
మన తెలంగాణము - తెలుగు మాగాణము

ప్రపంచ తెలుగు మహాసభలు

2017

# తెలంగాణ వైభవం

## పరిచయ దీపిక





రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణా సంస్థ,
తెలంగాణ, హైదరాబాదు.

## తెలుగులో తొలి సాహిత్య ప్రక్రియలు తెలంగాణ నుండి ఉద్భవించినవి

| | | |
|---|---|---|
| 1) తొలి తెలుగు శతకం | వృషాధిప శతకం | పాల్కురికి సోమన |
| 2) తొలి తెలుగు ద్విపద కావ్యం | బసవపురాణం | పాల్కురికి సోమన |
| 3) తొలి తెలుగు ఉదాహరణ కావ్యం | బసవోదాహరణం | పాల్కురికి సోమన |
| 4) తొలి తెలుగు లక్షణ గ్రంథం | కవిజనాశ్రయం | మల్లియరేచన |
| 5) తొలి తెలుగు ద్విపదరామాయణం | రంగనాథరామాయణం | గోనబుద్ధారెడ్డి |
| 6) తొలి తెలుగు చంపూరామాయణం | భాస్కరరామాయణం | హుళక్కిభాస్కరుడు |
| 7) తొలి తెలుగు దండకం | భోగినీదండకం | బమ్మెరపోతన |
| 8) తొలి తెలుగు సంకలన కావ్యం | సకలనీతి సమ్మతము | మడికిసింగన |
| 9) తొలి తెలుగు యక్షగానం | సుగ్రీవ విజయం | కందుకూరి రుద్రదేవుడు |
| 10) తొలి అచ్చతెలుగుకావ్యం | యయాతిచరిత్ర | పొన్నికంటి తెలగన్న |
| 11) తొలి తెలుగు కథాకావ్యం | సింహాసనద్వాత్రింశిక | కొరవి గోపరాజు |
| 12) తొలి తెలుగు పురాణం | మార్కండేయపురాణం | మారన |
| 13) తొలి తెలుగు వచనాలు | సింహగిరి నరహరివచనములు | కృష్ణమాచార్యులు |
| 14) తొలి తెలుగు చారిత్రక గ్రంథం | ప్రతాపరుద్రచరిత్రము | ఏకామ్రనాథుడు |
| 15) తొలి తెలుగు కందం | కురిక్యాల శాసనం (కరీంనగర్) | జినవల్లభుడు |
| 16) తొలి తెలుగు ద్వ్యర్థి కావ్యం | రాఘవ పాండవీయం | వేములవాడ భీమకవి |
| 17) తొలి తెలుగు త్ర్యర్థి కావ్యం | ఎలకూచి బాలసరస్వతి | యాదవ రాఘవ పాండవీయం |
| 18) తొలి తెలుగు చిత్ర కావ్యం | దశరథ రాజనందన చరిత్ర | మరింగంటి సింగరాచార్యులు |
| 19) తొలి తెలుగు అవధానం, అవధాని | ప్రతాపరుద్రుని ఆస్థానంలో | కొలిచెలమ మల్లినాథసూరి |
| 20) తొలి తెలుగు గజల్ | గాలిబ్‌గీతాలు | దాశరథి కృష్ణమాచార్యులు |
| 21) తొలి తెలుగు సీసపద్య శతకం | చెన్నమల్లు సీసము | పాల్కురికి సోమన |
| 22) తొలి గాథాసంకలన కావ్యం | గాథాసప్తశతి | హాలుడు |



# తెలంగాణ వైభవం

## పరిచయదీపిక

### సమన్వయం - సంపాదకత్వం


**శ్రీ సువర్ణ వినాయక్,** ప్రధానోపాధ్యాయుడు,
కోఆర్డినేటర్, తెలుగు పాఠ్యపుస్తకాలు, తెలంగాణ.

**డాక్టర్ ఎం. రమాదేవి,** ఉపన్యాసకురాలు,
రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణా సంస్థ, తెలంగాణ.


### మార్గదర్శకులు


**శ్రీ దేశపతి శ్రీనివాస్,**
కవి, గాయకుడు,
ముఖ్యమంత్రి కార్యాలయం ప్రత్యేక
అధికారి, తెలంగాణ.

**డా॥ నందిని సిధారెడ్డి,**
అధ్యక్షులు,
తెలంగాణ సాహిత్య అకాడమీ,
తెలంగాణ.

**డా॥ కె.వి. రమణాచారి,**
రిటైర్డ్ ఐ.ఏ.ఎస్. అధికారి,
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు,
తెలంగాణ.


### ప్రచురణ మరియు సలహాదారులు


**శ్రీ జి. కిషన్,** ఐ.ఎ.ఎస్.,
కమీషనర్ & సంచాలకులు,
పాఠశాల విద్యాశాఖ,
తెలంగాణ.

**శ్రీమతి బి. శేషుకుమారి,**
సంచాలకులు,
రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణా సంస్థ,
తెలంగాణ.

**శ్రీ ఎస్. వెంకటేశ్వరశర్మ,**
సంచాలకులు,
పాఠ్యపుస్తక ముద్రణాలయం,
తెలంగాణ.



**ప్రచురణ**

**రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణా సంస్థ,
తెలంగాణ, హైదరాబాదు.**

# సందేశం



తెలంగాణలో పరిఢవిల్లిన తెలుగు భాషా సాహిత్య వైభవాన్ని చాటిచెప్పాలనే ఆశయంతో తెలంగాణ ప్రభుత్వం 'ప్రపంచ తెలుగు మహాసభల'ను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోంది. ఈ మహాసభలు తెలుగుభాషా వెలుగులను ప్రపంచానికి పంచుతాయి. తెలంగాణ ఖ్యాతిని దశదిశలా చాటుతాయి. తెలంగాణ భాష సాహిత్య, సంస్కృతులను మౌలికంగా పరిచయం చేసే చిరు ప్రయత్నం ఈ పుస్తకం. ఇది ఒక పరిచయదీపిక. తెలుగు నెలలు, సంవత్సరాలు కూడా తెలియని స్థితిలోకి జారుకుంటున్న కొత్త తరానికి ఈ పుస్తకం తమ మూలాలను తెలుపుతుంది. ఇతర వ్యామోహాల వెల్లువలో సొంత అస్తిత్వం కోల్పోకూడదనే స్పృహను కలిగిస్తుంది. ప్రపంచ తెలుగు మహాసభల లక్ష్యానికి సూక్ష్మ రూపమే ఈ పుస్తకం. పుస్తకాన్ని రూపొందించిన రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణా సంస్థకు, విషయాలను పొందుపరచిన సభ్యులకు అభినందనలు.

**గౌ॥ శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు**
ముఖ్యమంత్రివర్యులు, తెలంగాణ రాష్ట్రం.

# సందేశం



తెలంగాణ రాష్ట్రావిర్భావం తర్వాత తొలిసారిగా ప్రపంచ తెలుగు మహాసభలను నిర్వహించుకోవడం మనందరికీ గర్వకారణం. ఈ సందర్భంగా ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజలకు, దేశ విదేశాల్లో ఉన్న తెలుగు వారందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు. ఈ 'ప్రపంచ తెలుగు మహాసభల'ను పురస్కరించుకొని తెలంగాణ చరిత్ర, సంస్కృతి, భాష, సాహిత్యాల వైభవాన్ని అందరికీ తెలిపేవిధంగా ప్రభుత్వం పక్షాన విద్యాశాఖ నుండి ఈ పరిచయదీపికను వెలువరించడం ఆనందదాయకం. ఈ పుస్తక రూపకల్పనలో పాల్గొన్న వారందరినీ మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను.

**గౌ॥ శ్రీ కడియం శ్రీహరి**
ఉపముఖ్యమంత్రి, విద్యాశాఖామాత్యులు,
తెలంగాణ రాష్ట్రం.

# సందేశం



తెలంగాణ రాష్ట్రంలో ప్రపంచ తెలుగు మహాసభలను
తొలిసారిగా నిర్వహిస్తున్న శుభసందర్భంలో
ఆహూతులందరికి తెలంగాణ చరిత్ర, భాష, సాహిత్యం,
సంస్కృతి మొదలగు వివరాలను మౌలికంగా
తెలియజేయాలని రూపొందించిన తెలంగాణ వైభవం
పరిచయదీపిక అందరికీ అవగాహన కల్పిస్తుందని
ఆశిస్తున్నాను. దీని రూపకల్పనలో పాల్గొన్న బృంద
సభ్యులందరికీ అభినందనలు.

**శ్రీమతి రంజీవ్ ఆర్. ఆచార్య,** ఐ.ఎ.ఎస్.,
స్పెషల్ చీఫ్ సెక్రటరీ,
విద్యాశాఖ, తెలంగాణ రాష్ట్రం.

## తెలుగు వికాసమే లక్ష్యం..



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా 'ప్రపంచ తెలుగు మహాసభల'ను నిర్వహించాలని సంకల్పించింది. ఈ మహాసభల ద్వారా తెలుగు భాషా సాహిత్య వికాసంలో తెలంగాణ పోషించిన మహోన్నత పాత్రను ప్రపంచానికి చాటిచెప్పాలని భావిస్తోంది. తెలుగు జాతి అత్యంత ప్రాచీనమైంది, ఎంతో విశిష్టమైంది. చరిత్రలో ఎన్నో ఆటుపోట్లను తట్టుకొని నిలబడింది. ప్రాంతాలుగా గుర్తించబడినా, రాష్ట్రాలుగా ఆవిర్భవించినా తెలుగు భాష మౌలికంగా ఒక్కటే. తెలుగు వారి అన్ని మాండలికాలు సముచిత గౌరవం పొందినప్పుడే 'భాష' కొత్త సొగసులతో వికసిస్తుంది. తెలుగు సాహిత్య వికాసానికి కృషి చేసిన రచయితలందరినీ పట్టించుకోవడం ద్వారా సాహిత్య చరిత్ర సమగ్రమౌతుంది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రం గురించి సంక్షిప్త వివరాలతో ముద్రించిన ఈ పరిచయదీపిక తెలుగు వారందరికీ తెలంగాణ వైభవం గురించి అవగాహన కల్పిస్తుందని ఆశిస్తున్నాను...

**డా॥ నందిని సిధారెడ్డి,**
అధ్యక్షులు, తెలంగాణ సాహిత్య అకాడమీ,
మహాసభల నిర్వహణ సంఘం అధ్యక్షులు.

# ప్రజల్లో చైతన్యం రావాలి...



సాహిత్య అకాడమీని ప్రకటించిన నాడే 'ప్రపంచ తెలుగు మహాసభలు' కూడా మనం జరుపుకోవాలని గౌరవ ముఖ్యమంత్రిగారు చెప్పారు. తెలంగాణలో జరిగిన తెలుగు భాష, సాహిత్యాభివృద్ధిని లోకానికి చాటిచెప్పడమే ప్రపంచ తెలుగు మహాసభల లక్ష్యం. దేశ విదేశాల్లో ఉన్నవారికి తెలంగాణ భాష, సాహిత్యవైభవం తెలియాలి. మన నుడికారంలోని సౌందర్యం కూడా తెలియాలి. ప్రజల్లో సాంస్కృతిక చైతన్యం రావాలి. తెలుగు భాష పరివ్యాప్తికి అందరం ప్రయత్నించాలి. ప్రపంచ తెలుగు మహాసభల ద్వారా ఇప్పటికాలపు యువత 'తెలుగు' గొప్పదనం రుచి చూస్తారు. ఇందుకోసం రూపొందించిన చిరు పుస్తకమే ఈ 'తెలంగాణ వైభవం' పరిచయదీపిక. ఇది తెలంగాణకు సంబంధించిన చరిత్ర, సంస్కృతి, భాష, సాహిత్యాల మౌలిక విశేషాలను పాఠకులకు పరిచయం చేస్తుందని భావిస్తున్నాను.

**డా॥ కె.వి. రమణాచారి,**
రిటైర్డ్ ఐ.ఏ.ఎస్. అధికారి,
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు,
మహాసభల నిర్వహణ సంఘం సభ్యులు

## తెలుగు భాషపట్ల స్వాభిమాన దృక్పథాన్ని కల్పించడం...



తెలంగాణ చరిత్రలో ప్రపంచ తెలుగు మహాసభలు ఒక ఉజ్జ్వల ఘట్టం. ప్రజలకు తమ భాష అస్తిత్వాలపట్ల స్వాభిమాన దృక్పథాన్ని కలిగించడం ప్రపంచ తెలుగు మహాసభల లక్ష్యాలలో మొదటిది. ఆధునిక అవసరాలకు తగిన విధంగా తెలుగు భాషా వ్యవహారాన్ని అభివృద్ధిపరచడం రెండవ లక్ష్యం. భాష కేవలం భావ వినిమయ సాధనం అనేది ప్రాథమిక భావన. భాష పరిధి చాలా విస్తృతమైనది. మన భౌతిక వాతావరణం, చరిత్ర, ఆర్థిక, రాజకీయ, సామాజిక ప్రత్యేకతలు, వారసత్వం, ఉజ్జ్వల స్మృతులు భాషలో నిక్షిప్తమై ఉంటాయి. ఒక్క మాటలో చెప్పాలంటే ఒక జాతి ఆత్మ ఆ జాతి భాషలో ప్రతిబింబిస్తుంది. తెలంగాణలో వెలుగొందిన తెలుగుభాష సాహిత్య దీప్తిని జగజ్జేగీయమానం చేయాలనే సంకల్పానికి కార్యరూపమే ప్రపంచ తెలుగు మహాసభలు. ఒకవైపు తెలంగాణ ప్రత్యేకతను చాటుతూనే, మరోవైపు తెలుగు భాషను దర్శించే విధంగా తెలుగు మహాసభలు జరుపాలనేదే ప్రభుత్వ నిర్ణయం.

ఇందుకోసం ప్రపంచవ్యాప్తంగాఉన్న తెలుగు భాషాభిమానులందర్నీ హైదరాబాదుకు ఆహ్వానిస్తున్నారు. తెలుగు భాష మాధుర్యం, తెలంగాణ నుడికారం, సొగసులు, తెలంగాణ సంస్కృతికి సంబంధించిన మౌలిక అంశాలు పరిచయంచేసేందుకు రూపొందించిన ఈ పుస్తకం ప్రపంచ తెలుగు మహాసభలకు తరలివచ్చిన, విదేశాలలో నివసిస్తున్న తెలుగువారందరికీ అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అనుకున్నదే తడవుగా (ఎస్.సి.ఇ.ఆర్.టి.) రాష్ట్ర విద్యా పరిశోధనా శిక్షణా సంస్థ ఈ కార్యభారాన్ని తలెత్తుకోవడానికి ముందుకువచ్చింది. తక్కువ సమయంలో వీలైనంత సమగ్రంగా రూపొందించేందుకు ప్రయత్నం చేశారు.

ఈ పుస్తకం తెలంగాణ పౌరులందరికీ ఒక పరిచయదీపిక. తెలుగు భాషాభిమానులకు అపురూపమైన కానుక. మహాత్మాగాంధీజి చెప్పినట్లు అన్ని వైపుల నుండి గాలిని ఆహ్వానించాలి. కానీ ఆ గాలిలో నీ కాళ్ళు పట్టు కోల్పోకూడదు. నువ్వు తేలిపోకూడదు. ఎన్ని చదివినా, ఎన్ని చూసినా మనదైన మౌలిక భాషా సంస్కృతులను, తల్లివేరును మరిచిపోవద్దు. మన ముఖ్యమంత్రిగారు పసితనం నుండే పద్యాన్ని ప్రేమించినవారు. రాజకీయోపన్యాసాలకు సాహిత్య పరిమళం అద్దినవారు. వారి ఉత్తమ అభిరుచి కారణంగానే తెలంగాణ భాషాసాహిత్యాల కీర్తి ప్రపంచవ్యాప్తమవుతున్నది.

ఈ సందర్భంగా వారికి, భాషాభివృద్ధికి తోడ్పడుతున్న ప్రతి ఒక్కరికీ నమస్సులు.

**దేశపతి శ్రీనివాస్,**

ప్రత్యేకాధికారి, ముఖ్యమంత్రి కార్యాలయం.

## ఈ పరిచయదీపిక గురించి . . .

తెలంగాణ రాష్ట్రం సాధించుకోవడం ఒక చారిత్రక ఘట్టం. 2017 డిసెంబర్ 15 నుండి డిసెంబర్ 19 వరకు నిర్వహించబడే **'ప్రపంచ తెలుగు మహాసభలు'** మరో చారిత్రక ఘట్టానికి తెరతీయబోతున్నాయి. తెలుగు రాష్ట్రాల నుండే కాక దేశవిదేశాల నుండి ఎందరో ఈ ఉత్సవాలకు విచ్చేస్తున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ గొప్పదనాన్ని తెలిపే విధంగా పరిచయదీపికను రూపొందించి వారందరికీ అందివ్వాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి **గౌ॥ శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు** గారు సంకల్పించారు. ఈ బాధ్యతను రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణా సంస్థకు అప్పగించడం గర్వకారణంగా భావిస్తున్నాను. ముఖ్యమంత్రి గారి సంకల్పానికి సాకార రూపమే ఈ **'తెలంగాణ వైభవం'** పరిచయదీపిక.

సూక్ష్మంలో మోక్షం అన్నట్లు తెలంగాణ ఔన్నత్యాన్ని సంక్షిప్తంగా ఇందులో పరిచయం చేయడం జరిగింది. చరిత్ర, సంస్కృతి, భాష, సాహిత్యాంశాల ఆధారంగా విషయాలను పొందుపరిచారు. చరిత్రకు సంబంధించి తెలంగాణ రాష్ట్ర చరిత్ర, సంస్కృతి, భౌగోళిక స్వరూపం, శాసనాలు, ప్రముఖులు, పత్రికలు, కోటలు, వార్తాపత్రికలు మొదలగువాటి వివరాలున్నాయి. సంస్కృతి గురించి తెలంగాణలో జరుపుకునే పండుగలు, జాతరలు, కళలు, ఆటలు, వంటలు వంటివి ఉన్నాయి. భాష గురించి మన పదజాలం, సామెతలు, జాతీయాలు, పొడుపు కథలు మొదలగువాటిని పొందుపర్చారు. సాహిత్యానికి సంబంధించి సాహిత్య ప్రక్రియలు, సంస్థానాలు – సాహిత్య పోషణ, పద్య వైభవం, వచన కవితా వికాసం, తెలంగాణ పాట, కథ, వాగ్గేయకారులు, తెలంగాణ ప్రాచీన మరియు ఆధునిక కవుల వివరాలు, తెలంగాణ శతక పద్యాలను పరిచయం చేశారు.

వీటిని ఈ పుస్తకంలో మూడు విభాగాలుగా పొందుపరిచారు. మొదటిది 'మన తెలుగు నేర్చుకుందాం', రెండవది 'మన తెలంగాణ గురించి తెలుసుకుందాం...', మూడవది 'మన తెలంగాణ గురించి అర్థంచేసుకుందాం...'. అయితే ఇది కేవలం తెలంగాణ వైభవం గురించి పరిచయం చేయడానికి చేసిన ప్రయత్నం మాత్రమే. అతి తక్కువ సమయంలో **'తెలంగాణ వైభవం'** పరిచయదీపికను రూపొందించిన పాఠ్యపుస్తక రచయితల బృందానికి, కో–ఆర్డినేటర్ శ్రీ సువర్ణ వినాయక్ గారికి, కవర్‌పేజి రూపొందించిన కూరెళ్ళ శ్రీనివాస్‌కు, డిటిపి & లేఅవుట్ చేసిన దార కన్నయ్య, శ్రీమతి పాతూరి ప్రతిమలకు అభినందనలు. ఈ బాధ్యతను మా మీద నమ్మకంతో అప్పగించి సలహాలు, సూచనలు అందజేసిన శ్రీ దేశపతి శ్రీనివాస్ గారికి, డాక్టర్ కె.వి. రమణాచారి గారికి, డాక్టర్ నందిని సిధారెడ్డి గారికి, అట్లాగే గౌరవ ముఖ్యమంత్రివర్యులు **శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు** గారికి, ఉపముఖ్యమంత్రి విద్యాశాఖామాత్యులు **శ్రీ కడియం శ్రీహరి** గారికి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ **శ్రీమతి రంజీవ్ ఆర్. ఆచార్య** గారికి ప్రత్యేక ధన్యవాదాలు. మా ఈ చిరు ప్రయత్నాన్ని ఆదరించి అభినందిస్తారని ఆశిస్తున్నాను...

**సంచాలకులు**

రాష్ట్ర విద్యాపరిశోధన, శిక్షణా సంస్థ

# రూపకల్పనలో పాల్గొన్నవారు

**శ్రీ పల్లెర్ల రామమోహన్‌రావు,** స్కూ.అ., వేముల, పాఠ్యపుస్తక రచయిత, మహబూబ్‌నగర్ జిల్లా.

**శ్రీ ఎల్.ఎం. ప్రసాద్,** భాషోపాధ్యాయుడు, సి.పి.ఎల్. అంబర్‌పేట్, పాఠ్యపుస్తక రచయిత, హైదరాబాద్ జిల్లా.

**శ్రీ కె. రంగరాజు,** స్కూ.అ., రంగాపురం, పాఠ్యపుస్తక రచయిత, రంగారెడ్డి జిల్లా.

**డా॥ వొజ్జల శరత్‌బాబు,** స్కూ.అ., రాజ్‌భవన్, పాఠ్యపుస్తక రచయిత, హైదరాబాద్ జిల్లా.

**డా॥ గట్టు త్రివేణి,** భాషోపాధ్యాయిని, చెన్నూరు, పాఠ్యపుస్తక రచయిత, మంచిర్యాల జిల్లా.

**శ్రీ వి.చెన్నయ్య (దోరవేటి),** స్కూ.అ., శామీర్‌పేట్, పాఠ్యపుస్తక రచయిత, మేడ్చల్ జిల్లా.

**శ్రీ గాజుల రవీందర్,** స్కూ.అ., కార్ఖానగడ్డ, పాఠ్యపుస్తక రచయిత, కరీంనగర్ జిల్లా.

**శ్రీ అవుసుల భానుప్రకాష్,** స్కూ.అ., లోనికలాన్, పాఠ్యపుస్తక రచయిత, సంగారెడ్డి జిల్లా.

**శ్రీ సాగర్ల సత్తయ్య,** స్కూ.అ., చినకాపర్తి, పాఠ్యపుస్తక రచయిత, నల్గొండ జిల్లా.

**శ్రీ కొండు జనార్ధన్,** స్కూ.అ., మంచిర్యాల, పాఠ్యపుస్తక రచయిత, మంచిర్యాల జిల్లా.

**శ్రీ కటుకోజ్వల మనోహరాచారి,** స్కూ.అ., కోరుట్ల, పాఠ్యపుస్తక రచయిత, జగిత్యాల జిల్లా.

**శ్రీ చక్రవర్తుల శ్రీనివాస్,** భాషోపాధ్యాయుడు, చెర్లపల్లి, పాఠ్యపుస్తక రచయిత, వరంగల్ జిల్లా.

**డా॥ కొంపల్లి శివకుమార్,** స్కూ.అ., శనిగరం, పాఠ్యపుస్తక రచయిత, సిద్ధిపేట జిల్లా.

**శ్రీమతి అల్లూరు శైలజారాణి,** స్కూ.అ., ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాద్.

**శ్రీమతి కోట సుకన్య,** ఉపాధ్యాయిని, జవహర్‌నగర్, పాఠ్యపుస్తక రచయిత, హైదరాబాద్ జిల్లా.

**శ్రీమతి పల్లి మాధవి,** భాషోపాధ్యాయిని, భారతీయ విద్యా భవన్, పాఠ్యపుస్తక రచయిత, హైదరాబాద్ జిల్లా.

**శ్రీ గంగ కాశీనాథ్,** భాషోపాధ్యాయుడు, కొత్లాపూర్, విషయనిపుణుడు, సంగారెడ్డి జిల్లా.

**శ్రీ గట్టు రామారావు,** టి.జి.టి., హసన్‌పర్తి (రెసిడెన్షియల్ పాఠశాల), వరంగల్ జిల్లా.

**డా॥ కాసర్ల నరేష్ కుమార్,** భాషోపాధ్యాయుడు, గూండారం, పాఠ్యపుస్తక రచయిత, నిజామాబాద్ జిల్లా.

**డా॥ దొడ్లె శారద,** స్కూ.అ., ఎడపల్లి, పాఠ్యపుస్తక రచయిత, నిజామాబాద్ జిల్లా.

**శ్రీమతి ఎస్.జ్యోతి,** భాషోపాధ్యాయిని, టి.డి.సింగ్, బాబానగర్, పాఠ్యపుస్తక రచయిత, హైదరాబాద్ జిల్లా.

**శ్రీమతి మీనాకుమారి,** భాషోపాధ్యాయిని, లాడ్‌బజార్, పాఠ్యపుస్తక రచయిత, హైదరాబాద్ జిల్లా.

**శ్రీమతి వురిమళ్ళ సునంద,** స్కూ.అ., ఆళ్ళపాడు, పాఠ్యపుస్తక రచయిత, ఖమ్మం జిల్లా.

**శ్రీమతి సనా ఫాతిమా,** భాషోపాధ్యాయిని, ఎమ్.ఎస్.క్రియేటివ్ స్కూల్, పాఠ్యపుస్తక రచయిత, హైదరాబాద్ జిల్లా.

**శ్రీ పసుల ప్రతాప్,** ఉపాధ్యాయుడు, గిమ్మ, పాఠ్యపుస్తక రచయిత, ఆదిలాబాద్ జిల్లా.

**శ్రీ ఎమ్.డి.షరీఫ్,** భాషోపాధ్యాయుడు, పాఠ్యపుస్తక రచయిత, సంగారెడ్డి జిల్లా.

**కవర్ పేజి** : **శ్రీ కూరెళ్ళ శ్రీనివాస్,** ప్రధానోపాధ్యాయుడు, కుర్మేడ, నల్లగొండ జిల్లా.

**డి.టి.పి. & డిజైనింగ్ : శ్రీమతి పాతూరి ప్రతిమ, దార కన్నయ్య,** ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాద్.

## విషయసూచిక


| అంశం | పేజి |
|---|---|
| **I. మన తెలుగు నేర్చుకుందాం** | |
| 1. తిథులు, వారములు, మాసములు | 2 |
| 2. మన పదజాలం | 6 |
| 3. సామెతలు, జాతీయాలు, పొడుపు కథలు | 9 |
| 4. బాల గేయాలు | 18 |
| 5. నీతి కథలు | 22 |
| 6. శతక పద్యాలు | 25 |
| **II. మన తెలంగాణ గురించి తెలుసుకుందాం...** | |
| 7. భౌగోళిక స్వరూపం – వివరాలు | 31 |
| 8. చెరువులు | 44 |
| 9. తెలంగాణ శాసనాలు | 48 |
| 10. తెలంగాణ పత్రికలు | 53 |
| 11. దర్శనీయ స్థలాలు | 70 |
| 12. తెలంగాణ కోటలు | 83 |
| 13. తెలంగాణ ప్రముఖులు | 90 |
| 14. తెలంగాణ మహిళా ప్రముఖులు | 95 |
| 15. ప్రాచీన కవులు | 100 |
| 16. ఆధునిక కవులు | 115 |
| 17. తెలంగాణ కళలు | 124 |
| 18. వాగ్గేయకారులు | 134 |
| 19. తెలంగాణ పండుగలు | 141 |
| 20. మన ఆటలు | 147 |
| 21. మన వంటలు | 151 |
| 22. మన సంస్థానములు–సాహిత్యం | 156 |
| 23. తెలంగాణ జాతరలు | 162 |
| **III. మన తెలంగాణ గురించి అర్థం చేసుకుందాం...** | |
| 24. తెలంగాణ చరిత్ర – సంస్కృతి | 166 |
| 25. తెలంగాణ భాష నుడికారాలు – మమకారాలు | 170 |
| 26. తొలి సాహితీ ప్రక్రియలు | 174 |
| 27. తెలంగాణ పద్యకవితా వైభవం | 183 |
| 28. తెలంగాణ పాట | 195 |
| 29. వచన కవిత | 202 |
| 30. తెలంగాణ కథా చరిత్ర | 208 |
| 31. నదులు – విశిష్టత | 212 |
| 32. తెలంగాణ తొలి తెలుగు వాచకాలు | 218 |

# I. మన తెలుగు నేర్చుకుందాం

# 1. తిథులు, వారములు, మానములు

## వర్ణమాల

**అచ్చులు :**

అ ఆ ఇ ఈ
ఉ ఊ ఋ ౠ ఌ ౡ
ఎ ఏ ఐ ఒ
ఓ ఔ

**ఉభయాక్షరాలు :**

ం ఁ ః

**హల్లులు :**

క ఖ గ ఘ ఙ
చ ౘ ఛ జ ౙ ఝ ఞ
ట ఠ డ ఢ ణ
త థ ద ధ న
ప ఫ బ భ మ
య ర ల వ శ
ష స హ ళ క్ష ఱ

## అంకెలు

౧ ౨ ౩ ౪ ౫ ౬ ౭ ౮ ౯ ౦

## వారములు-7

| వారముల పేర్లు | సంస్కృతనామములు |
|---|---|
| 1. ఆదివారం | భానువారం |
| 2. సోమవారం | ఇందువారం |
| 3. మంగళవారం | భౌమవారం |
| 4. బుధవారం | సౌమ్యవారం |
| 5. గురువారం | బృహస్పతివారం |
| 6. శుక్రవారం | భృగువారం |
| 7. శనివారం | స్థిరవారం |

## తిథులు-15

| | | |
|---|---|---|
| పాడ్యమి–1 | షష్ఠి–6 | ఏకాదశి–11 |
| విదియ–2 | సప్తమి–7 | ద్వాదశి–12 |
| తదియ–3 | అష్టమి–8 | త్రయోదశి–13 |
| చవితి–4 | నవమి–9 | చతుర్దశి–14 |
| పంచమి–5 | దశమి–10 | పూర్ణిమ–15 లేదా అమావాస్య–15 |

## పక్షములు-2

**1. శుక్లపక్షం:** పాడ్యమి నుండి పున్నమ వరకు 15 రోజుల కాలం. చంద్రుని కళలు రోజురోజుకు కొద్దికొద్దిగా పెరుగుతూ ఉంటాయి. పున్నమ రోజు పూర్ణ చంద్రుడిగా కనిపిస్తాడు.

**2. కృష్ణపక్షం:** (పున్నమ తర్వాత) పాడ్యమి నుండి అమావాస్య వరకు 15 రోజుల కాలం. ఈ కాలంలో చంద్రుని కళలు రోజురోజుకు కొద్దికొద్దిగా తగ్గుతాయి. అమవాస్య రోజు చంద్రుడు కనిపించడు.

## మాసములు - ఋతువులు: 12 : 6

కాలాన్ని లెక్కించడంలో చాంద్రమానం, సౌరమానం, బార్హస్పత్యమానం మొదలైన పద్ధతులున్నాయి. తెలుగు వారు చాంద్రమానంను అనుసరిస్తారు. ఇందులో చంద్రుని గమనాన్ని బట్టి లెక్కించడం జరుగుతుంది. పున్నమ రోజు ఏ నక్షత్రం ఉంటే ఆ పేరు ఆ నెలకు పెట్టడం జరుగుతుంది. ఉదా: పున్నమ నాడు కృత్తిక నక్షత్రముంటే అది కార్తీక మాసం.

| మాసములు | ఋతువులు |
|---|---|
| 1. చైత్ర, వైశాఖములు | వసంత ఋతువు |
| 2. జ్యేష్ఠ, ఆషాఢములు | గ్రీష్మ ఋతువు |
| 3. శ్రావణ, భాద్రపదములు | వర్ష ఋతువు |
| 4. అశ్వయుజ, కార్తీకములు | శరదృతువు |
| 5. మార్గశిర, పుష్యములు | హేమంత ఋతువు |
| 6. మాఘ, ఫాల్గుణములు | శిశిర ఋతువు |

## నక్షత్రాలు : 27

| | | |
|---|---|---|
| 1. అశ్విని | 2. భరణి | 3. కృత్తిక |
| 4. రోహిణి | 5. మృగశిర | 6. ఆర్ద్ర |
| 7. పునర్వసు | 8. పుష్యమి | 9. ఆశ్లేష |
| 10. మఖ | 11. పుబ్బ | 12. ఉత్తర |
| 13. హస్త | 14. చిత్త | 15. స్వాతి |
| 16. విశాఖ | 17. అనూరాధ | 18. జ్యేష్ఠ |
| 19. మూల | 20. పూర్వాషాఢ | 21. ఉత్తరాషాఢ |
| 22. శ్రవణము | 23. ధనిష్ఠ | 24. శతభిషము |
| 25. పూర్వాభాద్ర | 26. ఉత్తరాభాద్ర | 27. రేవతి |

## రాశులు-12

| | | |
|---|---|---|
| 1. మేషం | 2. వృషభం | 3. మిథునం |
| 4. కర్కాటకం | 5. సింహం | 6. కన్య |
| 7. తుల | 8. వృశ్చికం | 9. ధనుస్సు |
| 10. మకరం | 11. కుంభం | 12. మీనం |

## కార్తెలు-27

ప్రతి సంవత్సరం కింద చూపబడిన తేదీలకు ఒకటి రెండు రోజులు అటు ఇటుగా కార్తెల ప్రవేశం జరుగుతుంది. ముఖ్యంగా వ్యవసాయదారులు ఈ కార్తెల ఆధారంగా తమ పనులను నిర్వర్తించుకుంటూ ఉంటారు. కృత్తికకార్తెను కత్తెర్లు అని, మృగశిరకార్తెను ముర్గంబూనింది, పునర్వసును పెద్దపుష్యమి, పుష్యమికార్తెను చినపుష్యమి, ఆశ్లేషను అసలేరు అని పిలుస్తుంటారు.

| | | | |
|---|---|---|---|
| 1. అశ్వినికార్తె | :13 ఏప్రిల్ | 15. స్వాతికార్తె | :24 అక్టోబర్ |
| 2. భరణికార్తె | :27 ఏప్రిల్ | 16. విశాఖకార్తె | :6 నవంబర్ |
| 3. కృత్తికకార్తె | :11 మే | 17. అనూరాధకార్తె | :19నవంబర్ |
| 4. రోహిణికార్తె | :25 మే | 18. జ్యేష్ఠకార్తె | :2 డిసెంబర్ |
| 5. మృగశిరకార్తె | :8 జూన్ | 19. మూలకార్తె | :15 డిసెంబర్ |
| 6. ఆర్ద్రకార్తె | :22 జూన్ | 20. పూర్వాషాఢకార్తె | :28 డిసెంబర్ |
| 7. పునర్వసుకార్తె | :6 జులై | 21. ఉత్తరాషాఢకార్తె | :11 జనవరి |
| 8. పుష్యమికార్తె | :20 జులై | 22. శ్రవణముకార్తె | :24 జనవరి |
| 9. ఆశ్లేషకార్తె | :3 ఆగష్టు | 23. ధనిష్ఠకార్తె | :6 ఫిబ్రవరి |
| 10. మఖకార్తె | :17 ఆగష్టు | 24. శతభిషకార్తె | :19 ఫిబ్రవరి |
| 11. పుబ్బకార్తె | :30 ఆగష్టు | 25. పూర్వాభాద్రకార్తె | :4 మార్చి |
| 12. ఉత్తరకార్తె | :13 సెప్టెంబర్ | 26. ఉత్తరాభాద్రకార్తె | :17 మార్చి |
| 13. హస్తకార్తె | :27 సెప్టెంబర్ | 27. రేవతికార్తె | :31 మార్చి |
| 14. చిత్తకార్తె | :10 అక్టోబర్ | | |

## సంవత్సరాలు-60

| | | |
|---|---|---|
| 1. ప్రభవ | 21. సర్వజిత్ | 41. ప్లవంగ |
| 2. విభవ | 22. సర్వధారి | 42. కీలక |
| 3. శుక్ల | 23. విరోధి | 43. సౌమ్య |
| 4. ప్రమోదూత | 24. వికృతి | 44. సాధారణ |
| 5. ప్రజోత్పత్తి | 25. ఖర | 45. విరోధికృత్ |
| 6. ఆంగీరస | 26. నందన | 46. పరీధావి |
| 7. శ్రీముఖ | 27. విజయ | 47. ప్రమాథీచ |
| 8. భవ | 28. జయ | 48. ఆనంద |
| 9. యువ | 29. మన్మథ | 49. రాక్షస |
| 10. ధాత | 30. దుర్ముఖి | 50. నల |
| 11. ఈశ్వర | 31. హేవళంబ | 51. పింగళ |
| 12. బహుధాన్య | 32. విళంబి | 52. కాళయుక్తి |
| 13. ప్రమాధి | 33. వికారి | 53. సిద్ధార్థి |
| 14. విక్రమ | 34. శార్వరి | 54. రౌద్రి |
| 15. వృష | 35. ప్లవ | 55. దుర్మతి |
| 16. చిత్రభాను | 36. శుభకృత్ | 56. దుందుభి |
| 17. స్వభాను | 37. శోభకృత్ | 57. రుధిరోద్గారి |
| 18. తారణ | 38. క్రోధి | 58. రక్తాక్షి |
| 19. పార్థివ | 39. విశ్వావసు | 59. క్రోధన |
| 20. వ్యయ | 40. పరాభవ | 60. అక్షయ |

* 60 సంవత్సరాలు పూర్తయిన తరవాత మరల అవియే వచ్చును.

## అయనాలు-2

1. **ఉత్తరాయణం:** మకర సంక్రమణం (సంక్రాంతి రోజు దాదాపు జనవరి 14) నుండి కర్కాటక సంక్రమణం రోజు (దాదాపు జులై 14) వరకు.
2. **దక్షిణాయనం:** కర్కాటక సంక్రమణం (దాదాపు జులై 15) నుండి మకర సంక్రమణం (దాదాపు జనవరి 13) వరకు.

## కాల గణనం

| | |
|---|---|
| 60 తత్పరలు | – 1 పర |
| 60 పరలు | – 1 విలిప్త |
| 60 విలిప్తలు | – 1 లిప్త (3/ 5 సెకను) |
| 60 లిప్తలు | – 1 విఘడియ (25 సెకనులు) |
| 60 విఘడియలు | – 1 ఘడియ (24 నిమిషాలు) |
| 60 ఘడియలు | – 1 రోజు (24 గంటలు) |
| 2 1/2 విఘడియలు | – 1 నిమిషము |
| 2 1/2 ఘడియలు | – 1 గంట |
| 48 నిమిషాలు | – 1 ముహూర్తము |
| 30 ముహూర్తములు | – 1 రోజు |
| 1 విఘడియ | – 24 సెకన్లు |
| 1 ఘడియ | – 24 నిమిషాలు |
| 3 గంటలు | – 1 ఝాము |
| 8 ఝాములు | – 1 రోజు |
| 7 రోజులు | – 1 వారం |
| 15 రోజులు | – 1 పక్షము |
| 2 పక్షములు | – 1 మాసము |
| 2 మాసములు | – 1 ఋతువు |
| 3 ఋతువులు | – 1 ఆయనము |
| 2 ఆయనములు | – 1 సంవత్సరము |
| 12 సంవత్సరాలు | – 1 పుష్కరము |
| 10 సంవత్సరాలు | – 1 దశాబ్దము |
| 100 సంవత్సరాలు | – 1 శతాబ్దము |
| 1000 సంవత్సరాలు | – 1 సహస్రాబ్దము |
| 4 యుగములు | – 1 మహాయుగము |
| 71 మహాయుగాలు | – 1 మన్వంతరము |
| 1000 మహాయుగాలు | – 1 కల్పం |
| 1 కల్పం బ్రహ్మదేవునికి | – 1 పగలు |
| 2 కల్పాలు బ్రహ్మదేవునికి | – 1 రోజు |
| 360 బ్రహ్మ దినములు | – బ్రహ్మకు 1 సంవత్సరం |

## తెలంగాణలో పూర్వం వాడుకలో ఉన్న కొలమానాలు

### ద్రవ్యమానము

దమ్మిడి - 1 పైస
ఒక అణా - 6 పైసలు
బేడా - 12 పైసలు (దో అణా)
చారాణ - 24 పైసలు (వ్యవహారంలో 25 పైసలు)
ఆఠాణ - 48 పైసలు (వ్యవహారంలో 50 పైసలు)
బారాణ - 72 పైసలు (వ్యవహారంలో 75 పైసలు)
సోలాణ - 96 పైసలు (వ్యవహారంలో 100 పైసలు- రూపాయి)

### ఘన పదార్థాలను కొలిచే పద్ధతులు

గిద్దె - 50 గ్రాములు (దాదాపు)
పిరిచిట్టి - 250 గ్రాములు (దాదాపు)
అరసోల - 2 పిరిచిట్టిలు (500 గ్రాములు)
సోల - 1 కేజి (దాదాపు)
తవ్వెడు - 2 సోలలు (2 కేజీలు)
మానెడు - 2 తవ్వలు (4 కేజీలు)
అడ్డెడు - 2 మానెడ్లు (8 కేజీలు)
కుంచెడు - 2 అడ్డెడ్లు (16 కేజీలు)
ఇరుస - 2 కుంచెలు (32 కేజీలు)
తూమెడు - 4 కుంచాలు (50 కేజీలు)
గిద్దెడు - 2 తూములు (100 కేజీలు)

### ద్రవ పదార్థాలను కొలిచే పద్ధతులు

అర్ధ పావు - 1/8 లీటరు (125 మి.లీ.)
పావుశేరు - 250 మి.లీ.
అర్ధశేరు - 500 మి.లీ.
శేరు - 1000 మి.లీ.
సవశేరు - 1250 మి.లీ.

### పొడవులను కొలిచే పద్ధతులు

బెత్తెడు - 3 అంగుళాలు (దాదాపు)
జానెడు - 3 బెత్తెలు (దాదాపు 9 అంగుళాలు)
మూర - 2 జానెలు (దాదాపు 18 అంగుళాలు)
అడుగు -12 అంగుళాలు
గజం - 3 అడుగులు (1 మీటర్ కంటే తక్కువ)

### భూములను కొలిచే పద్ధతులు

1 గుంట - 121 చదరపు గజాలు
40 గుంటలు - 1 ఎకరం
1 ఎకరం - 4840 చ.గజాలు

### బంగారం కొలిచే పద్ధతులు

గురిజెత్తు - 1 గ్రాము
మాసమెత్తు - 2 గురిజలు
వీసమెత్తు - 3 గ్రాములు
బేడెత్తు - 2 అణాలు
చుక్కెత్తు - పావలా
8 అణాలు - అర తులం (6 గ్రాములు)
తులం - 11.5 గ్రాములు
తక్కెడ - 150 తులాలు
మణుగు - 8 తక్కెళ్ళు

## ఇతిహాసాలు-2

1. రామాయణం 2. మహాభారతం

## పురాణాలు-18

శ్లో॥ మద్వయం భద్వయం చైవ బ్రత్రయం వచతుష్టయమ్।
అనాపలింగకూస్కాని పురాణాని పృథక్ పృథక్॥

('మ' కారంతో ఆరంభమయ్యేవి - 2; 'భ' తో ఆరంభమయ్యేవి-2; 'బ్ర' అక్షరంతో ఆరంభమయ్యేవి-3; 'వ' కారంతో ఆరంభమయ్యేవి-4; 'అ, నా, ప, లిం, గ, కూ, స్కా' అనే అక్షరాలతో ఆరంభమయ్యేవి ఒక్కొక్కటి చొప్పున-7; మొత్తం 18 పురాణాలు ఉన్నవి.)

1. మత్స్యపురాణం
2. మార్కండేయపురాణం
3. భాగవతపురాణం
4. భవిష్యపురాణం
5. బ్రహ్మపురాణం
6. బ్రహ్మాండపురాణం
7. బ్రహ్మవైవర్తపురాణం
8. వరాహపురాణం
9. వామనపురాణం
10. విష్ణుపురాణం
11. వాయుపురాణం
12. అగ్నిపురాణం
13. నారదపురాణం
14. పద్మపురాణం
15. లింగపురాణం
16. గరుడపురాణం
17. కూర్మపురాణం
18. స్కాందపురాణం

**చతుర్వేదాలు:**

1. ఋగ్వేదం 2. యజుర్వేదం
3. సామవేదం 4. అధర్వణవేదం

**పంచభూతాలు:**

1. ఆకాశము 2. వాయువు
3. అగ్ని 4. జలము
5. భూమి

**షట్ రుచులు:**

1. తీపి 2. పులుపు 3. కారం
4. వగరు 5. చేదు 6. ఉప్పు

**సప్త ఋషులు:**

1. వశిష్టుడు 2. అత్రి 3. గౌతముడు
4. కశ్యపుడు 5. భరద్వాజుడు 6. జమదగ్ని
7. విశ్వామిత్రుడు

**అష్ట దిక్కులు:**

1. తూర్పు 2. దక్షిణం 3. పడమర
4. ఉత్తరం 5. ఆగ్నేయం 6. నైఋతి
7. వాయువ్యం 8. ఈశాన్యం

**నవరత్నాలు:**

1. మౌక్తికము 2. పద్మరాగము 3. వజ్రము
4. ప్రవాళము 5. మరకతము 6. నీలము
7. గోమేధికము 8. పుష్యరాగము 9. వైఢూర్యము

**దశావతారాలు:**

1. మత్స్యావతారం 2. కూర్మావతారం
3. వరాహావతారం 4. నారసింహావతారం
5. వామనావతారం 6. పరశురామవతారం
7. శ్రీరామావతారం 8. కృష్ణావతారం
9. బుద్ధావతారం 10. కల్కి అవతారం

❀❀❀❀❀



## గణపతి ప్రార్థన

తొండము నేక దంతము దోరపు బొజ్జయు వామహస్తమున్
మెండుగ మ్రోయు గజ్జెలును మెల్లని చూపులు మందహాసమున్
కొండొక గుజ్జురూపమున కోరిన విద్యలకెల్ల నొజ్జయై
యుండెడి పార్వతీ తనయ ఓయీ గణాధిప నీకు మ్రొక్కెదన్.

## సరస్వతి ప్రార్థన

సరస్వతీ నమస్తుభ్యం వరదే కామరూపిణీ
విద్యారంభం కరిష్యామి సిద్ధిర్భవతు మేసదా॥
పద్మపత్ర విశాలాక్షీ పద్మకేసర వర్ణిణీ
నిత్యం పద్మాలయా దేవీ సామాంపాతు సరస్వతీ॥





## గురు ప్రార్థన

గురుఃబ్రహ్మ, గురుఃవిష్ణు, గురుఃదేవో మహేశ్వరః।
గురుఃసాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీగురవేనమః॥

# 2. మన పదజాలం

తెలంగాణ 'పలుకు' తేనె చినుకులా ఉంటుంది. పదము పదములో ఒక అందం, మాటమాటలో చిక్కని బంధం అడుగడుగునా కనిపిస్తాయి. జనుల వ్యవహారంలో ఆ పదాలు అమృతధారలా అలవోకగా జాలువారుతుంటాయి. ఆ పదాలను తడిమితే మన గుండె పొరల్లో నిక్షిప్తమైన జ్ఞాపకాలను స్పృశించి వెళ్తాయి. ఈ పదాలు జన వ్యవహారంలో ఉన్నవేకాదు, మహాకవుల రచనల్లో కూడా కనిపిస్తున్నవని ఆచార్య రవ్వా శ్రీహరి గారు 'తెలంగాణా మాండలికాలు-కావ్య ప్రయోగాలు' అనే పుస్తకంలో సోదాహరణంగా నిరూపించారు. వారి పుస్తకం ఆధారంగా కొన్ని పదాలను, వాటి అర్థాలను మాత్రం ఇక్కడ ఇస్తున్నాం.

అంగీ = ఆంధ్ర ప్రాంతంలో చొక్క అంటారు

అంబేద = అమాయకుడు

అగ్గువ = చవక

అట్లనే = ఆ విధంగానె

అద్దమరాత్రి = మధ్యరాత్రి

అయగారు = పురోహితుడు

అఱ్ఱ = గది

అరుసుకొను = యోగక్షేమాలు, (అవసరాలు) తెలుసుకొను

అలుకు = చల్లు

ఆగం = తొందర

ఆడ = అక్కడ

ఆత్రం = తొందర

ఆదరువు = ఆధారం

ఆపతి = కష్టం

ఇగం = చలి

ఇట్లనే = ఇదే విధంగా

ఇదివర = ఇంతసేపు

ఎన్నడు = ఏరోజు

ఎఱుక = తెలిసి ఉండడం

ఎఱ్ఱ = వానపాము

ఎలుపు = వెడల్పు

ఏంది = ఏమిటి

ఏట = గొఱ్ఱ

ఏతులు = గొప్పలు

ఏ(యా)రాలు = తోడికోడలు

ఐరేండ్లు = పెండ్లి మొదలైన శుభ సందర్భంలో (పూజకై) ఉపయోగించే కుండలు

ఒర్లు = అరుచు

ఒలువడం = తీసెయ్యడం

కంటు = పగ, వైరం

కఱ్ఱె = నల్లని

కలెజూచు = కలియజూడడం

కాడ = దగ్గర

కానిపోని = నిరర్థకమైన

కాల్మడి = మూత్రం

కూరాడు = కలికుండ (పూజలప్పుడువాడే కుండ)

కొంచబోవు = తీసుకొనిపోవు

కొండెంగ = కొండముచ్చు

కొత్తలు = చిల్లర, నాణెములు

కొయ్‌గూర = తోటకూర

గట్టిపెట్టు = పలక మొదలగున్నవి వాటిని శుభ్రం చేయు

గడీ = దుర్గం, కోట

గడెగడెకు = మాటిమాటికి

గదువ = చిబుకం

గరిసె = ధాన్యముంచే గది

గాసం = ధాన్యం, ధాన్యరూపంలో ఇచ్చే జీతం

గీఅ = గీత, రేఖ

గురిగి = మట్టితో చేసిన చిన్న చెంబువంటి పాత్ర

గెదుము = అదలించు

గొట్టు = కఠినమైన

గొల = పండ్ల లేక పూలగుత్తి

గోద = పశువు

చూరు = చూర్ణం, పొడి

జాలె = బొంగరానికి చుట్టేతాడు

జోలి = విషయం, సంగతి

జిమ్మ = బాధ్యత

జీవి = ప్రాణం

తంతి = మెట్టు

తెట్టి = పళ్ళెం

తరాజు = తక్కెడ, త్రాసు

తలాకిలి = ఇంటి ముందరి భాగం

తావు = స్థానం, చోటు

తుంట = ముక్క

తూటు = రంధ్రం, చిల్లి

తెరువు = జోలి

తేవైతివి = తేకపోతివి

తొక్కు = పచ్చడి

తొట్లె = తొట్టెల

తోకమట్ట = తోక

తోడెం = కొంచెం

తోలు = పంపు

తోమకం = తోముట

దంట = జంట

దండగడెం = మోచేతిపై భాగంలో ధరించే కడియం

దండుగ = అపరాధం చేసినందుకుగాను విధించే రుసుం

దవితి = సిరాబుడ్డి

దిడ్డి = ఇంటి వెనుక లేక పక్క భాగంలో గృహద్వారం

దూప = దప్పి

దుడ్డె = దూడ

దేవులాడు = వెతుకు

దోర్ణం = తోరణం

నూకు = తోయు, గెంటు

నెనరు = ప్రేమ, స్నేహం, దయ, కనికరం

పగిడి = అదనంగా చెల్లించే ధనం

పజీతు = అవమానం

పలపక్షం = పక్షపాతం

పసులు = పశువులు

పాపోసు = ఒకరకం బూటు

పాయి = పాలు

పారనూకు = అనాదరణతో వస్తువులను తోసివేయు

పారి = పర్యాయం

పారిగోడ = ప్రహరీగోడ

పాసెం = పాయసం

పిలువనంపు = పిలిపించు

పుక్కట = ఊరికే, అప్రయత్నంగా

పుట్టకొక్కు = పుట్టగొడుగు

పెంట = చెత్త పదార్థాల కుప్ప

పేర్పు = మట్టికుండ

పైనం = ప్రయాణం

పొంటి = వెంట

పొద్దులు = ప్రసవదినాలు

పోరడు = చిన్నపిల్లవాడు

బంకులు = భవంతి ముందర పైన కప్పున్న పెద్ద అరుగులు కల భాగం

బద్రం = పదిలం

బమ్మెర పోవు = ఆశ్చర్యపడు

బాగాలు = వక్కలు

బింగీలు = గుంజిళ్ళు

బిరాన = తొందరగా

బుగులు = భయం

బుట్టి = బుట్ట

బెందులు = శరీరం మీద ఏర్పడే దద్దులు

బొంగు = వెదురుకఱ్ఱ

బొండిగ = మెడ, గొంతు

బొక్క = ఎముక

మంచిది = సరే, అలాగే ఇత్యాది అంగీకార సూచక పదం

మతలబు = సమాధానం, సంగతి, సమాచారం

మర్లబడు = ఎదురుతిరుగు

మలి(డి)గె = దుకాణానికి యోగ్యమైన గది

మళ్ళ = మళ్ళీ, తిరిగి

ముంగల = ముందర

ముల్లె = మూట

ముల్లెపోవు = సొమ్ముపోవు, నష్టపడు

మెర మెర = దుఃఖం, బాధ

మైదం = మైనం

మైసాక్షి = ధూప ద్రవ్య విశేషం

మొగురం = ఇండ్లలో వాసాలకు ఆధారంగా ఉండే చెక్క స్తంభం

మొల = మేకు

మొంబత్తి = కొవ్వు వత్తి

రాసికెక్కు = వన్నెకెక్కు

రుమాలు = తలపాగాగా చుట్టుకునే వస్త్రం

లెక్క = చొప్పున, వంతున, విధంగా

వెలుపు = వెడల్పు

శానా = చాలా

సదరుకొను = సర్దుకొను

సకిలం ముకిలం = బాసెన పట్టు

సరసర = తొందర తొందరగా

సాదు = పోషించు

సాపెన = శాపం

సుద్ది = విషయం, సంగతి/శుద్ధి

సోయి = స్పృహ

హరాంకోరు = చెడ్డవాడు

**– మూలం : డా॥ రవ్వా శ్రీహరి గారి**

**తెలంగాణ మాండలికాలు – కావ్యప్రయోగాలు**

❁❁❁❁❁

# 3. సామెతలు, జాతీయాలు, పొడుపు కథలు

మనసులోని భావాలను పంచుకోవడానికి మానవునికున్న ముఖ్య సాధనం భాష. అది మానవునికున్న గొప్ప వరం. ఈ వరమే మానవుణ్ణి ఇతర ప్రాణుల నుండి ప్రత్యేకంగా నిలబెడ్తున్నది. ఆ వరమే మనుషుల మధ్య అనుబంధాలు పెంచుతున్నది. ఆనందాన్ని పంచుతున్నది. కష్టాలను భాగిస్తున్నది. సంతోషాలను గుణిస్తున్నది. అందుకే భామహుడనే ఆలంకారికుడన్నాడు 'మాట అనే జ్యోతి లేకపోతే ఈ ప్రపంచమంతా చీకట్లోనే మగ్గిపోతూ ఉండేది' అని, ఈ 'మాట' నిజమనిపించకమానదు.

భాషను వినియోగించే సందర్భంలో మానవుడు ఆ భాషకు సొబగులు అద్దేందుకు చూస్తాడు. అది చాలా సందర్భాల్లో అప్రయత్నంగానే జరుగుతుంది. దానివల్ల మాట్లాడే వక్తకు, వినే శ్రోతకూ ఆ విషయం సరళంగ, సుబోధకంగ, వినసొంపుగా కూడా ఉంటుంది. మొత్తంగా భాషా సౌందర్యం ఇనుమడిస్తుంది.

ఇట్లా తెలుగు భాషా వినియోగంలో భాషకు సొబగును కల్గించే అంశాల్లో ముఖ్యమైనవి సామెతలు, జాతీయాలు. ఏదైనా ఒక విషయాన్ని చెప్తున్నప్పుడు ఎదుటివానికి ఆ విషయం సులభంగా అర్థం చేయించడానికి ఒక దృష్టాంత (పోలిక) వాక్యాన్ని జోడిస్తూ విషయాన్ని చెప్తాడు. అట్లా చెప్పే వాక్యాలనే సామెతలని అంటాం. సామ్యత అంటే పోలిక అని అర్థం. సామ్యత నుండి వచ్చిందే సామెత.

అట్లే తెలుగుభాషకు సౌందర్యాన్ని కల్గించే మరో అంశం 'జాతీయం'. ఒక పదము కాని పదబంధము కాని వాటికున్న సొంత అర్థం కాకుండా మరొక విశేష అర్థాన్ని చెప్తే దానిని జాతీయం అని అంటాం. జాతీయాలు కూడా చెప్పదలుచుకున్న విషయానికి పుష్టిని, శ్రోతకు అనురక్తిని కలిగిస్తాయి. వీటినే నానుడులని, పలుకుబడులనీ పిలుస్తుంటారు.

ఈ జాతీయాలు కాని సామెతలు కాని ఎవరో ఒకరు కూర్చొని రాసినవో చెప్పినవో కాదు. జనుల చేత అలవోకగా అప్రయత్నంగా చెప్పబడినవై, వారినోట్లో నానినవై, లోకజ్ఞానానికి మచ్చుతునకలై, తరతరాలకు అందింపబడినవై ఉంటాయి. ఇవి సంక్షిప్తంగా, మనోహరంగా ఉంటూ, ప్రస్తుతం చెప్పదలుచుకున్న సందర్భానికి అతికినవై ఉంటాయి. చెప్పదలుచుకున్న విషయానికి బలాన్ని చేకూరుస్తాయి. సులభంగా అర్థమయ్యేట్టు చేస్తాయి.

ఈవిధంగా సామన్యుల నుండి పండితజనుల వరకు అందరి నాలుకలపై నర్తిస్తూ, భాషను సుసంపన్నం చేస్తూ, రమ్యమై, హృద్యమై, తెలుగుభాషామతల్లికకు సువర్ణ మణిహారములై శోభిల్లే ఆ సామెతలు జాతీయాల్లో కొన్నిటిని గూర్చి ఇప్పుడు తెలుసుకుందాం.

# సామెతలు

**ఏరు దాటినాక తెప్ప తగిలేసినట్లు**: పని చేయించుకుని, లేదా సహాయం పొంది అది పూర్తయ్యాక ఉపకారం చేసినవాణ్ణి మరిచిపోయిన సందర్భంలో ఈ సామెతను వాడుతారు. దీనికి సమానార్థకంగా 'పాలుదాగి రొమ్ము గుద్దినట్లు, తిన్నంటివాసాలు లెక్కవెట్టినట్లు' మొదలైన సామెతలు ఉన్నాయి.

**పులిని సూసి నక్క వాత పెట్టుకున్నట్లు**: ఒకడు చేసినట్టు ఇంకొకడు చెయ్యాలని చూసి నవ్వుల పాలయ్యే సందర్భంలో ఈ సామెతను వాడుతారు.

**పేనుకు పెత్తనమిస్తే నెత్తంతగొరిగిందట**: అర్హత లేనివాడికి అధికారం ఇస్తే లాభం లేకపోగా నష్టం కలుగుతుందని చెప్పడానికి ఈ సామెతను వాడుతారు.

**అరచేతిలో ఉసిరికాయ**: సులభంగా పొందడానికి అనుకూలమైన విషయం లేదా వస్తువు విషయంలో ఈ సామెతను వాడుతారు. (ఉసిరికాయ దగ్గర ఉంటే ఆయుర్వేద వైద్యుడు అప్పటికప్పుడు సులభంగా వైద్యం చేయగలడు)

**చెర్ల బర్లను తోలి కొమ్ములకు బ్యారం పెట్టినట్లు**: మోసం చేయడం అనే అర్థం వచ్చే సామెత ఇది. బర్రెలను అమ్మాలంటే ఆ బర్రెలను కళ్ళముందర ఉంచి బ్యారం పెట్టాలి. అట్లా కాకుండా వాటిని చెర్లో తోలి కొమ్ములను చూపించుకుంటూ బ్యారం పెట్టడం మోసమవుతుంది.

**కూర కారమె కాని అంచుకు మిరం లేదు అన్నడట**: అన్నీ మంచిగా ఉన్నప్పటికీ వంక పెట్టాలని చూసినా, అన్నీ ఉన్నా లేనిదాని గురించి ఆశపడడమో చేసినా ఈ సామెతను వాడుతారు.

**తండ్రి తంతెలమీద అంటె కొడుకు కోనెట్ల**: ఒకరి కంటె ఒకరెక్కువ అనే సందర్భంలో ఈ సామెతను వాడుతారు.

**చంకల పిల్లనెత్తుకొని ఊరంత ఎత్కినట్లు**: అవసరమైన విషయమో వస్తువో అందుబాటులో ఉన్నప్పటికీ దాన్ని మరిచిపోయి ఎక్కడెక్కడో వెతుకుతుంటే ఈ సామెతను వాడుతారు.

**కందకు లేని దురద కత్తిపీటకెందుకన్నట్లు**: స్పందించాల్సినవాడు స్పందించకుండా వేరేవాడు స్పందించినా, అవసరంలేని విషయంలో జోక్యం చేసుకున్నా ఈ సామెతను వాడుతారు.

**తావట్టిన కుందేటికి మూడే కాళ్ళు**: ఇతరులు చెప్పేది వినకుండా తాను అనుకున్న విషయంపై మొండిగా వాదిస్తూ ఉంటే ఈ సామెతను వాడుతారు.

**చెట్టెక్కించి చేతులిడ్పించినట్లు**: నమ్మకంగా ప్రవర్తిస్తూ మోసం చేసేవాని విషయంలో, పొగుడుతూ పొగుడుతూ చివరకు అవమానాల పాల్జేసే సందర్భంలోనూ ఈ సామెత వాడుతారు.

**కొనబోతే కొరివి అమ్మబోతే అడవి**: ఒక వస్తువును కొనేటప్పుడు ఎక్కువ ఖర్చయి అదే వస్తువును తిరిగి అమ్ముతుంటె ఎక్కువ నష్టం వస్తుంటె ఈ సామెతను వాడుతారు.

**అంగట్ల అన్ని ఉన్న అల్లుడి నోట్ల శని**: ఎన్నో అవకాశాలు అందుబాటులోఉన్నా వాటిని అందిపుచ్చుకోలేని దురదృష్టవంతుని విషయంలో ఈ సామెత వాడుతారు.

**కట్టెవంకను పొయ్యిదీరుస్తదన్నట్లు**: చెడు అలవాట్లు గలవ్యక్తిని గాని, ఒక సమస్యకు పరిష్కారాన్ని గాని కాలమో లేక ఏదో ఒక సంఘటనో మారుస్తుంది అన్న సందర్భంలో ఈ సామెత వాడుతారు.

**చదువు చారెడు బలపాలు దోసెడు**: పని తక్కువ ఖర్చు ఎక్కువ అనే విషయం చెప్పడానికి గాని, ఫలితం తక్కువ కష్టం ఎక్కువ అనే సందర్భంలోగాని ఈ సామెత వాడుతారు.

**పిల్లికి పిచ్చెయ్యడుగాని ఊరంతా సంతర్పణ జేస్తడట**: ఇది చేస్తా అది చేస్తా అని అతిగా మాట్లాడేవాని విషయంలో, ఎవ్వడికి ఏమీ పెట్టకుండా మాటల్తో కోటలు కట్టేవాని విషయంలో ఈ సామెత వాడుతారు.

**కూట్లో రాయి తీయలేనోడు ఏట్లోరాయి తీస్తడట** : సులభమైన పనిని కూడా చేయలేనివాడు కష్టమైన పని చేయబోతే ఈ సామెత వాడుతారు. దీనికి సమానార్థకంగా 'ఉట్టికెగరలేనమ్మ ఆకాశాని కెగరజూసిందట' అనే సామెత ఉన్నది

**కోతికి ఇల్లుండదు ఒకనికి ఇల్లుంచదు**: తను నష్టపోతూ ఇతరులకు కూడా నష్టాన్ని కలిగించేవాని విషయంలో ఈ సామెత వాడుతారు.

**గాలిలో దీపంబెట్టి దేవుడా దిక్కన్నట్లు**: చేయాల్సిన ప్రయత్నం సరిగ్గా చెయ్యకుండా (పట్టించుకోకుండా) చివరకు ఫలితం విషయంలో ఆదుర్దాపడే విషయంలో ఈ సామెత వాడుతారు.

**ఇంటింటికి మంటిపొయ్యి**: కష్టాలు అందరికీ ఉంటాయి అనే సందర్భంలో ఈ సామెత వాడుతారు.

**తాదూర కంతలేదు మెడకో డోలు అన్నట్లు**: తాను కష్టాల్లోంచి బయటకురాలేనివాడు ఇతరులను కూడా తన కష్టాల్లోకి లాగే సందర్భంలో ఈ సామెత వాడుతారు.

**కోతికి కొబ్బరిచిప్ప దొరికినట్లు**: గొప్ప లాభం పొందినప్పుడు వ్యక్తి పొందే సంతోషాన్ని తెలియజెప్పడానికి, పొందిన లాభాన్ని చూసుకుంటూ మాటిమాటికి మురిసిపోయే వాణ్ణి గూర్చి ఈ సామెత వాడుతారు.

**చేతులు కాలినాక ఆకులు పట్టుకున్నట్లు:** మొదట సరైన జాగ్రత్తలు తీసుకోకుండా తీరా ఆపదలు వచ్చిపడ్డాక పరిష్కారంకోసం ఆరాటపడే సందర్భంలో ఈ సామెత వాడుతారు.

**తా చెడ్డకోతి వనమెల్ల చెరుచు** : తాను చెడిపోవడమే కాకుండా పదిమందిని చెడగొట్టె వాని విషయంలో ఈ సామెత వాడుతారు.

**కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిందన్నట్లు**: ఒకటి చెయ్యబోతే ఇంకేదో అయితే ముఖ్యంగా ఒక మంచి పని చెయ్యబోతే అది కాస్తా చెడు ఫలితం ఇస్తే ఈ సామెత వాడుతారు. దీనికి సమానార్థకంగా 'పుణ్యానికి బోతే పాపం ఎదురైంది' అనే సామెత ఉన్నది.

**కొండను తవ్వి ఎలుకను పట్టినట్టు**: ఎంతో పెద్ద ప్రయత్నం చేసి కొంచెం ఫలితాన్ని మాత్రమే పొందిన సందర్భంలో ఈ సామెత వాడుతారు. దీనికి సమానార్థకంగా 'కొండలదోడి తొండల వట్టినట్లు' అనే సామెత ఉన్నది.

**కొంప కాలుతున్నదిరా అంటే నీళ్ళు కాచుకుందామన్నడట**: ఒకడు కష్టాల్లో ఉంటే ఆ అవకాశంలో తన మేలు కోసం చూసుకునే వాడివిషయంలో ఈ సామెత వాడుతారు.

**ఇంట్లో ఎలుకలున్నవని ఇల్లంత తగుల బెట్టుకున్నట్లు**: చిన్న సమస్యను తీర్చకోవడానికి పెద్ద సమస్యను కొని తెచ్చుకునే సందర్భానికి ఈ సామెత వాడుతారు

**నోటికాడి బుక్క(వ్వ)ను న్యాలపాలు జేసినట్లు**: అందివచ్చిన అవకాశాన్ని ఎవడోవచ్చి దూరం చేస్తే ఆ సందర్భంలో ఈ సామెత వాడుతారు.

**ఇల్లలకంగనె పండగైతద**: ఏదో కొద్దిపాటి ప్రయత్నం చేసి ఇక ఫలితం వచ్చినట్టె అని సంబుర పడుతుండే సందర్భంలో ఈ సామెత వాడుతారు.

**పుండుమీద కారం జల్లినట్లు**: ముందే కోపంతో ఉన్నవాణ్ణి మరింత రెచ్చగొట్టేట్టు ప్రవర్తించే సందర్భంలో, బాధలో ఉన్నవాణ్ణి మరింత బాధపడేట్టు చేసే సందర్భంలోనూ ఈ సామెత వాడుతారు.

**శుభం గోరుర పెండ్లికొడకా అంటె ఐరేని కుండకు పర్రె అన్నడట**: ఎప్పుడూ అపశకునాలు (చెడు) పలుకుతూ ఉండేవాని విషయంలో ఈ సామెత వాడుతారు.

**మాటలు కోటలు దాట్తయ్ కాళ్ళు తంగెళ్ళుదాటయి**: ఇది చేస్తా అది చేస్తా అంటూ గప్పాలు కొట్టి తీరా చేయాల్సి వచ్చేసరికి వెనకడుకు వేసే సందర్భంలో ఈ సామెత వాడుతారు.

**గుత్పసేత వట్టినోడిదే రాజ్జెం**: 'బలమున్నోడిదే అధికారం' అనే అర్థంలో ఈ సామెత వాడుతారు.

**దూపయినప్పుడు బాయిదొవ్వబోయినట్లు**: ఒక సమస్యకు పరిష్కారాన్ని ఆ సమస్యలో ఇరుక్కున్నప్పుడు కాకుండా ముందే చూసి పెట్టుకోవాలి. అట్లా కాకుండా తీరా సమస్య వచ్చిపడ్డాక దాని పరిష్కారం వెతుకుతుంటే దాన్ని మూర్ఖత్వం అంటారు. ఈ సందర్భాన్ని తెల్పడానికి ఈ సామెత వాడుతారు.

**గడియపుర్సత్ లేదు గవ్వ ఆందాని లేదు**: క్షణం తీరికలేకుండా ఏదో ఒక పనిచేస్తున్నట్టుగా ఉండి ఏ పనికీ ఫలితం పొందకపోతే ఈ సామెత వాడుతారు.

## మరికొన్ని సామెతలు

కాసిన చెట్టుకే రాళ్ళ దెబ్బలు

తప్పాలకు అంటుకున్న మెత్కుతీర్గ

చెప్పెటోనికి యినెటోడు లోకువ

పొమ్మనలేక పొగబెట్టినట్టు

చింతజచ్చినా పులుపు జావలేదు

గుర్రం పోతూపోతూ గూటం బీక్కపోయె

ఎలుక పోరు ఎలుక పోరు పిల్లి దీర్చినట్లు

దొనె ఆరదు దొయ్యె వారదు

పెనం మీది నుండి పొయ్యిలో వడ్డట్టు

పగోణ్ణి పంచాంగమడిగితే మధ్యాహ్నానికే మరణమన్నాడట

యారాలు చిన్నదయితే పాలు చిన్నదా

గుమ్మిలో బియ్యం గుమ్మిలో ఉండాలె బిడ్డలు దుడ్డెలోలుండాలె

ఆవు పొలంలో మేస్తే దూడె గట్టున మేస్తదా

హనుమంతునిముందు కుప్పిగంతులు

దీపంకిందే చీకటి అన్నట్లు

చిన్న పామునైనా పెద్ద కర్రతో కొట్టాలి

శుంఠా శుంఠా అంటే నా పేరెట్లా తెలుసు అన్నడట

వెర్రి కుదిరింది రోకలి తలకు చుట్టుమన్నాడట

రొట్టె విరిగి నేతిలో పడ్డట్టు

మింగమెతుకు లేదు మీసాలకు సంపెంగ నూనె

తాతలు నేతులు తాగారు మా మూతులు వాసన జూడుండి అన్నాడట

మూలిగెనక్క మీద తాడిపండు పడ్డట్టు

ముందు నుయ్యి వెనక గొయ్యి

దీపముండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలి

నిండా మునిగోనోడికి చలేమిటి అన్నట్లు

మాట చుట్టమె గాని – పూట చుట్టంగానట్లు

ఊరిచ్చి ఊరిచ్చి ఉల్లిగడ్డవెట్టినట్లు

కానని మొకంకు ఈసుల్లపాశం అన్నట్లు

ఎప్పటి చిప్ప – యెనుగులనె వడ్డట్లు

ఆగిపోయిన పెండ్లికి – అరవై డప్పులన్నట్లు

చాప ఉన్న వరకే – కాల్లు చాపు కోవాలె

ఏనుగ్గె చెరుకులు తినేకంటే – చీమ్మె చక్కర బుక్కింది మేలట

చెడి బతకాలె గాని బత్కి చెడరాదు

చెప్పంగ వినకుంటె – చెడంగ జూడాలన్నట్లు

రెక్కలు లేనోడికి – రేషమెక్కువన్నట్లు

ఊగి ఊగి ఉయ్యాల ఉన్నతాటనె ఆగినట్లు

బురుద అచ్చినపుడు – రాయేసి దాటాలన్నట్లు

తిరిగే కాలు తిట్టేనోరు ఊర్కోవట

నోరు ఆడినట్లు నొసలు ఆడదు కదా

ఆవులనాటి గుణం లేగలనాడేతెల్సినట్లు

# జాతీయాలు

**సుక్కదెగివడ్డట్టు** : చాలాకాలం తర్వాతనొ, హఠాత్తుగానో వచ్చిన వాని విషయంలో ఈ జాతీయం వాడుతారు.

**కుడితిలో పడ్డ ఎల్క** : కుడితిలో పడ్డ ఎలుక ఇటు బయటకు రాలేక ఆటు చావలేక గిలగిలలాడినట్లు ఎవరైనా ఏదైనా సమస్యలో ఇరుక్క పోయి పరిష్కారం దొరకక సమస్యతోనే కొట్టుమిట్టాడుతుంటే ఈ జాతీయం వాడుతారు.

**చెవినిల్లు గట్టుకొని** : ఏదైనా ఒక విషయాన్ని ఎదుటివానికి ఎక్కువసార్లు చెప్పినా ముఖ్యవిషయమని చెప్పినా దాన్ని చెవినిల్లుగట్టుకొని చెప్పిండని అంటారు.

**అంబట్ల తెడ్డు** : ఆంబలి (వంటకం)లో వాడే గంటె అన్ని వైపులా కలవడానికి ఉపయోగ పడుతుంది. ఆట్లే ఒక వ్యక్తి ఇటు వీరితో అటు వారితో కలిసిపోతూ ఉంటే అంబట్ల తెడ్డుగా ఉన్నాడని అంటాం.

**కాళ్ళకు బుద్ధి చెప్పు** : పారిపోవడం అనే అర్థంలో వాడుతారు.

**రామసక్కని** : 'చాలా అందమైన' అనే అర్థంలో 'రామసక్కనోడు' 'రామసక్కని దృశ్యం' అంటూ ఈ జాతీయాన్ని వాడుతారు.

**నరంలేని నాల్కె** : ఎటువడితె అటు, ఎట్లపడితే అట్ల మాట్లాడుతుంటే ఈ జాతీయం వాడుతారు.

**చాపకింద నీరు** : ఒకనికి తెలియకుండా వానికి కీడుకల్గేట్టుచేయడం అనే సందర్భంలో ఈ జాతీయం వాడుతారు.

**గోడమీద పిల్లి** : ఒకస్థిరమైన ఆలోచన లేకుండా ఎటంటె ఆటు మాట్లాడేవాడు, ద్వంద్వ వైఖరి ప్రదర్శించేవాడి విషయంలో దీన్ని వాడుతారు.

**త్రిశంకు స్వర్గం** : ఏ విషయంలోనైనా అటుఇటు కాకుండా మధ్యలో కొట్టుమిట్టాడుతుండే వాని విషయంలో ఈ జాతీయాన్నివాడుతారు.

**వసదాగిన పిట్ట** : అతిగా మాట్లాడే వాని విషయంలో ఈ జాతీయం వాడుతారు.

**చేజారిపోవు** : ఏదైనా అవకాశాన్ని కోల్పోయిన సందర్భంలో దీన్ని వాడుతారు.

**గొడ్డలి పెట్టు** : ఆటంకం అవుతుంది. నాశనం చేస్తుంది అనే అర్థాల్లో దీన్ని వాడుతారు.

**ఆరునూరైనా** : ఏదైనా జరుగొచ్చు కాని 'ఈ పని మాత్రం జరగదు' అనే సందర్భంలో ఈ జాతీయం వాడుతారు.

**కొంగుబంగారం** : దగ్గరగా అందుబాటులో ఉన్నది, సులభంగా కష్టాల నుండి గట్టెక్కించేది అనే అర్థంలో ఈ జాతీయం వాడుతారు.

**కాళ్ళల్ల పిల్లి** : పనీపాట చేసుకోనీయకుండా ఒకటే వెంటపడుతుండే వాని విషయంలో, మాటిమాటికి ఎదురుపడి లొల్లి చేసే వాని విషయంలో ఈ జాతీయం వాడుతారు.

**స్వస్తి చెప్పు** : ఏదైనా ఒక విషయాన్ని పూర్తిగా వదిలేస్తే దీన్ని వాడుతారు.

**కొంపముందు** : అన్యాయం చేయడం, కీడు చేయడం అనే అర్థాల్లో దీన్ని వాడుతారు.

**బురదచల్లు** : కారణం లేకుండా వ్యక్తిని లేదా విషయాన్ని నిందించడమో, ఆరోపణలు చేయడమో చేస్తే ఈ జాతీయం వాడుతారు.

**గడ్డిపెట్టు** : ఎదుటివానికి బుద్ధిచెప్పడం అనే సందర్భంలో దీన్ని వాడుతారు.

**తామరతంపర** : ఎక్కువ సంఖ్యలో ఉన్న జనసమూహాన్ని చెప్పడానికి, పొందిన అభివృద్ధిని చెప్పడానికి ఈ జాతీయం వాడుతారు.

**ఆషాఢభూతి** : నమ్మించి మోసం చేసేవాని విషయంలో ఈ జాతీయం వాడుతారు.

**రావణ కాష్టం** : ఎంతకూ తెగని సమస్యలోంచి బయట పడలేకుండా ఉంటె ఈ జాతీయం వాడుతారు.

**అరణ్య రోదన** : ఎంత మొత్తుకున్నా ఏడ్చినా కాపాడేవాడు లేడు అని చెప్పడానికి, వృథాశ్రమ అని చెప్పడానికి ఈ జాతీయం వాడుతారు

**కడుపుతీపి** : తల్లిప్రేమను తెలుపడానికి ఈ జాతీయం వాడుతారు.

**మేడిపండు** : పైకి మంచి వానిలా కనిపిస్తున్నా లోపల దుష్టస్వభావాన్ని కలిగి యుండే వాని విషయంలో ఈ జాతీయం వాడుతారు.

**కాకిగోల** : బాగా అల్లరి/ చప్పుడు చేస్తున్న సందర్భంలో, ఎక్కువ మంది ఒక్కటేసారి అర్థం కాకుండా మాట్లాడుతున్న సందర్భంలో దీన్ని వాడుతారు.

**మొసలి కన్నీరు** : ప్రేమ లేకపోయినా ప్రేమ ఉన్నట్టు నటించడం, మోసపూరితమైన సానుభూతిని చూపించడం వంటి సందర్భాల్లో ఈ జాతీయం వాడుతారు. దీన్ని దొంగేడుపని అనవచ్చు.

**రెండు నాల్కలు** : మాట మర్చడం అనే అర్థంలో ఈ జాతీయం వాడుతారు.

**బాయిల కప్ప** : లోకజ్ఞానం లేనట్టివాని విషయంలో, ఇతర విషయాలేవీ పట్టించుకోకుండా తన పని మాత్రమే చూసుకుంటూ పోయేవాని విషయంలో ఈ జాతీయం వాడుతారు.

**బెల్లం కొట్టిన రాయి** : ఎక్కడ ఉంటె అక్కడే ఉండి, ఏమి జరిగినా పట్టించుకోకుండా ఉండేవాని విషయంలో దీన్ని వాడుతారు.

**తోక తొక్కిన తాచు** : హఠాత్తుగా పుట్టిన కోపంతోనో, ఆవేశంతోనో వ్యవహరిస్తున్నవాని విషయంలో ఈ జాతీయం వాడుతారు.

**అందెవేసిన చేయి** : ఏదైనా విద్యలోనో పనిలోనో నైపుణ్యం కలవాడు అని చెప్పే సందర్భంలో ఈ జాతీయం వాడుతారు.

**ముక్కుసూటి మనిషి** : ఉన్నది ఉన్నట్టుగా చెప్పేవాని విషయంలో, ఋజువుగా ప్రవర్తించే వాడి విషయంలో దీన్ని వాడుతారు.

**చేతులు దులుపుకోవడం** : ఒక వస్తువునో, విషయాన్నో వదిలించుకుంటే ఆ సందర్భంలో దీన్ని వాడుతారు.

**ఎన్నెలలు కురిసినట్లు** : ఆనందకరమైన సంఘటనలు జరిగినప్పుడు, చుట్టుపక్కల వాతావరణం సంతోషంగా ఉన్నప్పుడు ఈ జాతీయం వాడుతారు.

**కుమ్మరావం గాల్తున్నట్లు** : కుమ్మరి ఆవం లోపల కాల్తున్నా పైకి తెలియదు. అట్లే మనస్సులో బాధ ఉన్నా పైకి కనిపించకుండా వ్యవహరించే వాని విషయంలో దీన్ని వాడుతారు.

**గుండె పదిలం చేసుకొను** : దురదృష్టకరమైన సంఘటనను విన్నా చూసినా నిబ్బరం కోల్పోకుండా ఉండే సందర్భంలో ఈ జాతీయాన్ని వాడుతారు.

**రెంటికి చెడ్డ రేవడి** : ఈ లాభం కావాలి ఆ లాభం కావాలంటూ అనేక లాభాల కోసం అర్రులు చాచి అన్నింటిని నష్టపోయినవాని విషయంలో దీన్ని వాడుతారు.

**నలుగురితో నారాయణ** : తన ఇష్ట అయిష్టాలను పక్కన బెట్టి ఇతరులతో కలిసిపోవాల్సిన సందర్భంలో దీన్ని వాడుతారు.

**గుండె చెరువయ్యింది** : ఏదైనా విషాదకరమైన వార్తను విన్నప్పుడో, దృశ్యాన్ని చూసినప్పుడో వ్యక్తి చాలా బాధపడుతుంటే/ ఏడుస్తుంటే ఈ జాతీయం వాడుతారు.

**కొరివితో తలగోక్కోవడం** : కావాలని కష్టాలు తెచ్చుకుంటూ ఉంటె ఈ జాతీయం వాడుతారు.

**అడకత్తెరలో పోకచెక్క** : రెండు సమస్యల మధ్య నలిగి పోతున్నవాని విషయంలో ఈ జాతీయం వాడుతారు.

**పెయి మీద పెనువారడం** : ఎంత చెప్పినా పట్టించుకోకుండా ఉండే సందర్భంలో ఈ జాతీయం వాడుతారు.

**కండ్లల్ల వత్తులేసుకొని** : ఆతురతతో ఎదిరి చూస్తున్న విషయాన్ని చెప్పడానికి ఈ జాతీయం వాడుతారు.

**కాళ్ళకు బలపాలు కట్టుకొని** : ఏదైనా అవసరం మీద ఎక్కువగా తిరిగిన సందర్భాన్ని చెప్పడానికి ఈ జాతీయం వాడుతారు.

**మేకపోతు గాంభీర్యం** : లోపల భయపడుతూ ఉన్నా పైకి ధైర్యంగా ఉన్నట్టు ప్రవర్తించే వాని విషయంలో ఈ జాతీయం వాడుతారు.

**రెక్కలు ముక్కలు జేసుకొను:** శారీరక శ్రమ జేస్తూ కష్టపడేవారి విషయంలో ఈ జాతీయం వాడుతారు.

**కడ్పుల ఇసం నాల్కన తీపి:** మనస్సులో చెడు ఆలోచనలు పెట్టుకొని పైకి తియ్యగా మాట్లాడేవాని విషయంలో ఈ జాతీయం వాడుతారు. దీనికి సమానార్థకంగా 'అంగిట తీపి ఆత్మన ఇసం నింపుకున్నట్టు' అనే సామెత కూడా ఉన్నది.

**కడుపులో ఎలుకలు పరుగెత్తు :** 'ఆకలి అవడం' అనే విషయాన్ని తెలియజెప్పడానికి ఈ జాతీయం వాడుతారు.

**సెవ్వుమీద పేనువారకపోవడం :** ఒక విషయాన్ని ఎన్నిసార్లు చెప్పినా ఎదుటివాడు వినిపించుకోక పోతే ఈ జాతీయం వాడుతారు.

**నోట్లకెల్లి ఊశివడ్డట్టు** : ఒకనిలాగ ఇంకోడు మాట్లాడినా, ప్రవర్తించినా, ఆ రూపంలో ఉన్నా ఈ జాతీయం వాడుతారు.

**కాలుగాలినపల్లి** : ఏదైనా ఇబ్బంది వల్ల స్థిరత్వం లేకుండా ఉండేవాని విషయంలో ఈ జాతీయం వాడుతారు.

**ససేమిరా** : ఏమి చెప్పినా ఒప్పుకోని/ చేయని వాని విషయంలో ఈ జాతీయం వాడుతారు.

## మరికొన్ని జాతీయాలు

గుడ్డికొంగ
ముండ్ల మీదున్నట్టు
మంటల వడ్డట్టు
ససేమిరా
సర్వమంగళం
శ్రీరంగ నీతులు
రోకటిపాట
రెండు నాలుకలు
రామబాణం
రామరాజ్యం
ప్రసూతి వైరాగ్యం
పెళ్ళినడక
పొయ్యిలపిల్లి
పుక్కిటి పురాణం
బీరకాయ పీచు
నేతి బీరకాయ
నీటిమీద రాత
నకరాలు పోవడం
నక్కను తొక్కడం

# పొడుపు కథలు

ఆలోచన పెంచి ఆనందాన్ని పంచే మరో సాహితీ ప్రక్రియ పొడుపు కథలు. ఇవి సంక్షిప్తంగా, నిగూఢంగా ఉంటాయి. సమస్యా గర్భితంగా ఉంటూ, ఆ సమస్యా పరిష్కారానికై బుర్రకు పనిచెప్పే విధంగా ఉంటాయి. శబ్ద వైచిత్రి, ఆలంకారికత వీటికి సౌందర్యాపాదకంగా ఉంటాయి. కొన్ని వాక్యాల రూపంలో ఉంటే మరికొన్ని కవితారూపంలోనూ ఉంటాయి. అట్లాంటి పొడుపు కథలను సమీకరించి, పరిశోధించి డా॥ కసిరెడ్డి వెంకట్‌రెడ్డి 'పొడుపు కథలు ఒక పరిశీలన'లో సంకలనం చేసి పెట్టారు. వాటిలో కొన్ని పొడుపు కథలు కొన్నిటిని ఇప్పుడు చూద్దాం. మెదడుకు మేత పెడ్దాం.

కటకట రాముల కడుపుల పుడితి
ఏమై పుడితి – ఏం సుఖపడితి
ఆడదానితో దెబ్బలుదింటి
ఆగకుంటవోయి అగ్గిల బడితి (పిడక)

దాని మొదలు చెరుకు మొదలు
దాని ఆకు దామరాకు
దాని పూత మేడి పూత
దాని కాత గజ్జికాత (ఆముదం చెట్టు)

కొమ్ములు రెండుండు కోడె పస్రముగాదు
కట్టినట్లెయుండు కదలకుండు
నీళ్ళు మేతడగదు మేఘానికాసించు
దీని భావమేమి తెలిసి కొనుడు (చెఱువు)

వండగ నెండిన దొక్కిటి
ఖండించిన పచ్చి దొకటి, కాలినదొకటై
తిండికి రుచియైయుండును
ఖండితముగ దీని దెల్పు కవియుంగలడే! (వక్క, ఆకు, సున్నము)

ఇంటివెనుక కుప్పవోసి, కుప్పకు నిప్పును పెట్టి
కుప్ప కాలిపోతేను అప్పులెల్ల తీరిపోయె (కుమ్మరావం)

చింపిరి చింపిరి గుడ్డలు – ముత్యాలవంటి బిడ్డలు
(మొక్కజొన్న కంకి)

చూడకళ్ళులేవు, నడవకాళ్ళు లేవు
భుజమెక్కి చేతులు పట్టుకొంటాడు (అంగీ)

నున్నటి బండమీద నూగులు ఎండబోస్తే
నాలుకలేని పాము నాక్కొని పోయె (మంగలి కత్తి)

అంతులేని చెట్టుకు అరవైనాల్గే కొమ్మలు
కొమ్మకొమ్మకు కోటి పువ్వులూ
పువ్వుల్లో రెండేకాయలు (ఆకాశం, చుక్కలు, సూర్యచంద్రులు)

కాట్లగాల్తి – సాదిట్ల సస్తి
రోట్ల రుబ్బురాయికి తగిలి
రోసానికి వస్తి (సున్నం)

వంకరటింకర – శొ
వాని తమ్ముడు – అ
నల్లని పిల్లా – మి
నాకేమిస్తావు – తే
నాలుగుకాళ్ళ – మే (శొంఠి, అల్లం, మిరియం, తేనె)

పిల్లికి ముందు రెండు పిల్లులు
పిల్లికి వెనుక రెండు పిల్లులు
పిల్లికి పిల్లికి మధ్య ఒక పిల్లి
మొత్తం పిల్లులు? (మూడు)

బాహువుల్ పెక్కుండ్రు బాణాసురుడుకాదు
కలదు జన్నిదంబు కాదు ద్విజుడు
చెవులు, తోకనుండు జీవంబు లేకుండు
దీని భావమేమి తిరుమలేశ? (రాట్నం)

ఆకసమున దిరుగు నది పక్షియాకాదు
తోకలిగి యుండు మేకగాదు
త్రాడు కలిగి యుండు తలపయెద్దునుగాదు
దీనిభావమేమి తిరుమలేశ? (గాలిపటం)

వేయికనులు గలిగి వెలయునింద్రుడుకాదు
కాళ్ళునాల్గు కల్గు కాదు పశువు
నరుడు పట్టకున్న నడువగా జాలదు
దీని భావమేమి తిరుమలేశ? (మంచం)

వంగతోటనుందు వరిమళ్ళలో నుండు
జొన్న చేలనుండు చోద్యముగను
తలుపుమూల నుండు తలమీద నుండును
దీని భావమేమి తిరుమలేశ?
(పద్యంలోనే సమాధానాలున్నాయి)

అడవిలో పుట్టింది అడివిలో పెరిగింది మాయింటికొచ్చి తైతక్కలాడింది. (చల్లకవ్వం)

కిటకిట తలుపులు కిటారి తలుపులు ఎప్పుడు మూసిన చప్పుడుకావు. (కనురెప్పలు)

తోకలేని పిట్ట తొంభై ఆమడలు పోతది (ఉత్తరం)

పొట్టివానికి పుట్టెడు అంగీలు (ఉల్లిపాయ)

చెయ్యనికుండ, పొయ్యని నీళ్ళు, వెయ్యని సున్నం తియ్యగనుండు.
(కొబ్బరికాయ)

మా అమ్మచాప చుట్టలేదు. మా నాయన పైసలు లెక్కపెట్టలేదు (ఆకాశం, చుక్కలు)

ముక్కున బంగారం తోకతో నీరు తాగుతుంది.(దీపం వత్తి)

అరచేతికి అరవైతూట్లు (జల్లెడ)

పైనొక పలక కిందొక పలక పలకల మధ్య వలపలగిలక (నాలుక)

ఇంటి కాపలా కాస్తుంది. కుక్కకాదు, పట్టుకొని వేలాడుతుంది కాని పండుగాదు. (తాళం)

ఇద్దరు పెళ్ళాల మధ్య ఇరుకునపడిచచ్చాడు.(పోకచెక్క)

పొద్దున నాలుగు కాళ్ళు, మధ్యాహ్నం రెండుకాళ్ళు సాయంత్రం మూడు కాళ్ళు. (బాల్యం, యవ్వనం, ముసలితనం)

ఏమి లేనమ్మ ఎగిరెగరి పడ్తది – అన్ని ఉన్నమ్మ అణిగిమణిగి ఉంటుంది. (విస్తరాకు)

ఏటవతల ఒకరు, ఏటివతల ఒకరు ఇద్దరూ కలిస్తేగాని రాగాలు రావు (పెదవులు)

ఇంటికి వెయ్యిగదులు గదిగదికొక పిల్ల పిల్ల పిల్లకు తుపాకి (తేనెతెట్టె, తేనెటీగలు)

ఒళ్ళంతా ముళ్ళు – కడుపంతా చేదు (కాకరకాయ)

కన్నొక్కటే కాకి కాదు, కన్నం ఉంది పుట్టకాదు (సూది)

ఉన్నది వేలెడు తోక బారెడు (సూది)

మూడు గదులకుండ ముత్యాలకుండ – కుండలో గలదు ముత్యలపంట (దానిమ్మ)

ముగ్గురు రాజులకు ఒకటే టోపి (తాటిపండు)

ముఖమేలేదుకాని బొట్టుపెట్టుకుంది (కడప)

మొగ్గకాని మొగ్గ పూవ్వుపూయని మొగ్గ – పడతులు ముడువని మొగ్గ పంటికింది మొగ్గ (లవంగ)

మోకాలు లోతు మడుగులో మొండివాడు దిగవడ్డాడు (రుబ్బురోలు)

చిటపట చినుకులు చిటారిచినుకులు – ఎంత కురిసినా వరదలురావు (కన్నీళ్ళు)

చూస్తే ఒకటి, చేస్తే రెండు, తలకూ తోకకూ ఒకేటోపి (పెన్ను, కులం)

చూపులేని కన్ను సుందరమౌకన్ను తోటలేనికన్ను తోకకన్ను కన్నుగాని కన్ను కాలకంఠునికన్ను (నెమలి)

చేత్తోపారేసి నోటితో ఏరుకుంటారు (అక్షరాలు)

చేతికి అందదు, కంటికి దొరకదు, ముక్కుకు అందుతుంది (వాసన)

తవ్వని గుంట కురవని నీరు, ఎప్పుడు ఊరు (నోరు, లాలాజలం)

తెల్లని పొలంతో నల్లని విత్తనాలు (అక్షరాలు)

ముక్కు మీది కెక్కు ముందరి చెవులనొక్కు
టక్కునిక్కుల సొక్కు జారిందంటె పుటుక్కు (కళ్ళద్దాలు)

చిటారుకొమ్మున మిఠాయిపొట్లం
ఎంత ఎగిరినా అందదుపాపం (తేనెతెట్టె)

తండ్రి గరగర, తల్లి పీచు పీచు
బిడ్డలు రత్నమాణిక్యాలు (పనసకాయ)

వంటినిండా గాయాలు – కడుపునిండా రాగాలు (మురళి)

ఆకాశాన అరవై ఆరు కొడవళ్ళు (చింతకాయలు)

రెండు చేతులుంటాయి కాని పట్టుకోలేదు
నాలుగు కాళ్ళుంటాయి కాని నడువలేదు
వీపు ఉందికాని ముఖంలేదు ఏమిటది? (కుర్చీ)

అడవిలో పుట్టింది అడవిలో పెరిగింది
ఊరంత తిరిగింది తలుపెనక నక్కింది (చీపురు)

❀❀❀❀❀

# 4. బాల గేయాలు

పాట అనేది మన సంస్కృతిలో భాగమై కొనసాగుతున్నది. పనిపాటలు, ఆటపాటలు అంటూ పనిలో ఆటలో పాటలు కనిపిస్తాయి అంతేగాకుండా పండుగల్లో, జాతర్లలో, వివిధ సందర్భాలలో పాటలు పాడుతుంటారు.

అసలు మన పుట్టుక నుండే పాటతో సంబంధం ఏర్పడుతున్నది. మనం పుట్టినప్పుడు శిశువుగా ఉన్నప్పుడు నీళ్ళుపోయడం, అన్నం తినిపించడం, ఆటలు ఆడించడం, నిద్ర పుచ్చడం మొదలైన సందర్భాలలో ఎన్నో పాటలు మన సంస్కృతిలో అంతర్భాగంగా కనిపిస్తున్నాయి, వినిపిస్తున్నాయి

అటువంటి ఆ శిశుదశలో వెనుకటి తరం నుండి మనకు వినిపిస్తున్న కొన్ని పిల్లల పాటలను తెలుసుకుందాం.

### తారంగం తారంగం

తారంగం తారంగం - తాండవ కృష్ణా తారంగం
ముద్దుల కృష్ణా తారంగం - మోహన మురళీ
వేణునాథా తరంగం - వేంకటరమణ తారంగం
వెన్నదొంగ తారంగం - చిన్ని కృష్ణాతారంగం

### చేతవెన్న ముద్ద

చేతవెన్నముద్ద - చెంగల్వ పూదండ
బంగారు మొలతాడు - పట్టుదట్టి
సందిటతాయెతులు - సరిమువ్వ గజ్జెలు
చిన్ని కృష్ణా నిన్ను చేరి కొలుతు

### జగతిపై రామయ్య

జగతిపై రామయ్య జన్మించినాడు
సత్యములోకాన స్థాపించినాడు
ధర్మముతో రాజ్యాన్ని పాలించినాడు
తమ్ములను ప్రేమతో ఆదరించాడు
ఇల్లాలితో పాటు ఇక్కట్లుపడ్డాడు
అయోధ్య రామయ్య అన్నయ్యమాకు
వాలుకనుల సీత వదినమ్మమాకు

### చందమామ రావె

చందమామ రావె - జాబిల్లి రావె
కొండెక్కిరావె - కోటి వెలుగుతేవె
పరుగెత్తిరావె - పాలు పెరుగు తేవె
అన్ని తెచ్చి - మా అబ్బాయి/అమ్మాయికీవె

### చుక్ చుక్ రైలు

చుక్ చుక్ రైలు వస్తుందీ
పక్కకు పక్కకు జరుగండీ
ఆగినాక ఎక్కండీ
జో జో పాపాయి ఏడవకు
లడ్డు మిఠాయి తినిపిస్తా
కమ్మని పాలు తాపిస్తా

### చిట్టి చిలకమ్మా!

చిట్టిచిలకమ్మా - అమ్మకొట్టిందా
తోటకెళ్ళావా - పండు తెచ్చావా
గూట్లో పెట్టావా - గుటుక్కు మింగావా

### ఏడవకు ఏడవకు

ఏడవకు ఏడవకు ఓ చిట్టి పాప
ఏడిస్తే నీ కండ్ల నీలాలు కారు
నీలాలు కారంగ నే చూడలేను
పాలైన కారవే బంగారు కండ్ల

## బుజ్జిమేక

బుజ్జిమేక బుజ్జిమేక ఏడకెల్తివి?
రాజుగారి తోటలోన మేతకెల్తిని
రాజుగారి తోటలోన ఏమి చూస్తివి?
రాణిగారి పూలచెట్ల సొగసు చూస్తిని
పూలచెట్లు చూసి నీవు ఊరుకుంటివా?
ఊరుకోక పూలచెట్లు మేసివస్తిని
మేసివస్తే భటులు చూసి ఏమి చేసిరి
భటులు నన్ను కొట్టవస్తే తుర్రుమంటిని

## బుర్రుపిట్ట

బుర్రుపిట్ట బుర్రు పిట్ట
తుర్రుమన్నది
పడమటింట కాపురం
చేయనన్నది
అత్త తెచ్చిన కొత్త చీర
కట్టనన్నది
మామ తెచ్చిన మల్లెపూలు
ముడువనన్నది
మొగునిచేత మొట్టికాయ
తింటనన్నది

## ఏనుగు

ఏనుగమ్మా ఏనుగు – ఏ ఊరెళ్ళింది ఏనుగు
ఏనుగమ్మా ఏనుగు – మా ఊరొచ్చింది ఏనుగు
ఏనుగు ఏనుగు నల్లన – ఏనుగు కొమ్ములు తెల్లన
ఏనుగు మీద రాముడూ ! ఎంతో చక్కని దేవుడూ

## చెమ్మచెక్క

చెమ్మచెక్క – చారడేసి మొగ్గ
అట్లుపోయంగ – ఆరగించంగ
ముత్యాల చెమ్మచెక్క – ముగ్గులెయ్యంగ
రత్నాల చెమ్మచెక్క – రంగులెయ్యంగ
పగడాల చెమ్మచెక్క – పందిరెయ్యంగ
పందిట్లో మా బావ – పెండ్లిచెయ్యంగ
సుందెలుక పొక్కల్లో పెండ్లి కొడుకుండు
చేసుకోపెండ్లి పిల్లాసిగ్గెందుకే

## చిట్టి చిట్టి మిరియాలు

చిట్టి చిట్టి మిరియాలు – చెట్టు కింద పోసి
పుట్టమన్ను తెచ్చి – బొమ్మరిల్లు కట్టి
కలవారింటికి చల్లకు పోతే
కలవారి కుక్క భౌభౌ మన్నది
నా కాళ్ళ గజ్జెలు ఘల్లు ఘల్లు మన్నవి
చంకలో పాప కేర్ కేర్ మన్నది

## దాగుడు మూతా దండాకోర్

దాగుడుమూత దండోకోర్
పిల్లి వచ్చె ఎలుకా భద్రం
ఎక్కడి దొంగలు అక్కడనే
గప్‌చుప్ సాంబారు బుడ్డి

## కాకి కాకి

కాకి కాకి కొవ్వర కాకి – కాకి నాకు ఈకె ఇచ్చె
ఈకను తీసి అమ్మకిస్తే – అమ్మ నాకు అటుకులు పెట్టె
అటుకులు తీసి పంతులుకు కిస్తే – పంతులు నాకు
పద్యం చెప్పె
పద్యం తీసి మామకిస్తె – మామ నాకు పిల్లనిచ్చె
పిల్ల పేరు మల్లెమొగ్గ – నాపేరు జమీందార్

## వరిచేలు పండాలి

వానల్లు కురవాలి – వానదేవుడా
వరిచేలు పండాలి – వానదేవుడా
నల్లని మేఘాలు – వానదేవుడా
చల్లంగ కురవాలి – వాన దేవుడా
మా వూరి చెరువంత – వానదేవుడా
అలుగులు పారాలి – వానదేవుడా
పచ్చగ చేనంత – వాన దేవుడా
పంటలు పండాలి – వానదేవుడా

## నారింజ కాయ

నారింజ కాయ – నిను చూడగానే
నోరూరుతుండు – తిని చూడగానే
అబ్బబ్బ పులుపు – తిననే తినను
నీకు కావాలా ! మీకు కావాలా !
ఎవరికి వద్దా!
పడేస్తున్నాను పడేస్తున్నాను పడేసాను

## గుడు గుడు కుంచం

గుడు గుడు కుంచం గుళ్ళో రాగం
పాముల పెట్టే – పడిగే రాగం
పెద్దన్న గుఱ్ఱం పెండ్లికి వాయె
చిన్నన్న గుఱ్ఱం చీటికి వాయె
మా అన్న గుఱ్ఱం మాయింటికొచ్చె

## కాళ్ళా గజ్జా

కాళ్ళా గజ్జా – కంకాళమ్మా
వేగూచుక్కా – వెలగామొగ్గ
మొగ్గాకాదు – మోదుగనీడ
నీడా కాదు – నిమ్మలబాయి
బాయీ కాదూ – బచ్చలికూర
కూరా కాదు – గుమ్మడి పండు
పండూకాదూ – పాపాయి కాళ్ళు
కాళ్ళూతీసి – కడగాపెట్టు

## రింగు రింగు బిళ్ల

రింగు రింగు బిళ్ళ – రూపాయి బిళ్ళ
బిళ్ళ కాదురా – దామెర మొగ్గ
మొగ్గ కాదురా – మొదుగు నీడ
నీడకాదురా – నిమ్మల బావి
బావి కాదురా – బచ్చలి కూర
కూర కాదురా – కుమ్మరి మెట్టు
మెట్టుకాదురా – మేదరి సిబ్బి
సిబ్బికాదురా – చీపురు కట్ట
కట్ట కాదురా – కావడి బద్ద
బద్ద కాదురా – చారెడు మీసం
మీసం కాదురా – మిరియాల పొడుం
పొడుం కాదురా – పోతరాజు

## బావ బావ పన్నీరు

బావ బావ పన్నీరు
బావను పట్టుకు తన్నేరు
వీధి వీధి తిప్పేరు
వీసెడు గంథం పూసేరు
చావడి గుంజకు కట్టేరు
చప్పిడి గుద్దులు గుద్దేరు

## ఒప్పుల కుప్పా

ఒప్పుల కుప్పా – వయ్యారి భామ
సన్న బియ్యం – ఛాయ పప్పు
చిన్న మువ్వ – సన్న గాజు
కొబ్బరి కోరు – బాదం పప్పు
గూట్లో రూపాయి – నీ మగడు సిపాయి

## వానా వానా వల్లప్పా

వానా వానా వల్లప్పా !
వాకిట తిరిగు చెల్లప్పా
చేతులు చాచు మల్లప్పా
తిరుగు తిరుగు తిమ్మప్పా
తిరుగాలేను నరసప్పా

## బడాయి పిల్లి

బడాయి పిల్లి లడాయి కెళ్ళి
మిడతను చంపి ఉస్సురన్నది
ఎలుకను చంపి ఏనుగన్నది
సింహం తానని పొంగినపిల్లి
కుక్కను చూచి ఒకటే పరుగు

## గుమ్మాడమ్మా గుమ్మాడి

గుమ్మాడమ్మా గుమ్మాడి
గింజవేశాం గుమ్మాడి
మొక్క మొలిచే గుమ్మాడి
తీగ ప్రాకె గుమ్మాడి
మొగ్గ వేసె గుమ్మాడి
పువ్వు పూసె గుమ్మాడి
పిందెవేసె గుమ్మాడి
కాయకాసె గుమ్మాడి
పందిరి కింద గుమ్మాడి
పండు పండె గుమ్మాడి
పండుకోసి గుమ్మాడి
అందరికి పంచాము గుమ్మాడి

## చల్ చల్ గుర్రం

చల్ చల్ గుర్రం – చలాకి గుర్రం
కర్రతో చేసిన – గజ్జెల గుర్రం
మువ్వల మెడలో ముద్దుగ గట్టి
రంగుల హంగుల సింగారించి
వీపుకు జీను సాపుగ వేసి
వదిలేస్తే సరి పరుగిడు గుర్రం
కళ్ళెం చేత్తో గట్టిగ బట్టి
గుర్రం మీద కూర్చొని ఉండి
చల్ చల్‌మని తోలుతూ ఉంటే
గంతులు వేయుచు పరుగిడు గుర్రం
చల్ చల్ గుర్రం – చలాకి గుర్రం

## ఏదిమేలు?

గడపలన్నిటిలోన ఏ గడపమేలు?
మాలక్ష్మి నర్తించు మా గడపమేలు
అరుగు లన్నింటిలోన ఏ అరుగుమేలు?
అతిథులందరు జేరు మా అరుగుమేలు
వీథులన్నింటిలోన ఏ వీథిమేలు?
కొట్లాటలే లేని మా వీథిమేలు
ఊరిలన్నింటిలోన ఏ ఊరుమేలు?
సిరిసంపదలు తులతూగు మా ఊరుమేలు

## ఎందుకురా?

ఎండలు కాసేదెందుకురా?
మబ్బులు పట్టేటందుకురా
మబ్బులు పట్టేదెందుకురా?
వానలు కురిసేటందుకురా
వానలు కురిసేదెందుకురా?
చెరువులు నిండేటందుకురా
చెరువులు నిండేదెందుకురా?
పంటలు పండేటందుకురా
పంటలు పండేదెందుకురా?
ప్రజలు బతికేటందుకురా
ప్రజలు బతికేందెందుకురా?
మంచిని పెంచేటందుకురా

## తప్పట్లోయ్ – తాళాలోయ్

తప్పట్లోయ్ – తోళాలోయ్
దేవుడి గుళ్ళో – బాజాలోయ్
పప్పు బెల్లం – దేవుని కోయ్
పాలు నెయ్యి – పాపాయి కోయ్

## ఉడుతా ఉడుతా

ఉడుతా ఉడుతా ఊచ్
ఎక్కడి కెళ్తావ్ వోచ్
కొమ్మమీది జాంపండు
కోస్తుకోస్తావా! మా పాపకిస్తావా!

## పొట్టేలు కన్నతల్లి

పొట్టేలు కన్నతల్లి గొర్రే గొర్రే
దున్నపోతు కన్నతల్లి బర్రే బర్రే
ఉమ్మెంతకాయ తింటె వెర్రే వెర్రే
చిన్నచెల్లెకు చీమకుడితే ఒర్రే ఒర్రే
మిరపకాయ కొరికితే చుర్రే చుర్రే
బురదలోన కాలు వేస్తె పుర్రే పుర్రే
ముందు పళ్ళు ఊడిపోతే తొర్రే తొర్రే
తొర్రి నోట్లో అంబలి పోస్తె జుర్రే జుర్రే

❀❀❀❀❀

# 5. నీతి కథలు

### బంగారు బాతు గుడ్డు :

ఒక ఊరిలో కిష్టయ్య, అతని భార్య ఒక బాతు పిల్లను తెచ్చి పెంచుకుంటున్నారు. అది పెరిగి ఒక బంగారు గుడ్డును పెట్టింది. కిష్టయ్య దంపతుల ఆనందానికి అంతులేదు. అట్లా ప్రతి రోజు పెట్టే బంగారు గుడ్డును చూడగానే దురాశ కలిగింది. దాని పొట్టలోని బంగారు గుడ్లన్నీ ఒకేసారి తీసుకోవాలని అనుకున్నారు. పొట్ట చీల్చి చూశారు. ఒక్క బంగారు గుడ్డు కూడా లేదు. నెత్తి, నోరు కొట్టుకుంటూ దుఃఖించారు.

నీతి : దురాశ దుఃఖానికి మూలం.

### ఆవు - పులి :

ఒక రోజు ఒక ఆవు మేత కోసం అడవికి వెళ్ళింది. ఇంతలో దానికి ఒక పులి ఎదురైంది. పులి ఆవు మీద దూకి చంపబోయింది. అప్పుడు ఆవు బ్రతిమాలుతూ "నాకు ఇంటి వద్ద లేగదూడ ఉన్నది. అది ఆకలితో ఉన్నది. మీరు అనుమతిస్తే దానికి పాలు ఇచ్చి వస్తాను" అని దీనంగా వేడుకున్నది. శీఘ్రంగా వెళ్ళిరా, చాలా ఆకలిగా ఉన్నది అన్నది పులి. ఆవు దూడకు పాలిచ్చి, బుద్ధులు చెప్పి కన్నీళ్ళతో పులి దగ్గరకు వచ్చింది. ఆవును చూడగానే పులి ఆశ్చర్యపోయింది. నువ్వు తిరిగి రావని అనుకున్నాను అన్నది పులి. "ఆడిన మాట తప్పడం మహా పాపం కదా, ఇప్పుడు మీరు నన్ను తినవచ్చు" అన్నది ఆవు. ఆవు ప్రేమ, త్యాగ గుణం, సత్యనిష్ఠ చూసి పులి కరిగిపోయింది. ఆవును వదలిపెట్టి అడవిలోకి వెళ్ళి పోయింది. ఆవు ఉరుక్కుంటూ ఇంటికి పోయింది.

నీతి : ఆడిన మాట తప్పకూడదు.

### సింహం - చిట్టెలుక :

ఒక అడవిలో సింహం ఉండేది. అదే అడవిలోని చెట్టు కింద కన్నంలో చిట్టెలుక నివసిస్తున్నది. ఒక రోజు సింహం వేటాడి అలసిపోయి చెట్టు కింద పడుకున్నది. చిట్టెలుక అటూ ఇటూ తిరుగుతూ సింహం కాలుకు తగలగానే, సింహం కోపంతో పంజాతో పట్టుకున్నది. వణుకుతూ విడిచిపెట్టమని, "ఎప్పుడైనా నీకు ఉపకారం చేస్తాను" అని దీనంగా వేడుకున్నది. చిన్న ప్రాణివి, నీవు నాకు ఉపకారం చేస్తావా అని హేళనగా నవ్వుతూ పో! అని వదిలిపెట్టింది. కొద్ది రోజుల తర్వాత సింహం వేటగాడి వలలో చిక్కుకున్నది. చిట్టెలుక సింహం బాధను గమనించి, జాలిపడి వల తాళ్ళను కొరికింది. సింహం 'నన్ను క్షమించు' అని సిగ్గుపడుతూ చిట్టెలుకతో అన్నది. అప్పటి నుండి సింహం, చిట్టెలుక స్నేహంగా ఉన్నాయి.

నీతి : ఎంత చిన్నవారినైనా కించపరచరాదు.

### నాయనా పులి :

ఒక ఊరిలో ఒక రైతుకు పొలంతో పాటు గొర్రెల మంద కూడా ఉన్నది. ఒక రోజు రైతు తాను పొలానికి వెళుతూ గొర్రెల మందకు కాపలాగా తన కొడుకును ఉంచాడు. గొర్రెల కోసం అప్పుడప్పుడు పెద్ద పులి వస్తుందని జాగ్రత్తగా ఉండమని, పులి వస్తే కేక వేయమని కొడుకుకు చెప్పుతాడు రైతు. కొడుకు తండ్రిని ఆట పట్టించాలని నాయనా! పులి అని పిలిచాడు. తండ్రి రాగానే హాస్యానికి పిలిచానని చెప్పాడు. అట్లా మూడుసార్లు పిలిచాడు. నాల్గవసారి నిజంగానే పులి వచ్చింది. నాయనా! పులి అని పిలిచాడు. హాస్యానికే పిలుస్తున్నాడని తండ్రి పట్టించుకోలేదు. పులి గొర్రెపిల్లను ఈడ్చుకొని పోయింది.

నవ్వులాటకు కూడా అబద్ధం ఆడకూడదని ఏడుస్తూ నిర్ణయించుకున్నాడు రైతు కొడుకు.

నీతి : అబద్ధాలు ఆడకూడదు.

## సింహం – కుందేలు :

ఒక అడవిలో ఒక ముసలి సింహం జంతువులపై పెత్తనం చెలాయిస్తూ కాలం గడుపుతున్నది. జంతువులన్నింటిని ఇష్టం వచ్చినట్టు చంపి తింటున్నది. జంతువులన్నీ సింహం బాధ తప్పించుకునేందుకు సభలో ఒక నిర్ణయం తీసుకున్నాయి. దాని ప్రకారం రోజుకొకరు సింహానికి ఆహారంగా పోదాం అని అనుకున్నాయి. ఈవిధంగానే సింహంతో ఒప్పందం చేసుకున్నాయి. ఒక రోజు సింహానికి ఆహారంగా కుందేలు వంతు వచ్చింది. కుందేలు తెలివితో ఆలస్యంగా సింహం దగ్గరకు వెళ్ళింది. సింహం కోపంతో గర్జిస్తూ ఆలస్యానికి కారణం అడిగింది. మరొక సింహాన్ని తప్పించుకొని వచ్చాను అని కుందేలు చెప్పింది.

మరొక సింహమా! ఎక్కడ? చూపించుమని అడుగగా బావి లోపల ఉన్నది అని కుందేలు చెప్పింది. సింహం బావి లోపల తొంగి చూసి తన ప్రతిబింబాన్నే మరొక సింహం అని తలిచి చంపడానికి దుంకి చచ్చిపోయింది. చిన్న కుందేలు తెలివితేటలతో సింహాన్ని చంపినందుకు అడవిలోని జంతువులన్నీ సంతోషించాయి.

నీతి : తెలివితేటలతో ఏ పనైనా సాధించవచ్చు.

## పులి – బంగారు కంకణం :

ఒక చెరువు గట్టున ఉన్న పొదలో ఒక ముసలి పెద్దపులి దారిలో పోయే బాటసారిని పిలిచింది. నా దగ్గర ఒక బంగారు కంకణం ఉన్నది. దానిని ఏ పుణ్యాత్మునికైనా దానం చేయవలెనని ఎదురుచూస్తున్నాను. నీవు వెళ్ళి చెరువులో స్నానం చేసి రా అని అన్నది. బాటసారికి ఆశ కలిగినది. కాని పులి చంపుతుందేమోనని భయంతో వణుకుతున్నాడు. అయినా కంకణం మీది ఆశతో పులి మాటలను నమ్మాడు. నేను క్రూర జంతువునే. అనేక పాపాలు చేశాను. ఎన్నో జంతువులను, ఎందరో మనుష్యులను తిన్నాను. ఇప్పుడు కళ్ళు కనబడుటలేదు. గోళ్ళు మొద్దుబారిపోయినాయి. ముసలిదాన్ని అయినాను, సందేహించకు అని బాటసారితో పులి అన్నది. పులి మాటలను నమ్మి చెరువులో స్నానానికి దిగి బురదలో ఇరుక్కొని రక్షించండి... రక్షించండి... అని మొత్తుకుంటున్నాడు. వెంటనే పులి అతని మీదకు దుంకి తృప్తిగా ఆరగించింది. దురాశకు పోయి బాటసారి దుర్మరణం పాలైనాడు.

నీతి : దురాశ దుఃఖానికి మూలం.

## ఎవరి పని వారే చేయాలి? :

కిష్టాపురం గ్రామంలో పుల్లయ్య అనే చాకలివానికి ఒక కుక్క, గాడిద ఉన్నాయి. గాడిద బట్టలు మోసేది. కాబట్టి దానికి ఆహారం బాగా పెట్టేవాడు. కాపలా కాయటమే కుక్క పని అని దానికి సరిగ్గా ఆహారం పెట్టకపోయేవాడు. యజమాని చూపుతున్న ప్రవర్తనకు కోపం వచ్చింది కుక్కకు. ఒక రోజు ఒక దొంగ ఇంట్లో దూరాడు. అది చూసి గాడిద కుక్కతో దొంగ వచ్చాడు అరవమని చెబుతుంది. కుక్క, గాడిదతో యజమాని కడుపు మాడుస్తున్నాడు. నేను అరవనని చెబుతుంది. స్వామి ద్రోహివి. నీ పని నేను చేయలేనా అని గాడిద ఓండ్ర పెడుతుంది. ఈలోపు, దొంగ సొమ్మంతా మూటగట్టుకొని పారిపోయాడు. గాడిద ఓండ్రకు యజమాని నిద్రలేచి, రోజంతా కష్టపడి పడుకున్న నాకు నిద్రాభంగం కలిగిస్తావా అని గాడిదను దుడ్డుకర్రతో చావకొట్టాడు.

నీతి : ఎవరి పని వారే చేయాలి.

## పావురాలు – వేటగాడు :

అనగనగ ఒక పెద్ద అడవిలో ఒక మఱ్ఱిచెట్టు మీద ఎన్నో పక్షులు నివసిస్తున్నాయి. ఒకనాడు వేటగాడు అడవిలో నూకలు చల్లి వానిపై వలపన్ని కొంత దూరంలో దాగి ఉన్నాడు. పావురాలు ఆకాశ మార్గాన ఎగురుతూ భూమిపై నూకలు చూశాయి. వెంటనే కిందికి దిగాలని ఆశపడ్డాయి. పావురాల రాజు చిత్రగ్రీవుడు "ఈ అడవిలో నూకలు ఎట్లా ఉన్నాయి. తొందరపడవద్దు. ఏదో మోసమున్నది" అని అన్నది. అంతలో

ఒక ముసలి పావురం "లేనిపోని అనుమానాలు వద్దు, ఎదురుగా ఉన్న ఆహారాన్ని వదిలి ఆకలితో ఎక్కడికో పోవద్దు" అని అన్నది. అన్నీ కలసి నేల మీద వాలి వలలో చిక్కుకున్నాయి. ముసలి పావురం సలహాతో వలలో చిక్కుకున్నందుకు బాధపడుతూ తిట్టుకోసాగాయి. చిత్రగ్రీవుడు ''మీరు బాధపడవద్దు. ఐకమత్యమునకు మించిన బలం లేదు. అందరూ కలిసి ఒకేసారి పైకి వలతో సహా ఎగిరిపోదాము. నా మిత్రుడు హిరణ్యకుడు వలను కొరికి రక్షిస్తాడు" అని అన్నాడు. పావురాలన్నీ చిత్రగ్రీవుని మాటలకు సంతోషించి ఒకేసారి ఎగిరిపోయాయి. వేటగాడు ఆశ్చర్యపడి కొంత దూరం వెంబడించి పావురాలు, వల పోయినందుకు నిరాశతో ఇంటికి వెళ్ళాడు. పావురాలన్నీ హిరణ్యకమనే ఎలుక ద్వారా వల నుండి బయటపడి కృతజ్ఞతలు తెల్పి ఆనందంగా ఎగిరిపోయాయి.

నీతి : ఐకమత్యమే మహాబలం.

## నక్క – ద్రాక్షపండ్లు :

ఒక అడవిలో ఒక నక్క ఉండేది. ఒకరోజు దానికి బాగా ఆకలి అయింది. అడివంతా తిరిగింది. పక్కనే ఉన్న ద్రాక్షపండ్ల తోట కనిపించింది. వెంటనే ఉరుక్కుంటూ తోటలోకి పోయింది. పండ్లను చూడగానే దానికి నోరూరింది. ఎంతో పసందుగా ఉంటాయని తలచుకుంటూ పండ్ల కోసం ఎగిరింది. అవి అందలేదు. మళ్ళీ మళ్ళీ ఎగురుతూనే ఉన్నది. అవి అందటంలేదు. కడుపునిండా తిందామనుకొన్న ద్రాక్షపండ్లు అందకపోయేసరికి నక్కకు విసుగువచ్చింది. ఛీ ఈ ద్రాక్షపండ్లు పుల్లగా ఉంటాయి. నాకేం వద్దు అనుకుంటూ అడవిలోకివెళ్ళింది.

నీతి : అందని ద్రాక్షలు పుల్లన

## రాణిగారి హారం :

ఒక అడవిలో మఱ్ఱిచెట్టుపై కాకుల జంట నివసిస్తున్నది. చెట్టు కింద పుట్టలో ఒక పాము ఉన్నది. పాము రోజూ కాకులు పెట్టిన గుడ్లను తింటూ ఉండేది. కాకులు ఏడుస్తూ ఏమీ చేయలేక విచారిస్తున్నాయి. అవి తమ స్నేహితుడైన నక్క దగ్గరికి వెళ్ళి తమ బాధను చెప్పుకున్నాయి. నక్క ఆలోచించి ఒక ఉపాయం చెప్పింది. దాని ప్రకారం కాకి పక్కనే ఉన్న కోటలోకి వెళ్ళింది. అక్కడ రాణిగారు కొలనుగట్టుపై, నగలన్నీ ఉంచి స్నానం చేస్తూ కాకికి కనిపించింది. వెంటనే రాణిగారి హారం తీసుకొని కాకి ఎగురుకుంటూ వెళ్ళి పాము పుట్టలో వేసింది. కాకిని వెంబడించిన భటులు పుట్టను తవ్వి, పామును చంపి హారాన్ని తీసుకుపోయారు. పాము బాధ విరగడ అయినందుకు కాకులు సంతోషించాయి.

నీతి : యుక్తితో ఏపనైనా సాధించవచ్చు.

## కోతి – మొసలి :

ఒక అడవిలో కోతి, మొసలి స్నేహంగా ఉండేవి. కోతి చెట్టుపై నుండి పడవేసే పండ్లను మొసలి తింటుండేది. ఆ పండ్లను తన భార్యకు కూడా ఇచ్చేది మొసలి. కోతి ఇచ్చే పండ్లు ఇంత తియ్యగా ఉంటే దాని గుండె ఇంకా ఎంత తియ్యగా ఉంటుందో అని అనుకున్నది. వెంటనే కోతి గుండె తినాలనే కోరికను మొసలి భార్య అన్నది. మొసలి వెంటనే కోతిని విందుకు పిలిచింది. కోతి మొసలిపై ఎక్కి వెళుతుంటే దారిలో మొసలి కుతంత్రం కోతికి అర్థమైంది. 'తన గుండె తన దగ్గర లేదని, చెట్టు దగ్గర ఉన్నద'ని ఉపాయంతో కోతి చెప్పింది. మొసలి వెనుకకు తిరిగి చెట్టు దగ్గర కోతిని దించింది. వెంటనే కోతి చెట్టుపైకిచేరి 'నీ దుర్బుద్ధి అర్థమయింది ఛీ.. పో..' అని మొసలితో అన్నది.

నీతి : దుష్టులను నమ్మరాదు.

❀❀❀❀❀

# 6. శతక పద్యాలు

భాషా ప్రక్రియల్లో శతక ప్రక్రియకు ఒక ప్రత్యేక స్థానమున్నది. కవి యొక్క వైదుష్యానికి, విలక్షణతకు, అభిరుచులకు తార్కాణంగా నిలబడింది ఈ ప్రక్రియ.

సహజంగా నూరు అంతకంటే ఎక్కువ పద్యాలు ఉండడం, ఏ పద్యానికి ఆ పద్యమే ప్రత్యేకంగా భావాన్ని కల్గియుండటం, మకుటాన్ని కల్గియుండటం శతకానికున్న ప్రత్యేక లక్షణాలు.

తెలంగాణంలో అనేకమంది శతకకవులున్నారు. కొందరు శతకాలతో తమ కావ్యరచనా ప్రస్థానాన్ని మొదలుపెడ్తే మరికొందరు ఆ ప్రస్థానంలో శతకాలను చేర్చుకొని ముందుకు సాగిపోయారు. మరికొంతమంది 'శతకం'తోనే ప్రసిద్ధులూ అయ్యారు. అట్లా తెలంగాణంలో ప్రసిద్ధులైన కొంతమంది శతకకవుల శతకాల్లోంచి కొన్ని 'ముత్యాలను' మీముందు ఉంచుతున్నాం. ఇవి మన తెలంగాణ పిల్లల నోళ్ళల్లో నివాసం ఏర్పరచుకోవాలి.

### 1. సుమతి శతకము
### (బద్దెన)

1. కం. : తన కోపమె తన శత్రువు
తన శాంతమె తనకు రక్ష దయ చుట్టంబౌఁ
దన సంతోషమె స్వర్గము
తన దుఃఖమె నరకమండ్రు తథ్యము సుమతీ!

2. కం. : ఉపకారికి నుపకారము
విపరీతముగాదు సేయ వివరింపంగా
నపకారికి నుపకారము
నెపమెన్నక సేయువాడు నేర్పరి సుమతీ!

3. కం. : కూరిమిగల దినములలో
నేరములెన్నడునుఁ, గలుగనేరవు మఱి యా
కూరిమి విరసంబైనను
నేరములే తోఁచుచుండు నిక్కము సుమతీ!

4. కం. : లావుగల వానికంటెను
భావింపగ నీతిపరుడు బలవంతుడౌ
గ్రావంబంత గజంబును
మావటివాఁడెక్కినట్లు మహిలో సుమతీ!

5. కం. : బలవంతుడ నాకేమని
బలువురతో నిగ్రహించి పలుకుట మేలా?
బలవంతమైన సర్పము
చలిచీమల చేతఁజిక్కి చావదె సుమతీ!

6. కం. : వినదగు నెవ్వరు చెప్పిన
వినినంతనె వేగపడక వివరింపదగున్
గనికల్ల నిజము దెలిసిన
మనుజుడెపో నీతిపరుడు మహిలో సుమతీ!

### 2. దాశరథీ శతకము
### కంచర్లగోపన్న (రామదాసు)

7. ఉ. : శ్రీరఘురామ, చారు తులసీదళదామ, శమక్షమాది శృం
గార గుణాభిరామ; త్రిజగన్నుత శౌర్య రమాలలామ దు
ర్వార కబంధరాక్షస విరామ; జగజ్జన కల్మషార్ణవో
త్తారకనామ భద్రగిరి దాశరథీ కరుణాపయోనిధీ!

8. ఉ. : రాముడు ఘోరపాతక విరాముఁడు సద్గుణకల్పవల్లికా
రాముడు షడ్వికారజయ రాముడు సాధుజనావనవ్రతో
ద్దాముడు రాముడే పరమదైవము మాకని మీయడుంగు గెం
దామర లే భజించెదను దాశరథీ కరుణాపయోనిధీ!

9. ఉ. : చిక్కని పాలపై మిసిమిఁజెందిన మీగడ పంచదారతో
మెక్కిన భంగి నీ విమల మేచకరూప సుధారసంబు నా
మక్కువ పళ్ళెరంబున సమాహిత దాస్యమనేటి
దోయిటన్
దక్కెనటంచు జుఱ్ఱెదను దాశరథీ కరుణాపయోనిధీ!

10. ఉ. : పెంపునఁ దల్లివై కలుషబృంద సమాగమ మొందకుండ ర
క్షింపను దండ్రివై మెయి వసించు దశేంద్రియ రోగముల్ నివా
రింపను వెజ్జువై కృప గురించి పరంబు దిరంబుగాఁగా స
త్సంపద లీయ నీవెగతి దాశరథీ కరుణాపయోనిధీ!

11. ఉ. : నోఁచిన తల్లిదండ్రికిఁ దనూభవుఁడొక్కడెచాలు, మేటి చే
చాఁచనివాడు, వేఁడొకఁడు చాఁచినలేదన కిచ్చువాడు నో
రాఁచి నిజంబకాని పలుకాడనివాడు రణంబులోన మేన్
దాచనివాడు భద్రగిరి దాశరథీ కరుణాపయోనిధీ!

12. ఉ. : భండన భీముడార్తజన బాంధవుఁడుజ్జ్వల బాణ తూణ కో
దండ కళాప్రచండ భుజతాండవ కీర్తికి రామమూర్తికిన్
రెండవ సాటి దైవమిఁక లేఁడనుచున్ గడకట్టి భేరికా
డాండ డడాండ డాండ నినదంబుల జాండమునిండ
మత్తవే
దండము నెక్కి చాటెదను దాశరథీ కరుణాపయోనిధీ!

## 3. నరసింహ శతకము
## (కాకుత్థ్సం శేషప్పకవి)

13. సీ. : తల్లి గర్భమునుండి ధనము దేఁడెవ్వడు,
వెళ్ళిపోయెడినాడు వెంటరాదు,
లక్షాధికారైన లవణమన్నమెకాని
మెఱుఁగు బంగారంబు మ్రింగబోఁడు
విత్తమార్జనఁజేసి విఱ్ఱవీఁగుటెకాని,
గూడబెట్టిన సొమ్ము గుడువబోఁడు
పొందుగా మఱుఁగైన భూమిలోపలఁబెట్టి
దానధర్మము లేక దాఁచిదాచి

తే.గీ. : తుదకు దొంగల కిత్తురో? దొరలకవునొ?
తేనె జుంటీగ లియ్యవా తెరువరులకు?
భూషణ వికాస! శ్రీధర్మపురనివాస!
దుష్టసంహార! నరసింహ! దురితదూర!

14. సీ. : అధిక విద్యావంతు లప్రయోజకులైరి
పూర్ణశుంఠలు సభాపూజ్యులైరి
సత్యవంతుల మాట జనవిరోధంబాయె
వదురుపోతుల మాట వాసికెక్కె
ధర్మవాసన పరుల్ దారిద్ర్యమొందిరి
పరమలోభులు ధనప్రాప్తులైరి
పుణ్యవంతులు రోగ భూతపీడితులైరి
దుష్టమానవులు వర్ధిష్ణులైరి

కం : పక్షివాహన! మావంటి భిక్షుకులకు
శక్తిలేదాయె, నిఁక నీవె చాటు మాకు
భూషణ వికాస! శ్రీధర్మపురనివాస!
దుష్టసంహార! నరసింహ! దురితదూర!

15. సీ. : మాన్యంబులీయ సమర్థుఁడొకడు లేడు;
మాన్యముల్ చెఱుప సమర్థులంత
యెండిన యూళ్ళ గోడెఱిఁగింప డెవ్వడు
పండిన యూళ్ళకు ప్రభువులంత
యితడు పేద యటంచు నెఱిఁగింప డెవ్వడు
గలవారి సిరిలెన్నఁగలరు చాల
దనయాలి చేష్టలఁదప్పెన్నఁడెవ్వఁడు
బెఱకాంత రంకెన్న బెద్దలంత

తే.గీ. : యిట్టి దుష్టుల కధికార మిచ్చినట్టి
ప్రభువు తప్పులటంచును బలుకవలెను
భూషణ వికాస! శ్రీధర్మపురనివాస!
దుష్టసంహార! నరసింహ! దురితదూర!

16. సీ. : బ్రతికినన్నాళ్ళు నీ భజన తప్పనుగాని
మరణకాలమునందు మఱతునేమో!
యావేళ యమదూత లాగ్రహంబున వచ్చి
ప్రాణముల్ పెకలించి పట్టునపుడు
కఫవాత పైత్యముల్ గప్పగా భ్రమచేత
గంపముద్భవమంది కష్టపడుచు
నాజిహ్వతో నిన్ను నారాయణా! యంచు
బిలుతునో! శ్రమచేత బిలువలేనొ?

తే.గీ. : నాటికిప్పుడె చేసెద నామభజన
దలఁచెదను జేరి వినవయ్య! ధైర్యముగను
భూషణ వికాస! శ్రీధర్మపురనివాస!
దుష్టసంహార! నరసింహ! దురితదూర!

17. సీ. : నీలమేఘశ్యామ: నీవె తండ్రివి మాకు,
కమలవాసిని మమ్ముగన్న తల్లి
నీభక్తవరులంత నిజమైన బాంధవుల్,
నీకటాక్షము మా కనేకధనము
నీకీర్తనలు మాకు నిత్య ప్రపంచంబు
నీసహాయము మాకు నిత్యసుఖము
నీ మంత్రమే మాకు నిష్కళంకపు విద్య
నీపద ధ్యానంబు నిత్యజపము

తే.గీ. : తోయజాతాక్ష! నీపాద తులసిదళము
రోగముల కౌషధము బ్రహ్మరుద్ర వినుత!
భూషణ వికాస! శ్రీధర్మపురనివాస!
దుష్టసంహార! నరసింహ! దురితదూర!

18. సీ. : అడవి పక్షులకెవ్వఁడాహార మిచ్చెను
మృగజాతి కెవ్వడు మేతపెట్టె?
జల చరాదులకు భోజనమెవ్వఁ డిప్పించె?
చెట్లకెవ్వడు నీరుచేదిపోసె?
స్త్రీల గర్భంబున శిశులనెవ్వడు బెంచె?
ఫణుల కెవ్వడు పోసె బరగపాలు
మధుపాళి కెవ్వడు మకరంద మొనరించె?
పసులకెవ్వఁ డొసంగెఁ బచ్చి పూరి?

తే.గీ. : జీవకోట్లను జోషింప నీవెకాని
వేఱె యొక దాత లేదయ్య వెదకి చూడ
భూషణ వికాస! శ్రీధర్మపురనివాస
దుష్టసంహార! నరసింహ! దురితదూర!

## 4. శ్రీనారాయణ శతకము
## (శ్రీ బమ్మెరపోతన)

19. మ. : ధరసింహాసనమై, నభంబుగొడుగై, తద్దేవతల్ భృత్యులై
పరమామ్నాయము లెల్ల వందిగణమై, బ్రహ్మాండ
మాగారమై
సిరి భార్యామణియై విరించి కొడుకై, శ్రీగంగ
సత్పుత్రియై
వరుసన్నీ ఘనరాజసంబు నిజమై వర్ధిల్లు నారాయణా!

20. మ. : వరకాళింది తరంగడోలికలలో వైకుంఠ ధామంబులో
వెరవొప్పార నయోధ్యలో మధురలో వ్రేపల్లెలో ద్వారకా
పురిలో నాడెడు భంగినాడు మదిలో భూరి
ప్రసన్నాననాం
బురుహం బొప్పనటించు టొప్పును సితాం భోజాక్ష
నారాయణా!

21. శా. : మాపాలం గడుఁగొవ్వి గోపికలతో మత్తిల్లి వర్తింతు వే
మాపాలెంబుల వచ్చియుండుదు వెన్మాపాలతో నుండు మీ
మాపాలైన సుఖాబ్దిలో మునుగుచున్ మన్నించి
తాగొల్లలన్
మాపాలం గల వేల్పు నీవె యని కామన్నింతు
నారాయణా!

22. మ. : ఘనభోగాస్పదులై గతాఘమతులై కారుణ్యులై ముక్తులై
ధనకీర్తిప్రదులై దయాభిరతులై ధర్మాత్ములై నిత్యులై
మనుజాధీశ్వరులై మనోజనిభులై మాన్యస్థులై స్వస్థులై
యొనరన్నొప్పెడువారు నీ పదరుచి న్నూహించు
నారాయణా!

23. మ. : నినువర్ణింపని వాఁడు మూగమదిలో
నీనారమున్వీనులన్
వినిమోదింపని వాఁడు చెవ్వ, మరి నిన్
వేడ్కన్మనోవీధినిన్
గని పూజింపనివాడు నాశకరుఁడౌ కర్మక్రియా
రుభుఁడై
తనలోఁగానని వాడు నీచమతితో తత్వజ్ఞ నారాయణా!

## 5. శ్రీకృష్ణ శతకము
## (కాకుత్థ్సం నరసింహదాసు)

24. కం : శ్రీరుక్మిణీశ! కేశవ
నారద సంగీతలోల నగధర శౌరీ!
ద్వారక నిలయ జనార్ధన
కారుణ్యము తోడ మమ్ము గావుము కృష్ణా!

25. కం : నీవే తల్లివి దండ్రివి
నీవే నా తోడు నీడనీవే సఖుడౌ
నీవే గురుడవు దైవము
నీవే నా పతివి గతివి నిజముగ కృష్ణా!

26. కం : హరియను రెండక్షరములు
హరియించును పాతకముల నంబుజనాభా!
హరి నీనామ మహత్త్వము
హరి హరి పొగడంగవశమె హరి శ్రీకృష్ణా!

27. కం : దిక్కెవరు ప్రహ్లాదుకు
దిక్కెవ్వరు పాండుసుతుల దీనుల కెపుడు
దిక్కెవ్వర య్యహల్యకు
దిక్కెవ్వరు నీవెనాకు దిక్కువు కృష్ణా!

28. కం : దండమయా విశ్వంభర
దండమయా పుండరీకదళ నేత్రహరీ
దండమయా కరుణానిధి
దండమయా నీకు నెపుడు దండము కృష్ణా!

## 6. వృషాధిప శతకము

## (పాల్కురికి సోమనాథుడు)

29. చ. : సురవరమల్ల! మల్లలితసూత్ర సుధాంబుధిఖేల! ఖేల సం
గరకలకంఠ! కంఠమణి నాయక భీమభుజంగ!
జంగమ
స్థిరతరనాథ! నాథక! నిధీకృతరూప! విరూప!
సమ్మతా!
వర కరుణాబ్ధి ప్రోవు బసవా! బసవా! బసవా!
వృషాధిపా!

30. చ. : బలుపొడతోలు చీరయును పాపపెనల్ గిలుపారుకన్ను వె
న్నెలతల చేదుకుత్తుకయు నిండిన వేలువుటేఋ
వల్గుపూ
సలు కలతేని లెంకవని జానుదెనుంగున
విన్నవించెదన్
వలపు మదిన్ దలర్ప బసవా! బసవా! బసవా!
వృషాధిపా!

31. కం: సురవరపూజ్య, పూజ్యగుణశోభిత, శోభితరూప రూపవి
స్థురతరశీల, శీలగుణపుంగవసత్త్వ, సత్త్వసం
వర, వరవాద, వాదభయవర్జితపాపవిచార, చారయీ
శ్వరసమ, నీవెదిక్కు బసవా! బసవా! బసవా!
వృషాధిపా!

## 7. సర్వేశ్వర శతకము

## (యథావాక్కుల అన్నమయ్య)

32. మ. : పవనుండై, హిమధాముఁడై యనలుఁడై పానీయమై
యాత్మయై
రవియై యంబరమై మహీవలయమై రమ్యాష్టమూర్తి
క్రియన్
భువనాండంబులు రక్షణాంగములుగాఁ బుట్టించు
నత్యద్భుతో
త్సవలీలా విభవంబుతోడ భవదాజ్ఞాశక్తి సర్వేశ్వరా!

33. మ. : కలవారై, మతిమంతులై, రసికులై, గంభీరులై, ధీరులై
లలనా మన్మథులై, సముజ్జ్వల వచోలాలిత్యులై,
నిత్యులై,
బల విభ్రాజితులై, యశోభరితులై, భాసిల్లు
భాగ్యోదయుల్
తొలి జన్మంబుల మిమ్ముఁగొల్చిన మహాత్ముల్ వారు
సర్వేశ్వరా!

34. కం: భవదీయార్చన సేయుచోఁ ప్రథమ పుష్పంబెన్న
సత్యంబు, రెం
డవ పుష్పంబు దయాగుణం, బతి విశిష్టం బేకనిష్ఠా సమో
త్సవ సంపత్తి తృతీయ పుష్పమది భాస్వద్భక్తి సంయుక్తి యో
గవిధానం బవిలేని పూజల మదింగైకోవు సర్వేశ్వరా!

35. మ. : ఒనరం జిత్తము శుద్ధిలేని నరుఁడుద్యోగంబునం గోరి చే
సిన పూజావిభవంబు సువ్రతములున్ శీలంబు
లున్మంత్రసా
ధనముల్ తీర్థములుం దపంబులును మీఁదం
జెట్టవాఁడభ్యసిం
చిన శస్త్రాస్త్రకళా నిభంబులగుఁ జర్చింపంగ
సర్వేశ్వరా!

36. మ. : సకలాధీశ్వరులై గణాధిపతులై సర్వజ్ఞులై నిత్యులై
అకలంకాత్మకులై మహామహిములైయంభోజ గర్భాండ ర
క్షకులై యుందురు రెల్లవారును భవత్సద్భక్తి నానా గుణా
ధిక లీలా విధి నంతరంగముల వర్తింపంగ సర్వేశ్వరా!

## 8. శరభాంకలింగ శతకము

## (శరభాంకలింగ కవి)

37. ఉ. : పెట్టక కీర్తిలేదు, వలపించక యింతికి నింపులేదు తా
దిట్టక వాదులేదు, మరి ధీరత వైరుల సంగరంబులన్
గొట్టక పేరులేదు, కొడుకొక్కడు లేక వరంబులేదు, నా
పుట్టువు రాజుకైన నిది పద్ధతి శ్రీశరభాంక లింగమా!

38. ఉ. : పుట్టితి మర్త్యజన్మమున బుట్టియుఁ బుట్టి యనేక మార్గముల్
మెట్టితి, మెట్టి యేదియును మెచ్చక నీ పదపద్మముల్ మదిన్
బట్టితి, బట్టిపాపములఁ బాపితి బాపి మహత్త్వ తత్త్వముల్
ముట్టితి, ముట్టి తొంటి తుది ముట్టితినో శరభాంక లింగమా.

## 9. మల్లభూపాలీయం – నీతి శతకము

### (ఎలకూచి బాలసరస్వతి)

39. మ. : సిరిలేకైన విభూషితుండె యయి భాసిల్లున్ బుధుండౌదలన్
గురుపాదానతి కేలనీగి చెవులందున్విన్కి వక్త్రంబునన్
స్థిర సత్యోక్తి భుజంబులన్విజయమున్ చిత్తంబునన్ సన్మనో
హర సౌజన్యము గల్గినన్ సురభిమల్లా! నీతివాచస్పతీ!

40. మ. : చెవికిం గుండల మొప్పుగాదు శ్రుతమే చేదమ్మికిన్గంకణం
బువిభూషాఢ్యము గాదు దానమె మహిన్బుణ్యాత్మునేమ్మేనికిన్
బ్రవిలేపంబులు గావు సొమ్ములుపకార ప్రౌఢియే నిక్కమౌ
లవితేంద్రాతిగ వైభవా! సురభిమల్లా! నీతివాచస్పతీ!

## 10. ఉత్పలమాల

### (ఉత్పల సత్యనారాయణాచార్య)

41. చం: ధనము, ధనాభిమానము, సదాధనతృష్ణయు మూడు దోషముల్
ధనికున కందు తొల్తటిది ద్రవ్యము పేదకు లేదు కావునన్
ధనికుని కంటె పేదకడు ధన్యుడు, యాతని తృష్ణ సజ్జనా
ప్తిని శమియించు వేంకటపతీ! అఖిలాండపతీ! శ్రియఃపతీ!

❁❁❁❁❁

## నా తెలంగాణ...

కోటి తెలుగుల బంగారు కొండక్రింద
పరచుకొన్నట్టి సరసులోపల వసించి
ప్రొద్దుప్రొద్దున అందాల పూలు పూయు
నా తెలంగాణతల్లి కంజాతవల్లి.

ఎల్లోరా గుహలందున పల్లవించి
వేయిస్తంభాల గుడిలోన విరులు పూచి
శిల్పి యులిముక్కులో వికసించినట్టి
నా తెలంగాణ, కోటి అందాల జాణ.

మూగవోయిన కోటి తమ్ముల గళాల
పాట పలికించి కవితాజవమ్ము కూర్చి
నా కలానకు బలమిచ్చి నడపి నట్టి
నా తెలంగాణ కోటిరత్నాల వీణ.

– డా॥ దాశరథి కృష్ణమాచార్య

ఉ. మా తెలగాణ మందు నవమంజుల దివ్య సరస్వతీద్యుతుల్
పూతలు పూచి కాచి రసపూర్ణములై ఫలియింపగావలెన్
నీతుల జిమ్మి మానవుల నెమ్మదులన్ కరిగింపగావలెన్
తాతలనాటి సత్కవన ధాటుల నాటక మాడగావలెన్.

ఉ. మా తెలగాణ మందు సుకుమార మనోహర భావమగ్నులౌ
నేతలు దేశభక్తులయి నిండు మనంబులతోడ సాహితీ
జ్యోతి వెలుంగజేసి దమ యూహల నందఱకందజేసి వి
ఖ్యాతి గడింపగావలె సుఖంబున దేశమునుంపగావలెన్.

ఉ. మా తెలగాణ మందు గల మానవులెల్లరు నీతిమంతులై
పూత చరిత్రులై పలికి బొంకని వారయి ధర్మబద్ధులై
ఖ్యాతిగలారలై పరుల కష్టములన్నిటి దీర్చువారలై
భూత హితాత్ములై భువన పూజితులై విలసిల్లగావలెన్.

– మామిడిపల్లి సాంబశివ శర్మ

# II. మన తెలంగాణ గురించి

# తెలుసుకుందాం...

# 7. భౌగోళిక స్వరూపం - వివరాలు

వందల ఏండ్ల నిరంకుశ పరిపాలనలో తెలంగాణ ప్రజలు అణచివేతకు, దోపిడికి గురయినారు. హైదరాబాద్ సంస్థానాన్ని ఏలుతున్న ఏడవ నిజాం నవాబు మీర్ ఉస్మాన్ అలీఖాన్ నుంచి విముక్తి పొందడానికి ప్రజలు వీరోచిత పోరాటం జరిపారు. ఆనాడు హైదరాబాద్ సంస్థానంలో ప్రస్తుత తెలంగాణతో పాటు మరాట్వాడ (మహరాష్ట్ర), బీదర్ (కర్ణాటక) ప్రాంతాలుండేవి. మరాఠా, కన్నడ జిల్లాలు 8, తెలంగాణ జిల్లాలు 8 మొత్తం 16 జిల్లాలుండేవి. ఆగస్టు 15, 1947న దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించినా, తెలంగాణకు మాత్రం స్వాతంత్ర్యం లేక పోవడాన్ని ప్రజలు జీర్ణించుకోలేదు. స్వాతంత్రోత్సవాల్లో దేశ ప్రజలు ఆనందంగా ఉంటే, తెలంగాణ ప్రజలు మాత్రం నిజాం నిరంకుశత్వంలో నిరాశ, నిస్పృహల్లో కూరుకు పోయారు. ఆ దాస్య శృంఖలాల నుండి విముక్తి పొందడానికి స్వామి రామానంద తీర్థ, జనార్దన్‌రావు దేశాయ్ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ, పండిత్ నరేంద్రజీ ఆధ్వర్యంలో ఆర్య సమాజ ఉద్యమాలు, కమ్యూనిస్టు నాయకత్వంలో సాయుధ పోరాటాలు మొదలయ్యాయి.

## నిజాం పాలనకు చరమగీతం

నిజాం నిరంకుశ పాలన నిర్మూలనకు, అరాచక పాలనను అంతమొందించడానికి భారత ప్రభుత్వం సైనిక చర్య చేపట్టింది. దాంట్లో ఆనాటి హోంశాఖ మంత్రి సర్దార్ వల్లభభాయి పటేల్ కృషి ఎంతో ఉంది. హైదరాబాద్‌ను ప్రత్యేక దేశంగా ఉంచాలని, కనీసం పాకిస్తాన్‌లోనైనా విలీనం చేయాలనే నిజాం విశ్వప్రయత్నాలను పటేల్ బద్దలు కొట్టాడు. సైనిక చర్యలో భాగంగా అన్ని వైపుల నుండి దూసుకు వస్తున్న భారత బలగాలను చూసి భయపడి భారత ప్రతినిధి కె.ఎం. మున్షీని కలిసి, కాళ్ళబేరానికి వచ్చాడు. లొంగుబాటు తప్పదని తెలుసుకున్న నిజాం నవాబు బొల్లారం వద్ద సర్దార్ పటేల్ ముందు తలవంచి లొంగిపోవడంతో సెప్టెంబర్ 17, 1948 రోజున హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో కలిసిపోయింది. ఆనాడు నిజాం సంస్థానంపై జరిపిన సైనిక చర్యకు ఆపరేషన్ పోలో అని పేరు. సెప్టెంబర్ 13, 1948న జె.ఎన్.చౌదరి నాయకత్వాన నిజాం సంస్థానంపై ప్రారంభించిన దాడి సెప్టెంబర్ 17న పూర్తయింది. సైనిక చర్యకు నాయకత్వం వహించిన జె.ఎన్. చౌదరి సైనిక గవర్నర్‌గా పదవీ ప్రమాణం చేశాడు.

## తెలంగాణలో దేశ స్వాతంత్రోద్యమ కాలం నుండి 2014 జూన్ 2 వరకు జరిగిన ముఖ్య సంఘటనలు

1883 అక్టోబర్ 19 : జాతీయ భావస్ఫూర్తి సమావేశం.

1891 హైదరాబాద్ రాజ్యంలో ఆర్యసమాజ స్థాపన.

1906 అస్పృశ్యతా నివారణోద్యమం.

1906 జగన్మిత్ర మండలి స్థాపన.

1906–07 స్వదేశీ ఉద్యమం, పలు సమావేశాలు.

1901–08 ఆర్యసమాజ కార్యకలాపాలు.

1910 వైదిక ధర్మ ప్రచారిణి సభ (భాగ్యరెడ్డి వర్మ స్థాపన)

1910 నవంబర్ 20 : మహబూబ్‌నగర్ భజన మండలిని నిజాం ప్రభుత్వం మూసివేత (జాతీయ భావాలున్నాయని)

1911 మహబూబ్ అలీఖాన్ (6వ నిజాం) మరణం.

1911 దైవ మందిరాల నిర్మాణం నిషిద్ధం.

1918 హైదరాబాద్ రాష్ట్ర సంస్కరణల సంఘం ఆవిర్భావం.

1920 మార్చి 16–20 : ఖిలాఫత్ వ్యతిరేక సమావేశాలు వివేకవర్ధిని హైస్కూల్ హైదరాబాద్.

1920 మార్చి 16 : టర్కీ విషయంలో నిజాం బ్రిటిషు వారికి సమర్థన.

1920 రాజాబహద్దూర్ వెంకటరామిరెడ్డి, హైదరాబాదు, కొత్వాలుగా నియామకం.

1920 ఏప్రిల్ 23 : ఖిలాఫత్ సమర్థన సమావేశం. వివేకవర్ధిని – హైదరాబాదు.

1921 హైదరాబాద్ రాజ్య సంఘ సంస్కరణ సభలు 3 రోజులు – వివేకవర్ధిని, హైదరాబాదు.

1921 నవంబర్ 12 : ఆంధ్ర జనసంఘస్థాపన తీర్మానం.

1922 యువతీ శరణాలయం స్థాపన, సికింద్రాబాద్.

1922 ఫిబ్రవరి 24 : ఆంధ్ర జనసంఘ తొలిసమావేశం – రెడ్డి హాస్టల్ – హైదరాబాదు.

1924 ఏప్రిల్ 1 : ఆంధ్ర జనకేంద్రసంఘం తొలి సమావేశం, హనుమకొండ.

1925 ఫిబ్రవరి 22 : గ్రంథాలయ నిర్వాహకుల సమావేశం.

1925 ఏప్రిల్ 1 : హైదరాబాద్ రాజ్య హిందు ధర్మ పరిషత్ స్థాపన.

1926 తెలంగాణలో వాక్, సమావేశ స్వాతంత్ర్యాల నిషేధం.

1930 మార్చ్ (3–5) : తెలంగాణ ఆంధ్ర మహాసభ తొలి సమావేశాలు – జోగిపేట – మెదక్‌జిల్లా.

1931 మార్చ్ : తెలంగాణ ఆంధ్రమహాసభ రెండవ సమావేశాలు, దేవరకొండ, నల్గొండ జిల్లా.

1931 మార్చ్ : 'ఆంధ్రమహిళాసభ' ఏర్పాటు' దేవరకొండ, నల్గొండ జిల్లా.

1933 ఉద్యోగాలు ముల్కీ వారికే అనే నిర్ణయం.

1934 మార్చ్ : గాంధీజి హైదరాబాద్ పర్యటన (ప్రభుత్వ షరతులతో)

1934 నైజాం ప్రజల సంఘం ఆవిర్భావం.

1934 డిసెంబర్ : నైజాం ప్రజల సంఘం 3వ సమావేశం, ఖమ్మం.

1935 తెలంగాణ వ్యాప్తంగా తీవ్ర క్షామ పరిస్థితి.

1935 డిసెంబర్ : నైజా ప్రజల సంఘం 4వ సమావేశం, సిరిసిల్ల.

1936 డిసెంబర్ : నైజాం ప్రజల సంఘం 4వ సమావేశం, షాద్‌నగర్.

1936 హైదరాబాద్ ప్రజల విద్యామహాసభ, హైదరాబాద్.

1936 హైదరాబాద్ రాష్ట్ర శాసన సభ్యుల ఎంపిక (కొండ వెంకట రంగారెడ్డి, అబ్దుల్లా పాషా)

1937 ఆంధ్రమహాసభ 6వ సమావేశం, హైదరాబాద్.

1938 జూలై హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ స్థాపన.

1939 డిసెంబర్ : కామ్రేడ్స్ అసోసియేషన్ స్థాపన.

1938 నవంబర్ : ఉస్మానియా విద్యార్థుల వందేమాతరం ఉద్యమం.

1942 మే (22–24) : క్విట్ ఇండియా సమర్థన – 9వ ఆంధ్రమహా సభల్లో.

1942 అక్టోబర్ 8 : భారతజాతీయ పతాక ఆవిష్కరణ విక్టరీ గ్రౌండ్, హైదరాబాద్

1945 ఏప్రిల్ 26, 27 : నిజాం రాష్ట్ర ఆంధ్రమహాసభ సమావేశం, ఖమ్మం.

1947 ఆగస్ట్ 7 : జాయిన్ ఇండియా యూనియన్ సత్యాగ్రహ ఆరంభం.

1948 ఆగస్టు 22 : నిజాం వ్యతిరేక ఉద్యమకారుడు షోయబుల్లాఖాన్ హత్య జరిగింది.

1948 సెప్టెంబర్ 13 : ఆపరేషన్ పోలో.

1948 సెప్టెంబర్ 17 : హైదరాబాద్ రాష్ట్రం భారత్‌లో విలీనం – దక్కన్ రేడియోలో నిజాం ప్రకటన.

1948 సెప్టెంబర్ 18 : తెలంగాణలో గవర్నర్‌పాలన.

1949 ఆగస్ట్ : జాగిర్దారీ విధానం రద్దు.

1950 జనవరి 26 : నిజాంను రాజ్ ప్రముఖ్‌గా ప్రకటన.

1950 మార్చ్ : బూర్గుల రామకృష్ణారావు తొలి ముఖ్యమంత్రి.

1951 ఏప్రిల్ 8–11 : 3వ (దేశంలో) సర్వోదయ సమితి. సమావేశం శివరాంపల్లి, హైదరాబాద్.

1951 ఏప్రిల్ 16 : భూదానోద్యమ పుట్టుక. పోచంపల్లి.

1952 నాన్ ముల్కీ ఉద్యమం.

1952 ఫిబ్రవరి : సార్వత్రిక ఎన్నికలు.

1953 ఆగస్టు 25: తెలంగాణ వైతాళికుడుగా పేరుపొందిన సురవరం ప్రతాపరెడ్డి మరణించాడు.

1953 ఖమ్మం జిల్లా ఏర్పాటు.

1955 డిసెంబరు 10: నాగార్జునసాగర్ ప్రాజెక్టు శంకుస్థాపన జరిగింది.

1956 ఫిబ్రవరి 20: తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాల నాయకుల మధ్య పెద్ద మనుషుల ఒప్పందం కుదిరింది.

1956 నవంబరు 1: తెలంగాణ ప్రాంతం ఆంధ్రప్రదేశ్‌లో భాగమైంది.

1957 ముల్కి ఉద్యమం సికింద్రాబాద్.

1958 తెలంగాణ ప్రాంతీయ సంఘం ప్రకటన.

1961 ఫిబ్రవరి 6: తెలంగాణకు చెందిన ప్రముఖ సమర యోధుడు, రచయిత వట్టికోట ఆళ్వారుస్వామి మరణించాడు.

1963 జనవరి 13 : తెలంగాణ పరిరక్షణల కమిటీ ఏర్పాటు.

1963 జులై 26: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది.

1967 ఫిబ్రవరి 24: హైదరాబాద్ రాజ్యపు చివరి నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ మరణించాడు.

1967 ఏప్రిల్ 11: హైదరాబాద్‌లో ఈసిఐఎల్ స్థాపించబడింది.

1967 ఆగస్టు 4: నాగార్జునసాగర్ ప్రాజెక్టు ప్రారంభించబడింది.

1969 ముల్కి నిబంధనలపై కె.ఎస్.వాంఛూకమిటి.

1969 జనవరి 5 : తొలిదశ తెలంగాణ ఉద్యమానికి బీజం – పాల్వంచ – ఖమ్మం.

1969 జనవరి 19 : అఖిలపక్ష ఒప్పందం (ఆల్‌పార్టీ అకార్ట్).

1969 జనవరి 20 : తెలంగాణ విమోచనోద్యమ సమితి సదస్సు, వరంగల్‌లో.

1969 జనవరి 21 : జి.వో.నెం.36 విడుదల (ముల్కి ఉద్యోగులపై)

1969 ఫిబ్రవరి 20 : ముల్కి రూల్స్ సక్రమమని హైకోర్ట్ డివిజన్ బెంచ్ తీర్పు.

1969 ఫిబ్రవరి 28: ప్రత్యేక తెలంగాణా రాష్ట్ర సాధన ధ్యేయంగా యువకులు, మేధావి వర్గాలు కలిసి హైదరాబాద్‌లో తెలంగాణా ప్రజా సమితిని స్థాపించారు.

1969 మార్చ్ 3 : తెలంగాణ తొలి బంద్.

1969 మార్చ్ 17 : ప్రజాస్వామ్య రక్షణ దినం, పోరాట దినం.

1969 మార్చ్ 25 తెలంగాణ ప్రజాసమితి ఆవిర్భావం.

1969 మార్చ్ 30 : తెలంగాణ కాంగ్రెస్ సమితి స్థాపన.

1969 మే 1 : తెలంగాణ 'డిమాండ్స్ డే' నిర్వహణ.

1969 మే 24 : తెలంగాణ ఉపాధ్యాయులు, ఉద్యోగ సంఘాల గుర్తింపు రద్దు.

1969 మే 29 : మార్క్సిస్టు ఫోరం, ప్రత్యేక తెలంగాణ అనుకూల నిర్ణయం.

1969 జూలై 12 : తెలంగాణ ఫ్లాగ్ డె.

1970 జులై 24: తెలంగాణ పితామహుడిగా పేరుపొందిన కొండా వెంకట రంగారెడ్డి మరణించాడు.

1971 కేంద్ర ప్రభుత్వ పంచ సూత్ర పథక ప్రకటన (తెలంగాణ)

1971 సెప్టెంబర్ 30: ఆంధ్రప్రదేశ్‌లో పి.వి. నర్సింహారావు తొలి తెలంగాణ ముఖ్యమంత్రిగా నియామకం.

1972 సెప్టెంబర్ 15 : భూగరిష్ఠ పరిమితి బిల్లు ఆమోదం.

1972 అక్టోబర్ 3 : ముల్కి నిబంధనలు రాజ్యాంగ బద్ధమని సుప్రీంకోర్టు తీర్పు.

1973 సెప్టెంబర్ 21 : కేంద్ర ప్రభుత్వ ఆరు సూత్రాల ప్రకటన (తెలంగాణకు ఉపయోగంలేదు)

1973 డిసెంబర్ 12: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా జలగం వెంగళరావు పదవిలోకి వచ్చాడు.

1976 కాకతీయ విశ్వవిద్యాలయ స్థాపన.

1976 మార్చ్ 31: ప్రముఖ తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, కమ్యూనిస్టు నాయకుడు రావి నారాయణరెడ్డి మరణించాడు.

1976 సెప్టెంబర్ 24: నిజాం వ్యతిరేక పోరాట యోధుడు పండిత్ నరేంద్రజీ మరణించాడు.

1976 మే 12: ప్రముఖ సమర యోధుడు, రచయిత, రాజకీయ నాయకుడు మందుముల నరసింగరావు మరణించాడు.

1978 ఏప్రిల్ 6: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా మర్రి చెన్నారెడ్డి పదవిలోకి వచ్చాడు.

1978 ఆగస్టు 15: హైదరాబాద్ జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలను విడదీసి రంగారెడ్డి జిల్లా ఏర్పాటు చేయబడింది.

1985 డిసెంబర్ 30 : 610 జి.వొ. జారీ.

1985 విద్యావంతుల సదస్సు, కరీంనగర్‌లో

1986 తెలంగాణ ఇన్ఫర్మేషన్ ట్రస్ట్.

1989 తెలంగాణ అభివృద్ధి ఫోరం కార్యక్రమాలు.

1991 తెలంగాణ స్టూడెంట్స్ ఫ్రంట్ ఏర్పాటు.

1991 జూన్ 21: తెలంగాణ ముద్దుబిడ్డ పి.వి.నర్సింహారావు ప్రధానమంత్రి పదవి చేపట్టాడు.

1996 తెలంగాణ ప్రజాపార్టీ ఆవిర్భావం.

1997 డిసెంబర్ : ప్రజాస్వామిక తెలంగాణ సదస్సు.

1998 తెలంగాణ ఐక్యవేదిక ఏర్పాటు, తెలంగాణ ఉద్యమ కమిటి ఆవిర్భావము.

1999 తెలంగాణ డెవెలప్‌మెంట్ ఫోరం ఏర్పాటు (అమెరికాలో)

1997 మార్చ్, ఆగస్టు, డిసెంబర్ : స్టేడియం, భువనగిరి, సూర్యాపేట, వరంగల్ సభలు.

2001 ఏప్రిల్ 27 : 'తెలంగాణ రాష్ట్ర సమితి' ఆవిర్భావం.

2001 ఏప్రిల్ : సి.డబ్ల్యు.సి. తెలంగాణ కోసం రెండో ఎస్.ఆర్.సి.కై తీర్మానం.

2001 జూన్ 25 : గిర్‌గ్లానీ కమిటి నియామకం.

2002 ఏప్రిల్ : తెలంగాణ రాష్ట్ర ప్రతిపాదనను ఎన్.డి.ఎ. ప్రభుత్వం తిరస్కరణ.

2004 తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తథ్యం అని కాంగ్రెస్ పార్టీ ప్రకటన.

2004 జూన్ 7 : రాష్ట్రపతి ప్రసంగంలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రస్థావన.

2004 టి.ఆర్.ఎస్. కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటు.

2005 ప్రణబ్ ముఖర్జీ ఉపసంఘం.

2006 టి.ఆర్.ఎస్. సంకీర్ణం నుండి వైదొలగడం.

2007 ఏప్రిల్ 16: హైదరాబాద్ నగర పాలక సంస్థ స్థానంలో 'గ్రేటర్ హైదరాబాద్' (హైదరాబాద్ మహానగర పాలక సంస్థ) ఏర్పడింది.

2008 మార్చ్ 15: రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభించబడింది.

2008 తెలంగాణ జాగృతి ఆవిర్భావం.

2009 అక్టోబరు 19: దేశంలోనే అతి పొడవైన ఫ్లైఓవర్ (పి.వి. నర్సింహారావు ఎక్స్‌ప్రెస్ వే) హైదరాబాద్‌లో ప్రారంభమైంది.

2009 నవంబర్ 29: ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకై కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు నిరాహార దీక్ష మొదలైంది.

2009 డిసెంబర్ 9: భారత ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను మొదలుపెడుతున్నట్లు ప్రకటించింది. దాంతో కల్వకుంట్ల చంద్రశేఖరరావు నిరాహార దీక్ష విరమించాడు.

2009 డిసెంబర్ 9 : కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ప్రకటన – కె.సీ.ఆర్.దీక్ష విరమణ.

2009 డిసెంబర్ 10 : అసెంబ్లి ముట్టడి.

2009 డిసెంబర్ 31 : జె.ఎ.సి. ఆవిర్భావం.

2010 జనవరి 11 : రాష్ట్ర స్థాయి మహిళా సదస్సు హైదరాబాదు.

2011 శ్రీకృష్ణకమిటి ఏర్పాటు.

2011 ఫిబ్రవరి 17 – మార్చి 4 : సహాయనిరాకరణ ఉద్యమం. (ప్రత్యేక తెలంగాణాకై)

2011 మార్చ్ – : రైల్ రోకో (ప్రత్యేక తెలంగాణాకై)

2011 మార్చి 10: ప్రత్యేక తెలంగాణకై ట్యాంక్‌బండ్‌పై మిలియన్ మార్చ్ ఉద్యమం నిర్వహించబడింది.

2011 జూన్ 6 : 'నమస్తే తెలంగాణ పత్రిక' ప్రారంభం.

2011 జులై : తెలంగాణ ఎమ్.ఎల్.ఎ.ల రాజీనామ.

2011 సెప్టెంబర్ 13 : సకల జనుల సమ్మె ప్రారంభం.

2012 సెప్టెంబర్ 30, సాగరహారం.

2013 హైదరాబాద్‌తో కూడిన తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సి.డబ్ల్యు.సి. ప్రకటన.

2013 జులై 30: ప్రత్యేక తెలంగాణ ఏర్పాటుకై కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తీర్మానం చేసింది.

2013 అక్టోబర్ 3: ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును కేంద్ర మంత్రిమండలి ఆమోదించింది.

2013 డిసెంబర్ 5: తెలంగాణ ఏర్పాటు ముసాయిదా బిల్లును కేంద్ర కేబినెట్ ఆమోదించింది.

2014 జనవరి 7: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ బిల్లుకు కేంద్ర మంత్రిమండలి ఆమోదం తెలిపింది.

2014 ఫిబ్రవరి 13: తెలంగాణ ఏర్పాటు (ఆంధ్రప్రదేశ్ విభజన బిల్లు లోక్‌సభలో ప్రవేశపెట్టబడింది.)

2014 ఫిబ్రవరి 18: లోక్‌సభలో తెలంగాణ ఏర్పాటు బిల్లుకు ఆమోదం లభించింది.

2014 ఫిబ్రవరి 20: రాజ్యసభలో తెలంగాణ బిల్లు ఆమోదం పొందింది.

2014 మార్చ్ 1: తెలంగాణ ఏర్పాటు బిల్లుకు రాష్ట్రపతి ఆమోద ముద్ర లభించింది.

2014 మార్చ్ 4: ప్రత్యేక రాష్ట్రంగా అవతరించిన తెలంగాణ జూన్ 2, 2014 నుంచి అధికారంగా అమలులోకి వస్తుందని కేంద్ర హోంశాఖ ప్రకటన.

2014 జూన్ 2: భారతదేశంలో 29వ రాష్ట్రంగా తెలంగాణ ఆవిర్భావం.

2014 జూన్ 2: తెలంగాణ రాష్ట్రానికి మొదటి ముఖ్యమంత్రిగా కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ప్రమాణ స్వీకారం.

## తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి ప్రాణాలకు సైతం వెనుకాడక ఉద్యమాన్ని నడిపిన ధీశాలి. యావత్ తెలంగాణ ప్రజానీకానికి నాయకత్వం వహించి, ఆబాల గోపాలాన్ని తన ఉపన్యాసాలతో ప్రేరేపించిన మహా వక్త. తెలంగాణకు తిరుగులేని నాయకుడిగా ఎదిగిన శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు తెలంగాణ రాష్ట్ర చరిత్రలో ప్రముఖ స్థానాన్ని సంపాదించుకున్నాడు.

కె.సి.ఆర్.గా ప్రజల నాలుకలపై అనుదినం నర్తిస్తున్న కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు మెదక్ జిల్లాలోని చింతమడక గ్రామంలో ఫిబ్రవరి 17, 1954 రోజున రాఘువరావు, వెంకటమ్మలకు జన్మించాడు. ఎం.ఎ. (తెలుగు సాహిత్యం) పూర్తి చేసిన కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు తెలంగాణ రాష్ట్ర సాధనకై వ్యూహాన్ని రచించి, ఒంటిచేత్తో ఉద్యమాన్ని నడిపించిన మహా మేధావి.

ఎంతో సుదీర్ఘ పోరాటం అనంతరం కల సాకరమైన తరుణం. 2014, జూన్ 2 న తెలంగాణ 29వ రాష్ట్రంగా ఆవిర్భవించింది. తెలంగాణ రాష్ట్ర సాధన తర్వాత జరిగిన శాసనసభ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్ర సమితి విజయం సాధించింది. పార్టీ అధ్యక్షుడైన శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా పదవిని చేపట్టారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించినప్పుడు హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నల్లగొండ, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, ఖమ్మం జిల్లాలు ఉండేవి. 2016 అక్టోబర్ మాసంలో దసరా నుండి వీటిని 31 జిల్లాలుగా విభజించారు.

## వివరాలు

| | |
|---|---|
| తెలంగాణ రాష్ట్ర అవతరణ | 02.06.2014 |
| రాజధాని | హైదరాబాద్ |
| విస్తీర్ణం | 1,12,077 చ.కి.మీ. |
| జనాభా (2011 సెన్సస్ ప్రకారం) | 351.94 లక్షలు |
| స్త్రీ, పురుషుల నిష్పత్తి | 988 : 1000 |
| జనసాంద్రత | 307 చ.కి.మీ. |
| అక్షరాస్యుల సంఖ్య (2011 సెన్సస్ ప్రకారం) | 207.84 లక్షలు |
| అక్షరాస్యతా శాతం | 66.54% |
| విస్తీర్ణంగా పెద్ద జిల్లా | భద్రాద్రి (8062 చ.కి.మీ.) |
| విస్తీర్ణంగా చిన్న జిల్లా | హైదరాబాద్ (217 చ.కి.మీ.) |
| జనాభాపరంగా పెద్ద జిల్లా | హైదరాబాద్ (39,43,323) |
| జనాభాపరంగా చిన్న జిల్లా | రాజన్న సిరిసిల్ల (5,43,694) |
| మొత్తం విస్తీర్ణంలో నికర సాగు విస్తీర్ణ శాతం | 33.6% |
| నికరసాగు విస్తీర్ణంలో నికర నీటి పారుదల విస్తీర్ణం | 31.4% |
| మొత్తం జిల్లాలు | 31 |
| మొత్తం పట్టణాలు (2011 సెన్సస్ ప్రకారం) | 158 |

| | |
|---|---|
| లోక్‌సభ స్థానాలు | 17 |
| రాజ్యసభ స్థానాలు | 7 |
| అసెంబ్లీ స్థానాలు(నామినేటెడ్-1) 119+1 | 120 |
| శాసనమండలి స్థానాలు | 40 |
| మున్సిపాలిటీలు | 38 |
| మున్సిపల్ కార్పొరేషన్లు | 6 |
| రెవెన్యూ డివిజన్లు | 68 |
| మండల ప్రజాపరిషత్‌లు | 443 |
| మండల పరిషత్ టెరిటోరియల్ కాన్స్టిటెన్సివ్ | |
| మెంబర్స్ (ఎంపిటిసి) | 6497 |
| జిల్లా ప్రజా పరిషత్‌లు | 9 |
| గ్రామ పంచాయతీలు | 8778 |
| నగర పంచాయతీలు | 25 |
| రెవెన్యూ మండలాలు | 464 |
| రెవెన్యూ గ్రామాలు | 10761 |
| నివాస గ్రామాలు | 10128 |
| కుటుంబాలు | 83,03,612 |
| గృహములు | 83.58 లక్షలు |
| తొలి గవర్నర్ | శ్రీ ఇ.ఎస్.ఎల్. నరసింహన్ |
| తొలి ముఖ్యమంత్రి | శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు |
| తొలి ఉప ముఖ్యమంత్రులు | శ్రీ టి. రాజయ్య, శ్రీ మహమూద్ అలీ |
| శాసనసభ తొలి స్పీకర్ | శ్రీ మధుసూదనాచారి |
| తొలి డిప్యూటీస్పీకర్ | శ్రీమతి పద్మాదేవేందర్ రెడ్డి |
| శాసనమండలి తొలి చైర్మన్ | శ్రీ స్వామిగౌడ్ |
| జిల్లా ఆసుపత్రులు | 8 |
| ప్రాంతీయ ఆసుపత్రులు | 29 |
| సామాజిక ఆసుపత్రులు | 127 |
| ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు | 668 |
| ఆరోగ్య ఉప కేంద్రాలు | 4833 |
| అధికార భాష | తెలుగు, ఉర్దూ |
| రాష్ట్ర జంతువు | మచ్చల జింక |
| రాష్ట్ర పక్షి | పాలపిట్ట |
| రాష్ట్ర వృక్షం | జమ్మిచెట్టు |
| రాష్ట్ర పుష్పం | తంగేడు |
| రాష్ట్ర చిహ్నం | కాకతీయ కళా తోరణం, చార్మినార్ |
| రాష్ట్ర పండుగలు | బతుకమ్మ, బోనాలు |

## జిల్లాల వారీగా వివరాలు

### 1. ఆదిలాబాద్ జిల్లా

విస్తీర్ణం: 4153 చ.కి.మీ. రెవెన్యూ గ్రామాలు: 504

జనాభా: 7,21,433 గ్రామ పంచాయతీలు: 275

జిల్లా కేంద్రం: ఆదిలాబాద్ మండలాల సంఖ్య: 18

**ప్రత్యేకతలు:** ఆదిల్షా రాజు పేరు మీదుగా ఈ జిల్లాకు పేరు స్థిరపడింది. ప్రకృతి అందాలతో, విస్తారమైన అడవులతో, గిరిజన సంస్కృతితో పరవశించే జిల్లా ఇది. గోదావరి నది ఈ జిల్లా గుండా ప్రవహిస్తున్నది.

### 2. మంచిర్యాల జిల్లా

విస్తీర్ణం: 3943 చ.కి.మీ. రెవెన్యూ గ్రామాలు: 389

జనాభా: 7,07,050 గ్రామ పంచాయతీలు: 200

జిల్లా కేంద్రం: మంచిర్యాల మండలాల సంఖ్య: 18

**ప్రత్యేకతలు:** సింగరేణి బొగ్గు గనులున్న ప్రాంతం. గోదావరి, ప్రాణహిత నదులు ఈ జిల్లాలో ప్రవహిస్తున్నాయి. 1200 మెగావాట్ల విద్యుదుత్పత్తి కేంద్రం ఉన్నది. ఎల్లంపల్లి శ్రీరాంసాగర్ జలాశయం ఈ జిల్లాలోనే ఉన్నది. తెలంగాణలో ఉన్న ఏకైక సత్యనారాయణ స్వామి ఆలయం ఉన్న గూడెం ఈ జిల్లాలోనిదే.

### 3. నిర్మల్ జిల్లా

విస్తీర్ణం: 3845 చ.కి.మీ. రెవెన్యూ గ్రామాలు: 428

జనాభా: 7,30,286 గ్రామ పంచాయతీలు: 240

జిల్లా కేంద్రం: నిర్మల్ మండలాల సంఖ్య: 19

**ప్రత్యేకతలు:** ఒకప్పుడు నిమ్మనాయుడు పరిపాలించడంతో నిర్మల్ జిల్లాగా ప్రసిద్ధి. కొయ్య బొమ్మలకు ప్రపంచ ప్రసిద్ధిగాంచింది. కుంతల జలపాతం ఈ జిల్లాలోనే ఉన్నది.

### 4. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా

విస్తీర్ణం: 4878 చ.కి.మీ. రెవెన్యూ గ్రామాలు: 435

జనాభా: 5,92,831 గ్రామ పంచాయతీలు: 177

జిల్లా కేంద్రం: ఆసిఫాబాద్ మండలాల సంఖ్య: 15

**ప్రత్యేకతలు:** ఈ జిల్లా కేంద్రం ఒకప్పటి గోండుల రాజధాని. ఆదివాసుల ఆరాధ్య దైవం కుమ్రం భీం జన్మించింది ఈ జిల్లాలోనే. పచ్చని అడవులతో అలరారే జిల్లా ఇది.

### 5. కరీంనగర్ జిల్లా

విస్తీర్ణం: 2379 చ.కి.మీ. రెవెన్యూ గ్రామాలు: 215

జనాభా: 10,18,119 గ్రామ పంచాయతీలు: 215

జిల్లా కేంద్రం: కరీంనగర్ మండలాల సంఖ్య: 16

**ప్రత్యేకతలు:** ఈ ప్రాంతాన్ని పూర్వం 'సబ్బి మండలం' అని, కరీంనగర్ పట్టణాన్ని 'ఎలగందల' అని పిలిచేవారు. కరీంనగరానికి ఆనుకొనే మానేరు డ్యాం (ఎల్.ఎం.డి.) ఉన్నది. ప్రపంచ ప్రసిద్ధి చెందిన ఫిలిగ్రీ కళకు ప్రసిద్ధి చెందిన జిల్లా.

### 6. జగిత్యాల జిల్లా

విస్తీర్ణం: 3043 చ.కి.మీ. రెవెన్యూ గ్రామాలు: 284

జనాభా: 9,83,414 గ్రామ పంచాయతీలు: 328

జిల్లా కేంద్రం: జగిత్యాల మండలాల సంఖ్య: 18

**ప్రత్యేకతలు:** జగ్గదేవుని పేరిట ఏర్పాటైన 'జగదాలయ' ప్రాంతం. అదే జగిత్యాల తెలుగువారి వైభవానికి నిలువెత్తు నిదర్శనమైన కోటిలింగాల ఈ జిల్లాలోనే ఉన్నది. వ్యవసాయ పరిశోధనా కేంద్రం కూడా ఇక్కడే ఉన్నది. నవనార సింహ క్షేత్రాల్లో ఒకటైన ధర్మపురి ఈ జిల్లాలోనిదే.

### 7. పెద్దపల్లి జిల్లా

విస్తీర్ణం: 2236 చ.కి.మీ. రెవెన్యూ గ్రామాలు: 215

జనాభా: 7,95,332 గ్రామ పంచాయతీలు: 209

జిల్లా కేంద్రం: పెద్దపల్లి మండలాల సంఖ్య: 14

**ప్రత్యేకతలు:** ఇది ఒకప్పుడు సంస్థానంగా వెలుగొందింది. అనేకంగా పెద్ద పెద్ద పరిశ్రమలు ఉన్నాయి. ఎస్.ఆర్.ఎస్.పి. కాలువల ద్వారా చాలా ప్రాంతాలకు గోదావరి జలాలు అందుబాటులో ఉన్నాయి. నల్లబంగారపు భూమి కలిగి ఉన్న జిల్లా ఇది.

### 8. రాజన్న సిరిసిల్ల జిల్లా

విస్తీర్ణం: 2019 చ.కి.మీ. రెవెన్యూ గ్రామాలు: 170

జనాభా: 5,43,694 గ్రామ పంచాయతీలు: 177

జిల్లా కేంద్రం: సిరిసిల్ల మండలాల సంఖ్య: 13

**ప్రత్యేకతలు:** మరమగ్గాలకు, చేనేత పరిశ్రమకు ప్రసిద్ధి చెందిన ప్రాంతం. వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయం ఈ జిల్లాలోనే ఉన్నది.

### 9. నిజామాబాద్ జిల్లా

విస్తీర్ణం: 4261 చ.కి.మీ. రెవెన్యూ గ్రామాలు: 438

జనాభా: 15,77,108 గ్రామ పంచాయతీలు: 395

జిల్లా కేంద్రం: నిజామాబాద్ మండలాల సంఖ్య: 27

**ప్రత్యేకతలు:** దీన్ని పూర్వం 'ఇందూరు' అని పిలిచేవారు. చారిత్రకంగా, సాహితీపరంగా ప్రసిద్ధిపొందిన భీంగల్ ప్రాంతం. గోదావరి నది తెలంగాణాలో ప్రవేశించేది ఈ జిల్లాలోనే. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఈ జిల్లాలోనే ఉన్నది. అనేక దేవాలయాలు, పర్యాటక ప్రాంతాలు ఈ జిల్లాలో కొలువై ఉన్నాయి.

### 10. కామారెడ్డి జిల్లా

విస్తీర్ణం: 3667 చ.కి.మీ. రెవెన్యూ గ్రామాలు: 474

జనాభా: 9,74,227 గ్రామ పంచాయతీలు: 323

జిల్లా కేంద్రం: కామారెడ్డి మండలాల సంఖ్య: 22

**ప్రత్యేకతలు:** నిజాంసాగర్ ప్రాజెక్టు ఉన్న జిల్లా. బెల్లం ఉత్పత్తికి, చక్కెర కర్మాగారాలకు ప్రసిద్ధి చెందిన ప్రాంతం. చెరుకు పంటకు ప్రసిద్ధి.

### 11. వరంగల్ అర్బన్ జిల్లా

విస్తీర్ణం: 1305 చ.కి.మీ. రెవెన్యూ గ్రామాలు: 133

జనాభా: 11,35,705 గ్రామ పంచాయతీలు: 45

జిల్లా కేంద్రం: వరంగల్ అర్బన్ మండలాల సంఖ్య: 11

**ప్రత్యేకతలు:** ఒకప్పుడు కాకతీయుల రాజధానిగా వెలుగొందిన ప్రాంతం. హైదరాబాద్ తర్వాత ఎక్కువ విద్యాలయాలు గల జిల్లా. అనేక మంది కవులకు పుట్టినిల్లు.

### 12. వరంగల్ రూరల్ జిల్లా

విస్తీర్ణం: 2175 చ.కి.మీ. రెవెన్యూ గ్రామాలు: 233

జనాభా: 7,16,457 గ్రామ పంచాయతీలు: 280

జిల్లా కేంద్రం: వరంగల్ రూరల్ మండలాల సంఖ్య: 15

**ప్రత్యేకతలు:** కాకతీయుల సామ్రాజ్యం విస్తరించిన ప్రాంతం. వ్యవసాయానికి పట్టుగొమ్మ. పాకాల చెరువు ఈ జిల్లాలోనే ఉన్నది.

### 13. జయశంకర్ భూపాలపల్లి జిల్లా

విస్తీర్ణం: 6175 చ.కి.మీ. రెవెన్యూ గ్రామాలు: 574

జనాభా: 7,05,054 గ్రామ పంచాయతీలు: 262

జిల్లా కేంద్రం: భూపాలపల్లి మండలాల సంఖ్య: 20

**ప్రత్యేకతలు:** తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ప్రొ॥జయశంకర్ గారు జన్మించిన జిల్లా. ఆయన పేరిటనే ఈ జిల్లా ఏర్పాటయింది. బొగ్గు గనులు, ఎక్కువగా అటవీ ప్రాంతం ఉన్న జిల్లా ఇది. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన 'సమ్మక్క సారక్క' జాతర ఈ జిల్లాలోనే జరుగుతుంది.

### 14. జనగాం జిల్లా

విస్తీర్ణం: 2817 చ.కి.మీ. రెవెన్యూ గ్రామాలు: 200

జనాభా: 5,82,457 గ్రామ పంచాయతీలు: 217

జిల్లా కేంద్రం: జనగాం మండలాల సంఖ్య: 13

**ప్రత్యేకతలు:** ఒకప్పుడు జైనులు ఎక్కువగా ఉన్న ప్రాంతం. లోహ కళాఖండాలకు పుట్టినిల్లు పెంబర్తి ఈ జిల్లాలోనే ఉన్నది. పోతన, పాల్కురికి సోమన జన్మస్థలాలు ఈ జిల్లాలోనే ఉన్నవి. ప్రముఖ జైన క్షేత్రం కొలనుపాక ఈ జిల్లాలోనే ఉంది.

### 15. మహబూబాబాద్ జిల్లా

విస్తీర్ణం: 2877 చ.కి.మీ. రెవెన్యూ గ్రామాలు: 297

జనాభా: 770170 గ్రామ పంచాయతీలు: 287

జిల్లా కేంద్రం: మహబూబాబాద్ మండలాల సంఖ్య: 16

**ప్రత్యేకతలు:** ఒకప్పుడు 'మానుకోట'గా ప్రసిద్ధి. విస్తారమైన అడవులకు నిలయం. గిరిజనులు అధిక సంఖ్యలో ఉంటారు.

### 16. ఖమ్మం జిల్లా

విస్తీర్ణం: 4360 చ.కి.మీ. రెవెన్యూ గ్రామాలు: 380

జనాభా: 1389566 గ్రామ పంచాయతీలు: 389

జిల్లా కేంద్రం: ఖమ్మం మండలాల సంఖ్య: 21

**ప్రత్యేకతలు:** వ్యవసాయానికి ప్రసిద్ధి. చక్కెర మిల్లులు, ఎక్కువగా ఉన్న జిల్లా. సత్తుపల్లిలో బొగ్గుగని, రైస్ మిల్లులు, గ్రానైట్ పరిశ్రమలు ఎక్కువగా ఉన్నవి.

### 17. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

విస్తీర్ణం: 8062 చ.కి.మీ. రెవెన్యూ గ్రామాలు: 449

జనాభా: 1102094 గ్రామ పంచాయతీలు: 205

జిల్లా కేంద్రం: కొత్తగూడెం మండలాల సంఖ్య: 23

**ప్రత్యేకతలు:** రామదాసు (కంచెర్ల గోపన్న) నిర్మించిన రామాలయం ఈ జిల్లాలోనే ఉన్నది. గోదావరి జలాలతో పునీతమైనది. సింగరేణి సంస్థ ప్రధాన కార్యాలయం భద్రాద్రి పవర్‌ప్లాంటు ఈ జిల్లాలోనే ఉన్నది.

### 18. మెదక్ జిల్లా

విస్తీర్ణం: 2723 చ.కి.మీ. రెవెన్యూ గ్రామాలు: 381

జనాభా: 767428 రెవెన్యూ డివిజన్లు: 3

జిల్లా కేంద్రం: మెదక్ మండలాల సంఖ్య: 20

**ప్రత్యేకతలు:** అటవీ ప్రాంతం ఉన్న జిల్లా. 'మెతుకు సీమ'గా ప్రసిద్ధి. ప్రసిద్ధమైన మెదక్ చర్చి ఇక్కడే ఉంది. ఏడుపాయల జాతర ఘనంగా జరుగుతుంది.

### 19. సంగారెడ్డి జిల్లా

విస్తీర్ణం: 4441 చ.కి.మీ. రెవెన్యూ గ్రామాలు: 600

జనాభా: 1523758 రెవెన్యూ డివిజన్లు: 3

జిల్లా కేంద్రం: సంగారెడ్డి మండలాల సంఖ్య: 26

**ప్రత్యేకతలు:** మంజీరా బ్యారేజి ఉన్న జిల్లా. మొసళ్ళ పెంపకం జరుగుతున్నది. పారిశ్రామిక ప్రాంతంగా ప్రసిద్ధి చెందిన పటాన్‌చెరువు ఈ జిల్లాలోనే ఉన్నది.

### 20. సిద్ధిపేట జిల్లా

విస్తీర్ణం: 3432 చ.కి.మీ. రెవెన్యూ గ్రామాలు: 376

జనాభా: 1002671 రెవెన్యూ డివిజన్లు: 3

జిల్లా కేంద్రం: సిద్ధిపేట మండలాల సంఖ్య: 22

**ప్రత్యేకతలు:** వేగంగా అభివృద్ధి పథంలో దూసుకెళ్తున్న జిల్లా ఇది. ఉద్యాన విశ్వ విద్యాలయం ఈ జిల్లాలో ఉన్నది.

## 21. మహబూబ్‌నగర్ జిల్లా

విస్తీర్ణం: 4037 చ.కి.మీ. రెవెన్యూ గ్రామాలు: 454

జనాభా: 12,90,467 రెవెన్యూ డివిజన్లు: 2

జిల్లా కేంద్రం: మహబూబ్‌నగర్ మండలాల సంఖ్య: 26

**ప్రత్యేకతలు:** మీర్ మహబూబ్ అలీఖాన్ పేరు దీనికి పెట్టారు. పూర్వం దీనికి పాలమూరు జిల్లా అని పేరు. పిల్లలమర్రి, మన్నెంకొండ వంటి దర్శనీయ స్థలాలు, పుణ్యక్షేత్రాలకు కొలువైన జిల్లా ఇది.

## 22. వనపర్తి జిల్లా

విస్తీర్ణం: 3055 చ.కి.మీ. రెవెన్యూ గ్రామాలు: 279

జనాభా: 770334 గ్రామపంచాయతీలు: 215

జిల్లా కేంద్రం: వనపర్తి మండలాల సంఖ్య: 14

**ప్రత్యేకతలు:** 'వనపర్తి' సంస్థానం ఒకప్పుడు బాగా ప్రసిద్ధి చెందిన సంస్థానాల్లో ఒకటి. జూరాల ప్రాజెక్టు కొంత భాగం ఈ జిల్లాలోకి వస్తుంది.

## 23. నాగర్‌కర్నూల్ జిల్లా

విస్తీర్ణం: 2966 చ.కి.మీ. రెవెన్యూ గ్రామాలు: 362

జనాభా: 860613 గ్రామ పంచాయతీలు: 329

జిల్లా కేంద్రం: నాగర్‌కర్నూల్ మండలాల సంఖ్య: 20

**ప్రత్యేకతలు:** 'సోమశిల' అందాలు వ్యాపించి ఉన్న జిల్లా ఇది. మల్లెలతీర్థం జలపాతం ఈ జిల్లాలోనే ఉన్నది. కృష్ణానది పరీవాహక ప్రాంతం ఈ జిల్లాలో ఎక్కువ. బిజినేపల్లి, కొల్లాపూర్ మొదలగు ప్రాంతాలు ఈ జిల్లాలోనివే.

## 24. జోగులాంబ గద్వాల జిల్లా

విస్తీర్ణం: 2928 చ.కి.మీ. రెవెన్యూ గ్రామాలు: 226

జనాభా: 664971 గ్రామ పంచాయతీలు: 190

జిల్లా కేంద్రం: గద్వాల మండలాల సంఖ్య: 12

**ప్రత్యేకతలు:** అష్టాదశ శక్తి పీఠాలలో ఒకటైన జోగులాంబ అమ్మవారి పేరిట వెలసిన జిల్లా. గద్వాల సంస్థానం కళలకు, సాంస్కృతిక వైభవానికి ప్రతీక. గద్వాల చీరలు ప్రపంచ ప్రసిద్ధి చెందినవి. జూరాల ప్రాజెక్టు ఈ జిల్లాలోనే ఉన్నది.

## 25. నల్లగొండ జిల్లా

విస్తీర్ణం: 6863 చ.కి.మీ. రెవెన్యూ గ్రామాలు: 565

జనాభా: 1631399 గ్రామ పంచాయతీలు: 516

జిల్లా కేంద్రం: నల్లగొండ మండలాల సంఖ్య: 31

**ప్రత్యేకతలు:** ఆధునిక దేవాలయంగా చెప్పబడే 'నాగార్జున సాగరం' ఈ జిల్లాలోనే ఉన్నది. జల విద్యుత్ కేంద్రం, మూసీ ప్రాజెక్టులు ఈ జిల్లాలోనే ఉన్నాయి. 'దేవరకొండ' కోట ఈ జిల్లాలోని పర్యాటక ప్రాంతం.

## 26. సూర్యాపేట జిల్లా

విస్తీర్ణం: 3374 చ.కి.మీ. రెవెన్యూ గ్రామాలు: 279

జనాభా: 1099560 గ్రామ పంచాయతీలు: 322

జిల్లా కేంద్రం: సూర్యాపేట మండలాల సంఖ్య: 23

**ప్రత్యేకతలు:** అధికంగా సిమెంటు ఫ్యాక్టరీలు ఉన్న జిల్లా. వ్యవసాయంలో కూడా దూసుకెళ్తున్నది. ఈ జిల్లాలో 'ఫణిగిరి' బౌద్ధ క్షేత్రం ఉన్నది.

## 27. యాదాద్రి భువనగిరి జిల్లా

విస్తీర్ణం: 3092 చ.కి.మీ. రెవెన్యూ గ్రామాలు: 296

జనాభా: 726465 గ్రామ పంచాయతీలు: 304

జిల్లా కేంద్రం: భువనగిరి మండలాల సంఖ్య: 16

**ప్రత్యేకతలు:** ప్రముఖ పుణ్యక్షేత్రం 'యాదగిరిగుట్ట' ఈ జిల్లాలోనే ఉన్నది. చారిత్రక ప్రాధాన్యత గల భువనగిరి, భూదాన్ ఉద్యమానికి మూలమైన పోచంపల్లి ఈ జిల్లాలోనే ఉన్నాయి.

## 28. వికారాబాద్ జిల్లా

విస్తీర్ణం: 3386 చ.కి.మీ. రెవెన్యూ గ్రామాలు: 476

జనాభా: 8,81,250 గ్రామ పంచాయతీలు: 354

జిల్లా కేంద్రం: వికారాబాద్ మండలాల సంఖ్య: 18

**ప్రత్యేకతలు:** ఆహ్లాదకరమైన అనంతగిరి కొండలతో అలరారే ప్రాంతం. సిమెంటు కర్మాగారాలు, బండరాళ్ళ గనులు చాలా ఎక్కువ. హైదరాబాద్ తాగునీటి అవసరాలకు మూలమైన మూసి ఈ జిల్లాలోనే పుట్టింది.

## 29. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా

విస్తీర్ణం: 1039 చ.కి.మీ. రెవెన్యూ గ్రామాలు: 161

జనాభా: 25,42,203 గ్రామ పంచాయతీలు: 84

జిల్లా కేంద్రం: కీసర మండలాల సంఖ్య: 14

**ప్రత్యేకతలు:** శరవేగంగా అభివృద్ధి చెందుతున్న జిల్లా ఇది. అనేక పరిశ్రమలకు నెలవు. ప్రాచీన చరిత్ర, సంస్కృతికి నెలవైన కీసరగుట్ట శివాలయం ఈ జిల్లాలోనే ఉంది.

### 30. రంగారెడ్డి శంషాబాద్ జిల్లా

| | |
|---|---|
| విస్తీర్ణం: 5006 చ.కి.మీ. | రెవెన్యూ గ్రామాలు: 594 |
| జనాభా: 25,51,731 | గ్రామ పంచాయతీలు: 436 |
| జిల్లా కేంద్రం: | మండలాల సంఖ్య: 27 |

**ప్రత్యేకతలు:** ఐ.టి. పరిశ్రమలకు ఆలవాలమై ఉన్న జిల్లా ఇది. ఇవేకాకుండా రక్షణ, ఏరోస్పేస్, ఫార్మా, పోలీస్ ట్రైనింగ్ అకాడమీ వంటి అనేక సంస్థలకు నెలవు. హిమాయత్‌సాగర్, గండిపేట జలాశయాలు ఈ జిల్లాలోనే ఉన్నవి.

### 31. హైదరాబాద్ జిల్లా

| | |
|---|---|
| విస్తీర్ణం: 217 చ.కి.మీ. | రెవెన్యూ గ్రామాలు: 100 |
| జనాభా: 39,433,23 | రెవెన్యూ డివిజన్లు: 2 |
| జిల్లా కేంద్రం: హైదరాబాద్ | మండలాల సంఖ్య: 16 |

**ప్రత్యేకతలు:** చరిత్రకు, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచిన జిల్లా. తెలంగాణ రాష్ట్ర రాజధానిగా ఎంతో మందిని తన అక్కున చేర్చుకుంటున్నది. సాంకేతిక, వైజ్ఞానిక రంగాలకు చెందిన అనేక ప్రపంచ ప్రఖ్యాతి చెందిన సంస్థలు ఇక్కడ కొలువై ఉన్నాయి.

## అక్షరాస్యత

తెలంగాణ రాష్ట్రంలో 2011జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రంలో 20,787,228 మంది అక్షరాస్యులున్నారు. రాష్ట్ర అక్షరాస్యతా శాతం 66.5%కాగా, పురుషుల్లో అక్షరాస్యతా శాతం 75%(1,17,01,729మంది), స్త్రీలలో అక్షరాస్యతా శాతం 57.9% (89,95,049 మంది) గా ఉండగా, రాష్ట్రంలో అక్షరాస్యత ఎక్కువగా ఉన్న జిల్లా హైదరాబాద్ (83.2%) అని చెప్పవచ్చు.

## పాఠశాలలు, నమోదు

తెలంగాణ రాష్ట్రంలో 25991 పాఠశాలలు ప్రభుత్వ యాజమాన్యంలో ఉన్నవి. మొత్తం పాఠశాలలు 41337. సుమారు 5866780 మంది పిల్లలు విద్యను అభ్యసిస్తున్నారు.

## అటవీ ప్రాంతం

పూర్వపు ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్, నిజామాబాద్, వరంగల్, రంగారెడ్డి, ఖమ్మం జిల్లాల్లో అడవులు విస్తరించి ఉన్నాయి. వీటిలో శివ్వారం, మంజీరా, కవ్వాల్, ఏటూరునాగారం, పోచారం, కిన్నెరసాని, సాకుల మరియు మహావీర్, హరిణి, హైదరాబాద్‌లో వన్య ప్రాణి సంరక్షణ కేంద్రాలున్నాయి. రాష్ట్రంలో పూర్వపు రంగారెడ్డిలో 73000హెక్టార్లు, నల్గొండలో 86000హెకార్లు, మహబూబ్‌నగర్‌లో 3.03లక్షల హెక్టార్లు, కరీంనగర్‌లో 2.52లక్షల హెక్టార్లు, నిజామాబాద్‌లో 1.83లక్షల హెక్టార్లు, మెదక్‌లో 97092 హెక్టార్లు, ఖమ్మంలో 7.58లక్షల హెక్టార్లు, వరంగల్‌లో 3702.80చ.కి.మీ., ఆదిలాబాద్ 699825 హెక్టార్లు, హైదరాబాద్‌లో 73000 హెక్టార్ల అడవులు విస్తరించి ఉన్నాయి.

## తెలంగాణలోని నీటి వనరులు

తెలంగాణలో గోదావరి, కృష్ణా, పెన్‌గంగ, ప్రాణహిత, కిన్నెరసాని, మూసి, తుంగభద్ర, భీమా, మంజీర, తాలిపేరు, పాలేరు, మున్నేరు, వైరా, డిండి మొదలైన నదులు ప్రవహిస్తున్నాయి. వీటితో పాటు అనేక వాగులు, ఏర్లు ప్రవహిస్తూ తెలంగాణను సస్యశ్యామలం చేస్తున్నాయి.

## వ్యవసాయం

తెలంగాణ రాష్ట్రంలో ప్రధానంగా వ్యవసాయంపై ఆధారపడ్డ కుటుంబాలే అధికంగా ఉన్నాయి. ప్రజలకు జీవనాధారం వ్యవసాయమే. ఇక్కడ ప్రధానమైన పంటలు వరి మరియు పత్తి. వరిపై 14,18,504 హెక్టార్లు, పత్తి 18,12,876 హెక్టార్లు, చమురు గింజలు 5.08లక్షల హెక్టార్లు, చెఱుకు 40,878 హెక్టార్లు, జొన్న 1,22,709హెక్టార్లు, మొకజొన్న 6,62,938హెక్టార్లు, కంది 2,75,700 హెక్టార్లు, పెసలు 1,49,647హెక్టార్లు, సోయా 1,57,816 హెక్టార్లు, మిరప 82,671హెక్టార్లు, పసుపు 48,693 హెక్టార్లలో పండిస్తున్నారు. మొత్తం ఆహార ధాన్యాల ఉత్పత్తి 99లక్షల మెట్రిక్ టన్నులు పండిస్తున్నారు.

## ప్రధానమైన ఆనకట్టలు

తెలంగాణలో నాగార్జునసాగర్, నిజాంసాగర్, శ్రీరాంసాగర్, ఎల్లంపల్లి, మానేరు డ్యామ్, వెంగళరావు, తాలిపేరు, సింగూరు, వట్టివాగు, పాల్వాయిపురుషోత్తంరావు, గుండ్లవాగు, నెట్టెంపాడు, జూరాలా, భీమా ప్రాజెక్టు, సరళాసాగర్, కోయిల్‌సాగర్, కడెం, ఎలిమినేటి మాధవరెడ్డి, దేవాదుల ప్రాజెక్టు, పాలేరు ప్రాజెక్టు, ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు, దిండి ప్రాజెక్టు, సీతారామ ప్రాజెక్టు, కాళేశ్వరం ప్రాజెక్టు మొదలగు ప్రాజెక్టులు ఉన్నాయి. వీటి ద్వారా లక్షలాది ఎకరాల

నీరందించి వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేస్తున్నారు. వీటిలో కొన్ని బహుళార్థ సాధక ప్రాజెక్టులుగా ఉండి, విద్యుదుత్పత్తి కేంద్రాలుగా ఉన్నాయి. కొన్ని ప్రస్తుతం నిర్మాణదశలో ఉన్నాయి.

## తెలంగాణలోని పరిశ్రమలు

**ఐటిసి - 2 పిఎస్‌పిడి కాగితపు పరిశ్రమ:** ఖమ్మం జిల్లా బూర్గంపాడు మండలంలోని కాగితపు పరిశ్రమ అత్యుత్తమమైన కాగితపు తయారీ పరిశ్రమగా గుర్తింపు పొందింది.

**కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ (కె.టి.పి.ఎస్):** కొత్తగూడెంలోని పాల్వంచలో దాదాపు 46సం॥ల క్రితం భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని నిర్మించారు.

**డోలమైట్ కర్మాగారం:** రాష్ట్రంలోని పారిశ్రామిక రంగంలోనే ఖమ్మంలోని సింగరేణి మండలంలోని మాదారంలో నిర్మించిన డోలమైట్ కార్మాగారం ప్రసిద్ధి చెందినది.

**మధుకాన్ చక్కెర పరిశ్రమ:** నేలకొండపల్లి లోని రాజేశ్వర పురంలో ఉన్న మధుకాన్ చక్కర పరిశ్రమ ఆధునీకరణ చెందిన సాంకేతికతో నడుస్తుంది.

**కాకతీయ చక్కెర ఫ్యాక్టరీ:** 1991లో సుమారు 40 కోట్లతో నిర్మించిన కాకతీయ చక్కెర ఫ్యాక్టరీ ఖమ్మం జిల్లా కల్లూరు మండలం పేరువంచ, ఖాన్‌ఖాన్ పేట గ్రామాల మధ్యన ఉన్నది.

**సింగరేణి కాలరీస్:** గోదావరి నది పరీవాహక ప్రాంతంలోని బొగ్గు నిక్షేపాలను వెలికితీయడానికి ఆదిలాబాద్, ఖమ్మం, కరీంనగర్, భూపాలపల్లి, వరంగల్ జిల్లాలో వ్యాపించి ఉన్నది. అటవీ ప్రాంతంలో నిక్షిప్తమై ఉన్న బొగ్గు నిక్షేపాలను 'డాబి' అను అధికారి కనుగొన్నాడు. లక్షలాది మంది కార్మికులు సింగరేణిలో పనిచేస్తూ దేశానికే తలమానికంగా నిలిచారు. ఇప్పుడు అత్యంత ఆధునాతనమైన యాంత్రాలతో ఉపరితల గనుల ద్వారా బొగ్గును ఉత్పత్తి చేస్తున్నారు.

**ఎ.సి.సి. సిమెంట్:** 1958-59 సం॥లో ఎసిసి యాజమాన్యం మంచిర్యాలలో సిమెంటు కార్మాగారం ఏర్పాటు చేసినారు. దీనికి అవసరమైన ముడి సరుకును రోప్‌వే ద్వారా బకెట్లలో క్వారీ నుండి తీసుకురావడం జరుగుతుంది.

**రేయాన్స్ ఫ్యాక్టరీ:** ఏజన్సీ ప్రాంతమైన ఏటూరునాగారంలో గోదావరి గట్టున 1970లో ఈ పరిశ్రమ స్థాపించారు. దీనిలో 2000 మందికి పైగా కార్మికులు పని చేస్తున్నారు.

**ఎన్.టి.పి.సి. జ్యోతినగర్:** 23 అక్టోబర్, 1983లో రామగుండంలోని జ్యోతినగర్‌లో ఎన్.టి.పి.సి ని ప్రారంభించి థర్మల్ విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. 500 మెగావాట్ల ఏడో యూనిట్‌లో ఉత్పత్తి అయ్యే విద్యుత్ ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్నాటక, పాండిచెర్చి, గోవాలకు సరఫరా అవుతుంది.

**రామగుండం-థర్మల్ విద్యుత్ కేంద్రం:** పెద్దపల్లి జిల్లాలోని రామగుండం మండలంలోని బసంత్‌నగర్ సిమెంట్ ఫ్యాక్టరీలో రోజుకు 3000 టన్నుల సిమెంట్ ఉత్పత్తి అవుతుంది. అంతేకాకుండా ఇక్కడే ఉన్న విద్యుదుత్పత్తి కేంద్రంలో 15.7 మెగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేస్తున్నారు.

**దేవరకద్ర:** మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం జాతీయ రహదారిపై కొత్తకోట వద్ద రూ.150 కోట్లతో విత్తనోత్పత్తి కేంద్రం స్థాపించారు. ఇందులో వరి, జొన్న, మొక్కజొన్న, సజ్జ, రాగులు తదితర విత్తనాల ఉత్పత్తి శుద్ధి జరుగుతుంది.

**జడ్చర్లలోని ఫ్యాక్టరీలు:** పోలేపల్లి సెజ్ గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కులో అరబిందో ఫార్మా, హెటిరోడ్రగ్స్, ఎల్ & టి, గ్లోకుఫార్మా, అమిత్‌కాటన్, విలాస్‌రావు స్పాంజ్, జిటిఎన్ టెక్స్‌టైల్స్ పరిశ్రమలున్నాయి.

**బి.హెచ్.ఇ.ఎల్:** ఆసియా ఖండంలోనే అతిపెద్ద పారిశ్రామిక ప్రాంతమైన పటాన్‌చెరువులో జాతీయ స్థాయి పరిశ్రమలున్నాయి. ఇందులో బి.హెచ్.ఇ.ఎల్. ప్రధానమైనది. విద్యుత్తుకు ఉపయోగించే గ్యాస్‌టర్బైన్, జనరేటర్‌లు ఇక్కడ తయారవుతున్నాయి.

**ఇక్రిశాట్:** అంతర్జాతీయ మెట్టపంటల ఉష్ణమండల పరిశోధనా సంస్థ (ఇక్రిశాట్) కూడా ఇక్కడే ఉంది. దీనికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది.

**ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ:** యుద్ధ టాంకర్‌లు తయారుచేసే ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ కూడా సంగారెడ్డి జిల్లా ఎద్దుమైలారం గ్రామంలో నెలకొల్పబడింది.

**భారత డైనమిక్ లిమిటెడ్:** క్షిపణులు తయారు చేసే భారత డైనమిక్ లిమిటెడ్‌ను ఇదే ప్రాంతంలోని భానూరులో ఏర్పాటు చేశారు.

## ప్రముఖ సంస్థలు

తెలంగాణలో అంతర్జాతీయ ప్రమాణాలు కల్గిన ప్రముఖ సంస్థలు అనేకం ఉన్నాయి. ఇందులో ప్రధానమైనవి కొన్నింటిని ఇక్కడ తెలియపరచడమైనది.

### విశ్వవిద్యాలయాలు

1. ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.
2. జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ విశ్వ విద్యాలయం, హైదరాబాద్.
3. ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం, హైదరాబాద్.
4. డా.బి.ఆర్. అంబేద్కర్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్.
5. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్.
6. మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ విశ్వవిద్యాలయం, హైదరాబాద్.
7. హైదరాబాద్ కేంద్రీయ విశ్వ విద్యాలయం, హైదరాబాద్.
8. నల్సార్ న్యాయ శాస్త్ర విశ్వవిద్యాలయం, హైదరాబాద్.
9. శాతవాహన విశ్వవిద్యాలయం, కరీంనగర్.
10. పాలమూరు విశ్వవిద్యాలయం, మహబూబ్‌నగర్.
11. కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్.
12. కాళోజి నారాయణరావు వైద్య విశ్వవిద్యాలయం, వరంగల్.
13. పి.వి.నర్సింహారావు పశు సంవర్ధక విశ్వ విద్యాలయం, హైదరాబాద్.
14. మహాత్మాగాంధీ విశ్వ విద్యాలయం, నల్లగొండ.
15. తెలంగాణ విశ్వ విద్యాలయం, నిజామాబాద్.
16. గీతం విశ్వ విద్యాలయం, రుద్రారం, సంగారెడ్డి.

### విద్యా సంస్థలు

1. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐ.ఐ.టి.), కంది, సంగారెడ్డి..
2. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐ.ఐ.ఐ.టి.), గచ్చిబౌలి, హైదరాబాద్.
3. ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్, హైదరాబాద్.
4. బిర్లా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, హైదరాబాద్.
5. జె.ఎన్.టి.యు. ఫైన్ ఆర్ట్స్, హైదరాబాద్.

### ఇతర ప్రముఖ సంస్థలు

1. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్, హైదరాబాద్.
2. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ మేనేజ్‌మెంట్, హైదరాబాద్.
3. నేషనల్ అగ్రికల్చర్ & రూరల్ మేనేజ్‌మెంట్, హైదరాబాద్.
4. ఎలిమినేటి మాధవరెడ్డి తెలంగాణ స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పంచాయత్‌రాజ్ & రూరల్ డెవలప్‌మెంట్, హైదరాబాద్.
5. ఇక్రిసాట్ – ఇంటర్నేషనల్ క్రాప్స్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఫర్ ది సెమి అరిడ్ ట్రాపిక్స్, పటాన్‌చెరు.
6. బి.హెచ్.ఇ.ఎల్. – భారత్ హెవీ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, హైదరాబాద్.
7. ఐ.ఐ.సి.టి. – ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ, హైదరాబాద్.
8. ఎన్.ఎం.డి.సి. – నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, హైదరాబాద్.
9. సి.సి.ఎం.బి. – సెంటర్ ఫర్ సెల్యూలర్ & మాలిక్యులర్ బయాలజీ, హైదరాబాద్.
10. బి.డి.ఎల్. – భారత్ డైనమిక్స్ లిమిటెడ్, హైదరాబాద్.
11. ఎన్.ఐ.ఎన్. – నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్, హైదరాబాద్.
12. ఎన్.జి.ఆర్.ఐ. – నేషనల్ జియోగ్రాఫికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్, హైదరాబాద్.
13. డి.ఆర్.డి.ఓ. – డిఫెన్స్ రీసెర్చ్ & డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్, హైదరాబాద్.
14. హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్, హైదరాబాద్.
15. నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డు, హైదరాబాద్.

16. నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్.టి.పి.సి.), రామగుండం, పెద్దపల్లి.
17. మిశ్ర ధాతు నిగమ్ (మిధాని) లిమిటెడ్, హైదరాబాద్.
18. డిఫెన్స్ రీసెర్చ్ & డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్, హైదరాబాద్.
19. హిందుస్తాన్ ఎరోనాటిక్స్ లిమిటెడ్, హైదరాబాద్.
20. సర్వే ఆఫ్ ఇండియా

విద్యార్థులకు పాఠాలు సులభంగా అర్థమవడానికి డిజిటల్ క్లాసెస్‌ల కోసం ప్రత్యేకంగా "మన టివి" ఛానెల్‌ను ఉప ముఖ్యమంత్రి శ్రీ కడియం శ్రీహరి గారు, ఐ.టి. శాఖమాత్యులు శ్రీ కల్వకుంట్ల రామారావు గారు తేది : 16.11.2016న 1500 పాఠశాలల్లో ప్రారంభించారు.

తెలంగాణ ప్రభుత్వం విద్యార్థులకు కే.జి టు పి.జి విద్యను ప్రపంచస్థాయి ప్రమాణాలతో అందరికి అందుబాటులోకి తీసుకురావడమే తమ లక్ష్యంగా ప్రకటించింది. ఇందుకోసం దాదాపు 600 గురుకుల పాఠశాలలను నెలకొల్పారు. అన్ని పాఠశాలల్లో తెలుగును ఖచ్చితంగా చదవాల్సిన సబ్జెక్ట్‌గా చేసి తెలుగు భాషా ప్రాముఖ్యతను పెంచే ప్రయత్నం చేస్తున్నారు. ఉర్దూ భాషను రాష్ట్ర రెండవ భాషగా (అధికారిక) చేసి ఉర్దూకు కూడా తగు ప్రాధాన్యతను తెచ్చే ప్రయత్నం జరుగుతున్నది.

❀❀❀❀❀

## ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల



# 8. చెరువులు

తెలంగాణ ప్రజలకు చెరువు 'కల్పతరువు'. ప్రజల బతుకుల గుండెదరువు. అది రైతన్నకు ఆదరువు మరియు బతుకుదెరువు. ప్రజల యొక్క జీవనం, సంస్కృతి, సంప్రదాయాలు అన్నీ కూడా చెరువులతోనే ముడిపడి ఉన్నది.

కొన్ని శతాబ్దాల పాటు ఈ రాష్ట్రాన్ని పాలించిన కాకతీయ రాజులు. రెడ్డి రాజులు. కులీకుతుబ్‌షాలు, ఆ తర్వాత నిజాం నవాబులు 'చెరువు' అంటే ఏమిటో ప్రపంచానికి నేర్పించే విధంగా వందల చెరువులను గొలుసుకట్టు చెరువుగా నిర్మించారు. వీటి ద్వారా ప్రజలకు సాగునీరు, తాగునీరు అందేవి. వేల ఏళ్ళపాటు తెలంగాణను సస్యశ్యామలం చేసిన జల సంపదలు. ఇప్పటికీ రాష్ట్రంలో ఉన్న కొన్ని ముఖ్యమైన చెరువుల గురించి తెలుసుకుందాం.

### లక్నవరం చెరువు

కాకతీయులు నిర్మించిన చెరువు. పర్యాటక స్థలము. ప్రకృతి రమణీయతతో పర్యాటకులను ఆకర్షిస్తున్నది. సాగునీటి కోసం, బస చేయడానికి, బోటింగ్, భోజన వసతులు ఉన్నవి. ఇది పూర్వపు వరంగల్ జిల్లాలో ఉన్నది.

### పాకాల చెరువు

పర్యాటక కేంద్రం. వన్యప్రాణి సంరక్షణ కేంద్రం. ముఖ్యంగా వ్యవసాయం కోసం ఉపయోగిస్తున్నారు. ఇది పూర్వపు వరంగల్ జిల్లాలో ఉన్నది.

### భద్రకాళి చెరువు

చెరువు పక్కనే భద్రకాళి అమ్మవారి ఆలయం ఉంది. హృదయ్ పథకం కింద జియో–బయో డైవర్సిటీ కల్చరల్ పార్కు అభివృద్ధి చేశారు. ఇది పూర్వపు వరంగల్ జిల్లాలో ఉన్నది.

### రామప్ప చెరువు

ఇది కూడా ముఖ్యమైన పర్యాటక కేంద్రం. సాగునీటి కోసం, తాగునీటి కోసం ఉపయోగిస్తున్నారు. ఇది పూర్వపు వరంగల్ జిల్లాలో ఉన్నది.

### చౌండ సముద్రం చెరువు

గణపతిదేవుని సేనాని మల్యాల చౌండ సేనాపతి నిర్మించిన చెరువు. ఇది పూర్వపు వరంగల్ జిల్లాలో ఉన్నది.

### ఘన్‌పూర్ చెరువు

గణపతిదేవుని కాలంనాటిది. దీని కింద ఇప్పటికీ వందల ఎకరాల భూమి సాగవుతున్నది. పూర్వపు వరంగల్ జిల్లాలో ఉన్నది.

### సెట్టికెరియ చెరువు

రెండవ బేతరాజు నిర్మించాడు. వరుణదేవుడు ప్రతిష్ఠించాడని హనుమకొండ శాసనంలో ఉంది. ఇది పూర్వపు వరంగల్ జిల్లాలో ఉన్నది.

### కేసముద్రం చెరువు

మొదటి ప్రోలరాజు నిర్మించిన చెరువు. ఇది పూర్వపు వరంగల్ జిల్లాలో ఉన్నది.

### హుస్సేన్‌సాగర్ చెరువు

దీనిని ఇబ్రహీం కులీకుతుబ్‌షా 1563లో నిర్మించాడు. ముఖ్యమైన పర్యాటక స్థలం. 1992లో చెరువు మధ్యన జిబ్రాల్టర్ రాక్‌పై ప్రతిష్ఠించిన ఏకశిలా బుద్ధ విగ్రహం ప్రత్యేక ఆకర్షణ. హైదరాబాద్‌లో ఉన్నది.

### ఉస్మాన్‌సాగర్ (గండిపేట) చెరువు

ముఖ్యమైన పర్యాటక కేంద్రం. ప్రకృతి రమణీయత, ఏడవ నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ పేరు మీద 'ఉస్మాన్‌సాగర్' అని పిలవడం జరిగింది. హైదరాబాద్‌కు తాగునీటిని అందించే చెరువు. హైదరాబాద్ జిల్లాలో ఉన్నది.

### మీర్ ఆలమ్ చెరువు

హైదరాబాద్ ప్రధానమంత్రి మీర్ ఆలమ్ పేరు మీద ఈ చెరువు నిర్మాణం జరిగింది. ఆసిఫ్‌జాహి-III కాలంలో నిర్మితమైంది. ఇది హైదరాబాద్ జిల్లాలో ఉన్నది.

### అలీసాగర్ చెరువు

ఇది నైజాం కాలంలో నిర్మించబడింది. పర్యాటక కేంద్రం. జింకల పార్కు ఉంది. ఇది పూర్వపు నిజామాబాద్ జిల్లాలో ఉన్నది.

### అశోక్ చెరువు

జంకంపేటలోని చెరువును అశోక్‌సాగర్ చెరువుగా అభివృద్ధి చేశారు. పర్యాటక కేంద్రం. హైదరాబాద్ నుండి బాసర వెళ్ళే మార్గంలో ఉంది. ఇది పూర్వపు నిజామాబాద్ జిల్లాలో ఉన్నది.

### పోచారం చెరువు

పోచారం అడవి. వన్యమృగ సంరక్షణ కేంద్రం మధ్యలో ఈ చెరువు ఉంది. పర్యాటక కేంద్రం. ఇది పూర్వపు నిజామాబాద్ జిల్లాలో ఉన్నది.

### హిమాయత్‌సాగర్ చెరువు

చివరి నిజాం కాలంలో నిర్మించబడినది. ఏడవ నిజాం కుమారుడైన హిమాయత్ అలీఖాన్ పేరు మీద నిర్మించబడినది. జంట నగరాలకు మంచినీటిని అందిస్తుంది. ఇది పూర్వపు రంగారెడ్డి జిల్లాలో ఉన్నది.

### దుర్గం చెరువు

మంచినీటి చెరువు. దీన్ని రహస్య చెరువు అంటారు. జూబ్లీహిల్స్, మాదాపూర్ మధ్యలో పొందుపర్చినట్లుగా ఉంటుంది. కుతుబ్‌షాహి రాజులు నిర్మించారు. గోల్కొండ కోటలోని వారికి తాగునీరు అందించడానికి నిర్మించబడినది. ఇది పూర్వపు రంగారెడ్డి జిల్లాలో ఉన్నది.

### మాసాబ్ చెరువు

వ్యవసాయ ప్రధానమైనది. చేపల పెంపకం జరుగుతున్నది. పూర్వపు రంగారెడ్డి జిల్లాలో ఉన్నది.

### ఇబ్రహీంపట్నం చెరువు

వ్యవసాయ ప్రధానమైనవి. వందల ఎకరాలకు సాగునీరు అందించే పెద్ద చెరువు ఇది. రంగారెడ్డి జిల్లాలో ఉన్నది.

### పానగల్ చెరువు (ఉదయ సముద్రం)

ఇది వ్యవసాయానికి, తాగునీరుకు ప్రసిద్ధి చెందిన చెరువు. ఈ చెరువు పక్కనే ఛాయా సోమేశ్వర ఆలయం ఉన్నది. కాకతీయుల పాలనా కాలంలో నిర్మించారు.

### భువనగిరి చెరువు

సాగునీటికి ప్రధానమైనదిగా ఉన్నది. ప్రస్తుతం యాదాద్రి భువనగిరి జిల్లాలో ఉన్నది.

### తుమ్మలగూడెం చెరువు

సాగునీటికి ప్రధాన వనరు. వందల ఎకరాలకు సాగునీటిని అందిస్తుంది. ప్రస్తుతం యాదాద్రి భువనగిరి జిల్లాలో ఉన్నది.

### సూర్యాపేట చెరువు

ఇది కూడా సాగునీటికి ప్రధాన వనరు. ప్రస్తుతం సూర్యాపేట జిల్లాలో ఉన్నది.

### మానకొండూర్ చెరువు

వ్యవసాయానికి, తాగునీటికి ఉపయోగపడుతున్నది. కరీంనగర్ జిల్లాలో ఉన్నది.

### వేములవాడ చెరువు

చెరువుకు ఆనుకునే వేములవాడ రాజరాజేశ్వర ఆలయం ఉన్నది. తాగునీటికి, సాగునీటికి ప్రధాన వనరు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఉన్నది.

### అగ్రహారం చెరువు

అగ్రహారం చెరువును కొండులోని కుంట అంటారు. వేములవాడ పవిత్రమైన ప్రదేశం. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఉన్నది.

### కొత్తపల్లి చెరువు

తాగునీటికి, సాగునీటికి ప్రధాన వనరు. ఇది కరీంనగర్ జిల్లాలో ఉన్నది.

### గుండారం చెరువు

సాగునీటికి ప్రధాన వనరు. వేలాది ఎకరాలకు సాగునీటిని అందిస్తున్నది. ప్రస్తుతం పెద్దపల్లి జిల్లాలో ఉన్నది.

రెడ్డి చెరువు, శిల సముద్రం చెరువు, నల్లచెరువు మొదలైన చెరువులు పెద్దపల్లి జిల్లాలో ప్రసిద్ధమైన చెరువులు. సాగునీటికి, తాగునీటికి ఉపయోగపడుతున్నాయి.

### బోల్ చెరువు

ఇది ప్రాచీన చెరువు. అనేక గ్రామాలకు త్రాగునీరు, సాగునీరు అందిస్తున్నది. జగిత్యాల జిల్లాలోని కమలాపూర్ గ్రామ ప్రాంతంలో ఉన్నది.

### బుగ్గ చెరువు

ఇది రోడ్ల వాగుపై ఉన్న చెరువు. ఈ చెరువుకు ఊట ఎక్కువగా ఉంటుంది. అనేక గ్రామాలకు త్రాగు, సాగు నీరు అందిస్తుంది. ఇది చాలా పెద్ద చెరువు. జగిత్యాల జిల్లాలోని బీర్‌పూర్ ప్రాంతంలో ఉన్నది.

### అక్కపల్లి చెరువు

ఈ చెరువు ధర్మపురి శివార్లలో ఉన్నది. కొన్ని గ్రామాలకు త్రాగునీరు, సాగునీరు అందిస్తుంది. దీని గట్టున అక్కపల్లి రాజరాజేశ్వర స్వామి ఆలయం ఉన్నది. ఇది జగిత్యాల జిల్లాలోనిది.

### తోటపల్లి చెరువు

సిద్ధిపేట జిల్లాలో ఉంది. సాగునీటికి ప్రధాన వనరు.

### పాలేరు చెరువు

ముఖ్యమైన పర్యాటక కేంద్రం. వేలాది ఎకరాలకు సాగునీటిని అందిస్తున్నది. ఇది తాగునీరు కోసం కూడా ఉపయోగిస్తున్నారు. ఇక్కడ బోటింగ్ సౌకర్యం కూడా ఉంది. ఇది ఖమ్మం జిల్లాలో ఉంది.

### బయ్యారం చెరువు

ఇది కూడా ప్రముఖమైన సాగునీటి వనరు. ప్రస్తుతం ఖమ్మం జిల్లాలో ఉంది.

### లకరం చెరువు

ఇది కూడా ప్రముఖమైన సాగునీటి వనరు. పూర్వపు ఖమ్మం జిల్లాలో ఉంది.

### మల్ల సముద్రం చెరువు

ప్రముఖమైన సాగునీటి వనరు. పూర్వపు ఖమ్మం జిల్లాలో ఉంది.

### పెద్ద చెరువు

వ్యవసాయ ప్రధానమైనది. పూర్వపు మహబూబ్‌నగర్ జిల్లాలో ఉన్నది.

### మన్వాడ చెరువు

వ్యవసాయ ప్రధానమైనది. పూర్వపు మహబూబ్‌నగర్ జిల్లాలో ఉన్నది.

### కోయిల్‌సాగర్

వ్యవసాయ ప్రధానమైనది. వేలాది ఎకరాలకు సాగునీటిని అందిస్తుంది. పూర్వపు మహబూబ్‌నగర్ జిల్లాలో ఉన్నది.

### డిండి

వ్యవసాయ ప్రధానమైనది. వేలాది ఎకరాలకు సాగునీటిని అందిస్తుంది. పూర్వపు మహబూబ్‌నగర్ జిల్లాలో ఉన్నది.

### సరళాసాగర్

ఇది కూడా వ్యవసాయ ప్రధానమైన చెరువు. వేలాది ఎకరాలకు సాగునీటిని అందిస్తుంది. పూర్వపు మహబూబ్‌నగర్ జిల్లాలో ఉన్నది.

### పాలెం చెరువు (నాగర్‌కర్నూల్)

ఇది వ్యవసాయ ప్రధానమైనది. ఇది నాగర్‌కర్నూల్ జిల్లాలో ఉన్నది.

### సుల్తాన్‌పూర్

ఇది వ్యవసాయ ప్రధానమైనది. ఇది పూర్వపు మెదక్ జిల్లాలో ఉన్నది.

### సదాశివపేట చెరువు

వ్యవసాయ ప్రధానమైనది. ఇది పూర్వపు మెదక్ జిల్లాలో ఉన్నది.

### ఇస్నాపూర్ చెరువు

వ్యవసాయ ప్రధానమైనది. ఇది పూర్వపు మెదక్ జిల్లాలో ఉన్నది.

### ఎర్ర చెరువు

ఇది వ్యవసాయ ప్రధానమైన చెరువు. పూర్వపు మెదక్ జిల్లాలో ఉన్నది.

### నర్సాపూర్ చెరువు

వ్యవసాయానికి ప్రధాన వనరు. ఇది పూర్వపు మెదక్ జిల్లాలో ఉన్నది.

### తెల్లాపూర్ చెరువు (గచ్చిబౌలి)

ఇది వ్యవసాయ ప్రధానమైనది. ఇది పూర్వపు మెదక్ జిల్లాలో ఉన్నది.

### అందోలు చెరువు

ఇది వ్యవసాయ ప్రధానమైనది. వందల ఎకరాలకు నీరందించే చెరువు ఇది. పూర్వపు మెదక్ జిల్లాలో ఉన్నది.

### పటాన్ చెరువు

ఇది వ్యవసాయ ప్రధానమైనది. ఇది ప్రస్తుతం సంగారెడ్డి జిల్లాలో ఉంది.

### పెద్ద చెరువు (లక్ష్మణచంద)

వ్యవసాయానికి ప్రధాన వనరు. ఇది పూర్వపు ఆదిలాబాద్ జిల్లాలో ఉన్నది.

### ఖానాపూర్ చెరువు

వ్యవసాయానికి ప్రధాన వనరు. ఇది పూర్వపు ఆదిలాబాద్ జిల్లాలో ఉన్నది.

### దేవాపూర్ బొడ్డెమ్మకుంట

వ్యవసాయానికి ప్రధాన వనరు. ఇది పూర్వపు ఆదిలాబాద్ జిల్లాలో ఉన్నది.

### సాత్నాల

వ్యవసాయానికి ప్రధాన వనరు. ఇది పూర్వపు ఆదిలాబాద్ జిల్లాలో ఉన్నది.

### బోథ్

వ్యవసాయానికి ప్రధాన వనరు. ఇది పూర్వపు ఆదిలాబాద్ జిల్లాలో ఉన్నది.

### రాంపూర్

వ్యవసాయానికి ప్రధాన వనరు. ఇది పూర్వపు ఆదిలాబాద్ జిల్లాలో ఉన్నది.

### దండేపల్లి పెద్ద చెరువు

వ్యవసాయానికి ప్రధాన వనరు. ఇది పూర్వపు ఆదిలాబాద్ జిల్లాలో ఉన్నది.

### రాంచెరువు

వ్యవసాయానికి ప్రధాన వనరు. ఇది పూర్వపు ఆదిలాబాద్ జిల్లాలో ఉన్నది.

### ఇటిక్యాల చెరువు

వ్యవసాయానికి ప్రధాన వనరు. ఇది పూర్వపు ఆదిలాబాద్ జిల్లాలో ఉన్నది.

### అగస్తేశ్వర గుండం (చెన్నూరు) చెరువు

వ్యవసాయం కొరకు. ముఖ్య పర్యాటక, సాగునీటి కేంద్రము. చెరువు మధ్యలో శివుని విగ్రహం ఉంది. ఇది పూర్వపు ఆదిలాబాద్ జిల్లాలో ఉన్నది.

### నిర్మల్ చెరువు

వ్యవసాయానికి ప్రధాన వనరు. ఇది ప్రస్తుతం నిర్మల్ జిల్లాలో ఉన్నది.

### షామీర్‌పేట చెరువు

ప్రస్తుత మేడ్చల్ జిల్లాలో ఉంది. ఇది పర్యాటక కేంద్రం. సాగునీటికి, తాగునీటికి ఉపయోగపడుతుంది.

తెలంగాణ రాష్ట్రంలో చెరువు లేని గ్రామం లేదంటే అతిశయోక్తి కాదు. సంస్కృతీ సాంప్రదాయాలకు ఆయువుపట్టు చెరువులు. అందుకే దశాబ్దాలుగా నిర్లక్ష్యంతో పూడుకుపోయిన చెరువులకు మళ్ళీ జలకళను సంతరింపజేసేందుకు ప్రభుత్వం కంకణం కట్టుకోవడం తెలంగాణ ప్రజల అదృష్టం. గొలుసుకట్టు చెరువులు, ఇతర చెరువులు అన్నీ త్వరలోనే జల సంపదతో తెలంగాణ సస్యశ్యామలానికి కేంద్ర బిందువులు అవుతాయని ఆశిద్దాం.

❀❀❀❀❀

# 9. తెలంగాణ శాసనాలు

ఒక జాతియొక్క జీవన విధాన పరిణామక్రమం, సాంస్క ృతిక మూలాలను అధ్యయనం చేయాలంటే ఆ జాతి చరిత్రను అధ్యయనం చేయవలసిందే. చరిత్రను అధ్యయనం చేయడానికి ఆయా కాలాల్లో ఉపయోగించిన వస్తువులు ఆయా రాజులు వేయించిన శాసనాలు, ఆయా కాలాలలో వచ్చిన సాహిత్యం ప్రధాన ఆధారాలు. ప్రాచీన చరిత్రను తెలుసుకోవడానికి ప్రధాన ఆధారాలు శాసనాలే.

శాసనం (Inscript) అనగా ప్రాచీన కాలంలో రాయి, రాగిరేకు వంటి వాటిపై రాజులు రాయించిన రాత రూపంలోవున్న వారి ఆజ్ఞలు. కాగితం అందుబాటులోనికి రాని రోజుల్లో రాజు తమ ఆజ్ఞలను, సాధించిన విజయాలను రాళ్ళపై రాగిరేకులపై చెక్కించి భద్రపరిచారు. రాతిపై చెక్కినవి శిలాశాసనాలు. రాగిరేకులపై చెక్కినవి తామ్ర శాసనాలు. పురాతన శాసనాలను అధ్యయనం ద్వారా తెలంగాణకున్న అమూల్యమైన చరిత్ర మన కంటపడుతుంది. తెలంగాణ రాష్ట్ర సాధనకు ముందు ఇలాంటి శాసనాలను పట్టించుకోకపోవడంవల్ల తెలంగాణ చరిత్ర మరుగునపడింది. తెలంగాణ ప్రాచీన చరిత్రకు ప్రధాన ఆధారమైన కొన్ని శాసనాలను గురించి తెలుసుకుందాం.

**వేములవాడ చాళుక్యుల శాసనాలు**

| క్ర.సం. | శాసనం పేరు | వేయించిన వారు | కాలము | విశేషాలు |
|---|---|---|---|---|
| 01 | డెక్కలబండ శాసనం | ఆయ్తువర్మ | క్రీ.శ.850 | రేవణయ్యకు ఇచ్చిన దాన శాసనం |
| 02 | కొరివి గద్య శాసనం | చాళుక్యభీముడు | క్రీ.శ.892–922 మధ్యకాలం | కుసుమాయుధుని పెద్ద కుమారుడు కొరవి నల్లమేరయ కుమారుడు పెద్దనకు ఉపకారం చేసిన విషయం ఉంది. |
| 03 | కుర్క్యాల శాసనం (బొమ్మలగుట్ట శాసనం) | జినవల్లభుడు (రెండవ అరికేసరి | క్రీ.శ 946 | తొలికంద పద్య శాసనం, ఇందులో మూడు కంద పద్యాలున్నాయి. పంపకవికి ధర్మపురి అగ్రహారం ఇచ్చినట్లు తెలుస్తున్నది. జినవల్లభుడు జైన పండితులను ఆదరించినట్లు తెలియుచున్నది. |
| 04 | కరీంనగర్ శిలాశాసనం | రెండవ అరికేసరి | క్రీ.శ 930–55 | అరిపినపల్లి గ్రామంలో ధారవయ్య అనే బ్రాహ్మణునికిచ్చిన భూదానము గూర్చి వివరించబడింది. |
| 05 | రెండవ అరికేసరి వేములవాడ శిలాశాసనం | రెండవ అరికేసరి | – | వేములవాడ చాళుక్య వంశ ప్రశస్తిని వర్ణించినారు. రెండవ అరికేసరి పూర్వీకుల విజయాలను, బిరుదులను, దానములను ఈ శాసనం వివరిస్తుంది. |

| | | | | |
|---|---|---|---|---|
| 05 | బద్దెగుని వేములవాడ శిలాశాసనం | బద్దెగుడు | – | మేధావంతుడు, గౌడ సంఘాధ్యక్షుడయిన సోమదేవుడనే కవి గురించి ఈ శాసనంలో ఉన్నది. |
| 06 | రేపాక శిలాశాసనం | ఉజయ | క్రీ.శ. 968 | వేములవాడ చాళుక్య మూడవ అరికేసరి రేపాకలో జినాలయం నిర్మించినాడని, ఆ దేవాలయానికి భూదానం చేసినాడనీ ఈ శాసనం తెలుపుతుంది. |
| 07 | ఆహవ మల్లుని వేములవాడ శిలాశాసనం | పశ్చిమ చాళుక్య చక్రవర్తి ఆహవమల్లదేవుడు | – | దండనాయకుడైన మహేశ్వర శక్తి పండితునికి దానము చేసిన సమయంలో వేయించిన శాసనం |
| 08 | మసీదు శాసనం | చాళుక్యుల కాలం | క్రీ.శ 1018 | ధర్మపురి నరసింహా ఆలయ నిర్మాణ విశేషాలు. |
| 09 | చికరాజు వేములవాడ శిలాశాసనము | జయసింహ వల్లభుడు | క్రీ.శ 1033 | రాజేశ్వర, బద్దెగేశ్వర దేవరలకు దానమిచ్చు సందర్భంలో వేయించిన శాసనమిది. |
| 10 | ధర్మపురి శివాలయ శాసనం | కళ్యాణి చాళుక్య వంశ సామంతులు | క్రీ.శ 1076– 1126 మధ్యలో | చాళుక్యరాజుయొక్క బిరుదులు పేర్కొనబడినవి. |
| 11 | రాజాదిత్యుని వేములవాడ శిలాశాసనం | రాజాదిత్యుడు | క్రీ.శ. 1083 | కళ్యాణి చాళుక్య త్రిభువనమల్ల ఆరవ విక్రమాదిత్యుని ప్రశంస ఉన్నది. శాసనకర్త రాజాదిత్యుని ప్రశంస ఉన్నది. |
| 12 | కుమార సోమేశ్వరుని వేములవాడ శిలాశాసనం | కుమార సోమేశ్వరుడు | క్రీ.శ. 1106 | వేములవాడలోని శ్రీమదరికేశ్వర దేవర నైవేద్యం కొరకు ఆదేవర పూజారి ఆచార్యులకు అగ్రహారం దానమిచ్చినపుడు చేయించిన నాశనం |
| 13 | జగద్దేవరాజు వేములవాడ శిలాశాసనం | శ్రీమజ్జెగద్దేవరాజు | శ్రీ.శ. 1108 | హరికేశ్వర దేవరకు ఇల్లిందకుంట అగ్రహారమును దానమిచ్చినపుడు వేయించిన దానశాసనం. |
| 14 | వేములవాడ కేదారేశ్వరాలయ శాసనం | – | – | ఇది అసంపూర్ణ శాసనం. బ్రాహ్మణ భక్తిగల ఒక సామంతుని ప్రశస్తి ఉన్నది |
| 15 | కురువగట్టు శాసనం | – | – | జడ్చర్ల సమీపంలోని గంగాపురం సమీపంలోని గుట్టపై చౌడేశ్వరీ ఆలయంలో ఈ శాసనం ఉంది. వినయాదిత్య యుద్ధమల్లుని రెండవ కుమారుడైన భీరగృహుని ప్రశస్తి ఈ శాసనంలో ఉంది. |

## కందూరి చాళుక్యుల శాసనాలు

| క్ర.సం. | శాసనం పేరు | వేయించిన వారు | కాలము | విశేషాలు |
|---|---|---|---|---|
| 01. | కొలనుపాక శాసనం | ఏరుత తొండరస చోళమహారాజు | క్రీ.శ. 999 | త్రిభువనమల్ల ఆరవ విక్రమాదిత్యుని ప్రశస్తి ఉంది. ఆలేరు సమీపంలోని కాళూరు (నేటి కొల్లూరు) గ్రామం దానమిచ్చినట్లు తెలిపే శాసనం. |
| 02 | అనుముల శాసనం | రెండవ భీమ చోడుడు | క్రీ.శ.1096 | 11వ శతాబ్దపు పూర్వార్థపు తెలుగులిపి ఈ శాసనంలో ఉంది. ఆనాటి గ్రామాలలోని వృత్తుల ప్రశస్తి ఈ శాసనంలో ఉన్నది. |
| 03 | వల్లాల శాసనం | కందూరి మల్లికార్జున చోడమహారాజు | క్రీ.శ. 1098 | కందూరిచోడ రాజుల వంశ చరిత్ర ఉన్నది. కరికాళచోళ వంశీయులలో ఒక శాఖ కృష్ణానదికి ఉత్తరముగా పానగల్లు రాజధానిగా పరిపాలన చేసిన విషయం పేర్కొన్నారు. |
| 04 | పాములపాడు శాసనం | మల్లికార్జున చోడమహారాజు | క్రీ.శ. 1098 | ఇది దాన శాసనం. ఏడుపుట్ల పట్టుభూమి మల్లయ్య అనే వ్యక్తికి దానం ఇచ్చినట్లుగా ఈ శాసనంలో పేర్కొనబడింది. |
| 05 | ధేన్నమహాదేవి గట్టుతుమ్మెన శాసనం | నల్లభీమదేవ చోడమహారాజు | క్రీ.శ 1106 | ఆకాలం నాటి కొలతలు శాసనంలో కనిపిస్తాయి. 18 ఖండీల దాన్యం మానెడునూనె, నెలకు రెండు రూకలు మొదలయిన పదాలు కనిపిస్తాయి. |
| 06 | ఉప్పునూతల శాసనం | సోమనాథ దేవ చోడ మహారాజు | క్రీ.శ.1106 | కందూరు చోడులు మహామండలేశ్వరులు అనియు, సోమనాథ దేవ చోడునికి మహా మండలేశ్వర బిరుదు ఉన్నదనియూ ఈ శాసనం తెలుపుతుంది. |
| 07 | మైలాంబిక పానుగల్లు శాసనం | కందూరి చోడరస చోడ మహారాజు | – | కందూరి తొండర చోళ మహారాజు పట్ట మహిషి మైలాంబిక పిట్టంపల్లి గ్రామమును బ్రాహ్మణులకు దానం ఇచ్చిన విషయం ఈ శాసనంలో కలదు. |
| 08 | రాచూరు శాసనము | రావితొత్తి ప్రెగ్గడ మల్లిసెట్టి | క్రీ.శ. 1160 | కందూరి ఉదయన చోడ మహారాజు ప్రశంస కలదు. |

| | | | | |
|---|---|---|---|---|
| 09 | జడ్చర్ల శాసనం | ఉదయన చోడ మహారాజు | క్రీ.శ. 1162 | ఈ శాసనం శ్రీకారంతో ప్రారంభమైంది. ఇది దాన శాసనం. ధర్మము తప్పిన వారికి వేయు గోవులు చంపిన పాపము కలుగుతుందని ఈ శాసనంలో పేర్కొన్నారు. |
| 10 | నేలకొండపల్లి శాసనం | ఉదయనచోడ మహారాజు | క్రీ.శ. 1175 | ఇది దాన శాసనం. విశ్వేశ్వర దేవరకు భూదానము, కొండపల్లి చెరువుకు తూము నిర్మాణం ఈ శాసనంలో ప్రస్తావించబడింది. |
| 11 | తెల్లాపూర్ శాసనం (తెలుంగాణపుర శాసనం) | నాగోజు అయ్యలోరు | క్రీ.శ. 1418 | ఇందులో మొట్ట మొదటి సారిగా 'తెలుంగాణ పురం' అని పేర్కొనబడింది. విశ్వకర్మలు లోహపు పనులేకాక వాస్తు నిర్మాణాలు, బావులకు ప్రణాళికలు రచించేవారని ఈ శాసనం తెలుపుతున్నది. |

## రేచర్ల పద్మ నాయకుల శాసనాలు

| క్ర.సం. | శాసనం పేరు | వేయించి వారు | కాలము | విశేషాలు |
|---|---|---|---|---|
| 01. | రాచకొండ శాసనం | అనపోతా నాయకుడు | క్రీ.శ. 1365 | జల్లపల్లి కోటను జయించుట, చెంజెర్ల యుద్ధంలో క్షత్రియులను ఓడించుట, ధరణికోట వద్ద రెడ్డి రాజులను ఓడించుట ఈ శాసనంలో ప్రస్తావించబడినది. |
| 02 | కందికొండ శాసనం | వెన్న భూపాలుడు | క్రీ.శ. 1375 | జనార్ధనస్వామి దేవాలయ నిర్మాణం, పూజాధికములకు భూదానం తదితర అంశాలు ఈ శాసనంలో ఉన్నాయి. |
| 03 | అనపోతనాయకుని భువనగిరి శాసనం | అనపోతా నాయకుడు | క్రీ.శ. 1378 | ఇది అసంపూర్తి శాసనం. ముసునూరి కాపయనాయకుని ఓడించి భువనగిరి దుర్గమును సాధించిన సందర్భముగా వేయించిన శాసనమిది. |
| 04. | దేవలమ్మ నాగారం శాసనం | రాణి నాగాంబిక | క్రీ.శ. 1427 | రేచర్ల పద్మనాయకుల వంశావళి వర్ణించబడింది. విష్ణువు, శ్రీరాముని స్తుతి ఈ శాసనంలో ఉంది. |
| 05 | సాయంపేట శాసనం | రావు ధర్మానాయుడు | క్రీ.శ. 1446 | ఈ శాసనంలో దాన పరిగ్రహీతల, ముత్తాతల, తాతల, తండ్రుల పేర్లతో పాటు గోత్ర నామములు పేర్కొనబడినవి. |

| | | | | |
|---|---|---|---|---|
| 06 | శనిగరం శాసనం | – | – | రేచర్ల వెన్నమనాయుడు, అనపోత నాయకుని ప్రశస్తి ఈ శాసనంలో కలదు. |
| 07 | ధర్మపురి శాసనం | తిరుమలయ్య | క్రీ.శ. 1644 | ధర్మపురి నరసింహస్వామి భోగమంటపం పుష్కరిణికి ప్రాకారము నిర్మించిన సందర్భంగా వేసిన శాసనం. |
| 08 | మల్లన్నపేట శాసనం | జూపూడి ధర్మారావు దేశ్‌ముఖ్ | క్రీ.శ. 1753 | పొలవాస నివాసియగు తమ్మడి వెన్నజియ్యకు భూదానం ఇచ్చిన సందర్భంగా వేయించిన శాసనం |

**కాకతీయుల శాసనములు**

| క్ర.సం. | శాసనం పేరు | వేయించిన వారు | కాలము | విశేషాలు |
|---|---|---|---|---|
| 01. | మాగల్లు శాసనం | దానార్ణవుడు | క్రీ.శ. 966 | కాకత్య గుండన ఒక బ్రాహ్మణునికి మాగల్లు గ్రామాన్ని దానం చేసిన అంశం వివరించబడింది. |
| 02. | హనుమకొండ వేయిస్తంభాల గుడి శాసనం | రుద్రదేవుడు | క్రీ.శ. 1063 | రుద్రదేవుడు క్రీ.శ. 1063లో స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకొన్నట్లు తెలిపే శాసనం |
| 03 | ద్రాక్షారామం శాసనం | రెండవ ప్రోలరాజు మంత్రి ఇనంగాల బ్రహ్మిరెడ్డి | క్రీ.శ. 1158 | రెండోప్రోలరాజు తరువాత అతని కుమారుడు రుద్రదేవుడు రాజ్యానికి వచ్చాడని తెలిపే శాసనం |
| 04 | బయ్యారం శాసనం | కాకతిమైలాంబ గణపతిదేవుని సోదరి | క్రీ.శ. 1219 | మైలాంబ ఖమ్మం జిల్లా బయ్యారంలో చెరువు త్రవ్వించిన విషయం ఈ శాసనంలో ఉంది. |
| 05 | మోటుపల్లి అభయ శాసనం | గణపతిదేవుడు | క్రీ.శ. 1244 | విదేశీవర్తకులకు సౌకర్యాల కల్పన రక్షణ కల్పించే అంశం వివరించబడింది. |
| 06 | చందుపట్ల శాసనం | రుద్రమదేవి బంటు పువ్వుల ముమ్మడి | క్రీ.శ 1289 | అంబదేవుడిని అణచే ప్రయత్నంలో రుద్రమదేవి వీరమరణం పొందిందనే అంశం ఈ శాసనంలో ఉన్నది. రుద్రమ సేనాధిపతి మల్లికార్జునుడు కూడా ఈ యుద్ధంలో మరణించినాడు. |
| 07 | సలకవీడు శాసనం | రెండో ప్రతాపరుద్రుడు | క్రీ.శ. 1317 | ఈ శాసనంలో కాకతీయుల కాలం నాటి అనేక సుంకాల ప్రస్తావన ఉంది. సలకవీడు గ్రామాన్ని దానం చేసిన ప్రస్తావన ఈ శాసనంలో ఉన్నది. |

**ముగింపు**

ఈ విధంగా తెలంగాణలో అడుగడుగునా చారిత్రక ఆనవాళ్ళు కనిపిస్తున్నాయి. ప్రాచీన మధ్య యుగాల చరిత్రకు ఆలవాలంగా నిలుస్తున్నాయి. తెలంగాణ ప్రాంతానికి చారిత్రక నేపథ్యమే లేదన్నంతగా సాగిన వలసవాద చారిత్రక రచనలో మరుగున పడిపోయిన చరిత్రను వెలికి తీసి ముందు తరాలకుఅందించడంలో, శాసనాలు కీలకమైనవి. ఈ శాసనాలను, శిథిలాల్లో ఒదిగిన చారిత్రక సంపదను పరిరక్షించుకోవలసిన బాధ్యత మనందరిపై ఉన్నది.

❀❀❀❀❀

# 10. తెలంగాణ పత్రికలు

తెలంగాణలో నేడు జరుగుతున్న ప్రపంచ తెలుగు మహాసభల పత్రికారంగ చరిత్రను సింహావలోకనం చేసుకోవడం అవసరం. వీలైనంత మేరకు వాటిని పట్టిక రూపంలో రూపొందించడం జరిగింది.

'వార్తయందు జగతి వర్ధిల్లుచున్నది' అని నానుడి. వార్తలు ప్రజల ఉన్నతిని కాంక్షిస్తాయి. వార్తలు తెలుసుకోవడం, చర్చించుకోవడం అనేది మనిషి ఎప్పటినుండో తన సంస్కృతిలో భాగం చేసుకున్నాడు. మన దేశంలో వార్తాప్రసారం పూర్వకాలం నుండి ఉన్నా అవి పత్రికల రూపంలో లేవు. మన దగ్గర 'వకీయ' అనే వార్తామాధ్యమం ఉన్నట్లు తెలుస్తున్నది. వార్తలు ఏకకాలంలో చేరుకునే మార్గం చాలా తక్కువగా ఉన్న కారణంగానే సంయుక్త ప్రతిఘటనలు రాలేకపోయాయి. ఇది పాలకులకు చాలా ఉపయోగపడేది. ఉద్యమాలను అణచివేసే వీలయ్యేది. తెలంగాణ ఉద్యమానికి కూడా ఇలాంటి అవస్థలే తోడయ్యాయి.

ఆంగ్లేయులు కేవలం తమ అవసరాల కోసం మాత్రమే పత్రికను, ముద్రణాయంత్రాలను వాడేవారు. తెలంగాణలో రెండో సాలార్‌జంగ్ రాజీనామ తర్వాత ప్రధాని అయిన విఖారుల్ ఉమ్రా ముద్రణా విషయంలో కొంత ప్రయత్నం చేసినట్లు తెలుస్తున్నది. దానివల్ల 19వ శతాబ్దం చివరనాటికి దేశ భాషల్లో పత్రికలు ఆరంభమైనాయి.

ఆనాటి పత్రికలు సదాశయాల కోసం పనిచేసేవి. వాటిలో కొన్ని ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొని మూతపడేవి. ఆనాటి పత్రికల్లో కొన్ని వాటివాటి స్థితులను, కాలాలను అనుసరించి మాస, పక్ష, వార, దినపత్రికల లాగా మారిపోవడం జరిగేవి. ఆనాడు పత్రికా నిబంధనలను నిజాం కఠినంగా అమలుపరచేవాడు. అయినప్పటికీ అనేక పత్రికలు వివిధ భాషలో తెలంగాణ ప్రజలను చైతన్యపరచేవి. తెలుగు భాషా సాహిత్య, సాంస్కృతిక, చారిత్రక, సామాజిక అంశాలను పలు పరిశోధనలతో బయటపెట్టేవి. ప్రోత్సహించేవి. ప్రతి పత్రిక తెలంగాణను జాగృతం చేయడంలో మణిదీపమై వెలుగొందింది. వీటిలో కొన్ని తెలంగాణ బయట వెలసి, తెలంగాణ కొరకు పనిచేసినవి కూడా ఉన్నవి.

---

**సూచన:** 1. సంపాదకులను (సం) అని సూచించడం జరిగింది.

2. ముఖ్యమైన/ప్రత్యేకమైన పత్రికలను * గుర్తుతో సూచించడం జరిగింది.

3. లభ్యం కాని అంశాలను పేర్కొనలేదు.

4. ఆంధ్రప్రదేశ్–1956లో ఏర్పడకముందు ఉన్నవాటినే తీసుకోవడం జరిగింది.

| క్రమ సంఖ్య | పత్రిక పేరు | భాష | స్థాపించిన/ సంపాదకుల పేరు | ప్రాధాన్యత అంశాలు | వెలువడిన సంవత్సరం/ స్థలం/ఇతర విశేషాలు |
|---|---|---|---|---|---|
| 1. | జాబ్దుత్-ఉల్-అక్బర్ | ఉర్దు | - | ప్రజాచైతన్యం | 1833-హైదరాబాద్ భారతదేశంలో వచ్చిన తొలి పత్రికల్లో ఇది ఒకటి. |
| 2. | రిసాల తబ్బి | ఉర్దు | - | వైద్య అంశాలు | 1859-హైదరాబాద్ తెలంగాణలోని 'తొలి వైద్యపత్రిక'గా చెప్పవచ్చు. |
| *3. | అక్టారెషఫక్ | ఫార్సీ | - | - | 1878-హైదరాబాద్ నిజాం రాష్ట్ర తొలి పత్రికగా భావన. |
| 4. | మౌలిం-ఇ-నిస్వాన్ | ఉర్దు | మౌల్విమొహబ్ హుసేన్ | ముస్లిం స్త్రీలలో సంస్కరణలు | 1892-హైదరాబాద్ మూఢనమ్మకాలను తొలగించుకోవాలని పోరాటం-పత్రికను ప్రభుత్వం నిషేధించింది. |
| 5. | సేద్యచంద్రిక | తెలుగు | మున్షిమహమ్మద్ ముస్త్రక్ అహ్మద్ మాలిక్ | వ్యవసాయ సంబంధ అంశాలు | 1886-హైదరాబాద్ 'పునూన్' అనే ఉర్దూ పత్రికల అనువాద పత్రిక. నిజాం రాష్ట్రం/ తెలంగాణలో వెలువడిన తొలి తెలుగు పత్రిక అని భావన. |
| 6. | దినవర్తమాన్ | తెలుగు ఉర్దూ ఇంగ్లీష్ | నారాయణ స్వామి మొదలియార్ | - | 1890-91 హైదరాబాద్ |
| 7. | అసఫ్-ఉల్-అక్బర్ | ఉర్దు | నారాయణస్వామి మొదలియార్ | - | 1878-హైదరాబాద్ ఇది వారపత్రిక |
| 8. | ము అల్లం షఫీక్ | ఉర్దు | - | జాతీయభావ వ్యాప్తి | హైదరాబాద్ |
| 9. | షౌకతుల్ ఇస్లాం | ఉర్దు | - | జాతాయభావ వ్యాప్తి | హైదరాబాద్ |
| 10. | హైదరాబాద్ రికార్డు | | - | జాతీయభావ వ్యాప్తి | హైదరాబాద్ |
| 11. | నిజాం వైభవ్ | మరాఠీ | శ్రీపతిరావు వకీల్ | - | 1905-హైదరాబాద్ కేవలం ఆరు నెలలు నడిచింది. |
| 12. | భాగ్యేశ విజయ్ | మరాఠీ | శ్రీపతిరావు వకీల్ | - | 1906-హైదరాబాద్ |
| 13. | ది బోధ | మరాఠీ | లక్ష్మణ్‌రావు పాఠక్ | - | - |
| 14. | నిజాం విజయ్ | మరాఠీ | లక్ష్మణ్‌రావు పాఠక్ | - | నిజాం ప్రభుత్వాన్ని విమర్శించవద్దు అనే ప్రభుత్వ షరతుతో నడించింది. పోలీస్ చర్య తరువాత ఈ పత్రిక 'లోక్ విజయ్' అనే పేరుతో మారంది. |

| క్రమ సంఖ్య | పత్రిక పేరు | భాష | స్థాపించిన/ సంపాదకుల పేరు | ప్రాధాన్యత అంశాలు | వెలువడిన సంవత్సరం/ స్థలం/ఇతర విశేషాలు |
|---|---|---|---|---|---|
| 15. | లోకశిక్షణ్ | మరాఠీ | - | - | 1930-హైదరాబాద్ |
| 16. | సంజీవిని | మరాఠీ | - | - | 1932-హైదరాబాద్ |
| *17. | దక్కన్ టైమ్స్ | ఆంగ్లం | అబ్దుల్ ఖదీర్ | ఇంగ్లీష్ రెసిడెన్సి వార్తలు, అభిప్రాయాలు | 1864- ● 1885 వరకు ఆంగ్లేయుల సహకారంతో నడిచిన ఈ పత్రికను 1885లో నిజాం స్వాధీనం చేసుకొని మూసేసాడు. ● 'తొలి ఆంగ్ల పత్రిక'గా తెలంగాణలో నడిచింది. |
| 18. | హైదరాబాద్ టెలీగ్రఫీ | ఆంగ్లం | - | - | సికింద్రాబాద్ |
| 19. | హైదరాబాద్ రికార్డ్ | ఆంగ్లం | - | ప్రజాచైతన్యం | 1885-హైదరాబాద్ |
| 20. | దక్కన్ స్టాండర్డ్ | ఆంగ్లం | - | - | 1889-హైదరాబాద్ |
| 21. | దక్కన్ పంచ్ | ఆంగ్లం | - | - | 1890-హైదరాబాద్ |
| 22. | దక్కన్ బడ్జెట్ | ఆంగ్లం | - | - | 1891-హైదరాబాద్ |
| 23. | ది దక్కన్ మెయిల్ | ఆంగ్లం | - | - | 1898-హైదరాబాద్ (పై పత్రికలన్నీ ప్రభుత్వ నిర్బంధాలను ఎదుర్కొని కొనసాగాయి.) |
| *24. | హైదరాబాద్ బులిటెన్ | ఆంగ్లం | కామెరూన్ | ప్రజాచైతన్యం | 1904-హైదరాబాద్ ప్రభుత్వ నిర్బంధాలను ఎదుర్కొని 50 ఏళ్ళు నిలదొక్కుకున్న పత్రిక. |
| 25. | దక్కన్ న్యూస్ | ఆంగ్లం | - | ప్రభుత్వ అనుకూల వార్తలు | నిజాం ప్రభుత్వ అనుకూల వార్తలే వచ్చేవి. |
| 26. | వతన్ న్యూస్ ముబ్బేవతన్ | ఆంగ్లం | ముస్తఫాఖాదిరి | ప్రభుత్వ వ్యతిరేకం నిష్పాక్షిక వార్తలు | - |
| *27. | మోడరన్ న్యూస్ | ఆంగ్లం | గణపతిరావు అఖిలేకర్ | ప్రజాపక్షం | హైదరాబాద్ ● 'దక్కన్ న్యూస్' వార్తాల్లోని వాస్తవాలను బయటపెట్టేది. ఆ రోజులో ఇది సాహస పత్రిక అని అనుకునేవారు. |
| 28. | మసావత్ | ఉర్దూ | ప్రేమకుమార్ | - | - |
| 29. | సంయుక్త సంఘ వర్తమాని | తెలుగు | ఎస్.బి.సియోస్- -పశుమలె (సం) | క్రైస్తవమత ప్రచారం | 1909-ఖమ్మం జిల్లా మధిర. |
| *30. | హితబోధిని | తెలుగు | శ్రీనివాసశర్మ (సం) | జాతీయ వాదం (వ్యవసాయం, వైద్యం పారిశ్రామిక, సంఘ సంస్కరణలు | 1912-మహబూబ్‌నగర్ జిల్లా. ● 'తొలి తెలుగు మాస పత్రిక'. ● ఆ రోజుల్లోనే 500 మంది చందాదారులున్న పత్రిక. |

| క్రమ సంఖ్య | పత్రిక పేరు | భాష | స్థాపించిన/ సంపాదకుల పేరు | ప్రాధాన్యత అంశాలు | వెలువడిన సంవత్సరం/ స్థలం/ఇతర విశేషాలు |
|---|---|---|---|---|---|
| | | | | | • సురవరం ప్రతాపరెడ్డి, తిరుమల రామ చంద్ర లాంటి పరిశోధకులు దీన్ని తెలంగాణలో వచ్చిన తొలి తెలుగు పత్రికగా పేర్కొన్నారు. నిర్ధారించారు. |
| 31. | ఆంధ్రమాత | తెలుగు | స్వామి వెంకటరావు | దివ్యజ్ఞాన సంబం- -ధిత అంశాలు | 1917-సికింద్రబాద్ |
| *32. | ది పంచమ | ఆంగ్లం | జె.ఎస్.ముత్తయ్య | దళిత చైతన్యం | 1918-హైదరాబాద్ |
| 33. | ములాగ్ వర్తమాని | - | యం.పి.టాక్ (సం) | క్రైస్తవ మతప్రచారం | 1920-ఖమ్మం |
| 34. | సువార్త మణి | - | యం.పి.టాక్ (సం) | క్రైస్తవ మతప్రచారం | 1921-మహబూబ్‌నగర్ |
| 35. | దేశ వాఙ్మయ పత్రిక | తెలుగు ఆంగ్లం ఉర్దూ | - | పూర్తిగా సాహిత్య అంశాలు | 1921-<br>• తెలంగాణ లిటరరీ అసోసియేషన్ ప్రచురించేది.<br>• తిరుమల రామచంద్ర విద్వాన్ విశ్వం లాంటివారు పనిచేశారు. |
| *36. | తెనుగుపత్రిక | తెలుగు | వద్దిరాజు సీతారామ చంద్రరావు<br><br>వద్దెరాజు రాఘవరావు | తెలంగాణ ప్రజల అభివృద్ధి కోసం | 1922, ఆగస్ట్ 27- మానుకోట దగ్గరి ఇనుగుర్తి నుండి.<br>• 1927 మూతపడింది. 500కు పైగా చందాదారులున్న పత్రిక. |
| 37. | సుజాత పత్రిక | తెలుగు | - | ప్రధానంగా<br><br>రాజకీయం | కొంత కాలం గడియారం రామకృష్ణ శర్మ ప్రధాన సంపాదకులుగా ఉన్నారు. |
| 38. | నీలగిరి | తెలుగు | షబ్నవీస్ వేంకటరామ నరసింహరావు (సం) | రాజకీయం | 1922 ఆగస్ట్ - హైదరాబాద్<br>• ప్రభుత్వ నియంతృత్వ విధానాలకు వ్యతిరేకం. 1926లో మూతపడింది.<br>• నిజాం దేశ వార్తలను (వివిధ రంగాల), అనూహ్య విషయాలను ప్రచురించేవారు. |
| *39. | ప్రకటన పత్రిక | తెలుగు | గుండు రాఘవ దీక్షితులు | వ్యాపార ప్రకటనలు | 1922-హనుమకొండ |
| 40. | సర్వవిషయక మాసపత్రిక | తెలుగు | కొకల సీతారామ శర్మ (సం) | - | 1923-హనుమకొండ |
| 41. | ఆంధ్రాభ్యుదయం | తెలుగు | కొకల సీతారామ శర్మ (సం) | చారిత్రక స్థితిగతులతోపాటు అనేక అంశాలు | 1923-హనుమకొండ<br>• ఆంధ్ర-తెలంగాణలో ప్రసిద్ధి<br>• ఆంధ్ర ప్రాంతం నుండి కూడా ప్రకటనలు వచ్చేవి. |

| క్రమ సంఖ్య | పత్రిక పేరు | భాష | స్థాపించిన/ సంపాదకుల పేరు | ప్రాధాన్యత అంశాలు | వెలువడిన సంవత్సరం/ స్థలం/ఇతర విశేషాలు |
|---|---|---|---|---|---|
| 42. | శైవమత ప్రచారిణి | తెలుగు | ముదిగొండ వీరేశలింగ శాస్త్రి (సం) | శైవమత ప్రచారం | 1923 - వరంగల్<br>● శైవమత సాహిత్యం, సమకాలీన వార్తలు |
| 43. | శాంతి | తెలుగు | - | - | 1924<br>● ఈ పత్రిక గూర్చి 'ఆంధ్రాభ్యుదయం' మాస పత్రికలో 'మన ఆధునికస్థితి' అనే వ్యాసం ద్వారా ఒద్దిరాజు సీతారామ చంద్రరావు తెలిపినట్లు తెలుస్తున్నది. |
| 44. | శైవమణి | తెలుగు | ముదిగొండ బుచ్చయ్యశాస్త్రి<br>శివకుమారనంద పండితులు (సం) | మతప్రచారం ప్రధానం | 1924-హైదరాబాద్ అని భావన.<br>● 1927లో శివకుమారనంద పండితులు దీన్ని పునఃప్రారంభించారు. |
| 45. | కవిమిత్ర | తెలుగు | తూము వరదరాజు | - | 1924<br>● దీనికి సంబంధించిన వివరాలు పూర్తిగా అలభ్యం. |
| *46. | అహోకాంసుబే వరంగల్ | తెలుగు | రెవెన్యూ అధికారులు | రెవిన్యూ వార్తలు | 1925-వరంగల్<br>● తెలంగాణ నుండి వెలువడిన తొలి పక్ష పత్రికగా భావన. |
| 47. | నేడు | తెలుగు ఆంగ్లం | భాస్కర్ | హైదరాబాద్ రాజకీయాలు | 1925-సికింద్రాబాద్<br>● వారానికి రెండుసార్లు వచ్చిన పత్రిక. |
| 48. | సుబాహదక్కన్ | ఉర్దూ | - | ముస్లిం అనుకూల వార్తలు | 1924-హైదరాబాద్ |
| 49. | గెజెట్ సయిఫా | ఉర్దూ | - | ముస్లిం అనుకూల వార్తలు | 1925-హైదరాబాద్ |
| 50. | రహబరే దక్కన్ | ఉర్దూ | - | నిజాం అనుకూలం | - |
| *51. | ముషీర్ దక్కన్ | ఉర్దూ | - | నిష్పాక్షిక వార్తలు | ● ముస్లిమేతరుడు నడిపిన పత్రిక. |
| 52. | పయామ్ | ఉర్దూ | ఖాజీ అబ్దుల్ గఫార్ (సం) | ప్రగతిశీల భావాలు | - |
| 53. | సహకారి | ఉర్దూ కన్నడ తెలుగు మరాఠీ | సహకార అధికారులు | సహకార ఉద్యమ వార్తలు | 1926-హైదరాబాద్<br>● త్రైమాసిక పత్రిక<br>● హైదరాబాద్ రాజ్యసహకార ఉద్యమానికి బాసట. |
| 54. | దేశబంధు | తెలుగు | బెల్లంకొండ-రామానుజాచార్యులు (సం) | కార్మిక, సాహిత్య విషయాలు | 1926-మేడ్చల్-మఖ్తావద్దేపల్లి రాజకీయం, ఆర్థిక, తెలంగాణ చరిత్ర, కవి జీవితాలు, అముద్రిత శాసనాలు, సనాతన ఆచారాలు, సంస్కృతసాహిత్యం ఈ అంశాలు ప్రాథమ్యాలు. |

| క్రమ సంఖ్య | పత్రిక పేరు | భాష | స్థాపించిన/ సంపాదకుల పేరు | ప్రాధాన్యత అంశాలు | వెలువడిన సంవత్సరం/ స్థలం/ఇతర విశేషాలు |
|---|---|---|---|---|---|
| *55. | గోల్కొండ పత్రిక | తెలుగు | సురవరం ప్రతాపరెడ్డి (సం) | తెలంగాణ సమాజాభివృద్ధి, సాహిత్య కృషి | 1926, మే 10–హైదరాబాదు.<br>• 'ఆంధ్ర' అనే పేరు నిజాం వ్యతిరేకించడంతో 'గోల్కొండ' అని పెట్టారు.<br>• హైదరాబాద్ రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాలకు కూడ చేరిన పత్రిక.<br>• తెలంగాణలో తొలిసారిగా విలేకరులను సృష్టించిన ఘనత దీని సొంతం.<br>• తెలంగాణ రాజకీయ, సాంఘిక, సాహిత్య, సాంస్కృతిక ఉద్యమాలకు ఈ పత్రిక అండ.<br>• ఆయుర్వేదం, సంగీతం, చిత్రకళ, వాస్తుశాస్త్రం మొదలైన అంశాలపై చర్చలు సాగేవి.<br>• ప్రూఫ్‌రీడర్ నుండి సంపాదకుడు వరకు అన్నీ తానై నడిపించాడు సురవరం గారు.<br>• 1966లో ప్రచురణ ఆగిపోయింది. |
| *56. | భాగ్యనగర్ పత్రిక | తెలుగు | భాగ్యరెడ్డి వర్మ (సం) | సంఘ సంస్కరణోద్యమం | 1931–హైదరాబాద్<br>• పత్రిక ముఖచిత్రంపై చార్మినార్, మక్కా మసీదుతో పాటు, అజంతా ఎల్లోర చిత్రాలు ఉండేవి.<br>• దళిత వర్గాల అభ్యున్నతికి పాటుపడింది.<br>• ఇది పక్షపత్రిక.<br>• 'హరిజన' అనే పదానికి బదులు 'ఆది హిందువులు' అనే పదం వాడేవారు.<br>• 1937 డిసెంబర్ నుండి ఈ పత్రిక పేరు 'ఆదిహిందు' గా మార్చారు. |
| 57. | రయ్యత్ | ఉర్దూ | మందుముల– నర్సింగరావు (సం) | ఉత్తర భారతీయులకు హైదరాబాదు రాజ్య విషయాలు తెలుపడం | 1927–హైదరాబాద్<br>• 1929లోనే నిజాం నిషేధానికి గురైంది.<br>• 1932లో మళ్ళీ ప్రారంభమై 25 సం॥లు నడిచి మళ్ళీ నిషేధానికి గురైంది. |
| 58. | సుజాత | తెలుగు | పి.ఎస్.శర్మ (సం) | సాహిత్యాభివృద్ధి (అన్ని రకాల సాహిత్య ప్రక్రియలు) | 1927–హైదరాబాద్<br>• ఈ పత్రిక 'గోలకొండ పత్రిక' ఆవరణ నుండే నడిచేది.<br>• తెలంగాణ ప్రాంత రచయితలకు ప్రోత్సాహం. |

| క్రమ సంఖ్య | పత్రిక పేరు | భాష | స్థాపించిన/ సంపాదకుల పేరు | ప్రాధాన్యత అంశాలు | వెలువడిన సంవత్సరం/ స్థలం/ఇతర విశేషాలు |
|---|---|---|---|---|---|
| *59. | పూలతోట | తెలుగు | కంభంపాటి అప్పన్నశాస్త్రి (సం) | బాలలకు సంబంధించిన అనేక విషయాలు | • 1950–53 మధ్య గడియారం రామకృష్ణ శర్మ దీన్ని నడిపాడు.<br>• 1930–35–హనుమకొండ–నయీంనగర్<br>• తెలంగాణ నుండి వెలువడిన 'బాలల' తొలి పత్రికగా భావన. |
| 60. | ఆరోగ్య ప్రచారములు | తెలుగు | సుబ్బరాయ సిద్ధాన్తి | ఆరోగ్య సంబంధ విషయాలు | 1930–హైదరాబాదు |
| 61. | కాష్తుకార్ | తెలుగు ఉర్దూ | మహ్మద్ అబ్దుల్ రజాక్ సా బిస్మిల్ | వ్యవసాయాభివృద్ధి | 1931–హైదరాబాద్–డబ్లిపురం (డబీర్‌పుర) |
| *62. | వైద్యకళ | తెలుగు | ఎం.అనంతరంగా–చార్యులు | ఆరోగ్య సమాచారం | 1931–హైదరాబాద్<br>• హైదరాబాద్ వైద్య సంఘం దీన్ని ప్రచురించేది.<br>• వంశపరాంపర్య జబ్బులు–తత్సంబంధ అంశాలు ప్రాధాన్యం. |
| 63. | వైజయంతి వార్షిక పత్రిక | తెలుగు | – | కొల్లాపురం సంస్థానం వార్తలు, విశేషాలు | 1933–నూజివీడు<br>• ఈ పత్రిక 'స్నేహలతా కవితా సంఘం' మహబూబ్‌నగర్ వారు ప్రారంభిం–చారు. వీరు జటప్రోలు సంస్థానానికి చెందినవారు.<br>• పత్రిక ప్రచురణ, నిర్వహణ 'నూజివీడు' నుండి జరుగుతుండేది. |
| 64. | దక్కన్ కేసరి | తెలుగు ఆంగ్లం | అదుసుమల్లి వేంకట దత్తాత్రేయ శర్మ | సాహిత్యప్రాధాన్యం | 1934 జనవరి–సికింద్రాబాద్<br>• జాతీయ ఉద్యమానికి కూడా తోడ్పడిందీ పత్రిక. |
| *65. | మాతృభారతి | తెలుగు | మాడపాటి హను–మంతరావు (సం) | భక్తి, ప్రేమ, విద్య మద్యపాన నిషేధం లాంటి అంశాలు. | 1930వ దశకం - హైదరాబాద్<br>• తొలి విద్యార్థి మాసపత్రికగా చెప్పవచ్చు.<br>• మొత్తంగా (దాదాపు) 'విద్యార్థిని'లచే రాయబడినవి ఉండేవి. |
| 66. | హైదరాబాద్ ఫార్మర్ | తెలుగు ఆంగ్లం | – | వ్యవసాయశాఖ కార్యకలాపాలు | 1935–డిసెంబర్<br>• హైదరాబాద్ ఫార్మింగ్ అసోసియేషన్ వారి స్థాపన.<br>• ఇది త్రైమాసిక పత్రిక. |

| క్రమ సంఖ్య | పత్రిక పేరు | భాష | స్థాపించిన/ సంపాదకుల పేరు | ప్రాధాన్యత అంశాలు | వెలువడిన సంవత్సరం/ స్థలం/ఇతర విశేషాలు |
|---|---|---|---|---|---|
| | | | | | • నిజాం రాష్ట్ర వ్యవసాయ సమస్యలు, ఉద్యోగ నియామకాలు (వ్యవసాయ శాఖలో) అంశాలు, సమాచారం రైతులకు సులభంగా అందించేవారు.<br>• 'గోల్కొండ' ప్రెస్‌లోనే ముద్రించేవారు. |
| *67. | మద్యపాన నిరోధక పత్రిక | తెలుగు ఉర్దూ | - | మద్యపానానికి వ్యతిరేకంగా | 1935-36, హైదరాబాద్<br>• 1938-40 ప్రాంతంలో వెల్దుర్తి మాణిక్యరావు సంపాదకులుగా ఉన్నట్లు సమాచారం.<br>• సిగరెట్లు, బీడి, మత్తుపదార్థాలు వీటికి 'వ్యతిరేకంగా' వ్యాసాలు, చిన్న కథలు, చిత్రాలు మొ॥ వాడేవారు. |
| 68. | '1936' | - | - | సాహిత్యం | 1936-సికిందరాబాద్ |
| 69. | స్నేహలత | తెలుగు | ఎం.ఎస్.రామలింగం (సం) | - | 1937-వరంగల్<br>• ఇది లిఖిత పత్రిక. |
| 70. | ఆంధ్ర సారస్వత సంచిక | తెలుగు | ఎం.ఎస్.రాజలింగం (సం) | సాహిత్యం | 1937<br>• నిజాం కళాశాల విద్యార్థుల సహకారం లభించింది.<br>• ముదిగొండ బుచ్చయ్య లింగశాస్త్రి ప్రధాన సహకర్త. |
| * 71. | దివ్యవాణి | తెలుగు | చివుకుల అప్పయ్య శాస్త్రి (సం) | సనాతచన ధర్మ ప్రచారం | 1937-సికింద్రాబాద్<br>• 30ఏళ్ళు నడిచింది తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాల్లో. |
| 72. | ఆంధ్రవాణి | తెలుగు | బొంగులూరి నరసింహ శర్మ (సం) | రాజకీయ అంశాలు | 1938-విజయవాడ.<br>• హైదరాబాద్‌లో ఉన్న ఆంక్షలను దృష్టిలో పెట్టుకొని తెలంగాణ కొరకు విజయవాడలో స్థాపించారు.<br>• వార్తలన్నీ హైదరాబాద్ రాష్ట్రానికి చెందినదే. |
| 73. | కిన్నెర | తెలుగు | - | సాహిత్యం | 1939-ఖమ్మం జిల్లా - బూర్గులపాడు<br>• ఆంధ్రాభ్యుదయ సేవాసమితి స్థాపించింది. |
| *74. | తెలుగుతల్లి | తెలుగు | రాచమళ్ళ సత్యవతీ దేవి (సం) | అభ్యుదయ భావాలు | 1939-హైదరాబాద్<br>• స్త్రీ సంపాదకత్వం వహించిన తొలి (మాస) పత్రిక. |

| క్రమ సంఖ్య | పత్రిక పేరు | భాష | స్థాపించిన/ సంపాదకుల పేరు | ప్రాధాన్యత అంశాలు | వెలువడిన సంవత్సరం/ స్థలం/ఇతర విశేషాలు |
|---|---|---|---|---|---|
| | | | | | • స్త్రీల సమస్యలు, సాహిత్యకారులకు అగ్రతాంబూలం ఇచ్చింది. |
| 75. | విభూతి | తెలుగు | చిదిరేమఠం-వీరభద్రశర్మ (సం) | శైవమత ప్రచారం | 1939-హైదరాబాద్<br>• ధార్మిక విషయాలు అధికం.<br>• సురవరం వారి 'రామాయణ విశేషాలను' ధారావాహికంగా ప్రచురించింది. |
| 76. | ఆంధ్రశ్రీ | తెలుగు | అడుసుమల్లి వేంకట దత్తాత్రేయశర్మ (సం) | సాహిత్యాంశాలు | 1940-హైదరాబాద్<br>• కేవలం ఒకే ఒక్క ..... సంచిక వెలువడిన పత్రిక.<br>• ఇది వార్షిక పత్రిక. |
| *77. | హైదరాబాద్ సమాచారం | తెలుగు | - | ప్రభుత్వ సమా-చారం ప్రజలకు చేరవేయటం | 1940-41-హైదరాబాద్<br>• నిజాం ప్రభుత్వ ప్రకటనల శాఖ తరపున వెలువడేది.<br>• హైదరాబాద్ ప్రభుత్వ సెంట్రల్ ప్రెస్‌లో ప్రచురించేవారు.<br>• కప్పగంతుల లక్ష్మణ శాస్త్రిగారి సంపాదకత్వం కొంత కాలం నడిచింది. |
| 78. | తర్క్-ఎ-ముసా కిరాత్ | తెలుగు | - | - | 1940-41-హైదరాబాద్-ముస్తఫాబజార్<br>• ఉర్దూలో పేరున్న తెలుగు మాసపత్రిక. |
| 79. | విద్యార్థి | తెలుగు | - | సాహితీ అంశాలు | 1940-41-హైదరాబాద్<br>• వార్షిక పత్రిక.<br>• నిజాం కళాశాల విద్యార్థి విభాగం వారు నిర్వహించారు. |
| 80. | మెన్నొనైట్ వర్తమాని | తెలుగు | - | క్రైస్తవమత ప్రచారం | 1940-మహబూబ్‌నగర్ మిషన్‌ప్రెస్ |
| 81. | పయాం | ఉర్దూ | ఖాజీఅబ్దుల్ గఫార్ (సం) | జాతీయభావాలు | 1940-హైదరాబాద్<br>• ఈయన ఉత్తర భారతీయుడైనా ఇక్కడి భాష, రాజకీయాలకు మద్దతు ఇచ్చేవాడు.<br>• నిజాం ఆగ్రహానికి గురైనాడు. |
| 82. | సందేశం | తెలుగు | ఖాజీఅబ్దుల్ గఫార్ (సం) | జాతీయభావాలు | 1941-హైదరాబాద్<br>• ఇది తెలుగులో వచ్చిన తొలిదిన పత్రికగా కొందరు పరిశోధకుల భావన. |

| క్రమ సంఖ్య | పత్రిక పేరు | భాష | స్థాపించిన/ సంపాదకుల పేరు | ప్రాధాన్యత అంశాలు | వెలువడిన సంవత్సరం/ స్థలం/ఇతర విశేషాలు |
|---|---|---|---|---|---|
| 83. | రయ్యత్ | ఉర్దూ | మందముల నర్సింగ్ రావు (సం) | నిజాంకు వ్యతిరేకంగా ప్రజానుకులంగా | 1927–హైదరాబాద్ |
| 84. | క్లేరియాన్ | ఆంగ్లం | – | జాతీయవాదం | హైదరాబాద్ |
| 85. | ఇండియన్ స్టేట్స్ అండ్ జమిందార్స్ | ఆంగ్లం | – | జాతీయవాదం | హైదరాబాద్ |
| 86. | రెయిన్ బో | ఆంగ్లం | – | జాతీయవాదం | హైదరాబాద్ |
| 87. | న్యూఎరా | ఆంగ్లం | – | జాతీయవాదం | హైదరాబాద్ |
| 88. | దక్కన్ స్టార్ | ఆంగ్లం | – | జాతీయవాదం | హైదరాబాద్ |
| 89. | ఆర్యభాను | హిందీ | – | జాతీయవాదం | హైదరాబాద్ |
| 90. | స్వతంత్ర | హిందీ | – | జాతీయవాదం | హైదరాబాద్ |
| 91. | హైదరాబాద్ బులిటెన్ | ఆంగ్లం | – | – | హైదరాబాద్ |
| 92. | దక్కన్ క్రానికల్ | ఆంగ్లం | – | సామాజిక, రాజకీయ | 1937–హైదరాబాద్<br>• ఇది వారపత్రికగా మొదలై 'దిన– పత్రిక'గా మారింది.<br>• కె.రాజగోపాల్, బి.ఆర్.చారి, ఎమ్.ఎన్.జయంనార్యలు ప్రారంభించారు. |
| *93. | ఇమ్రోజ్ | ఉర్దూ | షోయబుల్లాఖాన్ (సం) | నైజాం వ్యతిరేక | హైదరాబాద్–1947 నవంబర్ 15<br>• హైదరాబాద్ భారత్‌లో విలీనం కావాలని సహేతుకంగా సంపాదకీయాలు రాసిన పత్రిక.<br>• MIM కార్యకలాపాలాను, దాని అధినేత ఖాసిం రజ్వీని తీవ్రంగా దూయబట్టేది.<br>• దుండగుల చేతిలో షోయబ్ హతమయ్యాడు. |
| 94. | సుబేదక్కన్ | ఉర్దూ | – | నిజాం అనుకూల అంశాలు | 1947–48<br>• నిజాం అభిమానం చూరగొన్న పత్రిక. |
| 95. | ఆంధ్రకేసరి | తెలుగు | గుండవరం హన్మం–తరావు (సం) | తెలంగాణ ప్రజల ఉపయోగం | 1941 ఫిబ్రవరి–హైదరాబాద్<br>• రైతు సమస్యలు, విజ్ఞానం, సాహిత్యం, రాజకీయ అంశాలకు ప్రాధాన్యం. |
| *96. | ప్రజాశక్తి | తెలుగు | – | వామపక్షభావజాలం | 1941–హైదరాబాద్<br>• తొల్త ఇది వారపత్రిక.<br>• 1945 నుండి దినపత్రికగా మారింది.<br>• 1951లో పునరుద్ధరించబడి 'విశాలాంధ్ర'గా మద్దుకూరి చంద్రశేఖర రావు సంపాదకత్వంలో వెలువడింది. విజయవాడ నుండి వచ్చాయి. |

| క్రమ సంఖ్య | పత్రిక పేరు | భాష | స్థాపించిన/ సంపాదకుల పేరు | ప్రాధాన్యత అంశాలు | వెలువడిన సంవత్సరం/ స్థలం/ఇతర విశేషాలు |
|---|---|---|---|---|---|
| *97. | ఆయుర్వేద కళ | తెలుగు | వేదాల తిరుమల వేంకట రామానుజ స్వామి (సం) | వైద్యసమాచారం | 1941–హైదరాబాద్<br>● వివిధ ఔషధాల గూర్చి, రసాయనాల తయారీ చిట్కాలు మొ॥అంశాలు సరళ భాషల్లో ప్రజోపయోగార్థం, వైద్యులకు అర్థమయ్యేట్లు రాసేవారు. |
| 98. | దాశరథి | తెలుగు<br>తమిళం | దాశరథి వేంకటా–<br>–చార్యులు (సం) | వైష్ణవమతోద్ధరణ ప్రధానం | 1941–సికిందరాబాద్<br>● ప్రీమియర్‌ప్రెస్‌లో ప్రచురించేవారు. ఇది మాస పత్రిక. |
| 99. | తరణీ | తెలుగు | చిల్లా సుబ్బారామ సిద్ధాంతి | సారస్వతం, విజ్ఞానం | 1942– |
| *100. | తెలంగాణ | తెలుగు | రాజగోపాల్ మొదలియార్<br>బుక్కపట్టణం (సం) | రోజువారీ కార్యక్ర–మాల అంశాలు | 1942/45–హైదరాబాద్<br>● తెలంగాణ నుంచి వెలువడ్డ తెలుగు 'తొలి దిన పత్రిక'గా రామానుజాచార్యులు భావన.<br>● గ్రంథాలయోద్యమం, ఆంధ్రసారస్వత పరిషత్ కార్యక్రమాలు, సాహిత్యాంశాల ప్రాధాన్యంతో ప్రచురించేది.<br>● ఇది మూడున్నరేళ్ళే కొనసాగింది. |
| 101. | గ్రామసుధార్ | తెలుగు<br>ఉర్దూ<br>మరాఠీ<br>కన్నడ | నిజాం ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి శాఖ | వ్యవసాయం, సహకార ఉద్యమాల వార్తలు | 1943–44 హైదరాబాద్<br>● ఇది మాస పత్రిక. |
| 102. | కాకతీయ సాహిత్య సంకలనం | తెలుగు | పాములపర్తి సదాశివరావు (సం) | వరంగల్ ప్రాంత కవుల రచనలు | 1944–వరంగల్<br>● కేవలం నాలుగు సంచికలు మాత్రమే వచ్చాయి. ఇది మాసపత్రిక.<br>● తరువాత కాలంలో ఇది 'కాకతీయ' అనే రాజకీయ పత్రికైంది. 1955 వరకు నడిచింది. |
| *103. | మీజాన్ | తెలుగు<br>ఉర్దూ<br>ఆంగ్లం | గులాం అల్లావుద్దీన్ | నిజాంకు అను–కూలం–ఆంగ్లం MIM కు అనుకూలం –ఉర్దూ అభ్యుదయభావాలు – తెలుగు | 1944–హైదరాబాద్<br>● దేశంలో 3 భాషల్లో వెలువడిన ఏకైక పత్రిక.<br>● తెలుగు ఎడిషన్‌కు అడవి బాపిరాజు సంపాదకులు.<br>● మూడు భాషల్లో ఒక్కో విధానాన్ని అవలంబించేది. |

| క్రమ సంఖ్య | పత్రిక పేరు | భాష | స్థాపించిన/ సంపాదకుల పేరు | ప్రాధాన్యత అంశాలు | వెలువడిన సంవత్సరం/ స్థలం/ఇతర విశేషాలు |
|---|---|---|---|---|---|
| 104. | పాడిపంటలు | తెలుగు | హైదరాబాద్ రాజ్య సమాచార శాఖ | వ్యవసాయం, పాడిపంటలు | 1944-45-హైదరాబాద్<br>• ఆంధ్ర మహాసభలో దీనిని ప్రదర్శనకు పెట్టేవారు. |
| 105. | హైదరాబాదాంధ్ర సాహిత్య పరిషత్పత్రిక | తెలుగు | హైదరాబాదాంధ్ర సాహిత్య పరిషత్తు | నిజాంకు అనుకూలం | 1945-హైదరాబాద్ |
| *106. | సంస్థాన విద్యార్థి | తెలుగు | భీమాగౌడు (సం) | విద్యార్థులు అభివృద్ధి | 1945-హైదరాబాద్ |
| 107. | పద్మశాలి | తెలుగు<br>మరాఠీ | శ్రీరాములు శ్రేష్ఠి | పద్మశాలికులాభివృద్ధి | 1925-మంగళగిరి నుండి, తర్వాత షోలాపూర్<br>• ఈ పత్రిక సంపాదకులు బూర్గుల రామకృష్ణయ్య షోలాపూర్ నుండి హైదరాబాద్‌కు వచ్చారు. |
| 108. | హైదరాబాద్ | తెలుగు | జమలాపురం-<br>-కేశవరావు | సంస్థాన రాజకీయ పరిస్థితులు | 1920వ దశకం-విజయవాడ<br>• తెలంగాణకు చెందిన నాయకులు ఇక్కడి ఇబ్బందుల దృష్ట్యా విజయ-వాడలో పత్రికను ప్రారంభించారు.<br>• ఇది జాతీయ వారపత్రిక.<br>• దీనిలో సంస్థానంలో ఆరాచక పాలన, పరిస్థితులను యావద్దేశానికి చేరవేసేవారు.<br>• ఈ పత్రికా పంపిణిని ఇక్కడ రహస్యంగా చేసేవారు. |
| *109. | క్రాంతి | తెలుగు | కె.సత్యనారాయణ (సం) | ఆనాటి జైళ్ళ పరిస్థితులు | 1940వ దశకం-హైదరాబాద్ చంచల్ గూడ జైలు నుండి<br>• జైళ్ళలోని ఆరాచక పరిస్థితులను కాళోజి, దాశరధి లాంటి వారు వివరించేవారు.<br>• ఇది రహస్యపత్రిక - ఖైదీలకోసం. |
| 110. | మేధావి | తెలుగు | బిరుదు వేంకట శేషయ్య | విద్యావిజ్ఞాన విషయాలు | 1946-హైదరాబాద్<br>• ఆంధ్ర సారస్వత పరిషత్తు కార్య-కలాపాలు కూడా ప్రచురించేవారు.<br>• రెండేళ్ళు కొనసాగింది. |
| 111. | సారథి | తెలుగు | తెలంగాణ ప్రాంతీయులు తాళ్ళూరి రామానుజా రావు (సం) | రాజకీయ పరిస్థి-తులు, కాంగ్రెస్ కలాపాలు | 1946-విజయవాడ<br>• నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకం.<br>• కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాల వార్తలు. |

| క్రమ సంఖ్య | పత్రిక పేరు | భాష | స్థాపించిన/ సంపాదకుల పేరు | ప్రాధాన్యత అంశాలు | వెలువడిన సంవత్సరం/ స్థలం/ఇతర విశేషాలు |
|---|---|---|---|---|---|
| 112. | శోభ | తెలుగు | దేవులపల్లి రామానుజారావు | సాహిత్యం | 1947 ఆగస్ట్–వరంగల్<br>● అనువాదాలు, గీతాలు కూడా ప్రచురించేవారు. |
| 113. | స్టేట్ కాంగ్రెస్ వార్తా సంచిక | తెలుగు | – | స్టేట్‌కాంగ్రెస్ కార్య-కలాపాలు ప్రధానం | 1947–కర్నూలు<br>● ఇది రహస్య వార పత్రిక.<br>● తెలంగాణ ప్రాంతీయూలు కర్నూలు నుండి నిర్వహించేవారు. |
| 114. | కాంగ్రెస్ సమాచార్ | తెలుగు | – | కాంగ్రెస్ కార్యకలాపాలు | 1948–హైదరాబాద్ |
| 115. | భాగ్యనగర్ | తెలుగు | అయోధ్యరామకవి | – | 1949–హైదరాబాద్<br>● ఆంధ్రసారస్వత పరిషత్తు ఐదో వార్షికోత్సవం సందర్భంగా ప్రారంభించారు. |
| 116. | ప్రగతి | తెలుగు | కోదాటి నారాయణరావు భండార్లు చంద్ర మౌళీశ్వరరావు (సం) | విశాలాంధ్ర స్థాపన | 1949–వరంగల్ |
| 117. | తెలుగుదేశం | తెలుగు | సూర్యదేవర రాజ్యలక్ష్మి (సం) | ప్రజోపయోగ అంశాలు | 1948–విజయవాడ<br>● 1949 సెప్టెంబర్ నుండి హైదరాబాద్‌లో వెలువడింది.<br>● జాతీయు, అంతర్జాతీయు వార్తలకు కూడా ప్రాధాన్యం కల్పించేది. |
| 118. | ఇంద్వార్ | తెలుగు<br>ఉర్దూ<br>ఆంగ్లం<br>అరబిక్ | – | సమకాలీన వార్తలు | 1950–హైదరాబాద్ |
| 119. | శ్రీకుసుమ హరనాథ | తెలుగు | ఉత్పల మేంకటరావు (సం) | ఆధ్యాత్మిక అంశాలు | 1950–హైదరాబాద్ |
| 120. | మానవధర్మ | తెలుగు | టి.లోకాచార్య (సం) | – | 1950–వరంగల్ |
| 121. | సత్యార్థి ప్రకాశిక | తెలుగు | మంత్రిప్రెగడ వేంకటేశ్వరరావు | ఆర్యసమాజ బోధనలు | 1940–తొల్త సూర్యాపేట తరువాత హైదరాబాద్ నుండి |
| *122. | శోభ | తెలుగు | ఉస్మానియా విశ్వ విద్యాలయ విద్యార్థులు | విద్యార్థుల రచనలు | 1950–హైదరాబాద్<br>● ఇది అర్ధవార్షిక సంచిక.<br>● తొల్త లిఖిత పత్రిక.<br>● తరువాత ముద్రణా పత్రికగా మారంది |

| క్రమ సంఖ్య | పత్రిక పేరు | భాష | స్థాపించిన/ సంపాదకుల పేరు | ప్రాధాన్యత అంశాలు | వెలువడిన సంవత్సరం/ స్థలం/ఇతర విశేషాలు |
|---|---|---|---|---|---|
| 123. | ప్రజాయుగం | తెలుగు | పి.ఎ.చారి (సం) | రాజకీయం ప్రజోపయోగం | 1950–హైదరాబాదు<br>● ఇది పక్షపత్రిక. |
| 124. | దక్షిణ ఇండియా పత్రిక | తెలుగు | రెవరెండ్ ఆల్‌ఫ్రెడ్ బన్సన్ (సం) | క్రైస్తవ మతోద్ధరణ ప్రచారం | 1951–డోర్నకల్ |
| *125. | గుమస్తా | తెలుగు | గుమస్తా ఉద్యోగుల వేదిక | గుమస్తాల సమస్యలు పరిష్కారాలు | 1951– |
| 126. | హైదరాబాద్ సహకార పత్రిక | తెలుగు<br>ఆంగ్లం<br>కన్నడం<br>మరాఠీ | సహకార ఉద్యోగులు | సహకార ఉద్యోగులు బ్యాంకులు, సహకార సొసైటీలు, ఇన్సూరెన్స్ మొదలైనవి | 1951–హైదరాబాద్ |
| 127. | జనశక్తి | తెలుగు | జువ్వాది గౌతంరావు (సం) | సోషలిస్టు భావ ప్రచారం | 1950–54 మధ్యలో–హైదరాబాద్<br>● ఇది వారపత్రిక. |
| 128. | జనత | తెలుగు | కాటం లక్ష్మీనారాయణ (సం) | – | 1951 |
| 129. | ప్రజాప్రభ | తెలుగు | – | – | 1951–హైదరాబాద్ |
| 130. | మనవ్యవసాయం | తెలుగు | హైదరాబాద్ రాష్ట్ర ప్రభుత్వం | వ్యవసాయ వార్తలు | 1951–హైదరాబాద్ |
| *131. | నేటి హైదరాబాద్ | తెలుగు | హైదరాబాద్ రాష్ట్ర ప్రభుత్వం | ప్రభుత్వ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు | 1951 ఫిబ్రవరి–హైదరాబాద్<br>● 1956 నుండి ఇదే పత్రిక ఆంధ్రప్రదేశ్ పేరుతో కొనసాగింది.<br>● 2014 నుండి 'తెలంగాణ'గా తెలంగాణలో కొనసాగుతున్నది.<br>● ఈ పత్రికతోపాటు 'హైదరాబాద్ టుడే' అనే ఆంగ్ల మాస పత్రిక కూడా వచ్చేది. |
| 132. | పల్లెటూరు | తెలుగు | మల్యాల దేవీప్రసాద్ | గ్రామీణ, సాంస్కృతిక అంశాలు | 1956–మెదక్ జిల్లా సంగారెడ్డి |
| 133. | సుదర్శన్ | తెలుగు | సుదర్శనాదేవి (సం) | – | 1956–మహబూబ్‌నగర్ జిల్లా–వనపర్తి |
| 134. | ప్రజావాణి | హిందీ<br>తెలుగు | సురవరం ప్రతాపరెడ్డి | – | 1951–హైదరాబాద్–వారపత్రిక<br>● ఆర్థిక ఇబ్బందుల వల్ల తొందరగా మూతపడింది. |
| *135. | రంజని | తెలుగు | బి.పి.రాజు | సినిమా వార్తలు | 1952–హైదరాబాదు–ఇది వారపత్రిక. |
| 136. | హిందీ సంఘ సమాచారం | – | హిందీ ప్రచార సంఘం | హిందీ భాషా ప్రచారం | 1952–హైదరాబాదు–ఇది మాసపత్రిక. |

| క్రమ సంఖ్య | పత్రిక పేరు | భాష | స్థాపించిన/ సంపాదకుల పేరు | ప్రాధాన్యత అంశాలు | వెలువడిన సంవత్సరం/ స్థలం/ఇతర విశేషాలు |
|---|---|---|---|---|---|
| *137. | నేత | తెలుగు | పి.వి.రామనరసయ్య(సం) | చేనేతరంగ వార్తలు పద్మశాలికులాభివృద్ధి | 1952–పక్షపత్రిక<br>● తొలి మాసపత్రిక<br>● తరువాత వారపత్రిక |
| 138. | పద్మప్రకాశ్ | తెలుగు | బూర్గుల రామకృష్ణయ్య | చేనేతరంగ వార్తలు పద్మశాలికులాభివృద్ధి | 1952 ప్రాంతం |
| 139. | వెలుగు | తెలుగు | చౌడవరం విశ్వనాథం | గ్రంథాలయోద్యమం స్వాతంత్రోద్యమం | 1952–జనగామ |
| *140. | విద్యాజ్యోతి | తెలుగు | అలంపూర్ మాధ్యమిక పాఠశాల విద్యార్థులు | విద్యార్థుల రచనలు | 1952–53 అలంపూర్<br>● గడియారం రామకృష్ణ శర్మ ప్రోత్సాహం లభించింది. |
| 141. | చైతన్యం | తెలుగు | తెరసం–కరీంనగర్ శాఖ | సాహిత్యం | 1952–53 కరీంనగర్ మాసపత్రిక. |
| 142. | గౌడపత్రిక | తెలుగు | కక్కేర్ల కాశీనాథం (సం) | గౌడుకులాభివృద్ధి | 1953–వరంగల్ |
| 143. | నాదం | తెలుగు | కనపర్తి లక్ష్మీనరసింహ (సం) | – | 1953 సిరిసిల్ల<br>● ఇది ప్రత్యేక సంచిక–సిరిసిల్ల తెరసం వారిది. |
| 144. | సేవ | తెలుగు | ఎస్.ఆర్.యోగి | వివిధ విషయాలు | 1953–హైదరాబాద్–మాసపత్రిక |
| *145. | తెలుగువీణ | తెలుగు | ఆలియా కళాశాల విద్యార్థులు | విద్యార్థుల రచనలు | 1953–హైదరాబాద్–వార్షికపత్రిక |
| 146. | విద్యోదయ | తెలుగు | ఎస్.బి.క్లబ్ | అభ్యుదయ భావాలు | 1953–వేములవాడ–మాసపత్రిక |
| 147. | వివేకానంద | తెలుగు | కొమ్మసుబ్బారావు | వివేకానందుని బోధనలు | 1953–వరంగల్ |
| 148. | సమత | తెలుగు | బి.ఎస్.మహదేవసింగ్<br>సంతపురి రఘువీరరావు (సం) | సోషలిస్టు భావాలు | 1953–సికిందరాబాద్–మాసపత్రిక |
| 149. | సాథీ | ఉర్దూ | బి.ఎస్.మహదేవసింగ్<br>సంతపురి రఘువీరరావు (సం) | సోషలిస్టు భావాలు | 1953–సికిందరాబాద్–మాసపత్రిక |
| 150. | మంజీర | తెలుగు | తెరసం | సాహిత్యం | 1954–హైదరాబాద్<br>● ఇదీ ప్రత్యేక వార్షిక సంచిక |
| 151. | కిసాన్ | తెలుగు | నూకల నరోత్తమ రెడ్డి (సం) | వ్యవసాయ ప్రాధాన్యం | 1954 ఆగస్ట్–హైదరాబాద్<br>● హైదరాబాద్ ఫార్మర్స్ యునియన్ స్థాపన |
| 152. | సారస్వతజ్యోతి | తెలుగు | బోయినపల్లి<br>వేంకటరామారావు | సాహిత్యం, కళలు,<br>చారిత్రక ప్రదేశాలు | 1954–కరీంనగర్–త్రైమాసిక పత్రిక.<br>● స్థానిక చరిత్రలకు స్థానం కల్పించారు. |
| 153. | సరోజిని | తెలుగు | లింబాద్రిరెడ్డి (సం) | వ్యవసాయ, వాణిజ్య, సారస్వతం | 1954–కరీంనగర్–మాసపత్రిక<br>● వైద్య అంశాలు కూడా చేర్చేవారు. |
| 154. | స్రవంతి | తెలుగు<br>హిందీ | హిందీ భాషా<br>ప్రచారక సంఘం | ద్విభాషా సాహిత్యం | 1954–హైదరాబాదు–మాసపత్రిక<br>● స్వతంత్ర రచనలు, వివిధ భాషా సారస్వతం, విశాలాంధ్ర ముఖ్యవార్తలు అని మూడు భాగాలుగా వచ్చేది. |

| క్రమ సంఖ్య | పత్రిక పేరు | భాష | స్థాపించిన/ సంపాదకుల పేరు | ప్రాధాన్యత అంశాలు | వెలువడిన సంవత్సరం/ స్థలం/ఇతర విశేషాలు |
|---|---|---|---|---|---|
| *155. | భూదానం | తెలుగు | ఆర్.కె.రామలింగా రెడ్డి (సం) | వినోబాభావె ఆశయాలు | 1954–హైదరాబాద్– గాంధీభవన్ |
| *156. | విజయ | తెలుగు | మంథని ఉన్నత పాఠశాల విద్యార్థులు | విద్యార్థుల రచనలు | 1954–కరీంనగర్, మంథని |
| 157. | జోత్స్న | తెలుగు | ఆర్.రాధాకృష్ణ | సారస్వత అంశాలు | 1955–జగిత్యాల–మాసపత్రిక స్థానిక రచనలకు ప్రాధాన్యం. |
| 158. | మనబడి | తెలుగు | – | సాహితీ, వైజ్ఞానిక | 1955–కరీంనగర్–హుస్నాబాద్. ● ఇది సైక్లోస్టైల్ పత్రిక. |
| 159. | సింగరేణి కబుర్లు | తెలుగు | హైదరాబాద్ రాష్ట్ర ప్రభుత్వం ఎస్.సోమరాజు (సం) | సింగరేణి కార్మికులు చైతన్యం | 1955–కొత్తగూడెం |
| 160. | వైశ్యవాణి | తెలుగు | అల్లాడివీరయ్యగుప్త(సం) | వైశ్యకులాభివృద్ధి | 1956– |
| 161. | అనుభవ వైద్యం | తెలుగు | విఠల్ ప్రసాద్ (సం) | ఆయుర్వేద వైద్య ప్రచారం | 1956–హైదరాబాద్– మాసపత్రిక ● వి.సదానందం ప్రారంభించారు. |
| 162. | ఆరాధన | తెలుగు ఇంగ్లీషు సంస్కృతం | – | ఆధ్యాత్మిక, తత్త్వశాస్త్రం | 1956–హైదరాబాద్– మాసపత్రిక ● ప్రభుత్వ దేవదాయశాఖ ఆధ్వర్యంలో వెలువడడం. |
| 163. | గుప్త | తెలుగు | కల్వకుంట్ల చంద్ర సేన్ గుప్త (సం) | వైశ్యుల అభివృద్ధి | 1956–హైదరాబాద్ మాసపత్రిక |
| 164. | లీడర్ | తెలుగు ఉర్దూ ఆంగ్లం | – | – | 1956–నిజామాబాద్ |
| 165. | నవశక్తి | తెలుగు | – | కమ్యూనిస్టు ఉద్యమాలకు ఊతం | 1956–హైదరాబాద్ |
| 166. | టీచర్స్ బులిటెన్ | తెలుగు | వి.పి.రాఘవాచారి (సం) | ఉపాధ్యాయ అంశాలు | 1956–57–హైదరాబాద్– మాసపత్రిక |
| 167. | వనిత | తెలుగు | అబ్బూరిఛాయాదేవి(సం) | స్త్రీల ప్రత్యేకం | 1950 దశకం–హైదరాబాద్– మాసపత్రిక |
| 168. | పంచాయత్ | తెలుగు | జె.రఘోత్తమరెడ్డి (సం) | పంచాయతీల వార్తలు | 1956–హైదరాబాద్– మాసపత్రిక |
| 169. | గంగపుత్ర | తెలుగు | జి.ఎస్.లక్ష్మణ్ (సం) | మత్స్యకారుల అభివృద్ధి వారి చైతన్యం | 1956–హైదరాబాద్– మాసపత్రిక |
| 170. | జ్ఞానతరంగిణి | తెలుగు | సి.వి.రామారావు (సం) | విజ్ఞానవార్తలు | 1956–హైదరాబాద్– మాసపత్రిక |
| 171. | హిందూవిజయ్ | మరాఠీ | వై.డి.జోషి (సం) | ప్రజానుకూల వార్తలు | హైదరాబాద్ ● వై.డి.జోషి హిందూ మహాసభ వ్యవస్థాపకులు. |

1956లో ఆంధ్రప్రదేశ్ ఏర్పడక ముందు తెలంగాణ గడ్డకు విస్తృత ప్రాతిపదికన విభిన్న కోణాల్లో ఇలా అనేక పత్రికలు తమ తమ సేవలనందించి ప్రజలను చైతన్యపరిచి నడిపించాయి. తెలంగాణలో వెలసిన, తెలంగాణ కోసం వెలసిన ప్రతి పత్రిక ప్రజాభ్యుదయాన్ని, తెలంగాణ పురోభివృద్ధిని ప్రధాన ఉద్దేశంగా పెట్టుకొని ముందుకు నడిచినవే. ఆనాటి నుండి వెలువెత్తిన ఆ చైతన్య స్రవంతియే నేటి తెలంగాణ రాష్ట్ర సాధనకు ప్రేరణ. తెలంగాణ తెలుగుకు అభ్యున్నతి.

ఇక ఆంధ్రప్రదేశ్‌లో ఆంధ్రభూమి, ఆంధ్రజ్యోతి, ఈనాడు, సితార, అన్నదాత, విపుల, చతుర, ఉదయం, వార్త, సాక్షి, శివరంజని ఇలా అనేక పత్రికలు హైదరాబాద్ కేంద్రంగా వెలువడ్డాయి. తెలంగాణ రాష్ట్ర సాధన ప్రధాన లక్ష్యంగా నమస్తే తెలంగాణ పత్రిక ఆవిర్భవించింది. సూర్య, నవ తెలంగాణ, మన తెలంగాణ లాంటి అనేక దిన, వార, మాస పత్రికలు వెలువడుతున్నాయి. నమస్తే తెలంగాణతో చరిత్రలో తెలంగాణ పత్రికాయుగం పునఃప్రారంభమైంది.

**ధన్యవాదాలు: 'తెలంగాణ తెలుగు అకాడమీ' వారి సౌజన్యంతో వెలువరించిన అంశాలున్నాయి.**

**ఆకర గ్రంథాలు: తెలంగాణ చరిత్ర-సంస్కృతి మరియు వికీపీడియా సమాచారం.**

❀❀❀❀❀


గోలకొండ పత్రిక

ప్రత్యేక తెలంగాణా మే పబ్లిక్లో అత్యధిక సంఖ్యాకుల వాంఛ

# 11. దర్శనీయ స్థలాలు

తెలంగాణ కోటి రతనాల వీణ. ఘనమైన ప్రాచీన వారసత్వ సంపదను కలిగివున్నది. తెలంగాణ వైభవాన్ని ఆ వారసత్వ చరిత్రను చాటిచెప్పే నిదర్శనాలెన్నో ఇక్కడ కొలువుదీరి ఉన్నాయి. శాతవాహనులు, రాష్ట్రకూటులు, కాకతీయులు, కుతుబ్‌షాహిలు మొదలుగాగల అనేక రాజవంశాలవారు పరిపాలించారు. ఇక్కడి చారిత్రక కట్టడాలు, కోటలు, దేవాలయాలు, శిల్పకళా నైపుణ్యానికి, నిర్మాణాత్మక కౌశలతకు ప్రతీకలు. తెలంగాణ ఘన చరిత్రను చాటిచెప్పే చారిత్రక కట్టడాలు, పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రదేశాల గురించి తెలుసుకుందాం.

**పుణ్యక్షేత్రాలు**

| క్ర.సం. | జిల్లా | క్షేత్రం పేరు / దేవి, దేవతల పేరు | విశేషాలు |
|---|---|---|---|
| 1. | యాదాద్రి భువనగిరి జిల్లా (హైదరాబాద్ నగరం నుండి దాదాపు 60 కి.మీ.) | యాదాద్రి (యాదగిరి గుట్ట) లక్ష్మీనరసింహస్వామి | తెలంగాణ రాష్ట్రంలో ప్రసిద్ధి పొందిన పుణ్యక్షేత్రం "యాదాద్రి". దీన్ని యాదగిరి గుట్ట అని కూడా పిలుస్తారు. ఈ క్షేత్రంలో నరసింహ స్వామి అయిదు రూపాలలో కొలువై ఉన్నాడు. పూర్వం యాద మహర్షి ఈ గుట్టపై తపస్సు చేయడం వల్ల నరసింహస్వామి ఇక్కడ వెలిశాడు అని పురాణ కథలు చెప్తున్నాయి. ఆ మహర్షి పేరు మీదనే ఈ గుట్టకు యాదాద్రి అని యాదగిరిగుట్ట అని పేరొచ్చింది. యాదాద్రి ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉన్న పుణ్యక్షేత్రం. నవనారసింహ క్షేత్రాల్లో ఒకటి. |
| 2. | భద్రాది కొత్తగూడెం (హైదరాబాద్ నుండి దాదాపు 310 కి.మీ. దూరంలో ఉంది) | భద్రాచలం శ్రీ సీతారామాలయం | 17వ శతాబ్దానికి చెందిన ప్రముఖ వాగ్గేయ కారుడు, శ్రీరామ భక్తుడు అయిన కంచెర్ల గోపన్నచే నిర్మించబడినది భద్రాచల శ్రీరామాలయం. భద్రాచలంలో తహసిల్దారుగా పనిచేస్తున్న గోపన్న ప్రజల వద్ద నుండి వసూలు చేసిన శిస్తులతో రామమందిరాన్ని నిర్మించాడు. చెరసాలలోని గోపన్న భక్తికి పరవశుడైన శ్రీరాముడు తానాషాకు రుసుమును చెల్లించి గోపన్నను బంధ విముక్తుడిని కావించాడు. అప్పటినుండి గోపన్న 'భక్త రామదాసుగా', 'భద్రాచల రామదాసుగా' పేరుపొందాడు. ప్రతియేడాది శ్రీరామనవమి సందర్భంగా ఇక్కడ సీతారాముల కళ్యాణం అంగరంగ వైభవంగా జరుగుతుంది. నైజాం కాలం నుండి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్వామి వారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తున్నది. |
| 3. | నిర్మల్ జిల్లా (హైదరాబాద్ నుండి దాదాపు 200 కి.మీ. దూరం ఉంది) | బాసర జ్ఞాన సరస్వతి దేవాలయం | ఈ ఆలయం గోదావరి నదీతీరంలో బాసరలో వెలసిన జ్ఞాన సరస్వతీ మందిరం. వ్యాసమహర్షి తపస్సు చేసిన ప్రాంతం కావున ఈ ప్రదేశాన్ని వ్యాసపురి అని పిలిచేవారు. తరువాత అది వాసరగా ప్రస్తుతం బాసరగా పిలువబడుతుంది. ఇక్కడి సరస్వతీ దేవతామూర్తిని వ్యాసమహర్షి ఇసుకతో ప్రతిష్ఠించాడని స్థలపురాణం తెలియజేస్తుంది. జ్ఞానాన్ని ప్రసాదించే సరస్వతీదేవి సన్నిధిలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తే వారికి చదువు బాగా అబ్బుతుందనీ భక్తుల విశ్వాసం. తెలుగు రాష్ట్రాల వారే కాకుండా ఇతర రాష్ట్రాల వారు కూడా ఇక్కడ తమ పిల్లలకు అక్షరాభ్యాసం చేయించుకొంటారు. |

| క్ర.సం. | జిల్లా | క్షేత్రం పేరు / దేవి, దేవతల పేరు | విశేషాలు |
|---|---|---|---|
| | | | మాఘ శుద్ధ పంచమి లేక వసంత పంచమి రోజు శ్రీ సరస్వతీ దేవి జన్మదినోత్సవాన్ని ఇక్కడ మహాఘనంగా జరుపుతారు. దేవి నవరాత్రులు, అనేక ఉత్సవాలు మహావైభవోపేతంగా జరుపుతారు. |
| 4. | రాజన్న సిరిసిల్ల జిల్లా, (హైదరాబాద్ నుండి దాదాపు 150 కి.మీ. దూరంలో ఉంది) | వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవాలయం | భారతదేశంలో ఉన్న పురాతన శివాలయాలలో ఇది ఒకటి. ఈ దేవాలయ నిర్మాణ కౌశలానికి పేరుగాంచినది. ఇక్కడి శివుడు "నీల లోహిత శివలింగం" రూపంలో భక్తులకు దర్శనమిస్తాడు. ఇక్కడ కొలువై ఉన్న స్వామిని శ్రీ రాజ రాజేశ్వర స్వామి అని, రాజన్న అని అంటారు. దేవాలయానికి ఉత్తరాన ధర్మగుండం అనే కోనేరు ఉంది. ఇక్కడ భక్తులు చేసే రకరకాల పూజల్లో ముఖ్యమైనది కోడెమొక్కు. భక్తులు కోడెలను తీసుకొచ్చి గుడి చుట్టూ ప్రదక్షిణ చేయించి ప్రాంగణంలో కట్టేసి ఆలయానికి దక్షిణగా ఇస్తారు. దీనివల్ల పాపాలు తొలిగిపోతాయని నమ్మకం. దీనికి దగ్గరలో 'భీమేశ్వరాలయం' చూడదగిన మరొక పెద్ద ఆలయం ఉన్నది. |
| 5. | జగిత్యాల జిల్లా, (హైదరాబాద్ నుండి దాదాపు 220 కి.మీ. దూరం ఉంది) | ధర్మపురి యోగ, ఉగ్ర లక్ష్మీనరసింహ క్షేత్రం | ధర్మపురి క్షేత్రంలో శ్రీనరసింహస్వామి లక్ష్మీ సమేతుడై స్వయంభూ విగ్రహంలో యోగాసీనుడై కోరమీసాలతో దర్శనమిస్తాడు. ఇది గోదావరి నదీ తీరంలో ఉన్న ప్రాచీన ప్రసిద్ధ నరసింహ పుణ్యక్షేత్రం. ప్రాకారం లోపల ఉగ్ర నరసింహస్వామి ఆలయం, యోగ నరసింహ స్వామి ఆలయం, వేంకటేశ్వర స్వామి ఆలయం, యమధర్మరాజు ఆలయం, బ్రహ్మదేవుని విగ్రహం ఉండడం ఈ ఆలయంలోని ప్రత్యేకత. నరసింహస్వామి ఆలయంతో పాటు దత్తాత్రేయ, సంతోషిమాత మందిరాలకు కూడా ప్రసిద్ధి చెందినది. |
| 6. | జయశంకర భూపాలపల్లి (హైదరాబాద్ నుండి 260 కి.మీ. దూరంలో ఉంది) | కాళేశ్వరం కాళేశ్వర ముక్తేశ్వర ఆలయం | ఒకే పానవట్టంపై రెండు లింగాలు వెలసిన శివాలయం. త్రిలింగ దేశంలో పేర్కొన్న మూడు శివలింగాలలో ఒకటి ఈ కాళేశ్వరం. తెలంగాణ మహారాష్ట్ర సరిహద్దులో, గోదావరి, ప్రాణహిత నదుల సంగమ ప్రదేశంలో ఉన్నది. ఒకే పానవట్టంపై ఉన్న రెండు లింగాలలో ఒకటి కాళేశ్వరుడుగా (శివుడు), మరొకటి ముక్తేశ్వరుడుగా (యముడు) కొలువబడుతున్నవి. |
| 7. | జోగులాంబ గద్వాల జిల్లా (హైదరాబాద్ నుండి 215 కి.మీ. దూరంలో ఉంది) | అలంపురం జోగులాంబ దేవాలయం | అష్టాదశ శక్తిపీఠాలలో ఐదవ శక్తి పీఠం. ఇది శ్రీశైలానికి పశ్చిమ ద్వారం. ఇక్కడ నవ బ్రహ్మాలయాలున్నాయి. ఇవన్నీ రసవాదానికి చెందినవి. జోగులాంబ, బాల బ్రహ్మేశ్వర స్వామి ప్రధాన దైవాలు. ఇది తుంగభద్ర నది తీరాన ఉన్నది. ఇది గద్వాల జోగులాంబ జిల్లాలో ఉన్నది. |

| క్ర.సం. | జిల్లా | క్షేత్రం పేరు / దేవి, దేవతల పేరు | విశేషాలు |
|---|---|---|---|
| 8. | రంగారెడ్డి జిల్లా (హైదరాబాద్ నుండి 28 కి.మీ. దూరంలో ఉంది) | చిలుకూరు (మొయినాబాద్ మండలం) బాలాజీ దేవాలయం | ఈ గుడి చాలా పురాతనమైనది. 10, 12 శతాబ్దాల్లో రాష్ట్రకూట, కళ్యాణి, పశ్చిమ చాళుక్యులు పాలనలో ఉండేదని చారిత్రక ఆధారాలు ఉన్నాయి. |
| 9. | కరీంనగర్ జిల్లా నుండి 35 కి.మీ. దూరంలో జగిత్యాలకు 15కి.మీ. దూరంలో ఉంది. | కొండగట్టు ఆంజనేయ స్వామి గుడి | ఆంజనేయస్వామి స్వయంభువుగా వెలిసిన క్షేత్రం ఇది. ఇది ఎత్తైన కొండమీద ఉన్నది. ఇక్కడి స్వామివారు సగం ఆంజనేయస్వామి ముఖం, సగం నరసింహ స్వామి ముఖంతో ఉత్తరాభిముఖుడై ఉన్నాడు. భక్తులు హనుమాన్ దీక్ష స్వీకరించి 41 రోజుల పాటు నిష్ఠలో ఉంటారు. దీనికి దగ్గరలో JNTU ఇంజనీరింగ్ కళాశాల ఉన్నది. కొండగట్టు అంజన్నపై భక్తితో కవులు శతకాలు కూడా రచించారు. |
| 10. | మంచిర్యాల జిల్లా (మంచిర్యాల నుండి సుమారు 50 కి.మీ. దూరంలో ఉంది.) | గూడెం సత్యనారాయణ స్వామి మందిరం | గోదావరి నదీ తీరంలో ఒక కొండమీద ఉన్న పుణ్యక్షేత్రం. తెలంగాణలోని ఏకైక ప్రాచీన సత్యనారాయణస్వామి ఆలయం ఉన్న క్షేత్రం గూడెం సత్యనారాయణస్వామి మందిరం చుట్టూ పచ్చని ప్రకృతి ప్రశాంతమైన వాతావరణంలో ఈ ఆలయం శోభిల్లుతున్నది. ఇక్కడ ప్రతిరోజు సత్యనారాయణ స్వామి వ్రతాలు జరిపిస్తారు. |
| 11. | సిద్ధిపేట జిల్లా (హైదరాబాదుకు 45 కి.మీ. దూరంలో ఉంది.) | వర్గల్ విద్యాధరి సరస్వతీ దేవి దేవాలయం | తెలంగాణలోని నిర్మల్ జిల్లాలో ఉన్న బాసర జ్ఞాన సరస్వతీ దేవాలయం తరువాత అంతటి ప్రాశస్త్యమైనది ఈ వర్గల్ విద్యాధరి సరస్వతీ దేవాలయం. ఇక్కడ తమ పిల్లల అక్షరాభ్యాసానికి అనేకమంది భక్తులు వస్తారు. ఇది కంచి కామకోఠి శంకరమఠం వారిచే నిర్వహింపబడుతున్నది. ఈ ఆలయ ప్రాంగణంలో వినాయకుని గుడి, శివునిగుడి, శనైశ్చరాలయాలు కూడా ఉన్నాయి. |
| 12. | మెదక్ జిల్లా (హైదరాబాదు నుండి 40 కి.మీ. దూరంలో ఉంది.) | నాచగిరి గుట్ట (నాచారం, నాచవరం) లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం | మెదక్ జిల్లాలో హరిద్రానదికి సమీపంలో నాచగిరి గుట్టపైన కొండల మధ్య గుహలో బండపైన స్వయంభువుగా వెలసిన నరసింహస్వామి దేవాలయం. ఈ నాచగిరి గుట్టను పూర్వం శ్వేతగిరి మరియు గార్గేయ తపోవనం అని పిలిచేవారు. అనేక శతాబ్దాల చరిత్ర ఉన్న పురాతన దేవాలయం ఇది. ప్రతి సంవత్సరం ఉగాదికి ఇక్కడ బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. |

| క్ర.సం. | జిల్లా | క్షేత్రం పేరు / దేవి, దేవతల పేరు | విశేషాలు |
|---|---|---|---|
| 13. | కామారెడ్డి జిల్లా (నిజామాబాద్ నుండి 17 కి.మీ. దూరంలో, దూరంలో ఉన్నది.) | డిచ్‌పల్లి రామాలయం | డిచ్‌పల్లి దేవాలయాన్ని "దక్షిణ భారత ఖజురహో", "ఇందూర్ ఖజురహో" అని కూడా పిలుస్తారు. ఈ దేవాలయ శిల్పసంపద అచ్చం ఖజురహోను పోలి ఉంటుంది. క్రీ.శ.14వ శతాబ్దంలో కాకతీయులు నిర్మించిన రామాలయం ఇది. డిచ్‌పల్లి రామాలయం చిన్నదే, అయినా కూడా అది అద్భుతమైనది. శిల్ప, వాస్తుకళల సౌందర్యానికి ప్రసిద్ధి చెందినది. |
| 14. | నల్గొండ జిల్లా (మిర్యాలగూడ నుండి 26 కి.మీ. దూరంలో ఉంది.) | వాడపల్లి లక్ష్మీ నరసింహ స్వామి | పవిత్ర కృష్ణా, మూసీ నదుల సంగమ క్షేత్రంలో వాడపల్లిలో ఉన్నది శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం. ఇది పంచనారసింహ (కృష్ణాతీర) క్షేత్రాలలో ఒకటి. ఇక్కడ ఉన్న మరొక పురాతన ఆలయం శ్రీ మీనాక్షి అగస్త్యేశ్వర ఆలయం. |
| 15. | నల్గొండ జిల్లా (వలిగొండ నుండి 13 కి.మీ. దూరంలో ఉంది.) | వలిగొండ మత్స్యగిరి లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం | ఇక్కడ కొండపై భాగాన బండలమధ్యలో చెరువు ఉంటుంది. ఆ చెరువులో నామాలు, మీసాలు కలిగిన చేపలు ఒకే పరిమాణంలో ఉంటాయి. అది ఇక్కడి ప్రత్యేకత. ఆ చేపల్లోనే నరసింహస్వామి వెలిశాడని, కావున ఇక్కడి స్వామికి మత్స్యగిరి నరసింహస్వామి అని పేరు వచ్చిందని. ఈ కొండకు మత్స్యగిరి అనే పేరు వచ్చిందని స్థానిక కథనం. పురాణ కథనం కూడా. |
| 16. | పెద్దపల్లి జిల్లా (గోదావరిఖని పట్టణమునకు 5 కి.మీ.) | సుందిళ్ళ యోగనృసింహ స్వామి క్షేత్రం | 13వ శతాబ్దంలో కాకతీయుల కాలమున నిర్మించబడినది. 'హిరణ్యకశ్యపుని' వధించి ఉత్తరాభిముఖంగా వెడుతున్న స్వామి వారిని ప్రహ్లాదుడు పిలువగానే తిరిగి బాలుని చూచి అలాగే స్వామి వారు యోగాసనంలో దక్షిణాభిముఖుడై వెలిశాడు. 28 సంవత్సరాల కిందట లక్ష్మీ అమ్మవారిని ప్రతిష్ఠించారు. 1 కి.మీ. దూరంలో కోనేరు ఉంది. అక్కడే కాకతీయుల శిలాశాసనం ఉంది. |
| 17. | పెద్దపల్లి జిల్లా (పెద్దపల్లి నుండి 30 కి.మీ. దూరంలో ఉంది.) | మంథని (మంత్రకూటం) గౌతమేశ్వర క్షేత్రం | గోదావరి తీరము. గౌతమ మహాముని స్థాపించిన గౌతమేశ్వర ఆలయంతో పాటు సరస్వతీ గుడి ఉంది. మహాలక్ష్మి గుడి, భిక్షేశ్వరుడు, ఓంకారేశ్వర ఆలయం, దత్తాత్రేయ మందిరాలతో పాటు అనేక దేవాలయాలు ఉన్నాయి. |

| క్ర.సం. | జిల్లా | క్షేత్రం పేరు / దేవి, దేవతల పేరు | విశేషాలు |
|---|---|---|---|
| 18. | మంచిర్యాల జిల్లా (మంచిర్యాల నుండి 39 కి.మీ. దూరంలో ఉంది.) | చెన్నూరు అంబా అగస్త్యేశ్వర క్షేత్రం | పంచక్రోశ ఉత్తరవాహినీ గోదావరి తీరం. అగస్త్య మహర్షి స్థాపించి అంబా అగస్త్యేశ్వరాలయం, జగన్నాథస్వామి ఆలయాలు ప్రసిద్ధమైనవి. అగస్త్యకుండం ఉంది. |
| 19. | వరంగల్ రూరల్ జిల్లా మంగపేట మండలం, మల్లూరుకు 4 కి.మీ. దూరం. (135 కి.మీ. దూరం వరంగల్‌కు) ఏటూరు నాగారం నుండి భద్రాచలం వెళ్ళే దారిలో ఉంటుంది. | శ్రీ హేమాచలం లక్ష్మీ నృసింహ స్వామి దేవస్థానం | ఇక్కడి స్వామివారు లక్ష్మీనృసింహస్వామి. అతి ప్రాచీన క్షేత్రం.<br>స్వామి వారి నాభి మెత్తగా ఉంటుంది. శరీరం నిండా రోమాలు ఉంటాయి. ఇక్కడి కుంటలు, చెరువులు, అగడ్తలు మొదలగువాటిలో నీరు పుష్కలంగా ఉంటాయి. ఇక్కడి చింతామణి ధారలోని నీరు ఔషధ గుణాలు కలిగి ఉంది. వైశాఖ మాసంలో బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. |
| 20. | సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం (హైదరాబాద్ నుండి 160 కి.మీ.) | ఝరాసంఘం కేతకీ సంగమేశ్వర స్వామి మందిరము | ఇక్కడ సంగమేశ్వర స్వామి ప్రధాన దైవం. బాణ లింగాకారంలో, జలం మధ్యలో పార్వతి అమ్మవారితో కూడుకొని లింగం ఉన్నది. ఇక్కడ కోనేరులో పవిత్ర స్నానాలు చేస్తారు. కాశీలోని ఝర (పాయ) ఒకటి ఈ కోనేరులో కలుస్తుందని వీరి నమ్మకం. |
| 21. | మహబూబ్‌నగర్ జిల్లా (అచ్చంపేట మండలం) | ఉమామహేశ్వర క్షేత్రం | ఇది శ్రీశైలానికి ఉత్తర ద్వార క్షేత్రమని ప్రసిద్ధి. ఉమా మహేశ్వరుడు, ఉమాదేవి ప్రధాన దైవాలు. పాపనాశినిలో స్నానం చేసి భక్తులు దైవాన్ని దర్శనం చేసుకుంటారు. ఆలయ శిల్పకళ ఉట్టిపడేవిధంగా ఉంటుంది. |



## పర్యాటక కేంద్రాలు/ విహార యాత్ర స్థలాలు

| క్ర.సం. | జిల్లా | పర్యాటక కేంద్రం పేరు | విశేషాలు |
|---|---|---|---|
| 1. | వరంగల్ జిల్లా (హైదరాబాదు నుండి 140 కి.మీ. దూరంలో ఉన్నది.) | వేయిస్తంభాల గుడి | ఇది కాకతీయుల కాలంనాటి ప్రసిద్ధ చారిత్రక కట్టడం. అప్పటి కళాకారుల శిల్ప కళానైపుణ్యానికి నిదర్శనం. క్రీ.శ.1175–1324 మధ్యకాలంలో ఓరుగల్లును పరిపాలించిన గణపతిదేవుడు, రుద్రమదేవి, ప్రతాపరుద్రుల ఆధ్వర్యంలో నిర్మింపబడింది. ఇది అనేక లింగాలతో అలంకరింపబడిన నక్షత్ర ఆకారపు వేదికపై నిర్మింపబడింది. ఇందులో శివుడికి, విష్ణువుకు, సూర్యుడికి అంకితం చేసిన త్రికూటాలయం ఉన్నది. భారత పురావస్తు పరిశోధనశాఖ దీని పునరుద్ధరణ పనులు చేపట్టింది. |
| 2. | జయశంకర భూపాలపల్లి జిల్లా. (హైదరాబాదు నుండి 142 కి.మీ. దూరంలో ఉన్నది.) | పాలంపేట రామప్ప గుడి | క్రీ.శ.1213 సం॥లోని శాసనాల ఆధారంగా ఈ ఆలయం కాకతీయ రాజు గణపతిదేవుడి పాలనలో రేచర్ల రుద్రుడు నిర్మించినట్లు తెలుస్తుంది. ఇక్కడి ప్రధానదైవం రామలింగేశ్వర స్వామి. రామప్ప అనే శిల్పి ఈ గుడి అందంగా చెక్కడం వల్ల దీనిని ఈయన పేరుతో 'రామప్పగుడి' అని పిలుస్తారు. ఈ అద్భుత కట్టడం నిర్మించడానికి 40 సం॥ల సుదీర్ఘకాలం పట్టిందని చరిత్ర చెబుతోంది. ఇక్కడి మరో అద్భుతం ఏమిటంటే దీనికి ఉపయోగించిన ఇటుకలు అతి తేలికై నీటిలో తేలియాడుతాయి. ఇది మరెక్కడా కానరాదు. |
| 3. | యాదాద్రి భువనగిరి జిల్లా (హైదరాబాదుకు 65 కి.మీ. దూరంలో ఉన్నది.) | కొలనుపాక జైన మందిరం | క్రీ.పూ.4వ శతాబ్దకాలంలో తెలుగు రాష్ట్రాలలో జైనమతం విస్తృతంగా వ్యాపించి ఉండేది. రాష్ట్రకూటుల పాలన కాలంలో జైనమతం బాగా అభివృద్ధి చెందినది. జైనులకు చెందిన శాసనాలు దాదాపు 20 వరకు ఇక్కడ కనుగొన్నారు. మహావీర్ జైనుడి 140 సెం.మీ. ఎత్తుగల ఏకశిలా విగ్రహం ఈ మందిరంలో ప్రతిష్టించారు. "మహావీర్ జైన్" జయంత్యుత్సవాలు ఇక్కడ ఘనంగా జరుగుతాయి. ఈ మందిరం నిర్మాణ కౌశలత్వానికి ప్రసిద్ధి చెందినది. |
| 4. | యాదాద్రి భువనగిరి జిల్లా (హైదరాబాదుకు 65 కి.మీ. దూరంలో ఉన్నది.) | కొలనుపాక ఛాయాసోమేశ్వర ఆలయం | కొలనుపాక గ్రామంలో ఛాయాసోమేశ్వరుని పేరుతో అతి పురాతన శివాలయం ఉన్నది. ఇక్కడ శివుడు ఇతర శివాలయాలలో ఉండే విధంగా లింగాకారంలో కాకుండా మానవ రూపంలో పూజలం– దుకుంటాడు. ఇదే ఈ ఆలయం ప్రత్యేకత. |
| 5. | మెదక్ జిల్లా (హైదరాబాదుకు 80 కి.మీ. దూరంలో ఉన్నది.) | మెదక్ కాథడ్రల్ చర్చి | ఆసియా ఖండంలోకెల్లా అతిపెద్ద చర్చి. ప్రపంచంలోని అతిపెద్ద చర్చిల్లో ఇది రెండవది. ఈ చర్చి చార్లెస్ వాకర్ పోస్నేట్ ఆధ్వర్యంలో నిర్మింపబడింది. చర్చి నిర్మాణమంతా కూడా గోతిక్ పునరుద్ధరణ శైలిలో జరిగింది. ఇది 200 అడుగుల పొడవు, 100 అడుగుల వెడల్పుతో ఉన్నది. దీని నిర్మాణానికి ఉపయోగించిన మొజాయిక్ టైల్స్ బ్రిటన్ నుండి దిగుమతి చేసుకొన్నారు. ఇక్కడి గంట స్తంభం (Bell-tower) 175 అడుగుల ఎత్తులో ఉన్నది. |

| క్ర.సం. | జిల్లా | పర్యాటక కేంద్రం పేరు | విశేషాలు |
|---|---|---|---|
| 6. | ఖమ్మం జిల్లా | నేలకొండపల్లి | "నేలకొండపల్లి" అనే చారిత్రక కట్టడం దాదాపు వంద ఎకరాల విస్తీర్ణంలో మట్టికోట గోడతో చుట్టబడి ఉన్న ప్రదేశం. చారిత్రక మరియు సాంస్కృతిక ప్రాముఖ్యత కలిగిన పురావస్తు ప్రదేశాలు ఇక్కడ ఉన్నాయి. స్థానిక హిందూ జానపద సంప్రదాయం ప్రకారం, మహాభారతంలోని కొన్ని సంఘటనలకు సంబంధించిన విరాటరాజు దిబ్బ మరియు కీచక గుండంగా కూడా ఈ ప్రదేశాన్ని వ్యవహరిస్తారు.<br>అంతేకాక ఈ ప్రదేశం (భక్త రామదాసు) కంచర్ల గోపన్న జన్మస్థలం 1955వ సంవత్సరంలో ఇక్కడ భక్త రామదాసుస్మారక భవనం నిర్మించారు. |
| 7. | పెద్దపల్లి జిల్లా (పెద్దపల్లి నుండి 20 కి.మీ. దూరంలో ఉన్నది.) | ధూళికట్ట | పెద్దపల్లి జిల్లాలో ఉన్న మరొక పురాతన బౌద్ధ క్షేత్రం ధూళికట్ట. ఇక్కడి ముఖ్యమైన అవశేషాలు, కళాఖండాలు శాతవాహన కాలం నాటి మూలాలను గుర్తుకుతెస్తాయి. మెగస్తనీస్ పురాతన వృత్తాంతంలో ప్రస్తావించిన 30 మెట్రోపాలిటన్ ప్రాంతాలలో ధూళికట్ట ఒకటిగా గుర్తింపబడింది. తవ్వకాలలో వెలుగు చూసిన వాటిలో చాలా ముఖ్యమైనవి మట్టిదిబ్బపై ఉన్న బుద్ధ స్థూపం మరియు ఒక విహారం. ఇవి రెండు క్రీ.పూ. 2వ, 3వ శతాబ్దాలకు చెందినవిగా గుర్తించారు. అందరూ చూడదగిన అందమైన ఈ బౌద్ధ క్షేత్రం హైదరాబాద్‌కు 197 కి.మీ. దూరంలో ఉన్నది. |
| 8. | నల్గొండ జిల్లా (నల్గొండ నుండి 56 కి.మీ. దూరంలో ఉన్నది.) | నాగార్జున సాగర్ ఆనకట్ట | తెలంగాణలో ప్రతి ఒక్కరు చూడదగిన ప్రాజెక్టు నాగార్జున సాగర్ ప్రాజెక్టు. నల్లగొండ జిల్లాలో కృష్ణానది మీద నిర్మించిన ఈ ఆనకట్ట ప్రపంచంలోనే అతి ఎత్తైన రాతి కట్టడం. దీనికి సమీపంలోని నాగార్జున కొండలో పురావస్తు శాఖ జరిపిన తవ్వకాలలో క్రీ.శ.1-3 శతాబ్ద కాలంనాటి అనేక బౌద్ధ శిల్పాలు దొరికినవి. వీటిలో అక్కడ ఒక మ్యూజియం ఏర్పాటు చేశారు.<br>నాగార్జునసాగర్ భారతదేశంలో రెండవ అతిపెద్ద బహుళార్థ సాధక ప్రాజెక్టు. సాగునీటితో పాటు విద్యుదుత్పత్తికి ఉపయోగపడే ప్రాజెక్టు ఇది. ఇక్కడ రోజు 810 మెగావాట్ల విద్యుదుత్పత్తి అవుతుంది. విహారయాత్రకు అనువైన చక్కటి ప్రదేశం ఇది. |
| 9. | మహబూబ్‌నగర్ జిల్లా (మహబూబ్‌నగర్ నుండి 4 కి.మీ. దూరంలో ఉన్నది.) | పిల్లలమర్రి చెట్టు | మహబూబ్ నగర్ జిల్లా చిహ్నమైన పిల్లలమర్రి ఒక పెద్ద మర్రిచెట్టు. సుమారు 800 సంవత్సరాల కాలంనాటి ఈ మర్రి వృక్షం పరిమాణంలో భారతదేశంలో మూడవది. ఈ చెట్టు 3 ఎకరాల స్థలంలో విస్తరించి ఉంది. వందల సం॥ల నుంచి ప్రకృతి వైపరీత్యాలను తట్టుకొని నిలబడి ఇది మహావృక్షమైంది. ఈ చెట్టు ప్రధానకాండం ఎక్కడుందో చెప్పడం కష్టం. ఇక్కడొక జంతుప్రదర్శన శాల, పురావస్తు మ్యూజియం, జింకల పార్కు, అక్వేరియం మొదలగునవి చూపరులను ఆకట్టుకొంటున్నాయి. |

| క్ర.సం. | జిల్లా | పర్యాటక కేంద్రం పేరు | విశేషాలు |
|---|---|---|---|
| 10. | వికారాబాద్ జిల్లా (హైదరాబాద్ నుండి 90 కి.మీ. దూరంలో ఉన్నది.) | వికారాబాద్ అనంతగిరి కొండలు | అనంతగిరి కొండలు తెలంగాణ ఊటీగా పేరు పొందినవి. వికారాబాద్ నుంచి కేవలం 6 కి.మీ. దూరంలో ఉన్న ఈ అనంతగిరి పుణ్యక్షేత్రంగా, పర్యాటక కేంద్రంగా విలసిల్లుతోంది. ప్రకృతి రమణీయత ఉట్టిపడేలా ఉన్న ఈ ప్రాంతంలోని కొండలు, అడవి అందాల మధ్య అనంత పద్మనాభస్వామి ఆలయం అందరినీ ఆకట్టుకొంటుంది. ఈ ఆలయానికి కిలోమీటరున్నర దూరంలో బుగ్గ రామలింగేశ్వర ఆలయం ఉంది. అక్కడ అందమైన జలపాతం వర్షాకాలంలో సందర్శకులను అలరిస్తుంది. కొండలపైకి ఎక్కే ట్రెక్కింగ్ మొదలైన సాహస కృత్యాలు చేసే వారికి ఇది చక్కటి ప్రదేశం. |
| 11. | సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం (సూర్యాపేట నుండి 26 కి.మీ. దూరంలో ఉన్నది.) | ఫణిగిరి బౌద్ధ క్షేత్రం | 2000 సంవత్సరాల చరిత్ర కలిగి ఉన్నది. ఇక్ష్వాకులు, శాతవాహనుల కాలంలో వెలుగొందింది. 1944లో నిజాం ప్రభుత్వం అతి పెద్ద బౌద్ధ క్షేత్రమని ప్రకటించింది. ఇక్కడ బౌద్ధ యూనివర్సిటీ ఉండేదని చెబుతారు. స్థూపాలు, చైత్య గృహాలు, నాణేలు, విహార గదులు, మండపాలు తవ్వకాల్లో బయటపడ్డాయి. బుద్ధుని పాదాలు, జాతక కథలు శిలలపై, స్థంభాలపై చెక్కబడి ఉన్నాయి. ప్రాచీన బౌద్ధ క్షేత్రంగా వర్ధిల్లిన ఫణిగిరి చూడదగ్గ పర్యాటక కేంద్రం. |

ఫణిగిరి



## తెలంగాణలోని సుందర జల దృశ్యాలు

| క్ర.సం. | జిల్లా | జలదృశ్యం పేరు | విశేషాలు |
|---|---|---|---|
| 1. | ఆదిలాబాద్ జిల్లా | "కుంటాల" జలపాతం | మన రాష్ట్రంలోని అతి ఎత్తయిన జలపాతం 'కుంటాల' ఉత్తర సహ్యాద్రి పర్వతశ్రేణుల్లో ఎత్తయిన కొండల నడుమ కడెం నదిపై ఉన్నది. పూర్వం శకుంతలా, దుష్యంతుల కథలోని శకుంతల ఇక్కడ నివాసముండుటచే దీనిని 'కుంతల' అని పిలిచేవారు. రానురాను ఇది 'కుంటాల'గా మారింది. ఈ జలపాతం నిర్మల్ నుండి ఆదిలాబాద్ వెళ్ళే 44వ జాతీయ రహదారి మీద ఉన్న నేరెడిగొండ మండల కేంద్రానికి 12 కి.మీ. దూరంలో ఉన్నది. ఇక్కడ గుహలో ఉన్న శివలింగానికి గిరిజన ప్రజలు ప్రతి శివరాత్రి రోజు పూజలు నిర్వహిస్తారు. దేశవిదేశాల నుండి పర్యాటకులు వస్తారు. |
| 2. | ఆదిలాబాద్ జిల్లా (నిర్మల్ నుండి 37 కి.మీ. దూరంలో ఉన్నది.) | పొచ్చెర జలపాతం | మహారాష్ట్రలో ఆవిర్భవించిన గోదావరి నది సహ్యాద్రి పర్వత శ్రేణుల మధ్య నుండి దట్టమైన అడవులగుండా ప్రయాణిస్తూ తెలంగాణ రాష్ట్రంలో పొచ్చెర జలపాతంగా మారుతుంది. 20 అడుగుల ఎత్తుమీది నుండి పారే ఈ జలపాతం చేసే నీటి సవ్వడులు అడవి అంతా ప్రతిధ్వనిస్తాయి. ఇక్కడి నీరు స్ఫటికమంత స్వచ్ఛంగా, పారదర్శకంగా ఉంటుంది. దట్టమైన అడవుల మధ్యలో ఉండటంచేత చాలా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. |
| 3. | ఖమ్మం జిల్లా (హైదరాబాద్ నుండి 329 కి.మీ. దూరంలో ఉన్నది.) | బోగత జలపాతం | ఈ జలపాతం వాజేడు మండలంలోకి బోగత గ్రామంలో ఉన్నది. జులై నుండి నవంబర్ వరకు ఇక్కడ భారీగా నీటి దూకుడు కనిపిస్తుంది. తెలంగాణ రాష్ట్రంలో ఇది రెండవ ఎత్తైన జలపాతం. చుట్టూ కత్తిరించినట్లుగా ఉన్న శిలల మీది నుంచి పారుతున్న ఈ జలపాతం తెలంగాణ 'నయాగరా' లాగ కనిపిస్తుంది. సాహస కృత్యాలు చేయాలనే అభిలాష ఉన్నవారికి ఇది ఒక అద్భుతమైన ప్రదేశం. |
| 4. | మహబూబ్ నగర్ జిల్లా (హైదరాబద్ నుండి 185 కి.మీ. దూరంలో ఉన్నది.) | మల్లెల తీర్థం జలపాతం | ఇది నల్లమల అడవుల్లోని కొండల మధ్యలో 50 అడుగుల ఎత్తు నుండి జాలువారే జలపాతం. దీనిని చేరుకోవడానికి కొండల మధ్య ఉన్న లోయ లోపలికి దాదాపు 300 పైగా మెట్లుదిగి వెళ్లాలి. ఈ జలపాతం పైన (భూమిపైన), చుట్టుపక్కల జనం నీరు లేక అల్లాడిపోతుంటారు. లోపల మాత్రం జలఊట మహాద్భుతంగా ఉంటుంది. ఇది ప్రకృతిలీలలకు ప్రతిబింబంగా కనిపిస్తుంది. పురాణ గాథల ప్రకారం అర్జునుడు మల్లెపూలతో ఇక్కడ పరమేశ్వరుడిని పూజించినందుకు దీనికి మల్లెల తీర్థం అనే పేరు వచ్చిందని చెప్తారు. |
| 5. | ఆదిలాబాద్ జిల్లా (హైదరాబాద్ నుండి 250 కి.మీ. దూరంలో ఉన్నది.) | గాయత్రి జలపాతం (లేదా) 'గాడిదగుండం' జలపాతం | నేరెడిగుండలోని దట్టమైన అడవుల మధ్యలో ఉన్న ఈ జలపాతాన్ని చేరుకోవడానికి అడవులు, గుట్టలు, లోయల్లో 3 కి.మీ. నడవాల్సి ఉంటుంది. దీనికి 'మెక్కుడు గుండం' 'ముక్కడి గుండం' అనే పేర్లు కూడా ఉన్నాయి. గాడిలో నుంచి దుంకుతుంది కాబట్టి గాడిదగుండం అని అంటారు. |

| క్ర.సం. | జిల్లా, గ్రామం | క్షేత్రం పేరు | విశేషాలు |
|---|---|---|---|
| 6. | ఆదిలాబాద్ జిల్లా (ఆదిలాబాద్ నుండి 51 కి.మీ. నిర్మల్ నుండి 54 కి.మీ. దూరంలో ఉన్నది.) | కనకాయి, గొలుగుల, చీకటిగుండం జలపాత సమూహం | కుంటాల జలపాతం నుండి 35 కి.మీ. దూరంలో ఇవి కూడ కడెం నది మీది జలపాతాలే. కడెం నది చుట్టూ చాలా జలపాతాలున్నాయి. వాటిలో ముఖ్యంగా మూడు జలపాతాల సమూహం ఇది. |
| 7. | మెదక్ జిల్లా జహీరాబాద్ (హైదరాబాద్‌కు దాదాపు 110 కి.మీ. దూరంలో ఉన్నది.) | ఎత్తిపోతల జలపాతం జహీరాబాద్ | మెదక్ జిల్లాలో ఉన్న జహీరాబాద్ దగ్గర కూడా ఎత్తిపోతల జలపాతం ఉన్నది. ఇది రాతి మట్టి గుట్టల మీది నుంచి దూకుతుంది. జహీరాబాద్ రైల్వేట్రాక్ దాటిన వెంటనే ఎడమ వైపుకి తిరిగి పర్వతాపూర్, ఉప్పుతండాలు దాటి ఎత్తిపోతలను చేరుకోవచ్చు. |
| 8. | జయశంకర్ భూపాలపల్లి జిల్లా (హైదరాబాద్‌కు 212 కి.మీ. దూరంలో ఉన్నది.) | లక్నవరం చెరువు | ఈ చెరువును కాకతీయ రాజులు తవ్వించారు. ఈ చెరువులో 13 ద్వీపాలు ఉన్నాయి. రాష్ట్రపర్యాటక సంస్థ మూడు ద్వీపాలను కలుపుతూ రోప్‌వే ఏర్పాటు చేసింది. చెరువులో ప్రయాణం చేయడానికి బోటింగ్ సౌకర్యం కూడా కల్పించింది. |
| 9. | వరంగల్ జిల్లా (వరంగల్ నుండి 80 కి.మీ. దూరంలో ఉన్నది.) | పాకాల చెరువు | క్రీ.శ.1213లో కాకతీయ రాజులు తవ్వించిన చెరువు. ఇది దట్టమైన అరణ్యం మధ్యలో ఈ చెరువును తవ్వించారు. కాకతీయ నిర్మాణ కౌశలత్వానికి ప్రజల పట్ల వారు చూపే ఆదరాభిమానాలకి ఈ చెరువులు సాక్ష్యం. |
| 10. | నిజామాబాద్ జిల్లా (నిజామాబాద్ నుండి దాదాపు 100 కి.మీ. దూరంలో ఉన్నది.) | నిజాంసాగర్ డ్యాం | పోచారం నుంచి గోపాల్‌పేట మీదుగా సుమారు 20 కి.మీ. ప్రయాణించి నిజాంసాగర్ అంచున ఉన్న త్రిలింగ రామేశ్వరాలయం చూస్తారు. అక్కడి నుంచి 22 కి.మీ. దూరంలో నిజాం సాగర్ డ్యాం ఉన్నది. డ్యాం కట్టమీద నడుస్తూ నిండుగా ఉన్న నీటి సౌందర్యాన్ని చూడవచ్చు. నీటిలో బోటు షికారు చేసి విద్యుత్ ప్లాంట్‌ను, నదీద్వీపం (రివర్ ఐలాండ్)ను చూడవచ్చు. |


బొగత జలపాతం

## హైదరాబాద్‌లోని దర్శనీయ స్థలాలు

| క్ర.సం. | దర్శనీయ స్థలం పేరు | విశేషాలు |
|---|---|---|
| 1. | చార్మినార్ | హైదరాబాద్ అనగానే ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చిన చిహ్నం "చార్మినార్". 1591వ సం॥లో హైదరాబాదులో ప్లేగు వ్యాధి నిర్మూలనకు గుర్తుగా ఒక స్మారక కట్టడంగా దీనిని నిర్మించారు. ఉర్దూలో 'చార్' అంటే నాలుగు, మినార్ అంటే "స్థూపాలు" అని అర్థం. నాలుగు స్థూపాలను కలిగి ఉంది కావున దీనిని "చార్మినార్" అంటారు. ఇది హైదరాబాద్‌లోని ప్రముఖ వ్యాపార సముదాయం (షాపింగ్ సెంటర్) గా కూడా పేరుకెక్కింది. |
| 2. | సాలార్‌జంగ్ మ్యూజియం | భారతదేశంలోని 3 అతి పెద్ద జాతీయ సంగ్రహాలయాలలో "సాలార్ జంగ్ మ్యూజియం" ఒకటి. ఇందులోని వస్తు సముదాయాన్ని నిజాం నవాబు "మీర్ యూసుఫ్ అలీ ఖాన్ సాలార్‌జంగ్ III" ప్రపంచ నలుమూలల నుండి సేకరించాడు. వీటిలో అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకున్నది 'రెబెక్కా' పాలరాతి శిల్పం. గంటలు కొట్టే గడియారం, 'మెఫిస్టోఫిలిప్స్' అనే రెండు రూపాల చెక్క శిల్పం. |
| 3. | బిర్లా మందిర్<br>బిర్లాసైన్ మ్యూజియం<br>బిర్లా ప్లానిటేరియం | హైదరాబాద్‌లోని రవీంద్ర భారతికి దగ్గరలో చిన్న కొండపై నిర్మించిన శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం "బిర్లామందిర్". ఈ మందిరం పూర్తిగా అంటే, కింద మెట్లు దగ్గర నుండి మొదలుకొని ఆలయ గోపుర శిఖరం దాకా తెల్లటి పాలరాతి రాళ్ళతో నిర్మించారు. దీని పక్కనే బిర్లా సైన్స్ మ్యూజియం, బిర్లా ప్లానిటేరియంలు కూడా ఉన్నాయి. మందిరం పైనుండి చూస్తే హుస్సేన్ సాగర్, బుద్ధ విగ్రహం, అసెంబ్లీ, రవీంద్ర భారతి వంటివి అన్నీ ఎంతో అందంగా కనిపిస్తాయి. |
| 4. | నెహ్రూజులాజికల్ పార్క్ | మీర్ ఆలం టాంక్ సమీపంలో 380 ఎకరాల స్థలంలో తెలంగాణలోని పెద్ద జంతుప్రదర్శన శాల ఉన్నది. అనేక రకాలైన జంతువులను, అరుదైన జీవజాతులెన్నో ఇక్కడ మనం చూడవచ్చు. అడవి జంతువుల మధ్య తిరగటానికి "సఫారీరన్ ట్రిప్", పార్క్ చుట్టూ తిరిగే రైలు, సీతాకోక చిలుకల పార్క్, దీని చరిత్రకు సంబంధించిన మ్యూజియం ఈ జంతు ప్రదర్శన శాలకు అదనపు ఆకర్షణలు. |
| 5. | మక్కామసీదు | ఇది హైదరాబాదులో చార్మినార్ సమీపంలో ఉన్నది. దీనిలో ఒకేసారి 10,000 మంది ప్రార్థన చేసే వీలుంది. ఈ మసీదు నిర్మాణంలో ఇస్లాముల పుణ్యక్షేత్రమైన 'మక్కా' నుండి తెప్పించిన ఇటుకను ఉంచడంవల్ల దీనికి "మక్కామసీదు" అని పేరు వచ్చింది. |
| 6. | చౌమహల్లా ప్యాలెస్ | నిజాం రాజులు హైదరాబాద్‌ను పరిపాలించే కాలంలో వారి అధికారిక నివాసం ఈ చౌమహల్లా ప్యాలెస్. నియో శాస్త్రీయ శైలిలో కట్టబడిన ఈ రాజభవనం దాని సుందరమైన నిర్మాణాత్మక శైలికి, అందమైన చెక్కడాలకు ప్రాముఖ్యత సంతరించబడింది. |

| క్ర.సం. | దర్శనీయ స్థలం పేరు | విశేషాలు |
|---|---|---|
| 7. | ఫలక్‌నుమా ప్యాలెస్ | ఫలక్‌నుమా ప్యాలెస్ 32 ఎకరాల స్థలంలో నిర్మించిన అందమైన రాజభవనం. 'ఫలక్‌నుమా' అంటే "ఆకాశానికి అద్దం" అని అర్థం. ఈ అందమైన కట్టడం ప్రస్తుతం హోటల్‌గా మారంది. |
| 8. | కీసరగుట్ట | హైదరాబాదు శివారులో 30 కి.మీ. దూరంలో ఉన్న రామలింగేశ్వర ఆలయం ఈ కీసరగుట్ట. ఈ ఆలయాన్ని 17వ శతాబ్దంలో గోల్కొండ రాజుల మంత్రులు అక్కన్న మాదన్నలు పునరుద్ధరించారు. విష్ణుకుండిన రాజు మాధవవర్మ 5వ శతాబ్దంలో అనేక మంది రాజులపై యుద్ధాల్లో గెలిచి ఒక్కొక్క విజయానికి గుర్తుగా ఒక్కొక్క శివలింగ ప్రతిష్ఠ చేస్తూపోగా అతని విజయాలకు గుర్తుగా కీసరగుట్టపై అనేక శివలింగాలు కనిపిస్తున్నాయి. |

తెలంగాణ రాష్ట్రంలో పైన పేర్కొన్నవే కాకుండా ఇంకా అనేక పుణ్యక్షేత్రాలు, విహార యాత్రా స్థలాలు, పర్యాటక కేంద్రాలు, చారిత్రక కట్టడాలు అనేకం ఉన్నాయి. వీటితో పాటు అనేక కోటలు కూడ ఈ రాష్ట్రంలో నెలవై ఉన్నాయి.

ఇక్కడ ప్రస్తావించినవి కాక మరికొన్ని దర్శనీయ స్థలాలు కింది సూచికలో చూడవచ్చు.

* **ఆదిలాబాద్, నిర్మల్, కుమ్రంభీం, మంచిర్యాల జిల్లాలో ఉన్నవి**
  - కవ్వాల్ వైల్డ్ లైఫ్ సాంక్చ్యురీ
  - జైనథ్ మందిరం
  - కడెం ఆనకట్ట
  - ప్రాణహిత వైల్డ్ లైఫ్ సాంక్చ్యురీ
  - కదిలె (Kadile) పాపహరేశ్వర్ మందిరం
  - నిర్మల్‌కోట
* **నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలలోనివి**
  - అలీసాగర్ రిజర్వాయర్
  - సారంగపూర్, గండి హనుమాన్ ఆలయాలు
  - ఖిల్లా టెంపుల్
  - డిచ్‌పల్లి రామాలయం
  - బడాపహాడ్ దర్గ
  - నిజామాబాద్ కోట
  - నిజామాబాద్ డామ్
  - పోచారం సాంక్చ్యురీ
* **మహబూబ్‌నగర్, జోగులాంబ గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాలలోనివి**
  - శ్రీ రంగనాయకస్వామి గుడి
  - రాజోలిబండ డామ్
  - బాబా తలాబ్
  - కోయిల్ సాగర్ డాం, సరళాసాగర్ ప్రాజెక్టు
  - వనపర్తి కోట
  - కురుమూర్తి వెంకటేశ్వర ఆలయం
  - మన్నెంకొండ వెంకటేశ్వర ఆలయం
  - పడమటి ఆంజనేయ స్వామి ఆలయం, మక్తల్
* **మెదక్, సంగారెడ్డి, సిద్ధిపేట జిల్లాలలోనివి**
  - మెదక్ కోట
  - పోచారం రిజర్వాయర్
  - కోటి లింగేశ్వరస్వామి (సిద్ధిపేట)
  - గొట్టంగుట్ట
  - అల్లాదుర్గ
  - మహేశ్వరం పిరమిడ్
  - రత్నాలయం
  - బొంతపల్లి వీరభద్ర ఆలయం
* **కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న (సిరిసిల్ల) జిల్లాలలోనివి**
  - దిగువ మానేరు డామ్
  - ఎలగందుల కోట
  - బీర్‌పూర్ నరసింహాలయం
  - నగునూరు కోట
  - కోటిలింగాల
  - ఎన్.టి.పి.సి. రామగుండం

- ఎల్.మడుగు, మంథని, మొసళ్ళ పెంపక కేంద్రం

* **వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్, మహబూబాబాద్, జయశంకర్ (భూపాలపల్లి) జనగామ, జిల్లాలలోనివి**
  - భద్రకాళి గుడి
  - ఓరుగల్లు కోట
  - కాకతీయ మ్యూజికల్ గార్డెన్
  - జఫర్‌ఘడ్ నరసింహాలయం
  - పాండవుల గుట్ట

* **ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనివి**
  - ఖమ్మం కోట
  - కల్లూరు
  - పేరంటాల పల్లి
  - పాపికొండలు
  - కంభం నరసింహాలయం, ఖమ్మం
  - కిన్నెరసాని వైల్డ్ లైఫ్ సాంక్చ్యురి
  - లాకారం కొలను
  - గుండాల
  - కె.టి.పి.ఎస్., పాల్వంచ
  - పర్ణశాల

* **నల్గొండ, యాదాద్రి (భువనగిరి), సూర్యాపేట జిల్లాలోనివి**
  - ఛాయా సోమేశ్వరాలయం
  - జాన్‌పహాడ్ సైదుల దర్గ
  - రాచకొండ కోట
  - భువనగిరి కోట
  - కాపురాల గుట్ట
  - బుద్ధవనం

* **రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్ జిల్లాలోనివి**
  - చిలుకూరు బాలాజీ దేవాలయం
  - ఓషియన్ పార్క్
  - గండిపేట చెరువు
  - మృగవాని నేషనల్ పార్క్
  - ఢోలారి ధని
  - మహావీర్ హరిణ వనస్థలి
  - శిల్పారామం, శిల్పకళావేదిక
  - కర్మన్‌ఘాట్ హనుమాన్ గుడి
  - రామోజీ ఫిల్మ్ సిటీ
  - దుర్గం చెరువు
  - సంఘి టెంపుల్
  - తాడ్‌బండ్ హనుమాన్ గుడి

* **హైదరాబాద్ జిల్లాలోనివి**
  - హుస్సేన్ సాగర్ (బుద్ధ విగ్రహం)
  - హైటెక్ సిటీ
  - గోల్కొండ కోట
  - జలవిహార్
  - ఎన్.టి.ఆర్.గార్డెన్
  - బిర్లా సైన్స్ మ్యూజియం
  - తారామతి బారాదరి
  - హైకోర్ట్
  - ఉస్మానియా యూనివర్సిటీ
  - జియాగూడలోని రంగనాథస్వామి ఆలయం
  - జంతు ప్రదర్శన శాల
  - టాంక్‌బండ్ & నెక్లెస్‌రోడ్
  - లుంబినీ పార్క్
  - స్టేట్ సెంట్రల్ లైబ్రరీ
  - కుతుబ్ షాహి టూంబ్స్
  - నిజాం మ్యూజియం
  - తెలంగాణ రాష్ట్ర పురావస్తు మ్యూజియం
  - అసెంబ్లీ
  - బ్రిటిష్ రెసిడెన్సి (ప్రస్తుత కోఠి ఉమెన్స్ కాలేజి)
  - పైగా టూంబ్స్
  - అల్వాల్ బాలాజీ మందిరం

మొదలగునవెన్నో అందమైన, పవిత్రమైన, చారిత్రక ప్రాశస్త్యం కలిగిన ప్రదేశాలు తెలంగాణ రాష్ట్రంలో ఉన్నాయి. అందుకే బంగారు తెలంగాణ–కోటి రతనాల వీణ.

# 12. తెలంగాణ కోటలు

తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాలు, వైభవం, గొప్పదనం, నాగరికత మొదలైన వాటి గురించి తెలియజెప్పే ఆనవాళ్ళు మనకు తెలియనివి ఎన్నో తెలంగాణలో ఉన్నాయి. అలాంటి వాటిని పరిశీలించినట్లయితే 'కోటలు' ప్రముఖ పాత్ర వహిస్తాయి. ఎందుకంటే ఈ కోటలలో అప్పటి రాజులు వేయించిన శాసనాలు, నాణాలతోపాటు వారు రాజ్యపరిపాలన సాగించినతీరుతెన్నులు, శత్రుదుర్భేద్యంగా నిర్మించిన రాతి గోడలు, అబ్బురపరిచే వాటి నిర్మాణశైలి మొదలైన ఎన్నో ఈ కోటల ద్వారా తెలుస్తాయి. అంతేకాకుండా ఏయే రాజవంశీయులు తెలంగాణ ప్రాంతాన్ని పరిపాలించారో వారి ఆచార వ్యవహారాలు, వారు వాడిన వస్తువులు, దుస్తులు, ఆయా రాజుల కళాపోషణ, నాటి శిల్పకళా వైభవం, అద్భుతమైన రాతికట్టడాలు మొదలైనవి గత చరిత్రకు సాక్షీభూతంగా ఈ కోటలలో నెలకొని ఉన్నాయి. అయితే ఇప్పుడు చాలా వరకు కోటలు శిథిలావస్థలో ఉన్నాయి. కొన్ని కోటలు పర్యాటక కేంద్రాలుగా మారి నేటికీ ప్రజలకు ఆహ్లాదాన్ని కల్గిస్తున్నాయి. వాటిని బాగుపరచి మెరుగులు దిద్దినట్లయితే తెలంగాణ గత చరిత్రను పదిలపరుచుకున్నట్లే.

**తెలంగాణలోని ప్రసిద్ధమైన కోటలు**

1. గోల్కొండ కోట (హైదరాబాదు)
2. రామగిరి ఖిల్లా (పెద్దపల్లి)
3. భువనగిరి కోట (యాదాద్రి)
4. గద్వాల్ కోట (జోగులాంబ గద్వాల)
5. మెదక్ కోట (మెదక్)
6. సిర్పూర్ కోట (కొమురంభీం)
7. నిజామాబాద్ కోట (నిజామాబాద్)
8. వరంగల్ కోట (వరంగల్)
9. ఎలగందుల కోట (కరీంనగర్)
10. ఖమ్మం కోట (ఖమ్మం)
11. మొలంగూరు కోట (కరీంనగర్)
12. నిర్మల్ కోట (నిర్మల్)
13. ప్రతాపగిరి కోట (జయశంకర్ భూపాలపల్లి)
14. కోటిలింగాల కోట (జగిత్యాల)
15. గాంధారి ఖిల్లా (మంచిర్యాల)
16. దేవరకొండ కోట (నల్గొండ)
17. జగిత్యాల కోట (కరీంనగర్)
18. ఉట్నూరు కోట (ఆదిలాబాద్)
19. ఖిల్లా ఘనపూర్ కోట (వనపర్తి)
20. దేవదుర్గం కోట (కుంరంభీం)
21. రాజాపేట కోట (యాదాద్రి భువనగిరి)
22. పానగల్లు కోట (వనపర్తి)
23. నగునూర్ కోట (కరీంనగర్)
24. రాయగిరి కోట (యాదాద్రి భువనగిరి)
25. వనపర్తి కోట (వనపర్తి)
26. కౌలాస్ ఫోర్ట్ (నిజామాబాదు)
27. దోమకొండ కోట (నిజామాబాద్)
28. రాచకొండ కోట (రంగారెడ్డి)

**కొన్ని ముఖ్యమైన కోటలు - వాటి వివరాలు**

### 1. గోల్కొండ కోట

హైదరాబాదు నగరం నడిబొడ్డులో నేటికీ ఠీవిగా నిలబడి ఉన్నది ఈ గోల్కొండ కోట. ఈ కోటను చూడటానికి అనేక ప్రాంతాల నుండి పర్యాటకులు వస్తూంటారు. వందల ఏళ్ళ చరిత్ర కలిగిన ఈ గోల్కొండ కోట నిజానికి హైదరాబాదు నగర నిర్మాణానికి చాలా ముందే నిర్మించబడింది. రాష్ట్రకూటుల కాలం నుండే ఈ గోల్కొండ కోట ఉన్నట్లుగా చరిత్ర చెబుతున్నది. కాకతీయుల కాలంలో ఈ కోటలు మట్టితో తొలుత

నిర్మించినట్లు తెలుస్తున్నది. దీని అసలు పేరు 'గొల్లకొండ'. కాకతీయ వంశీయులైన ముసునూరి నాయకులకు, బహమనీసుల్తానులకు 1347లో భీకర పోరాటం జరిగింది. చాలాకాలం వరకు జరిగిన ఈ యుద్ధంలో కాకతీయ సామ్రాజ్యాన్ని కాపాడుకోవడానికి బహమనీ సుల్తానులతో సంధి కుదుర్చుకున్నారు. అప్పటి నుండి ఈ కోట సుల్తానుల అధీనంలోకి వెళ్ళింది. వీరి తదనంతరం సుమారు 171 సంవత్సరాలపాటు ఈ కోటను కుతుబ్‌షాహీలు పాలించారు. కులీకుతుబ్‌షాహీల పాలనలో ఈ కోట రాతికోటగా తీర్చిదిద్దబడింది. దాదాపు 10 కి.మీ. చుట్టుకొలతతో 12 అడుగుల ఎత్తయిన ప్రహరీగోడతో చాలా పటిష్ఠంగా నిర్మించబడింది ఈ కోట. తెలంగాణ పునర్వైభవానికి ప్రతీకగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి 15, ఆగస్టు రోజున జాతీయ జండా ఎగురవేసి ఉత్సవాలు జరుపుకుంటున్నది. ఆ సాంప్రదాయానికి రాష్ట్ర ముఖ్యమంత్రి కె.సి.ఆర్. నాంది పలికారు.

### 2. రామగిరి ఖిల్లా (పెద్దపల్లి)

ప్రస్తుత పెద్దపల్లి జిల్లా నుండి మంథనికి వెళ్ళే దారిలో బేగంపేటవద్ద కొండపై ఈ కోట నిర్మించబడింది. బేగంపేట నుండి ఈ కోట దగ్గరికి వెళ్ళడానికి కాలినడకనే వెళ్ళాల్సి ఉంటుంది. రామగిరి చుట్టు ప్రక్కల గ్రామాలలో నాటి రాజులు వాడిన బంగారు, వెండి, రాగి నాణేలు పురావస్తుశాఖవారి తవ్వకాలలో బయటపడ్డాయి. దీనిని బట్టి ఈ కోటను ఆసరాగాచేసుకొని రాజులు తమ పరిపాలన సాగించారని తెలుస్తుంది. రామగిరి కోటకు అధిపతిగా ఉన్న ముప్పభూపాలుని ఆస్థాన కవి అయిన మడికిసింగన తాను రాసిన 'పద్మ పురాణోత్తరఖండాన్ని' వెలిగందుల కందనామాత్యునికి అంకితం ఇచ్చాడు. ఆ పురాణంలో ముప్ప భూపాలుని ప్రసక్తి, రామగిరి విశేషాలు కనిపిస్తాయి.

### 3. భువనగిరి కోట (యాదాద్రి భువనగిరి)

హైదరాబాదు నుండి వరంగల్‌కు వెళ్ళేదారిలో ఒక కొండపై అద్భుతమైన రాతి నిర్మాణం కనిపిస్తుంది. అదే యాదాద్రి భువనగిరి జిల్లాలో ఉన్నటువంటి 'భువనగిరి కోట' కాకతీయులు, విష్ణుకుండినులు, కుతుబ్‌షాహీలు మొదలైన ఎందరో రాజులు ఇక్కడ పరిపాలన కొనసాగించారు.

పశ్చిమ చాళుక్య రాజైన 6వ త్రిభువన విక్రమాదిత్యుడు 12వ శతాబ్దంలో ఈ కోట నిర్మాణానికి పునాది వేశాడని చారిత్రక ఆధారాలు లభిస్తున్నాయి. అతని పేరు మీదనే త్రిభువనగిరిగా పిలువబడుతుండేది. అయితే నవాబుల చేతులలోకి మారినతర్వాత అది కాస్తా భువనగిరిగా మార్పు చెందింది. శత్రుదుర్భేద్యంగా, పటిష్ఠంగా నిర్మించబడ్డ ఈ కోటను శాతవాహనులు, విష్ణుకుండినులు, చాళుక్య కాకతీయులు, రేచర్ల పద్మనాయకులు, బహమనీ వంశస్థులు కుతుబ్‌షాహీలు, అసఫ్ జాహీ వంశీయులు మొదలైనవారు పరిపాలించారు.

### 4. గద్వాల్ కోట (జోగులాంబ గద్వాల)

ఇది మహబూబ్‌నగర్ జిల్లా గుండా ప్రవహిస్తున్న కృష్ణ, తుంగభద్ర నదుల మధ్య 1200 మైళ్ళలో అడవిలో విస్తరించి ఉన్న పెద్దకోట. గద్వాల సంస్థానాధీశులలో మొదటివాడైన పెద్దసోమ భూపాలుడు ఇతనినే సోమనాద్రిగా కూడా పిలుస్తారు. పూడూరును రాజధానిగా చేసుకొని పరిపాలిస్తుండేవాడు. 400 ఏళ్ళ చరిత్ర కలిగిన గద్వాల సంస్థానానికి ఎంతోమంది కళాకారులను పోషించిన చరిత్ర ఉన్నది. ఇక్కడ కవులకు, పండితులకు, బ్రాహ్మణులకు, మంచి గౌరవ మర్యాదలు లభించేవి. అందుకే దీనిని విద్వత్ గద్వాల అని కూడా పిలుస్తారు. సంస్థానాన్ని ఎక్కువగా పద్మశాలీలు పరిపాలించడంతో గద్వాల పట్టణం చేనేత పరిశ్రమకు పేరుగాంచింది. ప్రస్తుతం ఈ కోట లోపల ప్రభుత్వ డిగ్రీ మరియు జూనియర్ కాలేజీలు నడుపుతున్నారు.

### 5. మెదక్ కోట (మెదక్)

మెదక్ పట్టణానికి పడమరన ఉన్న కొండపై 12వ శతాబ్దంలో నిర్మించబడ్డ కోట ఇది. శాతవాహనుల నుండి కుతుబ్‌షాహీల వరకు చాలా మంది రాజులు ఈ ప్రాంతాన్ని పరిపాలించారు. కోటకు ఏడు దర్వాజాలున్నాయి. మొదటి ప్రవేశద్వారం తర్వాత సింహద్వారం ఉంది. క్రీ.శ.1309లో అల్లావుద్దీన్ ఖిల్జీ సేనాని మాలిక్ కాఫిర్ ఈ కోటను స్వాధీనం చేసుకున్నాడు. నాటి రాజులు కోటలోని ప్రతిద్వారానికి గట్టి సైనికపహారాలు ఏర్పాటుచేసారు. 5వ ద్వారం దగ్గర 16

అడుగుల ఫిరంగితో కోటలోని సైనికులు నిరంతరం కాపలా కాస్తుండేవారు. 6వ ద్వారం గరుడ యంత్రంతో నిర్మించబడింది. ఈ యంత్ర నిర్మాణంవలన ఆ ప్రాంతంలోని వారికి సర్పాలవల్ల భయం లేదనేది ప్రజల నమ్మకం.

ఈ కోటలో తెలంగాణ పర్యాటకశాఖవారు కొన్ని సదుపాయాలు కల్పించారు.

### 6. సిర్పూర్ కోట (కుమ్రం భీం)

దట్టమైన అడవులతో, జలపాతాలతో, కొండ కోనలతో తెలంగాణ కాశ్మీర్‌గా పిలిచే ఆదిలాబాద్ జిల్లాలోని 'సిర్పూర్' ప్రాంతం దేశంలోనే మొట్టమొదటి గోండు రాజ్య సంస్థానంగా వెలిసింది. దీన్ని పూర్వం 'సూర్యాపురంగా' పిలిచేవారు. ఒకప్పుడు ఇదంతా దండకారణ్య ప్రాంతంలో భాగం.

దాదాపు 9వ శతాబ్దంలో మొట్టమొదట ఈ కోటను 'భీమ్ భల్లాల్‌సింగ్' నిర్మించాడు. కోట చుట్టూ 18 అడుగుల ఎత్తయిన మట్టిగోడ రెండు కిలోమీటర్లమేర ఉంది. కోటచుట్టూ 12 అడుగుల లోతైన కందకం ఉండేది. సిర్పూర్ కోటలో హిందువుల, ముస్లింలకు సంబంధించిన అనేక కట్టడాలు నిర్మించబడి వివిధ మతాల సంస్కృతుల సమ్మేళనానికి ప్రతీకగా ఉండేది. 12 వందల ఏళ్ళ కిందటి రాతి కట్టడాలు ఈ నాటికి కూడా చూపరులను ఆకర్షిస్తున్నాయి.

### 7. నిజామాబాద్ కోట (నిజామాబాద్)

ఇప్పుడు నిజామాబాద్‌గా పిలువబడుతున్న పట్టణం అసలు పేరు 'ఇందూరు'. దీనికి సుమారు 1500 ఏళ్ళ చరిత్ర కలిగిఉన్నది. ఈ ప్రాంతాన్ని ముందుగా రాష్ట్రకూటులు పరిపాలించారని చరిత్ర ద్వారా తెలుస్తున్నది. రాష్ట్రకూట రాజయిన ఇంద్రుడు పేరుమీదనే ఈ ప్రాంతాన్ని 'ఇంద్రపురి'గా పిలిచేవారు. రానురాను అది ఇందూరుగా మారింది. తదనంతరం కాకతీయులు, బహమనీలు, మొగలాయిలు, కుతుబ్‌షాహీలు, అసఫ్‌జాహీలు, పరిపాలించారు. నిజాంరాజుల పరిపాలనలో అనేక నగరాల పేర్లు మార్చబడ్డాయి. అదే విధంగా ఇందూరుకు నిజామాబాద్ అనే పేరు వచ్చింది.

### 8. వరంగల్ కోట (వరంగల్)

వరంగల్ రైల్వే స్టేషనుకు 2 కి.మీ. దూరంలోను, హన్మకొండకు 12 కి.మీ. దూరంలో ఉంది. ఓరుగల్లుకోట. ఈ కోట శత్రుదుర్భేద్యంగా నిర్మించబడింది. మొదటగా కాకతి వెన్నయ్య (క్రీ.శ.750–768) తన పాలనను ఇక్కడి నుండి ప్రారంభించాడు. 16 మంది రాజులు ఈ కోటను ఆధారంగా చేసుకొని తమ పరిపాలన సాగించారు. 1199 సం॥లో గణపతిదేవుడు కోట ప్రారంభించాడు. ఆయన కుమార్తె రుద్రమదేవి కోటను పూర్తిచేసింది. ఈ కోటకు 30 అడుగుల ఎత్తుతో ఏకశిలతో నిర్మింపబడ్డ ద్వారాలున్నాయి. కాకతీయ రాజులు కళాపోషకులు. వీరి కాలంలో సాహిత్య, సంగీత కళలు ఆదరించబడ్డాయి. సుసంపన్నంగా ఉన్న ఈ కోటపై ఢిల్లీని పాలిస్తున్న తుగ్లక్ చూపు వరంగల్ కోటపైబడింది. మొదటగా క్రీ.శ.1310లో వరంగల్ కోటను ముట్టడించి నెలల తరబడి యుద్ధం చేశాడు. అయినా బయట ఉన్న మట్టిగోడను మాత్రమే ధ్వంసం చేయగల్గాడు. అంత పటిష్ఠమైనదీకోట. చివరికి ప్రతాపరుద్రున్ని మోసంతో బంధించి వరంగల్‌కోటను తుగ్లక్ స్వాధీన పరచుకున్నాడు. కట్టడాలను శిల్పసంపదను మొత్తం నాశనం చేసారు. దానిలో భాగంగానే వేయి స్థంభాలగుడి ధ్వంసం చేయబడింది. కాకతీయులు నిర్మించిన 'కీర్తి తోరణం' నేడు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ చిహ్నంగా గుర్తింపు పొందింది.

### 9. ఎలగందుల కోట (కరీంనగర్)

కరీంనగర్ నుండి వేములవాడకు వెళ్ళేదారిలో ఈ ఎలగందుల కోట ఉంది. దీనికి వేయి సంవత్సరాల చరిత్ర ఉన్నది. కాకతీయులు, ఢిల్లీ సుల్తానులు, కుతుబ్‌షాహీలు, మొగల్ చక్రవర్తులు, నిజాం నవాబులు మొదలైన వారెందరో ఈ కోట నుండి తమ పరిపాలనకు ఆలంబనంగా చేసుకున్నారు. ఈ కోట కరీంనగర్‌కు 13 కి.మీ. దూరంలో ఉంటుంది. కోటపైభాగంలోకి వెళ్ళేకొలది ప్రతి మూలలో ఒక్కో సైనికాధికారిని నియమించి శత్రువులు కోటలోకి ప్రవేశించినా తిరిగి బయటకు వెళ్ళలేని పరిస్థితిని కల్పించారు. అంత కట్టుదిట్టంగా భద్రతా ఏర్పాట్లుండేవి. కోట పైభాగంలో నాలుగు దిక్కులా ఫిరంగి దళాలు కూడా ఏర్పాటుచేయబడి ఉన్నాయి.

ఈ గ్రామంలో ఉన్నటువంటి చింతామణి చెరువువద్ద క్రీ.శ.1202 శిలాశాసనం కనిపిస్తుంది. ఈ శాసనంలో కాకతీయ గణపతిదేవుని సేనాని చౌండ ప్రగడ కాలంలో వాయిద్య విద్వాంసులు శ్రీకరణ, భసవోజీలకు నరసింహదేవర పేరున ఉన్న మాన్యాలను దానాలిచ్చినట్లుగ ఉన్నది.

## 10. ఖమ్మం కోట (ఖమ్మం)

ఖమ్మం పట్టణం మధ్యలో 4 చ॥కి॥మీ వైశాల్యంతో నిర్మించబడి కనిపిస్తుంది ఈ కోట. ఈ కోట చుట్టూ 12 బురుజులు మరియు 10 రాతి దర్వాజాలు కట్టబడ్డాయి.

కాకతీయులు క్రీ.శ.950లో ఖమ్మం కోటను కట్టడం ప్రారంభించి సుమారు 56 సం॥రాల పాటు దీని నిర్మాణం కొనసాగించి పూర్తిచేసారు. రెడ్డిరాజులు, వెలమరాజులు, గజపతిరాజులు, నందపానులు, గుడ్లూరు, కాళ్లూరు మొదలైన ఎందరో రాజులు ఈ కోట నుండి పరిపాలన సాగించారు. 15వ శతాబ్దంలో శ్రీకృష్ణదేవరాయలు, 17వ శతాబ్దం తరువాత అసఫ్ జాహీలు ఈ కోటను పరిపాలించారు. కోట అంతా గ్రానైట్ రాయితో నిర్మించబడింది. శత్రువులెవరైనా మారువేషంలో కోటలోకి ప్రవేశిస్తే వారి రాకను తెలియజెప్పేవిధంగా కోట నిర్మించబడింది. ఇది నగరం మధ్యలో ఉండడంవల్ల కోట చుట్టూ ఇళ్ళ నిర్మాణాలు వెలిసాయి.

## 11. మొలంగూరు కోట (కరీంనగర్)

కరీంనగర్ జిల్లాలోని కేశవపట్నం మండలంలోని గ్రామం మొలంగూర్. ఇది కరీంనగర్‌కు 30 కి.మీ. దూరంలో మొలంగూరు గ్రామం పూర్వపు పేరు ముదగర్ అని తెలుస్తుంది. కానీ కొండకింద 'మలంగ్ షా అలీ' సమాధి ఉండడంతో ఈ ఊహ కొంతకాలం మలంగూర్‌గా పిలువబడి తరువాత మొలంగూర్‌గా ప్రసిద్ధి పొందింది. వాణస వంశీయుల మూలపురుషుడు రుద్ర మంత్రి మొలంగూరు నేలినట్లు ఈ కింది పద్యం తెలియజేస్తుంది.

ఇలవాణ సవంశంబున
జలరుహభవ నిభుడు నీతి చాణుక్యుడునా
జెలువమరు రుద్ర సచివుడు
మొలగూరేలుచును సౌఖ్యమున జెలువొందున్

ఈ గ్రామానికి అత్యంత ప్రాచుర్యాన్ని కలిగించిన ఈ ఊరిలోని దూద్‌బౌలి అనే పేరుగల బావి కొండ కింది భాగంలో ఇప్పటికీ ఉంది. అందులోని నీరు పాల వలె తియ్యగా ఉండడంతో నిజాం కొరకై ఈ బావి నీళ్ళు ప్రత్యేకంగా తీసుకొని వెళ్ళేవారు. నేటికీ ఈ బావి నీటిని ఆ ఊరి ప్రజలు వాడుతూ ఉంటారు.

## 12. నిర్మల్ కోట (నిర్మల్)

ఆదిలాబాద్ జిల్లాలో ఉన్న నిర్మల్ హైదరాబాదు నుండి నాగపూర్ వెళ్ళే దారిలో డిచ్‌పల్లి రైల్వేస్టేషన్ నుండి 58 కి.మీ. దూరంలో ఉంది.

అసఫ్‌జాహీల పాలన 1724లో మొదలైంది. సలాబత్ జంగ్ (1751-1761) నవాబు కాలంలో నవాబ్ ముజారిజుల్ ముక్క జసీరుద్దౌలా బహదూర్ మీరాజు ఇబ్రహీంఖాన్ ధంసా ఎల్లందల్ సర్కార్ పాలకునిగా ఉండేవాడు. నిర్మల్, లక్షెట్టిపేట, చెన్నూర్ ప్రాంతాలు ఇతని అధీనంలోనే ఉండేవి. 1747లో జగిత్యాల దుర్గాన్ని, నిర్మల్ దుర్గాన్ని ఇతడే నిర్మించాడు. ఇబ్రహీంఖాన్ పేరిట నిర్మించబడ్డం ఇబ్రహీంబాగ్‌లో అతని సమాధి ఇప్పటికీ ఉంది.

## 13. ప్రతాపగిరి కోట (జయశంకర్ భూపాలపల్లి)

పెద్దపల్లి జిల్లాలోని మంథని నుండి మహదేవ్‌పూర్ దాటి కాటారం అటవీ ప్రాంతం గుండా 35 కి.మీ. ప్రయాణిస్తే ఈ కోటను చేరుకోవచ్చు. ఇది దట్టమైన అడవుల్లో ఉండడం వల్ల దీనికి సరైన రవాణా సదుపాయాలు లేవు. ఇంత దట్టమైన అడవిలో సుమారు 1000 సంవత్సరాల క్రితమే కాకతీయుల కాలంలో ఈ కోటను నిర్మించడం జరిగింది. ఈ కోటపైభాగాన ఉన్న రాతికోటగోడపై తొమ్మిది లైన్ల తెలుగు శాసనం చెక్కబడి కనిపిస్తుంది. ఇరువత్తుగండడు, గండగోపాలుడు, కంచిరక్షపాలకా, చోళరాజ్యస్థాపనాచార్య, పాండ్యమనువిభాళ, రాయగజకేసరి, అరిరాయగజకేసరి మొదలైన బిరుదులు ఈ శాసనంలో చెక్కబడిఉన్నాయి. కాకతీ ప్రతాపరుద్రుని పేరు మీద నిర్మింపబడ్డ కోట కాబట్టి దీనికి ప్రతాపగిరి కోట అనే పేరు వచ్చింది.

## 14. కోటిలింగాల కోట (జగిత్యాల)

కరీంనగర్ నుండి లక్షెట్టిపేట వెళ్ళే మార్గంలో ఈ కోటిలింగాల ఊరు ఉన్నది. గోదావరి నదీ తీరానగల ఈ ఊరు పుణ్యక్షేత్రంగా ప్రజలకు సుపరిచితమే. అయితే 1979లో పురావస్తుశాఖవారు త్రవ్వకాలు జరిపేంతవరకు శాతవాహనులు పరిపాలించిన ప్రదేశం అని ఎవ్వరికీ తెలియదు. క్రీ.పూ.4వ శతాబ్దానికిచెందిన బౌద్ధ స్థూపములు కూడా ఇక్కడ బయటపడ్డాయి. వీటిమీద పూర్వ బ్రాహ్మీలిపిలో బౌద్ధుల ధర్మసూత్రాలు రాయబడి ఉన్నాయి.

పురావస్తుశాఖ తవ్వకాలలో శాతవాహనులలో తొలి రాజయిన శ్రీముఖుడు వేయించిన నాణాలు బయటపడ్డాయి. అంతేకాకుండా పెద్ద పరిమాణం గల ఇటుకలు, మట్టిపెంకులు, పూసలు, జనవాసాలు మొదలైనవి కనిపించాయి.

ప్రస్తుతం కోట కానరాకపోయినా తవ్వకాల్లో లభించిన ఆధారాల ప్రకారం తొలి తెలుగు రాజధాని "కోటలింగాలే"నని మనం గుర్తించవచ్చు.

## 15. గాంధారి ఖిల్లా (మంచిర్యాల)

మంచిర్యాల నుండి ఆసిఫాబాద్‌కి వెళ్ళేదారిలో బొక్కల గుట్ట నుండి 5 కి.మీ. దూరంలో ఉంది. గోండురాజులు, వడ్డెరాజులు, రెడ్డిరాజులు ఈ ఖిల్లా నుండి తమ పరిపాలన సాగించారు. గాంధారి ఖిల్లాను పాలించిన గోండురాజులు 'జనగాం' ప్రాంతాన్ని పాలించిన అంకమరాజుకు సామంతులుగా కొంతకాలం ఉన్నారు. ఇక్కడ రెండేళ్ళకోసారి కార్తీక మాసంలో గాంధారి జాతర జరుగుతుంది.

## 16. దేవరకొండ కోట (నల్గొండ)

దాదాపు 900 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ కోట నాగార్జున సాగర్‌కు 45 కి.మీ. దూరంలో ఉంది. దాదాపు 500 మీటర్ల ఎత్తులో నిర్మించబడ్డ ఈ కోట ఏడుకొండల నడుమ 524 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. శ్రీనాథకవి సార్వభౌములవారు కూడా ఈ ప్రాంతాన్ని దర్శించిన ఆధారాలున్నాయి. కోట ఉత్తరదిశలో రాజులు బయటికి వెళ్ళడానికి సొరంగ మార్గాలున్నాయి. శత్రువులు దండెత్తి వచ్చినప్పుడు, హెచ్చరికలు జారీ చేసినప్పుడు, రాజులు ప్రజల బాగోగులు చూసే నిమిత్తం మారువేషాల్లో వెళ్ళేటప్పుడు ఈ సొరంగ మార్గాలనే వాడేవారు.

## 17. జగిత్యాల కోట (కరీంనగర్)

1747లో ఎల్గందుల సర్కార్ అధిపతియైన ఇబ్రహీంఖాన్‌ధంసా జగిత్యాల పట్టణంలో ఉన్న ఈ ఖిల్లాను నిర్మించాడు. క్రీ.శ.1108 నాటి కన్నడ శాసనం ఆధారంగా పొలాసను రాజధానిగా పాలించిన మొదటి మేడరాజు కొడుకు జగ్గదేవుడు పేరిట నిర్మించబడిన జగ్గదేవాలయమే జగదాలయంగా, జగిత్యాలగా మారి ఉంటుందని అభిప్రాయం.

కోట నిర్మాణాన్ని పరిశీలిస్తే నక్షత్రాకారంలో నిర్మించబడిన ఈ కోట గోడలు రాయి. ఇటుక, సున్నంతో కట్టబడ్డాయి. ఈ కోటలో అత్యంత ఆకర్షణీయమైనది వెనుకవైపు ఉన్న దర్వాజా దీని తలుపుపైకి లేచి కందకము దాటడానికి కిందికి వాలే పద్ధతిలో ఏర్పాటు చేయబడి ఉంది. 1791లో ఎహెతెషామ్ జంగ్ యుద్ధంలో ఓడిపోయి ఎల్గందల నుండి పారిపోయి మొదట జగిత్యాల ఖిల్లాలో తర్వాత నిర్మల్‌కోటలో తలదాచుకొన్నట్లు తెలుస్తుంది. ఇదే సమయంలో నిజాం సేనలు జగిత్యాల కోటను ముట్టడించి ఖిలేదార్ జాఫర్ ఆలంను ఓడించి కోటను స్వాధీనం చేసుకున్నాయి.

## 18. ఉట్నూరు కోట (ఆదిలాబాద్)

కరీంనగర్ నుండి ఆదిలాబాద్ వెళ్ళే మార్గంలో దట్టమైన అడవుల మధ్య ఎత్తైన గుట్టల్లో ఉన్న ఉట్నూరు ఒకప్పటి గోండ్వానాగా పిలువబడ్డ ప్రాంతం. ఉట్నూరు గడీగా పిలువబడ్డ ఈ చిన్నకోట 1309లో నిర్మించబడింది. రాజ్‌గోండులతోపాటు సీతాగొంది రాజుల 700 ఏళ్ళ చరిత్ర కలిగి ఉన్నది ఈ ఖిల్లా. 1929-30 సం॥ల మధ్య ఈ ప్రాంతంలో ప్లేగు వ్యాధి ప్రబలటంతో కోటలో ఉన్న ప్రజలు కోటను వదలిపెట్టారు. మహారాష్ట్రలో ముఖ్యుడైన ఛత్రపతి శివాజీ ఆధీనంలో ఈ కోట కొంతకాలం పరిపాలింపబడింది. 3 దశాబ్దాల కిందట సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ద్వారా కోటకు సమీపంలో కుమ్రం భీం కాంప్లెక్స్‌ను నిర్మించారు.

## 19 ఖిల్లా ఘన్‌పూర్ కోట (వనపర్తి)

వనపర్తి జిల్లా కేంద్రానికి 6 కి.మీ. దూరంలో ఉన్నది ఈ ఘన్‌పూర్‌కోట. ఇది రేచర్ల పద్మనాయకులు, గోనగన్నారెడ్డిల కాలంలో క్రీ.శ.1224వ సం॥ నిర్మించబడింది. కాకతీయ సామ్రాజ్య పతనానంతరం ఈ కోట కొంతకాలం బహమనీలు, బీజాపూర్ రాజులు, విజయనగర రాజులు, గోల్కొండ మరియు అసఫ్‌జాహీల ఏలుబడిలో కొనసాగింది.

## 20. దేవదుర్గం కోట (కుమ్రంభీం)

ఆసిఫాబాద్ నుండి మేవాడ్‌కువెళ్ళి అక్కడి నుండి అడవిలో 12 కిలోమీటర్లు నడిస్తే 'దేవదుర్గంకోట' వస్తుంది. ఈ కోట కింద 180 గ్రామాలు పరిపాలించబడేవి. 900 సంవత్సరాల క్రితం "భీం బల్లాల్‌షా" అనే రాజు 1600 అడుగుల ఎత్తయిన, పటిష్ఠమైన కోటను 'దేవదుర్గం' కొండపై శత్రుదుర్భేద్యంగా నిర్మించాడు. ఈ కోట నిర్మాణం జరగకముందు 'దేవదుర్గం' 'జనగాం' రాజ్యంలో భాగంగా ఉండేది. భీంబల్లాల్ కాలంలో రాజగోండులు చిన్న చిన్న రాజ్యాలను, మండలాలను స్థాపించారు. అందులో భాగంగా 'దేవదుర్గం' కింద 6 రాజ్యాలు, 9 మండలాలు ఉండేవి. 870 నుండి 1751 వరకు 'దేవదుర్గం' రాజ్యాన్ని 'మడావిరాజులు' ఏకఛత్రాధిపత్యంగా పాలించారు.

## 21. రాజాపేట కోట (యాదాద్రి భువనగిరి)

యాదగిరి గుట్టకు 20 కి.మీ. దూరంలో నిర్మించబడిన 'రాజాపేటకోట' ఇక్కడి స్థల పురాణాన్ని బట్టి 1775లో 'రాజారాయన్న' అనే రాజు తనపేరు మీద కోట నిర్మించతలచి కొండ మీద కోట నిర్మాణం చేసి నగరాన్ని నిర్మించాడు. అందువల్ల అది మొదట్లో 'రాయన్నపేట'గా పిలువబడేది. 'రాయన్నపేటే' క్రమంగా రాజాపేటగా మారింది. ఈ కోట చుట్టూ 18 అడుగుల ఎత్తులో శత్రు దుర్భేద్యమైన రాతి గోడను కట్టించారు. కోటలోపలి నుండి రహస్య సొరంగ మార్గాలు తవ్వించారు. కోటలోపల అనేక సుందర భవనాలు నిర్మించబడ్డాయి. రాజాపేట సంస్థానాధీశులు ప్రతిరోజు శివపూజ చేయనిదే భోజనం చేసేవారు కాదు. వారు గొప్ప శివభక్తులు. రాజాపేట సంస్థానం కింద 9 గ్రామాలుండేవి.

## 22. పానగల్లు కోట (వనపర్తి)

నేటి వనపర్తి జిల్లా కేంద్రానికి 15 కి.మీ. దూరంలో, పానగల్లు బస్టాండ్‌కు 2 కి.మీ. దూరంలో ఎత్తైన రెండు కొండల నడుమ ఈ కోట ఉంది. సుమారు 1200 సంవత్సరాల క్రితం 11, 12 శతాబ్దాల మధ్య కళ్యాణి చాళుక్యులు చక్కటి ప్రణాళికతో శత్రుదుర్భేద్యంగా, విశాలమైన ఎత్తైన కోటగోడలతో 'పానగల్లుకోట'ను నిర్మించారు. ఈ కోట మొత్తం గ్రానైట్ రాయితో నిర్మించబడింది. ప్రధాన ముఖద్వారం 20 అడుగుల ఎత్తులో 16 ఇంచుల కంచు దర్వాజాలతో ఏర్పాటు చేయబడింది. కళ్యాణి చాళుక్యుల నుండి అసఫ్‌జాహీల వరకు రాజులు ఈ కోటను పాలించారు. ఈ కోటలో ఆయా రాజులు వేయించిన ఉర్దూ, కన్నడ, తెలుగు శాసనాలు కనిపిస్తాయి. ఈ కోట వందకు పైగా చిన్న, పెద్ద యుద్ధాలను ఎదుర్కొని నిలిచింది.

## 23. నగునూర్ కోట (కరీంనగర్)

కరీంనగర్‌కు 8 కి.మీ. దూరంలో ఈ నగునూర్ కోట ఉంది. క్రీ.శ.946 నాటి శిలాశాసనం కరీంనగర్ మ్యూజియంలో ఉంది. ఈ కోటను వేములవాడ చాళుక్యులు, కళ్యాణి చాళుక్యులు, కాకతీయులు, బహమనీయులు, కుతుబ్‌షాహీలు, మొగలాయిలు, అసఫ్ జాహీలు మొదలైన వారెందరో పరిపాలించారు. మొదట ఇది 'నగరూర్'గా పిలువబడేది. దీనినే 'నగనూరు'గా పేర్కొన్నారు. ఈ కోట ఒకప్పుడు 400 దేవాలయాలతో వేలాదిమంది భక్తుల జయజయధ్వానాలతో, వేద పండితుల వేదఘోషలతో అలరారుతూ ఉండేది.

## 24. రాయగిరి కోట (యాదాద్రి భువనగిరి)

భువనగిరికి సుమారు ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇది మల్లన్న గుట్టపై రెండువేల ఏళ్ళక్రితం శాతవాహనుల కాలంలో ఈ కోట నిర్మాణం జరిగినట్లు పరిశోధనల ద్వారా తెలుస్తుంది. శాతవాహనుల నుంచి మొఘలాయిల వరకు ఎందరో రాజులు ఈ కోటను పరిపాలించారు. రాయగిరికోట సుమారు 28 కి.మీ. విస్తీర్ణంలో ఉంది. మల్లన్న గుట్టకు ఉత్తరాన నదీతీరాలలో బౌద్ధుల ఆరామాలు, జైనుల ఆనవాళ్ళు లభించాయని చరిత్ర ద్వారా తెలుస్తుంది.

## 25. వనపర్తి కోట (వనపర్తి)

500 సం॥రాల గొప్ప చరిత్ర కలిగిన వనపర్తి సంస్థానంలో పాతపల్లె, నూగూరు, కొత్తకోట, శ్రీరంగపురం, పెద్దగూడెం. వెంకటాపురం, జంగమాయి మొదలైన 178 గ్రామాలుండేవి. 15వ శతాబ్దం నుండి 1948 సం॥ వరకు విజయనగర రాజులు, మొగలులు, కుతుబ్‌షాహీలు, నిజాం రాజుల పాలనలో కొనసాగింది. వనపర్తి గడి నిర్మాణాన్ని 1868లో జాన్న మందళ దొరసాని చేపట్టింది. 1807వ సం॥లో రాజధానిని వనపర్తికి మార్చింది. ఆ కాలంలో 'ఓరియెంట్ ఇంగ్లీష్ లాంగ్‌మ్యాన్' స్కూళ్ళను స్వయంగా సంస్థానాధీశులే నడిపేవారు. వారు ఆంగ్ల సాహిత్యాన్ని ఎక్కువగా ప్రోత్సహించేవారు. 1948 తరువాత వనపర్తి గడి పాలిటెక్నిక్ కాలేజీగా మార్చబడింది.

## 26. కౌలాస్ ఫోర్ట్ (నిజామాబాద్)

నిజామాబాద్ జిల్లాకు 120 కి.మీ. దూరంలో జుక్కల్ మండలంలో బాలాఘాట్ పర్వతశ్రేణుల్లో కౌలాస్ కోట ఉంది. ఈ కోట ఎన్నో పోరాటాలకు సాక్షీభూతం. ఈ కోట దాదాపు 150 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. కాకతీయుల కాలంలో రాణి రుద్రమదేవి ఆధీనంలో ఈ కోట చాలా కాలం ఉంది.

1857వ సం॥లో ఈ కోటను పాలిస్తున్న రాజా రాజ్‌దీప్‌సింగ్ భారతమాత సంకెళ్ళ విముక్తికోసం బ్రిటీషు పాలకులకు వ్యతిరేకంగా పోరాటం చేసాడు. భారత స్వాతంత్ర్యం కోసం పోరాడిన మొదటి సంస్థానంగా ఈ కోట చరిత్రలో పేరు సంపాదించుకొంది. ఈ విషయం తెలిసిన ఆంగ్లేయులు రాజాదీప్‌సింగ్‌తోపాటు పఫారుద్దౌలా, శేఖ్‌మదార్, నార్ఖేడ్ గ్రామపట్వారీ శ్రీరంగరావు మొదలగువారిని బంధించి హైదరాబాద్ కోర్టులో విచారణ చేసారు. స్థానిక ముస్లిం గ్రంథం 'తారిఖీ–ఇ–కౌలాస్'లో ఈ కోట పాలకుల గొప్పదనం, వైభవం వివరించబడింది.

## 27. దోమకొండ కోట (నిజామాబాద్)

కామారెడ్డి పట్టణానికి 15 కి.మీ. దూరంలో ఉన్న దోమకొండ కోట కామారెడ్డి జిల్లా మొత్తానికే మకుటాయమానంగా నిలుస్తుంది. రెడ్డిరాజులు ఈ దోమకొండకోట నిర్మాణానికి అంకురార్పణ చేశారు. తెలంగాణలో పెద్ద సంస్థానాలలో పేరున్న 'దోమకొండ కోట' పాకనాటి రెడ్డి శాఖకు చెందిన కామినేని వంశస్తులది. 16వ శతాబ్దంలో కుతుబ్‌షాహీల పాలనలో ఈ సంస్థానం యొక్క బాధ్యతలు చేపట్టారు కామారెడ్డి వంశస్థులు. నిజాంపాలన ముగిసేవరకూ నిజాం రాజ్యంలో దోమకొండ సంస్థానంగా కొనసాగింది. వారి సామంతులైన కామినేని వంశస్థుల అధీనంలో దోమకొండ, కాసాపురం, సంగమేశ్వరం, మహమ్మదాపురం, విసన్నపల్లి, బాగోత్పల్లి, కుందారం, పాల్వంచ దేవునిపల్లితోసహా 40 గ్రామాలుండేవి.

## 28. రాచకొండ కోట (రంగారెడ్డి)

ఇబ్రహీంపట్నం మండలంలోని తిప్పాయిగూడ గ్రామానికి 4 కి.మీ. దూరంలో రాచకొండ కోట ఉంది. రాచకొండ కోట చుట్టూ 40 కి.మీ. పొడవైన ఎత్తైన రాతిగోడ భారీగ్రానైట్ రాళ్ళతో, మలుపులతో 'ద గ్రేట్ వాల్ ఆఫ్ చైనాను' తలపించే విధంగా ఉంది.

కాకతీయ రాజుల సామంతరాజైన రేచర్ల సింగమ నాయకుడు 14వ శతాబ్దంలో ఈ కోట నిర్మాణానికి పునాది వేశాడు. ముస్లిం రాజులైన బహమనీ సుల్తానులకు, హిందూ రాజులైన విజయనగర రాజులకు మధ్య రాచకొండ రాజ్యం కొంతకాలం రెండు మతాల వారికి వారధిగా నిలిచి మతసామరస్యాన్ని చాటింది. 1433వ సం॥లో జరిగిన ఘోర యుద్ధంలో బహమనీ సుల్తానులు కోటను స్వాధీనం చేసుకున్నారు.

***మూలం :*** *తెలంగాణ కోటలు, నాగబాల సురేశ్ గారి గ్రంథం*

❀❀❀❀❀

# 13. తెలంగాణ ప్రముఖులు

తెలంగాణ విప్లవాలకు, సామాజిక సంస్కరణకు పురిటిగడ్డ. సంఘ సంస్కరణకు పాటుపడ్డవారు కొందరు. దీన జనుల అభివృద్ధికి, హక్కుల సాధనకు పోరాడినవారు కొందరు. తెలంగాణ రాష్ట్ర సాధనకు ఉద్యమించినవారు మరికొందరు. తెలుగు భాషాభివృద్ధికి తోడ్పడినవారు ఇంకొందరు. ఇలా ఎందరో మహానుభావులు తెలంగాణ గురించి పాటుపడ్డారు.

వీరంతా తెలంగాణకు గర్వకారణమైనవారు. ఇటువంటి వారి గురించి, వారి అత్యుత్తమ గుణ గణాలను గురించి, వారి దేశభక్తి, నాయకత్వ లక్షణాలను, సమాజం కోసం, ప్రజల కోసం వారు చేసిన సత్కార్యములను తెలుసుకోవడం మన కనీస కర్తవ్యం. వారు చూపించిన ఋజు మార్గంలో ఒక్క అడుగు వేసినా తెలంగాణ బిడ్డగా మన జీవితం సార్థకం చేసుకొన్నట్లుగా భావించవచ్చు.

అటువంటి మహనీయులలో కొంతమంది గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

**అక్కన్న మాదన్నలు**

**(1600 - 1687)**

హన్మకొండలో జన్మించారు. గోల్కొండ సంస్థానంలో ప్రధాన మంత్రిగా మాదన్న, అబుల్‌హసన్ తానాషాకి అత్యంత సన్నిహితునిగా, రాజోద్యోగిగా అక్కన్న పనిచేశారు. వర్తక వాణిజ్య కేంద్రంగా హైదరాబాదును అభివృద్ధి చేశారు. రాజ్యాభివృద్ధికి విద్యాలయాలు ముఖ్యమని వాటిని స్థాపించారు. గ్రామగ్రామానికి రహదారులు ఏర్పరచి ఆర్థికంగా అభివృద్ధి పరచడానికి కారకులైనారు. అనేక బావులు, చెరువుల అభివృద్ధికి కారకులైనారు. వీరు తెలంగాణాను కంటికి రెప్పలా కాపాడుకున్నారు. గోలుకొండ సంస్థానం శత్రువుల కుట్రలో ప్రాణాలు విడిచారు.

**పి.వి. నరసింహారావు**

**(28.06.1921-23.12.2004)**

వరంగల్ జిల్లా నర్సంపేట మండలం, లక్నేపల్లి గ్రామంలో జన్మించాడు. వంగరకు చెందిన రుక్మాబాయమ్మ, పాములపర్తి వెంకట సీతారామారావులకు దత్తతగా వచ్చాడు. నాగపూర్ విశ్వవిద్యాలయం నుండి ఎల్.ఎల్.బి. పట్టా పొందాడు. ప్రధాన మంత్రి పదవి చేపట్టిన తొలి తెలుగువాడు. ఆ పదవిని పొందిన మొదటి దక్షిణ భారతీయుడు కూడా. ప్రధానమంత్రిగా లోక్‌సభ సభ్యులుగా, ముఖ్యమంత్రిగా తన సేవలను అందించాడు. భారత ఆర్థిక వ్యవస్థలో విప్లవాత్మక సంస్కరణలు చేపట్టాడు. తెలుగు అకాడమీ స్థాపకుడు. బహుభాషా కోవిదుడు. గొప్ప సాహితీవేత్త. గురుకుల ఆశ్రమ పాఠశాలలు, నవోదయ పాఠశాలలు ఇతని హయాంలోనే ప్రారంభించబడ్డాయి.

**పండిత కేశవరావు కోరట్కర్**

**(1867-1932)**

మరాఠ్వాడా ప్రాంతంలోని పర్భనీ జిల్లా పుర్జల్ గ్రామంలో జన్మించాడు హైదరాబాదులో స్థిరపడ్డాడు. నిజాం నవాబు కాలంలో హైదరాబాదు హైకోర్టు ప్రధాన న్యాయ మూర్తిగా సేవలందించాడు. సామాజిక సంస్కరణ కోసం, హిందువుల పక్షాన నిలబడిన గొప్ప సామాజిక కార్యకర్త వివేకవర్ధిని, విద్యాలయాల స్థాపన సభ్యులలో ఒకడిగా స్థానిక భాషలో విద్యా బోధన ప్రారంభించి తెలుగు భాషపై మమకారం చాటిన విద్యావేత్త. నిజాం పాలనకు వ్యతిరేకంగా గళం విప్పిన స్వాతంత్ర్య సమర యోధుడు.

**రాజాబహుదూర్ శ్రీ వెంకట రామిరెడ్డి**

**(22.08.1869 - 02.05.1953)**

జోగులాంబ గద్వాల జిల్లా గద్వాలలో జన్మించాడు. తండ్రి కేశవరెడ్డి, తల్లి బారమ్మ. సమర్థవంతమైన అధికారిగా ఏడవ నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ అత్యంత విశ్వాసపాత్రునిగా ఉన్నాడు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా 14 ఏళ్ళపాటు సమర్థవంతంగా తన కర్తవ్యాన్ని నిర్వర్తించాడు. రెడ్డి వసతి గృహ రూపకల్పనతో ఉన్నత విద్యను ఆకాక్షించే ఎంతోమంది పేద విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దారు. గోల్కొండ పత్రిక మనుగడకు తెలుగు భాష, సాహిత్యాభివృద్ధికి ఎంతో సహాయ సహకారాలు అందజేశాడు.

## అలీనవాజ్ జంగ్ బహదూర్

## (11.07.1877 - 06.12.1949)

హైదరాబాదులో జన్మించిన అలీనవాజ్ జంగ్ బహదూర్ అసలు పేరు మీర్ అహ్మద్ అలీ. తండ్రి మీర్ వాహిద్ అలీ ఇంగ్లాండులో సివిల్ ఇంజనీరింగ్ పట్టాను పొందాడు. బ్రిటిషువారి కాలంలో తొలి భారతీయ చీఫ్ ఇంజనీర్‌గా పదవిని చేపట్టాడు. జాతీయ ప్రణాళిక కమిటీ చైర్మన్‌గా 1939లో జవహర్‌లాల్ నెహ్రూ నియమించాడు. తెలంగాణ ప్రాంతమును సస్యశ్యామలం చేయడానికి ఎన్నో ప్రాజెక్టుల రూపకల్పన చేశాడు. తెలంగాణ సాగునీటి పితామహుడుగా పిలువబడ్డాడు. గోదావరి, మంజీరా నదులపై ఆనకట్టల నిర్మాణం, ఉస్మానియా ఆర్ట్స్ కాలేజి, ఉస్మానియా హాస్పిటల్ తదితర కట్టడాలు తన నైపుణ్యానికి నిదర్శనాలు. ఈయన పేరిట నిజామాబాద్‌లో అలీసాగర్ ప్రాజెక్టును నిర్మించారు.

## మాడపాటి హనుమంతరావు

## (22.01.1885-11.11.1970)

హైదరాబాదులో స్థిరపడిన మాడపాటి హనుమంతరావు తల్లిదండ్రులు వెంకటప్పయ్య, వెంకట సుబ్బమ్మ. హైదరాబాదులో న్యాయశాస్త్రం విద్యను అభ్యసించారు. హైదరాబాదు నగర మేయరుగా, శాసనమండలి చైర్మన్‌గా, ఎన్నో పదవులు చేపట్టి సమర్థవంతంగా నిర్వహించారు. రాజకీయ పోరాటాలకు ప్రత్యామ్నాయంగా, సాంస్కృతిక ఉద్యమాలతో ప్రజలను చైతన్యపరిచాడు. ఉర్దూ భాష అధికార భాషగా ఉన్న కాలంలో తెలుగు భాషాభివృద్ధికి కృషి చేశాడు. గ్రంథాలయాల స్థాపన వల్ల తెలుగు భాషాభివృద్ధి చెందుతుందని భావించి ఎన్నో గ్రంథాలయాల స్థాపనకు కృషి చేశాడు.

సికిందరాబాద్‌లోని కుమ్మరి గూడా స్వస్థలం. ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా సేవలనందించాడు. అణగారిన ప్రజల అభ్యున్నతికై పాటుపడ్డాడు, సంపూర్ణ మద్య నిషేధం, దేవదాసి, జోగిని వ్యవస్థ, బాల్య వివాహాల వంటి సామాజిక రుగ్మతలకు వ్యతిరేకంగా పోరాడాడు. హరిజనుల, దళితుల కోసం అది హిందూసభ, జాతీయోన్నత సభ, ఆది హిందూ సోషల్ సర్వీసెస్ వంటి సంస్థలతో మమేకమై వారి అభ్యున్నతికి పాటుపడ్డాడు.

## అరిగె రామస్వామి

## (1885-1973)

అరిగె రామస్వామి స్వస్థలం సికింద్రాబాద్‌లోని కుమ్మరిగూడ. ఎమ్మెల్యేగా, రాష్ట్రమంత్రిగా సేవలందించాడు. అణగారిన ప్రజల అభ్యున్నతికై పాటుపడ్డాడు. సంపూర్ణ మద్య నిషేధం, దేవదాసి, జోగినీ వ్యవస్థ, బాల్య వివాహాల వంటి సామాజిక రుగ్మతలకు వ్యతిరేకంగా పోరాడాడు. హరిజనులు, దళితుల కోసం ఆది హిందూ సభ, జాతీయోన్నత సభ, ఆది హిందూ సోషల్ సర్వీసెస్ వంటి సంస్థలతో మమైకమై వారి అభ్యున్నతికి పాటుపడ్డాడు.

## భాగ్యరెడ్డి వర్మ

## (22.05.1888-18.02.1939)

భాగ్యరెడ్డి వర్మ తల్లిదండ్రులు రంగమాంబ, మాదిరి వెంకయ్య దంపతులు. జన్మస్థలం హైదరాబాద్. 1906లో మిత్ర మండలి అనే సంస్థను స్థాపించి దళితులకు విద్యాబుద్ధులు నేర్పడం, క్రమశిక్షణ, వ్యాయామం నేర్పించడం మొదలైన కార్యక్రమాలు చేపట్టాడు. మురళి, వేశ్య, దేవదాసి వ్యవస్థలను రూపుమాపడానికి కృషిచేశాడు. 1926 నుండి ఆది హిందూ మహాసభలను హైదరాబాద్ రాష్ట్రంలో పలు చోట్ల నిర్వహించి సాంఘిక ఉద్యమాన్ని చేపట్టాడు. ఆది హిందువుల అభ్యున్నతికి అలుపెరుగని పోరాటం చేశాడు. దేశంలో అనేక చోట్ల ఆది హిందూ వాణిని వినిపించాడు.

## కె.వి.రంగారెడ్డి

## (22.12.1890-24.07.1970)

ప్రస్తుత రంగారెడ్డి జిల్లా పెద్ద మంగళారంలో జన్మించాడు. ఈయన పూర్తి పేరు కొండా వెంకట రంగారెడ్డి. చెన్నారెడ్డి, బుచ్చమ్మ ఆయన తల్లిదండ్రులు. రెవెన్యూ మంత్రి, డిప్యూటీ ముఖ్యమంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు. "గులామ్‌కి జిందగీసేమౌత్ అచ్ఛీ" అనే నినాదంతో స్వతంత్ర్య సంగ్రామాన్ని ప్రజల్లోకి తీసుకెళ్ళిన మహానేత. రజాకారుల దురాగతాలకు వ్యతిరేకంగా పోరాడిన కె.వి రంగారెడ్డి జ్ఞాపకార్థం రంగారెడ్డి జిల్లా ఏర్పాటైంది.

## సురవరం ప్రతాపరెడ్డి

## (28.05.1896 -25.08.1953)

తెలుగు సాహిత్యంలో శిఖర సమానుడు సురవరం. పూర్వం మహబూబ్‌నగర్ జిల్లా బోరవెల్లి మండలం, ఇటిక్యాలపాడు గ్రామంలో జన్మించాడు. తల్లి రంగమ్మ, తండ్రి నారాయణరెడ్డి. గోల్కొండ పత్రిక సంపాదకులుగా, రెడ్డి వసతి గృహం నిర్వాహకుడిగా తన సేవలను అందించాడు. తెలంగాణకు చెందిన 183 మంది పూర్వకవులు, 354 ఆధునిక

కవుల రచనల పరిచయాలున్న గోల్కొండ కవుల సంచికను ప్రచురించి తెలంగాణ ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి తెలియజేశాడు. ఎన్నో పరిశోధనాత్మక గ్రంథాలు, కథలు, నవలలు, వ్యాసాలు, జీవిత చరిత్రలను రచించాడు.

**బి.ఎస్. వెంకట్రావు**

**(11.12.1898-1953)**

అంబేద్కర్ అడుగుజాడల్లో దళిత వర్గాల విముక్తికై నిజాం సంస్థానంలో ఉద్యమం నడిపిన నేత. హైదరాబాద్ అంబేద్కర్‌గా ప్రసిద్ధి పొందిన ఈయన దళితుల విద్య, ఉపాధి, రాజకీయ రంగాల్లో హక్కుల కోసం పోరాడాడు. దళితుల్లో మూఢనమ్మకాలు, జంతుబలులు, మద్యపానం వంటి వాటికి వ్యతిరేకంగా పోరాడి, వారిలో విద్యా వ్యాప్తికి కృషి చేశాడు. 1936లో అంబేద్కర్ యూత్ లీగ్ ఏర్పరచి దళిత యువకుల ప్రగతికి శ్రమించాడు. హైదరాబాద్ శాసనసభకు ఎమ్మెల్యేగా, అనంతరం విద్యాశాఖ మంత్రిగా పదవి నిర్వహించాడు.

**బూర్గుల రామకృష్ణారావు**

**(13.03.1899-15.09.1967)**

మహబూబ్‌నగర్ జిల్లా తలకొండపల్లి మండలం, పడకల్ గ్రామంలో జన్మించాడు. తండ్రి నరసింగరావు, తల్లి రంగ నాయకమ్మ. న్యాయశాస్త్రంలో పట్టాపొందాడు. హైదరాబాదు రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా, కేరళ, ఉత్తరప్రదేశ్‌లకు గవర్నర్‌గా సేవలనందించాడు. ప్రతి జిల్లాకు ఒక డిగ్రీ కళాశాల ఏర్పాటుకు పాటుపడ్డాడు. ఉర్దూ స్థానంలో తెలుగు భాషను బోధన భాషగా మార్చి మాతృభాషపై తన మమకారాన్ని చాటుకున్నాడు. భూసంస్కరణ ఉద్యమం చేపట్టి ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాడు. అవినీతి నిరోధకశాఖను ఏర్పాటుచేసి అవినీతి నిర్మూలనకు కృషి చేశాడు.

**కుమ్రం భీం**

**(22.10.1901-01.09.1940)**

కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా సంకేపల్లి గ్రామంలో కుమ్రం చిన్ను, సోమ్‌భాయి దంపతులకు జన్మించాడు. అదివాసి హక్కుల కోసం పోరాడిన నాయకుడు. 12 గొండు రాజ్యాల అధికారం కోసం నిజాం ప్రభుత్వాన్ని ఎదుర్కొని ఆదివాసి జనులను ఏకం చేశాడు. అడవి మీద, భూమి మీద హక్కు కోసం ఉద్యమం నడిపి అమరుడైనాడు.

**స్వామి రామానంద తీర్థ**

**(03.10.1903 -22.01.1972)**

కర్ణాటక రాష్ట్రంలోని గుల్బార్గా జిల్లా చిన్నల్లిలో జన్మించాడు. హైదరాబాద్‌లో స్థిరపడ్డాడు. ఎం.ఏ. పట్టభద్రుడైన స్వామీజీ ఉపాధ్యాయుడిగా పనిచేసి 1952-62 మధ్య కాలంలో రెండుసార్లు లోక్‌సభకు ఎన్నికైనాడు. స్వాతంత్ర్య సమర యోధుడు. హైదరాబాద్ సంస్థాన విమోచనానికి పాటు బడ్డ మహాయోధుడు. చిన్నతనంలోనే జీవితాంతం బ్రహ్మచారిగా ఉండి దేశమాతకు సేవ చేస్తానని ప్రతినబూని, తన జీవితాన్ని దేశం కోసం అర్పించిన దేశభక్తుడు. లోకమాన్య బాల గంగాధర్ తిలక్‌ను ఆదర్శంగా తీసుకొని దేశం కోసం తన సర్వస్వాన్ని ధారపోసాడు.

**ముద్దు రామకృష్ణయ్య**

**(18.09.1907-21.09.1985)**

పెద్దపల్లి జిల్లాలోని మంథని గ్రామంలో జన్మించాడు. తండ్రి ముద్దు రాజన్న. తల్లి ముద్దు అమ్మాయమ్మ. 1946లో బ్రిటన్‌లోని లీడ్స్ విశ్వవిద్యాలయం నుండి యం.ఇ.డి పట్టా పొందాడు. ఆసియా, ఆస్ట్రేలియా, యూరప్, అమెరికా ఖండాలలోని పలు దేశాలు పర్యటించి అక్కడి విద్యా విధానాలను అధ్యయనం చేశాడు. మన దేశపు విద్యారంగంలో ఎన్నో సంస్కరణలు తెచ్చాడు. నిరక్షరాస్యత నిర్మూలన కోసం 'ఈచ్ వన్ టీచ్ వన్' ఉద్యమాన్ని జీవిత చరమాంకం వరకు కొనసాగించాడు. గొప్ప విద్యావేత్త.

**మగ్దూం మోహియుద్దీన్**

**(04.02.1908-25.08.1969)**

సంగారెడ్డి జిల్లా ఆంథోల్‌లో జన్మించాడు. తల్లి ఉమ్దా బేగం, తండ్రి గౌసుద్దీన్. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎం.ఎ విద్యను అభ్యసించాడు. రచయితగా, లెక్చరర్‌గా, విప్లవ సాహిత్యకారుడిగా, కమ్యూనిస్టు పార్టీ నుండి శాసన సభ్యుడిగా తన సేవలనందించాడు. 'షాయరే ఇంక్విలాబ్'గా సుప్రసిద్ధుడు. స్వతంత్ర్య కాంక్షను తెలిపే విప్లవాత్మక గీతాలు రచించాడు.

**డా॥ వేంకటరాజన్న అవధాని**

**(10.06.1909-22.09.1995)**

ప్రస్తుతం పెద్దపల్లి జిల్లా మంథనిలో జన్మించాడు. స్వాతంత్ర్య సమరయోధుడు, కవి, పండితుడు,

బహుభాషాకోవిదుడు సంఘ సంస్కర్త. అవధాని, కాళోజీ, వెల్దుర్తి, ఈ ముగ్గురు తెలంగాణ వైతాళిక సమితిగా ప్రసిద్ధులు. ఆనాటి కాలంలో కరీంనగర్ జిల్లాలోని సాహిత్య, స్వాతంత్ర్య సభలకు నాయకత్వం వహించి యువకులను ప్రోత్సహించాడు. బాలికల విద్యకు ఆదర్శమూర్తిగా నిలిచాడు. 1926లోనే 'ప్రబోధచంద్రిక' అనే రాతపత్రికను నిర్వహించాడు. ఈయన తెలంగాణ తొలి కథకులలో ఒకడు. అగ్నిశబ్ద మహత్యం జన్మరహస్యం పుస్తకాలు రచించాడు. కథలు కూడా రాశాడు. ఈయన సేవలను ప్రభుత్వం గుర్తించి తామ్రపత్రంతో సత్కరించింది. వైద్యవర బిరుదాంకితులుకూడా. సురవరం ప్రతాపరెడ్డి గోల్కొండ పత్రికకు ఈయన సబ్ ఎడిటర్‌గా పనిచేశాడు.

### సుద్దాల హనుమంతు

### (06.06.1910-10.10.1982)

'పాలబుగ్గల జీతగాడ' అనే సుప్రసిద్ధ గీతాన్ని రచించిన సుద్దాల హనుమంతు యాదాద్రి జిల్లా మోత్కూరు మండలంలోని పాలడుగులో జన్మించాడు. తల్లి లక్ష్మి నరసమ్మ, తండ్రి బుచ్చిరాములు. గొప్ప రచయిత, నటుడు, గేయకారుడు. కమ్యూనిస్టు పార్టీ దళ సభ్యుడు. వ్యవసాయశాఖలో గుమాస్తాగా పనిచేశాడు. తెలంగాణ సాయుధ పోరాటానికి ప్రచార సాధనాలుగా గొల్ల సుద్దులు, లత్కోర్‌సాబ్, బుడబుక్కలు లాంటి వేషాలతో ప్రజలను చైతన్యపరిచాడు. నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా తన గళం విప్పాడు. ఆయన గేయాలలో ప్రజల కష్టనష్టాలు, వాళ్ళ ఆవేదన కన్పించేది.

### కాళోజి నారాయణ రావు

### (09.09.1914-13.11.2012)

వరంగల్ అర్బన్ జిల్లా మడికొండ గ్రామం కోళోజి స్వస్థలం. తండ్రి రంగారావు, తల్లి రామాబాయమ్మ. న్యాయశాస్త్ర పట్టాను పొందిన కాళోజి రాష్ట్ర విధాన పరిషత్తుకు సభ్యుడిగా తన సేవలను అందించాడు. తన విలక్షణమైన రచనలతో, తెలంగాణ వ్యవహారిక భాషలో కవితలను రచించి, తెలుగు మీద అభిమానాన్ని తట్టిలేపాడు. ప్రజల పక్షాన నిలబడే కవిగా కాళోజి మత సామరస్యానికి, ప్రజాస్వామిక విలువలకు, భావ ప్రకటన స్వేచ్ఛకు అమితంగా విలువనిచ్చాడు.

### జె.వి. నర్సింగరావు

### (14.10.1914-03.09.1972)

గోపాలరావు, లోకమ్మ దంపతులకు జన్మించాడు. ఈయన పూర్తి పేరు జోగినపల్లి వెంకటనరసింగరావు. మంచిర్యాల జిల్లా అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ నుండి బి.ఎ., ఎం.బి.ఏ, ఎల్.ఎల్.బి పట్టా పొందాడు. ఎలక్ట్రిసిటీ బోర్డ్ చైర్మన్‌గా, లక్షెట్టిపేట్ శాసనసభ్యులుగా, మంత్రిగా, ఉప ముఖ్యమంత్రిగా సేవలను అందించాడు. 65 వేల ఎకరాలకు సాగునీటిని ఉద్దేశించిన కడెం ప్రాజెక్టును చేపట్టి, పూర్తిచేశాడు. గ్రామ గ్రామానికి విద్యుచ్ఛక్తి విస్తరింపజేయడంలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో ఉండేలా ఆదర్శవంతంగా తీర్చిదిద్దాడు. భారతదేశం విలీన సమయంలో తెలంగాణ ప్రాంతానికి సముచిత ప్రాతినిధ్యం, నిధుల కేటాయింపు కోసం తన గళం విప్పాడు.

### కొండా లక్ష్మణ్ బాపూజి

### (27.09.1915-21.09.2012)

కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని వాంకిడి గ్రామంలో జన్మించాడు. తల్లి అమ్మక్క, తండ్రి బాపూజీ. న్యాయశాస్త్ర విద్యను అభ్యసించిన లక్ష్మణ్ బాపూజీ శాసన సభ్యులుగా కాబినెట్ మంత్రిగా, డిప్యూటి స్పీకర్‌గా తన సేవలనందించాడు. ఖద్దరు ఉద్యమం, క్విట్ ఇండియా ఉద్యమాలలో పాల్గొని స్వాతంత్ర్య కాంక్షను బలపరచాడు. నిజాం పోలీస్ యాక్షన్ సమయంలో పౌర శిక్షణా సంస్థ ఏర్పాటుకు, పద్మశాలి వసతి గృహ నిర్మాణానికి కృషి చేశాడు. వెనకబడిన తరగతుల స్థితిగతులను మెరుగు పరచడానికి ఎనలేని కృషి చేశాడు.

### వందేమాతరం రామచంద్రరావు

### (25.04.1918-28.11.2001)

మహబూబ్‌నగర్ జిల్లా క్యాతూర్‌లో జన్మించాడు. తల్లి రామలక్ష్మమ్మ, తండ్రి వావిలాల రామారావు. శాసనసభ సభ్యుడిగా, అధికార భాషా సంఘం అధ్యక్షుడిగా, అంతర్జాతీయ తెలుగు సంఘ అధ్యక్షుడిగా, స్వాతంత్ర్య సమర యోధునిగా పోరాటంలో పాల్గొన్నాడు. క్విట్ ఇండియా ఉద్యమం, నిజాం స్టేట్‌లో ప్రజా ఉద్యమం, సహకారోద్యమంలో పాల్గొన్నాడు. నల్లగొండ, మల్కాపూర్ వ్యవసాయదారుల సహకార సంఘం స్థాపించి వారి అభివృద్ధికి పాటుపడ్డాడు. రామచంద్రరావు, జైలులో ప్రతికొరడా దెబ్బకు బదులుగా వందేమాతరం చెబుతూ స్పృహ తప్పిపోయినా వందేమాతరం నినాదాన్ని వదలనందుకు వందేమాతరం రామచంద్రరావు పేరు స్థిరపడిపోయింది.

### గడియారం రామకృష్ణశర్మ

### (06.03.1919-...07.2006)

జ్యోలపతి, సుబ్బమ్మ దంపతులకు ఆరవ సంతానంగా జన్మించాడు. జోగులాంబ గద్వాల్ జిల్లా ఆలంపూర్‌లో

స్థిరపడ్డాడు. స్వాతంత్ర్య సమరయోధుడు. గొప్ప సంఘ సంస్కర్త. మహిళల అభ్యున్నతికి, సామాజిక దురాచారాలకు వ్యతిరేకంగా పోరాడాడు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత. బాల్య వివాహాల నిర్మూలనకు పాటుపడ్డాడు. స్వయంగా బాల వితంతువు కమలను పెళ్ళి చేసుకొని అందరికి ఆదర్శవంతుడైనాడు. ఈయన బాల బ్రహ్మేశ్వరస్వామి, జోగులాంబ ఆలయాలను పునరుద్ధరించాడు. ఆలయం జూరాల ప్రాజెక్టు కింద నీటి ముంపునకు గురికాకుండా కాపాడడంలో కీలకపాత్ర పోషించాడు.

### చెన్నారెడ్డి

### (13.06.1919-02.12.1990)

రంగారెడ్డి జిల్లా పెద్ద మంగళారంలో జన్మించాడు. తల్లి శంకరమ్మ, తండ్రి లక్ష్మారెడ్డి. వైద్యవిద్య పట్టభద్రుడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రెండు పర్యాయాలు ముఖ్యమంత్రిగా పనిచేశాడు. గవర్నర్‌గా వివిధ రాష్ట్రాలకు సేవలందించాడు. హైదరాబాదు సంస్థానం ఇండియన్ యూనియన్‌లో విలీనం చేయాలనే ఉద్యమ కాలంలో సత్యాగ్రహం చేసాడు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడాడు.

### షోయబుల్లాఖాన్

### (21.10.1920-21.08.1948)

పూర్వపు వరంగల్ జిల్లాలోని మానుకోటకు చెందినవాడు. పత్రికా సంపాదకులుగా ప్రజాగళం వినిపించిన విప్లవయోధుడు. నిజాం నిరంకుశ ప్రజావ్యతిరేక పాలనను, అఖండ భారతదేశంలో హైదరాబాదు సంస్థానము విలీనం కోసం తన కలాన్ని ఖడ్గంగా మార్చి ఇమ్రోజ్ పత్రికలో తన రచనల ద్వారా ప్రజలను చైతన్యపరిచాడు. పాత్రికేయ వృత్తికే వన్నె తెచ్చిన షోయబుల్లాఖాన్ మతంపేరుతో మారణహోమం చేస్తున్న సంస్థను తన పత్రిక ద్వారా తీవ్రంగా ప్రతిఘటించాడు. చిన్న వయస్సులోనే ప్రజాగళం వినిపించినందుకు అన్యాయంగా 28 సంవత్సరాల వయస్సులో హత్యకు గురైనాడు. అమరుడైనాడు.

### బి.ఎన్.శాస్త్రి

### (1932 - 2002)

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ గ్రామంలో జన్మించాడు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎం.ఎ. చదివాడు. తెలంగాణ చరిత్ర పరిశోధనలో అగ్రగణ్యుడు. ఈయన వ్యాసాలను ఎందరో ఆర్కియాలజిస్టులు బలపరిచి ఇతర భాషలలోనికి అనువదించాడు. భారతదేశ చరిత్రపై ఇరవై ఒక్క సంపుటాలు ప్రచురించాడు. సాహిత్య, చారిత్రక పరిశోధనలు చేసిన భిన్నూరి నరసింహశాస్త్రి, శాసనాలశాస్త్రిగా ప్రసిద్ధుడయ్యాడు. 'మూసి' పత్రిక ద్వారా భాషా, సాహిత్య, చరిత్ర, సాంస్కృతిక రంగాలకు విశేషమైన సేవచేశాడు. తాను నమ్ముకున్న సిద్ధాంతం కోసం పి.హెచ్.డి. పట్టాను కూడా వదులుకున్నాడు.

### ఆచార్య కొత్తపల్లి జయశంకర్

### (06.08.1934-21.06.2011)

భూపాలపల్లి జిల్లా ఆత్మకూరు మండలం, అక్కంపేటలో జన్మించాడు. తల్లి మహాలక్ష్మమ్మ, తండ్రి లక్ష్మీకాంతాచారి. కాకతీయ విశ్వవిద్యాలయం ఉపకులపతిగా సేవలందించాడు. తెలంగాణ రాష్ట్రం కోసం అవిశ్రాంతంగా పాటుబడిన ప్రొఫెసర్ జయశంకర్ 1959, 1969, 1996 నుండి తెలంగాణ సాధన కోసం జరిగిన ఉద్యమాలలో కీలక పాత్రను పోషించాడు. తెలంగాణ సిద్ధాంతకర్తగా పేరుపొందాడు.

### సంగనభట్ల నరహరి

### (20వ శతాబ్దం)

ధర్మపుర నివాసియైన నరహరి భారత పురావస్తుశాఖ, తెలుగు ప్రాంతంలో బ్రహ్మీ, ప్రాకృతం మొదలుగాగల ప్రాచీన భాషల లిపులను చదువగల్గిన ఏకైక వ్యక్తిగా ఎనభైయ్యోదశకంలో పేరొందాడు. శాతవాహనుల చరిత్ర కోటి లింగాల మూలాలను, జినవల్లభుడు వేయించిన బొమ్మల గుట్ట శాసనాలను 1970 ప్రాంతంలోనే వెలికితీసిన ఘనుడు. అనేక ఉన్నతోద్యోగాలను వదులుకొని తెలంగాణ గడ్డ చరిత్రను తవ్వి తీయటానికి కృషిచేశాడు.

### ముగింపు

పైన తెలుపబడిన ప్రముఖులు కొందరు మాత్రమే. వారే కాకుండా జమలాపురం కేశవరావు, జి.రాంరెడ్డి, ఆబిద్‌హుసేన్ వంటి ప్రముఖులు మరెందరో ఉన్నారు.

❀❀❀❀❀

# 14. తెలంగాణ మహిళా ప్రముఖులు

తెలంగాణ రాష్ట్రంలో ఎంతో మంది స్త్రీ ప్రముఖులున్నారు. వీరు వివిధ రంగాల్లో కృషిచేసారు. స్వాతంత్ర్యోద్యమ కాలం నుండి తెలంగాణ రాష్ట్ర సాధన వరకు పోరాటాల్లో పాల్గొన్నారు. సామాజిక, సాహిత్య విద్య వంటి రంగాల్లో విశేషమైన కృషిచేసి మహిళల అభివృద్ధికి, అట్లాగే రాష్ట్రాభివృద్ధికి కృషిచేసారు. వారిలో కొందరి గురించి తెలుసుకుందాం.

**1) రుద్రమ దేవి (1220–1289) :**

క్రీ.శ. 1220 సంవత్సరంలో జన్మించిన రుద్రమదేవి కాకతీయ చక్రవర్తి గణపతిదేవుని కుమార్తె. కొడుకులేని కారణంగా గణపతిదేవుడు రుద్రమదేవికి అన్ని రాజనీతి, రాజకీయ యుద్ధవిద్యలూ నేర్పి కొడుకులాగా పెంచాడు. అన్ని విద్యలలో ఆరితేరిన రుద్రమదేవి శత్రువులను చిత్తుగా ఓడించింది. 1262 నుండి 1289 వరకు కాకతీయ సామ్రాజ్యాన్ని పాలించింది. దక్షిణ భారతదేశంలో మొదటి మహిళా సామ్రాజ్ఞిగా రుద్రమదేవి పేరు చరిత్రలో చిరస్థాయిగా నిలిచింది.

**2) సమ్మక్క – సారక్క (13వ శతాబ్దం) :**

సమ్మక్క – సారక్కలు 12వ శతాబ్దానికి చెందినవారు. వీరిద్దరూ తల్లీ కూతుళ్ళు. వీరు ఆనాటి కరువు పరిస్థితుల్లో పన్ను చెల్లించేది లేదని కాకతీయులతో పోరాడిన వీరవనితలు. వీరి పేరు మీద జయశంకర్ జిల్లా తాడ్వాయి మండలం మేడారం గ్రామం దగ్గర ఉన్న దట్టమైన అడవిలోని 'చిలకలగుట్ట' దగ్గర జాతర రెండేళ్ళకోసారి గొప్పగా జరుగుతుంది.

**3) సరోజినీనాయుడు (1879–1949) :**

హైదరాబాదులో జన్మించిన సరోజినీ దేవి లండన్ కింగ్స్ కాలేజి, కేంబ్రిడ్జిలోనూ చదువుకున్నారు. ఈమె రాసిన కవితలకుగాను ఈమెకు "నైటింగేల్ ఆఫ్ ఇండియా" అనే బిరుదు వచ్చింది. దేశరాజకీయాలలో చురుగ్గా పాల్గొన్న ఈమె 'క్విట్ ఇండియా' ఉద్యమంలో పాల్గొన్నారు. దేశానికి స్వాతంత్ర్యం లభించాక నేడు ఉత్తరప్రదేశ్‌గా పిలువబడుతున్న సంయుక్త రాష్ట్రాల తొలి గవర్నర్‌గా పనిచేసారు.

**4) సుగ్రా హుమాయూన్ మీర్జా (1882–1958) :**

సుగ్రా హుమాయూన్ మీర్జా హైదరాబాదులో పుట్టింది. ఈమె ముస్లిం స్త్రీల విద్యకోసం, సాంస్కృతికాభివృద్ధి కోసం జీవితమంతా పాటుపడింది. ఈమె 'అంజుమన్–ఏ–ఖవాతీన్–ఎదక్కన్' అనే సంస్థను ప్రారంభించి దాంట్లో మహిళలకు వృత్తి విద్యలను నేర్పేది. 1919లో బాలికల కోసం రెండు పాఠశాలలను కూడా పెట్టింది. అంతేకాక తన ఆస్తిలో ఎక్కువ భాగం 'మద్రాసా–ఎ–సఫాదారియా' అనే బాలికల పాఠశాలకు ఇచ్చింది.

**5) మార్సెలిన్‌లిమా (1899–1984) :**

మార్సెలిన్ లిమా 1925లో సికింద్రాబాదులోని 'కింగ్ ఎడ్వర్డ్ మెమోరియల్' ఆస్పత్రిలో మెడికల్ ఆఫీసర్‌గా ఉద్యోగంలో చేరింది. 1958లో పదవీవిరమణపొందిన ఈమె స్వంతంగా ప్రాక్టీసుపెట్టి ఒక డాక్టర్‌గా మహిళలకు ఎనలేని సేవ చేసింది. అంతర్జాతీయ మహిళా సంవత్సరం సందర్భంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1975 సం॥లో లిమాను సత్కరించి గౌరవించింది.

### 6) కాన్‌స్టంట్స్‌గిబ్స్ (1900-1984) :

హైదరాబాదు ఎడ్యుకేషన్ సర్వీస్‌లో చేరిన గిబ్స్ స్త్రీల విద్య కోసం ఎంతో కృషిచేసింది. స్త్రీల కోసం 'కరుణ గార్డెన్' పాఠశాలను నిర్వహించింది. 40 సం॥లకు పైగా ఆమె లేడీ హైదరీక్లబ్‌కు కార్యదర్శిగా, కోశాధికారిగా పనిచేసింది. ఇక్కడి ఉస్మానియా విశ్వవిద్యాలయ మహిళా కళాశాల సభ్యులలో ఈమె ఒకరు.

### 7) డా॥ శాంతాబాయి కిర్లోస్కర్ (1901-1986):

డాక్టర్ శాంతాబాయి కిర్లోస్కర్ హైదరాబాదు నివాసి. 1929 నుండి 1936 వరకు సికిందరాబాదులోని కింగ్ ఎడ్వర్డ్ మెమోరియల్ ఆస్పత్రిలో సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా పనిచేసింది. ఈమె 1936లో కింగ్ కోఠీ రోడ్డులో స్వంతంగా ఒక ప్రసూతి వైద్యశాలను ప్రారంభించింది.

### 8) మాసుమాబేగం (1901-1990) :

మాసుమాబేగం హైదరాబాదులో పుట్టింది. స్త్రీలు ఎక్కువగా బయటకురాని ఆరోజుల్లో నైజాం రాజ్యంలో గ్రాడ్యుయేట్ చేసిన మొదటి ముస్లిం మహిళ ఈమె. ఆల్ ఇండియా ఉమెన్స్ కాన్ఫరెన్స్‌కు 1962-64 మధ్య కాలంలో అధ్యక్షులుగా పనిచేసింది. హైదరాబాదు నుండి మంత్రిపదవిపొందిన మొట్టమొదటి మహిళ. ఈమె బీద పిల్లల కోసం 'అంజుమన్-ఎ-ఖవాతీన్' సంస్థను స్థాపించింది. ఈమె చేసిన సాంఘిక సేవకుగాను భారత ప్రభుత్వం 'పద్మశ్రీ' బిరుదునిచ్చింది.

### 9) పద్మజానాయుడు (1905-1975) :

పద్మజానాయుడు హైదరాబాదులో పుట్టింది. గాంధీజీ బోధనలతో ప్రభావితమై జాతీయ రాజకీయాలలో పాల్గొన్నది. 1950 నుండి 1952 వరకు ప్రొవెన్షియల్ పార్లమెంటు సభ్యులుగా ఉన్నది. 1956 నుండి 1962 వరకు పశ్చిమ బెంగాల్ రాష్ట్ర గవర్నర్‌గా పనిచేసింది. భారత ప్రభుత్వంచే 1962 సం॥లో 'పద్మవిభూషణ్' బిరుదుతో సత్కరించబడింది.

### 10) సంగెం లక్ష్మీబాయి (1910-1979) :

సంగెం లక్ష్మీబాయి హైదరాబాద్‌లోని మలక్‌పేట నివాసి. మేడ్చల్ జిల్లాలోని ఘట్‌కేసర్‌లో పుట్టింది. చదువు కోసం అహర్నిశలు తపించింది. శారదానికేతన్‌లో విద్యనభ్యసించింది. సత్యాగ్రహంలో పాల్గొని జైలుశిక్షను అనుభవించింది. హైదరాబాదు రాష్ట్రంలో 1950లో శాసన సభ్యురాలిగా ఎన్నికై బూర్గుల రామకృష్ణారావు మంత్రివర్గంలో విద్యాశాఖ సహాయమంత్రిగా పనిచేసింది. మలక్‌పేటలోని తన ఇంట్లో నిరాశ్రయులైన స్త్రీలకు వసతి కల్పించింది. నా జైలు జీవితం అనే తన ఆత్మకథను రాసుకుంది.

### 11) జనంపల్లి కుముదినీదేవి (1911-2009) :

కుముదినీదేవి రావుబహదూర్ వెంకటరామ రెడ్డి కూతురు. 1958లో స్థాపించిన 'సేవా సమాజ బాలికా నిలయం' సభ్యులలో కుముదినీ ఒకరు. 1962లో హైదరాబాదు తొలి మహిళా మేయర్‌గా పనిచేసారు. వనపర్తి నియోజకవర్గం నుంచి 1962-72 సంవత్సరంలో రెండు సార్లు శాసన సభ్యురాలిగా ఎన్నికయింది. 1994వ సంవత్సరంలో 'యుధ్‌వీర్' అవార్డును, 1977వ సంవత్సరంలో 'మెహదీజంగ్ సెంటినరీ హ్యూమన్‌రైట్స్' అవార్డునూ పొందింది.

### 12) జమాలున్నీసాబాజి :

జమాలున్నీసాబాజి నిజామాబాద్‌లో ఒక మధ్య తరగతి కుటుంబంలో 1913లో జన్మించింది. 1945 సంవత్సరంలో జరిగిన అఖిలభారత రచయితల సంఘం సభలలో పాల్గొన్నది. ఈమె కమ్యూనిస్టు పార్టీలో 1946 సభ్యురాలిగా చేరింది. ఈమె స్వతంత్ర్యోద్యమంలో చురుకుగా పనిచేసింది.

### 13) ఈశ్వరీబాయి (1918-1991) :

ఈశ్వరీబాయి సికింద్రాబాదులో పుట్టింది. ఈమె రాజకీయాలలో చురుగ్గా పాల్గొన్నది. 1951లో జరిగిన పురపాలక సంఘ ఎన్నికలలో ఎవరి సహాయం

లేకుండానే గెలిచింది. ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ కులాల ఫెడరేషన్‌కు 1960లో ప్రధాన కార్యదర్శిగా పనిచేసింది. నిజామాబాద్ జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గం నుండి 1967లో రిపబ్లిక్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచింది.

### 14) జ్ఞానకుమారిహెడా :

ఉత్తరప్రదేశ్‌లోని ఖుర్జా జిల్లాలోని బులంద్ పహార్‌లో జ్ఞానకుమారి 1918లో జన్మించింది. 1936లో హైదరాబాద్‌కు చెందిన హరీష్ చంద్రహెడాతో పెళ్ళి కావటంతో ఆమె హైదరాబాద్ వచింది. సాంఘిక రాజకీయ చైతన్యం పెరగటానికి పనిచేసిన తొలితరం మహిళ. జ్ఞానకుమారి నైజాం రాజ్యం భారతదేశంలో విలీనమయ్యాక తెలంగాణ గ్రామాలన్నీ పర్యటించింది. హైదరాబాదులోని కస్తూర్బా ట్రస్టు రూపురేఖలను మార్చింది. 1953-60 మధ్యకాలంలో పొదుపు ఉద్యమ కేంద్రీయ సలహా సంఘ సభ్యురాలిగా పనిచేసింది.

### 15) కుమ్రం సోంబాయి (1918-1994) :

కుమ్రం భీం భార్య సోంబాయి. ఈమెది కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా. 1940 సంవత్సరంలో జోడెఘాట్‌ని సైనికులు తుపాకులతో చుట్టు ముట్టినప్పుడు వారితో యుద్ధం చేసింది. ఆ సమయంలో సోంబాయి నెలలవయసున్న తన కొడుకుని నడుంకు బిగించికట్టుకొని యుద్ధంలోకి దిగిన ధీరవనిత.

### 16) చిట్యాల ఐలమ్మ (1919-1985) :

పాలకుర్తి గ్రామంలో పుట్టిన ఐలమ్మ రజక కులానికి చెందింది. కాబట్టి చాకలి ఐలమ్మగా పేరొందింది. ఈమె ధైర్యసాహసాలు కలది. తన వృత్తిని వదలి వ్యవసాయం చేయాలని చూసిన ఐలమ్మను ఆనాటి దొరలు అనేక కష్టాలపాలుచేసారు. ఆమె భర్తను, కొడుకులను కూడా చిత్రహింసలు పెట్టారు. అయినా ధైర్యంతో వారిని ఎదిరించి పోరాడిన ధైర్యవంతురాలు ఐలమ్మ.

### 17) ఆరుట్ల కమలాదేవి (1920-2001) :

ఆరుట్ల కమలాదేవి నల్లగొండ జిల్లా ఆలేరు తాలూకా మంతపురి గ్రామంలో పుట్టింది. కమలాదేవి వివాహానంతరం కూడా చదువు కొనసాగించింది. పట్టుదలతో మెట్రిక్ పూర్తిచేసింది. ఈమె మహిళా ఉద్యమాలలో పాల్గొనేది. గ్రామీణ వయోజనులను అక్షరాస్యులుగా మార్చింది. 'మహిళా ఆత్మరక్షణ శిబిరం'లో సైనిక శిక్షణపొందింది. 1964లో శాసనసభ ప్రతిపక్ష నాయకురాలిగా బాధ్యతలు నిర్వహించింది. 1998లో కాకతీయ విశ్వవిద్యాలయం ఆమెకు గౌరవ డాక్టరేట్ ప్రధానం చేసింది.

### 18) బ్రిజ్ రాణీగౌడ్ :

బ్రిజ్ రాణీగౌడ్ హైదరాబాదులో 1920లో పుట్టింది. ఈమె సేవామార్గాన్ని ఎంచుకున్నది. 'నవజీవన్' మహిళా మండలి సేవా కార్యక్రమాలలో, సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనేది. 1972లో ఆంధ్రమహిళా సమాఖ్యలో భాగమై జర్మన్ డెమొక్రటిక్ రిపబ్లిక్‌లో జరిగిన ప్రజాతంత్ర మహిళా సమాఖ్య అంతర్జాతీయ సదస్సులో 1975లో పాల్గొన్నది. రష్యా, బల్గేరియా, మంగోళియా దేశాల ఆహ్వానంతో ఆయా దేశాలకు వెళ్ళింది. 1980-82 సంవత్సరంలో ఆంధ్ర మహిళా సమాఖ్య అధ్యక్షురాలిగా ఉన్నది.

### 19) జీనత్‌సాజిదా :

సాజిదా 1920లో రాయచూర్‌లో పుట్టింది. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఉర్దూ సాహిత్యంలో ఎమ్.ఎ.పట్టా అందుకున్నది. 'జలతరంగ్' అనే పేరుతో ఈమె కథలు ప్రచురింపబడ్డాయి. "తెలుగు ఆదాబ్‌కి తారీక్" అనే పేరుతో తెలుగు సాహిత్య చరిత్రను రాసింది. దక్కనీ సాహిత్యం గురించి "కులియత్-ఏ-షాహి" "అలి ఆదిల్‌షా" అనే పుస్తకాలు రాసింది. సాజిదా సృజనాత్మక రచయిత్రి. సాహితీ విమర్శకురాలు.

**20) బానుతాహెరా సహీద్ :**

బానుతాహెరా ఆగ్రాలో 1924లో జన్మించింది. 1945లో మేజర్ సయీద్‌ని పెళ్ళి చేసుకుని హైదరాబాద్ వచ్చి స్థిరపడింది. బానుతాహెరా ఉర్దూ, ఇంగ్లీషు, పర్షియన్ భాషలలో రచనలు చేసింది. 1959లో ఆమె రచించిన ఉర్దూ రచనలకు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు అందుకున్నది. ఇంకా 'బర్గేసబ్జ్' కవితా సంకలనానికి అఖిల భారత స్థాయిలో అవార్డు వచ్చింది. ఇతర ఎన్నో అవార్డులను కూడా ఆమె పొందింది.

**21) శాంతారామేశ్వరరావు :**

శాంతా రామేశ్వరరావు 1925లో జన్మించింది. శాంత హైదరాబాద్‌లో విద్యారణ్య హైస్కూలును 1961లో స్థాపించి కొత్త ప్రయోగాలు చేసింది.పిల్లల స్థాయిని అంచనావేయడానికి పరీక్షలు అవసరంలేదని చెపుతారు. శాంత మంచి రచయిత్రి కూడా. ఈమె రాసిన 'మత్స్య', 'మోహినీభస్మాసుర' అనే పుస్తకాలను నేషనల్ బుక్ ట్రస్టు వారు ప్రచురించారు.

**22) వనజా అయ్యంగార్ (1926-1999) :**

హైదరాబాద్‌లో పుట్టిన వనజా అయ్యంగార్ ఉస్మానియా కేంబ్రిడ్జి యూనివర్సిటీలలో గణితశాస్త్రం చదివింది. ఈమె 'ఐన్‌స్టీన్ థీరి ఆఫ్ రెలిటివిటీ' గురించి ఢిల్లీ యూనివర్సిటీ ద్వారా పరిశోధన చేసింది. పద్మావతి మహిళా విశ్వవిద్యాలయాల్లో వైస్‌ఛాన్సలర్‌గా, కోఠి మహిళా కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేసింది. మహిళలకు ఉపయోగపడే ప్రత్యేకమైన ఉపాధి కోర్సులనూ ప్రవేశపెట్టింది. ఆంధ్రమహిళా సభకు ఉపాధ్యాక్షురాలిగా, అధ్యక్షురాలిగా పనిచేసింది.

**23) సరోజినీ రేగాని :**

సరోజినీ రేగాని సికింద్రాబాద్‌లోని సిక్ విలేజ్‌లో 1927లో పుట్టింది. ఈమె చరిత్ర ప్రధానాంశంగా ఎమ్.ఎ. చేసింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సంస్థ అయిన 'స్టేట్ ఆర్కైడివ్స్' డైరెక్టరుగా ఉండి ఆ సంస్థ అభివృద్ధికి కృషి చేసింది. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ హిస్టారికల్ రీసెర్చి సభ్యులుగా, ఉస్మానియా విశ్వ విద్యాలయంలో సాంఘికశాస్త్రాల విభాగానికి డీన్‌గా మొదలైన అనేక బాధ్యతాయుతమైన స్థానాలను అలంకరించింది.

**24) టి.ఎన్.సదాలక్ష్మి :**

సదాలక్ష్మి హైదరాబాద్‌లోని బొల్లారంలో 1928లో పుట్టింది. ఈమె అంబేద్కర్ ఉపన్యాసాలతో ప్రభావితురాలై రాజకీయాలలో ప్రవేశించింది. 1952లో పెద్దపల్లి నుండి, 1957లో కామారెడ్డి నుండి ఎన్నికలలో పోటీచేసి గెలిచింది. అసెంబ్లీలో డిప్యూటీ స్పీకర్‌గా బాధ్యతలు నిర్వహించింది. 1982లో తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులుగా ఉన్నది. లెజిస్లేటివ్ కమిటీ సభ్యులుగా కూడా ఉన్నది.

**25) స్నేహలతా భూపాల్ :**

స్నేహలత హైదరాబాదులో 1928లో ఒక భూస్వామ్య కుటుంబంలో పుట్టింది. ఈమె 1950-69 సంవత్సరాల మధ్య కాలంలో భారత సైన్యానికి వైజ్ఞానిక కార్యక్రమాలను, వికలాంగులకు కుటీర పరిశ్రమనూ, జాతీయ పొదుపు కార్యక్రమాలు నిర్వహించింది. రాష్ట్రంలో బ్యాడ్మింటన్ అసోసియేషన్‌కు మొదటి కార్యదర్శిగా పనిచేసింది. 1969లో ద్రాక్ష తోటలువేసి స్వయంగా తానే అమ్మకాలు చేసింది. 1970లో హైదరాబాదు-కామధేను అనే డైరీఫాంను నెలకొల్పింది. హైదరాబాదులో 1988వ సంవత్సరంలో వారం రోజులపాటు స్త్రీ మేళాను కూడా నిర్వహించి స్త్రీల సమస్యల గురించి చర్చించింది.

**26) మల్లు స్వరాజ్యం :**

మల్లు స్వరాజ్యం 1930లో నల్లగొండ జిల్లా తుంగతుర్తి మండలంలోని కర్విరాల కొత్తగూడెం గ్రామంలో జన్మించింది. అప్పటి నైజాం రాజ్యంలో స్త్రీల పరిస్థితి దారుణంగా ఉండేది. అప్పటి నుండే స్వరాజ్యం స్త్రీల గురించి ఆలోచించేది. పన్నెండేళ్ళ వయసునుండే

పోరాటాలలో పాల్గొంది. నాల్గవ తరగతి వరకే చదివిన స్వరాజ్యం ఉపన్యాసాలిస్తుంటే విద్యార్థికులు సైతం చకితులయ్యేవారు. కమ్యూనిస్టు పార్టీ గ్రామరాజ్యాల నిర్వహణ కోసం స్వరాజ్యాన్ని నియమించింది. 1978లో జరిగిన సాధారణ ఎన్నికలలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభలో సభ్యురాలుగా ఉన్నది.

## 27) చిందు ఎల్లమ్మ :

చిందు ఎల్లమ్మ 1933లో నిజామాబాద్ జిల్లాలోని బోధన్ మండలంలోని ఆమేదాపూర్ గ్రామంలో జన్మించింది. అంటరానితనం, కులపరమైన అవమానాలు, బీదరికం మొదలైనవన్నీ ఆమెను వేధించాయి. ఎల్లమ్మ ప్రతిభను గుర్తించి నటరాజరామకృష్ణ ఆమె ప్రదర్శనను హైదరాబాదులో ఏర్పాటుచేశాడు. 1998 సం॥లో ఆమెకు రాష్ట్ర సాంస్కృతిక మండలి 'హంస' అవార్డునిచ్చి గౌరవించింది.

## 28) వినోదినీ రెడ్డి :

తెలంగాణ రెడ్డి కులంలో 1934లో పుట్టింది వినోదిని. విటమిన్ 'ఎ' గురించి ఆమె చేసిన అధ్యయనం 'పరిశోధన, పిల్లల అంధత్వాన్ని నిరోధించేందుకు తోడ్పడింది. ఐక్యరాజ్య సమితి ఆహార వ్యవసాయ సంఘం (ఎఫ్.ఎ.ఓ) ప్రపంచ ఆరోగ్యసంస్థ (డబ్ల్యూ.హెచ్.ఒ.) యునిసెఫ్ వంటి అంతర్జాతీయ సంస్థలలో ఈమె పనిచేసారు. ప్రపంచ ప్రసిద్ధిపొందిన వైద్య శాస్త్రవేత్తగా అనేక గౌరవాలను, గుర్తింపులను, అవార్డులనూ పొందింది.

ఇటువంటి మహిళా ప్రముఖులు నేడు కూడా ఎంతో మంది రాజకీయ రంగంలో, సేవా రంగంలో, క్రీడా రంగంలో, సాహిత్య రంగాలలో ఉన్నారు.

ఉదా : పూర్ణిమారావు, మిథాలీరాజ్–క్రికెట్ ఆటలో, సానియామీర్జా–టెన్నిస్‌లో, సైనానెహ్వాల్, పి.వి.సింధు – బాడ్మింటన్ క్రీడలో రాణించి తెలంగాణ కీర్తి పతాకాన్ని విశ్వవ్యాప్తం చేసారు.

జిలానీబాను పద్మశ్రీ అవార్డుపొందింది. ఈమె సాహిత్యరంగంలో విశేషమైన కృషి చేసింది. డాఫ్నీ ఎమ్.డి. రెబెల్లో సికింద్రాబాదులో చదువుకొని మొదటి మహిళా ఐ.ఎ.ఎస్. ఆఫీసర్‌గా పనిచేసింది. పరిపాలనా రంగంలో సేవలందించింది. ఉగాండాలో జన్మించిన సుజీతారు హైదరాబాద్‌లోని ఇఫ్లూ విశ్వవిద్యాలయంలో పనిచేసింది. ఈమె విద్యా రంగంలో కృషి చేస్తున్నది. రామన్ మెగసెసె అవార్డు గ్రహీత శాంతాసిన్హా. బాలకార్మిక విమోచన ఉద్యమానికి కృషిచేసి బాలల హక్కుల కోసం పాటుపడింది. ఎనిమిది భాషల్లో ప్రావీణ్యత కల్గిన జన్‌బీర్‌కౌర్ సంగీతరంగంలో విపరీతమైన కృసిచేసింది. కె.లలిత, గీతారామస్వామి, విమల, నిర్మల, గొర్రె సత్యవతి వంటి మహిళలు సామాజిక రంగంలో స్త్రీలకు సంబంధించి విశేషమైన కృషి చేస్తున్నారు. సినిమారంగంలో కరీంనగర్‌కు చెందిన శోభాలత మేకప్ రంగంలో కీర్తినార్జించింది. వసంత కన్నాభిరాన్, కల్పనాకన్నాభిరాన్ వంటివాళ్ళు స్త్రీవాద ఉద్యమాల్లో పాల్గొని మహిళాభ్యుదయానికి కృషిచేస్తున్నారు.

***మూలం :*** *మహిళావరణం*

*(అన్వేషి సంస్థకు ధన్యవాదములు)*

❁❁❁❁❁

# 15 . ప్రాచీన కవులు

ఆదిమ కాలం నుండి ఆధునిక కాలం దాకా తెలంగాణ నేల తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంతరించుకొన్నది. దేశీయ తెలుగుభాష సంస్కృత భాషాప్రభావంతో తత్సమ భాషగా రూపొందిన పరిణామం మొదట ఇక్కడి నేలలోనే దర్శనమిచ్చింది. తెలంగాణ నేల తనదైన అస్తిత్వాన్ని, ప్రత్యేకతను, ఔన్నత్యాన్ని కలిగి ఉంటూనే సాహిత్యపరమైన గుర్తింపును పొందింది. ఇక్కడి కవుల ఘనత, ఇక్కడి సాహిత్య వైశిష్ట్యం తెలుగునేలను సుసంపన్నం చేసింది. ప్రాశస్త్యం పొందిన మన తెలంగాణ ప్రఖ్యాత కవులను ఒకసారి తరచి చూద్దాం. కాలాల వారీగా ఆయా కవుల ఘనతను స్పృశిస్తూనే వారి సేవను స్మరిద్దాం!

### క్రీ.పూ. 225 నుండి క్రీ.శ. 225 వరకు శాతవాహన యుగం

పూర్వ కరీంనగర్ జిల్లా కోటిలింగాలను తొలి రాజధానిగా చేసుకొని పాలించిన శాతవాహనులు పైఠాన్, అమరావతి ప్రాంతాలకు విస్తరించినట్లు చారిత్రక ఆధారాలు లభిస్తున్నాయి. శాతవాహనుల కాలంలో రాజభాష ప్రాకృతమైనప్పటికీ జనవ్యవహార భాషగా తెలుగు ఉండడం ఒక విశేషం. మొట్టమొదటి కథాకావ్యాన్ని అందించిన గుణాఢ్యుడు, గాథాసప్తశతిని కూర్చిన హాలుడు ఈ కాలంలో సుప్రసిద్ధులుగా వెల్గొందారు. ఈ కాలంలోని మరికొందరు కవులు – వారి సాహిత్య సేవ...

| క్ర.సం. | కవి | రచనలు | ప్రక్రియ | ప్రత్యేకత |
|---|---|---|---|---|
| 1 | గుణాఢ్యుడు (కొండాపురం మెదక్ జిల్లా) | బృహత్కథ | కథాకావ్యం | ప్రపంచ కథా వాఙ్మయంలో ఆదిగ్రంథం |
| 2 | హాలుడు (కరీంనగర్) | గాథాసప్తశతి | పద్యసంకలనం | తెలుగు ఛందం కందానికి దగ్గరగా ఉన్న 'గాథా' ఛందంలో రాసిన 700 పద్యాల సంకలనం |
| 3 | శర్వవర్మ | కాతంత్ర వ్యాకరణం | లక్షణ గ్రంథం | – |
| 4 | కుతూహలుడు | లీలావతి పరిణయం | ప్రాకృత కావ్యం | – |
| 5 | కొండ కుందాచారి | సమయసారం | బౌద్ధ సూక్తులు (సంకలన గ్రంథాలు) | – |
| 6 | ఆచార్య నాగార్జునుడు (నల్గొండ) | మాధ్యమిక సూత్రములు సుహృల్లేఖ, రత్నావళి శూన్యతాసప్తతి | (లేఖా గ్రంథం) | నలందా విశ్వవిద్యాలయ ఆచార్యుడు. బౌద్ధ ధర్మ తాత్త్వికుడు |
| 7 | నాచి | నాచీ విజయం | నాటకం | సంస్కృతభాషలో నాటకాన్ని రాసిన తొలి కవయిత్రి |

## 8వ శతాబ్ది నుండి 10వ శతాబ్ది వరకు గల కవులు

అధికార భాష ప్రాకృతం నుండి సంస్కృతం రాజభాషగా పరిణామం చెందిన కాలమిది. లభించిన గద్య శాసనం తెలుగు వచన రచనా శైలికి, క్రమ పరిణామానికి, సాహిత్య భాషా పరిణతికి సజీవ సాక్ష్యం ఈ కాలమే! శాసనాల్లో తెలుగు పదాలు విస్తృతంగా లభించాయి. విస్తారమైన సంస్కృత సాహిత్యం వెలుగుచూసిందీ కాలంలోనే కావడం విశేషం.

ఈ కాలంలోని ప్రధాన కవులు వారి సాహిత్య సేవను అవలోకిద్దాం.

| క్ర.సం. | కవి | రచనలు | ప్రక్రియ | ప్రత్యేకత |
|---|---|---|---|---|
| 1 | నయనసేనుడు | ధర్మామృతం | సంస్కృత కావ్యం | జైన మత సంబంధ కావ్యం |
| 2 | మాధవ వర్మ | జనాశ్రయం, ఛందోవిచ్ఛిత్తి | ఛందోగ్రంథం | సంస్కృతంలో ఛందో గ్రంథం రాసిన తెలుగుకవి |
| 3 | భవభూతి<br>(క్రీ.శ.680)<br>(బోధన్, నిజామాబాద్) | ఉత్తరరామచరితం<br>మాలతీమాధవం<br>మహావీరచరితం | సంస్కృత నాటకం<br>నాటకం<br>నాటకం | లబ్ధ ప్రతిష్టుడైన సంస్కృత కవి |
| 4 | పద్మకవి (పంపన)<br>(క్రీ.శ.941)<br>(బోధన్, నిజామాబాద్) | విక్రమార్జున విజయం<br>జినేంద్ర పురాణం | కన్నడ కావ్యం<br>తెలుగు కావ్యం | కన్నడ రత్నత్రయంలో ఒక కవి<br>కన్నడ భాషలో ఆదికవి |
| 5 | జిన వల్లభుడు<br>(క్రీ.శ.940)<br>(వేములవాడ) | – | శాసనంలో పద్యం | తెలంగాణలో తెలుగు పద్యాలతో శాసనం వేయించిన తొలి శాసనకర్త. త్రిభాషా పండితుడు |
| 6 | మల్లియ రేచన<br>(క్రీ.శ.940) | కవిజనాశ్రయం | ఛందోగ్రంథం | తొలి తెలుగు ఛందో గ్రంథకర్త |
| 7 | సోమదేవసూరి<br>(క్రీ.శ.950)<br>(కరీంనగర్) | కథాసరిత్సాగరం | కథాకావ్యం | సంస్కృత పండితుడు |

## 11వ శతాబ్ది కవులు

శాసనభాషకు కావ్యభాషకు సంధికాలమిది. రచనా శైలి స్థిరీకరణపొంది తర్వాత కవులకు మార్గదర్శకం చేసినది 11వ శతాబ్దమే! నన్నయ అవతారికలోని పద్యం ద్వారా తెలుగు సాహిత్యలోకంలో విశేష స్థానం సంపాదించుకున్న యశోమూర్తి నారాయణభట్టు. వాఙ్మయ దురంధరునిగా కీర్తిపొందిన నారాయణభట్టు సహకారంతోనే అనువాదం చేశానని నన్నయ తనకుతాను పేర్కొన్నాడు. ఆ నారాయణభట్టు ఇక్కడివాడే.

ఇదేకాలానికి చెందిన వేములవాడ భీమకవి రాఘవ పాండవీయం కావ్యం రాసినట్లు ఆధారాలు లభిస్తున్నా అది అలభ్యం. నరసింహపురాణం, శతకంధర రామాయణం కూడా వేములవాడ భీమకవి రచించినట్లు చెబుతున్నా అవికూడా అలభ్యాలే!

## 12వ శతాబ్ది కవులు

సాహిత్యం ద్వారా వీరశైవ ప్రచారానికి పూనుకొన్న కవులంతా ఈ కాలం వారే! తొలిదేశీ పురాణం, చారిత్రక కావ్యం, శతకం, ఉదాహరణ, రగడ మున్నగు ప్రక్రియలను తెలుగుసాహిత్యానికి అందించిన ఈ కాలం శివకవియుగంగా పేరొందింది. ఈ కాలం కవులు – రచనలను పరిశీలిద్దాం!!

| క్ర.సం. | కవి | రచనలు | ప్రక్రియ | ప్రత్యేకత |
|---|---|---|---|---|
| 1 | మల్లికార్జున పండితారాధ్యుడు (1150) | శివతత్త్వసారం<br>శ్రీగిరి మల్లికార్జున శతకం | పద్యసంకలనం<br>శతకం | శివకవి |
| 2 | పాల్కురికి సోమన (1160-1240) (పాలకుర్తి, వరంగల్లు) | బసవపురాణం<br>వృషాధిప శతకం<br>పండితారాధ్య చరిత్ర<br>చెన్నమల్లు సీసాలు<br>చతుర్వేదసారము | ద్విపద కావ్యం<br>శతకం<br>కావ్యం<br>శతకం<br>శాస్త్ర గ్రంథం | తొలిదేశీ పురాణ కర్త<br>తొలి తెలుగు శతక కర్త<br>తొలి చారిత్రక కావ్య కర్త<br>సీస పద్యాలతో తొలి శతక ప్రయోగకర్త |
| 3 | మొదటి ప్రతాపరుద్రుడు (1158) (ఓరుగల్లు) | నీతిసారము | రాజనీతిగ్రంథం | - |
| 4 | నన్నెచోడుడు | కుమారసంభవం | కావ్యం | - |

## 13వ శతాబ్ది కవులు

తెలుగులో తొలి రామాయణం వెలువడింది ఈ శతాబ్దంలోనే! గోనబుద్ధారెడ్డి రంగనాథ రామాయణం ద్విపదకావ్యమై ఆ తర్వాత రామాయణ కవులకు దిశానిర్దేశం చేసింది. ఈ కాలం కవుల రచనలను - వారి ప్రత్యేకతలను అవలోకిద్దాం!

| క్ర.సం. | కవి | రచనలు | ప్రక్రియ | ప్రత్యేకత |
|---|---|---|---|---|
| 1 | గోనబుద్ధారెడ్డి (1210) (నాగర్ కర్నూల్) | రంగనాథ రామాయణం | ద్విపదకావ్యం | తొలి తెలుగు రామాయణకర్త |
| 2 | చక్రపాణి రంగనాథుడు | గిరిజాధినాయక శతకం<br>శ్రీగిరినాథ విక్రమం | శతకం<br>రగడ | - |
| 3 | శివదేవయ్య (1220) | శివదేవ ధీమణి శతకం | శతకం | - |
| 4 | శ్రీకంఠం కృష్ణమాచార్యులు (మహబూబ్‌నగర్) (1268-1323) | సింహగిరి వచనాలు | వచన సంకీర్తన | తొలి వచన సంకీర్తనాచార్యుడు |
| 5 | మారన (1289-1323) (ఓరుగల్లు) | మార్కండేయ పురాణం | పురాణం | తెలుగులో తొలి మార్గపురాణకర్త |
| 6 | విద్యానాథుడు (1289-1323) (ఓరుగల్లు) | ప్రతాపరుద్ర యశోభూషణం | లక్షణ గ్రంథం | సంస్కృతాలంకారిక గ్రంథం రాసిన తెలుగువాడు |
| 7 | అగస్త్యుడు | బాలభారతం<br>నలకీర్తికౌముది | కావ్యం<br>కావ్యం | -<br>- |
| 8 | శరభాంకుడు (1289) ఓరుగల్లు | శరభాంకలింగ శతకం | శతకం | - |

| క్ర.సం. | కవి | రచనలు | ప్రక్రియ | ప్రత్యేకత |
|---|---|---|---|---|
| 9 | నరసింహుడు (1289–1323) ఓరుగల్లు | మలయవతి<br>కాకతీయ చరిత్ర | గద్య కావ్యం<br>కావ్యం | – |
| 10 | కుప్పాంబిక (1230–1300) | అలభ్యం | పద్యం | తెలుగులో మొదటి రామాయణం రాసిన గోన బుద్ధారెడ్డి కూతురు |

## 14వ శతాబ్ది కవులు

తెలుగులో చంపూకావ్యంగా వెల్వడిన రామకథాకావ్యం భాస్కర రామాయణం రచించబడిన కాలం. తొలి జంట కవులు వెలుగొందిన కాలం కూడా ఇదే! ఈ కాలపు రచనాశైలి తర్వాతి కావ్యాలకు ప్రబంధాలకు మార్గదర్శనం చేసేంత సుస్థిరత పొందింది తెలుగు భాష.

| క్ర.సం. | కవి | రచనలు | ప్రక్రియ | ప్రత్యేకత |
|---|---|---|---|---|
| 1 | భాస్కర రామాయణ కవులు<br>– హుళక్కి భాస్కరుడు<br>– మల్లికార్జున భట్టు<br>– రుద్రదేవుడు<br>(14వ శతాబ్దం) | భాస్కర రామాయణం | కావ్యం | తొలి తెలుగు చంపూ రామాయణం |
| 2 | అయ్యలార్యుడు | భాస్కర రామాయణం యుద్ధకాండ | కావ్యం | – |
| 3 | అప్పయార్యుడు (1310) వరంగల్ | జినేంద్ర – కళ్యాణాభ్యుదయం | సంస్కృత కావ్యం | – |
| 4 | రావిపాటి త్రిపురాంతకుడు ఓరుగల్లు (14 శ॥ పూర్వార్ధం) | త్రిపురాంతకోదాహరణం<br>అంబికా శతకం | ఉదాహరణ కావ్యం<br>శతకం | – |
| 5 | విశ్వేశ్వరుడు (క్రీ.శ.1320) | చమత్కార చంద్రిక | అలంకార శాస్త్రం | – |
| 6 | కందనామాత్యుడు (రాయగిరి దుర్గం) | నీతితారావళి | పద్యకృతి | – |
| 7 | మడికి సింగన (క్రీ.శ.1430) | సకలనీతి సమ్మతం<br>జ్ఞాన వాశిష్ఠ రామాయణం | సంకలన గ్రంథం<br>కావ్యం | తెలుగులో తొలి సంకలన గ్రంథం |

| క్ర.సం. | కవి | రచనలు | ప్రక్రియ | ప్రత్యేకత |
|---|---|---|---|---|
| 8 | నాగేంద్రకవి (1400) | రమాధీశ్వర శతకం | శతకం | – |
| 9 | సర్వజ్ఞ సింగభూపాలుడు (క్రీ.శ.1384) (రాచకొండ) | రసార్ణవ సుధాకరం<br>సంగీత సుధాకరం<br>కందర్ప సంభవం | అలంకార గ్రంథం<br>నాట్య గ్రంథం<br>భాణం | కవి, కవిపండిత పోషకుడు (రాజు), బహుముఖ ప్రజ్ఞాశాలి |
| 10 | బొమ్మకంటి అప్పయాచార్యులు (క్రీ.శ.1380) (రాచకొండ) | అమరపద పారిజాతం | వ్యాఖ్యాన గ్రంథం | అమరకోశానికి వ్యాఖ్యరాసినవాడు |
| 11 | గౌరన (క్రీ.శ.1380) (రాచకొండ) | లక్షణ దీపిక<br>నవనాథ చరిత్ర<br>హరిశ్చంద్రోపాఖ్యానం | ఛందో గ్రంథం<br>ద్విపద కావ్యం<br>కావ్యం | – |

## 15వ శతాబ్ది కవులు

భాగవతాన్ని భక్తి రసామృతంగా చిలికి, ఆలంకారిక తరగతుల్లో తేలియాడించి పాఠకుల్ని పరమపునీతులను గావించే మహాభాగవతం తేట తెలుగులో వెల్వడిన కాలం 15వ శతాబ్దమే! అంతేకాదు మహాకవి కాళిదాసు కావ్యాలకు వ్యాఖ్యాన మందించిన విద్వత్ శిరోమణి విలసిల్లింది ఈ కాలమే! 15వ శతాబ్దం నాటి ప్రముఖ కవులను వారి ప్రత్యేకతలను పరిశీలిద్దాం!

| క్ర.సం. | కవి | రచనలు | ప్రక్రియ | ప్రత్యేకత |
|---|---|---|---|---|
| 1 | బమ్మెరపోతన (15వ శ॥) (బమ్మెర–జనగామ) | శ్రీమదాంధ్ర మహాభాగవతం | పురాణం | శబ్దాలంకార ప్రయోగశీలి, వర్ణనా నిపుణుడు, భక్తకవి<br>'సహజ పండితుడు' బిరుదాంకితుడు |
| 2 | మల్లినాథసూరి (15వ శ॥) (కొల్చారం, మెదక్ జిల్లా) | (కాళిదాసు మహాకావ్యాలకు వ్యాఖ్యలు)<br>సంజీవనీ వ్యాఖ్య (కుమార సంభవం వ్యాఖ్య)<br>ఘంటాపథం (కిరాతార్జునీయ వ్యాఖ్య)<br>సర్వంకష (మాఘ కావ్యానికి వ్యాఖ్య)<br>జీవాతు (నైషధ కావ్యానికి వ్యాఖ్య) | వ్యాఖ్యానాలు | గొప్ప వ్యాఖ్యాత. తర్క, వ్యాకరణ మీమాంసాది సర్వశాస్త్రాల్లో పండితుడు |

| క్ర.సం. | కవి | రచనలు | ప్రక్రియ | ప్రత్యేకత |
|---|---|---|---|---|
| 3 | నూతనకవి సూరన (1400–1480) (దేవరకొండ) | ధనాభిరామం | కావ్యం | తెలుగులో మొదటి కల్పిత ప్రబంధం అందించినవాడు |
| 4 | భైరవ కవి (క్రీ.శ.1420) | కవి గజాంకుశం<br>రత్న పరీక్ష<br>శ్రీరంగమాహాత్మ్యం | ఛందశ్శాస్త్రం<br>కావ్యం<br>కావ్యం | తెలంగాణలో బంధకవిత్వానికీ, చమత్కార కవిత్వానికి ఆద్యుడు |
| 5 | అనంతామాత్యుడు (క్రీ.శ.1435) | భోజరాజీయం<br>ఛందోదర్పణం<br>రసాభరణం | కావ్యం<br>ఛందోగ్రంథం<br>అలంకార శాస్త్రం | – |
| 6 | ఏర్చూరి సింగన (1450) (నల్గొండ) | భాగవత షష్ఠ స్కంధ పురాణం<br>కువలయాశ్వచరిత్ర | పురాణం<br>కావ్యం | పోతన శైలిని పుణికి పుచ్చుకున్నకవి |
| 7 | బొప్పరాజు గంగన (1450) | భాగవత పంచమస్కంధ పురాణం | – | – |
| 8 | వెలిగందల నారయ (1450) కరీంనగర్ | భాగవతం 11,12 స్కంధాలు | – | – |
| 9 | పిల్లలమర్రి పినవీరభద్రుడు (క్రీ.శ.1456) (నల్గొండ) | శృంగార శాకుంతలం | కావ్యం | 'వాణి నారాణి' అని చాటినకవి |
| 10 | ఏకామ్రనాథుడు (క్రీ.శ.1450) ఓరుగల్లు | ప్రతాపరుద్ర చరిత్రము | వచనకావ్యం | 'తొలి చారిత్రక గ్రంథం' |
| 11 | కొరవి గోపరాజు (క్రీ.శ.1470) (నిజామాబాద్) | సింహాసన ద్వాత్రింశిక | కథా కావ్యం | తెలుగులో తొలి కథా కావ్యకర్త |
| 12 | హరిభట్టు (క్రీ.శ.1415) (ఖమ్మం) | వరాహపురాణం | కావ్యం | – |
| 13 | కాకునూరి తిమ్మకవి (మహబూబ్‌నగర్) | కాలామృతం | సంస్కృత గ్రంథం | జ్యోతిష గ్రంథం |
| 14 | పిడుపర్తి సోమనాథుడు (1440) (వరంగల్) | పద్యబసవపురాణం<br>ప్రభులింగలీల | కావ్యం<br>కావ్యం | – |

## 16వ శతాబ్ది కవులు

సుమారు రెండు శతాబ్దాలు గోలకొండ రాజధానిగా చేసుకొని పరిపాలించిన కుతుబ్‌షాహీలు తెలుగుభాషను, కవులను సంస్కృతినీ ఆదరించారు. కట్టడాలకు స్వర్ణయుగంగా భాసిల్లిన ఈ కాలం సాహితీ సౌధ నిర్మాణానికి సైతం ఊతమయ్యింది.

| క్ర.సం. | కవి | రచనలు | ప్రక్రియ | ప్రత్యేకత |
|---|---|---|---|---|
| 1 | ఆసూరి మరింగంటి సింగరాచార్యులు (1520–1590) | దశరథ రాజనందన చరిత్ర<br>శుద్ధాంధ్ర నిరోష్ఠ్య సీతాకళ్యాణం<br>నలరాఘవ యాదవ పాండవీయం<br>రామకృష్ణ విజయం<br>శ్రీరంగ శతకం | కావ్యం<br>కావ్యం<br>కావ్యం<br>కావ్యం<br>శతకం | తెలుగులో తొలి శుద్ధాంధ్ర నిరోష్ఠ్య కావ్యకర్త<br>తెలుగులో తొలి చతురర్థీ కావ్యకర్త |
| 2 | అద్దంకి గంగాధరుడు (1525–1585) (గొల్కొండ) | తపతీ సంవరణోపాఖ్యానం | ప్రబంధం | – |
| 3 | సిద్ధరామకవి (1530–1580) | సిద్ధరామ శతకం<br>పిండచక్ర నిర్ణయం | శతకం<br>వేదాంత గ్రంథం | – |
| 4 | శంకర కవి (క్రీ.శ.1550) | హరిశ్చంద్రోపాఖ్యానం<br>శంకర వచనములు | కావ్యం<br>వచనాలు | – |
| 5 | కామినేని మల్లారెడ్డి దోమకొండ (1550–1600) | షట్చక్రవర్తి చరిత్ర<br>శివధర్మోత్తరం<br>పద్మపురాణం | కావ్యం<br>కావ్యం<br>పురాణం | – |
| 6 | పొన్నికంటి తెలగన (1550–1600) (పటన్ చెరువు) | యయాతిచరిత్ర | అచ్చతెలుగు కావ్యం | తొలి అచ్చ తెలుగు కావ్యకర్త |
| 7 | కందుకూరు రుద్రకవి (1568) | సుగ్రీవ విజయం<br>నిరంకుశోపాఖ్యానం<br>జనార్దనాష్టకం | యక్షగానం<br>సాంఘికకావ్యం<br>అష్టకం | తొలి తెలుగు యక్షగాన కర్త |
| 8 | సారంగు తమ్మయ (1580) (గోలకొండ కవి) | వైజయంతీ విలాసం | ప్రబంధం | – |

| క్ర.సం. | కవి | రచనలు | ప్రక్రియ | ప్రత్యేకత |
|---|---|---|---|---|
| 9 | ఎలకూచి బాలసరస్వతి (1570–1650) (నాగర్ కర్నూల్) | ఆంధ్రశబ్ద చింతామణి<br>సుభాషిత రత్నావళి<br>చంద్రికాపరిణయం<br>యాదవ రాఘవ పాండవీయం | వ్యాఖ్యానగ్రంథం<br>శతకం<br>కావ్యం<br>త్ర్యర్థి కావ్యం | మహా మహోపాధ్యాయ బిరుదాంకితుడైన తొలివ్యక్తి సుభాషిత త్రిశతిని తెలుగులోకి అనువదించిన తొలి కవి. |
| 10 | పైడిమర్రి వేంకటపతి (1570–1640) | చంద్రాంగద చరిత్ర | కావ్యం | – |
| 11 | నేబతి కృష్ణమంత్రి (1580–1612) (సిద్ధలూరు) | రాజనీతి రత్నాకరం | కథా కావ్యం | – |
| 12 | మరింగంటి జగన్నాథాచార్యులు (1550–1580) | శ్రీరంగనాథ విలాసం | ప్రబంధం | – |
| 13 | కాసె గంగాధరయ్య (1525) | గంగాధర వచనములు | వచనం | – |
| 14 | కాసె సర్వప్ప (1600) | సిద్దేశ్వర చరిత్రము | కావ్యం | – |
| 15 | చిత్రకవి పెద్దన (1560) (నాగర్ కర్నూల్) | లక్షణసార సంగ్రహం<br>హనుమదోదాహరణం | లక్షణ కావ్యం<br>ఉదాహరణ కావ్యం | – |
| 16 | బాల పాపాంబ(1600) | అక్కమహాదేవి చరిత్ర | యక్షగానం | – |

## 17వ శతాబ్ది కవులు

ఆంధ్రశబ్ద చింతామణికి పద్య గద్యాత్మకమైన వ్యాఖ్య అప్పకవీయం, రామదాసుగా సుప్రసిద్ధుడైన కంచెర్ల గోపన్నగారి దాశరథీ శతకం వెల్వడిన కాలమిది. పద్యం, గద్యం, గేయం సమపాళ్ళలో వెల్వడిన ఆయా విశేషాలను పరిశీలిద్దాం!

| క్ర.సం. | కవి | రచనలు | ప్రక్రియ | ప్రత్యేకత |
|---|---|---|---|---|
| 1 | కాకునూరి అప్పకవి (మహబూబ్‌నగర్) (1600–1660) | అప్పకవీయం | లక్షణ గ్రంథం | సప్రామాణిక లక్షణ గ్రంథకర్త |
| 2 | తెనాలి రామలింగకవి (1600–1686) (గోలకొండ) | ధీరజనమనోవిరాజితం | ప్రబంధం | – |
| 3 | సురభి మాధవరాయలు (1620–1670) (కొల్లాపురం) నాగర్ కర్నూల్ | చంద్రికా పరిణయం | ప్రబంధం | వసుచరిత్రకు ధీటురాగల రచన చేసాడు. |

| క్ర.సం. | కవి | రచనలు | ప్రక్రియ | ప్రత్యేకత |
|---|---|---|---|---|
| 4 | కంచెర్ల గోపన్న (1620–1680) (ఖమ్మం) | దాశరథీ శతకం (రామదాసు) కీర్తనలు | శతకం కీర్తనలు | తెలంగాణ తొలి సంకీర్తనాచార్యుడు |
| 5 | పెన్నలూరి వేంకటాద్రి (1625–1676) (వనపర్తి) | రఘునాయక శతకం లాలుకోట వేంకటేశ్వర శతకం | శతకం శతకం | – |
| 6 | టేకుమళ్ళ రంగశాయి (1630) ధర్మపురి–జగిత్యాల | వాణీవిలాస వనమాలిక ద్విపద భాగవతం | కావ్యం ద్విపదకావ్యం | – |
| 7 | అన్నంభట్టు (1650) (నాగర్ కర్నూల్)) | తర్క సంగ్రహం స్వరలక్షణం | న్యాయ తర్కశాస్త్రం లక్షణ గ్రంథం | 'తర్కసంగ్రహం' భారతదేశంలో ప్రామాణిక తర్క గ్రంథం |
| 8 | రెడ్రెడ్డి మల్లారెడ్డి (1650) | గంగాపుర మహాత్మ్యం | కావ్యం | క్షేత్ర మాహాత్మ్యం |
| 9 | సిరిప్రెగడ ధర్మన్న (1650–1750) | నలచరిత్రము | పద్య కావ్యం | – |
| 10 | పానుగోటి జగన్నాథ రాయలు (నల్గొండ) (1650) | కుముదవల్లీ విలాసం | ప్రబంధం | – |
| 11 | కొటికల పూడి వీరరాఘవకవి (1663–1712) (గద్వాల) | ఉద్యోగపర్వం | ప్రబంధం | 'అభినవ తిక్కన'గా పేరొందినట్లు తన అవతారికలో తానే పేర్కొన్నాడు |
| 12 | సింహాద్రి వేంకటాచార్యుడు (1630) | చమత్కారమంజరి | కావ్యం | – |
| 13 | రామడుగు శివరామ దీక్షితులు (1690) (నల్గొండ) | బృహద్వాశిష్ఠం | – | 'అచల సిద్ధాంత గ్రంథం' |
| 14 | సింహ వేదాంతాచార్యులు (1694) (జటప్రోలు) | రంగనాథ పంచశత్ సత్క్రియా కల్పమంజరి | శ్లోక సంకలనం | – |
| 15 | మల్లికార్జున సిద్ధయోగి (1700) | గౌడపురాణం | ద్విపద కావ్యం | – |
| 16 | ముదిగొండ బ్రహ్మయ్య 1700 (టేక్మాల్ – మెదక్) | శివరహస్య ఖండం | వచన గ్రంథం | – |
| 17 | బిజ్జుల తిమ్మ భూపాలుడు (1675–1725) | అనర్ఘరాఘవం | కావ్యం | సంస్కృతంలో మురారి అనర్ఘరాఘవానికి తెలుగు కావ్యరూపం |

| క్ర.సం. | కవి | రచనలు | ప్రక్రియ | ప్రత్యేకత |
|---|---|---|---|---|
| 18 | చరిగొండ హొన్నయ్య (1700) (నాగర్ కర్నూల్) | జ్యోతిషరత్నాకరం | శాస్త్ర గ్రంథం | – |
| 19 | గోపన మంత్రి (1700) (ఖమ్మం) | సింధుమతీ విలాసం | – | – |
| 20 | మరింగంటి రామానుజాచార్యులు (1700–1780) (నల్గొండ) | శ్రీరామ నాటకం | యక్షగానం | – |

## 18వ శతాబ్ది కవులు

అభినవ భోజునిగా పేరొందిన చినసోమ భూపాలుని ఆస్థానకవులు ఒకవైపు, చమత్కార వైభవంతో సాహిత్య సృజన చేసిన కవులొకవైపు ఈ శతాబ్దం సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు.

| క్ర.సం. | కవి | రచనలు | ప్రక్రియ | ప్రత్యేకత |
|---|---|---|---|---|
| 1 | పరశురామ పంతుల లింగమూర్తి (1710–1800) (ఓరుగల్లు) | రతీమన్మథ విలాసం<br>జీవన్ముక్తి ప్రకరణం<br>మనసా శతకం | ప్రబంధం<br>యక్షగానం<br>శతకం | – |
| 2 | ప్రెగడరాజు నృసింహకవి (1738) (వనపర్తి) | సీతారామాంజనేయ సంవాదం | కావ్యం | – |
| 3 | చిన్నకృష్ణకవి (1738) (వనపర్తి) | సావిత్రిచంద్ర<br>యాదవ భారతీయం | కావ్యం | – |
| 4 | శేషభట్టరు సింగరాచార్యులు (1742) | కేశవ విలాసం<br>శూద్ర ధర్మోత్పలద్యోతిని | ప్రబంధం<br>శాస్త్ర గ్రంథం | – |
| 5 | ధర్మపురి శేషాచలకవి (శేషప్పకవి) (ధర్మపురి–జగిత్యాల) 1735–1825) | నరసింహ శతకం<br>నరహరి శతకం<br>నృకేసరీ శతకం<br>ధర్మపురి రామాయణం | శతకం<br>శతకం<br>శతకం<br>కావ్యం | సుప్రసిద్ధమైన శతక కర్త |
| 6 | పరశురామ పంతుల రామమూర్తి (1740–1800) (మట్టెవాడ–వరంగల్) | మహిజా మనోహర శతకం<br>సీతారామాంజనేయం<br>శుక చరిత్ర | శతకం<br>యక్షగానం<br>కావ్యం | – |

| క్ర.సం. | కవి | రచనలు | ప్రక్రియ | ప్రత్యేకత |
|---|---|---|---|---|
| 7 | కొమ్మిశెట్టిపల్లి తమ్మయ్య (మెదక్ జిల్లా) (18వ శతాబ్దం) | నాగరాజు చరిత్ర<br>కేతకీ సంగమేశ్వర మహాత్యం | కావ్యం<br>కావ్యం | – |
| 8 | ముద్దు బాలంభట్టు (1780) (కరీంనగర్) | మంథెన రామాయణం<br>శివపురాణం | యక్షగానం<br>యక్షగానం | – |
| 9 | బోయ ధర్మయ్య | అభిమన్యు చరిత్ర<br>ఆగ్నేయ చరిత్ర | యక్షగానం<br>యక్షగానం | – |
| 10 | బంగారు రంగప్ప (1770) | భేతాళ చరిత్ర | ద్విపదకావ్యం | – |
| 11 | చింతపల్లి చినవీర రాఘవయ్య | మధురవాణీ విలాసం | కావ్యం | – |
| 12 | కాణాదం పెద్దన సోమయాజి (1762–1793) (గద్వాల) | ముకుంద విలాసం<br>శేషశైలేశ లీల | కావ్యం<br>కావ్యం | – |
| 13 | రాపాక లక్ష్మీపతి (1765–1790) (పరకాల–వరంగల్) | ఆచార్య విజయం<br>కృష్ణవిలాసం<br>భద్రాయురభ్యుదయం | శాస్త్రకావ్యం<br>కావ్యం<br>ప్రబంధం | – |
| 14 | సింహం శ్రీనివాస – రాఘవాచార్యులు (1786–1863) | లక్ష్మీ పంచాశత్తు | శ్లోకమంజరి | – |

## 19వ శతాబ్ది కవులు

ప్రాచీన కాలానికి ఆధునిక కాలానికి సంధానంగా నిల్చే సాహిత్యం విలసిల్లిన కాలమిది. భాష, అభివ్యక్తిలో నవ్యత్వానికి పాదులు వేసిన రచనలకు అంకురార్పణ జరిగిందీకాలంలోనే!

| క్ర.సం. | కవి | రచనలు | ప్రక్రియ | ప్రత్యేకత |
|---|---|---|---|---|
| 1 | నంబరాజు రామచంద్రకవి (1810) (మహబూబ్‌నగర్) | సుపాణినీ పరిణయం | అచ్చతెలుగు కావ్యం | కవిత్వాన్ని ఆరాధనా విశేషంగా స్వీకరించి సామాన్య ప్రజల భాషలో రాసిన కవి. |

| క్ర.సం. | కవి | రచనలు | ప్రక్రియ | ప్రత్యేకత |
|---|---|---|---|---|
| 2 | నారాయణ మునిపంతులు (1820) (నిర్మల్–ఆదిలాబాద్) | వత్సలా పరిణయం<br>బభ్రువాహన చరిత్ర<br>చంద్రహాస చరిత్ర<br>గోండి భారతం | కావ్యాలు | – |
| 3 | చిత్తారు గంగాధరయ్య (1823) (చర్లపల్లి, నల్లగొండ) | కొలిపాక మహాత్మ్యం<br>శృంగార భల్లాణ చరిత్ర<br>గంగా వివాహం | ద్విపద కావ్యాలు | – |
| 4 | మరింగంటి వేంకట నరసింహాచార్యులు (1800–1880) (నల్గొండ) | తాలాంక నందినీ పరిణయం | ప్రౌఢ ప్రబంధం | – |
| 5 | గుజ్జరి ఎల్లదాసు (1800–1860) (గొంగులూర్, మెదక్) | కూచకొండ రామాయణం | యక్షగానం | – |
| 6 | మాటూరు వెంకటప్పయ్య (1800–1870) (ఖమ్మం) | చెన్నకేశవ శతకం | శతకం | – |
| 7 | చెన్నూరి శోభనాద్రి నల్గొండ (1830) | శృంగార సుధా సముద్ర<br>పూర్ణ చంద్రోదయం | కావ్యం | – |
| 8 | దున్న ఇద్దాసు (1811) (నల్లగొండ) | దున్న ఇద్దాసుతత్త్వాలు | గీతాలు | – |
| 9 | మన్నెంకొండ హనుమద్దాసు (మహబూబ్ నగర్) | కీర్తనలు | కీర్తనలు | – |
| 10 | కాకుత్స్థం నరసింహదాసు (1820–1880) (ధర్మపురి – జగిత్యాల) | కృష్ణశతకం<br>మైరావణ చరిత్ర | శతకం<br>యక్షగానం | – |
| 11 | తూము రాంచంద్రారెడ్డి (19వ శతాబ్దం) (మహబూబ్‌నగర్) | శ్రీ అలుమేలు మంగా – పరిణయం | ప్రబంధం | – |
| 12 | వేముల రామభట్టు (1850) (మహబూబ్‌నగర్) | గౌరీవిలాసం | ప్రబంధం | – |

| క్ర.సం. | కవి | రచనలు | ప్రక్రియ | ప్రత్యేకత |
|---|---|---|---|---|
| 13 | తడకమళ్ళ కృష్ణారావు (1830) | రామావతారకాలనిర్ణయం<br>కంబుకంధర చరిత్ర<br>కామరూపకథ | చారిత్రక గ్రంథం<br>వచన ప్రబంధం | - |
| 14 | రాకమచర్ల వేంకటదాసు (మహబూబ్‌నగర్) (1834-1884) | రాకమచర్ల కీర్తనలు | కీర్తనలు | వాగ్గేయకారుడు. వికారాబాద్ జిల్లాలో నివసించి రాకమచర్ల పీఠాన్ని నెలకొల్పాడు. |
| 15 | రంగరాజు కేశవరావు (1835-1905) (వరంగల్లు జిల్లా) | ఇంద్రద్యుమ్నీయం<br>లీలాపరిణయం<br>హనుమద్విజయం | ప్రౌఢకావ్యం<br>కావ్యం<br>యక్షగానం | - |
| 16 | పురాణం దీక్షాచార్యులు (1845-1901) గద్వాల | ఛందోముకురం | లక్షణ గ్రంథం | - |
| 17 | రుక్ష్మానుపేట రత్నమ్మ (ఇప్పటూరు రంగారెడ్డి) (1847-1929) | శివకురువంజి | యక్షగానం | - |
| 18 | జైశెట్టి రాజయ్య (జగిత్యాల కరీంనగర్) | రాజరాజేశ్వర శతకం<br>మనస్సంబోధ కీర్తనలు | శతకం<br>కీర్తనలు | - |
| 19 | పరాంకుశం గోపాల కృష్ణయ్య | శ్రీరంగ మహాత్మ్యం | కావ్యం | - |
| 20 | సుంకరనేని ఫణికుండలుడు (వరంగల్) | సీమంతినీ విలాసం | కావ్యం | - |
| 21 | తూము రామదాసు (1856-1904) | రుక్మిణీ కల్యాణం<br>ఆంధ్రపద నిధానం<br>మిత్ర విందోద్వాహం | గేయకావ్యం<br>నిఘంటువు<br>ప్రబంధం | - |
| 22 | తిరుమల బుక్కపట్నం శ్రీనివాసాచార్యులు (1862-1920) (ఆత్మకూరు-వనపర్తిజిల్లా) | నంజరాజ చంద్రః<br>జాంబవతీ పరిణయం<br>విజయ వైజయంతి<br>లక్ష్మీ సరస్వతీ దండకం | సంస్కృత కావ్యం<br>కావ్యం<br>నాటకం<br>దండకం | 'బాలసరస్వతి' బిరుదాంకితులు |
| 23 | రామకవచం కృష్ణయ్య (1863-1926) (నల్గొండ) | భానుమతీ పరిణయం | యక్షగానం | - |

| క్ర.సం. | కవి | రచనలు | ప్రక్రియ | ప్రత్యేకత |
|---|---|---|---|---|
| 24 | ఈశ్వరానందం (1865–1926) (నల్గొండ) | వేదాంత శిరోమణి అఖండమాల | వచన గ్రంథం | – |
| 25 | మామిడిపల్లి సాంబశివశర్మ (1870) (వేములవాడ) | శ్రీరాజరాజేశ్వర తారావళి<br>ద్విపద రామాయణం<br>గౌరీశంకర సుప్రభాతం<br>రాజరాజేశ్వర క్షేత్ర మహాత్మ్యం | పద్యకావ్యం<br>ద్విపదకావ్యం<br>సుప్రభాతం<br>క్షేత్ర మహాత్మ్యం కావ్యం | – |
| 26 | పండరి విఠల రాయకవి (1874–1914) (రామాయంపేట–మెదక్) | గజగౌరీ వ్రతం<br>శ్రీరామ విజయం | యక్షగానాలు | – |
| 27 | కైరం భూమదాసు (1875–1950) (కరీంనగర్) | రావికంటి రామచంద్ర శతకం | శతకం | – |
| 28 | వేపూరు హనుమద్దాసు (19వ శ॥) (కల్వకుర్తి – మహబూబ్‌నగర్) | రామకీర్తనలు | కీర్తనలు | వాగ్గేయకారుడు |
| 29 | సరోజినీదేవి (1879–1949) | కాలవిహంగం, స్వర్గధామం, విరిగినరెక్కలు, ది గోల్డెన్ త్రెషోల్డ్ | వచన కవిత, గేయం | 'భారతకోకిల'గా ప్రసిద్ధి పొందినది |
| 30 | ఇల్లిందల సరస్వతీదేవి (1918–1998) | స్వర్ణకమలాలు, తులసీదళాలు, రాజహంసలు | కథలు | ఆంధ్రయువతీమండలి కార్యదర్శిగా, ఉపాధ్యక్షురాలిగా బాధ్యతలు నిర్వర్తించారు. |
| 31 | పాకాల యశోదారెడ్డి (1929–2007) | మా ఊరి ముచ్చట్లు ఎచ్చమ్మ కథలు, ధర్మశాల | కథలు | అధికార భాష సంఘం తొలి మహిళాధ్యక్షురాలు |
| 32 | చక్రవర్తుల లక్ష్మీనరసమ్మ (1939) | భద్రగిరి, కవితాధనస్సు, శ్రీపదం | కావ్యాలు | – |

వేయేళ్ళ వారసత్వమున్న తెలుగు ఆధునిక కోణాల్లో, ప్రక్రియా వైవిధ్యంతో, విభిన్నమైన భావజాలాల్లో వెలుగుచూసింది. తెలంగాణలో కవులు లేరు అన్న అపప్రథను తొలగించడానికి సురవరం ప్రతాపరెడ్డి 354 మంది సంస్కృతాంధ్ర కవులతో గోలకొండ సంచిక వెల్వరించి తెలంగాణ కవుల ఖ్యాతిని సాహితీలోకానికందించాడు.


పద్యం, కథ, నవల, వచన కవిత, స్వీయచరిత్ర, ఆత్మకథ, వ్యాసం, గేయం తదితర రూపాల్లో తెలంగాణ కవులు తెలుగుసాహిత్యాన్ని సుసంపన్నం చేశారు. చేస్తూనే ఉన్నారు కూడా! పుంఖాను పుంఖాలుగా కవిత్వాన్ని జాలువార్చిన, వానమామలై వరదాచార్యులు, డా॥ సి.నారాయణరెడ్డి మున్నగు మైలురాళ్ళ వంటి కవులకు తెలంగాణ ప్రజానీకం నీరాజనం అర్పించింది. వారి వరంపరలో కవితావ్యాసంగాన్ని కొనసాగిస్తున్న కవులనేకులు. వారందరూ సాహిత్య సేవలో తమ జన్మను సార్థకం చేసుకున్నవాళ్ళే!

***మూలం:*** *తెలంగాణ ప్రాచీన సాహిత్య చరిత్ర, 'ముంగిలి'*
*సుంకిరెడ్డి నారాయణరెడ్డి,*
***ప్రచురణ :*** *తెలుగు అకాడమి.*

❀❀❀❀❀



పాల్కురికి (ఊహాచిత్రం)



పోతన (ఊహాచిత్రం)



కంచర్ల గోపన్న (ఊహాచిత్రం)



కొఱవి గోపరాజు (ఊహాచిత్రం)

# 16. ఆధునిక కవులు

## మహబూబ్‌నగర్

### 1) సురవరం ప్రతాపరెడ్డి (28-05-1896 - 25-08-1953) :

నేటి జోగులాంబ - గద్వాల జిల్లాలోని గద్వాల సంస్థానానికి రాజధానిగా ఉండిన చోరవెల్లిలో జన్మించాడు. వీరి మొదటిపేరు పాపిరెడ్డి. తెలంగాణాలో కవులే లేరనే నిందా వ్యాఖ్యలకు "గొలకొండ కవుల సంచిక" ద్వారా సమాధాన మిచ్చినవాడు. గోలకొండ పత్రిక ద్వారా తన కృషిని సమాజపరంగా సాగించిన ఉద్యమశీలి. సాహిత్య, సాంస్కృతిక, సామాజిక, రాజకీయ మొదలగు రంగాల్లో బహుముఖ ప్రజ్ఞాశాలి. తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి.

### 2) బూర్గుల రామకృష్ణారావు (13-03-1893 - 15-09-1967) :

నేటి నాగర్‌కర్నూలు జిల్లా కల్వకుర్తిలో జన్మించాడు. హైదరాబాద్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టి అంతర్గతంగా, కాంగ్రెస్ అధిష్ఠానపరంగా, స్థానికంగా, ఉద్యమాల వల్ల అనేక సమస్యలను విజయవంతంగా ఎదుర్కొని నిల్చిన ఏకైక ముఖ్యమంత్రి. వాస్తవానికి హైద్రాబాద్ దక్కన్ చరిత్రలో అక్కన్న-మాదన్నల తర్వాత ఒక రాజనీతిజ్ఞుడిగా, ముఖ్యమంత్రిగా, పరిపాలనాదక్షుడిగా పేరు సాధించినవాడు.

### 3) కప్పగంతుల లక్ష్మణశాస్త్రి (1911-1980) :

నేటి వనపర్తి జిల్లా వనపర్తిలో జన్మించిన ఇతను ఉపాధ్యాయునిగా జీవనం ఆరంభించాడు. అష్టభాషా పండితుడైన ఇతని నుండి బూర్గుల రామకృష్ణారావు కూడా ఎన్నోభాషలు నేర్చుకున్నాడు. తర్క మీమాంసా శాస్త్రాలలో అగ్రగణ్యుడు.

### 4) గడియారం రామకృష్ణశర్మ (1919-2006) :

జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్‌లో స్థిరపడినాడు. ఇతను "శతపత్రం" అనే తన ఆత్మకథా గ్రంథానికి 'కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం' పొందాడు. క్షేత్ర చరిత్రలు, బాల సాహిత్యం, దేశ చరిత్రలు, శాసన పరిశోధన మరియు అనువాదాలు చేసి సాహిత్య ప్రపంచానికి ఎనలేని సేవలందించాడు.

### 5) డాక్టర్ ముకురాల రామారెడ్డి :

నేటి నాగర్‌కర్నూలు జిల్లా కల్వకుర్తి తాలూకా ముకురాల గ్రామంలో జన్మించాడు. సమకాలీన అంశాలను ప్రతిబింబించే కవితలు, పద్యాలు, పాటలు, కథలు, వ్యాసాలు రాసాడు. "ప్రాచీన తెలుగు కవిత్వంలో కవితాత్మక భావ పరిణామం" అనే అంశంపై పరిశోధనా గ్రంథం వ్రాసి "డాక్టరేట్" బిరుదు పొందాడు.

### 6) పాకాల యశోదారెడ్డి (08-08-1929 - 07-10-2007) :

నేటి నాగర్‌కర్నూలు జిల్లాలో భాగమైన బిజినేపల్లి గ్రామంలో జన్మించింది. తెలుగులో "హరివంశాలు" అనే అంశంపై పరిశోధనచేసి "డాక్టరేట్" పట్టా పొందింది. రాష్ట్ర అధికార భాషా సంఘానికి అధ్యక్షురాలిగా పనిచేసిన తొలిమహిళ. వీరి రేడియో ధారావాహిక కార్యక్రమం 'మహలక్ష్మి ముచ్చట్లు' ఎంతో ప్రజాదరణ పొందింది. ఎచ్చమ్మ కథలు, మా ఊరి ముచ్చట్లు అనే కథా సంపుటాలు వెలువరించింది.

### 7) డా॥ ఇరివెంటి కృష్ణమూర్తి (12-07-1930 - 26-04-1989) :

మహబూబ్‌నగర్ పట్టణంలో జన్మించాడు. నిజాం విమోచన ఉద్యమంలో పాల్గొని జైలు శిక్షను అనుభవించాడు. ఉస్మానియాలో ఆచార్యునిగా పని చేశాడు. ''కవి సమయములు, తెలుగు ఉత్తరభారత సాహిత్యాలు, చాటువులు మొదలగు రచనలు చేశాడు. "యువభారతి సంస్థకు" అధ్యక్షుడిగా సేవలందించాడు.

### 8) ఇమ్మడిజెట్టి చంద్రయ్య (31-03-1934 - 11-03-2001) :

ఈయన నాగర్‌కర్నూలు జిల్లా తాళ్ళపల్లి గ్రామంలో జన్మించాడు. "హనుమద్రామ సంగ్రామం, భక్తసిరియాళ, వీరబ్రహ్మేంద్ర విలాసం" అను హరికథలను, "రామ ప్రభుశతకం, మృత్యుంజయశతకం" మొదలగు శతకాలు, క్షేత్ర మహాత్మ్యములు కూడా రాశాడు.

### 9) ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి :

మహబూబ్‌నగర్ జిల్లాలో జన్మించాడు. తెలుగులో పొడుపు కథలపై పరిశోధన చేశాడు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆచార్యునిగా సేవలందించాడు. సాంస్కృతిక సేనాని, కవి, రచయిత, పరిశోధకుడు, 'తెలంగాణ సమాజంలో సంస్కరణోద్యమాలు' అనే గ్రంథంతోపాటు అనేక గ్రంథాలు కూడా రాశాడు. తి.తి.దే. ధర్మప్రచార పరిషత్తు అధ్యక్షుడిగా సేవలందించాడు. అనేక రేడియో, టి.వి., సాహిత్య కార్యక్రమాలలో తన గళాన్ని వినిపించాడు.

### 10) ఆచార్య కె.రుక్నుద్దీన్ (02-05-1947 - 26-05-2013) :

సామాజిక స్పృహ కలిగిన సాహితీవేత్త. ఈయన మహబూబ్‌నగర్ జిల్లా వెల్దండ మండలం రాచూరు గ్రామంలో జన్మించాడు. అలంకార విధానంపై పరిశోధనా గ్రంథాన్ని రాసాడు. 1969లో 'విప్లవ ఢంకా' మోగించడంతో మొదలైన ఇతని రచనలు తుది శ్వాసవరకు సాగినవి. "ప్రయాణం, శెలిమి" మొదలగునవి ఇతని రచనలు. సాహిత్య సంస్థల నుండి పురస్కారాలు పొందాడు.

### 11) కపిలవాయి లింగమూర్తి (31-03-1928) :

అచ్చంపేట తాలూకా బల్మూరు మండలంలోని జినుకుంట ఈయన స్వస్థలం. లింగమూర్తి నడిచే విజ్ఞాన సర్వస్వంగా పేరు పొందాడు. పలు గ్రంథాలు రచించి పరిశోధనలు చేశాడు. ఈయన 'ఆర్యశతకం, ఉప్పునూతల కథ, పరమహంస శతకం, పాలమూరు జిల్లా దేవాలయాలు, సోమేశ్వర మహాత్మ్యం, పద్య కథా పరిమళం' మొదలగు వాటిని రచించాడు. అనేక స్థల చరిత్రలు దేవాలయ కథలకు ఆయన ప్రాణంపోశాడు. మొత్తం 70 రచనలు ముద్రితమయ్యాయి. అముద్రితాలు చాలా ఉన్నాయి. ఈయనను తెలుగు యూనివర్శిటీ గౌరవ డాక్టరేట్‌తో సత్కరించింది.

## వరంగల్

### 1) దాశరథి కృష్ణమాచార్యులు (22-07-1925 - 05-11-1987) :

నేటి మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరులో జన్మించాడు. నాటి పాలకులపై తిరుగుబాటు బావుటా ఎగురవేసి, ప్రజల్లో చైతన్యం కల్గించి, నిజాంకు వ్యతిరేకంగా పద్యాలను జైలుగోడలపై రాసిన ధీరుడు. "అగ్నిధార, రుద్రవీణ, మహాంధ్రోదయం" మొదలగు రచనలు, కవితా సంపుటాలు, సినీగేయ కవిగా ఎన్నో సినిమాలకు పాటలు రాశాడు. గజల్ ప్రక్రియకు ప్రాణం పోసిన దాశరథి 1961లో గాలిబ్ గజళ్ళను అనువదించాడు. తెలుగు సాహిత్యానికి చేసిన సేవకు 1967లో "ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ పురస్కారం" 1974 "కేంద్ర సాహిత్య అకాడమి పురస్కారం". 1952లో డా॥ సినారె, వట్టికోట, డా॥ బిరుదురాజు రామరాజులతో కలిసి తెలంగాణ రచయితల సంఘాన్ని స్థాపించాడు.

### 2) డా॥ దాశరథి రంగాచార్య (24-08-1928 - 07-06-2015) :

మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరులో జన్మించాడు. దాశరథి కృష్ణమాచార్యకు తమ్ముడు. ఉపాధ్యాయునిగా, గ్రంథాలయ నిర్వాహకునిగా, పురపాలక శాఖ ఉద్యోగిగా కూడా పనిచేశాడు. విశిష్టమైన నవలలు రచించి

సాహిత్యాన్ని సుసంపన్నం చేశాడు. వేదాలను, ఉపనిషత్తులను అనువాదం చేశాడు. "రామాయణ, భారత, భాగవతాలను" వచనంలో రాశాడు. రైతాంగ పోరాటంలో పాల్గొన్నాడు. "చిల్లరదేవుళ్ళు" నవలకు "రాష్ట్ర సాహిత్య అకాడమీ పురస్కారం" లభించింది.

### 3) పల్లా దుర్గయ్య (25-05-1914 - 19-12-1983) :

వరంగల్ జిల్లా మడికొండలో నరసమ్మ, పాపయ్య శాస్త్రి దంపతులకు జన్మించాడు. సంస్కృతం, తెలుగు, ఆంగ్ల భాషల్లో పాండిత్యంకలవాడు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి మొట్టమొదటి ఎమ్.ఎ. పట్టా అందుకున్నాడు. "పాలవెల్లి, గంగిరెద్దు" మొదలైనవి ఈయన రచనలు. ''నందితిమ్మన'' రాసిన "పారిజాతాపహరణం"పై పరిశోధన చేశాడు.

### 4) గంగుల శాయిరెడ్డి (1890-1975) :

పూర్వపు వరంగల్ జిల్లా ప్రస్తుతం ఇది జనగాం జిల్లాలోను భాగమైన జీడికల్లు గ్రామం వీరి జన్మస్థలం. కాపుబిడ్డ, కావ్యంతోపాటు తెలుగు పలుకులు, వర్షయోగము మొదలగు ఎన్నో రచనలు రాశాడు. సహజకవిగా పేరుపొందిన "పోతన" పట్ల ఆరాధనా భావంగల శాయిరెడ్డి హలంతోపాటు కలంతో సమానంగా కృషిచేశాడు.

### 5) కాళోజి నారాయణరావు (09-09-1914 - 13-11-2002) :

తన ఆత్మకథ "ఇది నా గొడవ"లో తెలిపినట్లు "రట్టహళ్ళి" అనే ఊర్లో పుట్టాడు. 1917 వరకు హన్మకొండలో ఉండి, తర్వాత మడికొండకు మారాడు. కాళోజి అన్న రామేశ్వరరావు న్యాయశాస్త్రం చదవడానికి హైద్రాబాద్ రావడంతో నారాయణరావు కూడా హైద్రాబాద్ రావడం జరిగింది. కాళోజీ కథలు, ఖలీల్‌జిబ్రాన్, దిప్రాఫిట్ అనువాదం, జీవనగీతం మొదలగునవి ప్రాచుర్యం పొందినవి. వివక్ష ఎక్కడున్నా వ్యతిరేకించాడు. మంచి ఎక్కడున్నా స్వాగతించాడు. తెలంగాణ వైతాళికుడిగా పేరుపొందాడు. సామాజిక, రాజకీయ, పౌరహక్కుల ఉద్యమాలలో చురుకుగా పాల్గొన్నాడు.

### 6) ఆచార్య బిరుదురాజు రామరాజు (16-04-1925 - 08-02-2010) :

వరంగల్ జిల్లా దేవనూరు గ్రామంలో జన్మించాడు. జానపద సాహిత్యంపై కృషిచేసిన ప్రముఖ రచయిత, కవి, పరిశోధకుడు, అనువాద రచయిత, సంపాదకునిగా ప్రసిద్ధుడు. ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అధ్యక్షునిగా డీన్‌గా పనిచేసాడు. "తెలుగు జానపద గేయ సాహిత్యం" ఈయన పరిశోధన గ్రంథం. చరిత్రకెక్కని చరితార్థులు, ఆంధ్రయోగులు, తెలుగు నిఘంటువు మొదలగునవి ఈయన ఇతర రచనలు.

### 7) దేవులపల్లి రామానుజరావు (28-08-1917) :

వరంగల్ జిల్లా దేశాయిపేటలో జన్మించాడు. "గోలకొండ" పత్రికకు సంపాదకునిగా పనిచేసాడు. సారస్వత నవనీతం, తెలుగు సీమలో సాంస్కృతిక పునర్జీవనము, నా రేడియో ప్రసంగాలు, యాభై సంవత్సరాల జ్ఞాపకాలు మొదలగు అనేక రచనలు చేసాడు. చాలా పత్రికలకు సంపాదకీయం వహించాడు.

### 8) వానమామలై వరదాచార్యులు (16-08-1912 - 30-10-1984) :

20వ శతాబ్దపు మహాకవుల్లో ప్రముఖుడు. ఈయన వరంగల్ జిల్లా మడికొండలో జన్మించాడు. ఆదిలాబాద్ జిల్లా చెన్నూరులో స్థిరనివాసం ఏర్పరచుకొన్నాడు. అభినవపోతన, అభినవకాళిదాసు, మధురకవి-కవిచక్రవర్తి బిరుదులు పొందిన ఈయన సంస్కృతం, తెలుగుభాషల్లో మంచి పాండిత్యంకలవాడు. "పోతన చరిత్ర, మణిమాల, సూక్తి వైజయంతి, రైతుబిడ్డ" మొదలగు గ్రంథాలు రచించాడు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ పురస్కారం, వారణాసి వారి విద్యావాచస్పతి మొదలగు పురస్కారాలు అందుకున్నాడు.

### 9) పొట్లపల్లి రామారావు (1917-2001) :

వరంగల్ జిల్లా ధర్మసాగరం మండలం తాటికాయల గ్రామంలో జన్మించాడు. "ఆత్మవేదన, మెరుపులు, చుక్కలు

మొదలైన కవితా సంపుటాలు రాసాడు. "జైలు" కథల సంపుటి బాగా ప్రసిద్ధి పొందింది. వీరి రచన వాడుక భాషలో సరళమైన శబ్దాలతో సుందరమైన శైలితో సాగింది.

**10) ఆచార్య కోవెల సుప్రసన్నాచార్య (17-03-1936) :**

వరంగల్‌లో జన్మించాడు. సుప్రసన్నగా ప్రసిద్ధి. వేదం నుంచి ఆధునిక వాదం వరకూ, పాండిత్యం కలిగిన ప్రసిద్ధకవి, రచయిత, విమర్శకులు. రామరాజభూషణం అనే గ్రంథంపై పరిశోధన చేసి పిహెచ్.డి. పట్టాపొందాడు. ఈయన చేతనావర్తన కవుల్లో ఒకరు.

**11) ఆడెపు చంద్రమౌళి (07-04-1939 - 28-09-2009) :**

వరంగల్ జిల్లాకు చెందిన ఈయన "వేములవాడ రాజరాజేశ్వర శతకం, రామాయణ రమణీయం" (పద్యకావ్యం) రచించాడు. "కవిశశాంక" అనే బిరుదు పొందాడు. సరళమైన భాషలో, అందరికి అర్థమయ్యే శైలిలో పద్యాలు రాయడం ఈయన ప్రత్యేకత.

**12) వరవరరావు (03-11-1940) :**

వరంగల్ రూరల్ జిల్లా చిన్న పెండ్యాల గ్రామంలో జన్మించాడు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి ఎమ్.ఎ. సాహిత్యంలో పట్టాపొందాడు. మెదక్ సిద్ధిపేట కళాశాలల యందు ఉపన్యాసకుడిగా పనిచేశాడు. సి.కె.ఎమ్. కళాశాలనందు కూడా ఉపన్యాసకునిగా పనిచేశాడు. ఉద్యమాల్లో పాల్గొన్నాడు. పద్యకవితలు రాశాడు. వాటిలో "చలినెగళ్ళు, జీవనది, స్వేచ్ఛ" మొదలగునవి ముఖ్యమైనవి. "విరసం" అనే సంస్థను కూడా స్థాపించాడు.

## కరీంనగర్

**1) డా॥ సి.నారాయణరెడ్డి (29-07-1931 - 12-06-2017) :**

నేటి రాజన్న సిరిసిల్ల జిల్లా హనుమాజిపేటలో గ్రామంలో జన్మించాడు. సింగిరెడ్డి బుచ్చమ్మ మల్లారెడ్డి తల్లిదండ్రులు. ఇతను గొప్పవక్త, సాహితీపరిశోధకుడు, బహుభాషావేత్త, ప్రయోగశీలి. నాగార్జున సాగరం, కర్పూర వసంతరాయలు మధ్య తరగతి మందహాసం మొదలగు 70 పైగా కావ్యాలు రాసాడు. "ఆధునికాంధ్ర కవిత్వం సాంప్రదాయములు - ప్రయోగములు" ప్రామాణిక సిద్ధాంత గ్రంథం ఎందరో పరిశోధకులకు మార్గదర్శనం. ఎన్నో సినిమాలకు పాటలురాసాడు. భారత ప్రభుత్వంచే 'పద్మభూషణ్' పురస్కారంతోపాటు 'విశ్వంభర' కావ్యానికి అత్యున్నత 'జ్ఞానపీఠ' అవార్డును అందుకున్నాడు.

**2) మామిడిపల్లి సాంబశివ శర్మ (1870) :**

నేటి రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో జన్మించాడు. ''వేములవాడ సుప్రభాతం'' ఇతనే రాసాడు. జయశ్రీముక్తాహారం, కుంజవిహారం, శ్రీ రాజేశ్వర తారావళి మొదలగు గ్రంథాలు, సుప్రభాతాలు, బుర్రకథలు, కీర్తనలు, నాటకాలు మొదలగునవి ఈయన రచనలు.

**3) గంగా రాజేశ్వరరావు (1906-2004) :**

నేటి పెద్దపల్లి జిల్లా మంథని గ్రామంలో జన్మించాడు. "రుక్మిణీ కళ్యాణం, పార్వతీ విజయం, పరీక్షిచ్చరితం, గంగారూపకం మొదలగునవి ఈయన రచనలు. "ఆత్మబోధ" అనే శతకం వ్రాసాడు. "కవిశేఖర" అనే బిరుదు పొందాడు.

**4) పి.వి.నర్సింహారావు (14-10-1933 - 11-09-2006) :**

భారత ప్రధానిగా బహు భాషావేత్తగా ఆర్థిక సంస్కరణల పితామహుడిగా పేరొందిన పాములపర్తి వేంకట నర్సింహారావు వరంగల్ రూరల్ జిల్లా నర్సంపేటలోని లక్నేపల్లిలో జన్మించాడు. వంగర గ్రామానికి దత్తతగా వచ్చారు. 17 భాషలు అనర్గళంగా మాట్లాడగలిగిన బహు భాషావేత్త. విశ్వనాథ సత్యనారాయణ రాసిన "వేయిపడగలు" పుస్తకాన్ని హిందీలో "సహస్రఫణ్" పేరుతో అనువదించిన మేధావి, నిరాడంబర జీవి, నిజాయితీ కల్గిన పి.వి. స్థితప్రజ్ఞుడిగా వెలిగాడు.

### 5) ఆచ్చి వేంకటాచార్యులు (1914-1985)

రమణీయ భావాలతో కమనీయ కవితలు రచించిన కవిశిఖామణి ఆచ్చి వేంకటాచార్యులు. నేటి రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాదు మండలం, ఆవునూరు గ్రామంలో జన్మించాడు. ఆండాళ్ బుర్రకథ, రాగమాల, మాఊరు (ఏకాశ్వాస ప్రబంధం) ఈయన రచనలు. పండిత వంశంలో జన్మించిన ఈయన రాసిన పాటలు, హారతులు, పద్యాలు ఇప్పటికీ ప్రజల నాల్కలపై నాట్యమాడుతూనే ఉన్నాయి.

### 6) డా॥ అందె వెంకటరాజం (14-10-1933 - 11-09-2006) :

నేటి జగిత్యాల జిల్లా కోరుట్లలో జన్మించాడు. "నవోదయం, మణిమంజూష" మొదలగు పద్యకావ్యాలు "భారతరాణి" నాటకాల సంపుటి" నింబగిరి శతకం, ఈశ్వర శతకాలతో పాటు "వానమామలై వరదాచార్యులకృతులు అనుశీలన" సిద్ధాంత గ్రంథాన్ని రాసాడు. "కవిశిరోమణి, అవధాన యువకేసరి, అవధాన చతురానన" అనే బిరుదులు పొందాడు.

### 7) గూడూరి సీతారాం (18-07-1936 - 25-09-2011) :

నేటి రాజన్న సిరిసిల్ల జిల్లా హనుమాజీ పేటలో జన్మించాడు. 1953 నుండి 1965 వరకు సుమారు 80 కథల వరకు రాశాడు. తెలంగాణ రచయిత సంఘానికి కార్యదర్శిగా పనిచేశాడు. "మారాజు, లచ్చి, పిచ్చోడు, రాజమ్మ రాజరికం" మొదలగునవి ప్రసిద్ధ కథలు. తెలంగాణ భాష - నుడికారం పలికించడం ఈయన కలం ప్రత్యేకత.

### 8) కొల్లారపు సీతారామశర్మ (20-05-1931 - 22-10-2001) :

నేటి పెద్దపల్లి జిల్లా మంథని గ్రామంలో జన్మించాడు. బహుభాషాకోవిదుడు. సంస్కృతంలో నిష్ణాతుడు. "దత్తశతకం, కీర్తనలు, మంగళాష్టకాలు, వేదసూక్తులు, మంత్రమూలాలు, వేదసంస్కృతి-ప్రాశస్త్యము" మొదలగు గ్రంథాలు రాశాడు. వేద పాఠశాల నిర్మించి ఎంతోమందిని తీర్చిదిద్దిన ఘనుడు. ''బహుభాషా ప్రవీణ'' బిరుదాంకితుడు.

### 9) శేషం లక్ష్మీనారాయణ (15-04-1947 - 17-05-1998) :

కరీంనగర్ జిల్లాలోని నగునూర్‌లో కనకమ్మ నరసింహ స్వామి దంపతులకు జన్మించిన ఈయన చాలా కాలం రంగారెడ్డి జిల్లాలో తెలుగు భాషోపాధ్యాయునిగా పనిచేశాడు. పద్య, వచన, గేయ కవితలను రాశాడు. టివి రేడియోల్లో కూడా ప్రసారమయ్యాయి. లలిత మనోహరమైన "దైవభక్తి, దేశభక్తి" గేయాలను రాయడంలో అందెవేసిన చెయ్యి.

### 10) అలిశెట్టి ప్రభాకర్ (1954 - 1993) :

నేటి జగిత్యాల జిల్లా జగిత్యాల జన్మస్థలం, చిత్రకారుడిగా జీవితం ప్రారంభం. తర్వాత "సాహితీ మిత్ర దీప్తి" సంస్థ పరిచయంతో కవిత్వరంగంలో ప్రవేశం, 1974లో ఆంధ్ర సచిత్ర వారపత్రికలో వచ్చిన "పరిష్కారం" అచ్చయిన మొదటి కవిత. ఎన్నో సంస్థలు ఏర్పాటుచేసి కవిగా ఎదిగాడు.

### 11) రావికంటి రామయ్యగుప్త (17-06-1936 - 30-03-2009) :

నేటి పెద్దపల్లి జిల్లా మంథని నివాసి, "గౌతమేశ్వర శతకం, గీతామృతం, వరద గోదావరి" ఈయన రచనలు, వరకవి పేరిట మంత్రకూట వేమనగా సుప్రసిద్ధుడు.

### 12) అల్లం రాజయ్య (05-06-1952) :

నేటి పెద్దపల్లి జిల్లా మంథని మండలం గాజులపల్లి గ్రామంలో జన్మించాడు. ముందుగా సిమెంటు కంపెనీలో ఉద్యోగంచేసి, సాహిత్యంపై అభిమానముతో ఎనిమిది నవలలు, వందకుపైగా కవితలు, వ్యాసాలు అనువాదాలు చేసారు. అందులో ముఖ్యమైనవి "కొలిమంటుకున్నది, ఊరు, అగ్నికణం" నవలలు ప్రసిద్ధి పొందినవి.

# నల్లగొండ

## 1) వట్టికోట ఆళ్వారుస్వామి (01-11-1915 - 05-02-1961) :

సుప్రసిద్ధ రచయిత, సాహితీవేత్త ఆళ్వారుస్వామి నల్లగొండ జిల్లాలోని చెరువు మందారంలో జన్మించాడు. నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడి జైలుకు వెళ్ళాడు. "దేశోద్ధారక గ్రంథమాలను" స్థాపించి 35 పుస్తకాలను ముద్రించాడు. 'తెలంగాణ గుమాస్తా' అనే పత్రికను నడిపించాడు. ఆళ్వారు రచించిన 'ప్రజల మనిషి', 'గంగు' నవలలు ఎంతో ప్రజాదరణ పొందాయి.

## 2) ఆసూరి మరింగంటి పురుషోత్తమాచార్యులు (11-04-1936 - 09-01-2011) :

నల్లగొండ జిల్లా మునగాల మండలం నరసింహాపురం గ్రామంలో జన్మించిన ఇతను 'వేంకటేశ్వరా' అను మకుటంతో పద్యాలను రాశాడు. "గోదాదేవి, యాదగిరి లక్ష్మీనర్సింహశతకం, గోదావరి, సత్యవతీ సాంత్వనం" మొదలగు రచనలు చేశాడు. "విద్వత్ కవి"గా ప్రసిద్ధి పొందాడు.

## 3) సూరోజు బాలనరసింహాచారి (19-05-1946 - 02-02-2014) :

నల్లగొండ జిల్లా చిన్నకాపర్తి గ్రామానికి చెందిన ఇతడు "కవితాకేతనం, బాలనృసింహశతకం, మహేశ్వర శతకం, భగవద్గీతకందామృతం, వీరబ్రహ్మేంద్రస్వామి చరిత్ర" మొదలైన పుస్తకాలు రాశాడు.

## 4) సుద్దాల హన్మంతు (06-06-1910 - 10-10-1982) :

నల్లగొండ జిల్లాలోని పాలడుగు గ్రామంలో జన్మించాడు. తల్లిదండ్రులు లక్ష్మీనర్సమ్మ బుచ్చిరాములు. హన్మంతు హేతువాదిగా పేరుపొందాడు. ఉద్యోగానికి రాజీనామాచేసి కళాకారుడై అనేక చైతన్య గీతాలు, బుర్రకథలు, గొల్లసుద్దులు, పిట్టలదొర, యక్షగానం" మొదలైన కళారూపాల ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేశాడు.

## 5) నీలా జంగయ్య :

నల్లగొండ జిల్లా దేవరకొండ నివాసి బి.ఓ.ఎల్. వరకు విద్యనభ్యసించాడు. భగవద్భక్తి ఎక్కువ, "రమ్యపథము" అను కవితా సంపుటను రమ్యముగా రచించాడు. ఇందులో వృత్తములు, గీతములు, గేయములు, వచనకవి మొదలగునవి కలవు. భావసౌకుమార్యము, విషయ పరిశీలనము కల్గిన కవికిశోరము బహుగ్రంథ కర్త.

## 6) ఆచార్య ఎన్.గోపి (25-06-1948) :

పూర్వపు నల్లగొండ జిల్లా నేటి యాదాద్రి జిల్లా భువనగిరిలో జన్మించాడు. "ప్రజాకవి వేమన, కాలాన్ని నిద్రపోనివ్వను, నానీలు" మొదలగు రచనలు చేసాడు. ''పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం'' ఉపాధ్యక్షులుగా పనిచేసారు. "కేంద్రసాహిత్య అకాడమీ పురస్కారం" కూడా పొందాడు.

## 7) రవ్వా శ్రీహరి (12-09-1943) :

నల్లగొండ జిల్లా నివాసి, సంస్కృతాంధ్ర భాషల్లో నిష్ణాతుడు. సంస్కృత, ఆంధ్ర వ్యాకరణములను గూర్చి, నిఘంటువులను గూర్చి చేసిన పరిశ్రమ లోక ప్రసిద్ధం. వీరి రచనలు లఘు సిద్ధాంత కౌముది, సంకేత పదకోశము, తెలుగు మాండలికములు, తెలంగాణ మాండలికములు - కావ్య ప్రయోగాలు మొదలగు పుస్తకములు రచించాడు. ద్రావిడ విశ్వవిద్యాలయ ఉపకులపతిగా పనిచేశాడు.

# మెదక్

## 1) గుమ్మన్నగారి లక్ష్మీనర్సింహశర్మ (1934-2011) :

మెదక్ జిల్లా పోతారెడ్డిపేటలో జన్మించాడు. 300 పైగా అష్టావధానాలు చేసి ''అవధాన శశాంక'', ''ఆశు కవితాకేసరి'' అన్న బిరుదులు పొందాడు. హిందోళరాగంలో ఈయన పద్యపఠన విన్యాసం ప్రత్యేకమైనది. "కవితా కళ్యాణి" అవధాన సరస్వతి, వాగీశ్వరీస్తుతి మొదలగునవి ఈయన రచనలు. "విశ్వనాథేశ్వర శతకం కూడా రాశాడు.

### 2) గౌరీభట్ల రఘురామశాస్త్రి (22-04-1929 - 04-02-2004) :

నేటి సిద్ధిపేట జిల్లా రిమ్మనగూడలో జన్మించాడు. "వ్యాసతాత్పర్య నిర్ణయం, గోమాత కళ్యాణ దాసచరితం, శ్రీవేములవాడ రాజరాజేశ్వర ఏకప్రాస శతపద్యమాలిక, శివపదమణిమాల మొదలగు రచనలతోపాటు అనేక భజన కీర్తనలు రాశాడు.

### 3) డా॥ వేముగంటి నరసింహాచార్యులు (30-06-1930 - 29-10-2005) :

నేటి సిద్ధిపేట జిల్లాలో రామక్క రంగాచార్యుల దంపతులకు జన్మించాడు. "సాహితీ వికాస మండలి సంస్థ" మెదక్ జిల్లా రచయితల సంఘంను స్థాపించి, సాహిత్య వికాసానికి కృషిచేసాడు. పద్య, గేయ, కావ్య ఖండికలనే కాకుండా 40 పుస్తకాలు రాశాడు. కవికోకిల, కావ్యకళానిధి, విద్వత్‌కవి ఆయన బిరుదులు. తెలుగు విశ్వవిద్యాలయం గౌరవ "డాక్టరేట్"తో సత్కరించింది.

### 4) డా॥ సంపన్ముదుంబై రంగకృష్ణమాచార్యులు (23-12-1931 - 18-11-2015) :

మెదక్ జిల్లాలో జన్మించిన ఈయన గురుభక్తి, శ్రీరంగ నాథస్తవము, రంగనాథ దండకము, విరించి సూక్తులు, సప్తతి మొదలగు అనేక రచనలు చేశాడు. సాహితీ సంస్థను నడిపించాడు.

### 5) కె.వి.రాఘవాచార్యులు :

మెదక్ జిల్లావాసి, సంస్కృత ఆంధ్రభాషల్లో పండితుడు, శ్రీ వైష్ణవ సంప్రదాయవేత్త, భక్తిజ్ఞాన వైరాగ్య సంపన్నుడు. "శ్రీనారాయణ" శతకానికి వ్యాఖ్యానము రాశాడు. పలు ఆధ్యాత్మిక గ్రంథాలను రచించాడు.

## రంగారెడ్డి

### 1) గడిగె భీమకవి (14-01-1920 - 03-04-2010) :

రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం నాగరకుంట గ్రామంలో జన్మించాడు. వీధిబడి వరకు విద్యాభ్యాసం చేసిన ఈయనకు పద్యరచనలో నైపుణ్యం అబ్బడం విశేషం. వేణుగోపాల శతకంలోని పద్యాలు సరళశైలిలో సుబోధకంగా ఉంటాయి.

### 2) వెంకటరావు పంతులు (03-02-1937 - 26-08-1994) :

రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి నివాసియైన వెంకటరావు పంతులు తాండూరు దగ్గరలోని బాకవరం గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామిపై "బాకవరాంజనేయ! ఖలభంజన! సాధుజనానురంజక! అనే మకుటంతో పద్యాలను రాసాడు. యక్షగానాలు, కీర్తనలు, గేయాలు రాశాడు.

### 3) చెరబండ రాజు (03-01-1944 - 02-07-1982) :

చెరబండరాజు అసలుపేరు బద్దం భాస్కరరెడ్డి. మేడ్చల్ జిల్లాలోని అంకుశాపురం ఇతని సొంత ఊరు. ఈయన ఉపాధ్యాయుడుగా పనిచేశాడు. 1965లో దిగంబర కవిగా మొదలై, 1970 తర్వాత విప్లవగేయాలు, కథలు, నవలలు రాశాడు. 'గమ్యం', 'ముట్టడి', 'పల్లవి' ఇతని కవితా సంకలనాలు. 'కత్తిపాట' ఇతని పాటల సంకలనం. విప్లవ రచయితల సంఘం వ్యవస్థాపక సభ్యుడు. తెలుగు కవిత్వంలో పదునైన వ్యక్తీకరణకు మొక్కవోని దీక్షకు, ధిక్కారస్వరానికి ప్రతినిధి, ప్రతీక చెరబండరాజు.

## హైదరాబాదు

### 1) నెల్లూరి కేశవస్వామి (1920–1984) :

హైదరాబాద్ నగరంలో జన్మించాడు. విశిష్టమైన వస్తు శిల్ప నైపుణ్యంతో మహోన్నతమైన కథలను రాశాడు. అందులో "చార్‌మినార్" కథలు ప్రసిద్ధమైనవి. "భరోస, యథార్థకథ మొదలగు కథలు ప్రఖ్యాతిగాంచిన కొహినూర్ జౌ కోబ్ వజ్రాలవంటివే కేశవస్వామి కథలు "కేంద్ర సాహిత్య అకాదమి" పురస్కారం కూడా పొందాడు.

### 2) డాక్టర్ టి.వి.నారాయణ (26-07-1925) :

హైద్రాబాద్ జిల్లాకు చెందిన ఈయన విద్యావేత్తగా ఆధునిక దార్శనికుడిగా గుర్తింపుపొందాడు. జిల్లా విద్యాశాఖాధికారిగా, పబ్లిక్ సర్వీస్ కమీషన్ సభ్యుడిగా, అనేక సేవలందించాడు. "జీవనవేదం, ఆర్షపుత్ర శతకం, భవ్యచరిత శతకం, ఆత్మదర్శనం (కవితా సంపుటి) మొదలగునవి ఈయన రచనలు.

### 3) మాదిరెడ్డి సులోచన (1935–1984) :

హైదరాబాద్ నివాసి. భిన్నధృవాలు, పూలమనసులు, వారసులు, దేవుడిచ్చిన వరాలు మొదలైన రచనలతోపాటు పలునవలలు రాసిన ప్రముఖ రచయిత్రి. ఈమె రాసిన నవలలను సినిమాలుగా కూడా తీశాడు.

### 4) ఇల్లిందల సరస్వతీదేవి (1918–1998) :

హైదరాబాద్ నివాసి, ఆంధ్రయువతీ మండలి కార్యదర్శిగా ఉపాధ్యక్షురాలిగా బాధ్యతలు నిర్వర్తించారు. "స్వర్ణకమలాలు, తులసీదళాలు, రాజహంసలు మొదలగు కథలు రాసింది.

## నిజామాబాదు

### 1) నంబి శ్రీధరరావు (1934–2000) :

నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ (వేముగల్లు) నివాసి. 'శ్రీమన్నింబాచల మహాత్మ్యము' అనే కావ్యం, శ్రీమన్నింబగిరి నరసింహాశతకం ఈయన రచనలు. "కవిరాజు" బిరుదును కూడా పొందాడు.

### 2) సలంద్ర లక్ష్మీనారాయణ (12-01-1956 – 17-09-1986) :

నిజామాబాద్ పట్టణంలో జన్మించాడు. చిన్నతనం నుండే హేతువాద దృష్టిని ఏర్పరుచుకున్నాడు. 'వేడిగాలి' తొలి కవితాసంపుటి. 1979లో ఇతడు రచించిన 'చావుగీతం' కవితా సంపుటి సంచలనం సృష్టించింది. 'దళిత మానిఫెస్టో' అనే కవిత ప్రధానమైంది.

### 3) మామిండ్ల రామగౌడు (14-01-1943 – 06-06-2003) :

నిజామాబాద్ జిల్లా వర్ణిమండలం రుద్రూరులో బాలమ్మ మల్లాగౌడు దంపతులకు జన్మించాడు. తెలుగుభాషపై ప్రేమతో 20 ఏండ్ల వయసునుండే రచనలు ఆరంభించాడు. తెలుగు పండితునిగా ఉద్యోగం చేశాడు. "శబరిమాత శతకం, నరసింహ శతకం, కవిగౌడప్ప శతకం వంటి భక్తి నీతి శతకాలతోపాటు మరికొన్ని రచనలు రాశాడు". సుకవి, మధురకవి, కవికోకిల వంటి బిరుదులు, పలు సత్కారాలు అందుకున్నాడు.

## ఖమ్మం

### 1) ఆదిరాజు వీరభద్రరావు (16-11-1890 – 28-09-1973) :

చరిత్ర, సాహిత్య పరిశోధకుడిగా ప్రఖ్యాతిగాంచిన ఆదిరాజు వీరభద్రరావు ఖమ్మంజిల్లా మధిర తాలూకాలో జన్మించి హైదరాబాదులో స్థిరపడ్డాడు. చరిత్ర రచనాకళలో ప్రామాణికస్థాయిని అందుకున్న ఈయన ప్రాచీనాంధ్ర నగరములు, లలిత కథావళి, రత్నప్రభ, జీవిత చరితావళి, జీవిత చరిత్రలు, నవ్వుల పువ్వులు, మిఠాయిచెట్టు, షితాబ్‌ఖాన్ అనే రచనలు చేశాడు. సంగ్రహాంధ్ర విజ్ఞానకోశంలో యాభైవ్యాసాలు రాశాడు. హైదరాబాద్ రేడియోలో తొలి ప్రసంగం చేసినవాడిగా చరిత్రకెక్కాడు. గ్రీకు పురాణకథలు ఇంకా మరెన్నో వ్యాసాలు అముద్రితంగా ఉన్నాయి. చాదర్‌ఘాట్ హైస్కూల్

హైదరాబాద్‌లో ప్రధాన తెలుగుపండితుడిగా పనిచేశాడు. 'లక్ష్మణరాయ పరిశోధక మండలి'కి కార్యదర్శిగా వ్యవహరించాడు. తన పాండిత్యం, పరిశోధనలతో 'తెలంగాణ భీష్ముడి'గా పేరు తెచ్చుకున్నాడు.

### 2) ఉత్పల సత్యనారాయణాచార్య (04-07-1928 - 23-10-2007) :

ఈయన ఖమ్మం జిల్లాలోని చింతకాని ప్రాంతంవాడు. రసధ్వని, ఈ జంటనగరాలు హేమంత శిశిరాలు, గజేంద్ర మోక్షం, భ్రమరగీతం, శ్రీకృష్ణచంద్రోదయం మొదలైన పుస్తకాలు రాశాడు. 'సాహిత్య అకాడమీ పురస్కారం' కూడా లభించింది.

### 3) చక్రవర్తుల లక్ష్మీనర్సమ్మ (03-01-1939) :

ఖమ్మం జిల్లా భద్రాచలంలో జన్మించింది. నరసమాంబ వీరరాఘవాచార్యులు తల్లిదండ్రులు. "అభినవమొల్ల" బిరుదుగల ఈమె "రామదాసు (పద్యకావ్యం) స్వరార్చన, భద్రగిరిప్రశస్తి, కావ్యగౌతమి" మొదలగు గ్రంథాలు రాసింది.

### 4) పబ్బరాజు గోపాలరావు (1928) :

ఖమ్మం జిల్లా మామిళ్ళగూడెంలో జన్మించాడు. ఈయన రాసిన 'రిక్షావాలా కథ, లచ్చినవ్వింది అనే కథా సంకలనం లోనిది'. ఖమ్మం మెట్టు మిత్రమండలి అనే సాహిత్య సంస్థద్వారా అనేక సాహిత్య కార్యక్రమాల్లో పాల్గొన్నాడు.

### 5) శ్రీ ధూపాటి సంపత్కుమారాచార్య (20వ శతాబ్దం) :

ఖమ్మం జిల్లాకు చెందిన ఈయన "యాదగిరి! నృసింహ! రమావిభో! ప్రభో!" అనే మకుటంతో శతకం రాసాడు. భక్తితోపాటు నైతిక విలువను పెంపొందింపజేస్తాయి ఇతని రచనలు.

## ఆదిలాబాదు

### 1) డా॥ సామల సదాశివ (11-05-1928 - 07-08-2012) :

నేటి కుమ్రంభీం జిల్లాలో భాగమైన దహెగామ్ మండలం తెనుగుపల్లెలో జన్మించాడు. సంస్కృతం, హిందీ, ఆంగ్లం, ఉర్దూ, ఫార్సీ, మరాఠీ భాషల్లో పండితుడు. ఇతర భాషల సాహిత్యాన్ని తెలుగులోనికి అనువాదం చేశాడు. అమీద్ రుబాయిలు అనువాదానికి 1964 ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే ఉత్తమ అనువాద పురస్కారం, "స్వరలయలు" గ్రంథానికి 2011లో కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు, ఎన్నో విశ్వవిద్యాలయాలు డాక్టరేట్ బిరుదులు ఇచ్చాయి.

### 2) శ్రీరాంభట్ల చంద్రశేఖర సిద్ధాన్తి (1901-1984) :

నేటి మంచిర్యాల జిల్లాలోని చెన్నూరు నందు పుట్టిన శ్రీరాంభట్ల చంద్రశేఖర సిద్ధాన్తి పంచాంగకర్త మరియు కవి. పార్వతీశ్వర శతకం, అంబా అగస్త్యేశ్వర సుప్రభాతం, సాంబశివభజన కీర్తనలు మొ॥వి రచించారు. ఇతని కుమారుడే శ్రీ ముక్తేశ్వర సిద్ధాన్తి.

తెలంగాణ రాష్ట్రం ఎంతో మంది కవులు, రచయితలకు నెలవు. 20వ శతాబ్దం ఆధునిక కవులలో కొంతమందిని పూర్వపు జిల్లాలను ప్రాతిపదికగా చేసుకొని పేర్కొనడం జరిగింది. తెలంగాణ సాహిత్య చరిత్రలో ప్రాచీన కాలమైనా, ఆధునిక కాలమైనా వేలాది మంది ప్రముఖ రచయితలు తమ రచనలతో పాటు తెలంగాణ భాషకు సొబగులద్దారు. తెలుగు సాహిత్యానికి కీర్తి ప్రతిష్టలు తెచ్చారు. కాళోజీ రామేశ్వరరావు, నారంభట్ల లక్ష్మీనారాయణ, కొరిడె రామయ్య (రామారావు) మొదలగు కవులు, నందిని సిధారెడ్డి, అమ్మంగి వేణుగోపాల్, గోరటి వెంకన్న, గద్దర్, సుద్దాల అశోక్‌తేజ, వఝుల శివకుమార్, పోల్కంపల్లి శాంతాదేవి, కాలువ మల్లయ్య వంటి ఎంతో మంది కవులు, రచయితలు లెక్కకు మించి ఉన్నారు. వారందరికి భాషాభివందనాలు.

❀❀❀❀❀

# 17. తెలంగాణ కళలు

ప్రతికళ యొక్క అంతిమ లక్ష్యం ఒక్కటే బాధను పోగొట్టడమో, ఆనందాన్ని కల్గించడమో, చైతన్యాన్ని / ఉత్తేజాన్ని కల్గించడమో సందేశాన్ని ఇవ్వడమో.

వస్తు వైవిధ్యం, ప్రదర్శనా వైవిధ్యం కలిగిన ఎన్నో రకాలైన జానపదకళలకు తెలంగాణ పుట్టినిల్లు. వాటిని ప్రేమించి ప్రదర్శించి, తమ వృత్తిగా స్వీకరించి వాటి కోసమే తమ జీవితాలను త్యాగం చేసిన వారికి జన్మస్థానం. అటువంటి తెలంగాణ జానపదకళల గురించి వారిలో ప్రసిద్ధులైన కళాకారుల గురించి ఇక్కడ తెలుసుకుందాం.

## జానపద కళలు

### ఒగ్గుకథ :

కళామూర్తులకు తెలంగాణా ప్రాంతానికి జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిన కళారూపం ఒగ్గుకథ. ఒగ్గు అనే వాయిద్యం శివుని డమరుకాన్ని పోలి ఉంటుంది. ఒగ్గుకథ చెప్పే జట్టులో దాదాపు 5గురు ఉంటారు. ఇందులో ముగ్గురు వివిధ వాయిద్యాలు వాయిస్తారు. ఒక పెద్దడోలు, తాళాలు, ఒగ్గు ప్రధాన వాయిద్యాలుగా ఉంటాయి. తెలంగాణా ప్రాంతంలో ఎక్కువగా నల్లగొండ, వరంగల్ జిల్లాల్లో ఒగ్గుకథ చెప్పేవారున్నారు. ఒగ్గుకథను సామాన్యంగా గొల్ల, కురమలే కాకుండా ఇతరులు కూడా చెబుతుంటారు.

వీరు శైవమతానికి చెందిన కథలు ఎక్కువగా చెబుతారు. బీరప్పకథ, మల్లన్న కథ, నల్లపోచమ్మ కథ, మాంధాత కథ, ఎల్లమ్మ కథ. మొదలైనవి. కొమురెల్లి మల్లన్న జాతరలో ఒగ్గుకథను సంప్రదాయబద్ధంగా ప్రదర్శిస్తారు. జాతీయస్థాయిలో ఒగ్గుకథను ప్రాచుర్యం తెచ్చినవారిలో ప్రముఖులు చుక్కా సత్తయ్య, మిద్దె రాములు.

### శారద కథలు :

తెలంగాణలో జానపద గాయకులుగా, భిక్షకులుగా జీవనాన్ని కొనసాగించేవారు శారదకాండ్రు. వీళ్ళు ఎక్కువగా మున్నూరు, ముత్తరాశి మొదలైన కులాల నుంచి ఉద్భవించిన జాతుల్లో శారదకాండ్ర జాతి ఒకటని జానపద వాఙ్మయంలో బిరుదురాజు రామరాజు గారు ఉదాహరించారు. “ఓ భారతీ, కరుణామతీ, భళి శారద కరుణానిధీ” అను వంతపాట పాడటంతో వీరికి ‘శారదకాండ్రు అనే పేరు వచ్చి ఉండవచ్చు.

అంతే కాకుండా వీళ్ళు ఉపయోగించే వాయిద్యంలో భుజం మీద ధరించే తంబూరకు శారద అని పేరు. బుర్రకథలు ఉపయోగించే తంబూరకు, దానికి ఏ మాత్రం తేడా ఉండదు. శారదను ఒక భుజం మీద ధరించి దాని తీగలను మీటుతూ కథకుడు కథ చెప్తుంటే అతని భార్య డక్కి కొడుతుంది. వీళ్ళు పాడే పాటల్లో శారద వరుసలనే కాక చారిత్రాత్మకమైన వీర రసగేయాలను వీరావేశంతో పాడుతారు.

తెలంగాణాలో ప్రచారంలో ఉన్న ప్రసిద్ధ వీర కథలైన సదాశివరెడ్డి కథ, సర్వాయి పాపన్న కథలను అద్భుతంగా పాడి వినిపిస్తారు. శారద కథలను చెప్పేవారు ఎక్కువగా వరంగల్, నల్లగొండ జిల్లాల్లోని గ్రామాల్లో ఉన్నారు.

### బుర్రకథ :

బుర్రకథ ప్రదర్శనలో ముగ్గురు సభ్యులు ఉంటారు. మధ్యలో వ్యక్తి తంబుర భుజానికెత్తుకుని మీటుతూ కథ చెబుతుంటే మిగతా ఇద్దరూ అతనికి తాన తందాన అంటూ వంతపాడుతారు. ప్రశ్నలు సంధిస్తూ, పిట్టకథలు మొదలైనవి చెబుతూ చూసేవారికి ఉత్సాహాన్ని కలిగిస్తారు.

రామాయణ కాలం నుండీ ఇవి ప్రచారంలో ఉన్నాయని చరిత్ర ద్వారా తెలుస్తున్నది.

తెలంగాణ ప్రాంతంలో బాలనాగమ్మ వంటి వాటిని కథలుగా అల్లి ప్రదర్శించేవారు. ఇప్పటికి కూడా మన తెలంగాణా ప్రభుత్వం ప్రజాచైతన్య విషయాలైన కుటుంబ నియంత్రణ, ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన మొదలైన కార్యక్రమాలను వీటి ద్వారానే ప్రచారం నిర్వహిస్తున్నారు.

## హరికథ :

తెలంగాణాలో అన్ని జానపద కళారూపాలతో పాటు వర్ధిల్లి ప్రజాభిమానాన్ని చూరగొన్న కళారూపాలలో ముఖ్యమైనది హరికథాగానం. తెలంగాణాలో ఒక ప్రత్యేకతనూ, గౌరవాన్నీ సంపాదించింది. హరిలీలలను చెప్పే విధానమును హరికథ అంటారు. దీనికి తెలుగు సాహిత్యంలో చాలా ప్రాముఖ్యం ఉంది. నారదుణ్ణి మొదటి హరిదాసుగా పేర్కొంటాము. దానిని ఒక విశిష్ట కళారూపంగా తీర్చిదిద్దినవారు ఆదిభట్ల నారాయణదాసుగారు. ఇది సంగీత, సాహిత్యాల మేలు కలయిక. ఈ కథ చెప్పువారిని భాగవతులు లేదా భాగవతార్ అని అంటారు.

## తోలుబొమ్మలాట :

'తొంబై ఆమడబోయి తోలుబొమ్మలాట చూడాలి. ఆరవై ఆమడబోయి హరికథ వినాలి' అనేది తెలంగాణలో ప్రసిద్ధి గాంచిన నానుడి. దీన్ని బట్టి ఆరోజుల్లో తోలుబొమ్మలాటకు ఎంత ఆదరణ ఉందో అర్థం చేసుకోవచ్చు. తోలుబొమ్మలను తెల్లటి తెరపై వెనుకనుంచి దారంతో సన్నివేశానికి అనుగుణంగా సూత్రాదారుడు వాటిని నాట్యం చేయిస్తాడు. నాటక ప్రదర్శనకు ఎన్ని హంగులుండాలో అన్నిహంగులు తోలుబొమ్మలాటకు ఉండాలి. దాదాపు ఒక కుటుంబంలోని సభ్యులే ఆయా పాత్రలకు వాచికం చెప్పి అభినయింపజేస్తారు.

శ్రీశైలం శివరాత్రి మహోత్సవాలల్లో తోలుబొమ్మలాటలను ప్రదర్శించినట్టు పండితారాధ్య చరిత్ర, పర్వత ప్రకరణంలో 'పాల్కురికి – సోమనాథుడు' ఈ విధంగా వివరించాడు.

"కడునద్భుతంబుగా గంబ సూత్రంబు లడరంగ బొమ్మల నాడించువారు" దీన్నిబట్టి పాల్కురికి సోమనాథుని కాలం నుంచే తోలుబొమ్మలాటలు తెలంగాణాలో ప్రదర్శించారని అతని రచనల ద్వారా తెలుస్తుంది.

కాకతీయులకు సంబంధించిన వరంగల్ జిల్లా గూడూరు, పానగల్లు తెలంగాణా శాసనాల్లో తోలుబొమ్మలాట కళారూపం ప్రస్తావన ఉంది.

## యక్షగానం :

క్రీ.శ. 13వ శతాబ్దం నాటికే ఎంతో వైభవంగా వెలుగొందిన కళయని పాల్కురికి సోమనాథుడు రచించిన పండితారాధ్య చరిత్రలోని పర్వత ప్రకరణంలో చెప్పబడింది. ఈ కళారూపం కురవంజి లేదా కొరవంజికి అనుసరణగా వచ్చిందని సాహిత్య చరిత్రకారుల అభిప్రాయం. ఇది మొదట గానరూపంగా ఉండి క్రమక్రమంగా సంవాద రూపం పొందింది. యక్షగానం యక్షవేషం వేసిన స్త్రీచే గానం చేయబడుతుంది. మద్దెలు, మృదంగం, తాళాలు, హార్మోనియం మొ॥నవి సంగీత పరికరాలుగా ఉపయోగిస్తారు. ఇది సంగీత, సాహిత్య, నాట్యకళలతో మేళవించిన సమాహార కళ. లభిస్తున్న యక్షగానాల్లో మొదటిది కందుకూరి రుద్రకవి రచించిన సుగ్రీవ విజయం.

## చిందు యక్షగానం :

యక్షగానంలో ఒకవిధమైన వైవిధ్యం గల కళారూపం చిందుయక్షగానం. చిందు అంటే అడుగు. అడుగులు వేసే పద్ధతిలో ప్రత్యేక వైవిధ్యం గల యక్షగానమే చిందు యక్షగానం అంటారు. చిందు యక్షగానంలో సామాన్యంగా చెప్పే కథలు ఎల్లమ్మ చరిత్ర, లవకుశ, విప్రనారాయణ మొదలైనవి. ఒక ఎల్లమ్మపాత్ర తప్ప మిగతా స్త్రీ పాత్రలన్నింటినీ పురుషులే ధరిస్తారు. చిందు యక్షగానంలో ఎల్లమ్మ పాత్ర ధరించి ఆ పాత్రకు వన్నెతెచ్చిన కళాకారిణి చిందు ఎల్లమ్మ. చిందుయక్షగాన పితామహుడిగా 'పిల్లిట్ల వెంకయ్య'ను చెబుతారు. 'కేతన' దశకుమార చరితం'లో చిందోళ్ళ ప్రస్తావన ఉన్నది.

## చెక్కభజన :

జానపదుల భజన సంప్రదాయంలో చెక్కభజన ఒకటి. గిలకలు బిగించిన చెక్కలను చేతులలో ధరించి లయాత్మకంగా వాయిస్తూ, ఆ లయకు అనుగుణంగా నృత్యం చేస్తారు. తెలంగాణా అన్ని జిల్లాలోను చెక్కభజన బృందాలున్నాయి.

రామాయణ, భాగవతాలకు సంబంధించినవే కాకుండా సాంఘిక విషయాలకు సంబంధించిన గేయాలను పాడుతూ నృత్యం చేస్తారు. సరిసంఖ్యలో సుమారు 16, 20 మంది కళాకారులు చెక్కభజనలో పాల్గొంటారు. కాళ్ళకు గజ్జెలు ధరించి, తలకు రంగు వస్త్రాన్ని అలంకారంగా కట్టుకొని గుండ్రంగా లేదా వరుసలో నిల్చొని ప్రదర్శన ప్రారంభిస్తారు. మధ్యలో నిలుచున్న వ్యక్తి 'శ్రీమద్ రమారమణ గోవిందా హరి గోవిందా' అని పాటను ఎత్తుకొనగా కళాకారులు కూడా పాటను ఎత్తుకొని నృత్యం ప్రారంభిస్తారు. చెక్క భజనలో జడకోపులు వేస్తారు.

## కోలాటం :

తెలంగాణాలో అత్యంత జన ప్రియమైన వినోదాత్మకమైన జానపద కళారూపమే కోలాటం. శ్రీరామనవమి, దసర, శివరాత్రి పండుగలు, జాతర్లు మొదలైన సందర్భాలలో కోలాటాన్ని ప్రదర్శిస్తారు. కోలాటం, కోలన్న అనే పేర్లు జనవ్యవహారంలో ఉండగా కోలాటం, దండలాసకం, దండవర్తనం, దండరాసకం, వేష్టితం, హల్లీసకం అనేవి కవుల కావ్యాల్లో కోలాటానికి పర్యాయపదాలుగా కన్పిస్తాయి. పాల్కురికి సోమన, తిక్కన, తరిగొప్పుల మల్లన్న, నాచన సోమన మొదలైన కవుల రచనలో 'కోలాటం' యొక్క ప్రస్తావన కనిపిస్తుంది.

## మదిలి నృత్యం :

పీర్ల పండుగ సందర్భంలో ప్రదర్శించే కళారూపాల్లో మదిలి నృత్యం ఒకటి. పీర్లు నిలబెట్టిన రోజు నుండి మదిలి వేషం వేసుకుని ఇల్లిల్లు తిరుగుతూ నృత్యం చేసి డబ్బు, ధాన్యం తీసుకుని వెళ్తారు. వేషధారణ ఆకర్షణీయంగా ఉంటుంది. గజ్జెలు కుట్టిన రంగుల నిక్కరు, మెడలో రంగు వస్త్రాన్ని ధరిస్తారు. ఎడమ చేతిలో గొడుగు, కుడిచేతిలో ఒకకర్రను పట్టుకొని తప్పెట గతులకు అనుగుణంగా నృత్యం చేస్తారు. గుండం చుట్టూ తిరుగుతూ నృత్యం చేస్తారు. పీర్ల ఊరేగింపులోను నృత్యం చేస్తారు. వేగంగాను, నెమ్మదిగాను వివిధ గతుల్లో నృత్యం ఉంటుంది.

## బైండ్ల కథ :

తెలంగాణలో వృత్తిగాయకులుగా పేరు గాంచిన వారిలో బైండ్లవారు ఒకరు. ఈ వృత్తి గాయకులు ఎల్లమ్మ, మారమ్మ, మైసమ్మ, భవాని, దుర్గా, కాళి మొదలైన పేర్లు కలిగిన శక్తిని ఆరాధించి ఆమె గుణ గానం చేసి, ఆటలు, పాటలు పాడుతూ జీవనం గడుపుతారు. పేరేది చెప్పినా భవానిదేవియే వీరికి ఆరాధ్యదైవం. అందుచేత భవానిని కొలుచువారు 'బవనీయులు'. వీరినే వ్యవహారంలో బైండ్ల వారుగా పిలుస్తారు. ఈ క్రింది చాటుపద్యం ద్వారా వీరి గురించి సమగ్రంగా తెలుసుకోవచ్చు.

సీ॥ దీర్ఘకాయము గల్గి ధైర్యవంతుడయ్యి
        పాదాల జీరాడుపంచె గట్టి
    బుగ్గమీసంబుల పూర్ణదృఢత్వంబు
        తెల్లని తలపాగ తేజమలర
    చెనయ  దక్షిణ చేతి సింహతలాటమ్ము జమిటిక
        వామచంకను ధ్వనింప
    కాళ్ళకు గజ్జెలు ఘల్లు ఘల్లున మోగ
        నుదుట కుంకుమ బొట్టునది జ్వలింప
తే॥ శాంభవీ దుర్గా మహంకాళి జగము మాత
    ప్రకృతిదేవికి పుత్రుడు భవ్యశాలి
    అతడె భవనీడు జనపదుడాది శక్తి
    మహిమలన్నుగ్గడించెడు మానధనుడు

అనే ప్రయోగాన్ని చూస్తే 'బైండ్ల వాళ్ళ" గొప్పతనం తేట తెల్లమవుతుంది.

## గొల్లసుద్దులు :

యాదవ చరిత్రకు సంబంధించిన కృష్ణలీలలు, కాటమరాజు కథ మొదలైన వాటిని గొల్లసుద్దులవారు ప్రచారం చేస్తూ ఉంటారు. అయ్యలరాజు నారాయణామాత్యుడు 'హంసవింశతి'లో పెద్ద పెద్ద వస్త్రాలపై చిత్రించిన బొమ్మల సహాయంతో కథలు చెబుతారు. వీరిని గురించి ప్రస్తావించారు.

చేతిలో ఒక కర్రను పట్టుకుని భుజాన ఒక గొంగడి వేసుకుని సమాజంలోని అనాచారాలను, అన్యాయాలను వ్యంగ్యంగా ఎత్తుపొడుపు ధోరణిలో ఈ ప్రదర్శన ఇస్తుంటారు. ''తెలంగాణ సాయుధ పోరాట' కాలంలో ప్రజలను ఈ గొల్లసుద్దుల ద్వారా చైతన్యపరచిన ప్రజాకవి, గాయకుడు సుద్దాల హనుమంతు. అదే విధంగా కమ్యూనిస్టు పోరాటయోధుడు. మాజీ శాసనసభ్యులు కీ.శే. నర్రా రాఘవరెడ్డి గొల్లసుద్దుల ద్వారా ప్రజలను ఎంతగానో చైతన్యపరిచాడు.

## రంజు కళాకారులు :

విశ్వబ్రాహ్మణ కులానికి చెందిన ఆశ్రిత కులాలైన రంజు, పనస, సమయాలు చేసే ప్రదర్శన అద్భుతంగా ఉంటుంది. వీరు రంజు అనే వాయిద్యాన్ని వాయిస్తూ వీరబ్రహ్మం కథ, విశ్వకర్మ పురాణం చెబుతారు. 'రుంజ' అని వ్యవహారనామం కూడా ఉంది. మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి, కరీంనగర్, వరంగల్ మొదలైన జిల్లాలో ఎక్కువగా కనిపిస్తారు.

## 'తోటి' కళాకారులు :

గిరిజన తెగలైన కోయ, గోండు, నాయకపోడు కులాలకు సంబంధించిన కులోత్పత్తి గాథలు చెప్పేవారు వీరు.

ఈ 'తోటి' కళాకారులు గిరిజన జాతులు, తెగలకు ఆశ్రితకులాల వారు. వీరు కురువంశ మూల పురుషుల కథలు చెబుతారు.

ఖమ్మం, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, మహబూబ్‌నగర్ జిల్లాల్లోని గిరిజనులు ఈ కథలు చెబుతుంటారు.

## మందెచ్చు కళాకారులు :

యాదవ కులానికి చెందినవారు మందెచ్చు కళాకారులు. వీరు ఒల్లమాదేవి జానపద కథను గానం చేస్తారు.

ప్రధాన కథకుడు ఒక చేతితో కత్తి, మరోచేతితో చిరుతలు పట్టుకుని కథాగానం చేస్తాడు. మరో ఇద్దరు ఒకరు కత్తి, మరొకరు కర్ర పట్టుకుని కథకునికి వంత పాడతారు.

## బుడబుక్కలు :

తెలతెలవారుతుండగా వీధుల్లో తిరుగుతూ క్షుద్రశక్తులను పారద్రోలే బుడబుక్కల వారి గురించి తెలంగాణాలోని ప్రజలందరికీ తెలుసు. వీరు సంచార జాతులకు చెందినవారు. జోస్యం చెప్పడం, తాయెత్తులు కట్టడం వీరి వృత్తి.

## కప్పతల్లి / తప్పెటగుళ్ళు :

తెలంగాణాలో అతి ప్రాచీన కళానృత్య రూపకం కప్పతల్లి. నృత్యం, గీతం, తప్పెట లయతో కలిపి ప్రదర్శించే కళారూపకం ఇది. తప్పెటను ఛాతీపై పెట్టుకుని వాయించటం వల్ల తప్పెటగుళ్ళని దానికి పేరొచ్చింది. దీనిని తెలంగాణాలో కప్పతల్లి అంటారు.

## ఆసాదులు :

తెలంగాణాలో ఎల్లమ్మ, మైసమ్మ, పెద్దమ్మలను గ్రామదేవతలుగా పూజిస్తారు. ఈ పూజలను నిర్వహించే పూజారులనే 'ఆసాదులు' అంటారు.

దళితులతో పాటు కుమ్మర్లు కూడా ఆసాదులుగా ఉంటారు. గ్రామదేవతలకు పూజలు చేసే క్రమంలో అమ్మవార్లను ప్రార్థిస్తూ స్తుతిస్తారు. అమ్మవార్ల కొలువంతా తాంత్రిక పద్ధతిలో జరుగుతుంది.

## గంగిరెద్దులాట :

పూజ గొల్ల కులానికి చెందిన కళాకారులు నిర్వహించే ప్రదర్శన గంగిరెద్దులాట. ఒక వ్యక్తి గంట వాయిస్తూ గంగిరెద్దును ఆడిస్తుంటారు. మరో ఇద్దరు వ్యక్తులు సన్నాయి. డోలు వాయిస్తూ సహకరిస్తుంటారు.

తెలంగాణ జిల్లాల్లో ఈ ప్రదర్శన కనిపిస్తూ ఉంటుంది.

## బందారు కళాకారులు :

పెరిక కులానికి చెందిన ఆశ్రిత కులాలవారు పెరిక జాతి పురాణం కథ చెబుతారు. ఈ ప్రదర్శనలో వాద్య సహకారం లేకుండానే కథాగానం సాగుతుంది.

ప్రధాన కథకుడు పాడుతూ కథ చెబుతుంటే మరో ఇద్దరు 'ఊ' కొడుతూ సహకారం అందిస్తారు.

## వీరముష్టివారు :

కోమట్ల ఇలవేల్పయిన 'శ్రీకన్యకాపరమేశ్వరి' గురించిన పాటలు పాడడం చేత కోమట్లు వీరిని ఎక్కువ ఆదరిస్తారు.

## డోలి కళాకారులు :

గిరిజనులైన కోయతెగ పుట్టుక, వంశమూల పురుషుల చరిత్రను చెప్పేవారు డోలి కళాకారులు.

వీరిని 'ఇంటోళ్ళు, నాగస్తంభం' వారని కూడా పిలుస్తారు.

కోయలకు వీరు ఆశ్రితులు, వీరు కోయల్లో మూడో గట్టుకు చెందిన మూలపురుషుడు 'పేరం బోయరాజు' కథను చెబుతారు. డోలు వారి ప్రధాన వాయిద్యం.

## పెద్దమ్మలోళ్ళు :

సంచారజాతికి చెందిన మహిళా కళాకారులే పెద్దమ్మలోళ్ళు. వీరు ఇద్దరు, ముగ్గురు కలిసి ప్రదర్శన నిర్వహిస్తారు. పెద్దమ్మతల్లి విగ్రహాన్ని ఒక చేతిలో ఉంచుతారు. మరో కళాకారిణి డోలుతో శబ్దం చేస్తుంది.

వీరితో పాటు మరో కళాకారుడు వీరతాటిని పట్టుకుని విసురుతూ ఉంటాడు.

విగ్రహాన్ని తలపై పెట్టుకున్న స్త్రీ డోలు శబ్దానికి లయబద్ధంగా అడుగులు వేస్తుంది.

నిజాం ప్రభుత్వాన్ని ఎదిరించిన విప్లవయోధుడు పండుగశాయన్న వీరగాథను వీరు గానం చేస్తూ ప్రదర్శన నిర్వహిస్తారు.

## భిక్షకుంట్లు :

భిక్షకుంట్లు కళాకారులు సత్యహరిశ్చంద్ర, మార్కండేయ, ప్రహ్లాద, గంగ–గౌరి వంటి కథలు చెబుతారు.

ముగ్గురు నలుగు కళాకారులుకలిసి ఈ ప్రదర్శన నిర్వహిస్తారు. ప్రధాన కథకుడు పొన్నుకర్రచేతిలో ఉంచుకుని ఊపుతూ కథ చెబుతాడు. సహకళాకారులు, మద్దెల, హార్మోనియం, తాళాలు వాయిస్తారు. వీరినే పిచ్చుకగుంట్లవారు అని కూడా వ్యవహరిస్తారు.

తెలంగాణలో బాలనాగమ్మ కథను పిచ్చుక కుంట్లవారు వ్యాప్తిచేశారు. భారత కథలను, బీరప్ప కథలను ఉగ్గుగొల్లలు ప్రదర్శించారు.

## జముకులవారు :

ఎల్లమ్మ, పోచమ్మ, అక్కమ్మ, సారంగధరచరిత్ర కథలను అతి రమ్యంగా గానం చేస్తారు.

వీరు 'జమిడక' అనే వాయిద్యం వాయిస్తారు. ఖమ్మం, నల్లగొండ జిల్లాల్లో వీరికి ఆదరణ ఎక్కువ.

## జంగాలు :

తెలుగు గేయసాహిత్యంలో పద్యాలను, కీర్తనలను యక్షగాన పద్ధతిలో వీరు గానం చేసిన వీరజంగం కథలు ప్రసిద్ధి పొందాయి.

ప్రాచీన కాలం నుంచి జానపద సాహిత్యం వీరి వలన ప్రసిద్ధి చెందింది. వీరు ప్రముఖంగా శైవగాథల్నే వీరావేశంగా చెబుతారు.

## 'పర్ధాన్' కళాకారులు :

ఆదిమవాసి జాతికి చెందిన పర్ధాన్‌లు దేవాల్ పునాక్ (కోయపున్నమి) పురాణ గాథను గానం చేస్తూ ప్రదర్శిస్తారు.

ఇది గోండు జాతి పుట్టు పూర్వోత్తరాలు తెలిపే చరిత్ర.

కేకిరి (కింకిరి), డక్కి, తాళాలు వీరి ప్రదర్శనలో ఉపయోగించే వాయిద్యాలు.

## ఢాడీల ప్రదర్శన :

ఢాడీలు బంజారా మూలపురుషుల జీవిత చరిత్రలు గానం చేస్తూ జీవనం సాగిస్తారు.

వీరు ఆయా తండాలకు వెళ్ళి అక్కడ కుల పెద్దలను కలిసి ప్రదర్శన నిర్వహిస్తారు. 'వీరిని భట్టు, భట్‌లని కూడా పిలుస్తారు. వీరిది బృందగాన రూపకం.

## జోగాట :

హరిజనుల్లో ఒక తెగ అయిన జోగులు దీనిని ఆడుతారు. వీరు సంతోష సమయాల్లో, వేడుకలు ఉత్సవాలప్పుడే కాక తమ జాతివారెవరైనా మరణించినప్పుడు కూడా డప్పులు వాయించడం చేస్తారు.

నృత్యం చేసేటప్పుడు పిండోత్పత్తి క్రమాన్ని వర్ణిస్తారు.

## వీధి భాగోతం :

'ఆరె' తెగవారు ఆరె భాషలో వీధి భాగవతాన్ని చెబుతారు. వీరు ముఖ్యంగా కరీంనగర్, వరంగల్, నల్గొండ జిల్లాల్లో వ్యాపించి ఉన్నారు.

## చిందు భాగవతం :

డొక్కలివారు చిందు భాగవతాన్ని ప్రదర్శిస్తారు.

ఎల్లమ్మను ఆరాధిస్తూ 18 మంది కళాకారులు జాంబపురాణం మొ॥ వాటిని ప్రదర్శిస్తారు.

డప్పులు, కొమ్ములు, వొలిసెనలు, తాళం, హార్మోనియం, మువ్వల ధ్వనులతో జాంబవంతుడు ప్రవేశిస్తాడు.

"బుడ్డర్‌ఖాన్" అనే పాత్ర హాస్యంగా నటులందరినీ పరిచయం చేస్తాడు.

పొణికి కర్రతో చేసిన నగలను ధరిస్తారు.

తెలంగాణాలో నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్, మహబూబ్‌నగర్, నల్గొండల్లో చిందు భాగవతులు అధికంగా ఉన్నారు.

## బుడగ జంగాలు :

నంది ఉన్న గంటను వాయిస్తూ శివుడిని గూర్చిన జానపద గేయాలను పాడుతూ విభూతిని పంచుతూ భిక్షాటన చేస్తారు. వీరు శివభక్తులు.

## లత్కోర్‌సాబ్‌లు / పిట్టలదొర :

పిట్టలదొర వేషాన్ని తెలంగాణలో లత్కోర్‌సాబ్, బుడ్డర్‌ఖాన్, తుపాకిరాముడు అని పిలుస్తారు. ఇది పగటివేషాల్లో ఒక రకం.

పిట్లల దొర వేషగాళ్ళు ఖాకీచొక్కా, లాగు, టోపీ ధరిస్తారు. టోపీపై ఈకలు, చేతిలో కట్టె, మెడలోరుమాలు, బూటు తొడిగి హంగామా చేస్తారు. సమాజంలోని కుళ్ళును హాస్యంతో మేళవించి విరామం లేకుండా మాట్లాడుతారు.

## దండాగానం :

తెలంగాణా పల్లె ప్రజలు ఉర్దూ పదాలు తక్కువగా వాడుతూ తెలంగాణా వీరులను గూర్చి, పోలీసు చర్య, ప్రజల పోరాటాలు మొ॥ విషయాలను పాటల్లా పాడుతారు.

## బిత్రో నిత్రో పదాలు :

ముకెబల్ల జంగాలు బిత్రేశ్వరుడు, నిట్టేశ్వరీదేవిని గూర్చి పాడుతూ 'బిత్రో నిత్రో' అనే మకుటంతో పదాలు పాడతారు.

వీరు కాకతీయుల కాలంలో వంది, మాగదులుగా ఉండేవారు.

## గంటె భాగవతులు :

గరిటెలో చమురు దీపం వెలిగించి ఆ వెలుతురులో కథ చెప్తారు. ప్రతిపాత్ర చేతిలో గరిటె ఉంటుంది. గరిటె దీపపు వెలుగులో హావభావాలు ప్రదర్శిస్తారు.

తెలంగాణాలో గంటె భాగవతం చెప్పేవారు కరీంనగర్‌లో ఉన్నారు.

## చోడిగాని కలాపం :

'దసరా పండగ' సందర్భంగా 'సోలిగాడు' అనే కళాకారునిచే ఇది ప్రదర్శింపబడుతుంది.

కళాకారుడి వేషధారణ – ముఖం నిండా సున్నపుబొట్టు, మధ్య నల్లని చుక్కలు పెట్టుకొని, తలకు నల్లని గుడ్డ ధరించి, తలపై కాకి ఈకలు, చేతిలో వంకర దుడ్డు భుజానికి జోలె కట్టుకొని హాస్యాన్ని కలిగిస్తుంటాడు.

## బాలసతులవారు (బాలసంతులవారు) :

తెల్లవారుజామున గంట మ్రోగిస్తూ శంఖనాదంతో శివునిపై గీతాలు పాడుతూ గ్రామ ప్రజలను మేల్కొలుపుతారు.

ఇలా వీరు ప్రతి గ్రామంలోనూ యాచిస్తూ జీవనం సాగిస్తారు.

## దొమ్మరాట :

దొమ్మరివారు గ్రామాలకూడళ్ళలో ప్రదర్శించే కళ. సోమన 'పండితారాధ్య చరిత్ర'లో వీరిని ప్రముఖంగా ప్రస్తావించారు.

డోలు వాయిస్తుండంగా వెదురుగడలకు కట్టిన తాళ్ళపై నడుస్తారు.

బండలను చాతీపై ఉంచుకుని బద్దలు చేయటం, ఇనుపచువ్వలను వంచడం శరీరాన్ని వివిధ భంగిమల్లో వంచడం వంటివి – సర్కస్ తరహా ప్రదర్శన చేస్తారు.

## గుసాడి నృత్యం :

ఈ నృత్యం పుట్టినిల్లు పూర్వపు ఆదిలాబాదు జిల్లా. ఇది రాజగొండులకు సంబంధించింది. ఈ నృత్యానికి ప్రత్యేక వేషధారణతో, వివిధ నగల అలంకరణతో ఉంటారు. ఇది సామూహిక నృత్యం. ఇలాంటి సామూహికాలను 'దండారి' నృత్య సమూహాలు అని అంటారు. వీరు పరిసర గ్రామ గ్రామానికి వెళ్ళుతారు. ఇలా వెళ్ళే సమూహాలలో ఇరవై నుండి నలభై మంది వరకు ఉంటారు. ఈ సమూహాల్లో నుండే ఇద్దరి నుండి ఐదుగురి వరకు గుసాడి నృత్యాన్ని చేస్తారు. ఇది దండారిలోని ఒక భాగము. ఈ గుసాడి నృత్యం ఆశ్వీయుజ బహుళపాడ్యమి

నుండి అమావాస్య వరకు అంటే దీపావళి వరకు చేస్తారు. ఇది ఒక ఉత్సవంగా కనబడుతుంది. ఈ నృత్యానికి పిపిరి, డప్పు, తుడుం మొదలగునవి ఉపయోగిస్తారు. నెమలి ఈకలకట్టను, జింక కొమ్ములను, మేకచర్మాన్ని మొదలగు వాటిని ధరిస్తారు. ఇది గుసాడి నృత్య ప్రత్యేక వేషధారణ.

**సాధనాశూరులు :**

పద్మశాలీలను యాచిస్తూ వారి అనుమతితో ప్రతి గ్రామంలోనూ ప్రదర్శన చేసేవారిని 'సాధనాశూరులని' వ్యవహరిస్తారు.

పైన పేర్కొనిన జానపద కళారూపాలే కాకుండా ఇంకా ఎన్నో జానపద కళారూపాలు కనిపిస్తాయి. అయితే అవి పెరుగుతున్న సాంకేతిక విజ్ఞానం వల్ల కనుమరుగై పోతున్నాయి. ప్రజల ఆదరణ తగ్గిపోవడం, ప్రసార, ప్రచార మాధ్యమాల పోటి, జానపద కళారూపాలు, కళాకారులు కనుమరుగుకు కారణమవుతున్నాయి. కానీ తెలంగాణా రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వం జానపద కళాకారుల్ని ఆదరించి దగ్గరికి తీసుకుంటున్నది.

## హస్త కళలు

**బిద్రి :**

ఇది తెలంగాణలో కొన్ని వందల ఏళ్ళ నుండి ప్రసిద్ధి పొందింది. దేశ వ్యాప్తంగా విస్తరించింది. సుమారు 4000 ఏళ్ళ క్రిందట పర్షియన్, సిరియన్, ఇరానియన్ సంస్కృతి మూలస్థానంగా ఏర్పడిన కళ మన దేశంలో తొలిగా తెలంగాణలోకి ప్రవేశించింది. ఇక్కడే బహుమనీ సుల్తాను కాలంలో హైదరాబాద్ రాజ్యంలో పురోభివృద్ధి చెందింది. హైదరాబాద్ రాజ్యంలోని 'బీదర్' కేంద్రంగా కళాభివృద్ధి జరిగింది. కాబట్టే దీనిని బీదరి – బిద్రి కళగా పిలుస్తున్నారు.

గాజు వస్తువులు, పాన్‌దాన్‌లు, లోహపెట్టెలు మొదలగు వస్తువులపై ఈ కళాకారులు వారి నైపుణ్యాన్ని ప్రదర్శించేవారు. ఆయా వస్తువులను ప్రత్యేకంగా తీర్చిదిద్దేవారు. నేడు నామ ఫలకాలు, గిన్నెలు మొదలైన వస్తువులకు కూడా ఉపయోగిస్తున్నారు. బంగారు వెండి నగల తయారికీ ఇది పెట్టింది పేరు. బిద్రి కళ తెలంగాణ కళా ఉనికిని చాటే అద్భుతకళ.

**ఫిలిగ్రీ :**

క్రీ.పూ. 2500 సం॥ నుండి ఉన్న కళ ఫిలిగ్రి. ఇది కూడా దేశవ్యాప్తంగా వ్యాపించి ఉన్నప్పటికి హైదరాబాద్ రాజ్యంలో విస్తృతంగా ఉన్నది. ఈ రాజ్యంలో ఈ కళకు పూర్వ కరీంనగర్ జిల్లా పెట్టింది పేరు. ప్రధానంగా ఇది వెండి నగలకు సంబంధించింది. నగిషీ కళలాంటిది. వెండి గొలుసులు, చెవిదుద్దులు, పూజా సామాగ్రి వస్తువులు, ప్రతిమలు మొదలగు వాటిపైన ఉండే ఈ కళ అబ్బురపరస్తుంది.

**నకాశి :**

ఇది కూడా తెలంగాణలో విల్లసిల్లుతున్న కళ. మొఘలు చక్రవర్తుల కాలంలో వచ్చిన కళల ఆధారంగా రూపొందిన కళ ఇది. ఈ కళకు పుట్టినిల్లు పూర్వపు వరంగల్ జిల్లాలోని చేర్యాల. పురాణాలు, జానపదాల నుండి ఉన్న వర్ణనల ఆధారంగా తీర్చిదిద్దుతారు. వీటి ఆధారంగా ఆయా కథలను చక్కగా చెప్పవచ్చు. చక్కటి చిత్రకళకు నకాషి నిదర్శనం.

**నిర్మల్ కొయ్యబొమ్మలు, పెయింటింగ్స్**

నిర్మల్‌లో తయారైన కొయ్యబొమ్మలు, పెయింటింగ్స్ దేశీయంగా, అంతర్జాతీయంగా ప్రసిద్ధిపొందాయి. శాతవాహనుల కాలం నుండి ఈ హస్తకళ ఉన్నట్లుగా తెలుస్తున్నది.

అడవిలో దొరికే పొనికి కట్టెను వివిధ ఆకారాల్లో మలిచి దానికి రంగులు వేస్తారు. పండ్లు, కూరగాయలు, పక్షులు, జంతువులు మొదలైన బొమ్మలు చేస్తారు.

నిర్మల్ పెయింటింగ్స్ ఎంతో ప్రజాదరణ పొందాయి. గంధర్వ కన్య, గీతాబోధన, ప్రకృతి రమణీయ చిత్రాలు, దేవతల చిత్రాలు ఎంతో ఆకర్షణీయంగా ఉంటాయి. చెట్ల రసాలు, పువ్వుల నుండి తీసిన రంగులతో ఈ పెయింటింగ్స్ వేయడం దీని ప్రత్యేకత.

ప్రముఖ యాత్రా చరిత్రకారుడు ఏనుగుల వీరాస్వామయ్య తన కాశీయాత్ర చరిత్ర గ్రంథంలో ఈ నిర్మల్ కళలను గురించి ప్రస్తావించాడు. ఇక్కడి కళాకారులకు రాష్ట్రపతి అవార్డులు కూడా లభించాయి.

**పెంబర్తి :**

జ్ఞాపికలు అంటేనే జ్ఞాపకం వచ్చేది పెంబర్తి హస్తకళా రూపాలు. ఇక్కడ తయారయ్యే ఇత్తడి కళారూపాలు, నగిషీలు,

జ్ఞాపికలు కాకతీయుల కాలం నుండి పేరుపొందాయి. ఇక్కడి కళాకారులు వివిధ దేవాలయాల గోపురాలకు, ధ్వజస్తంభాలకు ఇత్తడి, రాగి, వెండి, బంగారు తాపడాలను తయారు చేశారు.

పెంబర్తి కళాకారులు చేసే బ్రాస్, కాపర్, సిల్వర్ ఉత్పత్తులకు ప్రపంచ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్నది. ఈ పెంబర్తి కళ పూర్తిగా చేతిపని. రంగశాయిపేటలో కూడా ఈ కళ ఉన్నది.

భువనగిరిలోని దంతపు బొమ్మలు, దేవుడి రూపాలలో మాస్కులు తెలంగాణలో ప్రసిద్ధమైనవి.

తెలంగాణలో వెదురుతో తయారుచేసిన చాపలు, తడకలు, బుట్టలు, విసనకర్రలు, బతుకమ్మ సిబ్బిలు, పిల్లల ఆట వస్తువులు మొదలగువాటిని తయారు చేస్తారు.

తెలంగాణలో ఆదిలాబాద్ ప్రాంతంలో ఢోక్రా హస్తకళ ప్రసిద్ధి పొందినది. తడి మట్టితో బొమ్మలు తయారు చేసి, దానిపై కావల్సిన ఆకృతుల్లో మైనాన్ని పెట్టి ఎండిన తర్వాత కంచు లేదా ఇత్తడితో పోత పోసి బొమ్మలు చేస్తారు.

### హైదరాబాద్ లక్క గాజులు :

హైదరాబాద్‌లోని చార్మినార్ వద్ద లాడ్‌బజార్‌లో లభించే వివిధ రకాల గాజులలో లక్క గాజులు ప్రసిద్ధి పొందాయి. ఇవి స్థానికంగా తయారు చేస్తారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడి లక్క గాజులను కొనుగోలు చేస్తారు. వీటికి జాతీయ, అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్నది. లక్కగాజులతోపాటు రంగురంగు రాళ్ళు పొదిగిన గాజులు కూడా ప్రసిద్ధిపొందాయి.

### చేనేత కళ :

నల్లగొండ జిల్లాలో పోచంపల్లి 'టై అండ్ డై'లో అంతర్జాతీయ స్థాయిలో రెండు దశాబ్దాల కాలంలోనే పేటెంట్ హక్కు పొందింది. ఇక్కత్ చీరలకు పోచంపల్లి ప్రసిద్ధి చెందినది. పోచంపల్లితో పాటు కొయ్యలగూడెం, పుట్టపాక, చౌటుప్పల్‌లకు కూడా ఈ కళ వ్యాపించింది.

నారాయణపేట పట్టు చీరలకు వందేళ్ళ చరిత్ర ఉన్నది. బంగారపు అంచులతో ఇక్కడి చీరలు ఉంటాయి.

గద్వాలలో పట్టు, నూలుపోగుల మిశ్రమంతో చీరలను నేస్తారు. తిరుపతి వేంకటేశ్వర స్వామికి నాలుగు దశాబ్దాలుగా పట్టు వస్త్రాలను పంపిస్తున్నారు.

తెలంగాణలోని కాజీపేటలో పిన్ లేదా బాబిన్ లేసుల కళకు ప్రసిద్ధమైనది. ఇవేకాకుండా తెలంగాణలోని బంజారా మహిళలు రంగు దారాలు, అద్దాలు, పూసలు, గవ్వలతో ఎంబ్రాయిడరీ చేసిన వస్త్రాలను ప్రత్యేకంగా తయారు చేసుకొని ధరిస్తారు.

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పట్టుకాయలతో తయారు చేసిన పట్టు వస్త్రాలకు (టస్సర్) ప్రసిద్ధి.

వరంగల్‌లో తివాచీలు, పూసలు, అల్లికలు ప్రసిద్ధమైనవి.

రాజన్న సిరిసిల్ల జిల్లా నూలు వస్త్రాలకు ప్రసిద్ధి చెందినది.

## లలిత కళలు

లలిత కళలు అనగా 5. చిత్రలేఖనము, శిల్పం, నృత్యము, సంగీతము, కవిత్వము.

### చిత్రకళ

చక్షురింద్రియము ద్వారా మనస్సుకు ఆనందాన్ని కలిగిస్తుంది. ఒక ఉపరితలంపై బొమ్మలు గీసి, రంగులు అద్దటమే చిత్రలేఖనం. దీనికి ప్రత్యేక కత్తులు (Knives), స్పాంజులు, రంగులు జల్లే బ్రష్‌లు (ఎయిర్ బ్రష్)లు, పెన్సిల్, కణిక (Crayans), కుంచెలను ఉపయోగిస్తారు. గోడలు, కాగితం, వస్త్రం, కలప, గాజు, బంకమట్టి, పత్రాలు (ఆకులు), రాగి, ఇసుక లేదా కాంక్రీటు మిశ్రమాలపై చిత్రకారులు బొమ్మలు గీస్తారు. చిత్రలేఖనానికి హద్దులు ఉండవు. ఊహా రూపానికి జీవకళ ఇచ్చే చక్కని సాధనం.

తెలంగాణలోని కొంతమంది చిత్రకారులు అంతర్జాతీయ స్థాయిలో ప్రసిద్ధిపొందారు.

ఆధునిక చిత్రకళలో పి.టి.రెడ్డి అంతర్జాతీయ ఖ్యాతి వహించారు. నీటి రంగులను వినియోగిస్తూ పౌరాణిక చిత్రాలు గీయడంలో కొండపల్లి శేషగిరిరావు ప్రసిద్ధుడు. వీరితో పాటు ఎంతో మంది చిత్రకళలో ప్రసిద్ధి చెందిన వారు తెలంగాణలో ఉన్నారు. వారిలో లక్ష్మాగౌడ్, తోట వైకుంఠం, సూర్య ప్రకాశ్, బైరు రఘురామ్, ఏలె లక్ష్మణ్, అనంతయ్య, నరహరి, విద్యాభూషణ్ తదితరులు ప్రసిద్ధులు.

బాతిక్ పద్ధతిలో చిత్రాలు గీయడంలో యాసాల బాలయ్య ప్రసిద్ధుడు. కవితా దేవేస్కర్, సురభివాణి, అంజనీరెడ్డి, లక్ష్మారెడ్డి, గౌరి వేముల మొదలగు మహిళలు కూడా చిత్రకళలో ప్రసిద్ధి పొందారు.

## నాట్యకళ

అభినయ ప్రధానమైన కళ. శ్రవణేంద్రియమునకంటే చక్షురింద్రయమునకు ఎక్కువ ప్రీతి కలిగించును. ఇది సమాహారకళ. అనేక సంస్థానాలలో ముఖ్యంగా గద్వాల, జటప్రోలు, కొల్లాపురం, వనపర్తి సంస్థానాల్లో నృత్యకళ పోషింపబడినది.

తెలంగాణ ప్రభువుల పాలనలో శాస్త్రీయ నర్తనమేకాక ప్రజానర్తనం బాగా ప్రసిద్ధి చెందింది. వాటిలో వీథినాటకం, యక్షగానం, కోలాటం, దప్పులు, మొదలైన 20 రకాల నాట్యరీతులు బవనాలు, ఉగ్గగొల్లలు, శారదవాండ్లు, పిచ్చుకగుంట్లు, పాండవులు, ఆరెమరాటీలు, బోడిదాసరులు, సైంధవులు, భరతులు, బహురూపులు మొదలగు జాతులు తమ నాట్యాన్ని ప్రదర్శించేవారు. పెద్దపల్లి, మంథెనలలో ప్రసిద్ధ నాట్యకళాకారులెందరో ఉన్నారు. ఈ కళాకారులు లక్ష్మాసాని, గిర్రాసాని, రామసాన అనే పేర్లుతో గౌరవింపబడేవారు. నిజామాబాద్ జిల్లాలో బోడి దాసరుల, గుసాడి నృత్యాలు ప్రసిద్ధమైనవి.

తెలంగాణలో యక్షగానం ప్రదర్శించే చిందు కళాకారులు ముప్పై వేల మంది వరకు ఉంటారు.

జాయపసేనాని నృత్తరత్నావళిలో భాండ్, గొండ్లి నృత్యాలను తెలిపాడు.

సర్వ వాద్య ఆరాధనా సమయాలలో 50 ఏళ్ళ క్రితం వరకు శుద్ధ నర్తనాన్ని దేవనర్తకులు దేవాలయాల్లో ప్రదర్శిస్తూ ఉండేవారు. ఇది రామప్ప శిల్పంపై కనబడుతుంది. దీన్ని తెలంగాణలో వీరముష్టి వారు ప్రదర్శిస్తారు. తెలంగాణలో ప్రసిద్ధమైనది పేరిణి నృత్యం.

### పేరిణి :

పేరిణి శివతాండవం అనేది తెలంగాణలో కాకతీయుల కాలం నుంచి ప్రసిద్ధి. ఈ నృత్యాన్ని వీరులకు ఉత్సాహాన్ని కలిగించడానికి, యుద్ధోన్ముఖులను చేయడానికి చేస్తారు. ఈ నృత్యంలో శివుడిని కొలుస్తారు. శివుడు చేసే నాట్యమే శివతాండవం. ప్రధానంగా డప్పుల మోతతో, మృదంగంతో, వీరత్వాన్ని ప్రదర్శించడానికి పురుషులు చేసే నృత్యం. ఇప్పుడు పేరిణీలో లాస్య నర్తనను చేర్చి స్త్రీలు కూడా ప్రదర్శిస్తున్నారు.

### డా॥ నటరాజ రామకృష్ణ (1933–2011) :

పేరిణి (శివతాండవం), ఆంధ్రనాట్యము (పురాతన లాస్యనర్తనం), నవజనార్దనం (ప్రబంధ నాట్య సంప్రదాయం) వంటి నృత్యరీతుల్ని వెలుగులోకి తెచ్చిన నృత్యకళాకారుడు. ఆజన్మ బ్రహ్మచారిగా ఉంటూ నాట్యంకోసం జీవితాన్ని ధారపోశాడు. ఎందరో శిష్యుల్ని తయారుచేశాడు. దేవదాసి నృత్య కళాకారిణులను సంఘటితం చేసి వారి సంప్రదాయ నృత్యరీతుల్ని అధ్యయనం చేశాడు. నృత్య రీతులపై ఎన్నో పుస్తకాలు రాశారు. ఆంధ్ర నాట్య సంస్థ స్థాపించాడు. ఆంధ్రప్రదేశ్ నాటక సమాజానికి చైర్మన్‌గా ఉండేవాడు. నటరాజ, పద్మశ్రీ, భారతకళాప్రపూర్ణ, సవ్యసాచిలాంటి ఎన్నో అవార్డులు అందుకున్నాడు.

### రాజారెడ్డి రాధారెడ్డి :

ఆదిలాబాద్ జిల్లాకు చెందిన రాజారాధారెడ్డిల కుటుంబం నాట్యానికే అంకితమయింది. న్యూఢిల్లీలో "నృత్య తరంగిణి" అను పాఠశాలను స్థాపించి అనేక మంది నాట్య కళాకారులను తయారు చేశారు. రాజారెడ్డి ద్వితీయ సతీమణి కౌసల్యారెడ్డి, రాజారాధారెడ్డిల కుమార్తె యామినీరెడ్డి, కౌసల్యారెడ్డిల కుమార్తె భావనారెడ్డిలు కూడా కూచిపూడి నృత్యంలో ప్రసిద్ధులు. భారత ప్రభుత్వం రాజారాధారెడ్డిలను "పద్మభూషణ్" పురస్కారంతో గౌరవించింది.

హైదరాబాద్ నగర దేవిడీలలో కథక్ నర్తనాన్ని నవాబులు పోషించారు. దీనిని ఉత్తర భారత ఉస్తాద్‌లు చేసేవారు. వీరిలో చివరివాడు ఖాజాబక్షు. గోలకొండ పాదుషాలు దక్కనీ నృత్యరీతులను తెలుగు నర్తనరీతులను పోషించారు.

హైదరాబాదులోని అల్వాల వెంకటేశ్వర స్వామివారి గుడిలోని చివర నర్తకి శ్రీమతి వేంకటమ్మ. హైదరాబాదు చరిత్రలో భాగమతి, తారామతి, ప్రేమావతి ప్రసిద్ధులు.

## శిల్పకళ

శిల్పం అనగా చెక్కిన, పోతపోసిన ప్రతిమ. నల్లరాళ్ళతోను, పాలరాళ్ళతోను చేస్తారు. దేవతల విగ్రహాలను, రాజులు, రాణులు, గురువులు, జంతువులు, నాయకుల విగ్రహాలు శిల్పాలుగా చేస్తారు. హిందూ సంప్రదాయంలో విగ్రహారాధనకు అధిక ప్రాధాన్యం కనుక శిల్పాలకు ప్రాధాన్యత చేకూరింది. శిల్పులకు అనేక విద్యలు తెలిసి ఉంటాయి. అప్పుడు శిల్పంలో జీవకళ ఉట్టిపడుతుంది. స్తంభాలు, మండపాలు, జంతువులు, తీగలు, వృక్షాలు, పశుపక్ష్యాదులు, దేవతా మూర్తులు పాన్‌దాన్‌లపై వెండినగిషీలు, బంగారుపూతలు మొదలగునవి శిల్పాలలో మలుస్తారు.

ఆధునిక కాలంలో ఎందరో శిల్పులు పేరు పొందారు. ఈ మధ్యనే ప్రముఖ శిల్పి ఎక్కా యాదగిరిరావుకు పద్మశ్రీ లభించింది. నిజాం కాలంలో ఇక్కడ స్థాపించబడిన లలిత కళల కళాశాల నుండి ఎందరో శిల్పులు తయారైనారు. ఉస్మాన్ సిద్ధిఖీ శిల్పకళలో ఎంతో ఖ్యాతి గడించాడు. ప్రస్తుతం ఆధునిక శిల్పకళలో ఎం.వి.రమణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఎం.జి.రెడ్డి, రవీందర్‌రెడ్డి, ఆదిలాబాద్‌కు చెందిన రవీంద్రశర్మ మొదలగువారు ప్రసిద్ధులు.

కాకతీయ కళానస్థానం, రామప్పదేవాలయం, వేయిస్తంభాల గుడి, అనేక కోటలు మొదలగు వాటిల్లో అద్భుత 'శిల్పకళ' ఉంది. అలాగే డిచ్‌పల్లి రామాలయంలో నల్లరాతిపై చెక్కబడిన అద్భుతమైన శిల్పకళతో శిల్పాలు అలరారుతున్నాయి. పాలంపేట దేవాలయం, ఘనాపురం దేవాలయం, పిల్లలమర్రి ఎరుకేశ్వరస్వామి గుడి, ఆలేరు చేరువలో కొలనుపాకలోని సోమేశ్వరాలయం, పానగల్లులోని పచ్చల సోమేశ్వరాలయం, పూర్వ మహబూబ్‌నగర్‌లోని ఆలంపూర్ బాలబ్రహ్మేశ్వరాలయం, గంగాపురంలోని చెన్నకేశవాలయం, శ్రీరంగాపురంలోని రంగనాథ ఆలయం, పూర్వ కరీంనగర్ జిల్లాలోని వేములవాడలోని భీమేశ్వరాలయం, మంథనిలోని గౌతమేశ్వరాలయం అద్భుతమైన, అపురూపమైన, అందమైన శిల్పకళ కనబడుతుంది.

వేయిస్తంభాల గుడిని, రామప్పగుడిని, జాయపసేనుని నృత్తరత్నావళి ఆధారంగా నిర్మించారు.

### ఉపయుక్త గ్రంథాలు - వ్యాసాలు :


1) డా॥ బి. రామరాజు - జానపద గేయ వాఙ్మయం


2) డా॥ మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి - తెలుగువారి జానపద కళారూపాలు

3) రాష్ట్రస్థాయి జానపద కళోత్సవాలు - (ప్రత్యేక సంచిక) - ఫిబ్రవరి 24-2001.

జానపద గిరిజన విజ్ఞాన పీఠం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, వరంగల్.

4) 2వ ప్రపంచ తెలుగు మహాసభలు - 1981 - ప్రత్యేక సంచిక, ఏప్రిల్ 14-18 కౌలాలంపూర్, మలేషియా.


❀❀❀❀❀



# 18. వాగ్గేయకారులు

వాఙ్మాతురుచ్యతే గేయం - ధాతురిత్యభిధీయతే।

వాచం గేయంచ కురుతే - యః స వాగ్గేయకారకః॥

- సంగీత రత్నాకరంలో శార్ఙ్గదేవుడు

(సంగీత సాహిత్యాలను సమపాళ్ళలో కూర్చగలిగిన కవులే వాగ్గేయకారులు - అని సంగీత రత్నాకరంలో శార్ఙ్గదేవుడు సెలవిచ్చినాడు)

'మాతువు' అంటే మాట (సాహిత్యం); 'ధాతువు' అంటే సప్తస్వరబద్ధమైంది (సంగీతం).

వాగ్గేయకారుల్లో సింహగిరి వచనాలనందించిన కృష్ణమాచార్యులను తొలి వాగ్గేయకారులుగా భావిస్తారు. ఈయన పదమూడు పద్నాలుగు శతాబ్దాలకు చెందినకవి. పూర్వ మహబూబ్‌నగర్ జిల్లా సంతూరు గ్రామానికి చెందినవారు. మొదట శృంగార పురుషుడుగానూ తదనంతరకాలంలో భక్తి వైరాగ్య సంభరితమైన విష్ణు సంకీర్తన వచనాల నందించి, వచన సంప్రదాయానికి ఆద్యుడై సాహితీక్షేత్రంలో మైలురాయిగా నిలిచినాడు. తీయని గాత్రంతో భావగాంభీర్యాన్ని నింపుకొన్న కృష్ణమాచార్యుని సింహగిరి వచనాలు పాడుకోవడానికి అనువైన మాత్రాఛందస్సును కలిగి ఉండేవి. పాట, పదం, గీతం, కీర్తనలలో ఒదిగిపోయే ఛందోరీతికి అవి అతీతమైనవి. అందుకే సకల లక్షణ సమ్మతమైన పదకవితల నందించిన తాళ్ళపాక అన్నమాచార్యులు వాగ్గేయకారుల్లో తొలి తాంబూలమందుకున్నారు.

త్యాగరాజు, శ్యామశాస్త్రి, ముత్తుస్వామి దీక్షితులను సంగీతశాస్త్రం వాగ్గేయకార త్రయంగా పేర్కొన్నది. తెలంగాణ వాగ్గేయకారుల్లో అగ్రతాంబూలం కంచర్ల గోపన్నదే. నారాయణ తీర్థులు కూడా ఖమ్మంమెట్టు సమీపంలోని కూచిమంచి (కూసుమంచి)లో జన్మించినారన్న కథ ప్రచారంలో ఉన్నప్పటికీ బలమైన ఆధారాలు లేవు. భావి పరిశోధకులు నిగ్గు తేల్చేదాకా నారాయణ తీర్థులను తెలంగాణ వాస్తవ్యులనుకోలేం. పైగా ఆయన జీవితమంతా సంచార భరితం కావడం కూడా ఎక్కడివా? డనే ప్రశ్నకు సమాధానానికి మధ్య ఇనుపతెరలా అడ్డునిలుస్తున్నది. మొత్తం మీద కృష్ణమాచార్యుల తర్వాత, సంకీర్తన కవిత్వానికి సంకేతమైనిలిచిన 'రామదాస' నామాంతరం గలిగిన కంచర్ల గోపన్న తొలి తెలంగాణ వాగ్గేయకారుడు.

## కంచర్ల గోపన్న (భక్త రామదాసు)

నేలకొండపల్లి కరణం కంచర్ల లింగన్న, కామమ్మల నోము ఫలంగా గోపన్న 17వ శతాబ్ది ద్వితీయార్థంలో జన్మించినాడు. జన్మతః తెలివైనవాడు. వంశపారంపర్యంగా పాలనా మెళకువలు జీర్ణించుకున్న గోపన్న భద్రాచలం తహసీల్దారుగా నియమితుడై తండ్రిని మించిన తనయుడనిపించుకున్నాడు. ఆదర్శపాలనతో అటు గోల్కొండ నవాబుల మన్ననలను, ఇటు ప్రజల ఆదరాభిమానాలనూ చూరగొన్నాడు.

రఘునాథ భట్టాచార్యులతో పరిచయం గోపన్న జీవితాన్ని మలుపుతిప్పింది. భట్టాచార్యుల ప్రభావంతో వీరవైష్ణవుడుగా మారిన గోపన్నలో అపారమైన భక్తి భావనలు చోటుచేసుకున్నాయి. రసరమ్యమైన రామకథ, శ్రీరామచంద్రుని పరిపూర్ణ పురుషత్వం, రామపాలనలోని నిబద్ధత, రామనామంలోని మాధుర్యం గోపన్నను అందరికి మించిన రామభక్తుడ్ని చేసింది.

**'భండన భీము డార్తజన బాంధవు డుజ్జ్వల బాణతూణ కో**
**దండ కళాప్రచండ భుజ తాండవ కీర్తికి రామమూర్తికిన్**
**రెండవసాటి దైవమిక లేడనుచున్ గడగట్టి భేరికా**
**దాండ డదాండ దాండ నినదంబు లజాండము నిండమత్తవే**
**దండము నెక్కి చాటెదను దాశరథీ కరుణాపయోనిధీ!**

అని ఆ శ్రీరామచంద్రుని మించిన దైవం లేదన్న అపారభక్తిభావానికి అతని హృదయం ఆలవాలమైపోయింది. సరిగ్గా అప్పుడే భద్రాచల రామభద్రునికి సుందర మందిర నిర్మాణం గావించాలన్న కోరిక జనించింది. ఆ ఆలోచన వచ్చిందే తడవు, ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టినాడు. తనవద్ద ఉన్న ధనం అయిపోయిందిగానీ, నిర్మాణం పూర్తికాలేదు. ప్రజానురంజకుడైన ప్రభువు, మానుష రూపంలో విహరించిన దైవం. ఆ రామన్నకు ప్రజాధనంతోనే దేవాలయ నిర్మాణం పూర్తిగావించడం సబబనిపించింది. శిస్తుల రూపంలో వసూలైన ధనమంతా రామాలయానికి వినియోగించినాడు.

అప్పటి గోల్కొండ పాలకుడు అబ్దుల్లా కుతుబ్‌షా (1626–1672) కు ఆలస్యంగా విషయం తెలిసింది. ప్రభువుల అనుమతి లేకుండా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసినాడన్న అభియోగం మీద అతడ్ని బంధించి, నేర నిరూపణగావడంతో కఠినకారాగార శిక్ష విధించినాడు కుతుబ్‌షా.

ఈ శిక్షతో గోపన్నలో భక్తిభావాలు అంతరించకపోగా మరింత మిక్కుటమైనాయి. ఆవేదన భక్త్యావేశంగామారి, ఆర్ద్రతనల్లుకొని అద్భుతమైన కీర్తనల ఆవిర్భావానికి పాదుగా నిలిచింది. చక్కని, చిక్కని లయానుగుణమైన సంగీతబద్ధమైన సాహిత్యం సాక్షాత్కరించింది. కారాగారావాసం తనకు శిక్షకాదని, అది ఆ రామయ్య తండ్రికే పరీక్ష అని, భారమంతా ఆ భగవంతునిమీద వేసి, మనసు భద్రగిరివాసునికి, శరీరం కఠిన శిక్షకూ అంకితంచేసి... చివరకు భక్తి ఆయుధంగానే విజయం సాధించి, తానీషాచేత ప్రశంసలందుకొని, ప్రతి సంవత్సరమూ సీతారామకళ్యాణానికి గోలకొండ నుండి రాజు ముత్యాల తలంబ్రాలు సమర్పించే సంప్రదాయానికి తెరతీసినాడు.

ఇంతటి మహిమాన్విత జీవిత నేపథ్యం గలిగిన రామదాసు అంతకు మించిన సురుచిర భక్తి సంకీర్తనలందించి, సాహిత్య చరిత్రలో వాగ్గేయకారుడుగా నిలిచిపోయినాడు. ఆయన రచించిన అనేకానేక కీర్తనలు తెలుగు వాళ్ళందరి నాలుకల మీద నాట్యమాడినాయి. పండితులు, పామరులన్న తేడా లేకుండా ఆబాలగోపాలం ఆనందంతో గానం చేసుకొనే మధురభక్తి గీతాలై, ఈనాటికీ అలరిస్తున్నాయి. అర్థసుభగమైన భాష; అందమైన పదబంధాలు; మధురమైన భక్తి; లయాన్వితమైన అక్షరరమ్యత; శ్రవణపేయమైన కూర్పు రామదాసు కీర్తనల్లోని ప్రత్యేకతలు. ఇవే ఆ మహానుభావుడ్ని వాగ్గేయకారుడ్ని చేసి తెలుగు హృదయకేదారాలను పులకింపజేసినాయి. వేలాది కీర్తనల్లో 130 మాత్రం చివరికి మిగిలినాయి. అన్నీ ఆణిముత్యాలే, ఆ పాత మధుర రసగుళికలే. రాగతాళబద్ధాలైన రామదాసుకీర్తనల్లో మచ్చుకు కొన్ని...

- ఓ రామ నీ నామ మెంత రుచిరా...
- పలుకే బంగారమాయెనా? కోదండపాణి...
- ఏ తీరుగ నను దయజూచెదవో ఇనవంశోత్తమ రామా!
- నన్ను రక్షింపకున్న రక్షకులెవరయ్యా...
- నను బ్రోవుమని చెప్పవే... సీతమ్మ తల్లి...
- ఇక్ష్వాకు కులతిలక ఇకనైన పలుకవు రామచంద్రా...
- తక్కువేమి మనకు రాముండొక్కడుండు వరకు...

రామదాసు కీర్తనల్లో పాదసేవనం, శ్రవణం, కీర్తనం, స్మరణం, అర్చనం, వందనం, దాస్యం, సఖ్యం, ఆత్మనివేదనం అనే నవ విధ భక్తి మార్గాలు ప్రస్ఫుటిస్తాయి.

సాధారణంగా పదం అనే మాటతో ప్రారంభమై సంకీర్తనగా నిలిచిపోయింది పదసాహిత్యం. పదసాహిత్యానికి ప్రతీకగా భాసిల్లిన గోపకవీంద్రుడు నామ సంకీర్తనల ద్వారా 'రామదాసు' అనే శాశ్వత నాముడైనాడు.

## రాకమచర్ల వేంకటదాసు

రామదాసు తర్వాత వాగ్గేయకారుడుగా అంతటి కీర్తి నార్జించిన మహనీయుడు, కారణజన్ముడు రాకమచర్ల వేంకటదాసార్యులు. సామాన్యజనంలో ఆధ్యాత్మిక చింతనను జాగృతంచేసి వేలాది కీర్తనలు రచించి గానం చేసిన వేంకటదాసు వికారాబాద్ జిల్లా పూడూరు మండలంలోని పెద్ద ఉమ్మెంతల గ్రామంలో రాకమచర్ల పీఠాన్ని నెలకొల్పి భజన సంప్రదాయాన్ని సుసంపన్నం చేసిన మహాత్ముడు.

1808లో మహబూబ్‌నగర్ జిల్లా దేవరకొండ (ప్రస్తుతం నల్గొండ జిల్లాలోని) పెద్దాపురం గ్రామకరణం (మల్లయ్య) పురుషోత్తం భరద్వాజన గోత్రులు. విశిష్టాద్వైత సంప్రదాయానుయాయులైన ఆ పురుషోత్తం అనంతమ్మ దంపతులకు జన్మించిన వేంకటదాసు అసలు పేరు వెంకటయ్య. తండ్రి మరణానంతరం దురవస్థలపాలైన కుటుంబాన్ని తీసుకొని వికారాబాద్ జిల్లాలోని రాకమచర్ల సమీపంలోని ఉమ్మెంతల

గ్రామం చేరుకొని మొదట బడిపంతులుగా, తర్వాత భజన పంతులుగా జీవనం సాగించినాడు. ఒకానొక శుభ ముహూర్తాన రాకమచర్ల వద్దగల పర్వత గుహకు చేరుకొని వారం రోజులు యోగధ్యానమగ్నుడై కఠోరమైన తపస్సుచేసినాడు. అంతకుముందే రెండేండ్లుగా ఉపవాస దీక్షలతో, యోగనిష్ఠతో గడిపిన వేంకటయ్య ఆ తపస్సుతో గణనీయమైన పరిణతినందినాడు. ఆ తర్వాత పండరీపురం వెళ్తూ, మార్గమధ్యంలో నీలగిరిలో వీరప్పయ్య స్వాములను కలిసి దివ్యజ్ఞానాన్ని పొందినాడు.

ఆ తర్వాత రాకమచర్ల యోగనారసింహుని పరమభక్తుడై రాకమచర్ల వేంకటదాసుగా ప్రసిద్ధిగాంచినాడు. వేలకొలది కీర్తనలు ఆశువుగా చెబుతూ భజన సంప్రదాయాన్ని ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక, మహారాష్ట్రల్లో గూడా విస్తృత ప్రచారం పొందేటట్లు చేసినాడు.

అంతటి మహత్తర కీర్తనలవల్లనే వేంకటదాసు – రామదాసు, అన్నమయ్యల సరసన చేరగలంతటి వాగ్గేయకారుడైనాడు. ఆ మహనీయుని కీర్తనల నుండి కొన్ని ఉదాహరణలు.

| | |
|---|---|
| ★ గురుమహరాజ గురుమహరాజ పరబ్రహ్మ సద్గురు మహరాజ... | ఆటతాళం |
| ★ హరి ధ్యానంబే పరమపదం – స ద్గురుని భజించుటె సుఖతరము | ఆటతాళం |
| ★ నీకన్న ఘనులెవ్వరయ్యా – అట్ల గాకున్న నను బ్రోవవయ్యా | ఆటతాళం |
| ★ అయ్యేటిపని ఏమొకాని – రామ సయ్యాన నీదయరానీ | ఆదితాళం |
| ★ కృష్ణరావోయీ – నిను కోరినానోయీ..... | ఆటతాళం |
| ★ స్వామిరార శివలింగా – నా చక్కనయ్య శివలింగా | ఆదితాళం |
| ★ నీవైన దయజూడవమ్మా – లోక పావని ననుబ్రోవవమ్మా | ఆటతాళం |

ఈ విధంగా సరళ సుందరమైన పదాలతో సహజ సుందరమైన భావాలను స్వర ప్రపూర్ణంగా జగతికందించిన రాకమచర్ల వేంకటదాసు కీర్తనల్లో 'హరిభక్తి' గీతాలు ఎక్కువగా ఉన్నప్పటికీ, ఇతర దేవతలను కూడా మనసారా భజించి, అందరికీ సన్నిహితుడైనాడు. సంస్కృత సమాస భూయిష్టమైన రచనలతోపాటు ఛందోబద్ధమైన పద్యాలు, శ్లోకాలు కూడా వీరి ముఖతా వెలువడ్డాయి. మచ్చుకొక్కటి...

**మ॥ పరుడై, యీశ్వరుడై, మహామహిముడై, ప్రాదుర్భవస్థాన సం**
**హరణ క్రీడనుడై, త్రిశక్తియుతుడై, అంతర్గత జ్యోతియై**
**పరమేష్ఠి ప్రముఖామరాధిపులకున్, బ్రాపింపరాకుండ దు**
**స్తర మార్గంబున తేజరిల్లు హరికిన్ తత్వార్థినై మ్రొక్కెదన్**

## కైరం భూమదాసు :

పరమతస్థుల పాలనలో తెలుగు భాషా సంస్కృతులు ఉపేక్షకు గురి అవుతున్న కాలంలో తెలుగునేల నాలుగు చెఱుగుల ఆధ్యాత్మ చింతన వశులైన వాగ్గేయకారులుద్భవించి, భక్తిమార్గంతో ముక్తిసాధన గురించిన విస్తృత ప్రచారం గావించినారు. అటువంటి వారిలో జనులకు బాగా చేరువై జనరంజకమైన కీర్తనలు సృష్టించి పదసాహిత్యాన్ని వెలువరించిన వాగ్గేయకారులు కొందరే ఉన్నారు. ఆ కొందరిలో చేరినవారు కైరం భూమదాసు.

గౌడ కులంలో జన్మించి, కల్లుగీత వృత్తిని అవలంబిస్తూనే జీయరు స్వామి ద్వారా రామానుజమతం స్వీకరించి జీవితమంతా తన కీర్తనల ద్వారా, పదాల ద్వారా, మంగళ హారతుల ద్వారా, స్త్రీల పాటల ద్వారా, బతుకమ్మ పాటల ద్వారా జానపద కళల ద్వారా శ్రీ వైష్ణవ ప్రచార కార్యాన్ని నిర్విఘ్నంగా నెరవేర్చినాడు భూమదాసు. ఆయన జీవిత చరిత్ర చిత్రమైంది.

నిజాం పరిపాలనా కాలంలో 1876లో రాయికల్ (ప్రస్తుతం జగిత్యాల జిల్లాలో ఉన్నది) గ్రామంలో కైరం రాజయ్య లింగమ్మ దంపతులకు జన్మించిన భూమగౌడు తదనంతర కాలంలో రామానుజమతం పుచ్చుకొని భూమదాసుగా మారినాడు. చిన్నప్పుడు భూమదాసు ఏమీ చదువుకోలేదు. కులకాయికాన్నే చేసుకుంటూ బతికినాడు. మతంపుచ్చుకున్న తర్వాత కూడా ఆయన కుల వృత్తితోనే జీవించినాడు. కాని మంత్ర భాగాలను, గురుబోధనలను అర్థంచేసుకోవాలన్న

సంకల్పంతో వయోజనుడుగానే విద్యాభ్యాసం ప్రారంభించి చదువడం, రాయడం నేర్చుకున్నాడు. గీతపనితో పాటు వ్యవసాయం చేసేవాడు. పెద్దకుటుంబం కావడంతో ఇంటి ఆడవాళ్ళు కూడా కూలీనాలి చేసి సంసారం నెట్టుకొచ్చేవాళ్ళు. అయినా ఆయన ఔదార్యం, భక్తిభావం, మతదీక్ష అందరికీ ఆదర్శవంతుడుగా నిలుపడమేగాక అతను కారణజన్ముడన్న భావాన్ని జనంలో నాటుకునేటట్లు చేసింది. దీనికి తోడు మూలికావైద్యం, చిట్కా వైద్యంతోనూ ప్రజలకు ఉచితంగా సేవలందించడం అతని పరోపకార గుణాన్ని, మానవత్వాన్ని చాటిచెప్పేవి.

నిజాం పరిపాలన కాలం. అధికారభాష ఉర్దూ. తెలుగుకు గుర్తింపు, ఆదరణ తక్కువ. ఊరి పెత్తందార్ల అధికారదాహం, అజమాయిషీల కింద సామాన్యజనం నలిగిపోతున్న సమయం... పామరజనంలో ఆధ్యాత్మిక చింతనను మేలుకొల్పి, మంచివైపు మళ్ళించడానికి భక్తిగీతాలు రచించి పాడటం ప్రారంభించినాడు భూమదాసు.

ఆరుగురు సంతానం భూమదాసుకు. పిల్లల బాధ్యత కొంచెం తగ్గిన తర్వాత దేశపర్యటనకోసం బయలుదేరినాడు. రామానుజమతవ్యాప్తికి, విష్ణుభక్తి విస్తరణకు జీవితాన్ని అంకితంగావించినాడు. పండరీపురం, భద్రాచలం, బాసర, నింబగిరి, పానుగల్లు, మామిడ, దిమ్మదుర్తి, అరుగుల, అవుల్దాపూర్, ముప్కాల, జల్దారుపేట, ఇందూరు మొదలైన అనేక తీర్థ స్థలాలూ, గ్రామాలూ తిరిగినాడు. ఎక్కడికిపోయినా శిష్యులను చేర్చుకుంటూ, కవులను, సాహితీవేత్తలను కలిసి కొత్త విషయాలను నేర్చుకుంటూ వేల మైళ్ళు దిరిగినాడు. పదమూడేండ్లు దేశాంతరవాసం గావించినాడు.

అతి సాధారణ జీవితం గడుపుతూ అనంతుని ధ్యానంలో లీనమయిన భూమదాసు కలం, గళం ఆధ్యాత్మిక కృతులతో పరమపావనం అయినాయి. జనరంజకమైన ఈయన పదకవితలు కేవలం భగవంతుని భజించడానికి పరిమితంకాలేదు. కృష్ణ చెలియలు, ఆధ్యాత్మలు, తిర్నామములు, జానపదాలు, చాటువులు, శతకం, మంగళహారతులు, నిత్య తనయలు అనే ఎనిమిది రకాల రచనలుగావించినాడు. మొదట తన రచనలను పురుషోత్తమదాసు పేరుతో ప్రచారంలోనికి తెచ్చినా చివరకు భూమదాసు అనే పేరుతోనే కృతికర్తగా స్థిర, చిర కీర్తినార్జించినాడు. ప్రతి విభాగం నుండి ఉదాహరణలు...

| | | |
|---|---|---|
| కృష్ణ చెలియలు | : | పోనివ్వరా కిట్టయ్యా – నా దారిని<br>నాకివ్వరా కన్నయ్యా... |
| ఆధ్యాత్మలు | : | అడుగుదాటి కదలనివ్వనూ – నా<br>కభయ మివ్వకున్న విడువనూ... |
| తిర్నామములు | : | రామానుజ జియ్యంగారూ –<br>హరి రామసోదర్లూ... పల్కరూ... |
| జానపదాలు | : | అల్లో నేరదల్లో... అల్లో నేరెడల్లో...<br>అల్లల్లనేరేడి – అల్లనేరేడి –<br>అల్లోనేరేడల్లో<br>మిథిలాపురములో మేదినీశుండు... |
| చాటువులు | : | కం॥ అవనిన్ కడు పాతకుడీ<br>భువినేలన లక్ష్మరెడ్డి బూడిదయగు, నే<br>కవిగా వాని శపించితి<br>కవితిట్టును పాముకాటుకట్టి<br><br>కుదువురా! |
| రామశతకం | : | ఇది సీస పద్యాల్లో ఉన్నది. 'రాజరాజేంద్ర రావికల్ రామచంద్ర! అనేది మకుటం. |
| మంగళహారతులు | : | మురళీధరుడైన కృష్ణునిపై, రంగనాయకునిపై, నరసింహ స్వామిపై, జీయంగారిపై... మరెందరో మహనీయులపై అనేక మంగళ హారతులు రచించినారు. |
| నిత్య తనయలు | : | భూమదాసు అనుదినం చేసే పారాయణంలో భాగంగా భగవంతుని శరణుగోరుతూ పలికే మాటలు పాటలూ – కృతుల ఆకృతిని దాల్చినాయి. (ఇవి వచనాలు) |

వీళ్ళేగాక తెలంగాణలో ప్రతి యాభై కిలో మీటర్ల పరిధిలో రమారమిగా ఒక వాగ్గేయకారుడు కనిపిస్తాడు. ఒక్క మహబూబ్‌నగర్ (పాతజిల్లా)లోనే వందకుపైగా

వాగ్గేయకారులను వెలికితీసినారు డా॥ పి.భాస్కరయోగి. ఆలెక్కన చూస్తే ఎంత తక్కువనుకున్నా తెలంగాణలో వేయిమంది వాగ్గేయకారులైనా లభించవచ్చు. ఈ వ్యాసంలో సుప్రసిద్ధులైన ముగ్గురి గురించి ఉదాహరణప్రాయంగా పేర్కొనడమైంది. భావి పరిశోధకులు ఈ విషయంలో చొరవ చూపి ఉత్తమ ఫలితాలు సాధించగలరని ఆకాంక్షిస్తున్నాను.


ఆధార గ్రంథాలు : 1) బిరుదురాజు రామరాజు – ఆంధ్రయోగులు

2) ఆచార్య సినారె సంపాదకత్వం – తెలుగు వాగ్గేయకారులు

3) రాకమచర్ల (వేంకటదాసు) కీర్తనలు

4) వరకవి కైరం భూమదాసు కృతులు


## ఎందరో వాగ్గేయకారులు – అందరికీ వందనాలు...

### పూర్వపు రంగారెడ్డి జిల్లా :

1) పట్లోళ్ళ లింగారెడ్డి –
అంగడి చిట్టంపల్లి (వికారాబాద్) 1920

2) అనంతదాసు –
హరిదాసుపల్లి (వికారాబాద్) 1895

3) పరదేశి వీరప్పయ్య –
చిన్నగొట్టిగ (రంగారెడ్డి) 1884

4) అన్నమరాజు రామదాసు –
ఎల్వర్తి (రంగారెడ్డి) 1905

5) వంగరి వెంకట నరసింహాచార్యులు –
లాల్‌గడి మలక్‌పేట్ (మేడ్చల్) 1920

6) పులమిశెట్టి బుచ్చప్ప –
కౌకుంట్ల (రంగారెడ్డి) 1922

7) వెంకటదాసు –
కాసారం (రంగారెడ్డి) 1920

8) సద్గురు చిరసంజీవుడు –
టేకులపల్లి (వికారాబాద్) 1938

9) దొడ్ల రామదాసు –
అంతారం (రంగారెడ్డి) 1940

### పూర్వపు నిజామాబాద్ జిల్లా :

1) పనస హనుమద్దాసు –
రామేశ్వరపల్లి, భిక్కనూరు (నిజామాబాద్) 1905

2) మునిపంతులు –
ఆర్మూరు (నిజామాబాద్) 1920

3) రఘువీర దాసు –
ఆర్మూరు (నిజామాబాద్) 1925

4) రామోజు లక్ష్మణాచారి –
తాడ్వాయి (కామారెడ్డి) 1928

5) తెన్నెరంగ పొన్నరంగనాథాచార్యులు –
మాసానిపల్లి (కామారెడ్డి) 1930

6) గోశిక భూమయ్య –
దుర్కి (నిజామాబాద్) 1950

### పూర్వపు వరంగల్లు జిల్లా :

1) కొండపల్లి శేషగిరిరావు –
మహబూబాబాద్ (వరంగల్) 1924–2012

2) జెట్టి సీతారాములు –
ములుగు (జయశంకర్) భూపాలపల్లి 1940–2015

3) కడకంచి సత్తెమ్మ –
లింగాల ఘనపురం (జనగామ) 1950
(ఉయ్యాలపాటల సత్తెమ్మ)

4) పెండ్యాల బుచ్చి కృష్ణమదాసు –
వరంగల్లు

5) మరింగంటి లక్షణదేశికులు –
వరంగల్లు

**పూర్వపు ఆదిలాబాద్ జిల్లా :**

1) జక్కెపల్లి కృష్ణశాస్త్రి –
చెన్నూరు (మంచిర్యాల జిల్లా) 20వ శతాబ్దం

**పూర్వపు కరీంనగర్ జిల్లా :**

1) చాచం కిష్టయ్య –
ధర్మపురి (జగిత్యాల) 20వ శతాబ్దం

2) మామిడిపల్లి సాంబశివ శర్మ –
వేములవాడ (రాజన్న సిరిసిల్ల) 20వ శతాబ్దం

3) వొజ్జల సాంబయ్య –
వేములవాడ (రాజన్న సిరిసిల్ల) 20వ శతాబ్దం

4) చౌటి సాంబయ్య –
వేములవాడ (రాజన్న సిరిసిల్ల) 20వ శతాబ్దం

5) కేశన్నగారి రాజశర్మ –
వేములవాడ (రాజన్న సిరిసిల్ల) 20వ శతాబ్దం

6) నందగిరి అనంతరాజశర్మ –
వేములవాడ (రాజన్న సిరిసిల్ల) 20వ శతాబ్దం

7) గట్టు బాబుశాస్త్రి –
గుంజపడుగు (పెద్దపల్లి)

8) గట్టు ఉమాపతి –
మంథని (పెద్దపల్లి)

9) రావికంటి రామయ్య –
మంథని (పెద్దపల్లి)

**పూర్వపు నల్లగొండ జిల్లా :**

1) అప్పలదేశికులు –
నరసింహాపురం (సూర్యాపేట) 1730

2) నరసింహదేశికులు –
నరసింహాపురం (సూర్యాపేట) 1760

3) బేతవోలు అనంతాచార్యులు –
బేతవోలు (సూర్యాపేట) 1800

4) అలీసయ్యద్ –
దేవరకొండ (నల్గొండ) 1875

5) అంజనీదాసు –
ఆత్మకూరు (యాదాద్రి) 1898

6) చందాలకేశవదాసు –
హుజూర్‌నగర్ (సూర్యాపేట) 1876

7) అనంతాచార్యులు భట్టు –
మోత్కూరు (యాదాద్రి) 1913

8) రామోజు నరసింహాచారి –
మునుగోడు (నల్గొండ) 1925

9) తందు సాయన్నదాసు –
కాకుల కొండారం (నల్గొండ) 1928

10) కె. సుగుణ –
సూర్యాపేట (నల్గొండ) 20వ శతాబ్దం

11) పి. విజయలక్ష్మి –
సూర్యాపేట (నల్గొండ) 20వ శతాబ్దం

12) ఈగ బుచ్చిదాసు –
యాదగిరి గుట్ట (యాదాద్రి) 1930

13) జరిగల బుచ్చిదాసు –
చందుపట్ల (నల్గొండ) 1941

14) ముదుంబై పురుషోత్తమాచార్యులు –
నల్గొండ 1948

**పూర్వపు మహబూబ్‌నగర్ జిల్లా :**

1) గంద్రకోట కుమారస్వామి –
అలంపూర్ (జోగుళాంబ గద్వాల) 19వ శతాబ్దం

2) పల్లా నారాయణాధ్వరి –
కల్వకుర్తి (నాగర్ కర్నూల్) 20వ శతాబ్దం

3) మన్నెంకొండ హనుమద్దాసు –
కోటకదిర (మహబూబ్‌నగర్) 19వ శతాబ్దం

4) వేపూరు హనుమద్దాసు –
వేపూరు (నాగర్‌కర్నూల్) 20వ శతాబ్దం

5) కామసముద్రం అప్పలాచార్యులు –
గద్వాల (జోగుళాంబ గద్వాల) 18వ శతాబ్దం

6) సోలిపురం కృష్ణదాసు –
సోలిపురం (నాగర్ కర్నూల్) 20వ శతాబ్దం

7) పొన్నలూరి హనుమంతరావు –
ఆమనగల్ (నాగర్ కర్నూల్) 20వ శతాబ్దం

8) కొండదాసు –
మహబూబ్‌నగర్ (మహబూబ్‌నగర్) 20వ శతాబ్దం

9) రంగదాసు –
మహబూబ్‌నగర్ (మహబూబ్‌నగర్) 20వ శతాబ్దం

10) కృష్ణదాసు –
గోపాలపేట (వనపర్తి) 20వ శతాబ్దం

11) ధర్మాపురం కృష్ణదాసు –
ధర్మాపూర్ (మహబూబ్‌నగర్) 20వ శతాబ్దం

12) ఈకదాసు –
టంకర (మహబూబ్‌నగర్) 20వ శతాబ్దం

13) వెంకటదాసు –
మరికల్ (మహబూబ్‌నగర్) 20వ శతాబ్దం

14) వెల్లగొండ జ్ఞానదేవకవి –
వెల్లగొండ (నాగర్ కర్నూల్) 20వ శతాబ్దం

15) బోగ అంబయ్య –
పులిమామిడి (మహబూబ్‌నగర్) 20వ శతాబ్దం

16) చెన్నదాసు –
దాయపంతులపల్లి (మహబూబ్‌నగర్) 20వ శతాబ్దం

17) గౌనల్ల రాంరెడ్డి –
అత్తారెడ్డిపల్లి (మహబూబ్‌నగర్) 20వ శతాబ్దం

18) నల్లవెల్లి గంగన్న –
గార్లపహాడ్ (మహబూబ్‌నగర్) 20వ శతాబ్దం

**పూర్వపు ఖమ్మం జిల్లా :**

1) తూము లక్ష్మీనరసింహదాసు –
ఖమ్మం, 1790–1833

2) తూము లక్ష్మీనరసింహాచారి –
ఖమ్మం

**పూర్వపు మెదక్ జిల్లా :**

1) విఠాల రాజమౌళి శాస్త్రి –
సంగారెడ్డి, 1890

2) రుక్మాభట్ల విధుమౌళి శాస్త్రి –
గజ్వేల్ (సిద్ధిపేట) 1900

3) రుక్మాభట్ల నరసింహ శాస్త్రి –
గజ్వేల్ (సిద్ధిపేట) 1922

4) విఠాల చంద్రమౌళి శాస్త్రి –
సంగారెడ్డి, 1910

❀❀❀❀❀

# 19. తెలంగాణ పండుగలు

వివిధ కులమతాలవారు రకరకాల ఆచార సంప్రదాయాలతో పండుగలు జరుపుకుంటున్నారు. తరతరాల నుండి వస్తున్న పండుగలకు ఒక ప్రత్యేకత, పరమార్థం ఉంది. తెలంగాణలో జరుపుకొనే పండుగలలో సంస్కృతి, సంప్రదాయాలతోపాటు సామూహిక భాగస్వామ్యానికి ప్రాధాన్యత ఉంటుంది. కొన్ని పండుగలు పురాణేతిహాసాలకు సంబంధించినవైతే, మరికొన్ని స్థానిక అంశాలతో ముడిపడి ఉన్నాయి. ఈ పండుగలు తరతరాల నుండి నేటి వరకు వాటి ప్రత్యేకతను చాటుతున్నాయి. వాటిల్లో బోనాలు, బతుకమ్మ, బొడ్డెమ్మలు ముఖ్యమైనవి.

## బతుకమ్మ

చల్లగా నిండు నూరేళ్ళు బతుకు మన్న దీవెనకు ప్రతీక బతుకమ్మ. పూలవలె ఫలవంతమైన వికాసవంతమైన బతుకుకు ప్రతీక బతుకమ్మ. చిదిమేయడం కన్నా అందంగా బతుకునీయడంలోనే సంబురమున్నదన్న సందేశానికి ప్రతీక బతుకమ్మ. తెలంగాణ సంస్కృతీ సాంప్రదాయాలకు పెద్ద పీటవేసిన పండుగ బతుకమ్మ. తీరొక్క పూలతో గోపురంలా పేర్చి ఆడబిడ్డలంతా నెత్తిమీదపెట్టుకుంటే, ప్రభుత్వం రాష్ట్ర పండుగ గౌరవాన్నిచ్చి గుండెలో పెట్టుకున్నది. శిష్టులకు దూరంగా పెరిగి నిజాంపాలనలో అణిచివేయబడి, జమీందారీ వ్యవస్థలో అవమానింపబడి, పరాయి పాలనలో ఆదరణకు దూరమయిన బతుకమ్మను పల్లీయులు ప్రాణంగా సాదుకున్నరు. భద్రంగా తరువాత తరాలకు అందించారు. బతుకమ్మ ఇంటింటి ఆడబిడ్డ పూజలందుకుంటున్నది.

### ఆదివాసుల బతుకమ్మ :

వేల సంవత్సరాల పూర్వమే ఆదివాసుల నమ్మకాలలో పురుడు పోసుకొని, పూల శిరసుగల దేవతగా మలచబడ్డది బతుకమ్మ. బతుకుదెరువు చూపిన అమ్మగా కొలువబడింది. బతుకుదెరువు అనగా ప్రాణం / జీవనం కొనసాగడం అని అర్థం. బతుకుదెరువు ప్రసాదిస్తున్న అమ్మ అనీ, అమ్మల గన్నయమ్మ అనీ, మాతమ్మ అనీ, మహామాయీ అనీ, పెద్దమ్మ అనీ రకరకాలుగా పిలుస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆ మూలపుటమ్మను పది వేల సంవత్సరాల కిందటి కొత్తరాతి యుగం నుండే కొలుస్తూ వస్తున్నారు. ప్రాణం నిలువడానికి మనిషికి పూలు, పత్రి, పండ్లు, పాలు కావాలి కాబట్టి ఆ మహాతల్లిని వాటితోనే చిత్రించారు. కాల్చిన మట్టితో చేసిన ప్రతిమలు పెద్దపల్లి జిల్లాలోని నేలకొండపల్లి, నల్గొండ జిల్లాలోని ఏలేశ్వరం తదితర ప్రాంతాలలో లభించాయి. ఇవి ఈనాటి బతుకమ్మకు మూలరూపాలు. వీటిల్లో చాలా ప్రతిమలు క్రీ.పూ. 3వ శతాబ్దానికి చెందినవి. అనగా బతుకమ్మ ఆరాధన తెలంగాణాలో రాజ్యవ్యవస్థ ఏర్పడక ముందు నుంచే ఆచారంలో ఉన్నదని స్పష్టమవుతున్నది. శిరసు స్థానంలో పూవు కలిగిన బతుకమ్మ సంతానాన్ని ప్రసాదిస్తుంది. స్త్రీ పురుష అవయవాలను పోలి ఉండే గుమ్మడి పువ్వును బతుకమ్మ శిఖరంలో పెడతారు. గుమ్మడి పువ్వు వర్ణం (గౌరవర్ణం) పేరుతో బతుకమ్మను గౌరమ్మ అని పిలువనారంభించారు. గోదావరినది ఉత్తర జిల్లాలోని నివసిస్తున్న గోండులు పశువుల పేడను పేర్చి అందులో పసుపు రంగు పూలనే గుచ్చి పూజిస్తారు. పదేళ్ళ కిందట వెలుగు చూపిన క్రీ.పూ. ఒకటవ శతాబ్దినాటి ప్రాకృత శాసనంలో బ్రాహ్మలిపిలో "బతక తమ్మురో ఖచి (వి) బిరహ పథహ" అన్న అక్షరాలు కనిపిస్తాయి. దీనిని బట్టి బతుకమ్మ ఒకటవ శతాబ్ది నాటికే విస్తరించిందని తెలుస్తున్నది. ఇక్ష్వాకులు, విష్ణు కుండినులు, చాళుక్యులు, కాకతీయుల కాలంలో ఈ పండుగ మూలాలు కనిపిస్తాయి.

### బొడ్డెమ్మ బొడ్డెమ్మ కోల్ :

బతుకమ్మ మహాపండుగ, నెల్లాళ్ళు జరుపుకునేలా పండుగ. ఈ పండుగ భాద్రపద అమావాస్య అనగా పెత్రమాస నుండి మొదలవుతుంది. బతుకమ్మ పండుగ కన్నా ముందు బొడ్డెమ్మలు ఆడుతారు. ఎడ్లపొలాల అమావాస్య నుండి బొడ్డెమ్మలాడడం మొదలవుతుంది. తెలంగాణ వ్యవసాయాధారింత ప్రాంతం. వ్యవసాయానికి ఉపయోగపడే ప్రతీ దానినీ పూజనీయ భావంతో

చూస్తారు. వ్యవసాయంలో పొలాలను దున్నే ఎడ్లను బసవన్నలుగా పూజిస్తారు. ఎడ్లను అలంకరించి ఊరేగిస్తారు. ఊరేగింపు తరువాత సాయంకాలం ఆ ఎడ్ల పెండతో బొడ్డెమ్మలను చేస్తారు. గుండ్రంగా ఉబ్బెత్తుగా చేసే వాటికి పసుపుకుంకుమ బొట్లు పెట్టి, దానికి తొడిమ తెంపిన పూలను అద్దుతారు. వాటిని వాకిట్లో పెట్టి పెళ్ళికాని పిల్లలంతా చప్పట్లు కొడుతూ గుండ్రంగా తిరుగుతూ ఆడుతారు. కొంత మంది బొడ్డెమ్మను పుట్టమన్ను, ఎర్రమన్నుతో గద్దెలు తయారుచేసి గౌరమ్మను పెట్టి పూలతో పూజిస్తారు. కొన్ని ప్రదేశాలలో పూలనే ఊదు కుప్పలుగా పోసి ఆడుతారు. కొంత మంది భూమిలోనే చిన్న గుంట బావిలాగా తవ్వి చుట్టు పూలు దీపాలతో అలంకరించి ఆడుతారు. ఈ విధంగా ఒక్కొక్క ప్రాంతం వారు వారి వారి పూర్వ ఆచారాలకనుగుణంగా బొడ్డెమ్మలు తయారు చేసి ఆడి, పాడి, నీటిలోకి సాగునంపుతారు.

పెండ బొడ్డెమ్మలను ఆడి, పాడి, వాటిని గోడలకు కొడతారు. బొడ్డెమ్మ పిల్లల పండుగ. కొంతమంది భాద్రపద బహుళ అమావాస్య నుండి బొడ్డెమ్మలు చేస్తారు. ఇవి పుట్టమన్నుతో చేస్తారు. పీటబొడ్డెమ్మ, సల్లుడు బొడ్డెమ్మ, కుప్పల బొడ్డెమ్మ, పెండబొడ్డెమ్మలు ఎక్కువగా చేస్తారు. ఈ బొడ్డెమ్మలు ఏ ప్రాంత ఆచారాన్ని బట్టి ఆ ప్రాంతం వారు చేస్తారు. బొడ్డెమ్మ అనే పదానికి బొట్టె, పొట్టి, బొడ్డ అనే పర్యాయం పదాలున్నాయి. బొడ్డు అనగా నాభి, ప్రాణం అనే అర్థాలు వస్తాయి. తల్లికి, బిడ్డకు గల ప్రాణ బంధం బొడ్డు తాడు ద్వారానే ఉంటుంది. జీవి పుట్టుకకు మూలమైన ప్రాణాన్ని అనగా ఆహారం ఈ బొడ్డుతాడు ద్వారానే అందుతుంది. బొడ్డెమ్మ అనగా బొడ్డు గల అమ్మ. రేపటి పున:సృష్టికి ఆధారమయిన గర్భాశయం కలిగిన కన్నె పిల్ల అని అర్థం. అందుకే బొడ్డెమ్మ కన్నె పిల్లల పండుగ. బొడ్డెమ్మను ప్రతి రోజు నీటిలోకి సాగనంపరు. ప్రతిరోజు దానినే తాజా పూలతో అలంకరించి ఆడి, పాడి, నైవేద్యం పెడతారు. చివరి రోజు ఆ పూలు తీసివేసి బొడ్డెమ్మలను మాత్రమే నీటిలోకి సాగనంపుతారు. తొలిరోజు చేసే బతుకమ్మ కడుపులో బొడ్డెమ్మకు వాడిన పూలను వేసి పేరుస్తారు. కాబట్టి తొలి బతుకమ్మను ఎంగిలి పూల బతుకమ్మ అంటారు. బొడ్డెమ్మ ఆటలో ఈ క్రింది పాటలు పాడుకుంటారు.

- ♦ బొడ్డెమ్మ బొడ్డెమ్మ ఉయ్యాలో నీ బిడ్డ పేరేమి ఉయ్యాలో నా బిడ్డ నెలగౌరు ఉయ్యాలో నిచ్చమల్లె చెట్టేసి ఉయ్యాలో
- ♦ తంగెడు చెట్టు కింద కోలు లింగూ పుట్టింగే కోలు లింగు నీళ్ళు పోసి కోలు నీలంగి తొడిగి కోలు

బొడ్డెమ్మలు తీసివేసినాక ప్రతి రోజు అదే ముగ్గుపై వాకిట్లో పుంగిడి పూస్తారు. ఇద్దరమ్మాయిలు ఒకరి చేతులొకరు ఇంటు ఆకారంలో పట్టుకొని, ఇద్దరి కాళ్ళు ఒక దగ్గర పెట్టి గిర్రున, గుండ్రంగా తిరుగుతారు. ఆ పుంగిడి ఆటలో ఈ పాటలు పాడుతారు.

- ♦ పుంగిడి పూత – ఘర్ కోజాతా
- ♦ దాల్ దడి – పోచమ్మ గుడి
- ♦ గూట్లో రూపాయి – నీ మొగుడు సిపాయి

## బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో :

పెద్దల అమావాస్య లేదా పెత్రమాస నుండి బతుకమ్మ పండుగ ప్రారంభమవుతుంది. ఉదయమంతా తమ తాత, ముత్తాతల చనిపోయినవారికి నైవేద్యాలు పెడతారు. దీనినే పెద్దలకు పెట్టుడు అంటారు. భోజనాలు పూర్తయిన తరువాత బతుకమ్మ పేరుస్తారు. దీనిని ఎంగిలి పూల బతుకమ్మ అంటారు. తొమ్మిది రోజులూ, బతుకమ్మలను ఒక్కొక్క పేర్లతో పిలుస్తారు. ఎంగిలి పూల బతుకమ్మ, అటుకుల బతుకమ్మ, ముద్ద పప్పు బతుకమ్మ, నానబియ్యం బతుకమ్మ, అట్లబతుకమ్మ, అలిగిన బతుకమ్మ, వేపకాయల బతుకమ్మ, వెన్నముద్దల బతుకమ్మ, సద్దుల బతుకమ్మ, అట్ల బతుకమ్మ రోజు అందరూ అట్లనే నైవేద్యం పెడతారు. తెల్లటి చీరలు ధరించి బతుకమ్మ ఆడుతారు. చప్పట్లు చరుస్తూ బతుకమ్మ చుట్టూ కుడి నుండి ఎడమకు తిరుగుతారు. పాట ఒకరు చెబితే మిగితా వారందరూ దానిని అంటారు. చాలా రకాల పాటలు పాడుకుంటారు. వాటిలో కొన్ని ఇవి:

బతుకమ్మ పాటలలో అనేక సారస్వత విలువలు మిళితమై ఉంటాయి. సహజమైన గుబాళింపు ఉంటుంది. నిరక్షరాస్యులైన పల్లె స్త్రీలు స్వయంగా పాటగట్టుకుంటారు. కాబట్టి ఈ పాటలు వారి జీవితాలను ఆవిష్కరిస్తాయి. ఈ పాటల ద్వారా వారి వెతలను వెళ్ళబోసుకుంటారు. దీని వలన వారికి మానసిక స్వాంతన కలుగుతుంది. బాధకు కొంత ఊరడింపు లభిస్తుంది. ఒక్కరి దు:ఖం అందరిది అనిపిస్తుంది. ఈ పాటల్లో ఒక విధమైన ఊపు, మాధుర్యం ఉన్నాయి. భావం అందరికి అర్థం అయ్యేటట్లు ఉంటాయి. ఈ క్రింది పాటలు గమనించండి.

- ♦ తూరుపు వానలు ఉయ్యాలో
  తరిమి తరిమి కొట్టె ఉయ్యాలో

  దక్షిణం వానలు ఉయ్యాలో
  దంచి కొట్టినాయి ఉయ్యాలో

పడపటి వానలు ఉయ్యాలో
పారి కొట్టినాయి ఉయ్యాలో

ఉత్తరపు వానలు ఉయ్యాలో
ఉరిమి కొట్టినాయి ఉయ్యాలో

ఆ వాన ఈ వాన ఉయ్యాలో
కట్ట మునగ వచ్చె ఉయ్యాలో

గొర్ల మంద నిస్త ఉయ్యాలో
కట్ట నిలపు మైసమ్మ ఉయ్యాలో

♦ పేదరికమును జూసి ఉయ్యాలో
ప్రీతి తప్పకు తల్లి ఉయ్యాలో

ఇరుగు పొరుగిండ్లకూ ఉయ్యాలో
తిరగ బోవద్దమ్మ ఉయ్యాలో

తన సక్కదనమునూ ఉయ్యాలో
దాసుకొని తిరగాలె ఉయ్యాలో

చేసిన పనులందు ఉయ్యాలో
చిత్తంబు నిలపాలె ఉయ్యాలో

♦ ఇద్దరక్క చెల్లెండ్లు ఉయ్యాలో
ఒక్కూరి కిచ్చి ఉయ్యాలో

ఒక్కడే మాయన్న ఉయ్యాలో
వచ్చైనా పోడు ఉయ్యాలో

ఎటస్తు చెల్లెలా ఉయ్యాలో
ఏరడ్డా మాయె ఉయ్యాలో

ఏరుకూ ఎంపల్లి ఉయ్యాలో
తోటడ్డామాయె ఉయ్యాలో

పెత్తరామాసం నుండి తొమ్మిది రోజుల పాటు బతుకమ్మ ఆడుతారు. ఒక వెడల్పాటి పళ్ళెం లేదా తాంబాలం లేదా తబుకు తీసుకొని వాటిపై ప్లెస్ ఆకారంలో దారాలు పెడతారు. దానిపై గుమ్మడాకులు పరుస్తారు. వాటిపై తంగేడు, గునుగు, కట్ల, బంతి, గుమ్మడి ఇట్లా అనేక పూలతో కట్టలు కట్టలుగా గుండ్రంగా పేర్చుతారు. పూర్తయిన తరువాత క్రింద వేసిన దారాలు కదలకుండా కడతారు. తమలపాకులో కాని చిక్కుడాకులో కాని గౌరమ్మను పెడతారు. తోడుబతుకమ్మను కూడా చేస్తారు. పేర్చిన బతుకమ్మలను అలికి ముగ్గేసిన వాకిట్లో, పెట్టి ఆడుతారు. తరువాత ఊరి ఆనవాయితీ ప్రకారం అన్ని బతుకమ్మలు పెట్టి, అందరు స్త్రీలు కూడి చుట్టూ తిరుగుతూ, చప్పట్లు చరుస్తూ పాటలు పాడుతారు. తరువాత నీటిలోకి సాగనంపుతారు. గౌరమ్మను ఓలలాడిస్తారు. పసుపుకుంకుమలు, వాయినాలు ఇచ్చుకుంటారు. ప్రసాదాలు పంచుకొని తింటారు.

## తొమ్మిది రోజుల విశిష్టత :

మహాలయ అమావాస్య మొదలు మహార్నవమి వరకు సాగే బతుకమ్మ ఉత్సవం తెలంగాణ సాంస్కృతిక సౌరభాలను వెదజల్లుతుంది. ప్రాణశక్తి, ప్రాణధాత్రి, ప్రాణేశ్వరీ అనే ఆదిశక్తి నామాలకు ప్రతిబింబం బతుకమ్మ తొమ్మిది రోజుల పాటు జరిగే బతుకమ్మ వేడుక పూర్ణత్వానికి సంకేతం. తొమ్మిది నెలల నిండు గర్భానికి చిహ్నం అండం, శుక్రకణం కలయిక మొదలు ప్రాణంరూపుదిద్దుకొని సంపూర్ణ మానవ రూపం దాల్చడానికి తొమ్మిది నెలల కాలం పడుతుంది. ఆ తొమ్మిది నెలలకు చిహ్నంగా ప్రకృతి ఫలదీకరణకు తొమ్మిది రోజుల పండుగ జరుపుకుంటారు. ఆ తొమ్మిది రోజులు నవ విధ భక్తి మార్గాలు పాటింపబడతాయి. అహింస, నిగ్రహం, భూతదయ, క్షమ, శాంతి, ధ్యానం, సత్యం, ప్రేమ, మనసు అనే నవ విధ పుష్పాలకు ఈ తొమ్మిది రోజులు ప్రతీక. అందుకే తొమ్మిది రకాల పుష్పాలు తొమ్మిది వరుసలు పేరుస్తారు. ఈ విధంగా బతుకమ్మ ప్రకృతిలోనే ఆవిర్భవించి, ప్రకృతిలోనే పూజింపబడి, ప్రకృతి జలంలో సమ్మిళితం కావడం జగన్మాత సృష్టి, స్థితి, లయాత్మక తత్వాలకు సంకేతం. ఇచ్ఛాశక్తి, క్రియాశక్తి, జ్ఞానశక్తుల సమ్మేళనమే బతుకమ్మ.

## భూమి, నీరు, సఫలత :

గుడి, గోపురాలలో ప్రతిష్ఠించిన శిష్టదేవతల కంటె భిన్నమైన లక్షణాలుండి గ్రామీణుల పూజలందుకుంటున్న గ్రామదేవతలే జానపదుల దేవుండ్లు. పురామానవుడు రూప కల్పన చేసుకున్న మాతృదేవతలే గ్రామదేవతలుగా పరిణామం చెందినయి. స్త్రీ పరంగా ప్రకృతిని ఆరాధించే తత్వమే బతుకమ్మ పండుగలో కనిపిస్తుంది. మాతృదేవతారాధనలో మూడు అంశాలు ప్రధానంగా కనిపిస్తాయి. అవి భూమి, నీరు, తల్లి సఫలతలు, ఈ మూడింటితో బతుకమ్మ పండుగ ముడిపడి ఉంది.

బొడ్డెమ్మ పండుగ మట్టి అనగా భూమిని పూజించే పండుగ. ఏ భూమి అయితే తమ మనుగడకు ఆధారమో ఆ మట్టికి తెలిపే కృతజ్ఞత బొడ్డెమ్మ. పుట్టిన నాటి నుండి గిట్టేవరకు ప్రతి క్రియకు భూమే ఆధారం. గిట్టిన తరువాత కూడా మట్టిలోనే కలిసేది. అటువంటి మట్టి గౌరవర్థం బొడ్డెమ్మ పండుగ

జరుపుకుంటారు. బొడ్డెమ్మది బతుకమ్మది బొడ్డుతాడు బంధం. తొమ్మిది రోజుల బతుకమ్మ పండుగ తొమ్మిది నెలల గర్భం పెరుగుదలకు చిహ్నం. బతుకమ్మను పూలతో పేర్చడంలోనూ అదే రహస్యం దాగి ఉంది. పూలలో ఫలదీకరణ జరిగి గింజ,కాయ, పండు తయారయి ఆహారోత్పత్తికి దోహదం చేస్తాయి. పూలు సఫలతకు సంకేతాలు. అందుకే బతుకమ్మ పూల పండుగ, పూలను గర్భాకారంలో పేర్చి ఆడి, పాడి సఫలతకై నీటిలోకి సాగనంపుతారు. ఏ జీవి అయినా పుట్టుకకు ఫలదీకరణ అవసరం. తరువాత పుట్టిన జీవి మనుగడకు భూమి, నీరు, అవసరం. అందుకే బతుకమ్మ పండుగ భూమి, నీరు, సఫలత నేపథ్యంగా సాగుతుంది.

## బతుకమ్మ, ప్రకృతివాదం :

బతుకమ్మ పూర్తి పండుగ వాతావరణం ప్రకృతిని పూజించే విధానం కనిపిస్తుంది. ప్రకృతిలో ఎక్కువ సమయం గడిపే పండుగ ఇది. ప్రకృతిలో గడపడం. ప్రకృతిని చూడడం ఎంతో ఆనందాన్నిస్తుంది. పారేఏరు, పర్వతాలు, చెట్లుచేమలు, సూర్యోదయం, సూర్యాస్తమయం ఇవన్ని మనిషిని ఆకర్షింపజేస్తాయి. ప్రకృతిలో గడిపినపుడు మనిషి అంతర్ముఖుడౌతాడు. తన గురించి తాను ఆలోచిస్తాడు. తన పుట్టుక, గిట్టుట, మధ్య జీవితంలోని తత్వం గురించి ప్రశ్నించుకుంటాడు. ప్రకృతికి, తనకుగల సంబంధం గురించి తర్కించుకుంటాడు. ప్రకృతిమాత్రమే సత్యమనీ, నిత్యమనీ భావించుకుంటాడు. దీనినే ప్రకృతివాదులు బలపరిచారు.

జే.జే. రూసో, ఆగస్టుకాంప్టే, పెస్టోలజీ, హెర్బర్ట్ స్పెన్సర్ మొదలగు తత్వవేత్తలు ప్రకృతివాదాన్ని ప్రచారంలోకి తెచ్చారు. ప్రాచీన తత్వశాస్త్రాలలో ప్రకృతివాదం విశిష్ట స్థానాన్ని పొందింది. ఇది ప్రాచీన భారతదేశంలోనూ, ప్రాచీన గ్రీసులోనూ ప్రారంభమైంది. 4వ శతాబ్దపు చార్వక సిద్ధాంతం ప్రకృతివాదమే. ప్రకృతివాదులు ప్రకృతికే ప్రాముఖ్యం ఇచ్చారు. ప్రకృతే యథార్థం. ప్రకృతిని మించి ఏమిలేదు. సర్వం ప్రకృతిమయం. ప్రకృతికి మించిన జ్ఞానం మరొకటి లేదు. సమాజంలో విలువలు ఎప్పటికప్పుడు మన అవసరాలకు అనుగుణంగా మారుతూ ఉంటాయి. అనేవి ప్రకృతివాదం ప్రధాన సూత్రాలు బాహ్య ప్రకృతిని అనుసరించి మనిషి అంత:ప్రకృతి అభివృద్ధి చెందుతుంది.

బతుకమ్మ పండుగ సందర్భంగా పూల కొరకు పల్లీయులు ప్రకృతిలోకి వెళతారు. బతుకమ్మ ఆట, పాట అంతా ప్రకృతిలోనే జరుగుతుంది. బతుకమ్మను సాగనంపడం కూడా ప్రకృతిలోనే సాగుతుంది. పల్లె ప్రజల జీవనం ఎక్కువగా ప్రకృతిపై ఆధారపడి ఉంటుంది. బతుకమ్మ పండుగ నెల్లాళ్ళు ప్రకృతితో మానవునికి సంబంధం ఏర్పడుతుంది. ప్రకృతి గురించి ఆలోచించడం, ప్రకృతిని అనుసరించడం, ప్రకృతిని పరిరక్షించాలనే భావనరావడం జరుగుతుంది. ప్రకృతిపట్ల ఆరాధనాభావం పెరుగుతుంది.

## స్త్రీల పండుగ :

ప్రకృతి జీవి మనుగడకు ఆధారం. అలాగే జీవి పుట్టుకకు స్త్రీ, గర్భం రెండు ఆధారం. అందుకే స్త్రీని 'బతుకమ్మా'! అంటూ సంబోధించినట్టుగా ఉంటుంది పండుగ పేరు. ఈ పండుగ పేరులోనే స్త్రీలు బతకాలి అనే ఆకాంక్ష, అవేదన కనిపిస్తాయి. అనాదిగా అనేక రూపాలుగా పురుషాధిక్యత సమాజంలో స్త్రీలు బలవుతూనే ఉన్నారు. బలుల రూపంలో, అత్యాచార రూపంలో అరాచకాల రూపంలో ఎందరో స్త్రీలు ఆత్మార్పణగావించుకున్నారు. స్త్రీలు లేని లోకంలో సమాజ సమతుల్యత దెబ్బతింటుంది. రేపటి తరం నిర్మాణం జరుగదు. అందుకే స్త్రీలు బతకాలి అన్న నిర్వచనాన్ని చెబుతుంది ఈ పండుగ. అందుకే స్త్రీల ప్రాముఖ్యత ఈ పండుగలో ఎక్కువగా కనిపిస్తుంది. వారి ఆవేదనను, ఆకాంక్షలను పాటలల్లో గట్టుకొని, పాడుకుంటారు. ఈ పాటలలోని మనోభావాల విచిత్రంగా ఉంటాయి. స్త్రీ మానసిక చిత్రణ కనిపిస్తుంది. పసుపు, బొట్లు, కాటుక, తలనిండాపూలు, చేతినిండా గాజులు, మెడలో నల్లపూసలు, ఒంటినిండా నగలు, కాలిమట్టెలు, గజ్జెలు, పట్టుచీరలు, ముత్తైదువతనము, ఇంటి నిండా సిరిసంపద, పాడి, ధాన్యము, తన వెంటే నడిచే మొగడు, కడుపునిండా సంతానం, తల్లిగారింటి ఆదరణ, అత్తింటి గౌరవం, కోరుకుంటారు. పాటల ద్వారా వాటిని వ్యక్తపరుస్తారు. నేటి కాలంలో స్త్రీలు దేనినైనా సాధించగలుగుతున్నారు. దాని ద్వారా తమ ఆత్మాభిమానాన్ని సంతృప్తి పరుచుకుంటారు. కాని నాటి కాలంలో స్త్రీలకు స్వాతంత్ర్యం ఉండేది కాదు. బతుకమ్మ పండుగ ద్వారా వారి మనసులోని ఆవేదనలు, కోరికలు, కష్టసుఖాలు వెల్లబోసుకుంటారు. ఆట, పాట ద్వారా ఆనందపడతారు.

## బతుకమ్మ పాటలు విజ్ఞాన సర్వస్వాలు :

బతుకమ్మ సాహిత్యంలో తెలంగాణ సంస్కృతి దాగి ఉన్నది. గ్రామీణ మహిళలు తమ అనుభవాలు, ఆలోచనలు, కష్టసుఖాలు పాటలుగా గట్టుకున్నారు. అన్నదమ్ముల అనుబంధాలు, తల్లిగారింటి మమకారం, అత్తింటి బాంధవ్యాలు, కుటుంబ ఆచారాలు, పెండ్లిల్లు, వ్యవసాయ పనులు, వృత్తి

పనులు, గ్రామ దేవతల కథలు, పురాణకథలు, పతివ్రతల పాటలు, చారిత్రాత్మక సన్నివేశాలు, స్త్రీల త్యాగాలు, రజాకర్ల నెదిరించిన పాటలు, భూస్వాముల నెదిరించిన పాటలు, తెలంగాణ ఉద్యమ సంఘటనలు పాటలలో కనిపిస్తాయి. బతుకమ్మ పాటలు అల్లడంలో మానసిక ఉల్లాసం, భౌతిక వికాసం, తాత్విక దృక్పథం, సౌందర్య దృష్టి, సృజనాత్మకత అలవడుతుంది.

బతుకమ్మ పండుగ తెలంగాణకు పెద్ద పండుగ. నెల్లాళ్ళపాటు కుటుంబం అంతా కలిసి సమాజంతో కలిసి జరుపుకునే పండుగ. ఈ పండుగ ద్వారా ఆత్మీయత అనుబంధాలు పటిష్టమౌతాయి. సమాజంలో ఏకత్వభావన వెల్లివిరుస్తుంది. తెలంగాణ ఉద్యమం కాలంలో అస్తిత్వ, సాంస్కృతిక ప్రతీకగా నిలిచింది బతుకమ్మ. పోరాటానికి స్త్రీల ప్రాతినిధ్యాన్ని పంచింది. బతుకమ్మ ఆత్మగౌరవ పతాకమైంది. స్వతంత్ర్య తెలంగాణాలో రాష్ట్రపండుగ విరాజిల్లుతున్నది.

## బోనాలు

తెలంగాణ రాష్ట్రమంతటా ఘనంగా జరుపుకొనే పండుగల్లో ఎంతో ప్రాముఖ్యత కలిగినది "బోనాల పండుగ". ఇది ప్రత్యేకంగా గ్రామదేవతలను పూజించే పండుగ. రాష్ట్రమంతటా ఈ పండుగ జరుపుతున్నప్పటికీ హైదరాబాదు, సికింద్రాబాదులలో చాలా విశేషంగా, ఘనంగా జరుపుతారు. సికింద్రాబాదులో జరిగే బోనాల పండుగను "లష్కరు బోనాలు" అని కూడా అంటారు.

ఈ పండుగను ఆషాఢమాసంలో ప్రారంభించి శ్రావణ మాసం చివరి దాకా అనగా వర్షాకాలంలో జరుపుకుంటారు. వర్షాలు బాగా కురవాలనీ, పాడిపంటలు బాగా అభివృద్ధి చెందాలనీ ప్రజలంతా ఎట్లాంటి అనారోగ్యాల బారిన పడకుండా ఉండాలనీ, అమ్మవారినీ, గ్రామదేవతలను కోరుకుంటూ జరుపుకొనే పండుగ ఇది.

ఆషాఢమాసంలో దేవి తన పుట్టింటికి పోతుందని నమ్మకం. అందుకే భక్తులు ఈ సమయంలో దేవిని దర్శించుకొని తమ కూతురు తమ ఇంటికి వచ్చిందనే భావనతోపాటు, భక్తి శ్రద్ధలతో ప్రేమానురాగాలతో "బోనాలను" నైవేద్యంగా అర్పిస్తారు. వస్త్రాలను, కానుకలను, ఒడిబియ్యాన్ని కూడ సమర్పిస్తారు. ఈ తంతును "ఊరడి" అంటారు. ఈ "ఊరడి" తర్వాత బోనాలుగా మారింది.

బోనాల పండుగ వస్తుందంటే వారం రోజుల ముందు నుండి కోలాహలం మొదలవుతుంది. అమ్మవార్ల గుళ్ళను, గ్రామదేవతల గుళ్ళను శుభ్రపరిచి సున్నంవేసి రంగులతో అలంకరిస్తారు. గుడి పరిసరాలు కూడ శుభ్రంచేసి భక్తుల రద్దీని తట్టుకునేందుకు అనువుగా సిద్ధం చేస్తారు. పండుగనాడు గుళ్ళను రంగురంగుల పూలతో, విద్యుద్దీపాలతో దేదీప్యమానంగా అలంకరిస్తారు.

పండుగనాడు గుడిలో అమ్మవారి విగ్రహం ముందు, బియ్యంపిండిలో పసుపు కలిపి సంప్రదాయ పద్ధతిలో, నిష్ఠతో 'పటం' వేస్తారు. ఈ పటం ముందు అఖండదీపం వెలిగించి భక్తులు తెచ్చిన నైవేద్యాన్ని అక్కడ రాశిగ పోస్తారు.

పండుగ రోజున ఇంటిని శుభ్రపరిచి ఇల్లు అలికి, సాన్పి చల్లి, తీనెలు తీసి చక్కటి ముగ్గులుపెట్టి, బంతిపూల మాలలతో, మామిడి, వేప తోరణాలతో అలంకరిస్తారు. స్త్రీలు పట్టుచీరలు కట్టుకొని, ముఖానికి, కాళ్లకు పసుపు రాసుకొని, చేతుల నిండా పచ్చటి గాజులు వేసుకొని, గదువకు గంధం పూసుకొని, తలనిండా పూలు, నొసటినిండుగా కుంకుమ బొట్టు పెట్టుకొని అమ్మవారి ప్రతి రూపాలుగా అలంకరించుకుంటారు.

'బోనం' అంటే భోజనం. కుండ అనే మరో అర్థం కూడ ఉన్నది. ఇదే దేవికి సమర్పించే నైవేద్యం. కొత్త మట్టి కుండకు పసుపు రాసి కుంకుమ బొట్లు పెట్టి వేపాకులను జడగా అల్లి కుండకు కడుతారు. పూలమాల కూడ కడుతారు. ఆ కుండలో పసుపు కలిపి వండిన అన్నంతో పాటు పాలు, పెరుగు, బెల్లం, అల్లం, పచ్చిపులుసు, ఆకుకూర మొదలగు వంటకాలను నైవేద్యంగా పెట్టుకొని దానిపై మరో చిన్న కుండను పెడుతారు. దానిని కూడా అలంకరించి దానిలో నీళ్లు పోసి అందులో కొంచెం బెల్లం, పెరుగు వేస్తారు. దీనినే 'సాక' అంటారు. ఈ చిన్న కుండపై మట్టి కంచుడు ఉంచి అందులో నూనె పోసి గండదీపం వెలిగిస్తారు. డప్పులతో, పోతరాజు ఆటలతో, మంగళహారతులతో ఊరేగింపుగా గుడికి పోతారు.

పండుగ మరునాడు పూనకం వచ్చిన శివసత్తులు చేతిలో వేపమండలు పట్టుకొని జుట్టు విరబోసుకొని బోర్లించిన పచ్చి మట్టికుండపై నిలబడి భవిష్యవాణి చెప్తారు. ఈ తంతును 'రంగమెక్కుడు' అంటారు. రంగంలో చెప్పినవన్నీ తప్పక జరుగుతాయని ప్రజలు విశ్వసిస్తారు. భవిష్యవాణిలో ప్రధానంగ వాతావరణ పరిస్థితులు, పంటలు, ప్రజల మధ్య అశాంతికి కారణాలు చెప్తారు. ఇందులో 'పోతరాజు' ప్రత్యేక ఆకర్షణగా

నిలుస్తాడు. ఒంటినిండా పసుపురాసుకొని, నొసట పెద్దగ ఎర్రని కుంకుమబొట్టు పెట్టుకొని, జుట్టు విరబోసుకొని, నడుముకు ఎర్రటి వస్త్రం కట్టుకొంటాడు. కాళ్లకు గజ్జెలుకట్టుకొని డప్పు చప్పుళ్ళకు లయబద్ధంగ, నృత్యం చేస్తూ ఒక చేతిలో సప్కు (కొరడ) పట్టుకొని 'గావు' పడుతాడు. పూనకం వచ్చిన మహిళ మహంకాళి అంశ రౌద్రాన్ని ప్రదర్శిస్తుంది. ఆమెను శాంత పరచుటకు ఆమె పాదాలను నీళ్ళతో కడుగుతారు. తమ భక్తికి చిహ్నంగ భక్తులు రంగురంగుల కాగితపు "తొట్టెల"లను గుడికి కట్టి మొక్కులు తీర్చుకుంటారు.

ఈ పండుగ వెనుక శాస్త్రీయ కోణం కూడ దాగి ఉన్నది. పూర్వకాలంలో వర్షాకాలం వచ్చిందంటే కలరా, మశూచి వంటి అంటువ్యాధులు వ్యాపించేవి. వైద్య సౌకర్యాలు అంతగా లేని ఆ రోజుల్లో ప్రజలు ఈ వ్యాధుల బారినపడి గ్రామాలు తుడిచిపెట్టుకు పొయ్యేవి. అందువల్ల గ్రామప్రజలు తమను రక్షించే గ్రామదేవతలను (మైసమ్మ, ఎల్లమ్మ, పోచమ్మ, మాంకాళమ్మ, ముత్యాలమ్మ మొదలగు) వివిధ రూపాలలో పూజించేవాళ్ళు. అమ్మవారికి సమర్పించే నైవేద్యం 'పసుపు అన్నం'లో రోగ నిరోధక శక్తి ఉంటుంది. దానిని ప్రసాదంగా ఇంటిల్లిపాదీ తింటారు. ఈ సంప్రదాయం ఈనాటికీ పాటిస్తూనే ఉన్నారు.

ఈ పండుగ ఆషాఢ మాసం మొదటి ఆదివారం హైదరాబాదు నగరంలోని గోల్కొండ కోటలో ఉన్న 'ఎల్లమ్మ', 'మహంకాళి' ఆలయం వద్ద మొదలవుతుంది. సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహంకాళి ఆలయంలో లష్కర్ బోనాలుగా సాగుతూ, బల్కంపేటలోని రేణుకాఎల్లమ్మ దేవాలయం నుండి పాత బస్తిలో చార్మినార్‌లో ఉన్న భాగ్యలక్ష్మి గుడిలోని బోనాలతో ముగుస్తుంది. ఇట్లా ప్రతి ఆదివారం ఒక్కొక్కచోట జరుపుతారు.

కొన్ని జిల్లాలలో, కొన్ని ప్రాంతాలలో ఈ పండుగను శ్రావణమాసంలో కూడ జరుపుతారు. ఈ పండుగకు తమ ఇంటి ఆడబిడ్డలను, చుట్టాలను పిలుచుకుంటారు. రకరకాల పిండి వంటలు చేసుకొని ఆనందంగ గడుపుతారు.

బోనాల పండుగ జరుపుకున్నప్పుడు ఒక వాడ / ప్రాంతంలోని వాళ్ళంతా కలిసి అమ్మవారి దగ్గరికి ఊరేగింపుగా వెళ్ళడం, కలిసి జరుపుకోవడం పండుగలోని గొప్పదనం. అట్లాగే బంధువులను, చుట్టుపక్కల వాళ్ళను స్నేహితులను పిలిచి జరుపుకోవడం దీని ప్రత్యేకత.

## హోళి

తెలంగాణలో జరుపబడుతున్న విశిష్టమైన పండుగల్లో హోళి ఒకటి. ఫాల్గుణ మాసం పౌర్ణమి రోజు కామ దహనం చేస్తారు. దీనిని 'కాముని పున్నమ' అని కూడా అంటారు. ఈ కామదహన సందర్భంగా 'కాముడు కాముడు వలలో.. కందూలెయ్యండీ వలలో.. భీముడు భీముడు వలలో.. బియ్యామెయ్యండి వలలో..' అంటూ ఈ పాట ఎంతో ప్రసిద్ధమైనది. 'రంగురంగు దండ– రూపాయి బిళ్ళ, బిళ్ళకాదురా' అంటూ పిల్లలు కోలలు కొడుతూ పాడే జాజిరి పాటలు తెలంగాణ ప్రత్యేకం.

కులమత భేదాలు లేకుండా ఒకరిపైనొకరు రంగులు చల్లుకుంటూ సామూహికంగా సంబురాలు జరుపుకుంటారు. దీనిని 'వసంతోత్సవం'గా జరుపుకోవడం చరిత్రలో కనిపిస్తున్నది.

## పీరీల పండుగ

తెలంగాణ జరిపే విశిష్టమైన పండుగలలో పీర్ల పండుగ ఒకటి. మత సామరస్యానికి ప్రతీకగా ఈ పండుగను అన్ని మతాల వారు కలిసి జరుపుకుంటారు. ఈ సందర్భంగా మసీదులలో పీరీలను నిలిపి ఆరాధించి నిమజ్జనం చేస్తారు. ఈ సందర్భంగా రాత్రివేళలో గ్రామీణ ప్రజలు ఒక గుండాన్ని తవ్వి, ఆ గుండం మధ్యలో మంటపెట్టి చుట్టూ వలయాకారంగా నృతం చేస్తూ ఆడే 'ఆలువా' తెలంగాణకు ప్రత్యేకం. ఈ సందర్భంగా పాటలు జనరంజకంగా ఉంటాయి. దట్టీలు కట్టడం, కుడకల పీర్లు కట్టడం వంటి విశిష్టతలు కనిపిస్తాయి. పీరీల ఊరేగింపు అద్భుతంగా ఉంటుంది.

పై పండుగలతోపాటు తెలంగాణలో అనేక రకాల పండుగలను జరుపుకుంటాము. ప్రత్యేకంగా సదర్ పండుగ, పొలాల అమావాస్య, మిరగ్, సారోజ్, తీజ్ పండుగలను జరుపుకుంటారు. వీటన్నింటితోపాటు ఉగాది, వినాయకచవితి, దసరా, దీపావళి, సంక్రాంతి, మహాశివరాత్రి, హోళి మొదలగు పండుగలతోపాటు ఆయా కులాల, మతాలకు సంబంధించిన పండుగలను అందరూ కలసిమెలసి జరుపుకుంటారు.

❀❀❀❀❀

# 20. మన ఆటలు

భాషలు, ఆటలు, పండుగలు ఇలా ప్రతీ విషయంలో తెలంగాణ రాష్ట్రానికి వైవిధ్యమైన గుభాళింపు కనిపిస్తుంది. మన సంస్కృతి సంప్రదాయాల పరంగా మన తెలంగాణ గొప్పగా ఉండటానికి ప్రాచీన ఆటలు ఎంతగానో దోహదం చేస్తాయి.

కాలం అనేక మార్పులను తీసుకు వస్తుంది. ఆ మార్పులకు అనుగుణంగా మన జీవన విధానాల్లో కూడా మార్పులు వస్తుంటాయి. ఆధునిక ధోరణులకు అలవాటుపడుతున్న నేటి సమాజం అనాదిగా వస్తున్న ప్రాచీన ఆటలను మరచిపోతున్నారు. మన తెలంగాణలోని ఆటలు పిల్లల్లో శారీరక, మానసిక వికాసానికి తోడ్పడతాయి. ఆనాటి జీవన పరిస్థితులకు అద్దంపడుతూ. ఒకరికొకరు సహకరించుకొని ఐక్యతను పెంచేవిగా ఉంటాయి.

స్నేహాలను పెంచి, మరచిపోలేని బాల్యపు జ్ఞాపకాలను మన సంప్రదాయక ఆటలను నేటి తరానికి అందించాల్సిన బాధ్యత మనందరిది. మన తెలంగాణ యాసను, హక్కును చేర్చుకున్నట్లు మన ఆటలను పిల్లలకు పరిచయం చేద్దాం. పల్లెల్లో, పట్టణాల్లో ఈ ఆటలకు జీవం పోద్దాం.

### దస్తీ ఆట :

పిల్లలు గుండ్రంగా కూర్చొని వారి రెండు అరచేతులను వెనుకకు పెట్టి కళ్ళు మూసుకొని కూర్చొని ఉంటారు. ఒక పిల్లవాడు ఒక చిన్న చేతి దస్తీ పట్టుకొని కూర్చున్న వారి వెనుక ప్రతి ఒక్కరి వద్ద వంగుతూ అందులో ఒకరి వెనుక గుడ్డను పెట్టేసి పరుగెత్తుతాడు. అప్పుడు అందరూ కళ్ళు తెరిచి తమ వెనుక వైపు చూసుకుంటారు. ఎవరు వెనుక దస్తీ ఉంటే వారు దాన్ని తీసుకొని దస్తీ వేసిన పిల్లాడి వెంట పరుగెత్తుతూ దస్తీతో కొడుతుంటాడు. పరుగెత్తే పిల్లవాడు తన వెనుక వస్తున్న పిల్లవాడు లేచిన స్థలంలోకి వెళ్ళి కూర్చోవాలి. మళ్ళీ నిలబడిన పిల్లవాడు కూర్చున్న వారి చుట్టు తిరుగుతూ ఈ దస్తీ వేయాలి. ఇలా సాగుతుంది ఆట.

### వామనగుంతలు :

ఇది ఎక్కువగా ఆడపిల్లలు ఆడే ఆట. వరుసగా ఆరు చిన్న గుంతలు, వాటికి సమాంతరంగా ఆరు గుంతలుంటాయి. నాలుగు చింత గింజలను చేతిలోకి తీసుకొని వాటిని పైకి ఎగురవేసి అవి కింద పడే లోపున అరచేతిని తిరిగేసి వాటిని పట్టుకోవాలి. ఎన్ని పట్టుకోగలిగితే అన్నింటిని ఆ గుంతలో పెట్టాలి. అలా కొన్నిసార్లు ఆడిన తర్వాత ఏ గుంతలో నాలుగు పిక్కలు చేరుతాయో వాటిని గెలుచుకున్నట్లు.

### వెన్నె కుప్పలు (పిల్ల కుప్పలు) :

ఇది చిన్న ఆట. ఈ ఆటలను ఆడపిల్లలు, మగపిల్లలు కలిసి ఆడుతారు. ఒక పిల్లవాడు ఒకచోట కళ్ళు మూసుకొని 1 నుండి 100 అంకెల వరకు లెక్క పెడుతుంటాడు. ఇంత లోపల మిగతా పిల్లలు తలో దిక్కు వెళ్ళి మట్టితో వెన్నెల నీడలో చిన్న కుప్పలు పెట్టాలి. తరవాత కళ్ళు మూసుకున్న పిల్లవాడు కళ్ళు తెరచి మిగతా పిల్లలు పెట్టిన కుప్పలను చెరిపివేయాలి. అలా చెరపలేకపోయిన కుప్పలను లెక్కపెట్టుకొని వాటిని తాము గెలిచిన పాయింట్లుగా లెక్కించుకుంటారు.

### బొంగరాలాట :

ఈ ఆటను పెద్ద పిల్లలే ఎక్కువగా ఆడుతుంటారు. బొంగరానికి మొనదేలిన మొల (మేకు) ఉంటుంది. శంఖాకారంలో ఉండే ఈ కర్ర బొంగరం కింది భాగాన ఉండే చిన్న మొల దగ్గర నుండి ఒక సన్నని తాడు చుట్టాలి. దాన్ని చేతిలో గట్టిగా పట్టుకొని బలంగా విసిరి నేలపైకి వేస్తే అది మొల ఆధారంగా వేగంగా నేలపై తిరుగుతూ ఉంటుంది.

## నేల బండ :

ఈ ఆటను బాలబాలికలు ఆడుతారు. ఒకరిని దొంగగా నిర్ణయిస్తారు. ఈ ఆట ఆడే ప్రదేశంలో నేల, బండ ఉండాలి. ముందుగా దొంగను నేల కావాలో, బండ కావాలో కోరుకొమ్మంటారు. దొంగ బండ కావాలి అని అంటే మిగతా వారంతా నేలపైన నిలబడాలి. ఒకవేళ మనం బండపైన నిలబడితే దొంగ వచ్చి పట్టుకుంటే వారు ఔట్ అయినట్టే. తర్వాత ఔట్ అయిన పిల్లవాడు ఈ ఆటను ఆడాల్సి ఉంటుంది.

## చిర్రగోనె (బిల్లంగోడి, గోటిబిళ్ళ, గిల్లిదండా) :

గ్రామీణ ప్రాంతాల్లో బాగా ఆదరణ ఉన్న ఆట ఇది. కానీ ఇప్పుడు అంతగా కనిపించడం లేదు. క్రికెట్ ఆటకు ఇదే మూలం అని చెపుతారు. కర్రతో తయారుచేసిన జానెడు కర్రముక్కను 'సిర్ర' అని, ఒకటిన్నర రెండు మూరల పొడవున్న కర్రను 'గోనె' అని అంటారు. దీన్ని గుంచి (బొంద) తవ్వి ఆడుతారు. అదే మాదిరిగా సిర్రను గోనెతో కొట్టి అది పైకి లేచినంక గోనెతో మళ్ళీ కొడతారు. అది గాలిలో ఎగిరి కొంత దూరంలో పడుతుంది. అది పడ్డ దూరం నుండి ఒంటి కాలుతో కుంటుకుంటూ వృత్తం లేదా గుంచి దగ్గరకు చేరుకోవాలి.

## కచ్చకాయలు (గచ్చకాయలాట) :

ఇది పూర్తిగా ఆడపిల్లలు ఆడే ఆట. దీని కోసం గచ్చకాయల చెట్టు ఉంటుంది. దాని కాయలు ఎండిన తర్వాత వాటిని సేకరించి ఆడుతారు లేదా నునుపుగా గుండ్రంగా ఉండే 5 చిన్నరాళ్ళను తీసుకొని వాటితో ఈ ఆట ఆడతారు. ఈ రాళ్ళనే కచ్చకాయలు అంటారు.

## కోతికొమ్మచ్చి :

చెట్టు కింద గుండ్రంగా గీత గీసి మధ్యలో ఒకరు నిలబడాలి. మరొకరు కట్టెను విసిరేసి చెట్టుపైకి ఎక్కాలి. అతను ఎక్కే లోపు విసిరేసిన కట్టెను మొదటి పిల్లవాడు తీసుకువచ్చి వృత్తంలో ఉంచాలి. ఆ కర్రకు కర్రకు కాపలాగా ఉంటూ అటూఇటూ తిరగాలి. చెట్టుపైన ఉన్నవారు దూకి కర్రను పట్టుకోవాలి. కర్రను పట్టుకోకముందే దొరికితే వారు ఔటు అయినట్లు. ఇప్పుడు ఔటు అయిన వారు కర్రను కాపలా ఉండాలి.

## రాజు, రాణి, మంత్రి, దొంగ :

దీన్ని చిట్టీలాట అని కూడా అంటారు. ఆడే వారి సంఖ్యను బట్టి చిట్టీల మీద పేర్లు రాసి చుడతారు. ఆ తర్వాత వాటిని గుప్పిట్లో పట్టుకొని నేలపైన వేస్తారు. అందులోంచి రాజు అన్న పేరు ఉన్న చిట్టి ఎవరికి వస్తుందో వారు దొంగను గుర్తించాలి.

## కుంటుడాట :

గుండ్రంగా వృత్తాన్ని గీసి ఈ ఆట ఆడతారు. ఒక కాలి మీద కుంటుతూ మిగిలిన వారిని పట్టుకోవడానికి ప్రయత్నిస్తుంటారు. వారిలో ఎవరినైనా ముట్టుకుంటే (పట్టుకుంటే) వారు కుంటుకుంటూ ఎవరినైనా పట్టుకోవాలి.

## గోలీలాట :

ఈ ఆటను కొంచెం పెద్ద పిల్లలు ఎక్కువగా ఆడుతారు. గోలీలను కుప్పలుగా పోసి దేన్ని కొట్టాలో ఒక పిల్లవాడు చెబుతారు. కొట్టే పిల్లవాడు ఒక నిర్ణీత దూరం నుండి గోలితో కొట్టాలి. మొదటి పిల్లవాడు చూపిన గోలిని కొడితే అతను గెలిచినట్లు. ఇలా ఈ గోలీలాటను 'గుంచి' తవ్వుకొని, బేంద గీసుకొని రకరకాలుగా ఆడుతారు.

## పచ్చీసు :

ఇది పూర్వం నుండి వస్తున్న ఆట. దీన్ని నేలపై గీసి గాని, ప్రత్యేకంగా దారంతో అల్లి గాని, గడుల రూపంలో తయారు చేస్తారు. ఇందులో ఏడు గవ్వలు, నాలుగు రకాల కాయలు ఉంటాయి. దీన్ని నలుగురు ఆడవచ్చు. గవ్వలను ఊపి నేలపై వేస్తారు. అలా వేసినపుడు పడే విధానాన్ని బట్టి పచ్చీస్, తీన్, ఎక్కీస్ ఇలా అంకెలు నిర్ణయించి గడుల్లో కాయలు జరుపుతుంటారు. గడుల మధ్యలో ఇల్లు ఉంటుంది. ముందుగా ఎవరి కాయలు ఇంట్లోకి చేరుతాయో వారే విజేతలు.

## చెడుగుడు (కబడ్డీ) :

ఇది అప్పటి, ఇప్పటి తరంలో గుర్తింపు పొందిన ఆట. ఈ ఆట కోసం ప్రత్యేకంగా కోర్టు గీసి రెండు జట్లు ఆడతాయి. ప్రతి జట్టులో ఏడుగురు సభ్యులు ఉంటారు.

## కాసెపుల్ల ఆట :

దీనిని ఇద్దరు కలిసి ఆడుతారు. ఇసుక ఉన్న చోట ఎక్కువగా ఆడటానికి వీలుగా ఉంటుంది. ఇసుకను నిలువుగా చిన్న కట్టలాగా పోసుకుంటారు. ఇద్దరిలో ఒకరు చిన్న కట్టెపుల్లను తీసుకొని ఇసుకలో దాస్తారు. రెండోవారు పుల్ల ఎక్కడుందో గుర్తించి రెండు చేతుల్లో కప్పుతారు. అలా పుల్ల ఎవరికైతే దొరకదో వారు దొంగ. అప్పుడు వారి చేతిలో ఇసుకపోసి అందులో పుల్ల ఉంచి, వారు కళ్ళు మూసి కొంత దూరం తీసుకెళ్ళి ఇసుక కుప్ప పోస్తారు. తిరిగి మొదటి ప్రాంతానికి వచ్చి వారిని వదిలేస్తారు. ఎక్కడ ఇసుక కుప్ప పోశారో గుర్తించాలి. ఇలా ఎంతసేపైనా ఆడుకోవచ్చు.

## తొక్కుడు బిళ్ళ :

ఈ ఆటను ఒంటరిగా లేదా జట్టుగా ఆడవచ్చు. పక్కపక్కనే నాలుగు నిలువు గళ్ళు, రెండు అడ్డ గళ్ళు గల దీర్ఘచతురస్రాకార గడులను గీయాలి. ఆడేవారు గడుల బయట నిలుచోవాలి. ముందుగా ఒకరు చేతిలో బిళ్ళను ముందు గడిలో వేసి కుంటికాలుతో బిళ్ళను చిమ్ముతూ (జరుపుతూ) మిగతా గడులను దాటించి బయటకు తీసుకురావాలి. ఆడుతున్నప్పుడు కాలు గాని, బిళ్ళ గాని గడుల గీతలు తాకరాదు. గడులన్నీ అయిపోయాక కాలివేళ్ళ మధ్య బిళ్ళను బిగించి పట్టుకొని దాన్ని కుంటికాలుతో ఎనిమిది గడులను గెంతి రావాలి. తరవాత కాలి మీద, తల మీద, అరచేతిలో, మోచేతి పైన, భుజం పైన పెట్టుకొని అన్ని గడులను దాటాలి. ఇవ్వన్నీ దాటిన వారే గెలిచినట్టు.

## నాలుగు స్తంభాలాట (గుడ్లాట) :

ఈ ఆటలో ఐదుగురు పిల్లలుంటారు. నలుగురు నాలుగు వైపుల చతురస్రాకారంలో నిలబడాలి. వీరిలో ఒకరు దొంగగా ఉంటారు. దొంగ మధ్యలో నిలబడతారు. నాలుగు వైపుల ఉన్న మిగతావారు ఒకరి స్థానాన్ని ఒకరు మారుస్తూ ఉండాలి. ఇలా మారే క్రమంలో ఎవరైతే దొంగకు దొరుకుతారో వారు తదుపరి దొంగవుతారు. తిరిగి వారు ఇలాగే ఆడాల్సి ఉంటుంది.

## చిత్తు బొత్తు :

ఇది ఇద్దరు కలిసి ఆడే ఆట. చేతిలో నాణెం తీసుకొని (బొమ్మ బొరుసు) ఊపాలి. ఎదుటివారిని నీకు చిత్తు కావాలా, బొత్తు కావాలా అడగాలి. అడిగి నేలపై వేసి చేతితో మూసి ఉంచాలి. ఒకవేళ వారు కోరుకున్నదే వెళితే వారు గెలిచినట్టు.

## లగోరి (బుర్ర, వరంపీట్) :

ఈ ఆటలో రెండు జట్లు ఉంటాయి. ఎంతమందైనా ఆడవచ్చు. మధ్యలో గుండ్రంగా వృత్తం గీసి అందులో నాలుగు లేదా ఐదు రాళ్ళు ఉంచుతారు. ఒక జట్టువారు రబ్బర్ బంతి తీసుకొని రాళ్ళను గురి చూసి కొట్టాలి. రాళ్ళు కిందపడి ఎదుటి జట్టువారు బంతిని పట్టుకుంటే ఇతర జట్టువారు అవుటైనట్టు. అలా కాకుండా బంతి దూరంగా వెళితే, ఆ బంతిని తెచ్చేలోపు పడిపోయిన రాళ్ళను పేర్చాలి. రాళ్ళు పేర్చే క్రమంలో ప్రత్యర్థి జట్టు బంతిని తీసుకొని రాళ్ళు పేర్చే జట్టులోని వ్యక్తులను గురి చూసి కొడతారు. ఇవతలి జట్టువారు ఆ బంతిని తప్పించుకుంటూ రాళ్ళను పేర్చి లగోరి అని అరవాలి.

## పులి జూదం ఆట (మదురంగం) :

ఇది ఇద్దరు ఆడే ఆట. చదరంగం, పచ్చీసులాగా గళ్ళను గీసుకొని చింతగింజలతో లేదా రాళ్ళతో ఆడే ఆట. ఇందులో పులి గొర్లను మింగకుండా జాగ్రత్తగా గడులతో ఆడతారు.

## దాడుగుమూతలు (డీబ్‌దయి) :

మొదటి పిల్లలంతా చప్పట్లు వేసి మిగిలిన ఒకరితో 'దయి' ఆడిస్తారు. ఆ పిల్లవాడు బయటకు వెళ్ళి అంకెలు లెక్కించేసరికి మిగతా పిల్లలంతా దాక్కోవాలి. బయటి నుండి వచ్చిన పిల్లవాడు అందరిని వెతుకుతూ 'డీబ్' అంటూ అవుట్ చేయాలి. అందరూ అవుట్ అయ్యాక మొదట ఎవరైతే అవుట్ అయ్యారో వారు 'దయి' ఆడాల్సి ఉంటుంది.

## ఖో... ఖో... :

ఈ ఆటను రెండు జట్లలో ఆడతారు. ప్రతి జట్టులో 12 మంది ఉంటారు. అందులో తొమ్మిది మంది మాత్రమే రంగంలో ఉంటారు. ఈ రెండు జట్లలో ఒక జట్టువారు కూర్చుంటారు. మరోజట్టువారు పరుగెత్తుతారు. కూర్చున్నవారు పరుగెత్తే వారిని అవుట్ చేయాలి. దీనికో నిర్ణీత సమయం ఉంటుంది. ఆ సమయంలోపు ఏ జట్టు వారిని తొందరగా అవుట్ చేస్తారో వారు గెలిచినట్టు.

## మరిగళ్ళాట :

ఈ ఆటను వర్షాకాలంలో బాలురు ఆడే ఆట. పొడువాటి రెండు కర్రలకు (బొంగు) ఒక మూర ఎత్తులో ఒక చిన్న కర్రను అడ్డంగా కడతారు. వాటిపై నిలబడి కర్రలను పట్టుకొని బురదలో తిరుగుతారు. వారి కాళ్ళకు బురద అంటకుండా వారు అటూ ఇటూ తిరగడం ఈ ఆట ప్రత్యేకత.

## జడకొప్పులాట :

ఊరి మధ్యలో ఒక మండపం వేస్తారు. మండపంలో పైన జడబల్ల చెక్కతో తయారుచేసి, దానికి 12 రంధ్రాలు చేసి ఒక్కో రంధ్రంలో ఒక్కో పట్టుతాడు కడతారు. 12 మంది కోలలు పట్టుకొని, పట్టుతాడును నడుముకు కట్టుకొని లయబద్ధంగా పాటలు పాడుతూ జడను అల్లుతారు. ఐదు రోజుల పాటు ఒక్కొక్క రోజు ఒక్కో రకమైన జడను అల్లుతారు.

## గుయ్యేపుంజా :

ఇది రెండు జట్లలో ఆడతారు. మొదటి జట్టువారు కనబడకుండా దాక్కొని, అందులోంచి ఒకరిపైన ముసుగు వేసుకువచ్చి రెండో జట్టు ముందుకు తీసుకువస్తారు. వారి ముందు 'గుయ్యేపుంజా' అంటూ సూచిస్తారు. ఆ శబ్దం ఆధారంగా రెండవ జట్టువారు ఆ ముసుగు మనిషిని గుర్తిస్తే ఆ వ్యక్తి ఆ జట్టులో కలుస్తారు. గుర్తించకపోతే తన జట్టులోకే వెళ్ళిపోతారు. ఇలా రెండు జట్లవారు ఆడతారు. చివరకు ఏ జట్టులోనైతే ఎవరు మిగలరో వారు ఓడినట్లు.

## పిట్టగూళ్ళాట :

ఈ ఆటను అమ్మాయిలు, అబ్బాయిలు ఆడుతారు. పచ్చి ఇసుకలో కాల్లు/ చెయ్యి దానిపైన ఇసుకపోసి మెత్తుకుంటూ గూడులాగా తయారు చేసుకొని మెల్లగా కాలు/ చెయ్యి తియ్యాలి. అప్పుడు చక్కని గూడులాగా తయారైతుంది.

## రాయిది రంగం :

వర్షాలు పడి భూమి మెత్తగా మారినపుడు, కర్రతో గాని, గజంతో గాని ఈ ఆటను ఆడుతారు. ఈ ఆటను ఇద్దరు గాని, రెండు జట్లలో గాని ఆడుతారు. ఒకరు గజం / కర్ర భూమిలో దింపుతూ వెళతారు. ఎంత దూరం వరకైతే దింపుతూ వెళతారో అంత దూరం నుండి ఎదుటివారు / మరో జట్టువారు కుంటుకుంటూ ఆట మొదలుపెట్టిన ప్రదేశానికి రావాలి.

ఈ విధంగా ఎన్నో రకాలైన ఆటలు మనకున్నాయి. వీటిల్లో కొన్ని ఆటలు గ్రామాల్లో ఇంకా కనిపిస్తూ ఉండడం నిజంగా గొప్ప విషయం. ఆధునిక కాలంలో కూడా వాటిని ప్రజలు మర్చిపోలేదు. అంటే ఆ ఆటలు మన జీవనంలో భాగమైపోవడమే. అవి మన సంస్కృతికి ప్రతీకలు.

❀❀❀❀❀



# 21. మన వంటలు

"ఆరోగ్యమే మహాభాగ్యం" అన్న ఆర్యోక్తి మనందరికీ తెలిసిందే. మనిషి ఆరోగ్యానికి పుష్టికరమైన ఆహారం తినడం ఎంతో అవసరం. క్రమబద్ధం కాని ఆహారం ఆరోగ్యానికి బదులు అనారోగ్యాన్ని కలిగిస్తుంది. ఆరోగ్యంగా ఉండటానికి మిశ్రమ ఆహారం చాలా ముఖ్యం. తాను తినే ఆహారంలో అన్ని రకాలైన ఆహార పదార్థాలు బియ్యం, జొన్నలు, సజ్జలు గోధుమలు, పప్పు ధాన్యాలు, కాయగూరలు, ఆకుకూరలు, మాంసాహారం, పళ్ళు మొదలయినవన్నీ సమయాన్ని పాటిస్తూ తినేదే మిశ్రమ ఆహారం. తెలంగాణా వంటలలో ఈ మిశ్రమ ఆహారం కనబడుతుంది. ఈ వ్యాసంలో తెలంగాణాలో ప్రసిద్ధమైన కొన్ని వంటకాల గురించి తెలుసుకుందాం.

### పిండివంటలు

### జొన్నలు - వంటల రకాలు

జొన్నలతో అనేక రకాలయిన వంటలు తయారుచేస్తారు. జొన్నలు తినడం వల్ల మధుమేహం నియంత్రణలో ఉంటుంది.

**జొన్న రొట్టెలు**

జొన్న పిండిని వేడి నీళ్ళతో కలిపి ఈ రొట్టెలను తయారుచేస్తారు. ఈ రొట్టెలను పప్పు లేదా ఎల్లిపాయకారంతో తింటే ఎంతో రుచిగా ఉంటాయి.

**జొన్న గట్క**

జొన్న గట్కను కొన్ని ప్రాంతాలలో 'సంకటి అంటారు. జొన్న రవ్వను అన్నంలాగా గంటె జారుడుగా ఉడుకబెట్టి ఏదైనా కూరతో లేదా తొక్కుతో కలుపుకొని తింటారు. దీనిని మధుమేహ బాధితులు మధ్యాహ్న భోజనంలో, రాత్రి భోజనంలో తింటారు. సులభంగా జీర్ణం అవుతుంది.

**జొన్న అంబలి**

జొన్న పిండిలో నీరు పోసి పలుచగా జావలాగా ఉడికించేదే అంబలి. ఈ అంబలి దాహాన్ని తీరుస్తుంది. వేసవి కాలంలో అంబలిని సేవించడం వల్ల శరీరానికి చలువ చేస్తుందని పెద్దలు చెపుతుంటారు.

**జొన్న రవ్వ ఉప్మా**

జొన్నలు రవ్వలా చేసుకోవాలి. ఈ రవ్వను వేయించుకోవాలి. ఆ రవ్వతో ఉప్మా చేసుకోవాలి. ఈ ఉప్మాను ఏదైనా తొక్కుతో తింటే చాలా రుచిగా ఉంటుంది.

### మొక్క జొన్న - వంటల రకాలు

మొక్క జొన్నలలో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. కాబట్టి అది పెద్ద పేగుకు సంబంధించిన వ్యాధులను నివారిస్తుంది.

**మొక్క జొన్న రొట్టెలు**

మక్క పిండిలో చిటికెడు ఉప్పువేసి వేడినీటితో కలిపి ఆ పిండిని చిన్న చిన్న ముద్దలుగా చేసి రొట్టెలలాగా వత్తుకుని పెనం మీద కాల్చేదే మక్క రొట్టె. ఈ రొట్టెలు చాలా రుచిగా ఉంటాయి.

**మక్క గారెలు**

మొక్క జొన్న గింజలు, పచ్చి మిర్చి, అల్లం వీటిని కలిపి రుబ్బుకొని, ఆ పిండికి కరివేపాకు, జీలకర్ర, కొత్తిమీర, తగినంత ఉప్పు కలిపి నూనెలో గారెలు వేయాలి. ఇవి చాలా రుచిగా ఉంటాయి.

**మక్క పేలాలు**

మొక్క జొన్న గింజలను ఎండబెట్టి వేయిస్తే వచ్చేవే మొక్క జొన్న పేలాలు, వీటి మీద కొంచె ధనియాలపొడి, ఉప్పు చల్లుకొని తినాలి.

## బియ్యం పిండి – వంటల రకాలు

### సకినాలు (చక్కిలాలు)

బియ్యం పిండి, నువ్వులు, వాము(ఓమ)తో చేసేవే సకినాలు. బియ్యం నానబెట్టి తడిబియ్యాన్ని బట్టలో వేసి నీరుపోయిన తరువాత పిండి పట్టించుకోవాలి ఆ పిండిలో నువ్వులు, వాము తగినంత ఉప్పు వేసి కొంచెం నీరుపోసి పిండిని తడుపుకోవాలి. ఆ పిండిని చిన్న చిన్న ముద్దలుగా తీసుకుని చేయితో చక్రాలుగా తిప్పుకోవాలి. ఆరిన తర్వాత ఆ చక్రాలను నూనెలో వేయించుకోవాలి వీటినే సకినాలు అంటారు. వీటిని ఎక్కువగా సంక్రాంతి పండుగకు చేస్తారు. సంక్రాంతి సమయంలో చలి ఎక్కువగా ఉంటుంది. కాబట్టి ఆ చలి నుండి శరీరాన్ని నువ్వులు కాపాడుతాయి. ఓమ జీర్ణశక్తిని పెంపొందిస్తుంది.

### సర్వపిండి

బియ్యం పిండి, ఉల్లిపాయ, పచ్చిమిర్చి, కరివేపాకు, కొత్తిమీర, నువ్వులు, పల్లీలు, జీలకర్ర, అల్లం వెల్లుల్లి ముద్ద వీటిన్నింటినీ కలుపుకుని గిన్నెకు వత్తుకుని మధ్యమధ్యలో రంధ్రాలు చేసి పొయ్యిమీద కాల్చితే సర్వపిండి సిద్ధం. దీనిని అల్పాహారంగా తింటారు. ఇది అత్యంత రుచికరమైన ఆహారం.

### బియ్యం పిండి మురుకులు

పుట్నాల పొడి, శనగపిండి, బియ్యంపిండి, నువ్వులు, వాము, కారం, ఉప్పు అన్నింటినీ కలిపి దానిలో కొంచెం నూనె, వేడినీరు పోసి ముద్దగా కలుపుకోవాలి. కొంచెం కొంచెం పిండిని గిద్దెలలో/పావులలో వేసి మురుకులను వేడినూనెలో వత్తుకోవాలి. ఇవి తినడానికి చాల రుచిగా ఉంటాయి. ఇందులోని ఓమ జీర్ణశక్తిని పెంపొందిస్తుంది. ఈ మురుకులను పెసరపిండి, శనగపిండి, మినప్పిండి, బియ్యంపిండితో కూడా చేసుకుంటారు. తెలంగాణాలో ఇది ప్రసిద్ధ వంటకం

### ఉప్పుడు పిండి

బియ్యంపిండి, పిచ్చిమిర్చి, ఎండుమిర్చి, కరివేపాకు, కొత్తిమీర, ఆవాలు, జీలకర్ర, సెనగపప్పు, మినపప్పు, నూనె, ఉప్పుతో చేసేదే ఉప్పుడుపిండి. గిన్నెలో నూనెవేసి ఆవాలు, జీలకర్ర వేసి చిటపటలాడాక ఎండుమిర్చి, మినపప్పు, సెనగపప్పు వేసి కొద్దిగా వేయించి దీనికి పచ్చిమిర్చి, కరివేపాకు చేర్చి కొద్దిగా ఉప్పువేసి నీళ్ళుపోసి మరిగించి, బియ్యం పిండిని అందులోవేసి ఉడికించాలి. ఈ ఉప్పుడుపిండి శరీరానికి చలువ చేస్తుంది.

### బియ్యం పిండి అట్లు

బియ్యం పిండిలో పచ్చిమిర్చి, తరిగిన కొత్తిమీర, జీలకర్ర, కరివేపాకు చేర్చి నీళ్ళుపోసుకుని దోశె పిండిలా కలుపుకుని అట్లు పోసుకోవాలి. ఈ అట్లు అల్పాహారంగా తింటారు. ఈ అట్లు శరీరానికి శక్తిని, చలువను చేకూరుస్తాయి.

### వడప్పలు

బియ్యం పిండిలో నూనె, శనగపప్పు నువ్వులు, పల్లీలు, పచ్చిమిరప ముద్ద, కరివేపాకు అన్నింటినీ వేసి వేడి నీళ్ళు పోసి ముద్దలాగా కలుపుకోవాలి. కొంచెం కొంచెం ముద్దను తీసుకుని అప్పలలాగా వత్తుకుని నూనెలో వేయించుకోవాలి. ఇది అల్పాహారంగా తింటారు.

### ఏపుడు బియ్యం

తెల్లవారికి మిగిలిన అన్నానికి గాని / వేడిగా వండి చల్లారిన అన్నానికి గాని ఉప్పురాచి ఎండబెడ్తారు. వాటిని ఇసుకను ఉపయోగించి వేయించి మరమరాలుగా చేస్తారు. వీటిని అల్పాహారంగా తింటారు. చాలా రుచికరంగా ఉంటాయి. ఒకప్పుడు తెలంగాణ ప్రాంతంలో చిన్న చిన్న కార్యక్రమాల్లో ఉదయం ఫలహారంగా ఏర్పాటుచేసేవారు. చిన్న పిల్లలు చాలా ఇష్టంతో తింటారు.

## గుడాలు (గుగ్గిళ్ళు)

గుడాలలో ప్రోటీన్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి శరీరానికి అత్యంత శక్తిని ఇస్తాయి.

### అలసంద గుడాలు

అలసందలు నీటిలో 4 – 6 గంటల వరకు నానబెట్టుకుని తర్వాత ఉడికించాలి. కడాయిలో నూనె వేసి పోపుగింజలు వేసి తరువాత ఉడకబెట్టిన అలసందలను వేసి వేయించి, ఉప్పు, కారం కొత్తిమీర, ఉల్లిపాయ, ధనియాల పొడి చల్లి దించేయాలి. ఇది అత్యంత శక్తిమంతమయిన ఆహారం. ఈ అలసందలు మలబద్ధకాన్ని పోగొడతాయి. ప్రతిరోజూ గుప్పెడు అసలందలు తింటే అజీర్తి, నిద్రలేమి ఆకలి మందగించడం, గుండెదడ మొదలగు సమస్యలకు మంచి ఔషధంగా పనిచేస్తుంది.

**శనగ గుడాలు, పెసరగుడాలు**

శనగలను, పెసర్లను కూడా 5 – 6 గంటలు నానబెట్టి నీరు తీసివేసి ఒక బట్టలో కట్టి పెట్టాలి. 5 – 6 గంటల తరువాత వాటిలోంచి మొలకలు వస్తాయి. ఈ మొలకలను పైన పేర్కొన్న అలసంద గుగ్గిళ్ళ మాదిరిగానే వండుకొని తినాలి. ఇలా మొలకలు వచ్చిన గుడాలలో ప్రోటీన్లు, కాల్షియం, ఐరన్ వంటివి సమృద్ధిగా ఉంటాయి. ఎదిగే పిల్లలకు ఇది ఎంతో బలవర్ధకమయిన ఆహారం.

## గారెలు

**పెసర గారెలు**

పెసర్లను నీళ్లుపోసి 6 గంటలు నానబెట్టాలి తరువాత వాటిని జల్లెట్లో వేసి నీరంతా పోయాక అల్లం, పచ్చిమిర్చి, తగినంత ఉప్పు కలిపి బరకగా రుబ్బుకోవాలి. దానిలో సన్నగా తరిగిన కరివేపాకు, కొత్తిమీర వేసుకుని కలుపుకోవాలి. ఈ పిండిని చిన్న చిన్న ముద్దలు తీసుకుని గారెలలాగా వత్తుకుని నూనెలో వేయించుకోవాలి. ఇది చాలా రుచికరమైన వంటకం తెలంగాణ ప్రాంతంలో ప్రతి పండుగకూ ఖచ్చితంగా చేసే వంటకు పెసర్లగారెలు

**చిట్టిగారెలు**

మినపప్పు కడిగి నీళ్ళలో 4 గంటలు నానబెట్టి నీరంతా వడగట్టి పచ్చిమిర్చి, తగినంత ఉప్పు వేసి మెత్తగా రుబ్బుకోవాలి. ఇందులో కొంచెం బియ్యం పిండి వేసి అరగంట మూత పెట్టి తర్వాత చిన్న చిన్న గారెల్లా వత్తుకొని వేడి నూనెలో వేసి బంగారు రంగు వచ్చేవరకూ వేయించుకుని తీసుకోవాలి. మినపప్పు తింటే నడుముకు చాలా బలం.

## తొక్కులు

**చింతకాయ తొక్కు**

చింతకాయలు చెక్కుతీసి, దానిలో పండుమిరపకాయలు, పసుపు, జీలకర్ర, మెంతులపొడి, ఉప్పు అన్నీ వేసి రుబ్బుకోవాలి. నూనె పోసి తరువాత తగినంత జీలకర్ర, ఆవాలు ఎండుమిర్చితో పోపువేసి రుబ్బుకొన్న తొక్కును అందులో కలుపుకోవాలి. ఈ తొక్కు వేడివేడి అన్నంలో నెయ్యి వేసుకుని తింటే అద్భుతమైన రుచి ఉంటుంది. ఇది తెలంగాణా ప్రాంతంలో ప్రతి ఇంట్లో ఉండే తొక్కు.

**రేగు పండ్లు తొక్కు**

పుల్లటి జిగురు ఉన్న రేగుపండ్లును శుభ్రంగా కడిగి బట్టలో తుడవాలి. ఒక్కొక్క పండును పుచ్చు లేకుండా పండు విప్పి చూడాలి. అలా విప్పి చూసిన పండ్లను ఒక జాడీలో పసుపు, ఉప్పు వేసి కొద్ది రోజులు మగ్గబెట్టాలి (చింతకాయ తొక్కులాగా) మాగిన రేగు పండ్లనుండి గింజలు తీసివేసి రుబ్బుకోవాలి. మిరపపండ్ల ముద్దను, రుబ్బిన రేగుపండ్ల ముద్దతో కలుపుకోవాలి ఎర్రటి రేగుపండ్లు తొక్కులో ఎప్పటికప్పుడు పోపు పెట్టుకొని వేడి వేడి అన్నంతో తినాలి. ఇది నిలువ తొక్కు.

**చెన్నంగి ఆకు తొక్కు**

కడాయిలో నూనె వేసి జీలకర్ర, ఎండుమిర్చి నువ్వులు వేసి వేయించి పక్కన పెట్టుకోవాలి. చెన్నంగి ఆకును ఉడికించుకొని పూర్తిగా మెత్తబడిన తర్వాత వేయించిన దినుసులు పొడిచేసుకుని దానికి చెన్నంగాకును కలిపి తగినంత ఉప్పు వేసి రుబ్బుకోవాలి. ఈ ఆకు తింటే శరీరానికి కావలసినంత ఐరన్ లభిస్తుంది.

**పులిసింతకూర తొక్కు**

చెన్నంగాకు తొక్కువలె నూరుకోవాలి.

**ఓగ్గాయి తొక్కు (కలిమికాయలు)**

ఓగ్గాయి ముక్కలుగా కోసుకొని నూనెలో వేయించుకోవాలి. పచ్చిమిరపకాయలను కూడా వేయించుకోవాలి. నువ్వుల పిండి, ధనియాల పొడి, తగినంత ఉప్పు వేసి అన్నింటినీ కలిపి రుబ్బుకోవాలి. ఈ రుబ్బుకున్న తొక్కులో పోపు వేసుకోవాలి.

**పుల్లదానిమ్మ తొక్కు**

పుల్ల దానిమ్మ గింజలను తీసుకోవాలి ఒగ్గాయి తొక్కులాగానే ఇది కూడా చేసుకోవాలి.

## కూరలు

**బోడ కాకరకాయ కూర**

బోడకాకరకాయలు కడిగి, పొడుగ్గా లేదా గుండ్రంగా ముక్కలు తరిగి పెట్టుకోవాలి గిన్నెలో పోపువేసి ఈ ముక్కలు కారం, ఉప్పు, పసుపు, ధనియాలు, జీలకర్ర పొడివేసి ఉడికించుకోవాలి. ఇది చాలా రుచికరమైన కూర.

### రాచ/తియ్య గుమ్మడి కాయ కూర

గుమ్మడికాయ తొక్కుతీసి, గింజలు తీసేసి ముక్కలుగా తరుక్కోవాలి. జీలకర్ర, ఎండుమిర్చి నువ్వులు, ధనియాలు వేసి వండుకోవాలి. ఉడికినాక తగినంత ఉప్పు, కొంచెం బెల్లం వేసి 5 ని॥లు ఉంచి దింపేయాలి. ఇది చాలా బలవర్ధకమైన కూర.

### పచ్చి పులుసు

చింతపండులో నీళ్ళు పోసి కాస్త పలుచగా పులుసు తీసి పెట్టుకోవాలి. అందులో ఉప్పు కొత్తిమీర కొంచెం చక్కర వేయాలి. ఆవాలు, జీలకర్ర, ఎండుమిర్చి, కరివేపాకు వేసి పోపు చేసుకోవాలి. అవసరమైతే ఉల్లిపాయలు సన్నగా తరగివేసుకోవచ్చు.

### కట్టుచారు

పప్పు దినుసులు ఉడికించగా వచ్చే నీళ్ళను కట్టు అంటారు. గిన్నెలో నూనె వేడి చేసి ఇంగువ వేసి ఆవాలు, జీలకర్ర, ఎండుమిర్చి వేసి వేగిన తర్వాత, అందులో కొంత చింతపులుసు  పప్పు కట్టు పోయాలి. ఇందులో కరివేపాకు, కొత్తిమీర వేసి కొద్దిసేపు మరగించి దింపేయాలి.

### గుమ్మడికాయ పులుసు

గుమ్మడికాయ పొట్టుతీసి ముక్కలుగా తరిగి పక్కకుపెట్టుకోవాలి. గిన్నెలో నూనె వేసి అదికాగాక అందులో పసుపు, కరివేపాకు, కారంపోడి, అల్లం వెల్లుల్లి ముద్ద వేసి కొద్దిగా వేపాలి. తరువాత గుమ్మడి ముక్కలు నూనెలో వేసి మగ్గనివ్వాలి. దీనిలో చింతపండు పులుసు పోసి, నీళ్ళు పోసి దానిలో జీలకర్ర మెంతులపోడి, ధనియాల పొడి, కొత్తిమీర వేసి పులుసును మరిగించాలి.

### కందగడ్డ పులుసు

గుమ్మడి పులుసు మాదిరిగానే ఈ పులుసును కూడా చేసుకోవాలి. గుమ్మడి ముక్కలకు బదులు కందగడ్డ ముక్కలు వేసుకోవాలి.

### పప్పుచారు

మొదట కందిపప్పును కుక్కర్లో ఉడికించుకోవాలి దోసకాయలు, మునగకాయలు, ఆనపకాయ, టమాట, దొండకాయ ముక్కలను పోపులో వేసుకుని ఉడికించాలి. దానిలో చింతపండు పులుసు పిండి కొంచెం మరిగించాలి. చివరగా కొత్తిమీర వేసి దించేయాలి.

ఈ పప్పు చారు మంచి పౌష్టిక ఆహారం ఇందులో పప్పులోని ప్రోటీన్లు, కూరగాయలలో లభించే ఐరన్, కాల్షియం వంటివి మనకు అందుతాయి.

### చల్ల పులుసు

చల్లను తీసుకుని దానిలో కొద్దిగా శనగపిండిని ఉండలు లేకుండా కలుపుకోవాలి. కడాయిలో నూనెవేసి దానిలో జీలకర్ర, ఆవాలు, ఎండుమిర్చి కరివేపాకు, అల్లం ముక్కలు వేసి దానిలో కలుపుకున్న చల్లను వేసుకోవాలి. దాన్ని మరిగించి దించేయాలి. అవసరమైతే అందులో మునక్కాయ / బెండకాయ  ముక్కలు కూడా వేసుకోవచ్చు.

## స్వీట్స్ - మిఠాయిలు

### బూడిద గుమ్మడికాయ హల్వా

గుమ్మడికాయ చెక్కుతీసి సన్నగా తురుముకోవాలి. కడాయిలో నెయ్యివేసి ఈ తురుమును కొద్దిసేపు వేయించాలి. తరువాత పాలు పోసి ఉడికించాలి మొత్తం ఉడికాక చక్కెర వేసి పూర్తిగా దగ్గర పడే వరకు ఉడికించి, ఇలాచిపొడి, కాజు, బాదం వేసి కలిపి దింపేయాలి.

### ఓగ్గాయి మొరబ్బా

ఓగ్గాయిలను కడిగి రెండు ముక్కలుగా కోసుకోవాలి. లోపల ఉన్న గింజలను తీసి తగినంత చక్కెరపాకంలో ఓగ్గాయి ముక్కలను వేసి పాకం దగ్గరికి వచ్చే వరకు ఉడికించాలి. ఎంతైతే ఓగ్గాయిలను తీసుకుంటామో దానికి రెండింతలు చక్కెరను తీసుకోవాలి. దీనిలో ఇలాచి పొడి, సార పలుకులను వేసుకోవాలి.

### మరమరాల ఉండలు

బెల్లం తురిమి కప్పుడు నీళ్ళు తీసుకుని పోసి కరిగించాలి బెల్లం కరిగిన తరువాత వడకట్టి మళ్ళీ మరిగించాలి. ముదురు పాకం రాగానే ఇలాచి పొడి, మరమరాలు వేసి కలిపి దింపేయాలి. కొద్దిగా చల్లారిన తర్వాత చేతికి నేయి రాసుకుని ఉండలు చేసుకోవాలి.

**రవ్వ లడ్డూలు**

నెయ్యి వేడిచేసి రవ్వను దోరగా వేయించుకుని పక్కన పెట్టుకోవాలి. ఇందులో చక్కెర పొడి వేసి కలపాలి. ఇలాచి పొడి కరిగించిన నెయ్యి వేసి కలిపి కావలసిన సైజులో ఉండలు కట్టుకోవాలి.

**నువ్వులు లడ్డూలు**

నువ్వులను దోరగా వేయించుకుని పెట్టుకోవాలి. ఒక గిన్నెలో తరిగిన బెల్లం కప్పు నీళ్ళు పోసి మరిగించాలి. బెల్లం ముదురు పాకం రావాలి. అప్పుడు నువ్వులు వేసి బాగా కలపాలి, కొంచెం వేడి తగ్గిన తరువాత ఉండలు చేసుకోవాలి.

**మలీద ముద్దలు**

మలీద ముద్దలు బతుకమ్మ పండుగ సందర్భంగా తయారుచేస్తారు. సద్ద రొట్టెలను ముక్కలుగా చేసి దానిలో బెల్లం వేసి రోటిలో వేసి దంచి ఆ పిండిని ముద్దలుగా కట్టుకోవాలి.

**భక్ష్యాలు (పోలెలు)**

భక్ష్యాలను కొన్ని ప్రాంతాలలో పోలెలు అని కూడా అంటారు. ఈ భక్ష్యాలను ఎక్కువగా ఉగాది పండుగ రోజు చేస్తారు. శనగపప్పును ఉడికించి నీరు తీసివేసి దానిలో బెల్లంకాని, చక్కెరకానీ వేసి రోటిలో నూరుకోవాలి. ఆ పిండిని ముద్దలుగా చేసి ఒక్కో ముద్దను చపాతి పిండిలో పెట్టుకోవాలి. చపాతీల్లాగా వత్తుకుని పెనంపైన కాల్చాలి. దానిపైన నెయ్యి వేసుకుని తింటే భక్ష్యాలు చాలా రుచికరంగా ఉంటాయి.

**బూడిద గుమ్మడికాయ వడియాలు**

బూడిద గుమ్మడికాయను చిన్న ముక్కలుగా కోసుకోవాలి. పెసరపప్పును నానబెట్టి రుబ్బుకోవాలి ఆపిండిలో పచ్చిమిర్చి, జీలకర్ర, ఉప్పు, గుమ్మడి ముక్కలను వేసి వడియాలు పెట్టాలి వీటిని పప్పు భోజనంతో తింటే అద్భుతంగా ఉంటాయి.

## వరుగులు

అన్ని కాలాలలో అన్ని కూరగాయలు దొరకవు అందువల్ల కూరగాయలను ముక్కలుగా తరుక్కొని వాటికి ఉప్పు, పసుపు పట్టించి ఎండబెట్టి వరుగులుగా చేసుకుంటారు. ఈ వరుగులు సంవత్సరమంతా నిలువ ఉంటాయి. ఆయా కూరలు దొరకనపుడు ఈ వరుగులను కూరలాగా వండుకుంటారు. మామిడికాయ వరుగులను టంకర్లు అంటారు.

## మాంసాహార వంటలు

**హైదరాబాద్ దమ్‌కీ బిర్యాని**

హైదరాబాద్ దమ్‌కీ బిర్యానీ ప్రపంచ వ్యాప్తంగా చాలా ప్రసిద్ధి చెందింది. ఈ బిర్యానీ బాసుమతి బియ్యం, చికెన్ లేదా మటన్, వేయించిన ఉల్లిగడ్డలు, నిమ్మకాయ, కొత్తిమీర, మసాలాలు ఉపయోగించి తయారుచేస్తారు.

**హలీమ్**

దీనిని రంజాన్ మాసంలో తయారుచేస్తారు. ఇది తెలంగాణా వంటకం కాకున్నా తెలంగాణా ప్రాంతంలో చాలా ప్రసిద్ధి పొందిన వంటకం దీనిని ముస్లింలు రంజాన్ మాసంలో ఇఫ్తార్ విందు సందర్భంగా పూర్వం నుండి తినడం వస్తున్న ఆచారం మాంసం, గోధుమలు, మాసాలా దినుసులు, నెయ్యి వేసి చేస్తారు, ఈ వంటకం ఉదయం నుండి ఉపవాసం ఉన్న వారికి శక్తినిస్తుంది.

పండే పంటల ఆధారంగా మన తెలంగాణా వంటలు ఉన్నవి. పైన పేర్కొన్న వంటలన్నీ కూడా తెలంగాణా ప్రాంత వాతావరణానికి, ప్రజల అభిరుచులకు అనుగుణంగా ఉన్నవి.

**ముగింపు**

పైన పేర్కొన్న వంటలే కాకుండా ఇంకా ఎన్నో రకాలైన వంటలున్నాయి. దేని ప్రత్యేకత దానిదే. కొన్ని వంటలను మాత్రమే ఇందులో పరిచయం చేయడం జరిగింది.

ఈ వంటలు అతిథులకు రుచి చూపిస్తూ ఘుమఘుమలను వ్యాపింపచేస్తూ నోరూరుస్తున్నాయి కదా! ఇంకెందుకు ఆలస్యం. ఆరగిద్దాం పదండి.

❀❀❀❀❀

# 22. మన సంస్థానములు-సాహిత్యం

తెలంగాణలో అనేక సంస్థానాలు ఉండేవి. వాటిలో కొన్ని కాకతీయుల కాలంలో, కొన్ని కుతబ్‌షాహీల కాలంలో, మరికొన్ని అసఫ్‌జాహీ కాలంలో ఆవిర్భవించాయి.

దోమకొండ, జటప్రోలు, గద్వాల, వనపర్తి, బోరవెల్లి, ఆత్మకూరు, పావన్నపేట, పాల్వంచ, గోపాలపేట, నారాయణపురం, రాజపేట, దుబ్బాకుల, క్యాతూరు, అలంపురం, సీర్నాపల్లి, దొంతి, మనాజీపేట మొదలగు సంస్థానాలు ఆయా ప్రాంతాలను పాలించారు. తర్వాత ఇవి నిజాం రాష్ట్రంతో సహా భారతదేశంలో విలీనం అయ్యాయి.

తెలంగాణ సంస్కృతి, సాహిత్యాలను పోషించడంలో ఈ సంస్థానాలు కీలక పాత్రను పోషించాయి.

## 1) పాల్వంచ సంస్థానం :

- 800 చదరపు మైళ్ళు విస్తీర్ణం 40 వేల జనాభాతో విలసిల్లిన సంస్థానం.
- పాత వరంగల్లు ప్రస్తుత ఖమ్మం జిల్లాలకు సంబంధించింది.

**సాహిత్య సేవ**

- వెంకట రామయ్య అనుకవి ఈ సంస్థాన చరిత్రను "అశ్వరాయ చరిత్ర" "శ్రీరామ పట్టాభిషేకం" అను కావ్య రూపంలో రచించాడు.

## 2) జటప్రోలు సంస్థానం :

- 191 చదరపు మైళ్ళ విస్తీర్ణంతో 89 గ్రామాలతో మహబూబ్‌నగర్ జిల్లాలో ఉండిన సంస్థానం.

**సాహిత్య సేవ**

- ఈ సంస్థానంలో సాహిత్య సౌరభాలు విరజిమ్మాయి. ఈ సంస్థానాధీశులు ఎందరో కవి పండితులను పోషించడమే కాకుండా వారిచే రచించబడిన గ్రంథాలను ముద్రించి శాశ్వత రూపం కల్పించారు.
- సురభి మాధవరాయలు 'చంద్రికాపరిణయం', ఎలకూచి బాలసరస్వతి – భర్తృహరి సుభాషితాలను తెనిగించాడు.
- లక్ష్మీనృసింహవిలాసం (చంపూ గ్రంథం), మదన గోపాల మహాత్యం (సంస్కృత కావ్యం)లను హోసు దుర్గం కృష్ణమాచార్యులు రచించినారు. సురభి వెంకట లక్ష్మణరావు గారు చంద్రికా పరిణయం, మల్ల భూపాలీయం, సురభివంశ గ్రంథాలను ముద్రింపచేశాడు.
- వెల్లాల సదాశివశాస్త్రి గారు రామరాజ భూషణ కావ్యాలంకార సంగ్రహమునందలి రసప్రకరణ, నాయికా నాయకా ప్రకరణములకు సవిమర్శయైన వ్యాఖ్యను రచించాడు. వీరి గ్రామం అయ్యవారిపల్లె. అక్షింతల సుబ్బశాస్త్రి మొ॥ ఎందరో కవులు ఈ గ్రామంలో ఉన్నారు.
- మంచాలకట్ట అను మరొక గ్రామం కూడా కవిపండితులకు నిలయంగా ఉండేది. ఇక్కడ వైష్ణవ పండితుల సాహిత్యం చెప్పుకోదగినది. వైయాకరణ గజకంఠీరవగా ప్రసిద్ధిపొందిన యాణయవల్లి కృష్ణమాచార్యులు సంస్కృతమునందు అష్టప్రాస రామశతకం, శ్రీకృష్ణచంపువు, నిరోష్ఠ్య కృష్ణశతకం, రసజ్ఞానందం, జాతకచంద్రికావ్యాఖ్య అను గ్రంథాలను రచించాడు.

- సంస్కృతమున నిరోష్ఠ్య రామాయణాన్ని రచించిన కవికంఠీరవ కృష్ణమాచార్యులు వీరి సమకాలీకులు. వేంకట లక్ష్మణరావు బహుద్దూరుగారి కాలమున కవిపండిత సాహిత్య గోష్ఠులు, శాస్త్రచర్చలు, ధర్మశాస్త్రానికి సంబంధించిన వాదోపవాదాలు చాలా జరిగినట్లు తెలుస్తున్నది.
- శ్రీమతి చేబ్రోలు సరస్వతీదేవి గారి "సరస్వతీరామాయణం" వాజపేయ యాజుల రామ సుబ్బారాయుడు గారు స్నేహలతా కవితా సంఘమును స్థాపించాడు. 130 పైగా కావ్యములను ప్రకటించాడు.
- శ్రీ సురభి లక్ష్మణరావు బహద్దూరు, జటప్రోలు మహారాణి వేంకట రత్నమాంబ గారి కాలంలో పండిత పోషణతో పుస్తకాల ముద్రణ, పారితోషికములతో, సత్కారములతో దిగ్విజయముగా సాగినది. భాషామతల్లిక సేవలో వీరు తరించారు.

### 3) గద్వాల సంస్థానం :

- 360 గ్రామాలతో కృష్ణా తుంగభద్ర నదుల మధ్యన మహబూబ్‌నగర్ జిల్లా తూర్పున ఆలంపురం తాలుకా పడమర రాయచూర్ జిల్లా హద్దుల వరకుండెను.

**సాహిత్య సేవ**

- వీరరాఘవాచార్యులు యథాశ్లోక భారతోద్యోగపర్వం. పెద్దన్న ఆధ్యాత్మ రామాయణం, ముకుందవిలాసం, మత్స్యపురాణం, శేషశైలేశలీల, యథాశ్లోక తాత్పర్యరామాయణం, రామాయణ చంపు మొ॥ కావ్యములను రచించాడు. చినసోమాద్రి (ఆధీశుడు) రతిరహస్యం (ప్రబంధం), అష్టపదులు రాశాడు.
- శేషాచార్యులు యథ్యాశ్లోకతాత్పర్య రామాయణం (యుద్ధకాండ) చెన్నకేశవ స్వామికి అంకితమిచ్చాడు.
- కామ సముద్రం అప్పలాచార్యులు ఆంధ్రాష్టపది లేక కృష్ణలీలా తరంగిణి, యధాశ్లోకతాత్పర్య రామాయణం (కిష్కింధకాండ) మొ॥వి రాశాడు.
- తిరుమల కృష్ణచార్యులు సుందరకాండను రచించాడు.
- బుచ్చి వేంకటాచార్యులు ''వేదాంత కారికావళి'' అభినవశృంగార మంజీరభాణం, కళ్యాణపు రంజనము, శృంగారసర్వస్వం రాశాడు..
- కిరీటి వేంకటాచార్యులు "అచలాత్మజా పరిణయం" (ద్వ్యర్థికావ్యం) రాశాడు.
- ధర్మవరం రామకవి "ముకుంద విలాసం" రచించాడు.
- కొత్తపల్లి రామాచార్యులు యథాశ్లోకతాత్పర్య రామాయణం (అయోధ్యకాండ) రాశాడు.
- నరసింగమయ్య 'నృసింహవిలాసం" రచించాడు.
- కొటికలపూసి వీరరాఘవచార్యులు ''యథాశ్లోక తాత్పర్యభారతం" (ఉద్యోగపర్వం) రాశాడు.
- శ్రీ ముష్టిపల్లి రామభూపాలుడు (సంస్థానాధీశుడు) "ఛందోముకుర" అను సంస్కృత గ్రంథాలు రచించాడు.
- చెట్లూరి నారాయణాచార్యులు "ప్రతాపరుద్రీయము" రాశాడు.
- ముఖ్యంగా ఇచ్చట నిర్వహించిన విద్వత్సభలకు వివిధ ప్రాంతాల నుండి కవిశ్రేష్ఠులు వచ్చేవారు. కాశీ, మైసూరు పండితులు పాల్గొనేవారు. రామభూపాలుని కాలంలో తిరుపతి వేంకటకవులు మొదటి సారిగా 'గద్వాల'కు వచ్చారు. వీరు నిర్వహించు కవిపండిత గోష్ఠులను చూసి వీరికి గల ఆదాయమెంతయని మైసూరు మహారాజావారు తెలుసుకున్నట్లు తెలియుచున్నది.
- వీరిలో సీతారామ భూపాల్‌రావు బలవంత్ బహద్దూర్ చేసిన కవిపోషణను చూసి "ఆంధ్రభోజు"డిగా కవులు కీర్తించారు.
- గద్వాల సంస్థానానికి కవులు, కళాకారులు రావడం పరిపాటి. వారిని సన్మానించడంతో ఆ సంస్థానం "విద్వద్గద్వాల"గా మారింది. కార్తీక, మాఘ పౌర్ణిమల సందర్భంగా ప్రత్యేక కవిగాయక బృందాలతో కార్యక్రమాలు నిర్వహించేవారు.
- వీరి కాలంలో వేదం వేంకట రాయశాస్త్రి, గోపాలుపేట రామచంద్రాచార్యులు, గౌరావఝ్జల రామకృష్ణ శాస్త్రి, జానపాటి పట్టాభిరామ శాస్త్రి, మల్లాది అచ్యుత రామశాస్త్రి, చంద్రశేఖర శర్మ, బలిజేపల్లి లక్ష్మీకాంతము, మొదలగు కవులు, అవధానులు ఈ సంస్థానాన్ని "సాహితీ" ప్రభలతో నింపి, ఈ సంస్థాన శోభను దశదిశలా వ్యాపింపచేశారు.

## 4) దోమకొండ :

- నిజామాబాద్ జిల్లాలోని బిక్కవోలు ప్రాంతం ఈ సంస్థానానికి చెందినది.
- 1789లో "బిక్కవోల్" నుండి "దోమకొండ" కు రాజధాని మార్చబడింది.

**సాహిత్య సేవ**

- పడమట సోమనాథుడు షట్చక్రవర్తి చరిత్ర, శివధర్మోత్తరం పద్మపురాణం అను గ్రంథాలను రచించాడు.
- రెండో ఎల్లారెడ్డి వాసిష్ట పురాణం రాశాడు.
- ఉమాపతి : ఉమాపత్యభ్యుదయం రచించాడు.
- 'ఎల్లారెడ్డి బాల భారతం, కిరాతార్జునీయం' అను గ్రంథాలను అంకితం తీసుకున్నాడు.
- కొలిచలమ నారాయణ చంపురామాయణం రాశాడు.

## 5) వనపర్తి సంస్థానం :

- 124 గ్రామాలతో అతిపెద్ద సంస్థానం ఇది.
- పూర్వపు మహబూబ్‌నగర్ జిల్లాలోనిది.

**సాహిత్య సేవ**

- అష్టభాషా గోపాల్‌రావు 'రామచంద్రీయం' (శ్లేషకావ్యం) 'శృంగార మంజరీ భాణము' మొ॥ సంస్కృత గ్రంథాలు రాశారు. గోపాల్‌రావు ఎనిమిది భాషల్లో ప్రావీణ్యుడు. "షడ్దర్శనీవల్లభు"డను బిరుదును పొందాడు.
- అయ్యమాచార్యులు, 'చెన్నకేశవ విలాసము, రామేశ్వర విజయం' లను రచించాడు.
- చెన్నకృష్ణకవి యాదవ భారతీయం (ద్వర్థి ప్రబంధం)ను రాశాడు.
- వీరరాఘవాచార్యులు : వీరరాఘవీయం "సంస్కృత భాగవతమునకు వ్యాఖ్య రచించాడు.
- శ్రీనివాస రాఘవాచార్యులు వీరాఘవీయ భూమిక, ఆచార్య వైభవము, స్వభావపద్ధతి అను గ్రంథములు రచించాడు.
- శ్రీ పాపశాస్త్రి : భారతసంగ్రహం, భ్రమరాంబికానువాదము అనే గ్రంథాలు రాశాడు.
- విక్రాల నరసింహాచార్యులు : భారతీస్తుతి, కళ్యాణి మాలతీ మాధవము, కురుసంధానం, దూతాంగదము,జగన్మోహన భావము అను గ్రంథాలను రచించాడు.
- మాదిరాజు విశ్వనాథరావు మరియు కప్పగంతుల లక్ష్మణ శాస్త్రిగారితో కలిసి "విక్రమాంక దేవచరిత" (ప్రౌఢ ప్రబంధం), 'కర్ణసుందరీ నాటకం'ను రచించాడు.
- రామేశ్వరరావు గారి కాలమున నంబాకం రాఘవచార్యులు, శేరటూరు శేషాచార్యులు, ధూళిపాల సూర్యనారాయణశాస్త్రి మొ॥వారు సభలకు వచ్చేవారు.
- స్ఫోటవాదము, కావ్యలక్షణము, సర్వదర్శన మత తత్త్వామృతం, న్యాయదర్శనం, విశిష్టాద్వైత దర్శనం, పాణినీయ దర్శనం, ఆయుర్వేద పరిశోధనలు, మొ॥ అంశంలపై కృషిచేసిన శంకరశాస్త్రులు, నరసింగయ్య శాస్త్రులు, సూరిరామకోటి శాస్త్రి, నరసింహశాస్త్రి, సుదర్శనా చార్యులు, కందాడై రంగాచార్యులు, బల్మారు వేంకట రామానుజస్వామి గారలు కృషినల్పి ముద్రింపజేశారు.
- బ్రహ్మ విద్యాముద్రాక్షరశాల యందు "విస్మృత కవులు " శీర్షికతో మానవల్లి రామకృష్ణ కవి, నన్నెచోడుని కుమార సంభవము. వల్లభరాయని క్రీడాభిరామము, మడికి సింగన సకలనీతి సమ్మతం, బద్దెభూపాలుని నీతిశాస్త్ర ముక్తావళి, భైరవకవి శ్రీరంగ మహత్మ్యము, ప్రబంధమణి భూషణము, వేంకటేశోదాహరణం, మొదలగు గ్రంథములను ప్రకటించారు.
- "ప్రతి వర్షంబున దెల్గుతల్లిని పవిత్రప్రేమ నర్చించు నున్నతుడౌ మా వనపర్తి రాజు" అని కవులు పొగుడునట్లు తెలుగు సాహిత్య పోషణ గావించిన వారు వనపర్తి రాజులు.

## 6) మునగాల :

- ఈ సంస్థానం ప్రస్తుత కృష్ణా జిల్లాలో ఉన్నప్పటికినీ మూడువైపుల ఎక్కువభాగం నల్గొండ, ఖమ్మం జిల్లాల్లో విస్తరించియున్నది.
- 1766 ముందు తెలంగాణాలో ఉన్నది.

**సాహిత్య సేవ**

- శ్రీ రాజా వేంకటరంగరాయుడు వరదరాజు నందికేశ్వర శాస్త్రి "శివతత్త్వ సుధానిధి" అను ప్రబంధమును రచింపజేసినాడు. ఈయన సేతు మాహాత్మ్యము అను మరొక ప్రబంధమును రచించాడు.
- ఈయన దీవాన్‌గా ఎన్న కొమర్రాజు వేంకటలక్ష్మణ రావు గారు విజ్ఞానచంద్రికా గ్రంథమండలిని "స్థాపించి" ఆంధ్ర విజ్ఞాన సర్వస్వమును మొదటగా ప్రకటించి భాషాసేవ చేశాడు.
- కొమర్రాజు వేంకట లక్ష్మణరావు, రావిచెట్టు రంగారావుగారలిరువురు 1901లో శ్రీ కృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం, రాజరాజనరేంద్ర భాషానిలయం స్థాపించి భాషాభివృద్ధికి శాశ్వత మార్గనిర్దేశం చేశాడు.

## 7) ఆత్మకూరు (అమరచింత సంస్థానం) :

- 190 చదరపు మైళ్ళ వైశాల్యంతో మహబూబ్‌నగర్‌కు చెందిన సంస్థానమిది.

**సాహిత్య సేవ**

- సాహిత్య పోషణలో వీరు (చిన్న సంస్థానంవారు అయినప్పటికిని) గద్వాల సంస్థానాధీశులతో పోటీపడ్డాడు.
- గాడేపల్లి వీరరాఘవశాస్త్రి శతావధాని.
- వీరి ఇలవేల్పుయైన శ్రీనివాసస్వామి పై "శ్రీనివాస విలాసం" గ్రంథము రచింపబడింది.
- సురపురం కేశవయ్య "నిరోష్ఠ్య రామాయణమును రచించి రాజా సోమభూపాలునికి అంకితం ఇచ్చాడు.
- శ్రీ తిరుమల బుక్కపట్టణం రంగాచార్యులు గుణరత్నాకరము, పద్మానీ పరిణయము అను చంపూ గ్రంథాలను రచించాడు.
- అంశాణపాలెం వేంకటాధ్వరి "లక్ష్మీసహస్రమునకు" వ్యాఖ్యను రచించెను.
- బాలసరస్వతి, తర్కతీర్థ బిరుదును చాటుకున్న శ్రీ తిరుమల బుక్కపట్టణం శ్రీనివాసాచార్యులు నటరాజ పరిణయచంపువు, తత్త్వమార్తాండ ప్రభాపటలము వెంకటాచర్యవైజయంతీ నాటకం మొ॥ రచనలు చేసి, అష్ట భాషా కవిత్వము చెప్పాడు.
- బాల సరస్వతి శ్రీ బుక్కపట్టణం శ్రీనివాసాచార్యులుగారికి తిరుపతి వేంకటకవులకు వాదోపవాదములు నిర్వహించి శ్రీ సీతారామ భూపాల్‌రావు గారు వారిని సన్మానించారు. శ్రీనివాస విలాసమును తిరుపతి వేంకట కవులచే అనువదింపచేశారు.
- ఆత్మకూరు సంస్థానాధీశుడైన శ్రీ సీతారామభూపాలుడిని, ఆస్థాన కవియైన శ్రీ బాల సరస్వతి "శ్రీనివాసాచార్యులని" తిరుపతి కవులు ప్రస్తుతిస్తూ చెప్పిన పద్యాలు ప్రశస్తమైనవి.
- "కరినెక్కించితి............ సీతారామ భూపాలకా"

  "ఏనుగునెక్కినాము..... నీవలనన్ సరస్వతీ"
- శ్రీ దీక్షితుల నరసింహశాస్త్రి "లక్ష్మణ పరిణయం" తెనుగు సత్యనారాయణ వ్రతకల్పం, విదురాశ్వత్థ మాహాత్మ్యం, శ్రీరంగ మహోత్సవ వర్ణమాలిక, పారుపేట పద్యములు రచించాడు.
- శ్రీ హారతి దీక్షాచార్యులు : అంతర్లాపి, బహిర్లాపి కవిత్వము, మహాంతర్లాపమాల, అలంకరణ మణిమాల ఆచార్య వింశతి" మొ॥వి రచించాడు.
- తిరుమల బుక్కపట్టణం రంగాచార్యులు బంధకవిత్వం చెప్పేవాడు. రంభోర్వశీయమును రచించాడు.
- బహుజనవల్లి వేంకటాచార్యులు (అమరచింత నివాసి) ఈయన గద్వాల యమునాచార్యులతో కలిసి జానకీ పరిణయం, దంతునూరు వేంకట కృష్ణమాచార్యులతో కలిసి రాజలేఖ అనుపుస్తకం రచించాడు.
- గుండేరావు హర్కారే సంస్కృతమున రచించిన శ్రీరామ పూజా విధానాదులను తెలుగులో అనువదించాడు. వీటితో పాటు రామాశ్వమేధము, ఆంధ్ర సత్యనారాయణ వ్రతం మొదలగు వాటిని రచించాడు.

ఈ సంస్థానంలో ప్రతి సం॥ ఫాల్గుణ శుక్లతదియ, చవితి తిథులలో విద్వత్కవిగాయక సభలు నిర్వహించేవారు. ఎందరో దేశవిదేశ కవులను సన్మానించి సాహిత్యాభిమానాన్ని చాటుకొన్నారు.

## 8) పాపన్నపేట (మెదక్ జిల్లా) :

- పాకనాటి రెడ్లవంశానికి చెందిన "అనంతరెడ్డి" ఈ వంశానికి మూల పురుషుడు.
- ఇది మెదక్ జిల్లాలోనిది. 25. చ॥ మైళ్ళ విస్తీర్ణంలో ఉండేది.

**సాహిత్య సేవ**

- రాజా సదాశివారెడ్డికి చెందిన 'తందానకథ' ప్రసిద్ధిచెందినది.
- కురుగంటి సీతారామ భట్టాచార్యులు సరిపెట్ల విశ్వనాథశాస్త్రి మొ॥ గురువులు ఈ సంస్థానాధీశుల పోషణలో ఉండిరి.

## 9) బోరవెల్లి సంస్థానం :

- మహబూబ్‌నగర్ జిల్లాలోనిది.

**సాహిత్య సేవ**

- చింతలపల్లి ఛాయపతి అనుకవి "రాఘవాభ్యుదయం" ప్రబంధాన్ని రాసి వీరి ఇలవేల్పైన "కేశవస్వామి"కి అంకితం ఇచ్చాడు.

## 10) నారాయణపురం రాజాపేట సంస్థానాలు :

- నల్గొండ జిల్లా
- మంచల్ రెడ్డి "నారాయణపురం" ను ఇనాంగా పొందాడు.

## 11) మానాజిపేట :

- మహబూబ్‌నగర్ మండలం ఉన్నది మానాజిపేట. తూము రామకృష్ణారెడ్డి ఇక్కడివాడిదే.

**సాహిత్య సేవ**

- తూము రామచంద్రావనీపాల రచించిన "అలుమేలు మంగా పరిణయం" ప్రసిద్ధమైన కావ్యం.

## 12) మల్లారెడ్డి దేశాయి :

- నాటి అలంపూరు తాలుకాలోది.

**సాహిత్య సేవ**

- శ్రీ రెడ్రెడ్డి మల్లారెడ్డి దేశాయి "గంగాపుర మహోత్త్యము" అను పద్యకావ్యమును రచించాడు. (క్రీ॥ శ॥ 1700)

## 13) క్యాతూరు :

- మహబూబ్‌నగర్ జిల్లాలోది.

**సాహిత్య సేవ**

- సురవరం రంగారెడ్డి విజ్ఞానవర్ధినీ పరిషత్తు ప్రకటించిన గ్రంథాలకు ధనసహాయం చేశాడు.
- "కవిశరభ" బిరుదాంకితుడు దోమకొండ సంస్థానకవి శ్రీ పెద్దమందడి వేంకటకృష్ణ కవి రచించిన నిర్వచన మహాభక్త విజయం ముద్రణ చేయించాడు.
- ''భార్గవ రామచరిత్ర'' మొ॥ గ్రంథాలు రాసిన శ్రీ అనుముల వేంకట సుబ్రహ్మణ్య శాస్త్రి కవిని ఆదరించి సత్కరించాడు.

## 14) గోపాలపేట :

- మహబూబ్‌నగర్ మండలం వనపర్తి సమీపంలో కలదు.

**సాహిత్య సేవ**

- వల్లా లక్ష్మీనరసింహ శాస్త్రి, బుక్కపట్టణం రాఘవాచార్యులు, శ్రీకేశవ పంతుల సింగయ్య సిద్ధాంతి, కాకునూరి అప్పకవి మొ॥ కవి పండితులు వీరిచే పోషించబడ్డారు.
- ఈ సంస్థానంలోని చింతకుంట గ్రామంలో "మంగువారు" అను కవులుండేవారు.
- బుక్కపట్టణం రాఘవాచార్యుల వారి విద్వత్పరీక్షలో నెగ్గి తెలంగాణమునకే కీర్తి తెచ్చిన కవి.
- శ్రీ రామచంద్రాచార్యులు (శతావధాని) ఆనంద రామాయణం రచించాడు.
- ఈ సంస్థానపు రాణీ రంగనాయకమ్మ "సహస్రావధాని"యైన శ్రీ జంధ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రిని సత్కరించింది. ''కేసంపేట'' జాతర్లలో విద్వత్ కవిగాయకులను సన్మానిస్తూ వారిలో సాహిత్యాభిలాషను ప్రకటించుకొన్నారు.


**15) అలంపురము :**

- శ్రీశైల క్షేత్రమునకు పశ్చిమమున ఉన్నది. ప్రస్తుతం జోగులాంబ గద్వాల జిల్లాలోది.
- బిజ్జుల వారు సంస్థానాధీశులు.

**సాహిత్య సేవ**

- బిజ్జుల తిమ్మభూపాలుడు, చెప్పుకోదగిన 'సాహిత్య కృషి చేశాడు'. అనర్ఘ రాఘవము" రచించాడు.
- ఇది సంస్కృతమున మురారి కవిరచించిన "అనర్ఘరాఘవము"లను నాటకమునకు అనువాదము (ప్రౌఢ ప్రబంధం) కృష్ణకవి ఈ అనువాదమునకు సహకరించాడు.
- 1930 ప్రాంతమున శ్రీ రాజాబిజ్జుల చంద్రశేఖర రెడ్డి "అనర్ఘరాఘవమును" ముద్రింపచేశాడు.
- వీరి వంశీయులందరూ కవిపండిత గాయకులను ఆదరించుటలో శ్రద్ధ కనబరిచారు. స్వయంగా కవియైన శ్రీ దైవము దినెన్న రామారెడ్డిగారు విశేషముగా కవులను ఆదరించి అవధానాలు నిర్వహించి భాషా సాహిత్యాలను పోషించాడు. చెమికెల చెన్నారెడ్డి, శ్రీ పోకూరి కాశీపతి, పెద్దమందడి వేంకటకృష్ణ కవి, వేదవరం రామబ్రహ్మశాస్త్రి, దీపాల పిచ్చయ్య శాస్త్రి, పిశుపాలి చిదంబర శాస్త్రి, సంగుబొట్ల నరసింహశాస్త్రి, గొట్టిముక్కల గోపాలకృష్ణశాస్త్రి, శ్రీపతిత్ర్యంబకరావు, అల్లసాని రామనాథశర్మ వంటి ఎందరో అవధానులు సంస్థానం వారిచే ఆదరించబడి, సన్మానించబడ్డారు.

❀❀❀❀❀



# 23. తెలంగాణ జాతరలు

## సమ్మక్క – సారలమ్మ జాతర :

సమ్మక్క – సారలమ్మ జాతర ఆసియా ఖండములోనే అతి పెద్ద గిరిజన జాతరగా యునెస్కో – పారిస్ వారిచే గుర్తింపు పొందింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే రాష్ట్ర ఉత్సవంగా 1996 ఫిబ్రవరి 1న ప్రకటించబడింది. ఈ జాతరలో గిరిజనులకంటే గిరిజనేతరులే ఎక్కువగా పాల్గొంటారు. ఈ జాతరలో సమ్మక్క సారలమ్మలు దేవతల రూపంలో ఆరాధించబడుతారు. ప్రతి రెండు సంవత్సరాలకొకసారి మాఘశుద్ధ పౌర్ణమి రోజున జరుపుకుంటారు. జాతర మొత్తం 4 రోజుల పాటు కొనసాగుతుంది. ఈ జాతరను జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లోని ప్రస్తుత తాడ్వాయి మండలంలో జరుపుకుంటారు.

## నాగోబ జాతర :

నాగోబ జాతర ఆదిలాబాద్‌లోని ఇంద్రవల్లి మండలంలోని కేస్లాపూర్ గ్రామంలోని గోండు గిరిజన తెగవారు ప్రతి సంవత్సరం పుష్యమాసంలో బహుళ అమావాస్య రోజున జరుపుకుంటారు. 1940లో ప్రొ॥ హెమన్ డార్ఫ్ అనే గిరిజన స్కాలర్ నాగోబ జాతర సందర్భంగా గోండు దర్బార్ నిర్వహించడానికి కలెక్టర్‌ను ఆహ్వానించి గిరిజన సమస్యలను విన్నవించుకునే సంప్రదాయాన్ని ప్రారంభించాడు. నాగోబా అనగా నాగదేవత ఈ జాతరలో పామును దేవతా రూపంలో పూజిస్తారు.

## గొల్లగట్టు జాతర :

సూర్యాపేట జిల్లాల్లో దురాజ్‌పల్లి గ్రామంలో "పాలశెర్లయ్య గట్టు" మీద ఈ జాతరను జరుపుకుంటారు. తెలంగాణ రాష్ట్రంలో సమక్క సారలమ్మ జాతర తరువాత అతిపెద్ద జాతరగా ప్రసిద్ధి చెందినది. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి 4 రోజుల పాటు కొనసాగుతుంది. లక్షలాది భక్తులు దర్శనానికై వస్తారు.

## కొండగట్టు జాతర :

కొండగట్టు జాతర జగిత్యాల జిల్లా మాల్యాల మండలంలోని ముత్యంపేట గ్రామ సమీపంలో ఉన్న ఆంజనేయస్వామి దేవాలయంలో జరుగుతుంది. ఈ దేవాలయంలోని విగ్రహంలో ఆంజనేయస్వామి ఒక వైపు, మరోవైపు నరసింహస్వామి ముఖం కల్గి ఉండటం ఈ దేవాలయం ప్రత్యేకత. శంఖు, చక్రాలు, హృదయంలో సీతారాములను కలిగి ఉండటం విశేషం.

## కొమురవెల్లి మల్లన్న జాతర :

ఇది సిద్ధిపేట జిల్లాలోని కొమురవెల్లి గ్రామంలో జరుగుతుంది. ఈ జాతర శివరాత్రి రోజున ప్రత్యేకంగా జరుగుతుంది. ప్రధాన దేవుడు మల్లికార్జునస్వామి (మల్లన్న). ప్రతిసంవత్సరం మాఘమాసం నుండి చైత్రమాసం వరకు మల్లన్న జాతర జరుగుతుంది.

## ఏడుపాయల జాతర (మెదక్ – నాగసాన్ పల్లి) :

మెదక్ జిల్లా నాగసాన్‌వల్లి గ్రామంవద్ద మంజీరానది ఏడుపాయాలుగా వేరుబడే చోట ఈ దేవాలయాన్ని 12వశతాబ్దంలో నిర్మించారు. అందుకే ఏడుపాయలు జాతరగా ప్రసిద్ధి చెందింది. ప్రతిసంవత్సరం శివరాత్రి రోజున ఈ జాతర జరుగుతుంది. ఈ జాతర మూడు రోజులపాటు జరుగుతుంది.

## గంగమ్మ జాతర :

సూర్యాపేట జిల్లాలోని నూతన కల్లు మండలం 'చిక్కమల్ల' గ్రామంలో గంగాదేవమ్మ ఆలయం ఉన్నది. ప్రతి సంవత్సరం ఉగాది నాడు ఈ జాతర జరుగుతుంది.

## మల్లూర్ జాతర :

ఈ జాతర జయశంకర్ భూపాలపల్లి జిల్లా మంగపేట మండం మల్లూర్‌లో జరుగుతుంది. ఈ జాతర మే నెలలో జరుగుతుంది. నరసింహస్వామిని పూజిస్తారు.

## వేలాల జాతర :

శివరాత్రి పండుగ నాడు ఈ జాతర జరుగుతుంది. మంచిర్యాలలోని చెన్నూర్ మండలంలోని వేలాల గ్రామంలో జరుగుతుంది. శివుని పూజిస్తారు.

## అయినవోలు జాతర :

వరంగల్ రూరల్ జిల్లాలోని అయినవోలులో మైలార్ దేవునికి ప్రతిసంవత్సరం ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈ జాతర 20 రోజులపాటు జరుగుతుంది.

## కొరివి జాతర :

మహబూబ్‌బాద్ జిల్లాలోని కొరివి శ్రీవీరభద్రస్వామి ఆలయంలో ప్రతి సంవత్సరం శివరాత్రి రోజు జరుగుతుంది.

## నల్లగొండ జాతర :

జగిత్యాల జిల్లాలోని కొడిమ్యాల మండలం నల్లగొండ గ్రామంలో ప్రతి సంవత్సరం మాఘ పౌర్ణమి రోజున నరసింహస్వామి పేరున ఈ జాతర జరుగుతుంది.

## తుల్జాభవాని జాతర :

నల్లగొండ జిల్లా చందంపేట మండలం పెద్దమునిగాల్ గ్రామంలో నవరాత్రి దసరా ఉత్సవాలలో భాగంగా తొమ్మిది రోజులపాటు జాతర జరుగుతుంది.

## గద్వాల్ జాతర :

జోగులాంబ గద్వాల జిల్లా గద్వాల్ పట్టణం కోటలోని శ్రీచెన్నకేశవస్వామి ఆలయంలో ప్రతి సంవత్సరం మాఘమాసంలో జాతర జరుగుతుంది.

## మల్దకల్ జాతర :

జోగులాంబ గద్వాల జిల్లాలోని మల్దకల్‌లో తిమ్మప్ప జాతర ఎంతో వైభవంగా జరుగుతుంది శ్రీవేంకటేశ్వరస్వామిని తిమ్మప్పగా కొలుస్తారు.

## చేవెళ్ళ జాతర :

చేవెళ్ళగ్రామంలో కొలవై ఉన్న శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి వారి ఉత్సవాలు ప్రతి సంవత్సరం చైత్ర మాసంలో జరుగుతాయి. ఈ సందర్భంగా ఘనంగా జాతర జరుగుతుంది.

## జోగినాథుని జాతర :

మెదక్ జిల్లా జోగిపేటలో కొండపై జోడులింగాలుగా వెలిసిన జోగినాథుని జాతర ప్రతి సంవత్సరం మార్చినెలలో జరుగుతుంది.

## కేతకి సంగమేశ్వరస్వామి జాతర :

సంగారెడ్డి జిల్లా ఝరాసంగం (జహీరాబాద్ సమీపాన) గ్రామంలో శ్రీకేతకి సంగమేశ్వరస్వామి ఆలయం ఉన్నది. ఇక్కడ ప్రధాన దైవం నల్లకొండ నరసింహస్వామి. ప్రతి సంవత్సరం మాఘ బహుళ దశమి నుండి ఫాల్గుణ శుద్ధ పాడ్యమి వరకు స్వామి వారి నవాహ్నిక బ్రహ్మోత్సవాలు జరుపుతారు.

## బెజ్జంకి జాతర :

ఈ జాతర సిద్ధిపేట్ జిల్లాలోని బెజ్జంకి అనే ప్రాంతంలో జరుగుతుంది. ఇక్కడ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం ఉంది. ఈ జాతర చైత్రమాసంలో జరుపుతారు.

## సింగరాయ జాతర :

సిద్ధిపేట జిల్లాలోని కోహెడ మండలంలో కూరెళ్ళలో ఈ జాతర జరుగుతుంది. ఇక్కడి ప్రధాన దైవం లక్ష్మీ నరసింహస్వామి ప్రతి సంవత్సరం పుష్యబహుళ అమావాస్య రోజున నిర్వహించబడుతుంది.

## తేగడ జాతర :

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని మణుగూరు మండలం తేగడ గ్రామంలో భద్రకాళి, వీరభద్రుల దేవాలయాలు ఉన్నాయి. ఈ దేవతలను మాఘ బహుళ త్రయోదశి, చతుర్ధశిలలో దేవతలకు కళ్యాణం నిర్వహిస్తారు.

## బుర్నూరు జాతర :

ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూరు తాలూకాలోని బుర్నూరు ప్రాంతంలో ఈ జాతరను జరుపుకుంటారు.

## మన్యంకొండ జాతర :

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి 16 కి.మీ. దూరంలో ఉన్న మన్యంకొండలో జరిగే జాతర ఇది. 'మూడు కొండల తిరుపతి'గా పిలవబడే మన్యంకొండలో శ్రీవేంకటేశ్వర స్వామి కొలువైనాడు. మాఘ పున్నమకు బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు.

## గంగాపురం జాతర :

మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల సమీపంలోని గంగాపురంలో ఈ జాతర జరుగుతుంది. శతాబ్దాల చరిత్రగల ప్రాచీనమైన ఇక్కడి చెన్నకేశవాలయంలో మాఘ శుద్ధ సప్తమికి భారీస్థాయిలో జాతర జరుగుతుంది.

## కురుమూర్తి జాతర :

మహబూబ్‌నగర్ జిల్లాలోని కురుమూర్తి గ్రామాన్ని ఆనుకొని ఉన్న కొండపై వెలసిన శ్రీ వేంకటేశ్వర స్వామి పేరుతో ఈ జాతర జరుగుతుంది. కార్తిక శుద్ధ సప్తమిన ఇక్కడ జాతర జరుగుతుంది.

## సిరసనగండ్ల జాతర :

నాగర్‌కర్నూల్ జిల్లాలోని వంగూరు మండలంలో గల చారకొండ వద్ద సిరసనగండ్ల జాతర జరుగుతుంది. సీతారాముల కళ్యాణం ఈ జాతరలో ప్రత్యేకతతో జరుపుతారు.

## సలేశ్వరం జాతర :

నాగర్‌కర్నూల్ జిల్లాలోని లింగాల మండలం అప్పాయిపల్లి గ్రామపంచాయితీ పరిధిలోని నల్లమల అటవీ ప్రాంతానికి చెందిన చెంచుజాతి వారు సలేశ్వర స్వామికి పౌర్ణమి రోజున జాతర జరుపుతారు. ప్రతి సంవత్సరం ఏప్రిల్ నెలలో చైత్రపౌర్ణమికి మూడు రోజుల ముందు మూడు రోజుల వెనుక మొత్తం వారం రోజులు నిర్వహిస్తారు.

## కోటంచ జాతర :

జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని కోటంచ గ్రామంలో ప్రతి సంవత్సరం ఫాల్గుణ శుద్ధ ఏకాదశి నుండి ఫాల్గుణ బహుళ విదియ వరకు బ్రహ్మోత్సవాల సందర్భంగా జాతర నిర్వహిస్తారు. ఇక్కడి ప్రధాన దైవం లక్ష్మీ నరసింహస్వామి.

## కూడెల్లి జాతర :

ఈ జాతర సిద్ధిపేట జిల్లా దుబ్బాక మండలం కూడవెల్లి గ్రామంలో కలదు. ఇక్కడ ప్రధాన దైవం రామలింగేశ్వరుడు. ప్రతి సంవత్సరం పుష్యబహుళ అమావాస్య నుంచి మాఘశుద్ధ తదియ వరకు నాలుగు రోజులు ఈ జాతర జరుగుతుంది.

## పుల్లూరు జాతర :

సిద్ధిపేట జిల్లాలోని పుల్లూరు గ్రామంలో 94 ఏకరాల విశాలమైన బండ మీద కాకతీయుల కాలంలో త్రికూటేశ్వర ఆలయం నిర్మించబడింది. ప్రతి సంవత్సరము ఈ జాతర జరుగుతుంది.

## దుద్దెడ జాతర :

సిద్ధిపేట జిల్లా కొండపాక మండలంలోని దుద్దెడలో ఈ జాతర జరుగుతుంది. ఇక్కడి ప్రధాన దైవం శంభుదేవుడు.

## భేతాళ జాతర :

మెదక్ జిల్లాలోని అల్లాదుర్గం మండల కేంద్రంలో భేతాళ జాతర జరుగుతుంది. భేతాళ స్వామికి ఇక్కడ తప్ప ఇంకెక్కడ దేవాలయం లేదు. ఈ జాతర వారం రోజుల పాటు జరుగుతుంది.

## చెర్వుగట్టు జాతర

నల్గొండ జిల్లాలోని నార్కట్‌పల్లి మండలంలోని ఎల్లారెడ్డి గూడెం గ్రామ సమీపంలో జరుగుతుంది. ఇక్కడి ప్రధాన దైవం శ్రీ జడల రామలింగేశ్వరస్వామి.

## మేళ్లచెర్వు జాతర :

సూర్యాపేట జిల్లాలోని హుజూర్‌నగర్ తాలూకాలోని మేళ్లచెర్వు గ్రామంలో ఈ జాతర జరుగుతుంది. ఈ జాతరలో శంభులింగేశ్వరస్వామి ప్రధాన దైవం.

## అడవి దేవునిపల్లి జాతర :

నల్గొండ జిల్లాలోని దామచర్ల మండలంలో గల అడవి దేవునిపల్లి గ్రామంలో ఈ జాతర జరుపబడుతుంది. ఈ జాతరలో ప్రధాన దైవం కనకదుర్గమ్మ తల్లి.

## కార్నేపల్లి జాతర :

భూపాలపల్లి జిల్లాలోని ములుగు నుండి 20 కి.మీల దూరంలో ఉన్న కార్నేపల్లి గ్రామపంచాయితీలోని నంద్రగూడెంలో ఈ జాతర జరుగుతుంది. ఇక్కడ సారలమ్మను పులి రూపంలో పూజిస్తారు.

## భూపతి జాతర :

భూపాలపల్లి జిల్లాలోని భూపతిపురంలో మాఘశుద్ధ పౌర్ణమి నుండి 11 రోజులపాటు ఈ జాతర పెద్ద ఎత్తున జరుగుతుంది. ఈ ప్రాంతంలో కోయలు కొండసారలమ్మ పేరుతో సారలమ్మను పూజిస్తారు.

## మునీశ్వరుల జాతర :

మునివంపుల గ్రామంలో రామన్నపేట మండలం భువనగిరి యాదాద్రి జిల్లాలో ప్రతి సంవత్సరం శ్రావణమాసం ఆఖరి శనివారమునాడు ఈ జాతర జరుపుకుంటారు.

## శంభులింగేశ్వరస్వామి జాతర :

నల్లగొండ జిల్లాలోని శాలిగౌరారం మండలంలోని చిత్తిలూరు గ్రామం మూసినది ఒడ్డున వెలసిన ఈశ్వరుడు వైభవంగా పూజలందుకుంటారు. ఈ గ్రామంలో ప్రాచీనకాలంలో శంభులింగేశ్వర దేవాలయం ఉన్నది. శివరాత్రికి ఇక్కడ జాతర జరుగుతుంది.

## అర్వపల్లి జాతర :

సూర్యపేట జిల్లా జాజిరెడ్డి గూడెం మండలానికి చెందిన అర్వపల్లి అనే గ్రామంలో ప్రతి సంవత్సరంలో ఎంతో ఘనంగా అర్వపల్లి లక్ష్మీనరసింహస్వామి జాతరను జరుపుకుంటారు.

## ముగింపు :

తెలంగాణలో విభిన్న కులాలు, మతాలవారు ఉన్నారు. తెలంగాణ సమాజంలో దాదాపు అన్ని జిల్లాల్లో పైనతెల్పిన జాతరలతోపాటు స్థానికంగా ఇంకా ఎన్నో జాతరలను జరుపుకొంటారు. తెలంగాణ సంస్కృతిలో జాతరలు ముఖ్యమైనవి చెప్పవచ్చు. కలిసి వెళ్ళడం, కలిసి జరుపుకోవడం, సామూహిక జీవనం వంటివి జాతరల ద్వారా చేకూరే గొప్ప ప్రయోజనాలని చెప్పవచ్చు. మచ్చుకు కొన్ని జాతరల వివరాను వివరించడం జరిగింది.

❀❀❀❀❀



# III. మన తెలంగాణ గురించి అర్థం చేసుకుందాం...

# 24. తెలంగాణ చరిత్ర - సంస్కృతి

తెలంగాణ సుందరమైన ప్రదేశం. భౌగోళికంగా సుసంపన్నమైన ప్రాంతం. నదులు, అడవులు, కొండలు, చెరువులు, వాగులు, నల్ల, ఎర్రరేగడి భూములు, గనులు, ఖనిజాలతో విలసిల్లుతున్నది. తూర్పున కందికల్ గుట్టల వరుస, పడమట బాలాఘాట్ పర్వతశ్రేణులు, ఉత్తరాన గోదావరీనది, దక్షిణాన కృష్ణానది సహజ సరిహద్దులుగా నెలకొని ఉన్న ప్రాంతం ఇది. గోదావరి నానుకొని దండకారణ్యం, కృష్ణనానుకొని నల్లమల అడవులు సహజ సంపద నిలయాలుగా ఉన్నాయి. భౌగోళికంగా ఎన్నో అనుకూలతలు, వనరులు ఉన్న ప్రదేశం కావటం వల్ల స్థానికంగా ఎంతో గొప్ప చరిత్ర, నాగరికత, సంస్కృతి వికసించినాయి.

### తెలంగాణ

నదులు, కొండలు, అడవులు అల్లుకొని ఉన్న ప్రదేశం కనుక వీటిని నమ్ముకొని ఎన్నో గిరిజన తెగలు జీవిస్తూ వచ్చాయి. కోయలు, గోండులు, చెంచులు, గుత్తికోయలు, కొండరెడ్లు, రాజ్‌గోండులు, కోలాములు మొదలైన ఆదివాసులు తమ ప్రత్యేక విధానాలతో జీవనం సాగిస్తున్నారు. క్రీస్తు పూర్వం వేల సంవత్సరాల నుంచి ఉనికిలో ఉన్న గోండులు ప్రాచీన ఉత్పత్తి కథను చెప్పుకుంటూ ' టేకం, మార్కం, పూసం, తెలింగం' అనే నలుగురు మూలపురుషుల్ని దేవతలుగా పేర్కొంటారు. ఇందులో 'తెలింగం' ప్రాచీన తెలుగు జాతి మూల పురుషుడని ఆరుద్ర భావించాడు. స్థానికంగా ప్రాచీన కాలం నుంచి 'తలైంగ్' జాతివారు నివసించారని 'తలైంగ్'లు నివసించినందు వల్ల 'తిలింగ' 'తెలుంగు' పదాలు వాడుకలోకి వచ్చాయని, వారు మాట్లాడే భాష 'తెలుంగు' అని, ఆ జాతి 'తెలుంగు' లని ఖండవల్లి సోదరులు భావించినారు. బర్మాలో నివసిస్తున్న ఒక తెగ ఇప్పటికీ తాము 'తలైంగ్' జాతి వారమని చెప్పుకొంటారని పేర్కొన్నారు. మార్కండేయ, వాయు పురాణాల్లో 'తిలింగ' ప్రస్తావనవుంది. గ్రీకుశాస్త్రజ్ఞుడు టాలెమి తన యాత్రాచరిత్రలో 'టిలింగాన్' పదాన్ని పేర్కొన్నాడు. ఈ 'తిలింగ' శబ్దమే 'తెలుంగు' శబ్దానికి మూలం. 'తెలుంగు' 'గణం' కలిసి 'తెలుంగణం'గా మారినట్లు భావించవచ్చు. మెదక్ జిల్లా తెల్లాపూర్‌లో బయట పడిన క్రీ॥శ॥ 1417 నాటి శాసనంలో 'తెలుంగణ' పదం, 1510 వెలిచర్ల శాసనంలో 'తెలంగాణ' పదం ప్రయోగించబడింది. అనంతర కాలంలో, వ్యవహారాల్లో 'తెలంగాణ' పదం విస్తృత ప్రచారంలోకి వచ్చింది.

### చరిత్ర

క్రీ.పూ. 600-400 కాలానికి సంబంధించిన వెండి నాణాలు బయటపడిన తర్వాత పురావస్తు పరిశోధనల ఆధారంగా 'గోపరాజు'లు పరిపాలించినట్లు చరిత్ర కారుల భావన. తర్వాత కాలంలో క్రీ.పూ 200 నుంచి క్రీ.శ. 200 వరకు శాతవాహనులు పరిపాలించినట్లు తెలుస్తుంది. తర్వాత విష్ణుకుండినులు, బాదామి చాళుక్యులు, వేములవాడ చాళుక్యులు, వాకాటకులు పరిపాలించారు. తదనంతరం కాకతీయుల సామ్రాజ్యం క్రీ.శ. 950 నుండి 1323 వరకు విస్తరిల్లింది. మునునూరు నాయకులు, పద్మనాయకులు, బహమనీలు(క్రీ.శ.1518-1686) అసఫ్ జాహీలు (క్రీ.శ. 1724- 1948) తెలంగాణ నేలను పరిపాలించారు.

### సంస్కృతి

ప్రజల ప్రధాన జీవనాధారం వ్యవసాయం. వ్యవసాయం ఆధారంగానే గ్రామాలు, చెరువులు, వృత్తులు, సంస్కృతులు నిర్మించబడుతూ వచ్చినాయి. నదులున్నప్పటికీ వాటిని వ్యవసాయానికి అనుగుణంగా మలచుకునే సాంకేతికాభివృద్ధి జరుగకపోవడం వల్ల వర్షాధారంగా వ్యవసాయం సాగింది. నీటి పారుదలకు ఉదక యంత్రాలు, ఏతాలు ఉపయోగించేవారు.

కాకతీయరాజులు తీసుకున్న ప్రత్యేక శ్రద్ధ వల్ల నీటిపారుదల కోసమే చెరువుల నిర్మాణం అధికంగా జరిగింది. పెద్ద చెరువులు, గొలుసు చెరువులు, చెరువుల వ్యవస్థ ప్రత్యేకంగా కనిపించటం వల్ల అప్పట్లో ఈ ప్రదేశాన్ని 'చెరువులదేశం'గా పిలిచేవారు. వరి, గోధుమ, నువ్వులు, పత్తి తృణధాన్యాలతో పాటు తోటల పెంపకం కూడా కొనసాగింది. ఆ క్రమంలో 'బాగ్'ల విస్తరణ 'బాగ్'ల (తోటలు)కు నెలవైన నగరం కనుకనే హైదరబాద్‌కు 'బాగ్‌నగర్' అనే పేరొచ్చింది.

వ్యవసాయం చుట్టూ అనేక వృత్తులు ఏర్పడ్డాయి. పనిముట్లు చేసేవారు. అవసరాలు చూసేవారు, పనులు చేసేవారు వివిధ వృత్తులుగా మార్పు చెందుతూ వచ్చినాయి. పురోహితులు, కంసాలి, కమ్మరి, కుమ్మరి, వడ్రంగి, చాకలి, మంగలి, పద్మశాలి, గొల్ల, బెస్త, గౌండ్ల, గాండ్ల, చర్మకార, వడ్డెర, ఎన్నో వృత్తులు కొనసాగుతూ వచ్చినాయి. శాతవాహనుల కాలం నాటికే నిర్మల్ కత్తులు ప్రసిద్ధి పొందినాయి. పట్టు వస్త్రాలకు పోచంపల్లి, గద్వాల ప్రపంచ ప్రసిద్ధి పొందినాయి. వ్యవసాయం, ఉత్పత్తులు, గ్రామం చుట్టూ ఎన్నో జానపద సంస్కృతి పండుగలు, జాతరలు వర్ధిల్లినాయి. రుంజలు, బైండ్లు, వొగ్గుకథ, శారదకథ, హరికథ, చిందు భాగోతం, బాల సంతులు, బుడిగెజంగాలు, గంగిరెద్దులు, సాధనాశూరులు, బహురూపులు, పెద్దమ్మలు, గుసాడీ నృత్యం, చెంచు, కోయ, బంజారా ప్రదర్శనలు కళకళనాడినాయి. బతుకమ్మ, బొడ్డెమ్మ, బోనాలు, వనభోజనాలు, పీరీలు, దసరా, రంజాన్, కాట్రావులు, కొత్తలు, సంక్రాంతి, ఉగాది, పెద్దలకు పండుగ, ఊరికి పండుగలు ఎన్నో కొనసాగుతున్నాయి.

పేరిణి తాండవం, లాస్యం, భజనలు, చిరుతలు, శిల్పకళ, పెంబర్తి జ్ఞాపికలు,నిర్మల్ బొమ్మలు, నకాశి చిత్రాలు, కరీంనగర్ వెండిపనులు ప్రత్యేక గుర్తింపు సాధించుకున్నాయి. సమ్మక్క సారక్కలు, బల్మూరికొండల రాయుడు, సర్వాయి పాపన్న, రాణిశంకరమ్మ, సోమనాద్రి, సదాశివరెడ్డి, రాంజీగోండు, కొమురంభీం, బండిసాయన్న, ఆరుట్ల రామచంద్రారెడ్డి, రేణుకుంటరామిరెడ్డి ఎందరోవీరుల సాహసగాథలు కళారూపాలు సంతరించుకొని వీరగాథలుగా విస్తరిస్తున్నాయి.

## ఉద్యమాలు

తెలుగు భాషా ఉద్యమాలు, గ్రంథాలయ ఉద్యమాలు, ఆంధ్రమహాసభ, ఆర్యసమాజం, రైతాంగ ఉద్యమం, తెలంగాణ ఉద్యమం, ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాలు, విప్లవోద్యమం, మద్యపాన వ్యతిరేకోద్యమం, జలసాధనోద్యమం, హరితహారం అనేక ప్రజా ఉద్యమాలు వర్ధిల్లి ప్రజాసమూహాలను చైతన్య పరుస్తున్నాయి. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ పథకాలు ప్రజలను ఎంతో ఆకట్టుకుంటున్నాయి.

## తెలుగు భాష

తెలంగాణ ప్రజలు వ్యవహరించే తెలుగు విశేషమైంది. ఎన్నో ప్రత్యేకతలు కలిగిఉంటుంది. గ్రాంధికానికి, మంచి తెలుగుకు దగ్గరగా, వ్యాకరణ ప్రమాణాలతో కూడి ఉంటుంది. లయ బద్ధంగా ఉండటం వల్ల, ద్రుతాత్మకంగా ఉచ్చరించడం వల్ల వినసొంపుగా ఉంటుంది. జీవితానుభవాలలో వికసించిన సామెతలు, నానుడులు, పలుకు బడులు సహజంగానే ఇమిడి ఉండటం వల్ల అర్థవంతమై అలరిస్తుంది. సహజత్వం, సరళత్వంతో పాటు సృజనాత్మకంగా సాగిపోతుంది. భావాలను ప్రసన్నంగా వ్యక్తం చేసే పద్ధతివల్ల 'జాను తెనుగు'గా ప్రశంసలందుకున్నది. కమ్మని ధ్వనులకు, కమనీయ అలంకారాలకు నెలవైన భాష. జానపద గీతాలకైనా, పద్యకావ్యాలకైనా, అలవోకగా ఒదిగిపోయే అందమైన భాష. సంస్కృత, ఉర్దూ, ఫారశీ, అరబ్బీ, ఆంగ్ల, హిందీ పదాలను కలుపుకోగల విశాలతత్వం వల్ల పదవిస్తృతి సాధించి కొత్త సొబగులతో పురోగమించే భాష.

## సాహిత్యం

తెలుగులో తొలి ప్రాచీన కంద పద్యాలు బొమ్మలమ్మగుట్ట శాసనంలో లభించి క్రీ.శ. 9 శతాబ్ది నాటికే ఛందోబద్ధ సాహిత్యమున్నదని నిరూపిస్తున్నాయి. కన్నడంలో, తెలుగులో పద్యాలు రాసిన పంపమహాకవి చరిత్ర తెలంగాణ గర్వకారణం. మల్లియరేచన రచించిన 'కవిజనాశ్రయం' తెలుగులో తొలిఛందోగ్రంథం. 'వృషాధిప శతకం' పేరుతో తొలిశతకాన్ని పాల్కురికి సోమన రచించాడు. తొలిచతురర్థి కావ్యం తెలంగాణ నుంచి వచ్చింది. మరింగంటి సింగరాచార్యులు రచించిన నలరాఘవ యాదవపాండవయం ఏకామ్రనాథుడు రచించిన "ప్రతాపరుద్ర చరిత్రము" తెలుగులో తొలి చరిత్ర గ్రంథం. అదే విధంగా మొదటి అచ్చతెనుగు కావ్యం "యయాతిచరిత్ర"ను పొన్నగంటి తెలుగన రచించాడు.

బహుముఖ ప్రజ్ఞావంతుడు సామాజిక చైతన్యానికి బీజంవేసిన పాల్కురికి సోమన తెలంగాణ ఆదికవి. సంస్కృతం, తెలుగు భాషల సమన్వయంతో, పురాణగాథలను మన జీవితంలో అనుసంధానించుకొని కడు మనోహరంగా సృజించిన బమ్మెరపోతన 'శ్రీ మద్భాగవతం' ప్రత్యేక రచన. వీరశైవ సాహిత్యం విస్తరించినంత గంభీరంగా వైష్ణవ సంప్రదాయాన్ని నిలబెట్టిన సాహిత్య సృష్టి జరిగింది. గోనబుద్దారెడ్డి 'రంగనాథ రామాయణం' ద్విపద ఛందంలో సాగినా హుళక్కి భాస్కరుడు 'భాస్కర రామాయణం' సంప్రదాయ ఛందంలో సాగినా ఇక్కడి రాజ, ప్రజాభిరుచికి ప్రతిబింబాలే. గౌరన 'హరిశ్చంద్రోపాఖ్యానం' రచించి సత్యనిరతిని చాటి చెప్పాడు. విద్యానాథుడు రచించిన 'ప్రతాపరుద్రయశోభూషణం' లక్షణాలంకార శాస్త్ర గ్రంథాలకే తలమానికం. తొలి సంకలన గ్రంధాన్ని 'సకల నీతిసమ్మతం' సంకలనం చేసిన ఉదార సాహితీ హృదయుడు మడికిసింగన. స్వతంత్ర కావ్యకర్త అయినా ఇతర కవులను సంకలనం చేసి కొత్త దారివేశాడు. చరిగొండ ధర్మన కాల్పనిక భావనలను ప్రవేశపెట్టి 'చిత్ర భారతాన్ని' సృష్టించాడు. తెలంగాణ సామాజిక చిత్త వృత్తాన్ని సంస్కృతీ విశేషాల్ని ప్రత్యేక కావ్యంగ మలిచి కొఱవి గోపరాజు 'సింహాసన ద్వాత్రింశిక' రచించాడు. జానపద, సాంప్రదాయిక, ప్రజాస్వామిక సాహిత్యాలు విస్తృతంగా వర్ధిల్లినాయి.

*– **డా॥ నందిని సిధారెడ్డి,** అధ్యక్షులు,*
*తెలంగాణ సాహిత్య అకాడమీ గారి వ్యాసం*

❀❀❀❀❀



# 25. తెలంగాణ భాష నుడికారాలు - మమకారాలు

తెలుగులో ఆధునిక ప్రమాణ భాష, తెలంగాణ భాష... ఈ రెండూ వేరు వేరు. ఆ మాటకొస్తే ఈ భేదాలు దాదాపు ప్రతిభాషలోనూ ఉంటాయి. ఆధునిక ప్రమాణ భాష అన్నది రాష్ట్రంలో అభివృద్ధిచెందిన ప్రాంతాల శిష్టభాష. ఈ మూస భాషలోని నుడికారాలకూ, తెలంగాణ భాషలో ఉన్న నుడికారాలకూ తేడా తప్పనిసరిగా ఉంటుంది. రెండు ప్రాంతాలు వేరయినప్పుడు, ఆ రెండు ప్రాంతాల అభివృద్ధుల్లో తేడాలు ఉన్నప్పుడు, సంస్కృతీ ప్రసరణ అంతగా లేనప్పుడు, ఇంకా ఇంకా అనేకానేక కారణాలు తోడైనప్పుడు దేని ప్రత్యేకతలు దానికుంటాయి.

నుడికారాలు ఏ భాషకైనా సహజ భూషణాలు. ఈ నుడికారాల్లో కనిపించే ప్రేమలు, మమకారాలు ప్రాంతీయ భాషల్లో అత్యంత సహజంగానూ, మిక్కిలి మమకారంతోనూ, అసలు సిసలు జీవంతోనూ తొణికిసలాడుతుంటాయి. నాగరిక సమాజాల్లోకన్నా ప్రేమలూ, కోపాలూ, తాపాలూ, వలపోతలూ, ఏడ్పులూ గ్రామీణ ప్రాంతాల్లో సహజంగానే ఎక్కువ.

తెలంగాణ భాష జీవద్భావ. తెలంగాణ భాష ప్రజల భాష. నుడుల్లో (మాటల్లో పదాల్లో), నానుడుల్లో (సామెతల్లో), నుడికారాల్లో (జాతీయాల్లో, పదబంధాల్లో) పదిలంగా ఉన్నది. శ్రమైక జీవన సౌందర్యంతోపాటు బతుకు వాసనలతో భాషిల్లుతున్న భాష తెలంగాణ భాష.

తెలంగాణలో ‘‘తమ్మీ! మంచిగున్నావా?’’ అన్న ఆప్యాయమైన పలకరింపు ఉంది. ఆధునిక ప్రమాణ భాషలో ఇది ‘‘తమ్ముడూ! బావున్నావా?’’ అన్న రూపంలో ఉంది. “తమ్ముడూ!” అన్న సంబోధన కన్న “తమ్మీ” అనే పిలుపు ఎంతో ప్రేమాన్వితంగా ఉన్న మాట. దగ్గరితనాన్ని సూచిస్తున్న పదం. పైగా భాషాపరంగా తమిళ “తంబీ”కి దగ్గర (అంబ-అమ్మ; నంబిక్కై-నమ్మిక; నింబూ-నిమ్మ; బింబి-బిమ్మి; తంబి-తమ్మి పురుగు) ఈ పిలుపులోని మరో అర్ధభాగమైన “మంచిగున్నవా?” అంటే యోగక్షేమాలు విచారించడం “బాగున్నావా?” అంటే యోగక్షేమాల విచారణతోపాటు బాగుగా ఉంటే పుష్కలంగా, విరివిగా, సమృద్ధిగా అని అర్థమూ స్ఫురిస్తున్నది.

“వారి!” అనేది తెలంగాణలో సంబోధనా విభక్తి ప్రత్యయం. ఇది “ఓరి”కి రూపాంతరం. “వారీ! ఎటు పోతివిరా? నీ కోసం చూసి చూసి నీ దోస్తు ఇప్పుడే పోయిండు. నువ్వు ఏ పని చేసినా గింతేరా?” అన్న వాక్యాల్లోని సంబోధన మాట్లాడే మనిషితో సంబోధించబడే మనిషికున్న సాన్నిహిత్యాన్ని చూపిస్తున్నది. పైగా “ఓరీ!లో లేని ఉచ్చారణా విధేయత “వారీ”లో నిలుస్తున్నది వారితోపాటు తెలంగాణలో అదనంగా “ఓరి వారీ” అనే పిలుపు కూడా ఉంది.

ఇంటికి అత్యంత గౌరవార్హుడైన అతిథి వచ్చినప్పుడు తెలంగాణలో “నా తండ్రి వచ్చిండు చూడు. నా మీద ఎంత దయనోనా తండ్రికి” వంటి వాక్యాలు మాట్లాడుతారు. ఇక్కడ తండ్రి పదం పితృదేవునికున్న గౌరవాన్ని అతిథికి ఆపాదిస్తున్నది. ఆధునిక ప్రమాణ భాషలో “పుట్టినిల్లు” అన్న పదం ఉంది. దీనికి సమానార్థంగా తెలంగాణలో ‘తల్లిగారిల్లు’, ‘అవ్వగారిల్లు’ లాంటి పదాలు వాడుకలో ఉన్నాయి. పుట్టడం ఎక్కడయినా జరగొచ్చు. కానీ తల్లిగారిల్లు, అవ్వగారిల్లు అనే పదాలు పుట్టిన బిడ్డకు తల్లితోనూ, అవ్వతోనూ, ఇంటితోనూ ఉన్న పేగుబంధాన్ని చెప్పకనే చెబుతున్నాయి. నిజానికి తెలంగాణలోని సంబోధనలన్నింటిలోనూ దాదాపుగా బంధు(త్వ) వాచకాల ప్రస్తావన ఉంటుంది. వావి వరుసలతో పిలుచుకోవడం సర్వసాధారణం. ఇలా పిలుచుకోవడం మానవ సంబంధాలను పదిలపరుచుకోవడం. ఇంకా చెప్పాల్సివస్తే రక్తసంబంధాల్లాంటి అనుబంధాలనూ, అనురాగాలనూ పటిష్టపరుచుకోవడం.

చెల్లే, అవ్వా, నాయినా, అన్నా, బావా, వదినే, మర్దలు పిల్లా, తాతా, బాపూ, చిచ్చా, కాకా... లాంటి మాటలతో...

వావి వరుసలు కలుపుతూ పిలవడం ఆత్మీయతనూ, అనురాగాన్నీ పంచుకోవడం. మాటలతో గెలుచుకోవడం. భాషల్లో మాట (పదం) చాలా ముఖ్యమైన, మూలభూతమైన అంశం. మాటలతో కోటలు కట్టవచ్చు. గొడవలు తెచ్చుకోవచ్చు. మనుషులను గెలుచుకోవచ్చు. మాటే మంత్రం. వావి వరుసలతో ఉన్న మాటలు అవతలి వాళ్ళని మంత్రముగ్ధుల్ని చేస్తాయి. మమతకు వారధిగా మనుషుల మధ్య నిలుస్తాయి. "నాలుకా, నాలుకా వీపుకి దెబ్బలు తేకే" అన్నది జానపదులకి బాగా తెలిసిన సామెత కదా!

చిన్న పిల్లల్ని బుజ్జీ, బుజ్జమ్మా, బుజ్జవ్వా, బిజ్జీ, బుచ్చీ, బుచ్చవ్వా, చిట్టీ, పొట్టి, చిట్టితల్లీ,బంగారు తల్లీ, గున్నతల్లీ, నానీ, అమ్మా... లాంటి పిలుపులతో బుట్టలో పడేస్తారు. కాదు గుండెల్లో దాచుకుంటారు. అలతి అలతి పదాలకు మమకారలేపనం చేస్తారు. పిల్లల్ని ఆకర్షిస్తారు. పిల్లల్ని ప్రేమిస్తారు. తెలంగాణలో "సంటోడు" అనే పదం కూడా ఆత్మీయంగా ఉంది. "జెర్ర ససుండ్రి. సంటోడు నిద్రపోతున్నాడు లొల్లి చెయ్యకుండ్రి" అనే వాక్యాల్లోని 'సంటోడు'కి అర్థం ఇంకా చన్నుపాలు మరవని, మరిచినా పెద్దగా వయస్సురాని పిల్లాడు అని, (చను+టి– చంటి; కన్ను+టి– కంటి; పన్ను+టి– పంటి; మెన్ను+టి– మింటి మొ॥వి)

తెలంగాణ సంబోధనల్లో 'బై' అన్నది ఒక ప్రత్యేకమైన మాట. "అరే ఏంది బై? అంత ఎట్లెట్లనో చెయ్యవడితివి. నీ కోసం ఎంతకని ఎదురుచూడాలె?"

ఇక... "నాయినా! ఎట్లున్నవే?" "చెల్లే! ఊకోరాదే?" మొదలైన వాక్యాల్లోని చివర ఉన్న "ఏ" ఆత్మీయతకు చక్కని నిదర్శనం. ఇది కావ్య భాషలో కూడా ఉంది. అభిమానధనుడైన పోతన "కారే రాజులు, రాజ్యముల్ కలుగవే, వారేరీ సిరిమూట కట్టుకుని పోవంజాలిరే, భూమిపైన పేరైనం గలదే..." అన్నాడు భాగవతంలో. గ్రాంథిక భాషలో ఉన్న ఈ పద్ధతి తెలంగాణలో ఇప్పటికీ చెక్కు చెదరకుండా ఉన్నది.

ఇట్లాంటి సంబోధనల్లోనే కాకుండా తెలంగాణ నుడికారాల్లోనూ నిలువెల్లా మమకారం జాలువారుతున్నది. పెద్దవాళ్ళు చిన్నవాళ్ళను ఆశీర్వదించేటప్పుడూ, చేసిన సాయానికి కృతజ్ఞతలు చెబుతున్నప్పుడూ... "నీ కడుపు సల్లగుండ", నీ కడుపు నంబలి వడ", "సద్ది తిన్న రేవు తలవాలె" లాంటి వాక్యాలు అలవోకగా వస్తాయి. "నీ కడుపున అంబలి వడ" అంటే 'నీ కడుపులో అంబలి పడనీ' అని అర్థం. అంతకన్నా దీవెన ఏం కావాలి? ఏ రేవుకి మనం వెంట తెచ్చుకున్న చద్దిమూటను విప్పి ఆకలి తీర్చుకుని ప్రయోగాన్ని కొనసాగిస్తామో...ఆ రేవును, మజిలీని మరిచిపోవద్దు. తప్పక తలచుకోవాలి.

తల్లిదండ్రుల్ని అవసాన దశలో చక్కగా అరుసుకొని (అరసి) సేవలు చేసినవాళ్ళను ఉద్దేశించి "వాల్లు అయ్యవ్వను పువ్వులల్ల పెట్టుకుని చూసిండ్రు. పండును పారేసినట్లు పారేసిండ్రు" అంటారు. పిల్లలు వృద్ధులైన తల్లిదండ్రులకు చేసిన పరిచర్యల్ని కవితాత్మకంగా వెలిబుచ్చిన ప్రకటన ఇది. మన శరీరభాగాల్లో చేతులు కూడా ఉన్నాయి కదా! వీటిల్లో కుడిచేయి, ఎడమచేయి అని రెండు రకాలు, కుడి చేయి అంటే మనలో చాలా మందికి కుడిచే చేయి అని తెలియదు. కాని తెలంగాణలో ఈ చెయ్యిని "బువ్వ చెయ్యి" అంటారు. ఎంత గొప్ప మాట ఇది! సహజత్వాన్ని నిలుపుకున్న మాట! బువ్వ చెయ్యి అనగానే మనకే తెలియని మమకారాదులు కలుగవా? వధూవరుల్ని తెలంగాణ భాషలో "పిల్ల, పిల్లగాడు" అనే కాకుండా "పిల్ల, పిన్న"డు అని కూడా వ్యవహరిస్తారు. పిన్నడు అనే పదం ఆలుమగల బంధాన్ని తెలుపుతున్నది. అట్లాగే వాళ్ళకు ముందు ముందు ఎంతో బతుకుంది. ఎంతో భవిష్యత్తుంది. చాలా సాలోచనగా సాభిప్రాయంగా చెప్పాలనుకున్నప్పుడు 'అరేయ్! వాల్లు బతుకపుట్టినోల్లురా. మనదంటె ఏదో అయిపోయిందిగాని వాల్లు సల్లగుండాలే' లాంటి వాక్యాలు పెద్దవాళ్ళు మాట్లాడుతారు.

తెలంగాణ భాషలో నుడుల్లో కూడా ప్రత్యేక కనిపిస్తుంది. ఉదాహరణకు పాఁవురం (పాయిరం) అన్న మాట పరిశీలనార్హం. పాఁవురం అంటే కపోతమనే పక్షి అని అందరికీ తెలుసు. ఇక్కడ పాఁవురం అంటే వాచ్యార్థం కాదు. అట్లాగని వ్యంగ్యమూ కాదు. తెలంగాణలో పాఁవురం ముదిగారువం, ననుగారం, పట్టి (రమి), కన్నెర్లు... ఇలాంటి అనేక అర్థాలు స్ఫురిస్తాయి. "వాల్లకు నామీద మస్తు పాయిరం. నేనే వాల్లను లెక్క చెయ్యలేదు. నేనత్తు గుర్రపు బెయిమాద్‌ను" అనే మాటల్లోని పాఁవురానికి అర్థం అభినామనమే! పావురం శాంతికి, సామరస్యానికీ, ముగ్ధత్వానికీ, అమాయకత్వానికీ, అందానికీ, అణకువకీ, సంకేతం అవన్నీ కలగూసి తెలంగాణ పావురంలాగా ఉన్నాయి.

శోక ప్రకటనల్లో సైతం తెలంగాణ మాటలు ఎంతో సహానుభూతిని నిలువెల్లా మోసుకొస్తాయి. అకటా, అక్కటా, కటా, కటకటా, అయ్యో... మొదలైన సంప్రదాయబద్ధమైన శిల్పాకృతమైన మాటలు తెలంగాణలో ఎంత సహజంగా ఉంది చూడండి. అవ్వల్లా అయ్యల్లా, అయ్యా, అవ్వబిడ్డా మొదలైనవి "అవ్వబిడ్డా! ఎంత గోరం జరిగిపోయిందే తల్లీ! ఆ పొల్ల ఎట్ల బతుకాలె మొగన్ని పోగొట్టుకొని" అంటుంటారు. 'అవ్వ' అన్న మాట జరిగిన ఘోరాన్ని చెబుతుంటే, "బిడ్డా" అనే పదం మాటసాయం కాదు. ఒక సహానుభూతి. అంతేకాదు "అబ్బా" అనే మాట కూడా ఇలాంటి సన్నివేశాల్లో ప్రయోగింపబడుతూ ఉన్నది. ''అబ్బా! ఎంత దెబ్బ తాకిందో చూడు (ఎంత గాయమైందో చూడు)" మొదలైనవి ఇలాంటివి.

ప్రయాణాలు చేస్తున్నప్పుడూ, ఇంటికొచ్చిన వాళ్ళను సాగదోలుతున్నప్పుడూ, ఇతర సందర్భాల్లోనూ వెంటనే తెలంగాణీయుల నోటి నుండి జాలువారే మాట "పైలం (పదిలం) బిడ్డా" అనేది. వెళ్ళిన చోట ఎంతో పదిలంగా (భద్రంగా) ఉండమని చెప్పడం. ప్రమాణ భాషలో కూడా జాగర్త (జాగ్రత్త) అని జాగరూకతా, మెలకువా అవసరం సుమా! అని చెబుతారు.

తెలంగాణ భాషలో అర్థింపులు కూడా ప్రేమాన్వితంగా ఉంటాయి. ఎదుటి వ్యక్తిని ఎంతో ప్రాధేయపడుతున్నట్లు "బాబు! (అబ్బాయ్!) నాకు అర్జెంటు పనుంది. ఒక్క అడుగు గాందాక పొయ్యి రారాదు" అనే వాక్యంతో చేరాల్సిన గమ్యం ఒక్క అడుగు దూరంలో లేనప్పటికీ, బతిమాలడం ద్వారా ఎదుటివ్యక్తి ఎంతదూరమైనా వెళ్ళి పనిపూర్తిచేసుకొచ్చే అవకాశం ఉంది. అట్లనే "గిది లేస్త లేదు. జెర్ర ఎత్తి పో పిలగా. ఒక్క చెయ్యి వెయ్యరాదు!" అనడం పరిపాటి. గంపలు మొదలైన బరువులు నెత్తిమీదికి ఎత్తుకోవడంలో సాయాన్ని అర్థిస్తూ అనే మాట ఇది.

ఎవరైనా ముభావంగా ఉన్నప్పుడూ, ఎన్నిసార్లు ప్రశ్నించినా ఏమీ చెప్పనప్పుడూ, తన మనోగతాన్ని ఏ మాత్రం విప్పనప్పుడూ "అయ్యా ఏందయ్యా! అసలే మాట్లాడుతలెవ్వు. నోట్లె బెల్లంగడ్డ గిట్ట పెట్టుకున్నావా ఏందది? మాట్లాడితె నీ నోటి ముత్యాలు రాలి పోతయా ఏంది?'' అంటారు తెలంగాణలో. నోటి ముత్యాలు రాలిపోతాయా అనడం ఎంత గొప్పగా ఉంది! ఒక మనిషి మరొకరిని ఉద్దేశించి "నీకు తప్పక బియమయితది. ఈ కష్టాలు ఎల్లకాలం ఉండయి. గడ్డకు పడుతవు" అని ధైర్యం చెప్పాడనుకోండి ఆ మాటలు విన్న మనిషి "నీ నోటి వాక్యాన అట్లనే కాని" అంటాడు. ఇట్లాంటి ప్రేమాన్వితమైన మరొక దీవెన : "నా ఆయుషు కూడా పోసుకొంని సల్లంగ బతుకు బిడ్డా!" ఎంత గొప్ప మాట ఇది! పురాణకాలంలో ఒకరి ఆయుష్షు మరొకరికి ఇవ్వడం విన్నాం. పైగా ఇక్కడ ఆయుష్షు ఇచ్చి తీసుకుని అనడంలేదు. ఆయుష్షు పోసుకొని అంటున్నారు. అందులో స్వీయ ప్రత్యయ త్యాగం ఉంది.

"తోడపుట్టిన తోడు దొర్కుతదా?" అనేది తోబుట్టువుల ప్రాముఖ్యాన్ని తెలంగాణ పదబంధం. ఏ కారణంగానైనా సోదరీసోదరుల అనుబంధం సడలిపోయినప్పుడు మల్లా వెంటనే స్ఫురించే నుడికారమిది. భారతకాలం నుండి అన్నదమ్ముల మధ్య కలహాలు చూస్తున్నాం. ఎంత కలహించుకున్నా అన్నతమ్ములు మూడోవాడు వచ్చినప్పుడు కలిసి పోతుంటారు. ఆపదల్లోనూ కలిసిపోతుంటారు. ఇట్లాంటి ఎన్నో సందర్భాలను చూసి అనుకుంటాను "ఎవని నెత్తురు వానికి కొట్టుకుంటుంది" అనే నుడికారం పురుడు పోసుకుని ఉండాలి. రక్త సంబంధం తిక్త సంబంధం, ఉత్తి సంబంధం కాదని చెబుతున్నారు. తెలంగాణీయులు, ''నెత్తురు కొట్టుకోవడం'' అంటే మమకారంతోనే కదా!

వివాహాది సందర్భాల్లో ఒక కుటుంబానికి చెందిన సభ్యులందరూ హాజరైనప్పుడూ, అనేక కుటుంబాల వాళ్ళంతా ఉపస్థితులైనప్పుడూ ఆధునిక ప్రమాణ భాషలో "ఇంటిల్లిపాదీ" వచ్చారంటారు. తెలంగాణ భాషలో దీన్ని "ఇంటి ఇల్లాదులు" లేదా "ఇంటింటి (మా) రాజులు" వచ్చింద్రు అంటున్నారు. ఇంట్లో ఉన్న ఒక వ్యక్తికీ (మహా) రాజ దశపట్టించడం కన్న మహర్దశ మరొకటి ఉంటుందా? "ఇంటింటి రాజులు" అనడం వచ్చిన వాళ్ళను గౌరవించడం, ప్రేమాభిమానాలతో అతిథుల్ని రాజదశకు ఉదాత్తీకరించడం.

కూటికి మొహం వాచిన నిరుపేదలను చూసి "పాపం! వాల్లు కడుపుల పేగుల్లేనోల్లు" అని వ్యవహరిస్తారు తెలంగాణ భాషలో. ఇది దయతో, తదానుభూతితో కూడిన సాహసం. కడుపులో పేగుల్లేనోల్లు అంటే అత్యుక్తి ధ్వనించవచ్చు. కానీ పేదరికాన్ని వ్యక్తీకరించే చక్కని పదబంధమిది. ఆధునిక భాషలోని అంటుకడుపు అన్నమాట. పిల్లల్ని ప్రేమానురాగాలతో బాధ్యతగా పెంచినప్పుడూ, కంటికి రెప్పలా కాపాడుకున్నప్పుడూ

"ఆమె పిల్లల్ని ఒల్లె పెట్టుకుని సాదుకున్నది", "ఆమె పిల్లల్ని కడుపులో పెట్టుకుని సాదింది" అంటారు. గర్భవతులు ప్రసవవేదన పడుతున్నప్పుడు "ఆ పొల్లమస్తు ఆపతి పడుతుంది. ఎట్ల కాన్పు అయితదో ఏందో" అంటుంటారు. తెలంగాణ భాషలో ఆపతి (ఆపద) అంటే పురుటినొప్పులు, ప్రసవవేదన, సచ్చి పుట్టుడు.

ఆధునిక ప్రమాణ భాషలో ఉన్న "ఆప్తబంధువు" అన్న సమాసానికి తెలంగాణలో "పానమసొంటి సుట్టం" అనే మాట వాడుకలో ఉంది. ఆ చుట్టం ప్రాణంలాంటివాడు. అంతకన్నా ఆప్తమైనది ప్రపంచంలో మరేదీ లేదు. వాడంటే నాకు ఆరోప్రాణం, బహిఃప్రాణం, పంచప్రాణాలు అనే గొడ్డు వీరగ్రాంథికాలకు ధీటుగా తెలంగాణలో ఒక దొడ్డ మాట "నాకు వాడంటే సానాపానం" అనేది ఉంది. తెలుగుతనమైన మాటలకు తెలంగాణం గొప్ప కాణాచి.

ప్రపంచంలో బావా బావమరుదుల బంధం చాలా గొప్పది. వీళ్ళిద్దరి అనుబంధాన్ని చెప్పే సామెతలు సాహిత్యంలో కోకొల్లలు. బావమరిదిని తెలంగాణలో "సాలెగాడు" అంటారు. బావమరిది అనే మాటతో "గాడు" నిందార్థ సూచకం కాదు. బావతో బావమరిదికి ఉన్న సాన్నిహిత్యాన్ని సూచించే పదం. ఒక "సాలె" అంటే ఉర్దూపదమని ముక్కువిరుస్తారు కొందరు. అంతేగాక తెలంగాణ భాష అంతా తౌరాక్యాంధ్రం అంటారు. ఉర్దూ సైతం ఈ మట్టి మీదే పుట్టి పెరిగిన భాష, ముస్లిముల పాలనలో పాలలో పంచదారలా ఉర్దూ కలిసిపోయింది. దీన్ని ఎవరూ తప్పించలేరు కదా! పైగా చాలా పదాలకు సంస్కృతమే మాతృక, సంస్కృత 'శ్యాలః' కదూ 'సాలె'కు పురుడుపోసింది. తెలంగాణలో మరొక అబ్బురమైనది 'అబ్బా' పదం. అమ్మాయిల్లో ఈ పదం బహుళవ్యవహారంలో ఉంది. 'అబ్బా! ఏందబ్బా! జెర్ర రారాదా అబ్బా! నానొక్కదానికి బయమైతదబ్బా" లాంటివి.

"మా ఆయినె రెక్కలు సల్లగుండాలె గని మాకేం తక్కువ గాదు, నీ బాంచెనైతె అదె పాయె తియ్యి, సచ్చి నీ కడుపుల పుడుత, పిల్లి ఏడిండ్లు తిప్పినట్లు, తల్లి కడుపుల పొద్దు పడుడు, పిల్ల పిల్లగాన్ని ఇల్లు నింపుడు (పెళ్ళయ్యాక నూతన వధూవరుల్ని ఇంటికి తీసుకురావడం. తెలంగాణలో ఇల్లు నింపడం ఎంత గొప్పమాటో? (కొత్త పెళ్ళి జంటతో ఇంటికి నిండుదనం వచ్చేస్తుందన్న మాట) నోట్లెపండు, జాలిగుండె, నల్లవడుడు (తినడం), కడుపుల దయ పట్టుడు... లాంటి వందలాది వేలాది నుడులు, నుడికారాలు, నానుడులు ఎలాంటి నాన్చుడు లేకుండా ప్రజల నోళ్ళలో నానుతున్నాయి. పరాయీకరణకు గురైన తెలంగాణలోని విద్యావంతులకు సాహిత్యంలోని అస్తిత్వవాదం (అస్తిత్వవేదం) మళ్ళీ తల్లి మాటల రుచిని చూపించింది. నిజమే! ఇవాళ తెలంగాణీయులకు చిన్నప్పటి ముచ్చట్లు గుర్తుకొచ్చి మన్ను కొట్టుకుంటున్నది. ఆనాటి దోస్తులతో చిన్నప్పటి మాటలతోనే మాట్లాడుకోవాలని మన్నుగుంజుతున్నది. అదిగూడ కడుపునిండ (మనస్ఫూర్తిగా) మాట్లాడుకోవాలని మన్ను గుంజుతది. ఆధునిక ప్రమాణ భాష పోతపాలవంటిదని, తెలంగాణ భాష తల్లిపాలసొంటిదనీ, ఎవ్వలు గూడ తల్లి భాషను యాదిమరిచిపోవుడు మంచిదిగాదని ఆలిశెంగానైనా జెర్ర సురుకుపడుతుంది... కనువిప్పు కలుగుతుంది.

*– డాక్టర్ నలిమెల భాస్కర్ గారి వ్యాసం*

❀❀❀❀❀

# 26. తొలి సాహితీ ప్రక్రియలు

**నాయొదయండ, నావిభుడ, నా హృదయేశ్వర నామనోరమా!**
**నాయిల వేల్ప, నా వరద! నాగురు లింగమ! నాదు జంగమా!**
**నాయధినాథ, నావరుడ నన్ను గృపామతిం బ్రోవుమయ్యదే**
**వా! యమ బృందవంద్య బసవా! బసవా! బసవా! వృషాధిపా!**

**– వృషాధిప శతకం**

ఈ పద్యం తొలి తెలుగు శతకంలోనిది. ఈ శతక ప్రక్రియ తెలుగులో అజరామరమైనది. తెలంగాణ గడ్డ దీనికి పురుడు పోసింది. దీనికి మాత్రమేకాదు. ఇంకా అనేక ప్రక్రియలకు తెలంగాణమే పుట్టినిల్లు. భాషా సుసంపన్నతకు ప్రక్రియలు చేసిన మేలు అనంతం.

### తెలంగాణ తెలుగు భాష

'తెలంగాణ' పదానికి తెలుగు భాషనే మూలమని తెలుస్తున్నది. క్రీ.శ రెండో శతాబ్దానికి చెందిన 'టాలమీ' (గ్రీకుదేశం) తెలుగులు నివసించే ప్రాంతాన్ని 'ట్రిలింగాన్ అన్ని పేర్కొన్నట్లు తెలుస్తున్నది. బర్మాకు వలసపోయిన తైలంగులు, తెలగాణ్య బ్రాహ్మణులు, తెలగాలు మొదలగు వారంత తెలంగాణ ప్రాంతం వారే. క్రీ.శ.9వ శతాబ్దపు సంస్కృత కవి రాజశేఖరుడు తన విద్ధిసాలభంజికలో ఉపయోగించిన 'త్రిలింగ' పదం ఉండనే ఉంది. మార్కండేయ, వాయు పురాణాల్లో కూడ 'తిలింగ' పదముంది.

వీటినటుంచి పూర్వపు కరీంనగర్ (నేటి జగిత్యాల జిల్లా) జిల్లాలోని కోటి లింగాల ప్రాంతాన్ని తొలి తెలుగు రాజులు పాలించారు. ఈ విషయాన్ని బట్టి మొదటి తెలుగు ప్రాంతం తెలంగాణ ప్రాంతమే అని సుస్పష్టం. తెలుగు – తెలంగాణ అనే పదాలకు నిర్మాణాత్మక సంబంధం స్పష్టంగా కనబడుతుంది. టాలమీ చెప్పిన 'ట్రిలింగన్' ఇందుకు ప్రథమ నిదర్శనం. సంగారెడ్డి జిల్లాలోని భెల్ సమీపాన గల తెల్లాపురం శాసనం మరో నిదర్శనం. ఆ శాసనాన్ని వేయించింది ఫిరోజ్‌షా బహమనీ. గ్రామంలోని దిగుడు బావి దగ్గర ఉంది. ఆ శాసనం కాలం క్రీ.శ. 1418. దాంట్లోని ఒక వాక్యం కింది విధంగా ఉంది.

**"ఆచంద్రార్కంగా తెలుంగాణ పురాన".** ఇక మరో శాసనం క్రీ.శ. 1510 నాటిది. అది వెలిచర్లశాసనం. పూర్వపు నల్గొండ జిల్లాలో ఉంది. దాని ప్రకారం **"అనన్య సాధారణ సాహస శ్రీ దీర్ణ గ్రాహ పశ్చా త్తెలుంగాణ దుర్గాన్"** అని ఉంది. పైన చెప్పుకునే ట్రిలింగాన్, తైలుంగులు, తెలుంగాణ ఇవన్నీ తొలి తెలుగు ప్రాంతాన్ని సూచిస్తున్నట్లుగా ఉన్నాయి **"ఆణెమంచనగ దేశాహ్వయంబు"** అని 'ఆంధ్రభాషార్ణవ నిఘంటువులో ఉన్నట్లు సురవరం వారి 'తెలంగాణ చరిత్ర' అనే వ్యాసం ద్వారా తెలుస్తున్నది. అంటే తెలుగు + ఆణెము, తెలుంగు + ఆణీయం – తెలుంగాణెము, తెలుంగాణీయము అనే పదాలు క్రమంగా తెలంగాణము' గా స్థిరపడినట్లు భావించవచ్చు.

ఈ తెలంగాణమున ఉన్న భాషనే తెలుగు భాషకు మూలకందం. దేశీ ఛందోరీతులు, జాను తెనుగు ప్రయోగాలు, తొలి శతకం, గేయాలు, పాటలు, కురిక్యాల శాసనపు కందం ఇలా అనేకమైన వాటికి తెలంగాణ ఆద్యస్థానమైంది. తెలుగు భాషకు పుట్టినిల్లైంది. తెలంగాణలోని కోటిలింగాలలో దొరికిన ఆధారాలు గొబధ, సామగోప మొదలుగాగల తెలుగు పదాల ఉనికిని చాటుతున్నాయి. క్రీ.శ. 1వ శతాబ్దం నాటి హాలుని గాథాసప్తశతి తెలంగాణలోని తొలికావ్యం. అందులో ఉన్న తెలుగు పదాలు అందరికి విదితమే. అయితే ప్రపంచ సాహిత్యంలోనే గాథాసప్తశతిని 'తొలి గాథా సంకలన కావ్యం'గా పేర్కొనవచ్చు.

తెలుగుకు మూలస్థానం తెలంగాణ అని ఇంతకు ముందే చర్చించుకున్నాం. డా॥ సంగనభట్ల నరసయ్యగారి మాటల సారాంశం ప్రకారం "తెలివాహనది అంటే గోదావరి నది. ఆ

నదీతీరం వెంట మొదలై కొనసాగిన ప్రాంతమే తెలుగు ప్రాంతం". ఆ తెలుగే తెలంగాణ ప్రాంతపు తెలుగు. అందులో విలసిల్లిన ప్రక్రియలే తెలంగాణలోని తెలుగు భాషా ప్రక్రియలు. దేశీఛందానికి పురుడుపోసి తెలుగు ప్రక్రియలకు జన్మనిచ్చినది ఈప్రాంతం.

శాసనాల్లో, కావ్యాల్లో కనిపిస్తున్న పదాలు, ఛందో ప్రయోగాలు తెలుగులో తెలంగాణ ప్రాశస్త్యాన్ని గూర్చి చెప్పకనే చెప్తూతున్నాయి. అవే 'తెలుగు భాషకు ప్రాచీనత్వాన్ని' కూర్చి పెట్టాయి. దానికి ప్రధాన కారణం క్రీ.శ. 945 నాటి జినవల్లభుని కురిక్యాల శాసనం. ఇది అటుంచితే తెలుగులో వెలువడిన అనేక కావ్యాల్లో, పురాణాది గ్రంథాల్లో తెలంగాణ పదాలు తిష్ఠ వేసాయి. మచ్చుకు

'అలుకు' – 'కామ బీజములలుక" – కుమార సంభవం

'అట్లనే' – 'మఱి యట్లనే మెచ్చి' – బసవపురాణం

'అగ్గువ' – గ్రోతి మాంస మగ్గువయయ్యెఁ గొనుడటంచు
– రామాభ్యుదయం

అర్సుకొను – అరదంబు డిగి యరసికొని
– ఆంధ్రమహాభారతం (సౌప్తిక పర్వం 2 – 108)

ఆడ, గడిసేపు, ఇగో, కంచుడు, ఐరేండ్లు, ఏడ కొంచబోవు, దూప, పెండ్లాం, తెరువు, శానా, ముంగల, బరంతి, ముల్లె, రండ, పైసం, సోయి మొదలగు అనేక పదాలు మహాకవుల కావ్య నిర్మాణాల్లో భావపూర్ణం చేసాయి. తెలంగాణలోని తెలుగు కేతనాన్ని ఎగురవేసాయి.

**భాషా ప్రక్రియలు :**

**"హృద్యాన పద్యకావ్యము**
**పద్యము పద్యమని చెప్పగా ద్వివిధమగున్**
**గద్యంబ పాదపదనిక**
**రద్యోతిత నవ రసార్థరచనల నెగడున్"**

– మల్లియరేచన
(కవిజనాశ్రయం)

"కావ్యం పద్య గద్యాత్మకము. వాటిలో ఛందో బద్ధమైనవి పద్యాత్మకములు. ముక్తఛందములైనవి గద్యాత్మకములు" అని పై పద్యం స్థూల భావం.

చినుకుచినుకు వేచినుకులుగా సంద్రమౌతాయి. ఇదే విషయం భాషా విషయంలో కూడా వర్తిస్తుంది.

శోకం శ్లోకమైంది. శ్లోకాలన్నీ కలిపితే రామాయణ మహా కావ్యమైంది. ఈ మహాకావ్యాల మూల భావన/కథ నుండే కావ్యరూపాలు ఆవిర్భవించాయి. ఈ కావ్యాల నుండే ఖండకావ్యాలు, కావ్య ఖండికలూ వచ్చాయి. వాటినుండే కథలు, రూపకాలు పొడసూపాయి, ద్వ్యర్థి, త్ర్యర్థి మొదలగు కావ్యాలు విచ్చుకున్నాయి. పదకవిత్వం, కీర్తనలు, పాటలు, గేయాలు స్తుతుల గానాలకు మూలాలైనాయి. అనేక భాషా ప్రక్రియలకు వాఙ్మయమే ఆలంబనమైంది. భాషా సంద్రం వీటిన్నింటిని కలుపుకుంటూనే ఉంది. నాటి మహాకావ్యం నుండి నేటి చిట్టి పొట్టి కవితారూపాల వరకు భాషను, భాషా ప్రక్రియా మార్పులను చూస్తునే ఉన్నాం.

ఒక వ్యక్తి తాను చెప్పదలచుకున్న విషయానికి ఒక రూపాన్ని ఎన్నుకుంటాడు. అదే ప్రక్రియా రూపం. అదే ప్రక్రియ. అదే భావవాహకరూపం. అది సంప్రదాయ బద్ధమైందీకావచ్చు. ప్రయోగాత్మకమైందీ కావచ్చు. లేదా ఉభయ తారక మార్గ సూచ్యమై ఉండవచ్చు. అది ఎలా ఉన్నప్పటికీ ఆయా భాషల్లో అనుసరణీయమై ప్రామాణికం కావచ్చు. ఇతర భాషల్లోకి ప్రవేశించవచ్చు. భాషా ప్రవాహంలో స్థిర కీర్తినీ పొందవచ్చు. కాలగర్భంలో కలువనూవచ్చు. ప్రక్రియలు భావవాహికల పరమమార్గాలు

ప్రతీ ప్రక్రియ ఒక ప్రత్యేక మార్గంలో ప్రయాణించడం సహజం. ఈ ప్రక్రియలన్నింటికీ జన్మ స్థాన మూలం ఏదో ఒక రకంగా మౌఖిక సాహిత్యం, మహాకావ్యాలు, పురాణాలు మొదలగునవి అవుతున్నాయి. తెలుగు సాహిత్యంలోను ఇతిహాస, మహాకావ్యాలలోని ఏక దేశములైన అంశాలు కొత్త ప్రక్రియలకు మూలకారణం కావటం మనం గమనించవచ్చు అది శిష్టము కావచ్చు. మౌఖికముకావచ్చు. ఆయా కాలాల్లోని కవులు ఆయా భాషా వ్యవహారాల్లో ప్రయోగశీలురై తమ తమ సృజనను చేస్తూనే ఉన్నారు. అందుకే మూడు పువ్వులు ఆరుకాయలుగా భాషా సంపద ప్రోది అవుతూనే ఉంది.

**తెలంగాణ - తెలుగు భాషా ప్రక్రియలు :**

మన తెలుగు భాషా సాహితీ ప్రక్రియలు అనేకాలున్నాయి. ఇవి ఈ భాషలోనే పుట్టినవి కొన్ని. పరభాష నుండి ప్రవేశించినవి

కొన్ని. ఉదాహరణము, ద్విపద, రగడ, మొదలైనవి సొంత భాషా జన్యాలే. ఇవి పద్యరూపాలు. పురాణం, కావ్యం మొదలైనవి పరభాష నుండి స్వీకృతాలు. సాధారణంగా ఇవి సంస్కృతం నుండి గ్రహీతాలు. యాత్రా చరిత్ర, వచనాలు, వ్యాసాలు, వ్యాఖ్యానాలు మొదలగునవి గద్య ప్రక్రియలు. దాదాపు ఇవన్నీ పరభాషలో నుంచి దిగుమతి ఐనవే ఎక్కువ, ఐతే సంస్కృతం లేదంటే ఆంగ్లం. యక్షగానాలు, జానపదాలు, సుప్రభాతాలు, మొదలైనవి గాన ప్రక్రియలు. వీటిలో రెండు రకాలుగా (ఉభయ భాషా జన్యమైనవి) ఉన్నాయి.

తెలుగు భాషా ప్రక్రియలకు సంబంధించి నాడు సంస్కృత ప్రభావం పూర్ణం. నేడు ఆంగ్ల ప్రభావమాసాంతం. తెలుగు భాషా ప్రక్రియలు సుపరిచితమే సాహితీయులకు. వాటి గూర్చి నేనిక్కడ వల్లె వేయను. అలా వేస్తే చర్విత చరణ మౌతుంది. ప్రస్తుత వ్యాసంలో చర్చించాల్సిన అంశం ప్రత్యేకమైనదని అనుకుంటున్నాను. ఇతరులకూ ఇది ప్రత్యేకం కావచ్చు. కాకపోనూవచ్చు. తెలంగాణలోని తెలుగు భాషా ప్రక్రియాకేతనాల గూర్చే ఆ చర్చ.

సగర్వంగా తెలంగాణ జాతి ప్రపంచ తెలుగు మహాసభలను నిర్వహించుకోవడం 'సోముడి'తో ఉన్నంత సంతోషం. 'పోతన'తో అమృతం తాగిన సంతృప్తి. రామదాసుతో నడుస్తున్నట్లు పరమానందం. ఇట్టి సందర్భంలో తెలంగాణలో ఆవిర్భవించిన లేదా సంప్రదాయ వారధిగా తెలుగులో తొల్త నుండి కొనసాగుతున్న ప్రక్రియల గూర్చి మాట్లాడకోవడం పరమాన్నమో/అంబలో తగిన తృప్తి అని నా భావన.

ద్విపద, ఉదాహరణం, రగడ, శతకం, అక్షరాంక పద్యాలు, అష్టకాలు, పంచకాలు, గద్యలు/వచనాలు మొదలైన ప్రక్రియలకు తెలంగాణానే మూలం. అందుకే దేశి కవితా పద్ధతికి తెలంగాణ మూల 'కందం'గా కీర్తివడిసింది. పరోక్షంగా కథారచన, వీరగాథ రచనలకు 'దేశీయ మార్గదర్శక'మైంది.

అచ్చ తెనుగు ప్రబంధ ప్రక్రియకు జన్మనిచ్చింది నేటి సంగారెడ్డి జిల్లా ప్రాంతం, పఠాన్ చెరువు (పొట్లచెఱువు) ప్రాంతమే ఆ కవి ప్రాంతం.

ఇక జాయప సేనాని రచించిన 'నృత్తరత్నావళి'లో మన ప్రాంతంలోని మరిన్ని ప్రక్రియలు కనబడుతాయి. పేరిణీ నృత్యం, చిందు, కోలాటం మొదలైనవి.

పాలుకురికి సోమనాథుడి కంటే ముందు నుండే, తెలంగాణలో నాటక (రూపక) ప్రక్రియ ఉన్నట్లు తెలుస్తున్నది.

ద్వ్యర్థి, త్ర్యర్థి, చతురర్థి మొదలగు కావ్య విధానాలకు బీజం వేసింది కూడా తెలంగాణమే. తొలి యక్షగానము గోల్కొండ సుల్తానుల కాలంలో ప్రవేశించింది.

శుద్ధాంధ్ర నిరోష్ఠ్య ప్రక్రియకు నల్లగొండ జిల్లా ఆద్యమైంది. ద్విపదకు మూలకందాలైన తుమ్మెద పదాలు, వెన్నెల పదాలు, ప్రభాత పదాలు, వాలేశు పదాలు, నివాళి పదాలు, గొబ్బి పదాలు, సంజవర్ణన పదాలు మొదలైనవి అన్నీ తెలంగాణ ప్రాంతంలోనే ఉన్నట్లు సోమనాథుడి ద్వారా తెలుస్తున్నది. అవన్నీ ఇక్కడ జనుల నోళ్ళలో నానిన మౌఖిక సాహితీ రూపాలుగా పేర్కొనవచ్చు. గీతాలలో ఆనంద గీతాలు, శంకర గీతాలు, చారుగీతాలు, చాంగు బళాలు కూడా తెలంగాణమునందే ఉన్నట్లు 'పండితారాధ్య చరిత్ర' ద్వారా తెలుస్తున్నది.

తెలుగులోని తొలి స్వతంత్ర కథాకావ్యానికి బీజం నిజామాబాద్ (ఇందూరు) ప్రాంతం వేసింది. ఈ కథా కావ్యం ప్రకారం 'వెన్నెలగుడి' పాటలు తెలంగాణలో వాడుకలో ఉన్నట్లు తెలుస్తున్నది.

జానపదగేయాలు, పాటలకు తెలంగాణ పెన్నిధి. జానపద గేయ సాహిత్యానికి డాక్టరేటు పట్టా పట్టం కట్టింది ఉస్మానియా విశ్వవిద్యాలయమే. తెలంగాణలోని శాసనాల్లోనే దర్శనం ఇచ్చిన మరో ప్రక్రియ చిత్రకవిత.

శైవ, వైష్ణవ వచనాలు/గద్యలకు మూలం కూడా తెలంగాణ ప్రాంతమే. శైవ గద్య మార్గదర్శి పాలుకురికి వాసి. వైష్ణవ వచన మార్గదర్శి పాలమూరు జిల్లా 'సంతూరు' వాసి.

తెలుగుభాషకే సొంతం అయిన ప్రక్రియ అవధానం. దాని పునాది తెలంగాణ ప్రాంత పాలకులైన రెండో ప్రతాపరుద్రుని ఆస్థానంలో పడింది. తెలుగులో ఉన్న మరో విశిష్టమైన ప్రక్రియ లాలి – ప్రహరి. దీనికి మూలం మహబూబ్‌నగర్ జిల్లాగా చెప్పవచ్చు.

ఆధునికంగా పరుగు లెడ్తున్న నానీ, పరభాష నుండి వచ్చిన గజల్, రుబాయి ప్రక్రియలకు తెలుగులో మూలస్థానం తెలంగాణయే. గజల్, రుబాయిలు అరబ్, ఉర్దూ ప్రక్రియలు. కానీ తెలంగాణలో తెలుగు వాటిని స్వీకరించింది. ఇంకా ఇలాంటివీ ఉండవచ్చు. వ్యాస పరిధిని దృష్టిలో పెట్టుకొని కొన్నింటిని గూర్చి మాత్రమే చూపాను.

## I) తెలంగాణ - దేశీ ఛందోరీతుల పుట్టుక :

తెలుగు భాష అంటేనే వెంటనే స్ఫురణకు వచ్చేది పద్యం, పాట. వీటిలో పద్యాలు ఛందోబద్ధాలు. ఈ పద్యాల్లో సంస్కృత సంప్రదాయానుసారం వచ్చిన కవిత్వం 'మార్గం'. తెలుగు భాషకు సొంతమైన కవిత్వం 'దేశి'. దేశికవిత్వంలో కందం, ద్విపద మొదలైనవి జాతి పద్యాలు. వీటి జనన స్థానం తెలంగాణ. కందం, ద్విపదలతో పాటు ఉపజాతి పద్యమైన సీసం గూర్చి మాత్రమే ప్రస్తుత ప్రస్తావన.

### 1) కంద పద్యం

'కందం రాస్తేనే కవి' అని నానుడి. తెలుగులో కందపద్యానికి అంత విశిష్టస్థానముంది. అట్లాంటి కందపద్యం నన్నయ్యకు వందేళ్ళ ముందే పుట్టింది. క్రీ.శ. 945లో వేయించిన బొమ్మలగుట్ట (వృషభగిరి) శాసనమే పరమసాక్ష్యం. కన్నడలో ఆదికవి అయిన పంపకవి సోదరుడైన జినవల్లభుడు ఆశాసనాన్ని వేయించాడు. ఆశాసనం వేములవాడ చాళుక్య రాజైన అరికేరి–II (క్రీ.శ.930–55) నాటిది.

ఇది గంగాధర (కరీంగనర్ జిల్లా) మండలంలోని కురిక్యాల ప్రాంతంలో ఉంది. ఈ ప్రాంతాన్ని నాడు సబ్బిమండలంగా పిలిచేవారని, సంగనభట్ల నరహరి గారి వ్యాసంలో ఈ శాసనానికి సంబంధించిన వివరాలు తెలుస్తున్నాయి. ఈ వ్యాసం ఉన్న 'త్రిశతి' అనే గ్రంథం సెప్టెంబర్ 1979లో యం. శ్యామసుందర శాస్త్రిగారు ప్రకటించారు. కురిక్యాలలో జినవల్లభుడు వేయించిన శాసనంలోని మూడు కంద పద్యాలలోని ఒక కంద పద్యం మచ్చుకు

**కం. జినభవనంబులెత్తించుట**
**జిన పూజల్ సేయు చున్కి జినమునులకు తృ**
**ప్తిన అన్నదానమీయుట**
**జిన వల్లభుపోలగలరె జినధర్మపరుల్**

ఈ పద్యాలే తెలుగుకు ప్రాచీన హోదా నిప్పించగలిగాయి. ఈ పద్యాల కంటే ముందే కంద పద్యం బాగా ప్రచారంలో ఉండి ఉండాలి. పద్యం ఇంత ఛందో బద్ధంగా ఉందంటే తత్పూర్వమే దీని ఛందో నిర్మాణం జరిగి ప్రచారంలో / రచనలల్లో ఉండే ఉంటుంది. కందపద్యాలను ముందుకు తీసుకెళ్ళినవాడు సోమనాథుడే.

### 2) ద్విపద

దీని జన్మస్థానం తెలంగాణనే. నేటి జనగామ జిల్లా పాలుకురికి గ్రామంలోనే. అది పాలుకురికి సోమనాథుడి నివాస స్థానం. తెలుగు సాహిత్యాన్ని ద్విపద ఒక్క కుదుపు కుదిపింది. సాహిత్య విప్లవాన్ని సృష్టించింది. ఆ సృష్టికర్త సోమనాథుడు. ఆయన తనకంటే ముందు నుండి మాత్రాఛందస్సులో ఉన్న గేయగతులను దృష్టిలో పెట్టుకున్నాడు. వాటిలో 'రోకటి పాటలు' ప్రధానమైనవి. దేశీయ ఛందోరూపకల్పనకు నడుంబిగించాడు. ద్విపదను సృష్టించాడు. యావత్తు తెలుగు సాహితీ లోకానికి మార్గదర్శి ఐనాడు. భాషా సంపన్నతకు పథము నేర్పరచాడు. ఆలాంటి ద్విపద గూర్చి ఆయన మాటల్లోనే

**"ఉరుతర గద్య పద్యోక్తుల కంటె**
**సరసమై నరిగిన జాను తెనుంగు**
**చర్చింపcగా సర్వసామాన్య మగుట**
**గూర్చెద ద్విపదలు కోర్కె దైవార"**

– (బసవపురాణం)

**"ఆరూఢ గద్యపద్యాది ప్రబంధ**
**పూరిత సంస్కృత భూయిష్ఠరచన**
**మానుగా సర్వసామాన్యంబు గామి**
**జాను తెనుcగు విశేషము ప్రసన్నతకు"**

– (పండితారాధ్య చరిత్రము)

సంస్కృత భూయిష్ఠ రచనకంటే దేశీ తెనుగులో దేశీ ఛందస్సుఐన ద్విపదలో రచననే ప్రసన్నమైనదని ప్రకటించుకున్నాడు. దాన్ని సాధించాడు. ద్విపద సాహితీ పరివ్యాప్తంకు మూల పురుషుడైనాడు.

### 3) సీసం

ముందు నుండి ఉన్న సీస పద్యాన్ని తీర్చిదిద్దినకవి సోమనాథుడే. ఏ పాదమునకు ఆపాదము విడివడచేసి అర్థం ఉండేట్లు కూర్చినాడు. (సీసానికి సజాతీయ అశ్వగమనానికి అనువైన విధానాన్ని ప్రారంభించింది సోమననే) ఈతని చెన్నమల్లు సీసాలే అందుకు ప్రబల తార్కాణాలు,

సీసపద్యాలతో తొలి సీస శతకానికి ఆద్యుడైనాడు సోమన్న. మచ్చుకు

సీ. "సన్మనో భావంబు సందిల్లుటరిదియే
తగిలి ప్రసాదమై తలపులదర
భక్తి సుభాషల భాసిల్లుట రిదియే
కలయ, బ్రసాదమై పలుకు లదర
విమల భక్తి క్రియాంగము చెల్లుటరిదియే
వఱలు ప్రసాదమై వ్యాప్తి దనరఁ
జిరతరాంత శ్శుద్ధి దొరకొనుటరిదియే
గూఢ ప్రసాదమై కోర్కులదర

తే.గీ. ఇంద్రియములు గెల్చుటెట్లు రిదియె సమ
స్తాంగములు ప్రసాదమై చేలంగ
నటుగాన నీ మహా ప్రసాదానూన
సిద్ధి కేవలంబె చెన్నమల్లు"

– (చెన్నమల్లు సీసము)

## II) వివిధ పద్య ప్రక్రియలు - విశేషాలు :

### 1) పురాణం

#### అ) దేశీ పురాణం

తెలుగులో పురాణాన్ని కొత్త పుంతలు తొక్కించింది పాలుకురికి సోమనాథుడు. పురాణాలను అనువదించడం సంప్రదాయం. కానీ తొలి తెలుగు దేశీ పురాణం అందుకు భిన్నం. దేశీ సమాజాన్నీ దృష్టిలో పెట్టుకొని, దేశీ ఛందోరీతితో రాసింది బసవపురాణం. దీనికి సమాజాంశాలే ఇతివృత్తం. ఇందలి కథలు పరోక్షంగా సామాజికకథా రచనకు, వీరగాథారచనలకు బీజం వేసాయి. గొడగూచి కథ, బెజ్జమహాదేవి కథ మొదలగున్నవి అట్టివే. ఈ పురాణం సమకాలీన సమాజాన్ని చిత్రించింది. తెలుగు సాహిత్యంలో అద్భుత విజయం సాధించింది. పురాణంగాని పురాణంగా పేరొందింది. ఇది ప్రథమాంధ్ర దేశీ పురాణం. తెలుగులో తొలి సాంఘిక కావ్యం, స్వతంత్ర పురాణం. ఈ సందర్భంలో కొర్లపాటి శ్రీరామమూర్తి గారన్న మాటలు ప్రస్తావనార్హమైనవి.

**"కవిత్వము, పాండిత్యము జోడు గుఱ్ఱముల వలె కదను తొక్కిన కావ్యరథము"** ఈ మాట నూటికి రెండింతలు సత్యాలు. తెలంగాణలో పుట్టిన ఈ ప్రక్రియ తెలుగు భాషలో సర్వవ్యాప్తమైంది. మహాకవులకు కీర్తినిచ్చింది. తెలుగు వారికి బ్రహ్మానందాన్ని అందించింది.

#### ఆ) మార్గ పురాణం

తొలి మార్గపురాణానికి జన్మనిచ్చింది కూడా తెలంగాణ నేలనే. కవి – మారన, పురాణం – మార్కండేయ పురాణం, కాలం – కాకతీయుల కాలం

### 2) ఉదాహరణం

తెలంగాణ నేలలోనే పుట్టిన మరో ప్రక్రియ. ఈ ప్రక్రియ సంస్కృతాది భాషల్లోకి పోయింది. ఇది మధుర భక్తి కవితా శాఖకు సంబంధించింది. మార్గ, దేశీల సమ్మేళనంలో రూపుదిద్దుకున్న సాహితీ ప్రక్రియ. నేటికీ నిలబడిన ఈ ఉదాహరణ ప్రక్రియలో వస్తువు, విషయంలో మార్పు కనబడుతుంది. ఈ ఉదాహరణ ప్రక్రియకు ఆద్యుడూ సోమనాథుడే, ఆయన రాసిన బసవోదాహరణమే తొలి తెలుగు ఉదాహరణము.

సాధారణంగా ఉదాహరణంలో 25 లేదా 26 పద్యాలుంటాయి. ఇవి సదాశివుని షడ్వింశతి (26) తత్త్వములకు ద్యోతకం అని చెప్తారు. విద్యానాథుని ప్రతాపరుద్రీయమున చెప్పబడిన ఉదాహరణ లక్షణానికి బసవోదాహరణమే లక్ష్యం.

ఎనిమిది విభక్తులు కలిగిన (వేరు వేరు) వృత్తాలు (8), కళికలు (8), ఉత్కళికలు (8), చివరన సార్వవిభక్తిక పద్యం (1), నామాంకిత పద్యం (1) (ఇది తప్పనిసరికాదు)తో రచన ముగస్తుంది. ఇదీ స్థూలంగా ఉదాహరణ లక్షణం.

తెలుగు సాహితీ ప్రపంచానికి తెలంగాణ అందించిన అద్భుతం ఈ ఉదాహరణం.

### 3) రగడ

ఇదీ దేశీసాహితీ ప్రక్రియనే. దీనికి ఆద్యుడు కూడా సోమన్ననే. తొలి రగడ బసవ రగడ. రగడ ద్విపాద నియమయుక్తం. ప్రాస, అంత్య ప్రాసలు విశేషములు. తెలుగు లాక్షణికుల దృష్టిలో రగడ భేదాలు తొమ్మిది. వీటిలో కొన్ని మాత్రాగణ బద్ధం. మరికొన్ని సూర్య, ఇంద్ర గణ బద్ధాలైనవి. సోమన్న రగడలో మొత్తం 108 పాదాలున్నాయి. తెలంగాణ నేల, తెలుగు భాషకు అందించిన మరో ప్రక్రియా రత్నం ఈ రగడ ప్రక్రియ.

## 4) కావ్యాలు

### అ) ద్వ్యర్థి కావ్యం

తెలుగు నాట వెలువడిన తొలి ద్వ్యర్థికావ్యం తెలంగాణలోనే. అది రాఘవ పాండవీయం. కవి వేములవాడ భీమకవి. పింగళి సూరన **"భీమన తొల్లిసెప్పె"** నంటూ ఈ ప్రక్రియ కవీశ్వరుని గూర్చి చెప్పాడు. దీని తర్వాత తెలుగులో మరో 'రాఘవ పాండవీయం' కూడా వచ్చింది.

### ఆ) త్ర్యర్థి కావ్యం

దీనికి ఆద్యుడు ఎలకూచి బాలసరస్వతి. ఈయన మహబూబ్‌నగర్‌లోని జటప్రోలు సంస్థాన కవి. కాలం 17వ శతాబ్దం. కావ్యం పేరు యాదవ రాఘవ పాండవీయం. ఇది త్ర్యర్థికావ్యం.

### ఇ) చతురర్థి కావ్యం

క్రీ.శ 1520 - 1590 కాలంనాటి మరింగంటి సింగరాచార్యులు ప్రసిద్ధులు. చతురర్థి కావ్య రచనకు మొదటి వాడు. వీరిది నల్లగొండ జిల్లా. వీరి కావ్యం పేరు నలయాదవ రాఘవ పాండవీయం.

### ఈ) అనేకార్థక కావ్యాలు

దీనికి కన్నడ మహాకవి పంపకవి ఆద్యుడు. ఇతడు తెలంగాణ వాసి. ఈయన అనేక అర్థక కావ్యాలు రాసిన విషయాన్ని గూర్చి 'నృపతుంగుడు' 'కవి రాజమార్గం'లో చూపాడు.

### ఉ) కథా కావ్యం

తొలి తెలుగు కథా కావ్యానికీ మూలం తెలంగాణయే. కవి కొఱవి గోపరాజు. ఈయన ఇందూరు (నిజామాబాద్) జిల్లా ప్రాంతానికి చెందినవారు. 32 కథలతో 'సింహాసన ద్వాత్రింశక' అనే తొలి కథా కావ్యాన్ని రాశాడు.

### ఊ) అచ్చ తెనుగు కావ్యం

'యయాతి చరిత్రమ్' తొలి అచ్చ తెనుగు కావ్యం. దీని రచయిత పొన్నికంటి తెలగనార్యుడు. నేటి సంగారెడ్డి జిల్లాలోని పటాన్ చెఱువు (పొట్ల చెరువు) ప్రాంతవాసి. ఈ ప్రక్రియ తెలంగాణ అందించిన మరో సాహిత్య ప్రక్రియ.

## 5) చిత్ర కవిత

ఈ చిత్రకవిత సంస్కృతం నుండి వచ్చిన ప్రక్రియ. ఈ కవితా ప్రక్రియకూడా తెలంగాణలోనే తొలిగా కనబడుతుంది. దీనికి 'వర్ధమానపుర' శాసనం ఆధారం. కవి అభినవ మయూర సూరి. శాసనంలో ఉన్న బంధం 'షడర చక్రబంధం'. శాసనం వేయించింది గణపతి దేవ మహారాజు క్రీ.శ 1245లో.

తొలి చిత్ర కావ్యానికి తెలంగాణనే జన్మ ఇచ్చింది. కవి పేరు మరింగంటి సింగరాచార్యులు. రచన 'దశరథ రాజనందన చరిత్ర' ఇదే తొలి చిత్ర కవితా కావ్యం.

## 6) శతకం

తెలుగులో ఉద్దరింపబడి కాంతులీనుతున్న ప్రక్రియ. తొలి శతకం వృషాధిప శతకం. కవి పాలుకురికి సోమనాథుడే. శతకం దేశీ ప్రక్రియ అని కొందరి భావన. డా॥ కే. గోపాల కృష్ణ మూర్తి మాటల్లో శతకం

"సంస్కృత ప్రాకృత భాషలలోని శతకమే తెలుగులోకి ప్రవేశించింది. అది దేశీ కవితా శాఖకు పూచిన పువ్వుకాదు"

నిడుదవోలు వేంకట రావుగారి మాటల్లో

"కన్నడంలో శతకం పుట్టింది. మనకు మార్గదర్శకమైంది". ఏదేమైనా తెలుగులో వచ్చిన సంపూర్ణ లక్షణ శతక గ్రంథం తెలంగాణ గడ్డమీదనే పుట్టింది.

**"బలుపొడతోలు సీరయును, బాపసరుల్ గిలుపారు కన్ను, వె**
**న్నెలతల, చేదుకుత్తుకయు నిండిన వేలుపుటేరు, వెల్లు పూ**
**సలుగల తేని లెంకవని జాను తెనుంగున సన్నుతించెదన్**
**వలపు దలిర్ప నిన్ను బసవా! బసవా! బసవా! వృషాధిపా!"**

- (వృషాధిప శతకం)

తెలుగులో వస్తున్న వేనవేలశతకాలకు తెలంగాణ నేలనే మార్గదర్శి అని చెప్పడంలో అతిశయోక్తిలేదు. భర్తృహరి సుభాషితాలను తొలిగా తెలుగులోకి అనువదించింది ఎలకూచి బాలసరస్వతి.

## 7) సంఖ్యోక్తి శీర్షికలతో రచనలు

i) **అక్షరాంక పద్యాలు :** 'అ' నుండి 'క్ష' వరకు గల వర్ణాలను వరుసగా మొదటి అక్షరంగా ఉంచి పద్యాలు రాసే విధానం. దీనికి సోమనాథుడే మొదటి వాడు. ఆయన రాసింది లఘుకృతి.

**ii) పంచకము :** ఈ విధానాన్ని ఈనాటికీ అనేక మంది కవులు ఆయా సందర్భాలను ఉద్దేశించి ఈ 'పంచకాల'ను రాస్తూనే ఉన్నారు. ఇది సంస్కృత సంప్రదాయ ప్రక్రియ. దీన్ని తెలుగులోకి తెచ్చినవాడు సోమనాథుడే. తెలుగులో 'తొలిపంచకం'గా 'బసవపంచకం' చెప్పవచ్చు. దీంట్లో ఐదు మాలినీ వృత్తాలున్నాయి.

**iii) అష్టకములు :** ఇదీ సంస్కృత ప్రక్రియనే. దీన్ని 'బసవాష్టకం' పేరుతో తెలుగు ప్రక్రియగా మార్చింది సోమననే. అష్టకాలలో ఎనిమిది పద్యాలుంటాయి.

### 8) శుద్ధాంధ్ర నిరోష్ఠ్యం

దీనికి తెలంగాణనే జన్మనిచ్చింది. 'రామ' అనే శబ్దంలో 'మ'కారం ఓష్ఠ్యం. కాని రామ అనే శబ్ద ప్రసక్తి లేకుండా తెలుగులో వచ్చిన కావ్యం 'దశరథ రాజనందన చరిత్ర'. ఇది అచ్చుతెనుగు కావ్యం. తెలుగులో వచ్చిన 'శుద్ధాంధ్ర నిరోష్ఠ్య కావ్యం'. కవి మఱింగంటి సింగరాచార్యులు. నల్లగొండ ప్రాంతవాస్తవ్యులు.

ఈ కావ్య ఉత్తర కాండ పేరు 'దాశరథి చరిత్ర'. కవి పేరు పురుషకారి కేశవయ్య. ఇతడు ఆత్మకూరు సంస్థానంలో ఉన్నట్లు తెలుస్తున్నది. దీనికి సంబంధించిన వివరాలు గోలకొండ కవుల సంచికలో ఉన్నాయి.

### 9) సంకలన కావ్యం

దీనిని కూడా తెలుగులో ఒక ప్రక్రియగా చెప్పుకుంటున్నాం. తెలుగులో వచ్చిన తొలి సంకలన కావ్యం 'సకల నీతి సమ్మతము'. దీనిలో రాజనీతి, శాస్త్ర విషయక పద్యాలను రాసాడు. ఇవ్వన్నీ 17 గ్రంథాల నుండి సేకరించి రాసాడు. దీని కవి మడికి సింగన. ఈయన పెద్దపల్లి జిల్లా రామగిరి వాసి. నాటి సబ్బిమండలానికి చెందినవాడు. తెలంగాణ, తెలుగులోకానికి తొలిగా అందించిన (శాస్త్ర) కావ్య సంకలన ప్రక్రియ.

### 10) నానీ

ఇది ఆధ్యతన కాలపు ప్రక్రియ. సృష్టికర్త డా॥ ఎన్. గోపి. తన నానీలను 1997లో 'వార్త' దినపత్రిలో తొలిసారిగా ధారావాహికగా ప్రకటించారు. 1998లో 'నానీలు' పేరుతో తొలిగ్రంథం ప్రకటించారు. అనేక మంది కవులు ఈ ప్రక్రియలో దూసుకుపోతున్నారు.

ఇవీ పద్య ప్రక్రియకు తీసుకున్నవి కొన్ని మాత్రమే.

## III) గద్య ప్రక్రియలు

### 1) గద్యలు / వచనాలు

భక్తి సాహిత్యంలో ఇవి శరణాగతికి ఒక మార్గంగా నిలిచి ఉన్నవి. తెలుగులో శైవగద్య పరిచయ కర్త సోమనాథుడే. ఈయనే పంచపకారగద్య, నమస్కార గద్య, అక్షరాంక గద్య, అష్టోత్తర శత నామ గద్య, శరణు బసవ గద్య అనే 5 గద్యలు రాసాడు. మొదటి నాలుగు సంస్కృత భూయిష్టమైనవని, చివరిది కన్నడదని చెప్తారు.

తెలుగులో తొలి వచనాలు రాసింది తెలంగాణ కవియే. ఆయన పేరు కృష్ణమాచార్య. వీరి జన్మస్థలం పాలమూరు జిల్లాలోని 'సంతూరు' గ్రామం. కాకతీయ ప్రతాపరుద్రుని కాలం వాడు. కానీ ఈతను సింహగిరి వచనాలను సింహాచలం నరసింహుని అనుగ్రహంతో రాశాడు. సుమారు నాలుగు లక్షల వచనాలు ఉన్నట్లు తెలుస్తున్నది.

### 2) కథ

తెలుగులో తొలి కథ తెలంగాణలో పుట్టింది. ఆ కథ 'ధన త్రయోదశి'. రాసింది 1902లో. రచయిత్రి బండారు అచ్చమాంబ.

## IV) గాన ప్రక్రియలు

### 1) ద్విపద

ఇది దేశీ ఛందోరీతి ఐనప్పటికీ ఒక ప్రక్రియగా స్థిరపడింది. తెలుగు సాహిత్యానికి మకుటాయమానమైంది. దీనికి ఆద్యుడు సోమననే. పాలుకురికి గ్రామ నామం ఆయన ఇంటి పేరైంది. అక్కడి సోమనాథేశ్వరుడి పేరు ఆయన పేరైంది. ద్విపదలో రెండే పద్య పాదాలుంటాయి. ఈ ప్రక్రియలో శ్రీనాథుడు మొదలుకొని అనేక మంది సుప్రసిద్ధులైనారు. ద్విపదలో తొలి గ్రంథం బసవ పురాణం. తొలికావ్యం రంగనాథ రామాయణం. వీటి పుట్టినిల్లు తెలంగాణనే. తొలి జంటకవులుగా ప్రసిద్ధి నొందిన ద్విపదకవులు కాచవిభుడు, విఠల నాథుడు వీరు కాకతీయులకు సామంతులుగా ఉన్నారు.

## 2) యక్షగానం

ఇది తెలుగులోనే పుట్టిన ప్రక్రియ. కొడంగి ఆటలు, బొమ్మలాటలు,బయటాటలు, దొమ్మరాటలు, ఏలలు, దాసరి చిందులు మొదలైన దేశీరీతులు సోమన కాలానికే ఉన్నాయి. ఆ పరిణామ క్రమంలోనే యక్షగానం రూపొందింది. 'యక్షగానం' అనే పదాన్ని తొల్త శ్రీనాథుడు వాడాడు. కానీ దానికి సంబంధించిన విషయాలు పండితారాధ్య చరిత్ర గ్రంథం ద్వారా తెలుస్తున్నాయి. సర్వ లక్షణ తొలి యక్షగానం సుగ్రీవ విజయం. కవి కందుకూరి రుద్రకవి. ఈయన ఇబ్రహింకుత్‌బ్‌షా (మలికిభరాముడు) సంస్థానపు కవిగా తెలుస్తున్నది. అంటే గొల్కొండ ఆస్థాన కవి. తెలుగు సాహిత్యంలో రుద్రకవులు ముగ్గురున్నట్లు సమగ్రాంధ్ర సాహిత్యం చెప్తుతున్నది. తెలుగు భాషకు తెలంగాణ అందించిన విస్తృతగాన ప్రక్రియ యక్షగానం.

## 3) పాట - గేయం

నన్నయ్య మహాభారత రచనకు ముందు నుండే తెలంగాణలో తుమ్మెద పదాలు, వెన్నెల పదాలు, ప్రభాత పదాలు లాంటివి జానపద మౌఖిక సాహిత్య నిధులుగా ఉన్నట్లు తెలుస్తున్నది. ఇందులో మాత్రాబద్ధమైనవి, కానివీ ఉన్నాయి. చిరుతల రామాయణం, బతుకమ్మ పాటలు, బుడగ జంగాలు, అస్పైదుల పీరీల పాటలు, హరికథలు ఉన్నాయి. నాట్ల పాటలు, మోట బావి పాటలు, కళ్ళాల పాటలు, దంపకపుపాటలు, విసుర్రౌతు పాటలు మొదలైనవన్నీ దాదాపుగా తెలంగాణ నేల నుండి పుట్టినవే ఎక్కువ. తెలంగాణ అంటే పాట, పాట అంటే తెలంగాణే అనే స్థాయికి చేర్చిన ప్రక్రియ.

## 4) లాలి - ప్రహరి

ఈ ప్రక్రియకు మూలం మహబూబ్‌నగర్ జిల్లాలో ఉంది. జిల్లాలోని కురుమూర్తి వేంకటేశ్వరాలయం 'ప్రహరి' ప్రక్రియకు కేంద్రమైనట్లు తోస్తున్నది. ఈ ప్రక్రియ కూడ మార్గ, దేశీ కవిత్వాల సమ్మేళనం. వసుదుగ్ కృష్ణమాచార్యులు దీనికి ఆద్యులని శ్రీరంగాచార్యుల వారి పరిశోధన. కృష్ణమాచార్యుల ప్రహరి సంస్కృతంలో ఉంది. కానీ పూర్తిగా దేశీ ఛందో రచనా పూరితంగా ఉంది.

## 5) అవధానం

తెలుగు భాషలోనిదే ఈ ప్రక్రియ. తెలుగులో అద్భుతంగా స్థిరీకరణమైన ప్రక్రియ. అవధానం అంటే తెలుగు అనే స్థితికి వెళ్ళింది. ఈ ప్రక్రియ ఆరంభమైంది ప్రతాపరుద్రుని ఆస్థానంలో. కవి కొలిచెలమ మల్లినాథసూరి. ఈయన తెలుగు సారస్వతమందు తొలి శతావధాని. ప్రతాపరుద్రునిచే కానకాభిషేకం చేయించుకున్నాడు.

## 6) గజల్

ఇది ఉర్దూ ప్రక్రియ. పారశీక దేశంలో పుట్టింది. హైదరాబాద్‌లో తెలుగులోకి ప్రవేశించింది. తెలుగులో గజల్ ప్రక్రియకు ఆద్యుడు దాశరథి. ఈయన గజల్ గ్రంథం 'గాలిబ్ గీతాలు'. గజల్ ప్రక్రియ వారసత్వంగా పరిపుష్టంగా కొనసాగించిన కవి డా॥ సినారె.

## 7) రుబాయి

దీని ప్రయోక్త కూడా దాశరథే. కవితా పుష్పకంలో కొన్ని రుబాయిలు ప్రచురించారు. 'జ్వాలా లేఖిని' గ్రంథం లోని 'సాఖీనామ' అనే రెండో భాగంలో 1984 లో కొన్ని రుబాయిల్లాంటివి ప్రకటించారు. 'నేనంటాను' అనే శీర్షిక కింద సలక్షణ రుబాయిలను చెప్పాడు.

మచ్చుకో రుబాయి –

"కళ్ళెం ఉన్నదే మన చేతిలో

గుర్రం మాత్రం పడెగోతిలో

దప్పి తీరదని నేనంటాను

నీళ్ళు అందని మన నూతిలో"

బూర్గుల లాంటి వాళ్ళూ రుబాయిలను అనువాదాలు చేసారు.

## ముగింపు

వ్యాస పరిధిని దృష్టిలో పెట్టుకొని తెలుగుభాషకు తెలంగాణ ప్రాంతం అందించిన తెలుగుభాష, భాషా ప్రక్రియల గూర్చి స్పృశించడం జరిగింది. ఇవి కాక ఇంకా

చర్చించుకోవాల్సినవి చాలా ఉంటాయి. కురిక్యాల శాసనం కంటే ముందునుండే తెలంగాణ ప్రాంతం తెలుగు వాఙ్మయంలో కీర్తినొందింది. సారస్వత సాహితీ ప్రవాహానికి అనేక ప్రక్రియలను అందించింది. అందుకేనేమో మహాకవి దాశరథి "నా తెలంగాణ కోటి రత్నాల వీణ" అని అన్నాడు. ఒక్కో ప్రక్రియ ఒక్కోరత్నం. ఒక్కోపదం ప్రజ్ఞాపూర్ణం. ధూళికట్ట, కురిక్యాల, నందికొండల లాంటివి పురా సాహితీ పురాలు. తెలుగు సాహిత్యానికి భావ ప్రపూర్ణాలు.

### వ్యాస రచనలో ఉపయోగపడిన గ్రంథాలు


1) ఆంధ్ర సాహిత్య సంగ్రహ చరిత్ర – శ్రీవారణాసి వేంకటేశ్వర్లు
– స్టూడెంట్స్ ఫ్రెండ్స్ – 1974 గుంటూరు

2) ఆధునికాంధ్ర కవిత్వము – సంప్రదాయములు : ప్రయోగములు – డా.సి. నారాయణ రెడ్డి
– స్వీయ ప్రచురణ – 1967 హైదరాబాద్

3) కదంబం – సాగికమలాకర శర్మ (సం)
– మూసీ సాహిత్య, సాంస్కృతిక చారిత్రిక మాస పత్రిక – 2014 హైదరాబాద్

4) త్రిశతి – ఎమ్. శ్యామ సుందర శాస్త్రి (సం) స్వీయ ప్రచురణ – 1979 – ధర్మపురి

5) తెలంగాణ మాండలికాలు – కావ్య ప్రయోగాలు
– డా. రవ్వ శ్రీహరి, స్వీయ ప్రచురణ

6) తెలంగాణ ప్రాచీన సాహిత్య చరిత్ర – సుంకిరెడ్డి నారాయణరెడ్డి – తెలుగు అకాడమి, హైదరాబాద్ – 2016

7) తెలుగు భాషా సాహిత్య దర్పణం – డా. దహగాం సాంబమూర్తి
– నీల్‌కమల్ పబ్లికేషన్స్ – 2015, హైదరాబాద్

8) తెలుగు సాహిత్య సమీక్ష – డా. జి. నాగయ్య
– నవ్యపరిశోధక ప్రచురణలు తిరుపతి – 1983 – 2009

9) తెలివాహ – డా॥ సంగనభట్ల నరసయ్య (స్వీయ)

10) మఱింగంటి కవులు సాహిత్య సేవ
– డా. శ్రీరంగాచార్య – స్వీయ ముద్రణ
– పరివర్ధితము 2014 – హైదరాబాద్

11) మనది తెలంగాణము కాదు – తెలుంగాణము – డా॥ సంపన్ముదుంబై రంగ కృష్ణమాచార్యులు – మెదక్ జిల్లా – అముద్రితము

12) సమగ్ర ఆంధ్ర సాహిత్యం – రెండో సంపుటి – ఆరుద్ర – తెలుగు అకాడమి – 2005 హైదరాబాద్

13) తెలంగాణ నారసింహ క్షేత్ర సాహిత్యం – అనుశీలనం
–వొజ్జల శరత్ బాబు – సిద్ధాంత పరిశోధనా వ్యాసం
– అముద్రితం


❀❀❀❀❀

# 27. తెలంగాణ పద్యకవితా వైభవం

శా. **వ్యాఖ్యల్‌జేయుచు, భాష్యముల్ పలికి, కావ్యప్రక్రియల్, శాస్త్రముల్**
**విఖ్యాతమ్ముగ వ్రాసియున్ ఘనత సద్వేదాది విద్యాళులం**
**ప్రఖ్యాతింగనినట్టి పండితులకున్, పాండిత్య శౌండీర్యమం**
**దాఖ్యల్ గల్గిన వారికిన్నెలవు సుమ్మా మండలంబంతయున్**

అని గంగాపురం హనుమచ్ఛర్మగారు పాలమూరు జిల్లా గూర్చి ప్రస్తావించినా ఇది యావత్ తెలంగాణ సాహితీ వైభవానికి ఎత్తిన అక్షర జయపతాకగా అన్వయించుకోవచ్చు. తెలంగాణ..... కవి పండితుల కాణాచి. కవిరాజులను, రాజకవులను కన్న కవివీరమాత. అష్టభాషాకోవిదులకు ఆటపట్టు. చతుర్విధ కవితా నిర్మాణదక్షుల విహారభూమి. అనిదంపూర్వ ప్రజ్ఞ నావిష్కరించిన అవధానుల ఆవాసము. నవనవోన్మేషంగా సాగే ప్రతిభామూర్తుల ప్రయోగశాల. అనర్ఘ కావ్యరత్నాలను దాచుకొన్న రత్నగర్భ. కవి పండిత సమాదరణలో అనన్యాలంకారం.

తెలుగులో ఎన్నో సాహిత్య ప్రక్రియలున్నాయి. అందులో పద్యం ఒకటి. పద్యం... ఛందోబంధాలలో ఒదిగి, అలంకారాలతో అందాన్నిచిందే అక్షరాకృతి. తన వొంపుసొంపులతో హృదయ క్షేత్రాలను రసప్లావితంచేస్తూ సాగుతున్న అక్షర ప్రవంతి.

**వెయ్యేళ్ళకు పైబడి వయసున్నా నిత్యయవ్వనియై విలసిల్లే తెలంగాణ పద్యం భక్తిని పెంచింది, రక్తిలో ముంచింది, విరక్తిని పంచింది. మనసుకు గిలిగింతలు పెట్టింది. అహంకరించిన వారి నెత్తిమీద మొట్టింది. జీవన రీతులను చాటే నీతులను ప్రవచించింది. కోపించింది, శపించింది, దీవించింది, .... వేయేల మానవ జీవన సకల పార్శ్వాలను అక్షర హస్తాలతో స్పృశించింది.**

పద్యాత్మకమైన శతకం, చంపూకావ్యం, త్ర్యర్థి, చతురర్థి, నిరోష్ఠ్య, అచ్చతెలుగు కావ్యాలు, యక్షగానం, ఉదాహరణం వాఙ్మయం పురుడుపోసుకొన్నదీ తెలంగాణ గడ్డమీదనే.

తెలుగు పద్యం 'కంద' రూపంలో తొలిసారి ప్రత్యక్షమైనది కరీంనగర్ జిల్లా కుర్క్యాల గ్రామం వద్ద. క్రీ.శ.946లో జినవల్లభుడు వేయించిన ఈ శిలాశాసనంలో మూడు కంద పద్యాలున్నాయి. తెలుగులో తొలి కవయిత్రి కుప్పాంబిక వర్ధమానపురానికి (నాగర్ కర్నూల్ జిల్లా) చెందినది.

వెయ్యేళ్ళకు పైబడిన తెలంగాణ పద్యకవితా వైభవాన్ని వివరించాలంటే ఒక ఉద్గ్రంథమే ఊపిరిపోసుకొంటుంది. కనుక తెలంగాణ కవులు వెలార్చిన పద్యనిర్మాణ చాతుర్యాన్ని "అత్తరుల మాసరలు అంటిచూపినట్లు" ప్రకటించే ప్రయత్నం చేస్తాను.

## అక్షర చిత్రాలు :

అక్షర క్రీడలో ఆరితేరినవారు తెలంగాణ కవులు. శబ్దాలతో వారు చేసిన సర్కస్ ఫీట్లు చూస్తే ముక్కున వేలేసుకోవడం ఖాయం. 'కమల' శబ్దంతో కొఱవి గోపరాజు తన సింహాసన ద్వాత్రింశికలో చేసిన ప్రయోగాన్ని చూడండి.

కం. **కమలారి గమల హిత దృ**
**క్కమలుని గమలాంకనాభి కమలాకరునిం**
**గమలాంక రమణి రమణుం**
**గమలాసన హృదయ కమలు కమల ప్రియునిన్**

ఎన్ని కమలాలను వికసింపజేసాడో! ఇవన్నీ శ్రీమన్నారాయణునకు సమర్పింపబడినవే. పద్యమంతా విష్ణుపరంగా సాగింది. కమలారి – కమలాలకు శత్రువు–చంద్రుడు, కమలహితుడు–సూర్యుడు – ఈ ఇద్దరినీ నేత్రకమలాలుగా కలవాడు, నాభియందు కమలం కలవాడు (కమలనాభుడు), కమలాకరుడు, కమలములయందుండే రమణి లక్ష్మి – ఈమెకు భర్త (విష్ణువు) కమలము నందు

కూర్చున్నవాడు బ్రహ్మ – అతని హృదయ కమలంలో కొలువైనవాడు (విష్ణువు), కమలములంటే మిక్కిలి ప్రియమైనవాడు... విష్ణువు. ఈ కందం అనడానికి, కనడానికి ఎంత అందంగా ఉందో.

బమ్మెర పోతన అనగానే ఘనీభవించిన భక్తిరసం మన కళ్ళ ఎదుట సాక్షాత్కరిస్తుంది. శ్రీకైవల్యపదాన్ని అపేక్షించి, జగద్ధితాన్ని ఆకాంక్షించి శ్రీమహాభాగవతాన్ని 'న భూతో న భవిష్యతి'గా రచించాడు. పోతన శబ్దేంద్రజాలికుడు. శబ్దాలతో ఎన్ని అద్భుతాలను సృష్టించవచ్చో తన పద్యాల ద్వారా చూపించినాడు. 'హరి' నామంతో సాగిన ఈ పద్యాన్ని గమనించండి.

**కం. హరిసుతు బరిచరుగాగొని**
**హరిసుతు దునుమాడి పనిచె హరిపురమునకున్**
**హరి విభునకు హరిమధ్యను**
**హరి రాజ్య పదంబునిచ్చె హరి విక్రముడై**

శ్రీరాముని గూర్చి చెప్పిన పద్యమిది. 'హరి' అంటే – విష్ణువు, ఇంద్రుడు, యముడు, కోతి, సింహము మొదలగు ఎన్నో అర్థాలున్నాయి. ఈ నానార్థాలతో చమత్కారం చేసాడు పోతన. హరిసుతు (వానరుడైన కేసరి కొడుకు – హనుమంతుని) సేవకునిగా జేసుకొని హరి విక్రముడై – (సింహము వంటి పరాక్రమం కలవాడై) హరిసుతు (ఇంద్రుని కొడుకైన వాలిని) చంపి, హరిపురమునకు (యమపురికి) పంపాడు. తరువాత హరి విభునకు (వానర ప్రభువైన సుగ్రీవునకు) హరిమధ్యను (సింహము వంటి నడుముగల రుమను), హరి రాజ్య పదమును (వానర రాజ్యాన్ని) ఇచ్చాడు.

శబ్దాలతో సందర్భాన్ని దృశ్యమానం చేసిన ఘట్టాలున్నాయి. గజేంద్ర మోక్షణంలో ఏనుగు, మొసలి పోరాటాన్ని వర్ణిస్తూ...

**కం. కరిదిగుచు మకరి సరసికి,**
**గరి దరికిని మకరి దిగుచు గరకరి బెరయన్**
**గరికి మకరి మకరికి గరి**
**భరమనుచును నతల కుతల భటులదురుపడన్**

అన్నాడు. కరి అంటే ఏనుగు. మకరి అంటే మొసలి. మొసలి ఏనుగును నీళ్ళలోకి లాగుతున్నది. ఏనుగు మొసలిని తీరానికి లాగుతున్నది. ఈ రెండింటి పెనుగులాట ఎంత తీవ్రంగా ఉందో చూపించిన శబ్ద చిత్రం ఈ పద్యం. పైగా ఇందులో మరో విశేషమేమంటే ఇది 'సర్వలఘుకందము'. అన్నీ లఘువులతోనే సాగుతుంది. ఈ పెనుగులాటలో ఏనుగుకు బలంతోపాటు అహంకారమూ అణిగిపోయింది. విష్ణువును 'నీవేతప్పనితఃపరంబెరుగ'నన్నది. గజప్రాణావనోత్సాహియై విష్ణువు సిరికి చెప్పకుండా వైకుంఠం నుండి బయలుదేరాడు. ఈ హఠాత్పరిణామంతో అయోమయంలో పడ్డది లక్ష్మీదేవి. విషయమేమిటో విష్ణువు నడుగాలెననుకొని

**కం. అడిగెదనని కడువడిజను**
**నడిగిన దను మగుడనుడుగడని నడ యుడుగున్**
**వెడవెడ సిడిముడి తడబడ**
**నడుగిడు నడుగిడదు జడిమ నడుగిడునెడలన్**

కారణం అడుగాలని వేగంగా అడుగులు వేస్తున్నది. అంతలోనే అడిగినా చెప్పడేమోనని వేగం తగ్గించింది. ఒక్కోసారి అడుగుల వేగాన్ని పెంచుతున్నది, అంతలోనే తగ్గిస్తున్నదట. మనసులోని ద్వైదీభావం నడకపై చూపిన ప్రభావాన్ని పద్యపునడకలోనే ప్రదర్శించాడు పోతన. అమ్మవారి పదములు సాగిన తీరును పద్యంలోని పదాలలో, పాదాలలో చూపించాడు. ఈ నడకకు పొట్టి, పొడుగు పాదాలలో సాగే కందాన్నే ఎంచుకోవడం విశేషం. అద్భుతమైన పద్య శిల్పం. అడిగే విషయం, అడుగుల విషయం కనుక 'డ' కార ప్రాసతో (23 సార్లు) పద్యాన్ని నడిపించడం మరో విశేషం.

శ్రవ్యకావ్యాన్ని దృశ్యమానంగా మలచడంలోనే కవి ప్రతిభ ద్యోతకమవుతుంది. శ్రీరామునియందు అనన్యభక్తిని చాటి రామదాసుగా చిరకీర్తి నార్జించుకొన్న కంచెర్ల గోపన్న తన దాశరథి శతకంలో

**ఉ. భండనభీము డార్తజన బాంధవు డుజ్జ్వల బాణతూణ కో**
**దండ కళా ప్రచండ భుజ తాండవకీర్తికి రామమూర్తికిన్**
**రెండవ సాటి దైవమిక లేడ చున్ గడగట్టి భేరికా**
**డాండ డడాండ డాండ నినదంబు లజాండము నిండ మత్తవే**
**దండము నెక్కిచాటెదను, దాశరథీ కరుణాపయోనిధీ**

శ్రీరామునికి సాటివచ్చే దైవము మరొకరెవరూలేరని ఢంకాబజాయించి చెపుతానన్నాడు. 'డాండ, డడాండ, డాండ' అన్నప్పుడు ఢంకా కొట్టినట్లుగానే ఉన్నది. ఇందులో విశేషం ఏమంటే ఈ ధ్వని మూడుసార్లు వచ్చింది. ఏదైనా మూడుసార్లు చెపితే ముమ్మాటికీ నిశ్చయమేనని భావిస్తారు. బిందు పూర్వక డకారాన్ని (ండ) ఆవృత్తిచేసి పద్యమంతా అక్షర ఢంకా మ్రోగించాడు.

## అంకెల పద్యం :

ప్రతిభావంతుడైన కవికి పరిమితులేముంటాయి? అతడు తన కృతిలో ఎన్నో చమత్కృతులను చూపగలడు. ఆ పని చేసి చూపినవాడు మల్లికార్జునభట్టు. చూపినది భాస్కర రామాయణంలో. చంపూ (గద్య పద్యాత్మక) పద్ధతిలో తెలుగులో వెలిసిన తొలిరామాయణం భాస్కరరామాయణం. అవతారిక లేకుండా అవతరించిన సుకృతి ఇది. ఈ రామాయణ భవనాన్ని నిలబెట్టిన మూలస్తంభాలు మల్లికార్జున భట్టు, కుమార రుద్రదేవుడు, హుళక్కి భాస్కరుడు, అయ్యలార్యుడు. ఈ రచనలో సింహభాగం మల్లికార్జునభట్టుదే. బాలకాండంలో ఇతడు దశరథుని ఔన్నత్యాన్ని ఉగ్గడించిన తీరును చూడండి.

**మ. జనలోకైక మహారథుండు, ద్విజ రక్షాదక్షు డాజింద్రిలో**
**చను దుద్యచ్చతురంగ సైన్యుడును, భాస్వద్రూప**
**పంచాస్త్రుడ**
**న్నృప క్రౌంచ షడాననుండు, ఘనసప్తాశ్వాన్వయుండష్ట**
**మం**
**త్రి నవద్రవ్య నిధీశుడై దశరథాధీశుండు పెంపొందుచున్**

అంకెలతో లంకెపెట్టిన పద్యమిది. దశరథుడు ఒకే ఒక మహారథుడు. (ద్విజ) బ్రాహ్మణులను రక్షించడంలో దక్షుడు. యుద్ధంలో (త్రిలోచనుడు) రుద్రుడు. చతురంగ సైన్యంకలవాడు. రూపంలో (పంచాస్త్రుడు) మన్మథుడు. శత్రువులను మర్దించడంలో (షడాననుడు) కుమారస్వామి. (సప్తాశ్వాల రథాన్నధిరోహించే) సూర్యవంశంవాడు. అష్టమంత్రులతో, నవ నిధులకు ప్రభువై దశరథుడు వెలుగొందుచున్నాడు. ఇందులో ఒకటి నుండి పది వరకు వరుసగా అంకెలను దశరథునికి అన్వయిస్తూ చెప్పడం విశేషం.

## చిత్రకవిత :

ఛందోబద్ధమైన కవిత్వాన్ని లాక్షణికులు 'ఆశు, మధుర, చిత్ర, విస్తర'ములనే నాలుగు విధాలుగా వింగడించారు. వీటినే చతుర్విధ కవితలని పేర్కొన్నారు. అయితే ఇందులో చిత్ర కవిత కవి ప్రతిభకు నికషోపలము. పాఠకునికి ఆలోచనామృతము. చిత్రకవిత ప్రధానంగా 'అక్షరాలతో, శబ్దాలతో ప్రయోగాలు చేయడం. గర్భకవిత్వం, బంధ కవిత్వమ'నే మూడు విభాగాలుగా సాగుతుంది. చిత్రకవితకు లక్షణముచెప్పిన చిత్రకవి పెద్దన జటప్రోలు సంస్థాన ప్రాంతము వాడు. తెలంగాణ కవులు సల్పిన చిత్రకవితా క్రీడను దర్శిద్దాము.

## అచల జిహ్వాక :

పద్యాన్ని చదువుతుంటే నాలుక కదలకుండా ఉండడం దీని ప్రత్యేకత.

**కం. అభోగ మహీభాగ మ**
**హాభాగ మహామహామహాభోగ మహా**
**మా భామావహ బహుమహి**
**మాభామావహ విభావ మఘువ ముఖావా!**

– కాణాదంపెద్దన, ముకుంద విలాసం

## పాదభ్రమకం :

పద్య పాదాన్ని తిప్పి చదివితే అవే పదాలు మళ్ళీ వస్తాయి.

**కం. మార సమరామ సరమా**
**సారావన రసవిభావి సరనవరాసా**
**హారి యరి ధారి యరిహా**
**భారత జయద పరధీర పదయజ తరఖా**

– కాణాదంపెద్దన, ముకుంద విలాసం

## పద్యభ్రమకం :

పద్యాన్ని చివర నుండి వెనకకు చదివినా అవే పదాలు వస్తాయి.

**కం. ధీర వనజ భానుమహిమ**
**సారసవర భామదరగ సాయాదరపా**
**పార దయాసాగర దమ**
**భారవసర సామహిమాను భాజనవరధీ!**

– మతింగంటి జగన్నాథాచార్యులు; శ్రీరంగనాథ విలాసము

## గుణకము :

అక్షర గుణింతముతో పద్యం సాగుతుంది.

**మ. గరుడాంకధ్వజ గానలోల గిరిరాట్కన్యా మన స్థాయి గీ**
**ర్వర సంరక్ష గుణాఢ్య గూఢపద సద్రమాట్తల్ప గేయ ప్రతా**
**ప రమాగైరికచేల గోధినయనాప్తా గౌతమర్షి ప్రియం**
**కర గంగాజనకాంఘ్రి తామరస గర్గస్తుత్య నిత్యోత్సవా!**

– మతింగంటి జగన్నాథాచార్యులు; శ్రీరంగనాథ విలాసము

## ఏకాక్షర కందం :

ఒకే అక్షరంతో సాగే పద్యం

కం. నేనాన నాని నా నిను
నాన ననిన్ నిన్ను నాననని నిన్ననె నా
నూనిన నెన్నాన ననెన్
నోనన నెన్నైన నేనునున్ నిన్నన్నా

– కోట్ల బాలబ్రహ్మాచారి, శతావధాని

## నిరోష్ఠ్యము :

ఓష్ఠ్యములంటే పెదవులు. పద్యం చదివేటప్పుడు పెదవికి పెదవి తాకకుండా ఉండేటట్లు చేసే రచన నిరోష్ఠ్యరచన. తెలుగు సాహిత్యంలో ప్రప్రథమ నిరోష్ఠ్య రచన 'దశరథనందన రాజచరిత్ర'. కర్త మరింగంటి సింగరాచార్య (క్రీ.శ. 16 శతాబ్దం). 'రామాయణం' అంటే రెండవ అక్షరం పలికేటప్పుడే పెదవులు తాకుతాయి. అందుకే 'దశరథనందనరాజచరిత్ర' అని పేరుపెట్టాడు. శుద్ధాంధ్ర నిరోష్ఠ్య రచనకు కూడా ఇతడే ఆద్యుడుగా కీర్తింపబడ్డాడు. అహల్యకు శాపవిమోచనం కలిగించిన శ్రీరామపాద విశిష్టతను తెలుపుతూ...

సీ. అచలారి నిరసించినట్టి రాక్షసనేత
నచలకిందికి దన్నినట్టి యంఘ్రి
సత్యజగత్స్థలి చక్కికై సాచిన
నల శతధృతి కడ్గినట్టి యంఘ్రి
సకల ఋషి శ్రేణి సంతతాసక్తిచే
సరసి హృత్స్థలి దాల్చినట్టి యంఘ్రి
కలశనీరధి కన్యకా స్తన ఘట్టన
నతిశయిల్లగ జేసినట్టి యంఘ్రి

తే.గీ. యనగ సనక సనందనాద్యఖిల ఖచర
యతి తతికైన గనరానియట్టి యంఘ్రి
తాకినంత ధరాధినేతలు గణించ
శిల నళిననేత్రయై నిల్చె జిత్రకళల

## నిరోష్ఠ్య చతుర్విధ కందము :

చతుర్విధ కందమంటే కంద పద్యంలోని రెండవ పాదంలోని రెండవ గణము నుండి ప్రారంభిస్తూ ఇంకొక కంద పద్యం సాగుతుంది. ఆ పద్యంలోని రెండవపాదం రెండవగణాన్ని ఆధారంచేసుకొని మూడవ కంద పద్యం. ఇదే పద్ధతిలో నాల్గవ కందం సాగుతుంది. చతుర్విధ కందాన్ని మొదట ప్రయోగించినవాడు నన్నెచోడుడు. కుమార సంభవ కావ్యంలో ఈ ప్రయోగం చేశాడు. కాని నిరోష్ఠ్య చతుర్విధ కందాన్ని తెలుగులో మొదటిసారిగా ప్రవేశపెట్టింది ఆత్మకూరు సంస్థానానికి చెందిన పురుషకారి కేశవయ్య. అతని దాశరథి చరిత్రలోని ఈ చతుర్విధ కందాన్ని అవలోకించండి.

కం. శ్రీశా! జయజిత శరదై
త్యేశా! జయరక్షిత జనహిత జటిచయనా
కేశా! జయధృత జలజ ధ
రేశా! జయశంకరగిరి ధృతి హరి శయనా

2. జయరక్షిత జనహిత జటి
చయనా కేశా! జయధృత జలజ ధరేశా!
జయ శంకర గిరి ధృతి హరి
శయనా! శ్రీశా! జయజిత శరదైత్యేశా

3. కేశా! జయధృత జలజ ధ
రేశా! జయ శంకరగిరి ధృతిహరి శయనా!
శ్రీశా! జయజిత శరదై
త్యేశా! జయరక్షిత జనహిత జటిచయనా!

4. జయశంకర గిరిధృతి హరి
శయనా! శ్రీశా! జయజిత శరదైత్యేశా!
జయరక్షిత జనహిత జటి
చయనా కేశా! జయధృత జలజ ధరేశా!

## గర్భకవిత :

ఒక పద్యంలో ఇంకో పద్యాన్ని (పద్యాలను) ఇమిడ్చి రాయడం. పురుషకారి కేశవయ్య తన సీస పద్యంలో మత్తేభాన్ని, కందాన్ని ఎలా గర్భితం చేశాడో చూద్దాం. అదికూడా నిరోష్ఠ్యంగా...

### మత్తేభ కంద గర్భసీసము :

సీ. 'స'తత శృంగార లసజ్జగజ్జరర కం
దశ్రీ శరీరాంచితా' యహీడ్మ
య 'హత నీలాదితి జారి తాత యజరై
కాధార చంద్రాననా' నిరంజ

న 'సత రక్షా రతినందకారి ధర ధ
న్యా నిత్య రాజద్ఘృణా' ఖలాంత
క 'హితశీతాచల కన్యకాదయిత హృ
ద్దృద్యాలయాశ్రీ గృహీ'య జాత

తే.గీ. 'నలినదళనేత్ర యాతత కలశజలధి
సారదేశఘన నగరీశా, జలజజ
జనక హృదిన గళ, కలిత సరసహార
జాల కాంచన చేలా' రసా సతీశ॥

పై పద్యంలో మొదటి నాలుగు పెద్ద పాదాలలో ప్రతి పాదంలోని రెండవ అక్షరం నుండి గ్రహించి రాస్తే మత్తేభవృత్త పద్యం వస్తుంది. చూడండి.

మ. తత శృంగార లసజ్జగజ్జరర కందశ్రీ శరీరాంచితా
హతనీలాదితి జారి తాత యజరైకాధారచంద్రాననా
నత రక్షారతి నందకారి ధర ధన్యా నిత్య రాజద్ఘృణా
హిత శీతాచల కన్యకాదయిత హృద్దృ ద్యాలయాశ్రీ గృహీ

పై సీసపద్యం లోని తేటగీతి నందలి మొదటి పదంతో మొదలుపెడితే కందం అందంగా అవతరిస్తుంది.

కం. నలిన దళనేత్ర యాతత
కలశ జలధి సారదేశ ఘన నగరీశా
జలజజ జనక హృదిన గళ
కలిత సరసహారజాల కాంచనచేలా


**బంధ కవిత :**

పద్యాన్ని ఆయా చిత్రాలలో ఇమిడేటట్లు రచించడం. దీనిని తెలుగులో నన్నెచోడుడు ఆరంభించాడు. కాని నిరోష్ఠ్య బంధ కవిత మాత్రం తొలిసారిగా రూపుదిద్దుకొన్నది పురుషకారి కేశవయ్య కాలం నుండే. ప్రస్తుతం శతావధాని శిరిసినహళ్ కృష్ణమాచార్యుల బంధ కవితను చూద్దాం. ఒకే పద్యాన్ని మూడు బంధాలలో పొదిగేటట్లు రచించడం వీరి ప్రత్యేకత.

**మాణవక వృత్తము :**

మానుగ నీ భావన మా
మానవ భూ సాధనమా!
మానధనం బీదిన మా
మానదికన్ నన్ గనుమా!

**భావము :** అందముగా నీ భావనయే మా మానవలోకమునకు కారణము. అభిమాన ధనము వదలని స్థితినున్న నన్ను దయతో గనుమా!



## సొగసైన వర్ణనలు :

'కవయతీతి కవిః' – వర్ణించేవాడు కవి అన్నారు. వర్ణనలోని భావము, భాషనుబట్టి కవి స్థాయిని అంచనావేయవచ్చు. జటప్రోలు సంస్థానాధీశ్వరుడు సురభి మాధవరాయలు (16వ శతాబ్దం) చంద్రికా పరిణయమనే ప్రౌఢ ప్రబంధాన్ని సంతరించారు. వసుచరిత్రకు సాటిరాగల రచనగా విమర్శకులు దీన్ని కీర్తించారు. అందులో నాయికయైన చంద్రిక వర్ణనను చూడండి.

**మ. అతిశోణం బతికోమలం బతి విశాలాత్మం బతిశ్లక్ష్ణకం**
**బతినిమ్నం బతిమేచకం బతిదృఢం బత్యంత పారిప్లవం**
**బతివక్రం బతిదీర్ఘమౌర బళి యీ యంభోజ పత్రాక్షి య**
**ప్రతిమానావయవ ప్రతానము మనః పద్యన్విచారింపగన్**

పైకి చూస్తే నాయిక చాలా 'అతి'యైన దానివలే కనిపిస్తున్నది. పైగా ఎర్రనైనది, నల్లనైనది – కఠినమైనది, మెత్తనైనది, విశాలమైనది, కృశించినది అంటూ పరస్పర విరుద్ధ విషయాలను ప్రకటించేదిగా అనిపిస్తున్నది. కాని వివరాల్లోకి వెళితేనే అసలురంగు బయటపడుతుంది.

(శోణంబు) ఎర్రనైనవి – ఆమె అరికాళ్ళు, కోమలమైనవి ఆమె పాదాలు, విశాలమైనది కటిస్థలము, (శ్లక్ష్ణం) కృషించినది నడుము, (నిమ్నము) లోతైనది నాభి, (మేచకము) నల్లనైనది నూగారు, దృఢమైనవి స్తనాలు, (పారిప్లావితం) చపలమైనది కన్నుల జంట, వంకరలు తిరిగినవి ముంగురులు, దీర్ఘమైనది ఆమె జడ. ఇన్నిటితో 'అతి'గా వెలిగే 'నాతి' సౌందర్యశోభ ఏమిటో ఇప్పుడు మనకు అర్థమవుతుంది. విశేషణాలతో విశేష్యాన్ని ధ్వనింపజేసే అద్భుతమైన రచనా సౌందర్యం, 'అతి' శబ్దాన్ని ఆవృత్తి చేయడంలో ఉన్న లయ మదిని పులకింపజేస్తుంది.

చంద్రుడు సురలకు భోజ్యవస్తువు, కవివరులకు పూజ్యవస్తువు. చంద్రుని వర్ణించని కవులరుదు. వెల్లూరి నరసింగకవి తన రాచకన్యకా పరిణయములో చంద్రోదయాన్ని వర్ణించిన తీరును గమనించండి.

**చ. సురలకు విందు, పొందు తొగజోటికి, లేటికి పట్టు, గట్టుకూ**
**తురుదొర సొమ్ము, వమ్ము వెలిదొంగకు, గంగకు దీవి, తావితా**
**మరలకు కీడు, జోడు హరి మామకు, తేమకు మేర, జారతా**
**చరులకు ముప్పు, మెప్పు గురుజాయకు, నాయకుడొందె ముందెసన్**

దేవతలకు ఆహారం, కలువల చెలికాడు, జింకకు స్థానం, జింకను ధరించిన శివునికి అలంకారం, దొంగలకు బాధ, ఆకాశగంగకు ద్వీపము, తామరలకుకీడు, సూర్యునికి జోడు, చల్లదనానికి సంపద, జారులకు ముప్పు, గురువుభార్యకు ఉపపతి. అద్భుతరీతిలో చంద్రుని స్వరూప స్వభావాలను ఆవిష్కరించిన మత్రివిత్తనమీ పద్యం. గట్టు కూతురు దొర – హిమవంతుని బిడ్డయైన పార్వతికి భర్త – శివుడు – ఇలాంటి చక్కని తెలుగు పదబంధాలతో, విందు–పొందు, సొమ్ము–వమ్ము, వంటి అనుప్రాస విన్యాసాలతో చంద్రునివలెనే మనసుకు ఆహ్లాదాన్ని కలుగజేస్తున్నదీ పద్యం.

జాతీయాలు భాషకు సరికొత్త అందాలను సంతరిస్తాయి. విషయానికి పుష్టిని, పాఠకునికి తుష్టిని కలిగిస్తాయి. పిల్లలమఱ్ఱి పినవీరభద్రుడు తన శృంగార శాకుంతలములో కణ్వమునిచే చేయించిన శివస్తుతిపై ఒకసారి దృష్టిపెడదాం.

**సీ. గిరిజా విభుండు ముంగిటి పెన్నిధానంబు**
**కృత్తివాసుండు తంగేటిజున్ను**
**గోరాజ గమనుండు గుజ్జుమామిడిపండు**
**కుసుమాస్త్రహరుడు ముంగొంగుపసిడి**
**శీతాంశుధరు డఱచేతి మాణిక్యంబు**
**కద్రూజ కటకుండు గాదెకొలుచు**
**కరటి దానవవైరి పెరటికల్పద్రుమం**
**బసమనేత్రుడు సిద్ధరసము చెలమ**

**తే.గీ. విషగళుడు గాడికట్టిన వేల్పుటావు**
**హాటకాచల ధన్వి సిద్ధాంజనంబు**
**పురహరుడు పెట్టెలోనున్న పరుసవేది**
**ప్రమథభర్త చింతామణి భక్తులకును**

'తంగేటిజున్ను, పెరటి కల్పకం, వేల్పుటావు, పరుసవేది' వంటి జాతీయాల ప్రయోగంతో శివుని అనుగ్రహవిశేషాన్ని అమోఘంగా అందించాడు. ఈ పద్యంలో మరో విశేషం ఏమంటే పరమశివుని పర్యాయపదాలతో పద్యపాదాలు ప్రారంభంకావడం. ద్వాదశ జ్యోతిర్లింగ రూపుని పన్నెండు పర్యాయ పదాలతో ప్రస్తుతించడంలో కవి ప్రతిభ ద్యోతకమవుతున్నది. పద్యంలో శివనామం, తత్సంబంధ జాతీయం – ఈ రెండింటితోనే ప్రతి పాదం కదులుతుంది, అర్థనారీశ్వరతత్త్వాన్ని ఆవిష్కరిస్తున్నదా! అన్నట్లు.

తెలుగు సాహిత్యంలో నవ్యరీతులకు నాంది పలికినవాడు పాల్కురికి సోమనాథుడు. మతావేశం, భాషావేశం, కవితావేశం నేత్రత్రయంగా వెలిగిన సాహితీరుద్రుడు సోమనాథుడు. 'అల్పాక్షరంబుల అనల్పార్థ రచనగావించ'మని కవులకు అక్షరాల పొదుపుకు పిలుపునిచ్చినవాడు. రచనాపరంగా ఎన్నో పోకడలు పోయినవాడు. మచ్చుకు ఒక పద్యం.

**సీ. శ్రుతి "ఏకఏవరుద్రో నద్వితీయాయతస్థే" యనుట**
**యథార్థంబు దలప**
**నవల "నణోరణీయాన్మహతో మహీయా"నన నదియె**
**యనూన పదము**
**పంబి "యనాగోచరం"బను "న ప్రాప్య మనసా సహ"**
**యనుమాట నిజము**
**ఏదియు గాదనియెడి పరమేశుడే యెంతయునని యెర్గి**
**యెఱగననక**

.....................................................

ఇది 'అనుభవ సారము'లోని పరమేశ్వర ప్రశంస. వేద మంత్రభాగాలకు మంత్రభాగాలనే ఉటంకిస్తూ సాగింది. ఇలా వైదిక మంత్రాలను ఇంత స్థాయిలో పద్యాలలో ఇమిడ్చిన ప్రతిభామూర్తులైన కవులు తెలుగు సాహిత్యంలో లేరంటే అత్యుక్తి కాదేమో?

లౌకిక లంపటాలలోబడి కొట్టుమిట్టాడుతూ దేహభ్రాంతిలో మునిగిన వారికి తత్త్వోపదేశంచేసిన కవితల్లజులెందరో ఉన్నారు. వారి కవిత కళ్ళు తెరిపిస్తుంది. తెలుగు పద్యానికి రాతలో, కూతలో మార్దవాన్ని, మాధుర్యాన్నద్దిన 'ఉత్పల' సత్యనారాయణాచార్యుల 'చంపకమాల'ను అవలోకించండి.

**చ. సరిగ మనుష్యదేహమొక సత్రము, అందరమందులో ముసా**
**ఫిరులము కొన్నినాళ్ళిచట విశ్రమమొంది స్వధామమేగుటే**
**ఒరవడిగాని ఇందె పడియుండిన సత్రము సొంతమౌనటే**
**తిరుపతి వేంకటాచలపతీ! అఖిలాండపతీ! శ్రియఃపతీ**

## లాలి జోల పద్యాలు :

బాల సాహిత్యంలో లాలి, జోల పాటలకు ప్రత్యేక స్థానమున్నది. ముద్దైన పాటలను పద్యావతారమెత్తించినారు మన కవులు. భక్తలోలుడు, దయాశీలుడైన బాలకృష్ణునికి

**కం. జోజో కమల దళేక్షణ**
**జోజో మృగరాజమధ్య, జోజో కృష్ణా!**
**జోజో పల్లవ కరపద**
**జోజో పూర్ణేందు వదన, జోజో యనుచున్**

జోల పాడినాడు బమ్మెర పోతన. పద్యం గొంతెత్తి పాడితే జోకొట్టినట్టుగానే ఉంటుంది.

'అవధానంబులనేకముల్ గఱపి', 'చతుర్విధ కవిత్వ ప్రౌఢిమల్' – చూపిన కవిశిరోమణి చింతపల్లి వీరరాఘవ కవి. తన 'మధురవాణీ విలాసము' అనే కావ్యంలో 'లాలి సీసాన్ని' అందించాడు.

**సీ. లాలి శ్రీమచ్చౌర్య లక్ష్మీ సహాయ లా**
**లి క్షితీశాళి లాలిత్యగేయ**
**లాలి లక్షణయుక్త లావణ్యకాయ లా**
**లి విశేషధీ లవలీల మాయ**
**లాలి జయాస్పదా లఘుసాంపరాయ లా**
**లి ప్రసూనాస్త్ర కేళీనికాయ**
**లాలి విపక్షేంద్రజాలాలి జేయ లా**
**లి త్రయీధర్మ పాళీ విధేయ**

**తే.గీ. లాలి వల్లకి వర్ణితాలాప లోల**
**లాలి సంతత లోకపాలా స్వలీల**
**లాలి యీచెదమయ్యా హేలా విశాల**
**లాలి యీగర ముద్దుబాలా సుశీల**

ఉయ్యాల ఊగుతున్నట్లుగా సాగిందీ పద్యం. రాగాన్ని మేళవిస్తే ఈ పద్యం పాటై పరవశింపజేస్తుంది. ఇందులో అంత్యానుప్రాస అదనపు అలంకారం.

## శతక సౌందర్యం :

శతక శిశువుకు మాతృస్థానమైనది తెలంగాణము. పాల్కురికి సోమన 'వృషాధిప శతకం' తెలుగులో తొలిశతకం. అయినా ఇందులో రచనాపరంగా ప్రాథమిక స్థాయి కనిపించదు, పరిణతస్థాయి తప్ప. చూడండి...

**చ. సురవరమల్ల, మల్లలిత సూత్ర సుధాంబుధి ఖేల, ఖేల సం**
**గర కలకంఠ, కంఠమణి నాయక భీమ భుజంగ, జంగమ**
**స్థిరతరనాథ, నాథక, నిధీకృత రూప, విరూప, సమ్మతా,**
**వరకరుణాబ్ధి ప్రోవు బసవా, బసవా, బసవా, వృషాధిపా!**

ఛేకానుప్రాస, అంత్యానుప్రాసలతో, సుందర సమాన ఘటనతో పాల్కురికి పాండిత్యాన్ని పట్టిచూపే పద్యం ఇది. శతక లక్షణాలలో మకుటం ఒకటి. యతిస్థానంలో మకుటాన్ని ప్రారంభించిన (దాశరథీ కరుణా పయోనిధీ) రామదాసు ప్రతిభను ప్రశంసించాల్సిందే. ద్విపాద మకుటాన్ని పాటించి నరసింహ శతకాన్నందించిన కాకుత్థం శేషప్ప కవికి కైమోడ్పులు. భర్తృహరి సుభాషిత త్రిశతిని తెలుగులోకి మొదటిసారి అనువదించినవారు జటప్రోలు సంస్థాన ఆస్థానకవి ఎలకూచి బాలసరస్వతి. తెలుగులో మొదటి త్ర్యర్థికావ్యం (యాదవ రాఘవ పాండవీయం) నిర్మించినవారు. భర్తృహరి సుభాషితాలను తరువాతి కాలంలో పుష్పగిరి తిమ్మన, ఏనుగు లక్ష్మణకవి అనువదించారు. అయితే వీరు మకుట నియమం పెట్టుకోలేదు. కాని బాలసరస్వతి మాత్రం మకుట నియమం పాటించాడు. పైగా మరొక అడుగు ముందుకువేసి నీతి శతకానికి 'సురభిమల్లా నీతి వాచస్పతీ' అని, శృంగార శతకానికి 'సురభిమల్లా మానినీ మన్మథా' అని, వైరాగ్యశతకానికి 'సురభిమల్లా వైదుషీ భూషణా' అని ఔచితీమంతంగా మకుట ధారణ చేశాడు. అతని పద్యధారకు ఒక ఉదాహరణ.

**మ. ఒకచో వెన్నుడు పవ్వళించె, నొకచో నున్నారు దైత్యేంద్రు,**
**లొం**
**డొకచో శూల చయంబు నిల్చె, నొకచో నుగ్రానలంబున్ బలా**
**హకము ల్వర్తిలె, నెంత భారసహుడాహో ధన్యుడౌ సింధు పా**
**లకు డైశ్వర్య పురందరా సురభిమల్లా నీతి వాచస్పతీ**

ఈ పద్యం చదువుతుంటే తరువాతి కాలంలో ఏనుగు లక్ష్మణకవి 'ఒకచో నేలను బవ్వళించు....." పద్యం చప్పున స్ఫురిస్తుంది. తెలుగు శతకమనగా మెదడు తలుపును తెరచుకొని ముందుగా ముందుకొచ్చేది సుమతి శతకం. ఈ శతక పద్యం ఒక్కటైనా తెలియని తెలుగు వాడుండడంటే సాహసంకాదు. భావంలో చిక్కదనం, భాషలో చక్కదనం పొదుగున్న శతకం ఇది. తెలుగు సాహిత్యంలో అకారక్రమంలో వచ్చిన శతకం బహుశా ఇదేనేమో? మకుటంలో 'సుమతీ' – 'ఓ బుద్ధిమంతుడా!' అని సంబోధించాడు. 'ఓ బుద్ధిమంతుడా!' అని పిలిస్తే అవతలవాడు సంతోషించి చెప్పే విషయాన్ని శ్రద్ధతో వింటాడు. మానసిక శాస్త్రానికి, వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన అంశం ఇది. ఇదొక అపూర్వ మకుట ప్రయోగం. నీతులను లోకరీతులను ఏకరువు పెట్టిందీ శతకం.

**కం. తన కోపమె తన శత్రువు**
**తన శాంతమె తనకు రక్ష దయచుట్టంబౌ**
**దన సంతోషమె స్వర్గము**
**తన దుఃఖమె నరకమండ్రు తథ్యము సుమతీ!**

ఇంతకన్నా వ్యక్తిత్వ వికాస మౌలిక సూత్రమింకేముంటుంది?

సమాజంలోని అపసవ్య ధోరణులను వెలివకుండా చాటిన కవిధీరులెందరో. కవి నిర్భయుడుకదా! సంఘంలోని విపరీత ధోరణులను తన శతక దర్పణంలో ప్రతిబింబింపజేసిన శేషప్పకవి పద్యాన్ని చూద్దాం.

**సీ. అధిక విద్యావంతు లప్రయోజకులైరి**
**పూర్ణశుంఠలు సభాపూజ్యులైరి**
**సత్యవంతులమాట జనవిరోధంబాయె**
**వదరుబోతుల మాట వాసికెక్కె**
**ధర్మవాసన పరుల్ దారిద్ర్యమొందిరి**
**పరమలోభులు ధన ప్రాప్తులైరి**
**పుణ్యవంతులు రోగభూత పీడితులైరి**
**దుష్ట మానవులు వర్ధిష్ణులైరి**

**తే.గీ. పక్షివాహన మావంటి భిక్షుకులకు**
**శక్తి లేదాయె నికనీవె చాటుమాకు**
**భూషణ వికాస! శ్రీధర్మపురనివాస!**
**దుష్ట సంహార! నరసింహ, దురిత దూర!**

## పలు బాసల పద్యాలు :

వివిధ భాషలపై విశేషాధికారంగల కవి ప్రవరులెందరో తెలంగాణ గడ్డన పుట్టి తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు. ముఖ్యంగా అష్ట భాషాకోవిదులకు అనాదిగా తెలంగాణము ఆవాసభూమి. కొఱవి గోపరాజు, పిడుపర్తి సోమన, మల్లికార్జునభట్టు, కామసముద్రం అప్పలాచార్యులు, తిరుమల కృష్ణమాచార్యులు, లయగ్రాహి గరుణాచల కవి, వనపరి సంస్థానాధీశుడు బహిరి గోపాలరావు, మరింగంటి సింగరాచార్యుల వంటి వారెందరో అష్టభాషావిదులమని చెప్పుకొన్నారు. ఘంటాశత గ్రంథకరణ ధుర్యులెందరో ఉన్నారు. వారిలో ఆత్మకూరు సంస్థాన ఆస్థానకవి 'బాలసరస్వతి' తిరుమల బుక్కపట్టణం శ్రీనివాసాచార్యులవారు పేర్కొనదగినవారు.

1903లో మద్రాసులో వీరు 'శతఘంటకవనమ్' చేసారు. అష్టభాషల్లో (సంస్కృతాంధ్రాలు, షడ్విధ ప్రాకృతాలు) 'సముద్రమథనం'పై కవితను పలికారు. వీరి ఆశుధాటికి రాసుకోవడానికే తడబడ్డారట. ఆ కార్యక్రమంలో కందుకూరి వీరేశలింగంగారు కూడా పృచ్ఛకులుగా పాల్గొన్నారు.

### అచ్చ తెలుగు పద్యం :

అచ్చతెలుగు తొలికావ్యం పొన్నగంటి తెలగన 'యయాతి చరిత్ర' అవతరించింది తెలంగాణయందే. అచ్చ తెలుగు సొగసు చూపించాడు తెలగన. మచ్చుకు

**మత్తకోకిల: 'ఓలి రక్కసి వంగడంబున కొజ్జకూరిమి కూతు ర**
**న్నేల వేలుపు గన్నియం దగనీవు గట్టిన పుట్టముం**
**దాలుపం దగునమ్మ నా' కని దాని కర్మిలి బల్కు దా**
**నాలకించక నూతద్రోచి గయాళియై చనియెన్వడిన్**

దేవయాని శర్మిష్ఠల వాదును ప్రత్యక్షమొనరించాడు. నేలవేలుపు (భూసురుడు-బ్రాహ్మణుడు) - వంటి అందమైన ప్రయోగాలున్నాయి.

### సంస్కృతం :

బలరామ కృష్ణులను జూచి బలిచక్రవర్తి చేసిన స్తుతి

**ఉ. ధీయుతుడై 'నమో భగవతే హరయే పరమాత్మనే ముకుం**
**దాయ సమస్త భక్త వరదాయ నమః పురుషోత్తమాయ కృ**
**ష్ణాయ మునీంద్ర వంద్య చరణాయ సురారి హరాయ సాంఖ్యయో**
**గాయ వినీల భాస్వదలకాయ రథాంగ ధరాయ వేధసే**

'ధీయుతుడై' తప్ప తక్కినదంతా సంస్కృతంలోనే సాగించారు బమ్మెరపోతన.

### ప్రాకృతం :

కొఱవి గోపరాజు సింహాసన ద్వాత్రింశికలోని ఈ పద్యాన్ని చూడండి.

**సీ. దంద శూకాధిపోద్దండ భుజాదండ**
**భూరి విశ్వంభరా భారధుర్య**
**జంభారి పరికీర్తితాంభోజినీ మిత్రు**
**సూణు సమాహియ దాణణయ**
**అక్కిణి హృదయ దండొక్క కేళఃక్కేళి**
**పతివః కణీవళః పక్కదక్క**

### సంస్కృత, ద్రవిడ, కర్నాటాంధ్ర, మహారాష్ట్ర భాషల పద్యం :

ఐదు భాషల పదాలతో అపూర్వ రీతిలో మణి ప్రవాళ శైలిలో పద్యం రాసిన గరీయః ప్రతిభుడు పాల్కురికి సోమనాథుడు. ఈ పంచభాషామృతాన్ని ఆస్వాదించండి.

**చ. తిరుఘుఁడి నామనంబుననుదే హృదయేశ్వర కింవిధీయతాం**
**పరతర త్వం బురాణ నను పాహివిభో అనువాపితా అమా**
**వరదనెఘళ్ళె యంచు నిను బ్రస్తుతిసేయుదు బెక్కు భాషలన్**
**వరద వివేకశీల బసవా, బసవా, బసవా, వృషాధిపా**

ఇందులో తిరుఘుఁడి (తమిళం), దే (మరాఠీ), కింవిధీయతాం (సంస్కృతం), నను (తెలుగు), అమావరదనెఘళ్ళె (కన్నడ). ధారచెడకుండా పంచభాషా సంగమంగా పద్యాన్ని ప్రవహింపజేసాడు పాల్కురికి.

### తెలంగాణ మాండలికం :

తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డిగారు సహజ సుందరంగా మలచిన పద్యాన్ని చూడండి.

**సీ. వారి యెంకన్న, దోస్తిదారుడా, యిదన్క**
**యేమదో గాలొల్లి యెరుకజేయుర**
**..................................................**
**........................................**
**పొద్దుగాల మా గొర్రెపోరి బర్రది పెర్గు**
**దెస్తదిలే దాన్తొ నాస్తజేసి**
**..................................................**
**........................................**

### ఆశుపద్యం :

చతుర్విధ కవితలలో ఆశుకవిత యొకటి. అవధానం ఇందులోనిభాగమే. ఎందరో ఆశుకవితా చక్రవర్తులు ఈ నేలన పుట్టారు. తెలుగులో శతావధానానికి ఆద్యుడుగా చరిగొండ ధర్మన్నను పేర్కొన్నారు పరిశోధకులు. అంధుడై కూడా వందల అవధానాలుచేసిన ఆత్మకూరు సంస్థాన కవి కోట్ల బాలబ్రహ్మాచారిది అవధాన చరిత్రలో ప్రత్యేకాధ్యాయం. ఒకసారి కందుకూరు రుద్రకవికి సమస్యనిచ్చారట. 'వక్త్రంబుల్ పది కన్నులైదు కరముల్ వర్ణింపగా వేయగున్' పది తలలు, ఐదుకన్నులు, వేయిచేతులు గలవాడని దీని భావం.

విషయమేకాదు 'క్ర' - దుష్కర ప్రాసతో 'సమస్య'. అయినా ప్రతిభావంతుణ్ణి ప్రతిబంధకాలు ఏమి చేస్తాయి? పద్యం ఎత్తుకున్నాడు రుద్రకవి.

**శా. ఈక్రా ప్రాసము కష్టమౌననుచు మీరెంతేసి వారాడగా**
**వాక్రాంసంబిది సత్కవీశ్వరుల త్రోవల్ గామినే జెప్పెదన్**
**దిక్రారాతికి, బార్వతీశ్వరులకున్, దిగ్మ ప్రభారాశికిన్**
**వక్రంబుల్ పది, గన్నులైదు, కరముల్ వర్ణింపగా**
**వేయగున్**

(దిక్రారాతి) రావణాసురునికి పదితలలు, పార్వతీశ్వరులకు ఐదు కన్నులు (పార్వతివి రెండు, శివునవి మూడు), సూర్యునకు వేయి చేతులు (కిరణాలు) క్రమాలంకారంలో పూరించాడు.

## ఛందస్సు అందాలు :

ఛందస్సు-రచనకు బిగిని, జిగిని కలిగిస్తుంది. ఉత్పల, చంపకాది సాధారణ ఛందస్సులనే కాకుండా విశేష వృత్తాలను ఇక్కడి కవులు ప్రయోగించారు. 'పంచచామరం, మలినీ, మానినీ, క్రౌంచపదము, వనమయూరము, తరువోజ, శ్రీవృత్తము, స్రగ్విణి, తోటక, మహాస్రగ్ధర, తోదక, సంగంధి, భుజంగ ప్రయాత, ధృవకోకిల, లయగ్రాహి, ఉత్సాహ, పృథ్వీ, త్వరితగతి, కలహంస, రాజహంస, సరసిజ, సింహరేఖ, మాణవక, ప్రమాణ, విద్యున్మాల, సరోజ, మంగళమహాశ్రీ' వంటి వృత్తాలను అలవోకగా నడిపించారు. 'గోకర్ణ ఛందస్సు'ను రచించిన గోకర్ణ మహారాజు, తెలుగులో ప్రామాణిక లక్షణ గ్రంథం 'అప్పకవీయం' రచించిన కాకునూరు అప్పకవి మహబూబ్‌నగర్ జిల్లావారే. ప్రయోగదక్షుడైన పాల్కురికి సోమనాథుడు తెలుగులో 'త్రిభంగి' ఛందాన్ని తొలిసారిగా నడిపించాడు.

**త్రిభంగి : గురుమత సహితులు దురిత విరహితులు**
**సురుచిర సజ్జన వర్తుల్, ధ్రువకీర్తుల్, శాంత**
**సుమూర్తుల్**
**పరిహృత వికృతులు, నిరవధి సుకృతులు**
**మరణ పునర్భవ దూరుల్, సువిచారుల్, భక్తి**
**విచారుల్**
**పరవశ హృదయులు, నిరుపమ సదయులు**
**పరసమయ ప్రవిఫాలుర్ గుణశాలుర్ దాన**
**సుశీలుర్**

'అనుభవసారము'లో అనుప్రాస అందాతో చిందులేసిన పద్యమిది.

గద్వాల సంస్థాన ఆస్థాన కవియైన కాణాదం పెద్దన తన 'ముకుంద విలాసము'లో వివిధ వృత్తాలతో సమన్వయపరుస్తూ చేసిన నాయికావర్ణన సరికొత్త మార్గాన్ని నిర్మించింది.

**మ. గతి మత్తేభము నాస చంపకము గైశ్యంబు కందంబు సం**
**గత వాక్యంబులు మత్తకోకిలలు దృక్కాండిత్య మయ్యుత్పల**
**ద్యుతి మోమంబురుహంబు దేహరుచి విద్యున్మాలిగా మానినీ**
**తత వృత్త స్థితులెన్నగాదరమె తద్వాగ్జానికైనం దగన్**

ఆమె నడక 'మత్తేభము' (మదించిన ఏనుగు) వలె, ముక్కు 'చంపకము' (సంపెంగ) వలె, వెంట్రుకలు 'కందం' (మబ్బు) వలే, మాటలు 'మత్తకోకిల'ల వలే, చూపులు 'ఉత్పలము' (కలువ) వలే, ముఖం తామర వలే, శరీరకాంతి 'విద్యున్మాల' (మెరుపుతీగ) వలే ఉన్నదట. అందాన్ని వృత్తాలతో ఉపమిస్తూ, శ్లేషనాశ్రయించి చేసిన అద్భుతమైన ఆవిష్కరణ.

## అలంకారం :

అలంకారాలు కావ్యలక్ష్మికి అలంకారాలు అన్నారు లాక్షణికులు. కవులు వారి వారి ప్రతిభననుసరించి కవితా సుందరిని అలంకరించారు. ఒక్క ఉదాహరణను చూపెడతాను.

**కం. కరివరద దయాపర**
**పర సంహార హరనుత ప్రభాధర ధరణీ**
**శ్వర శరణాగత సుజనా!**
**దర దరకర కర జనిహత దనుజ ప్రవరా!**

చింతలపల్లి వీరరాఘవ కవి 'మధురవాణీ విలాసము'లోని పద్యమిది. (దయాపర-పరసంహార) ముక్త పదగ్రస్తము. (సంహర-హర) ఛేకానుప్రాస. 'ర'కార ఆవృత్తిచే వృత్త్యనుప్రాస... శబ్దాలంకార త్రయంతో వెలుగుతున్న పద్యమిది.

## మాటే మంత్రము :

ఋషి వాక్కు, సత్కవి వాక్కు వ్యర్థములుకావు. తెలుగు సాహిత్య చరిత్రలో వాక్‌శక్తిని ప్రదర్శించిన కవులు కొందరున్నారు. వారిలో ప్రథమగణ్యుడు వేములవాడ భీమకవి. చాటు కవిగా, దిట్టకవిగా, తిట్టుకవిగా ప్రసిద్ధుడు. శాపానుగ్రహ సమర్థుడు. తన మాటలోని మహిమను గూర్చి చెపుతూ...

తే.గీ. ఉగ్రకోపి నేను నోపుదు శపియింప
గ్రమ్మతింప శక్తి కలదు నాకు
వట్టెమాన జిగురు బుట్టింప గిట్టింప
బిరుదు వేములవాడ భీమకవిని

అన్నాడు. అతని పద్యరూప శాపంతో రాజ్యాన్నికోల్పోయి, అతని పద్యానుగ్రహంతో రాజ్యాన్నిపొందిన రాజు కథ ప్రచారంలో ఉంది. మధురవాణీ విలాసకర్తయైన చింతలపల్లి వీరరాఘవకవి ఒకసారి తమ గ్రామమైన 'వట్టెం'లో తీవ్రకరువు వచ్చినప్పుడు తల్లడిల్లినాడట. గ్రామ సమీపాన వెలసిన 'వింధ్యవాసిని' అమ్మవారిపై అష్టకంచెప్పి ప్రార్థించాడట.

చ. చెరువుల నిండజేసి వరిచేల పునాసకు లగ్గుబోసి యా
కరువరి గోసివేసి భువనంబులలో బలుకీర్తిమోసి, సు
స్థిరముగ మాటవాసి విలసిల్లుము యో కరుణాంబు
రాశి భూ
వరములొసంగుమీ, త్రిపురవాసి నివాసిని, వింధ్యవాసినీ

ఈ అష్టకం చెప్పిన తరువాత విపరీతమైన వర్షం కురిసి చెరువులు కుంటలు నిండాయట.

## స్వాభిమాన ప్రకటన :

తెలంగాణ వారు సాత్త్వికులేకాని స్వాభిమానం చచ్చినవారు కారు. ఎవరో ఆంధ్రుడు తెలంగాణలో కవులు లేరంటే, ఎంతో వ్యయ ప్రయాసలకోర్చి 354 మంది సంస్కృతాంధ్ర కవుల రచనలతో 'గోల్కొండ కవుల సంచిక'ను ప్రకటించాడు తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి. ఇది స్వాభిమాన ప్రకటన సంచిక. ఒకచోట తెలుగు భాషామతల్లిని గూర్చి చెపుతూ సురవరం వారు

సీ. పరిపూర్ణ పావనాంభస్తరంగోద్వేగ
గౌతమీ గంభీర గమనమునకు
ఆలంపురీ నందనారామ విభ్రాజి
మల్గోబ ఫలరాజ మధుర రుచికి
ఆంధ్రీకుమారీ సమాయుక్త పరిపూత
తుంగా పయస్సు మాధుర్యమునకు
ఖండశర్కర జాతి ఖర్జూర గోక్షీర
ద్రాక్షాదియుత రామరసమునకును

తే.గీ. అమృత నిష్యంది వల్లకీ హ్లాదమునకు
రాగిణీ దివ్య సమ్మోహన రాగమునకు
తేనేతేటల నవకంపు సోనలకును
సాటియగును మా తెనుగు భాషామతల్లి

అన్నారు. తెలుగు భాష మాధుర్యాన్ని చెప్పాల్సివచ్చినప్పుడు అలంపురులో దొరికే మల్గోబ మామిడి పండ్లను, అలంపూరునానుకొని ప్రవహించే తుంగభద్రను ప్రస్తావించడం స్వాభిమానానికి సాక్ష్యం.

కవి, పండితుడు, పరిశోధకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘసంస్కర్త గడియారం రామకృష్ణ శర్మ తెలంగాణ వైభవాన్ని ఇలా కీర్తించారు.

సీ. తుంగభద్రా సముత్తుంగ గంగా కృష్ణ
వేణీమతల్లుల కాణయాచి
ఆ కాలనాథ కాంచీ కళింగ వ్యాప్త
దేశమేలిన కాకతీయమాత
భద్రాది రఘురామ పాదకంజ మరంద
పావనంబైన గోపన్న గృహము
ఢిల్లీ సురత్రాణ భల్లాయితాక్కన్న
మంత్రి మాణిక్యు జన్మస్థలంబు

తే.గీ. అఖిలవైభవ భోగభాగ్యాకరంబు
ఆ విశాలాంధ్ర రాజ్య సింహాసనంబు
కల్పతరుభూమ, మా తెలంగాణ సీమ
స్వాగతముపల్కె మీకు సుస్వాగతంబు

స్వస్థాన వేషభాషలు అణచబడిన తరుణంలో నిజాముకు వ్యతిరేకంగా ప్రతిఘటనా స్వరాల రుద్రవీణను మీటిన కవిధీరుడు దాశరథి కృష్ణమాచార్య. కలాన్ని, గళాన్ని తెలంగాణపరంచేసిన దేశభక్తుడు. 'నాడు నేడును తెలగాణమోడలేదు, శత్రువుల దొంగదాడికి' అని నినదిస్తూ 'వీరతెలంగాణము' యొక్క పౌరుషాన్ని అక్షరశః ప్రకటించినాడు.

ఉ. **నీయొడిలోన పెంచితివి నిండుగ కోటి తెలుంగు కుర్రలన్**
**ప్రాయము వచ్చినంతనె కృపాణములిచ్చితి, యుద్ధమాడి వా**
**క్రేయ భుజాబలమ్ము దరిసింప జగమ్ము, నవాబుతో సవాల్**
**చేయుమటంటివీ తెలుగు రేగడిలో జిగిమెందు మాతరో**

ఆంధ్రసారస్వత పరిషత్తు వార్షికోత్సవం తూప్రాన్‌లో జరిగినప్పుడు నాటి సభాధ్యక్షులు బిరుదు వేంకటశేషయ్య తెలంగాణవారిని పెద్దబాలశిక్ష, సుమతి శతకము చదివి తెలుగు నేర్చుకొమ్మన్నారట. అది విన్న కేశవపంతుల నరసింహశాస్త్రి ఉగ్రనారసింహుడై కవితా సింహగర్జన చేశాడు.

మ. **కవులున్నారు కవి ప్రకాండులకు సత్కారమ్ము కల్పించు భూ**
**ధవులున్నారు, ఫణీశ గౌతమ కణాదవ్యాస ముఖ్యోక్త శా**
**స్త్ర విచారమ్ముల వైరి గెల్చెటి బుధేంద్రస్వాములున్నారు త**
**క్కువ యేమున్నది మీకు రాష్ట్రమున మాకుం తెల్గు నేర్పింతురే.**

శా. **మానైజాము ధరిత్రిలోన తెలుగు న్మాగాణమందుంగృషిన్**
**దానై సల్పెడు సోదరాంధ్రునకు చిత్తప్రీతి గల్పింపగా**
**మేనున్వంచి పరిశ్రమించెదము కానీ మమ్ము దద్దమ్మలం**
**చీనాడెంచిన నాడె వాని పస తానేపాటిదో, చూడమే**

శా. **వాగారంభము లేమి చాలునిక నెవ్వాడేని శాస్త్రజ్ఞతా**
**శ్రీగన్నన్ సుకవిత్వవైభవ జయశ్రీ మించినన్ రాగ వి**
**ద్యా గర్వంబున మిన్ను ముట్టినను తాదృక్ శక్తి రూపింపగా**
**మా గద్వాలకు రాకయున్నగలదే, మాన్యత్వమీనాటికిన్**

ఈ నర'సింహనాదం' – తెలంగాణ జయనాదం.

ఈ విధంగా తెలంగాణ పద్యస్రవంతి పలువొంపులతో, సొంపులతో మాధుర్యాన్ని పంచుతూ, చైతన్యాన్ని పెంచుతూ, స్వస్థాన వైభవాన్ని గానంచేస్తూ సాగుతున్నది.

## పరామర్శ గ్రంథాలు


1. మహబూబ్‌నగర్ జిల్లా సర్వస్వం – బి.ఎన్.శాస్త్రి
2. సింహాసన ద్వాత్రింశిక – ఆం.ప్ర.సా.అకాడమీ
3. చాటు పద్య రత్నావళి – తె.వి.విద్యాలయం
4. మధుర వాణీ విలాసం – డా॥ వి. బుచ్చారెడ్డి
5. శ్రీమహాభాగవతం – పోతన
6. భాస్కర రామాయణం
7. ముకుంద విలాసం – కాణాదం పెద్దన, సా.అకాడమీ
8. శ్రీరంగనాథ విలాసం – డా॥ వి. బుచ్చారెడ్డి (సం.)
9. నిరోష్ఠ్య రచన – దాశరథి చరిత్ర – డా॥ వి. రత్నయ్య
10. చిత్ర ప్రబంధము – సిరసనహాళ్ కృష్ణమాచార్యులు
11. చంద్రికా పరిణయం – తె.వి.విద్యాలయం
12. శృంగార శాకుంతలం – పిల్లలమర్రి పినవీరభద్రుడు
13. అనుభవసారం – పాల్కురికి సోమనాథుడు
14. ఉత్పలమాల – ఉత్పల సత్యనారాయణాచార్య
15. వృషాధిపశతకం – పాల్కురికి సోమనాథుడు
16. నరసింహ, సుమతీ, మల్లభూపాలీయ శతకాలు
17. యయాతి చరిత్ర – పొన్నగంటి తెలగన
18. పాంచజన్యం – గడియారం రామకృష్ణశర్మ
19. దాశరథి కవిత
20. సురవరం కవిత


❀❀❀❀❀

# 28. తెలంగాణ పాట

పాట.... తెలంగాణ ప్రజల శ్వాస

పాట.... తెలంగాణ జనుల ధ్యాస.

పాటే తెలంగాణ జానపదుల జనజీవం

తెలంగాణ జనజీవనంలో అల్లుకుపోయిన పాట ప్రతి తెలంగాణ బిడ్డడి సంపద. పాటే ఆయుధంగా, పాటే జీవనశైలిలా మార్చుకొని నలువైపులా తెలంగాణ పాట ప్రాభవాన్ని చాటిన ఘనత మనది. చదువుతో నిమిత్తం లేకుండా చక్కని పాటలు కట్టిన జాపదుల జావళీలలో ఓలలాడిన గడ్డమనది.

తెలంగాణ ప్రజల నోటి నుండి ఉద్భవించిన వందలు, వేల సంఖ్యలో పాటలు తెలుగు ప్రజల సాంఘిక, సాంస్కృతిక మూలాల్ని తట్టి లేపాయి. తొలినాళ్లలో పుట్టిన జానపదాల నుండి ఆధునికంగా వెలువడిన ఉద్యమ, సినీగేయాల వరకు తెలంగాణ పాట ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారి హృదయాల్ని పల్లవింపజేసింది. తెలంగాణ పాటను జాతీయ, అంతర్జాతీయ స్థాయి వేదిక లెక్కించిన జానపద, ఆధునిక కవులెందరో తెలంగాణ ప్రజల సంస్కృతిని, చరిత్రను, సాంప్రదాయాల్ని, ఆచార వ్యవహారాల్ని మేళవించి ప్రజల జీవనానికి, పాటకు విడదీయరాని సంబంధం ఉందన్న సత్యాన్ని ప్రపంచానికి చాటారు.

## విభిన్న రకాల పాటలు

తెలంగాణలో పుట్టిన పాటలు వివిధ రకాలుగా విలసిల్లాయి. ఇక్కడ సంస్కృతీ సాంప్రదాయాల కనుగుణంగా ఆయా సందర్భాల్లో ఆయా పాటలు పుట్టుకొచ్చాయి. జనుల మానసిక భావన, సుఖదుఃఖాలు పాటలై పల్లవించి సామాజిక పరిణామాన్ని అనుసరించి వివిధ రూపాలై విస్తరించాయి.

## జానపద గేయాలు

జనపదాల్లో (పల్లెల్లో)పుట్టి, ఆశువుగా ఆనోటా ఈ నోటా విస్తరించిన పాటే జానపదగేయం. జానపద సాహిత్య పరిశోధకుల చేత పలు రకాల లక్షణాలు చెప్పబడిన ఈ జానపద గేయాలు ప్రధానంగా గానయోగ్యమైనవి. తన మనోభావాల్ని ఎదుటివారికి చెప్పడం ఎప్పుడైతే మొదలు పెట్టాడో మానవుడు అప్పుడే ఈ గేయాల్ని సృష్టించుకొన్నాడు.

మాడ్చే ఎండలు, కురిసేవానలు, వణికించే చలి, ఆకర్షించే ప్రకృతి, శరీరాన్ని కష్టింపజేసే పనులు, పుట్టుకలు, చావులు, పెళ్ళిల్లు, పండుగలు, ఇట్లా అన్నీ జానపదులకు ఇతి వృత్తాలై పాటలుగా పల్లవించాయి.

సంతోషసమయంలో అందరూ కలిసి గంతులు వేసినపుడో, తమకు తీరని కోర్కెలను నిజ జీవితంలో సంప్రాప్తించనివి ఊహల్లో తీర్చేసుకుంటూ వాటినే కళాత్మకంగా వెలిబుచ్చునపుడో, కష్టాలు కడగండ్లలో మునిగి తేలుతున్నపుడో, తాము చేస్తున్న పనుల్లో శ్రమను మరిచిపోవడానికో అలవోకగా ఈపాటలు పుట్టాయి. అవన్నీ విభిన్న రకాల జానపద పాటలే. వీటిని వేరువేరు వర్గాలుగా పరిశీలిద్దాం.

జానపదుల్లో ఆదిమ కాలం నుండి ఉన్న సంస్కృతులు, సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు ప్రస్ఫుటం చేసేవే సంస్కృతీ సాంప్రదాయ పాటలు. పరిణామ క్రమంలో మనిషి వివిధరకాల ఆచారాలను సృష్టించుకున్నాడు. ప్రతి ఆచారానికి, సాంప్రదాయానికి అనేకరకాల పాటలు పుట్టుకొచ్చాయి. మనిషిని నిత్యం వెన్నంటుకొని యుండే పాట శుభకార్యాలు, పెళ్లి వేడుకలు పండుగలు, స్త్రీల పాటల రూపంలో జానపదుల నోళ్ళ నుండి జాలువారాయి.

## పెండ్లిండ్లకు సంబంధించినవి :

మన ఆచారాల్లో పెండ్లి విశిష్టమైంది. దీని ఆధారంగా జానపదులు ఎన్నో పాటలు అలవోకగా పాడుకున్నారు. అందులో కళ్యాణం పాటలు, గంధం పాటలు, కొట్టాం పాటలు, నలుగు పాటలు, తలుపు దగ్గర పాటలు, బంతులాటల పాటలు, అయిరేణి పాటలు, అప్పగింతల పాటలు ఇట్లా అనేకంగా ఉన్నాయి.

"అన్ని దేవుల పూజ అతిభక్తితో చేసి

పతికరుణచే నేను పడతిని గంటి

ఎనిమిది వర్షములు ఘనముగ సాకినే

ఈ దినము ఇస్తినీ నా జననినిన్ను

నీళ్ళముంచిన మీరె పాలముంచిన మీరె.." అంటూ తమ బిడ్డను ఆదరంగా చూడమని చెప్పే పెండ్లినాటి పాట ఇది.

అట్లే...

పన్నెండు గుర్రాల బగ్గిపోతాంది..

బగ్గితొమ్యానత్త బిడ్డవోతాంది

బిడ్డతో బిందెడు నీళ్ళు పోతున్నాయ్...

నీళ్ళతో నీలంచు చీరెపోతాంది..." అంటూ అత్తింటికి పంపుతున్నప్పుడు పాడుకునే పాట తెలంగాణలో బాగా ప్రాచుర్యంలో ఉన్నది.

## పండుగలకు సంబంధించినవి :

తెలంగాణలో అతి ప్రధానమైన పండుగ బతుకమ్మ. వివిధపండుగల సందర్భంగా పాడుకునే పాటలకంటే బతుకమ్మపండుగకు చెందిన పాటలే బహుళ ప్రచారంలో ఉన్నాయి. ఈ బతుకమ్మ పాటల్లో కూడా ఉయ్యాల, కోల్, చందమామ, బొడ్డెమ్మ అనే పదాల కోరస్‌గా కలిగిన పలు రూపాలున్నాయి. ముఖ్యంగా ఇవి స్త్రీలకు చెందినవి.

రామ రామ రామ ఉయ్యాలో

రామనే శ్రీరామ ఉయ్యాలో

అయ్యయ్యో ఓరామ ॥

అయ్యనే శ్రీరామ ॥

ఇద్దరక్క చెల్లెండ్లను ॥

ఒక్కూరికిచ్చె ॥

ఒక్కడే మాయన్న ॥

వచ్చున్నా పోడు... ॥

ఇట్లా ఉయ్యాల పాటలో కూడా అన్నా చెల్లెళ్ళ, అనుబంధం... తదితరాలు ద్యోతకమవుతాయి.

'ధర చోళదేశమున చందమామ

ధర్మాంగుడనురాజు చందమామ

ఆ రాజు భార్యయు ॥

అతి సత్యవతి యంద్రు ॥

నూరునోములు నోమి ॥

నూరు మందిని గాంచె ॥

..........................

ఈ పాటలో బతుకమ్మ లక్ష్మీదేవి అంశగా ధర్మాంగుడనే రాజుకు ఉద్భవించినట్లు చెబుతుంది.

## శుభకార్యాలకు చెందినవి :

"శ్రీ లక్ష్మి నీ మహిమలూ గౌరమ్మ

చిత్రమై తోచునమ్మా....

భారతీసతివయ్యి బ్రహ్మకిల్లాలివై

పార్వతీదేవివై పరమేశురాణివై

పరగ శ్రీలక్ష్మివయ్యా గౌరమ్మ

భార్యవైతివి హరికినీ... గౌరమ్మ...."

సమస్త దేవతల సమాహార రూపమే ఆదిశక్తి అని నమ్మిన జానపదులు గౌరి, లక్ష్మి, సరస్వతిగా అమ్మవారిని భావించి నోములు, వ్రతాల సందర్భంగా పాడుకునే ప్రసిద్ధమైన పాట. ఇది తెలంగాణ పల్లెల్లో వినిపించే పాట.

రుద్రాక్ష చెట్లల్ల ఆట చిలుకల్లార పాట చిలకల్లార

కలికి చిలుకల్లార కొలికి చిలుకల్లార కందువ్వ గువ్వలు

నీ నోము నీకిత్తునే గౌరమ్మ.... నా నోము ఫలమివ్వవే... గౌరమ్మ..."

అంటూ బతుకమ్మ నోమును పంచుకొంటూ పాడుకునే పాట కూడా బహుళ ప్రచారంలో ఉన్నది.

## స్త్రీలకు సంబంధించినవి :

జానపదుల్లో స్త్రీలకు సంబంధించిన పాటలే ఎక్కువగా ప్రచారంలో ఉన్నాయి. పండుగలు, పబ్బాలు, నోములు, వ్రతాలు అన్నీ మహిళల ప్రాధాన్యతను తెలిపేవే. పెళ్ళిళ్ళు, పేరంటాల్లలో కూడా స్త్రీల పాటలే ఎక్కువగా కనిపిస్తాయి. కరుణ రస గేయాలు కూడా మహిళల జీవన స్థితిగతుల్ని తెలిపేవే ఎక్కువగా ఉన్నాయి. అట్లా తెలంగాణలో ప్రసిద్ధంగా వినబడే స్త్రీల పాటలు శ్రామిక గేయాల్లోకూడా కనిపిస్తాయి. రోకటి పాటలు, విసుర్రాయి పాటలు, నాట్ల పాటలు, కలుపు పాటలు, కోతల పాటలు ఇవన్నీ స్త్రీలు పాడుకునేవే. పండుగలు పబ్బాల్లో స్త్రీలు పాడుకునే పాటలకు ఓ ప్రత్యేకత ఉంది.

కాముని పండుగ రోజు స్త్రీలందరూ ఒక్కచోట చేరి పాడుకునే ఈపాట తెలంగాణలో బాగా ప్రాచుర్యంలోఉంది.

వోలి వోలీల రంగ వోలీ..

చెమ్మ కేలిర వోలీ...

చిన్నవాడు కామయ్య హెూలి చెమ్మ కేలిరా హెూలి

పోరగాడు కామయ్య ॥

యాడికి పోతాడె ॥

కమ్మరొల్ల ఇంటికి ॥

పోతాడె కామయ్య ॥

.............. ॥

అట్లాగే పెళ్ళికి సంబంధించిన దంపుడు పాట... 'సువ్వీ... సువ్వి... సువ్వానరంగా - సువ్వి మోహన రంగ సువ్వీ - సువ్వీకావేటె రంగ - సువ్వి లాలి సువ్వి..." అని వడ్లు దంచుతూ.. ఇట్లా అనేక రకాల స్త్రీల పాటలున్నాయి.

## శ్రామిక గేయాలు

"ఏటికేతంబెట్టి ఎయిపుట్లు పండిత్తె

ఎన్నడూ మెతకెరుగరన్నా... నేను గంజిలో మెతుకెరుగరన్నా....."

కాల్జేయి కడ్కోని కట్టమీద కూకుంటె

కాకి తన్నీపోయెరన్నా... పిల్లకాకి తన్నీ పోయెరన్నా..."

ఈ జానపద గేయంలో తెలంగాణా వాస్తవ జీవన చిత్రణ కనిపిస్తుంది. వందల సంవత్సరాల నుండి తెలంగాణ పల్లెల్లో ప్రజల జీవన స్థితిగతులు పైన చెప్పిన జానపదగేయంలో లాగా దుర్భిక్షస్థితిలోనే ఉన్నాయి. తరాల నుండి వ్యవసాయాన్ని నమ్ముకున్న జనానికి గడ్డు పరిస్థితులే ఎదురయ్యాయి. అట్లా వ్యవసాయ వృత్తిని ఆధారంగా చేసుకొని అనేక పాటలు ప్రచారంలోఉన్నాయి.

కాగా జానపదుడు శ్రమజీవి. అసలు జానపదాలన్నీ శ్రమనుండి ఉద్భవించినవే!

వివిధ వృత్తుల మీద ఆధారపడిబతికే పల్లె జనం తాము చేసే పనుల్లో కష్టాన్ని మర్చిపోయేందుకు పాటనాశ్రయించాడు. పనిలో మునిగిన శ్రమజీవికి పాటే ఊతమయ్యింది. పాటకు పనికి జతకలిసింది. పాటే వారి ఆకలిని తీర్చింది.

"పాట పనితో పాటే పుట్టింది

పని పాటతోనే జతకట్టింది..." అన్నవిధంగా 'పనీపాట' జంటపదాలై స్థిరపడ్డాయి. అట్లా వ్యవసాయ సంబంధమైనవేకాక వివిధ కులవృత్తులకు చెందినవి, కార్మిక సంబంధమైనవి. అనేకానేక పాటలు ఉద్భవించాయి.

"నేనేమీ సేతు... నేనెట్లు గాతూ...

మొగులు మెత్తనాయె...

భూమి బురబుర పొంగె

నల్లనీ రాగట్ల తెల్లజొన్నలేస్తే

మొలసి మొలవక ముందె

కోతింత పీకే...

కోతిపీకిందాని కోపాననేనుంటె

పస పస వచ్చేటి పందింత పీకే...

......................" ఓ పెదరైతు తనపంట ఎట్లా నాశనమవుతుందో నిరాశా నిస్పృహలతో వెళ్ళడిస్తున్న పాట.

తెలంగాణలో బొగ్గుగని కార్మికులూ ఎక్కువే. వాళ్ళు

నెత్తురా తారన్నా నెత్తురా.. లాడీసు

నెత్తి జంక్షను దాకా నెత్తురా మాయన్న

ఆరోడ్డు ఈ రోడ్డు...

ఇష్టమైనా రోడ్డు...

ఈడ పనిసేసిన వాడే.

మొనగాడెయన్నా.... ॥ నెత్తరో...॥

అనిపాడుకునే శ్రామిక గేయమిది.

**పిల్లల పాటలు :**

జానపదులు పిల్లల కోసం పాడుకున్న పాటలు కూడా తెలంగాణలో ప్రసిద్ధమైనవే. ఇందులో పిల్లల కోసం పెద్దలు పాడే పాటలు, పిల్లలు పాడుకునే పాటలు అని రెండు రకాలున్నాయి. పెద్దవాళ్ళు పాడేపాటల్లో పిల్లల్ని నిద్రపుచ్చే జోలపాటలు, లాలిపాటలు ప్రధానమైనవి.

" లాలీలాలోయమ్మ లాలీ మాయమ్మ...

లాలీ ముద్దుల గుమ్మ బాలా కృష్ణమ్మ..." అనే లాలిపాటతో పాటు

పిల్లల్ని ఆడిస్తూ...

"ఊగూ ఊగు గంగెద్దా

ఉగ్గుపాలే గంగెద్దా

సోలీ ఊగె గంగెద్దా

సోలెడు పాలె గంగెద్దా

ఆగి ఊగె గంగెద్దా

అద్దెడు పాలె గంగెద్దా..." అంటూ తల్లిదండ్రులు పాడుతుంటారు.

ఇక పిల్లలు ఆటలాడుతూ పాడే పాటలు చాలా ఉన్నాయి. మట్టిలో పుల్లను దాచి ఎదుటి వారిని దొరికించుకొమ్మంటూ

" దూదూ పుల్లా దూచాయ్ పుల్లా

చూడాకుండా జాడాలీయ్

ఊదాకుండా పుల్లాతీయ్..." అని ప్రతిదీ పాటతో ఆటను మిళితం చేశారు.

ఇట్లా తెలంగాణలో నాటి నుండి నేటి వరకు శ్రామిక గేయాల నుండి పోరాట పాటల దాకా జానపదులు సృష్టించుకున్న పాటలు ఒకెత్తైతే ఇటీవల తెలంగాణ ఉద్యమంలో పుట్టిన పాటలు మరోక ఎత్తు. నిజాం కాలం నాటి నుండి తెలంగాణ ప్రజలు తాము అనుభవిస్తున్న కష్టాల్ని వివిధ రూపాల్లో పాటల రూపంలో వెలిగక్కారు. అందులో బండి యాదగిరి..

బండెనక బండి కట్టి పదహారు బండ్లు గట్టీ

ఏ బండ్లె పోతావు కొడుకో... నైజాము సర్కరోడా...

నాజీల మించినఊరో నైజాము సర్కరోడా..." పాట తెలంగాణ ప్రజల పోరు బాటయ్యింది.

సుద్దాల హన్మంతు గాయక కవి గొంతెత్తిన

"పల్లెటూరి పిల్లగాడా పసులగాసే మొనగాడ...

పాలుమరిసి ఎన్నాలయ్యిందో... ఓ పాల బుగ్గలా జీతగాడా..." నాటి చిన్నపిల్లల బతుకు బడివైపుగాక బజార్న పడిన వైనాన్ని వెల్లగక్కుతుంది.

**ఉద్యమ పాటలు :**

తెలంగాణలో ఉద్యమాన్ని పాట నుంచి విడదీసి చూడలేం. ఇవి రెండు పరస్పర ప్రేరకాలు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట కాలం నుంచే పాట శక్తిని ప్రజాకళాకారులు, ప్రజలు గుర్తించారు. అందుకే తెలంగాణలో పాట సాయుధ పోరాట వారసత్వంగా కొనసాగుతున్నది. ఒక ఉద్యమం తరువాత మరో ఉద్యమం పురుడుపోసుకోవడానికి వెనుకబాటుతనం, పాలకుల పీడనే కారణం. ఆ వెనుకబాటుతనానికి గల కారణాలను అన్వేషించింది ప్రజలపాట. వాటి మూలలను విశ్లేషించే పని తెలంగాణ సాహిత్యం స్వీకరించింది. ఆ సాహిత్యంలో అన్ని ప్రక్రియల కంటే పాటే అత్యంత ఎక్కువగా ప్రజల జీవితాలను చేరగలిగింది. వ్యవసాయక ప్రధానమైన దేశంలో, అక్షరాస్యత అంతంత మాత్రంగానే ఉండడం వల్ల పాట ద్వారా మాత్రమే రాజకీయాలను బోధించడం, అర్థం చేయించడం వీలైంది. దీనికి తెలంగాణ ప్రాంతంలోని జానపద ఆశ్రిత కులాల మౌఖిక సంప్రదాయం సృష్టించిన పాటల ఒరవడి ఎంతగానో ఉపయోగపడింది. తరతరాలుగా ప్రజల జీవితాలతో పెనవేసుకున్న జానపద కళారూపాల శక్తిని తెలంగాణ

సాయుధపోరాటం గ్రహించింది. వాటిని పోరాట రూపాలుగా మలిచి మళ్ళీ అదే ప్రజల వద్దకు చేర్చింది. ఈ ప్రయోగం విప్లవోద్యమంలో మరోసారి విజయవంతమైంది.

తెలంగాణ ఉద్యమం అనేక ఎత్తుపల్లాల సుదీర్ఘ పయనానికి చిహ్నం. అటువంటి ఒడిదొడుకుల కాలంలో పాట గొప్ప ఓదార్పునిచ్చి, ఉద్యమ వాడిని వేడిని కాపాడగలిగింది. పాట. ఉద్యమం పొడుగునా పాట ఒక సైరనై మోగింది. ఉద్యమ తీవ్రతలను, స్థితిగతులను గానం చేస్తూనే ఉద్యమాన్ని దిశానిర్దేశం చేసింది. 1969నాటి ఉద్యమంలో పాట నామమాత్రపు స్థాయిలోనే సృజించబడింది. పాటల రచయితలు కేవలం వేళ్ళ మీదకే పరిమితమయ్యారు. అందుకు రెండు కారణాలు ప్రధానంగా కనిపిస్తున్నాయి. ఆంధ్రకవుల ఆకర్షణలో మునిగిన తెలంగాణ కవులు పద్యరచనమైకంలో తేలియాడారు. మరోకారణం అప్పటి ఉద్యమంలో ప్రధానంగా మధ్యతరగతి విద్యావంతులు మాత్రమే భాగస్వాములయ్యారు. అట్టడుగు కూలీనాలీ జనం పెద్దెత్తున ఉద్యమంలో ఆకర్షితులు కాకపోవడం వల్ల వారి ద్వారా సృజించబడే పాట విస్తృతంగా వెలువడలేదు. అప్పటి ప్రధాన సమస్య కేవలం ఉద్యోగాలు, విద్యావకాశాలకు పరిమితమయ్యాయి. కానీ, సీమాంధ్ర దోపిడి విస్తృతమైన కొద్దీ ఇవాళ ప్రత్యేక తెలంగాణ ఉద్యమం మరింత రాటుదేలింది. ఫలితంగా ఉద్యమానికి ఒక సైద్ధాంతిక భూమిక ఏర్పడింది. నీళ్ళు, నిధులు, ఉద్యోగాలతో పాటు భాషా సంస్కృతుల పరిరక్షణాంశం జతకావడంతో తెలంగాణ ఉద్యమం ఆత్మగౌరవ నినాదంగా మారింది.

అరవయేండ్ల సుదీర్ఘ ఉద్యమ ప్రయాణానికి తెలంగాణ పాట ప్రతిబింబంగా నిలిచింది. జరుగుతున్న అనేక అన్యాయాలను తెలంగాణ రాష్ట్ర డిమాండ్ కోణం నుంచి చిత్రించడం జరిగింది. ఈ మలిదశ సమయానికి ఊహించని రీతిలో సాంస్కృతిక పునాది బలపడింది. తెలంగాణలో మాత్రమే కాకుండా తెలుగు సమాజంలో కనీవినీ ఎరుగనంత సాంస్కృతికోద్యమం ఇటీవల కాలంలో తెలంగాణ నేలమీద పురుడు పోసుకున్నది. 90 వ దశకం ఉత్తరార్థంలో తెలంగాణ జనసభ, తెలంగాణ సాంస్కృతిక వేదిక, తెలంగాణ జాతర, 2000ల తర్వాత ధూంధాం వేదికల ద్వారా పాట ప్రచారం విస్తృతమయ్యింది. వందల సంఖ్యలో పాటల సీడీలు, వేల సంఖ్యలో పాటలు, పదుల సంఖ్యలో పాటల సంకలనాలు, సంపుటాలు, ఊరూర ధూంధాం నిర్వహించే లెక్కలేనంత మంది కళాకారుల్ని తెలంగాణ ఉద్యమం మాత్రమే అందించగలిగింది. కాలానుగుణంగా అందివచ్చిన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం పాట ప్రచారానికి బలంగా ఉయోగపడింది. కోల్పోయిన చరిత్ర, సంస్కృతిని తిరిగి బ్రతికించుకునేందుకు పాటల ద్వారా తెలంగాణలో సాంస్కృతిక పునర్జీవనోద్యమం కొనసాగుతున్నది. సాంస్కృతిక చిత్రపటం నుదుటన తెలంగాణ ఉద్యమం కొత్త చరిత్రను లిఖిస్తున్నది. రాజకీయోద్యమానికి కావాల్సిన మద్ధతును సాంస్కృతిక శక్తులు కూడగడుతాయి. తెలంగాణలో ఆ పని పాట ద్వారా మాత్రమే సాధ్యపడింది. విశాల ప్రజారాశుల్లో ఉద్యమ ఆలోచనలతో పాటు భావజాలన్ని పెంపొందించడం కోసం పాట సాధనమయ్యింది. తెలంగాణ వర్ధమాన స్థితికి వలసపాలనలోని దోపిడే కారణమన్న ఎరుకను ఊరూర ప్రచారం చేసింది పాట. అట్లా పాట రాజకీయాలతో పాటు చరిత్రను కూడా కండ్లముందుంచిందంటే అందుకు కారణం రాజకీయ చైతన్యం కలిగిన రచయితలు, కళాకారులు తెలంగాణలో పుష్కలంగా ఉండడమే. తెలంగాణలో ఇవాళ పాటలేని పల్లె లేదు. పెరిగిన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలంగాణ ఉద్యమం సరిగ్గా ఉపయోగించుకోవడం వల్ల ఉద్యమ చైతన్యానికి అది అదనపు చేర్పుగా నిలిచింది.

పాట తెలంగాణకు జరిగిన, జరుగుతున్న అన్యాయాలను విడమరిచి చెప్పింది. తెలంగాణ రాష్ట్రం సాధించుకోవాల్సిన ఆవశ్యకతను కూలంకషంగా ప్రజలకు బోధించింది. నడుస్తున్న ఉద్యమానికి సైరన్‌లా ఉపయోగపడింది ప్రజావాగ్గేయ సాహిత్యం. మిగిలిన సందర్భాల్లో కంటే ప్రజావాగ్గేయకారుడు ప్రస్తుత సందర్భంలో మరింత రాజకీయ చైతన్యంతో వ్యవహరించాడు. ఒకప్పుడు ప్రజల నోళ్లల్లో నానేపాటలు చాలా పరిమితంగా ఉండేవి. కానీ, ఇవాళ తెలంగాణ ఉద్యమ సందర్భంలో ప్రజా వాగ్గేయకారులు సృజించిన సాహిత్యం అత్యంత శక్తివంతమైంది కావడం మూలంగా అనేక పాటలు ప్రజల నిత్యజీవితంలో భాగమయ్యాయి. ఉద్యమం అనేక ఒడిదొడుకులకు లోనవుతున్న సందర్భంలో కూడా తెలంగాణ పాట ఉద్యమ స్ఫూర్తిని కోల్పోకుండా కాపాడింది. ఉద్యమాల్లో ప్రజావాగ్గేయ సాహిత్యం పోషించిన పాత్ర అజేయమైంది. సామాజిక చరిత్రను నమోదు చేస్తున్న సాంస్కృతిక విభాగమైన ప్రజావాగ్గేయసాహిత్యం అజరామరమైంది. జరుగుతున్న

పరిణామాల నేపథ్యంలో తెలంగాణ గేయం ఒక ప్రత్యక్ష వ్యాఖ్యానంగానే కాకుండా రాజకీయాలను అర్థం చేయించే సాధనంగా, ఉద్యమ పయనానికి దిక్సూచిలా ఉపయోగపడింది. పాటలే కాకుండా అనేక జానపద కళారూపాలు కూడా ఉద్యమంలో భాగంగా రోడ్డెక్కాయి. చిందు, ఒగ్గు, గంగిరెద్దులు, డప్పుల నృత్యం వంటి కళారూపాలు తెలంగాణ ఉద్యమానికి మద్దతుగా నిలిచాయి. అనేక పరికల్పనల ఆధారంగా పాటకు విశేష ప్రచారం లభించింది. పాటకు గల ఆదరణ ఆధారంగా విస్తరించింది. మారుమూల అట్టడుగు పల్లెలకు కూడా పాట ప్రవహించగలిగింది. తెలంగాణలో పాటకున్న చరిత్రను పరిశీలిస్తే విప్లవోద్యమ కాలంలోనే గణనీయంగా పెద్దమొత్తంలో పదునెక్కిన పాటలు వెలువడ్డాయనే విషయం అర్థమవుతుంది. కానీ, మలిదశ తెలంగాణ ఉద్యమం అప్పటిదాకా ఉన్న రికార్డులను అధిగమించి కొత్త చరిత్రను లిఖించింది. విప్లవోద్యమం కేవలం ఒక వర్గానికి సంబంధించిన జీవితాన్ని, చైతన్యాన్ని గానం చేస్తే మలిదశ తెలంగాణ ఉద్యమంలో అన్ని వర్గాల ఉమ్మడి అస్తిత్వ లక్ష్యంగా పాటలు సృజించబడ్డాయి. ఫలితంగా పాట అన్ని వర్గాలను ఉద్దేశించినదయ్యింది. తెలంగాణ సాయుధ పోరాట వారసత్వంగా కొనసాగుతున్న పాట వలస పాలనలో దగాపడ్డ నేపథ్యాన్ని గుండెల నిండా నింపుకొని ఆలపిస్తున్నది. విషాదాల నడుమ ఓదార్పై నిలిచింది పాట. ఉద్యమంలో ఒక్కటై నడిచిన నాలుగు కోట్లమందికి ఉమ్మడి ఆస్తిగా నిలిచింది పాట. ప్రాదేశిక కేంద్రంగా సృజించబడిన తెలంగాణ పాట ఇక్కడి ప్రజల్లో ఒక జాతి భావనను నెలకొల్పింది. అందెశ్రీ రచించిన "జయజయహే.. తెలంగాణ" గీతంలో అనేక పాఠశాలల్లో ప్రార్థన గీతంగా ఆలపించబడడమే ఇందుకు నిదర్శనం. మిగిలిన సాహిత్య ప్రక్రియలకంటే పాటకు ఉండే ఆకర్షణ గుణం తెలంగాణ ప్రజలను ఒక్కటి చేయగలిగింది. ప్రబోధాత్మకత ప్రధానంగా గల పాటలో స్థానికత అత్యంత బలంగా వ్యక్తమయ్యింది. అరవయేండ్ల వలస పాలన మిగిల్చిన విషాదాలను అవలీలగా పట్టుకోగలిగింది పాట.

పోరాట పాటకు ఒక ఒరవడిని ఏర్పరచిన గద్దర్ తెలంగాణ ఉద్యమంలో అనేక మంది కళాకారులు రూపొందడానికి ప్రేరణగా నిలిచాడు. అంతేకాకుండా మరోసారి ఊరూరా రాజకీయాలతో పాటు పాటను భుజానేసుకొని ముందు నడిచిండు. అలాగే ప్రజావాగ్గేయకారులైన గూడ అంజయ్య, గోరటి వెంకన్న, అందెశ్రీ, జయరాజు, మిత్ర, కోదారి శ్రీనివాస్, యశ్‌పాల్, నిసార్, పైలం సంతోష్, దయా నర్సింగ్, విమల, నేర్నాల కిషోర్, దేవరకొండ భిక్షపతి, ఏపూరి సోమన్న, ఎర్ర ఉపాళి, మిట్టపెల్లి సురేందర్, రసమయి బాలకిషన్, దేశపతి శ్రీనివాస్, సాయిచంద్, గిద్దె రామనర్సయ్య, వరంగల్ శ్రీనివాస్, సుందిళ్ల రాజన్న, పసునూరి రవీందర్, తాళ్ళ సునీల్, గుడిపల్లి రవి, దరువు ఎల్లన్న, నలిగంటి శరత్, నాగన్న తదితరుల పాట మాటతో తెలంగాణ ఉద్యమం పది జిల్లాలకు విస్తరించి సజీవమయమైంది. తెలంగాణలో వామపక్ష విప్లవోద్యమాలు అందించిన ప్రదర్శనా పద్ధతులు తెలంగాణ ఉద్యమ సందర్భంలో కూడా ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. అందుకే పాట తెలంగాణ సాయుధరైతాంగ పోరాట వారసత్వమయ్యింది. పాట ఒక చారిత్రక ఉద్యమ అవసరాన్ని తీర్చేక్రమంలో గత అనుభవాల పునాదిగా తన కర్తవ్యాన్ని నెరవేర్చింది.

**ప్రాచుర్యం పొందిన కొన్ని పాటలు:**

పల్లెటూరి పిల్లగాడా– సుద్దాల హనుమంతు

బండెనక బండిగట్టి– బండి యాదగిరి

అమ్మ తెలంగాణమా ఆకలి కేకలి గానమా– గద్దర్

పొడుస్తున్న పొద్దుమీద– గద్దర్

నాగేటిసాల్లల్ల నాతెలంగాణ– నందిని సిధారెడ్డి

మత్తడి దుంకి అలుగుతన్నుకొని పారినట్లు– మిత్ర (అమర్)

ఎందుకు రాలిపోతావు ఎందుకు వాడిపోతావు– మిత్ర (అమర్)

పల్లె కన్నీరు పెడుతోందో– గోరటి వెంకన్న

ఊరు మనదిరా ఈ వాడ మనదిరా– గూడ అంజయ్య

జయ జయహే తెలంగాణ– అందెశ్రీ

వానమ్మ వానమ్మ– జయరాజు

వీరులార వందనం– దరువు ఎల్లన్న

## ఉద్యమకాలంలో వచ్చిన పాటలు

"వీర తెలంగాణమా...." పాట కూడా ప్రతివారి నరనరాల్ని ఉప్పొంగేలా చేసి ఉద్యమానికి ఊతమిచ్చాయి. ఇట్లా ఎన్నో మరెన్నో తెలంగాణ ఉద్యమగేయాలు పల్లెపల్లెనా ప్రతిధ్వనించి... పాట లేనిదే ఉద్యమంలేదన్నంత ప్రాధాన్యతను సంతరించుకొన్నవి. తెలంగాణోద్యమ సమయంలో ఎన్నో కళా

బృందాలు ఊరూరా వాడవాడలా ఉద్యమ పాటలతో జనంలో కదలిక తెచ్చారు. ఎక్కడ సభలు జరిగినా, సమావేశాలు జరిగినా పాట లేనిదే అవి ప్రారంభం కాలేదంటే 'పాట' తెలంగాణ ఉద్యమాన్ని ఎంతముందుకు తీసుకెళ్ళిందో అర్థం చేసుకోవచ్చు.

## సినిమా పాటలు

పాట ప్రజల శ్వాసగా పరిఢవిల్లిన తెలంగాణలో సినిమా పాటలు కూడా విరివిగా వెలువడ్డాయి. డా॥ సి నారాయణరెడ్డి, దాశరథి వంటి ప్రసిద్ధులేకాక ఆధునికంగా చంద్రబోసు, సుద్దాల అశోక్‌తేజ వంటి తెలంగాణ కవుల కలం నుండి జాలువారిన పాటలెన్నో ఆనాటి నుండి ఈనాటి వరకు జనుల మనసుల్ని దోచుకుంటానే ఉన్నాయి.

జ్ఞానపీఠపురస్కార గ్రహీత స్వర్గీయ డా॥ సి.నారాయణరెడ్డి గారు

"నన్నుదోచుకుందువటే వన్నెల దొరసాని...

కన్నులలో దాచుకుందు నిన్నే నాస్వామి..." అనే పాటతో సినీ రంగంలో శ్రీకారం చుట్టి అప్రతిహతంగా ఎన్నో అణిముత్యాల్ని సంగీత సాహిత్యప్రియులకు అందించారు. తొలిపాటలోనే 'వన్నెల దొరసాని' వంటి తెలంగాణా పదపల్లవంతో ఎందరి మనసుల్నో దోచుకున్నారాయన.

దాశరథి కృష్ణమాచార్యకూడా...

"గున్న మామిడీ కొమ్మమీద గూళ్ళు రెండున్నాయి...

ఒక్క గూటిలోన కోయలుంది..."

"ఖుషీ ఖుషీగా నవ్వుతూ... చలాకి మాటలు

రువ్వుతూ..."

అంటూ ఆరోజుల్లో ఎన్నో జనసమ్మోహనమైన గీతాల్ని అందించారు.

హైదరాబాద్‌లో స్థిరపడిన నేటి సినిమా పరిశ్రమకు ఆణిముత్యాల వంటి పాటల్ని అందిస్తున్న ఎందరో మరెందరో వర్ధమాన తెలంగాణకవులు సినీ రంగాన్ని కూడా తమ పాటలతో పల్లవింపజేస్తున్నారు.

## ముక్తాయింపు

ఆదిమకాలం నుండి ఆధునిక కాలందాకా పాట ప్రజల జీవనాడియై వెన్నంటి ఉండి వాళ్ళను ఉత్తేజితుల్ని చేస్తునే వస్తున్నది. కష్టమొచ్చినా సుఖమొచ్చినా పాటే ఊతంగా చేసుకున్న తెలంగాణ ప్రజలు అడుగడుగునా తన కలాన్ని, గళాన్ని ఝుళిపిస్తూనే ఉంది. పాటను ప్రాణంకన్నా మిన్నగా భావించి పది తరాలకు ప్రసరింపజేస్తునే ఉంది.

ఆధునికంగా వచ్చిన సాంకేతికతలో, పాశ్చాత్య సంగీతాల మీద మోజు ఎంతగా వ్యాపించినా తెలంగాణ ప్రజల్లో తిరిగి దేశభక్తిని, ఉద్యమ చైతన్యాన్ని రగుల్కొలిపేందుకు, పారవశ్యంలో ముంచి తెల్చేందుకు పాట ఎప్పుడు నిత్య నూతనంగా ఉద్భవిస్తూనే ఉంటుంది. ప్రతి తెలుగు వాడి ఎదను తట్టి లేపుతునే ఉంటుంది.

***(శ్రీ పసునూరి రవీందర్ గారి సౌజన్యంతో)***

❀❀❀❀❀

# 29. వచన కవిత

దాదాపుగా రెండు వేల ఏళ్ళ తెలంగాణ సాహిత్య చరిత్రలో ఎన్నో ప్రక్రియలు, మరెన్నో ప్రయోగాలు వెలువడి కాలానుగుణంగా ఈ సమాజంపై తమదైన మరెన్నో ప్రయోగాలు వెలువడి కాలానుగుణంగా ఈ సమాజంపై తమదైన ముద్రవేస్తూ సాహితీక్షేత్రాన్ని సుసంపన్నం చేయడం జరిగింది, జరుగుతున్నది.

ఆధునికాంధ్ర కవిత్వ ప్రాదుర్భావం జరిగి సుమారుగా నూట ఇరవై ఏళ్ళు అయ్యింది. ఈ నూట ఇరవై ఏళ్ళలో భావకవిత్వం, అభ్యుదయ కవిత్వం, దిగంబర కవిత్వం, చేతనావర్తన కవిత్వం, విప్లవ కవిత్వం, స్త్రీవాద కవిత్వం, దళితవాద కవిత్వం ఇలా ఎన్నో పాయలు పాయలుగా ఈ కవిత్వం కొత్తపుంతలు తొక్కుతూ సాహితీరంగంపై, సమాజంపై తనదైన ముద్ర వేస్తూ సాగిపోతుంది.

ఆ క్రమంలో ఆధునిక కవిత్వపు కాలంలో వచ్చిన కవిత్వంలో భావనవ్యత, వస్తువైవిధ్యం ఉన్నప్పటికి ప్రక్రియాపరంగా పద్యాన్ని, గేయాన్ని ఆశ్రయించి కవిత్వాన్ని వెలువరించారు.

ఈ సందర్భంలో వస్తుపరమైన నవ్యతను పాటిస్తూనే ప్రక్రియాపరమైన నవ్యతను ఎంచుకోవడం జరిగింది. ఇదే సమయంలో పాశ్చాత్య దేశాల్లోని సాహితీ రంగంలోని మార్పులు మనదేశ కవులపైనా, మన ప్రాంత కవులపైనా కూడా ప్రభావాన్ని చూపాయి.

సమాజంలోని రుగ్మతలను నిరసించడానికి వచనకవిత్వాన్ని ఆశ్రయించారు. ఈ పాశ్చాత్య సాహిత్య ప్రభావంతో తెలుగులో వచన కవిత ప్రస్థానం ప్రారంభమైంది. అయితే పూర్తిగా ఇది పాశ్చాత్యుల ప్రభావం అని చెప్పలేం. ఎందుకంటే రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో ప్రపంచస్థాయి ప్రజల ఆలోచనల్లో వచ్చిన మార్పుకనుగుణంగా కవిత్వంలో ఆ ప్రభావం కనిపించింది కాని ప్రక్రియాపరంగా ఇది పూర్తిగా నూతనమైంది. పాశ్చాత్య ప్రభావంతో సృష్టించబడ్డది అని అనలేం. 16వ శతాబ్దంలోని రాయవాచకం కంటే ముందే మహబూబ్‌నగర్ జిల్లాలోని నంతూర్‌కు చెందిన కృష్ణమాచార్యులచే క్రీ.శ.13వ శతాబ్దం ఉత్తరార్థం నుంచి క్రీ.శ.14వ శతాబ్దం పూర్వార్థంలో 'సింహగిరి నరహరి వచనములు' రాయబడ్డాయి.

కాబట్టి వచన ప్రక్రియకు రూపమూలం తెలంగాణ ప్రాంతమే అని చెప్పక తప్పదు. వస్తువైవిధ్యం, వస్తునవ్యత అనేది పాశ్చాత్యదేశాల ప్రభావంచేత రావడం జరిగిందని చెప్పవచ్చు.

వచన గేయాన్ని ఫ్రెంచి భాషలో 'Verse Libre' అని ఇంగ్లీష్‌లో Free Verse అని అంటారు. ఆధునికుల అభిప్రాయం ప్రకారం ఈ వచనవితకు ఆద్యులుగా ఫ్రెంచ్ కవి జూలీస్ లాఫోర్జ్ మున్నగువారిని చెపుతారు. తద్వారా ఈ వచన కవిత ఆంగ్ల రచయితలను, తద్వారాప్రపంచ దేశాల్లోని వివిధ ప్రాంత కవులకు ప్రేరణ కల్పించింది.

ఫ్రీవర్స్‌ను తెలుగులో వచన గేయం, వచన పద్యం, ముక్తచ్ఛందం, స్వచ్ఛందకవిత్వం, స్వేచ్ఛాకవిత్వం, అనిబద్ధ కవిత్వం అని పేర్లు పెట్టినప్పటికి చివరికి వచనకవితంగా స్థిరీకరించబడింది.

అరిపిరాల విశ్వంగారి మాటల్లో...

వచనంలాగా భాసించే మాటల్లో కవితా స్వభావమైన భావానుభూతిని కలిగించే ప్రయత్నం వచన కవిత్వం. ఛందో రహితమైన, కేవలం వచనంలో భావాలయ ప్రధానంగా పలికే కవిత్వాన్ని వచన కవిత్వం అని చెప్పవచ్చునంటారు.

సి.నారాయణరెడ్డి గారు "వచన గేయమునకు లయ ముఖ్యం అన్నారు. ఒకానొక ఊపులో, విసురులో పదములను గుప్పించుట వలన ఈ లయ ఏర్పడును. ఏ నియమం లేకుండా శుద్ధ వచనమును లయాత్మకంగా కూర్చినచో అది వచన గేయమగునని" పేర్కొన్నారు.

టి.ఎల్.కాంతారావు గారు "కవి వచన గేయాన్ని రాసేటప్పుడు అతడు ప్రదర్శించే శైలీవిన్యాసం, భావనానుగుణమైన శబ్దవైచిత్రి, ఉద్రేకానుగుణమైన పాదాల విరుపు ఇవన్నీ ఆ వచన గేయం యొక్క రూపావిష్కరణకు తోడ్పడుతాయి. అంచేత కవి ప్రతిభను బట్టి మారుతూ ఉంటుంది" అని అంటారు.

పై నిర్వచనాలనన్నింటిని పరిశీలిస్తే...

వచన కవితా లక్షణాలు సంక్షిప్తంగా...

- ♦ నిరాడంబరత
- ♦ గణ నియమం లేకపోవడం
- ♦ నియమ (ఛందో) రాహిత్యం
- ♦ నడకలో వైవిధ్యం
- ♦ వాక్యాల విరుపు
- ♦ అంతర్లయ
- ♦ అర్థగాంభీర్యత
- ♦ నిగూఢత
- ♦ వ్యవహారిక పదాల ప్రయోగం
- ♦ సూటిదనం
- ♦ సరళత
- ♦ క్లుప్తత
- ♦ వస్తువైవిధ్యం
- ♦ బలమైన భావ ప్రకటనా లక్షణాలు కనిపిస్తాయి.

ఈ పై లక్షణాలన్నీ కూడా ఒకే కవితలో ఉండొచ్చు, ఉండకపోవచ్చు.

అందుచేత వచన కవిత్వాన్ని నిర్వచించే కొలమానాలు లేవు అని చెప్పవచ్చు. కాని ఏది రాస్తే అది వచన కవిత్వం అవుతుందా? అని పరిశీలిస్తే 'కాదు' అని సమాధానం చెప్పుకోవాల్సి వస్తుంది. వినూత్న శబ్ద ప్రయోగం, భాషా వినిమయం, ఒక విరుపు, ఒక మెరుపు, ఒక అంతర్లయ ఆ కవితలో మనకు కనిపించాలి. అప్పుడే ఆ కవితకు ఒక స్థాయి ఏర్పడుతుంది. దీనిలో ఉత్తమమైన కవిత్వం ఆ కవి యొక్క భావనాబలం, శబ్ద ప్రయోగశక్తి, భావచిత్రాలు, శబ్దవైచిత్రి, వస్తు నవ్యతను బట్టి ఆ కవిత ఉత్తమ కవితా కాదా అని నిర్ణయించవచ్చు.

వచన కవితలో వస్తువు ప్రకృతి, ప్రేమ, భక్తి, స్మృతి, ఆస్తికత, నాస్తికత, ఆనందం, విషాదం, అభ్యుదయం ఒకటేమిటి గడ్డిపరక నుంచి గగనం దాకా దేన్నైనా తీసుకోవచ్చు. అలాగే కవి యొక్క శైలిలో కూడా నూతనత్వం కనబడ్తుంది. అన్యభాషా పదాల ప్రయోగం, మాండలిక పదప్రయోగం, సంస్కృత భూయిష్టమైన పద ప్రయోగం లాంటి భిన్నశైలులతో వచన కవిత్వాన్ని సుసంపన్నం చేసారు, చేస్తున్నారు.

ఏమైనా వచన కవిత్వం ఏ నిర్వచనానికి, లక్షణానికి లొంగదు. సమగ్రంగా, శాస్త్రీయంగా నిర్వచించడం కూడా కుదరదు. కవిత్వం ఒక అమూర్త భావనకు అక్షర రూపం కల్గించడమే' అనే నిర్వచనం చక్కగా సరిపోతుంది.

## ప్రాదుర్భావ వికాసాలు :

దాదాపుగా 1939-40లో ప్రారంభమైన వచన కవితా ఉద్యమం ఇంతింతై వటుడింతై అన్నట్లుగా తెలంగాణ సాహిత్య క్షేత్రం అంతా విస్తరించింది. అప్పుడప్పుడు, అక్కడక్కడ వివిధ ప్రక్రియలు వెలువడ్తున్నప్పటికి వచన కవిత సాహితీ క్షేత్రంలో సింహభాగాన్ని ఆక్రమించింది.

తెలంగాణ ప్రాంతంలోని రాచరికపు అణచివేత ధోరణులు, ఆకలి, తిరుగుబాటు కవితా వస్తువులుగా వచన కవిత్వం వెలువడింది.

ఆనాటి మార్గకవిత్వాన్ని తోసిరాజని దేశికవిత్వ ఉద్యమాన్ని తీసుకొచ్చిన పాల్కురికి నుండి నేటి కవుల వరకు కూడా కవిత్వాన్ని కొత్తపుంత త్రొక్కించినవారే. ప్రపంచ సాహిత్యంలో వచ్చిన మార్పులకనుగుణంగా తెలంగాణ ప్రాంత కవుల్లో కూడా వారి రచనల్లో స్వేచ్ఛా క్రియత్వం, ధిక్కార స్వరం మనం చూడవచ్చు.

1955లో కుందుర్తి తెలంగాణ వచన కావ్యానికంటే ముందుగానే అంటే 1953లోనే కవిరాజమూర్తి 'మహిక' అనే వచన కావ్యం వచ్చిందని పరిశోధకులు తేల్చి చెప్పారు. ఇలా ప్రయాణం చేసిన వచన కవితలో ఆవేదన, ఆవేశం, ఆత్మానుభూతి వస్తువులుగా కనిపిస్తాయి.

అన్నపురాసులు ఒకచోట, ఆకలిమంటలు ఒకచోట

హంసతూలిక లొకచోట, అలసిన దేహాలు ఒక చోట

సంపదలన్నీ ఒకచోట, గంపెడు బలగంబొకచోట

అంటాడు కాళోజీ – తెలంగాణ వచన కవితకు మార్గదర్శకులుగా కాళోజీ, దాశరథి గార్లను పేర్కొనవచ్చు. కాళోజీ – నా గొడవ అంతా గేయ, వచన కవిత్వాలే సమాజమే ఆయన కవితా వస్తువు.

నేను ప్రస్తుతాన్ని – గతానికి శిఖరాన్ని

వర్తమానాన్ని – భావికి ఆధారాన్ని

నేను కవనాన్ని – నేను ప్రస్తుతాన్ని

నేను అక్షరాన్ని – నేను సాగేదాన్ని అనే కాళోజీ కవిత్వంలోని

పంక్తుల్ని పరిశీలిస్తే తెలంగాణ వచన కవిత్వంలో సమాజమే కవితా వస్తువుగా మనకు కనబడ్తుంది. వచన కవితల్తో తెలంగాణ భాషకు కావ్యగౌరవాన్ని కల్గించిన కవి కాళోజీ.

వచన కవిత్వంలో ఒక తాత్వికతను అందించాడు కాళోజీ

అతిథివోలే ఉండి ఉండి / అవని విడిచి వెళ్ళుతాను

పల్లె పట్టణం బులకన / పల్లేరై తిరిగినాను

..........................................

"లోయలో దూకి దూకి / లోతులెన్నో చూసినాను" అంటూ మానవ జీవన పార్శ్వపు లోతులను దర్శించి వచన కవిత్వాన్ని సుసంపన్నం చేసిన కవి కాళోజీ ఈ కోవలోనే సమాజంలోని అన్యాయాలకు, నిజాం కబంధ హస్తాల్లో చిక్కుకుని నలిగిపోతున్న ప్రజల ఆర్తనాదాలకు దాశరథి కృష్ణమాచార్య గుండె అగ్నిధారై కవిత్వమై ప్రవహించింది.

'అది తెలంగాణలోన దావాగ్ని లేచి

చుట్టుముట్టిన భయద సంక్షోభవేళ

అది నిజాము భయద సంక్షోభవేళ

చూచుకొని నిక్కునట్టి పిశాచహేల' అని నిజాంను, రజాకార్లను పిశాచాలలో తన కవితలో పోల్చుతాడు దాశరథి.

'ఇదే మాట ఇదే మాట పదే పదే అనేస్తాను

..........................................

దగా కోరు బడాచోరు రజాకారు పోషకుడవు

వద్దంటే గద్దె యెక్కి పెద్దరికం చేస్తావా?' వచన కవితకు తిరుగుబాటు తత్వాన్ని అందించిన పంక్తులు దాశరథివి.

వచన కవితను విశ్వవ్యాపితం చేసి జ్ఞానపీఠమెక్కించిన కావ్యతపస్వి సి.నా.రె. అప్పటి వరకు అభ్యుదయ కవుల కలాల్లో, ప్రజల గుండెల్లో గూడుకట్టుకొన్న వచన కవిత ఒక్కసారిగా జ్ఞానపీఠాన్ని అధిరోహించడం వచన కవితను శబ్దశక్తితో బంధించి విశ్వంభర కావ్యంతో వచన కవితా ప్రస్థానానికి పరాకాష్టగా నిలిచారు సి.నా.రె.

డా॥ సింగిరెడ్డి నారాయణరెడ్డి గారు వచన కవిత్వానికి కావ్యగౌరవం ఆపాదించారు. వారి విశ్వంభర కావ్యానికి జ్ఞానపీఠ అవార్డు సాధించిపెట్టినది.

"నా పేరు కవి

ఇంటిపేరు చైతన్యం

ఊరు సహజీవనం

తీరు సమభావనం" అని చెప్పుకొంటారు.

నా వచనం బహువచనం / నా వాదం సామ్యవాదం

కవిత నామాతృభాష / ఇతివృత్తం మానవత్వం అని వచన కవిత్వానికి మానతావాదం ప్రాథమికం అంటాడు. వారి ప్రతి కవితా సంకలనం ఒక రసగుళిక, అమృత భాండమే. కవిత్వం రాయకపోతే ఊపిరి ఆడడంలేదంటారు వారు. వీరి రచనలు నవ్వనిపువ్వు, అజంతా సుందరి, జలపాతం, దివ్వెల మువ్వలు, అక్షరాల గవాక్షాలు, మధ్యతరగతి మందహాసం, మంటలూ – మానవుడూ, ఉదయం నా హృదయం, మార్పు నా తీర్పు, నడక నా తల్లి, కాలం అంచుమీద, కవిత నా చిరునామా, కలం సాక్షిగా, లాంటి ఎన్నో వచన కవితా రచనలలో తెలంగాణ క్షేత్రాన్ని వచన కవిత ద్వారా విశ్వవినువీధుల్లోకి ప్రయాణింపజేసారు.

ఇలా వచన కవిత అభ్యుదయ కవిత్వపు అడుగుజాడలనుండి విప్లవ కవిత్వంగా పరిణామం చెందింది. దీనిలో వరవరరావు, అలిశెట్టి, వెల్దుర్తి మాణిక్యరావు లాంటి కవులు తమ కవిత్వం దారా సామాజిక చైతన్యాన్ని కాంక్షించారు.

అనంతరం 1965లో కవిత్వంలో ఒక పాయగా మూడేళ్ళు ఒక తుఫాన్‌లాగా తెలుగు సాహిత్యాన్ని కల్లోలం సృష్టించిన కవిత్వం దిగంబర కవిత్వం. వీరు ఆరుగురు. వీరిలో

నగ్నముని, నిఖిలేశ్వర్, చెరబండరాజు, మహాస్వప్న, జ్వాలాముఖి, భైరవయ్య. వీరిలో నిఖిలేశ్వర్, చెరబండరాజు, జ్వాలాముఖి ముగ్గురూ తెలంగాణ వాళ్ళే.

అభ్యుదయ కవీ, నల్లమందు తిని నిద్రపోయావ్" అని వచన కవిత్వాన్ని ఒక పదునైన ఆయుధంగా మలుచుకొని సమాజంలోని కుళ్ళును కుళ్ళుగానే చూపించారు వీళ్ళు.

'నన్నెక్కనివ్వండి బోను' అనే కవితలో చెరబండరాజు

"మనిషిమీద నమ్మకం పోగొడ్తున్న మీరు / దేవుడి మీద ప్రమాణం చెయ్యమంటారెందుకు?" అని ప్రశ్నిస్తాడు.

ఏదేమైనా ఒక ఝంఝామారుతంలో ఒక మూడు సంవత్సరాలు తెలుగు నేలలో వచన కవితద్వారా ప్రకంపనలు సృష్టించారు.

ఈ సందర్భంలోనే చేతనావర్తన కవులు పేరుతో కోవెల సుప్రసన్న, పేర్వారం జగన్నాథం, కోవెల సంపత్కుమారాచార్య, వేం. నరసింహారెడ్డి వచన కవితను తమ బలమైన సాధనంగా చేసుకొని దిగంబర కవులు సృష్టించిన అస్థిరతకు స్వాంతన చేకూర్చాలనే లక్ష్యంతో తమదైన పంథాలో అవినీతిని, అన్యాయాన్ని ఆక్షేపిస్తూ కవిత్వాన్ని వెలువరించారు.

"రాత్రి నల్లంచు చీర చివర / కట్టుకున్న జరీపోగు ఉషస్సు

సాగిపోయే గజదొంగ మెడకు / కట్టిన ఇనుప గుండు సూరీడు"

అంటూ ప్రతీకాత్మకంగా వచన కవిత్వాన్ని ఫలవంతం చేసిన కవులు చేతనావర్తన కవులు. వీరిలో ఒకరైనా వేం.నరసింహారెడ్డి.

"ఈ దేశంలో ఎప్పుడూ / పేదల గుడిసెలో కాలిపోతాయి

కడుపులో మండే ఆకలిమంటలు / కనుల్లోంచి ఎగిసి

కప్పులంటుకుంటాయేమో" అంటూ పేదవారి బాధలను తమ బాధలుగా సమాజ చేతనను ఆశించారు చేతనావర్తన కవులు. ఈ వచన కవిత్వంలో పైన పేర్కొన్న భావ కవిత్వం, అభ్యుదయ కవిత్వం, విప్లవ కవిత్వం, దిగంబర కవిత్వం, చేతనావర్తన కవిత్వం లాంటి ఉద్యమాలతో పాటు 80వ దశకంలో దళితవాద, స్త్రీవాద ఉద్యమాలు తెలంగాణ సమాజాన్ని జాగృతం చేసాయి.

దళితవాద కవిత్వంలో 'బీజ కవితలు', నడుస్తున్న చరిత్ర, వెలుతురు లాంటి కవితా సంపుటాలు వెలువరించిన జోయజంగయ్య, వేముల ఎల్లయ్య, తిరుగుబాటు కవిత్వం, కోరస్, జయహే తెలంగాణ, నెత్తుటి వెన్నెల రాసిన దామెరరాములు, వీళ్ళందరికంటే ముందుగా స్మరణీయులు మాష్టార్జీ. వీరి రచనలు బౌద్ధగేయాలు, మట్టిపూలు. మాష్టార్జీ దళిత కవితలు దళితోద్యమంలో చెరగని ముద్రవేసాయి.

దళితులను చరిత్రలేని వ్యక్తులుగా తీర్చిదిద్దడానికి తీవ్రంగా ఖండిస్తాడు. ఈ రకంగా దళితవాద ఉద్యమం వచన కవితపై చెరుగని ముద్రవేసింది.

ఇంగ్లీషులో 'ఫెమినిజం' అనే పదానికి సమానార్థకంగా తెలుగులో 'స్త్రీవాదం' అని పేర్కొనవచ్చు. ఫెమినిజం ముఖ్యంగా ఫ్రెంచి విప్లవ ఫలితంగా ఉద్భవించింది అని చెప్పవచ్చు. స్త్రీ అభ్యుదయం, పురుషాధిపత్య ధోరణి, నిరసన, లింగవివక్షపట్ల తిరుగుబాటు, సమానత్వం, ఆర్థిక స్వాతంత్ర్యం, పితృస్వామ్య ధోరణిపట్ల వ్యతిరేకత వెలసి స్త్రీవాద ఉద్యమంగా రూపుదిద్దుకున్నది.

తెలంగాణలో 1999లో 'పంజరాన్ని నేనే పక్షినీ నేనే', ఎంతెంతదూరం, గాజునది అనే కవితా సంకలనాలను వెలువరించింది శిలాలోలిత.

1973లో 'చైతన్యం పడగెత్తింది' అనే కవితా సంకలనంలో వచన కవిత్వాన్ని ప్రారంభించిన అనిశెట్టి రజిత గులాబీలు జ్వలిస్తున్నాయి, చెమటచెట్టు, ఓ లచ్చువ్వ, అనగనగా కాలం లాంటి కవితా ఖండికలను వెలువరించింది. జూపాక సుభద్ర "కొంగునా బొచ్చు మీద కావలుండే బొంతపేగ్గాదు" హైటెక్ సిటీ మామకి స్వాగతం' లాంటి కవితా ఖండికలతో పురుషాధిపత్యానికి సవాలు విసిరింది. కర్షకులు, దళితవాద కవిత్వంతో తమవాణిని వినిపిస్తున్న జాజుల గౌరీ "తిరుగుబాటు ప్రకటిస్తున్నా కుటుంబంలోని కుళ్ళుని కడిగి సమాజంలోని దురహంకారాన్ని ఇక ఉతికి ఆరేస్తా" అంటూ కుటుంబంలోని పురుషాధిపత్యాన్ని సమాజంలోని అగ్రకులాధిపత్యాన్ని కడిగిపారేస్తుంది నఖాబ్, జఖ్మీ, ఆవాజ్, దర్దీ లాంటి కవితా సంకలనాలు వెలువరించిన షాజహాన్‌లాంటి కవయిత్రులు స్త్రీవాద కవిత్వాన్ని బలమైన గొంతులో బలంగా వినిపిస్తున్నారు.

పొట్లపల్లి రామారావు చుక్కలు, టి.కృష్ణమూర్తి యాదవ్ – తొక్కుడు బండ, షబ్నం; వానమామలై జగన్నాథాచార్యులు – ఆహ్వానం; సలంద్ర లక్ష్మీనారాయణ – చావుగీతం; అలిశెట్టి ప్రభాకర్ – చురకలు, రక్తరేఖ, సిటీలైఫ్, ఎర్రపావురాలు, సంక్షోభగీతం; ఇలా అనేక కవితా ఖండికలతో తెలంగాణ కవులు వచన కవితాన్ని పరిపుష్టం చేశారు.

ఆధునికుల్లో అత్యంత బలంగా వచన కవిత్వాన్ని పండిస్తూ, వచన కవితకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన కవి ప్రొ.ఎన్.గోపి వారి 'కాలాన్ని నిద్రపోనివ్వను' కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు పొందినది. వంతెన, చిత్రదీపాలు, తంగేడుపూలు జలగీతం ద్వారా వచన కవిత్వానికి చిక్కదనం తీసుకొస్తున్న కవి ఆచార్య ఎన్.గోపి.

"ముట్టుకుంటే తగలాలి కవిత్వం – మనిషిలాగ

నరాల్లో ప్రవహించే రక్తపుష్పాలు వెచ్చగా తాకిపోవాలి"

అని వచన కవిత్వపు నిర్వచనమై మిగులుతాడు.

చేతిలో వాలిన వార్తాపత్రిక

దేశం మీద కప్పిన కఫన్‌లా ఉంటుంది

..........................................

మనిషి కాటుపడ్డ మానవత్వానికి

ఏ యాంటి బయోటిక్ మందూ పనిచెయ్యదు

ఇవాళ జీవితం, మరణం పర్యాయ పదాలయ్యాయి అంటారు కాలాన్ని నిద్రపోనివ్వనూ కవితా సంపుటిలో.

జూలూరి గౌరిశంకర్ – ముండ్లకర్ర, గూడూరి సీతారాం – ఇదిగో ఇక్కడిదాకే, సన్/ఆఫ్ మాణిక్యం, జూకంటి జగన్నాథం – పాతాళగంగ, బొడ్డుతాడు, తల్లికొంగు, గంగడోలు, అఫ్సర్–వలస, ఊరి చివర, వర్మల శివకుమార్ – గోగుపువ్వు, దాఖలా, కలలసాగు, నాళేశ్వరం శంకరం – దూదిమేడ, అమ్మంగి వేణుగోపాల్ – మణుగురు, భరోసా, పచ్చబొట్టు లాంటి కవితా సంకలనాలలో వచన కవిత్వాన్ని సుసంపన్నం చేస్తున్నారు.

స్వయం సమృద్ధమైన గ్రామాలు

రోగగ్రస్త నగరాల చుట్టూ చక్కర్లు కొట్టడం మాయ

వొత్తిడి గుండెను తొలుస్తది

ఒంటరి తనం వొంటిని తొలుస్తది

....................................

బతకాలంటే / ఇంటి తుఫానులూ

ఇసుక తుఫానులూ / తట్టుకోవాల్సిందే – అంటాడు సిధారెడ్డి.

ఇలా వచనకవిత్వాన్ని సుసంపన్నం చేస్తున్న కవులు వందలు, వేల సంఖ్యలో తెలంగాణ రాష్ట్రంలో ఉండి ఒక బలమైన కవిత్వ శక్తితో వచన కవిత్వాన్ని శిఖర స్థాయిలో నిలబెడ్తున్నారు. ఆధునిక వచన కవుల్లో ఒక్కొక్క జిల్లాలోనే వందల, వేల సంఖ్యల్లో వచన కవితలు, కవితా సంకలనాలు, మినీ కవితలు, దీర్ఘకవితలు, హక్కుల్లాంటి ప్రక్రియలలో ఈ ప్రాంతం కవిత్వ శోభను అందుకుంటుంది. 1980 దశకం తర్వాత తెలంగాణ ప్రాంతంలో విస్తృతంగా వచన కవిత్వ రచన కొనసాగుతుంది. దీనిలో బలంగా కవిత్వాన్ని పండిస్తున్న చేయితిరిగిన వర్తమాన యువ కవులెందరో, ఎందరెందరో. ప్రతి పేరును కూడా ప్రధాన శీర్షిక క్రింద చేర్చుకునేంత బలంగా వచన కవిత్వం తెలంగాణ క్షేత్రంను సుసంపన్నం చేస్తుంది.

## వచన కవులు – రచనలు

**వానమామలై వరదాచార్యులు :** ఆహ్వానం, జయధ్వజం, మణిమాల, కూలిపోయే కోర్కు

**కాళోజి నారాయణరావు :** నా గొడవ, జీవనగీత (అనువాదం)

**పొట్లపల్లి రామారావు :** చుక్కలు

**టి.కృష్ణమూర్తి యాదవ్ :** తొక్కుడుబండ, షబ్నం

**కోవెల సంపత్కుమారాచార్య :** కాలస్పృహ, అంతర్మథనం, చేతనావర్తనము–1

**సి. నారాయణ రెడ్డి :** నవ్వని పువ్వు, అక్షరాల గవాక్షాలు, మధ్యతరగతి మందహాసం, మంటలూ – మానవుడు, ఉదయం నా హృదయం, మార్పు నా తీర్పు, మట్టి మనిషి ఆకాశం, విశ్వంభర మొదలగునవి

**పేర్వారం జగన్నాథం :** సాగర సంగీతం, వృషభపురాణం, మోర్దోపుదున్న

**కోవెల సుప్రసన్నాచార్య :** తేజచ్చక్రము, దుఃఖయోగిని, ఆధునీకం, శతాంకుర, ఋతంబర మొదలగునవి

**చెరబండరాజు :** నేనెక్కడిబోను, ఊబి, జాగ్రత్త, వందేమాతరం మొదలగునవి

**జ్వాలాముఖి :** శస్త్రచికిత్స, సూర్యస్నానం మొదలగునవి

**నిఖిలేశ్వర్ :** నీవు చెప్పింది అబద్ధం కాదు, నా దేశంలో నేను ఏకాకిని మొదలగునవి

**అలిశెట్టి ప్రభాకర్ :** చురకలు, సిటీలైఫ్, ఎర్రపావురాలు, సంక్షోభ గీతం మొదలగునవి.

**అమ్మంగి వేణుగోపాల్ :** మిణుగురు, భరోసా, పచ్చబొట్టు, పటంచెరు

**ఎన్.గోపి :** కాలాన్ని నిదురపోనివ్వను, వంతెన, చిత్ర దీపాలు, తంగేడు పూలు, జలగీతం

**నందిని సిధారెడ్డి :** భూమి స్వప్నం, ఇక్కడి చెట్లగాలి, ప్రాణహిత, ఒక బాధకాదు, నదిపుట్టువడి

**గూడూరి సీతారాం :** ఇదిగో ఇక్కడిదాకే, సన్/ఆఫ్ మాణిక్యం

**బోయజంగయ్య :** భోజ కవితలు, నడుస్తున్న చరిత్ర, వెలుతురు

**వేముల ఎల్లయ్య :** తిరుగుబాటు కవిత్వం

**దామెర రాములు :** కోరస్, జయహే తెలంగాణ, నెత్తుటి వెన్నెల

**మాష్టార్జీ :** బౌద్ధగీతాలు, మట్టిపూలు

**సతీష్‌చందర్ :** పంచమవేదం, నాన్నా సైకిల్, పసుపు జాబిల్లి

**ఎండ్లూరి సుధాకర్ :** వర్తమానం, కొత్త గబ్బిలం, పుష్కర కవితలు, గోసంగి

**జూలూరి గౌరీశంకర్ :** పొలికట్టె, ముండ్ల కర్ర

**జూపాక సుభద్ర :** హైటెక్ సిటీ మామ్‌కి స్వాగతం

**అనిశెట్టి రజిత :** నేనొక నల్లమబ్బునవుతా, చెరుట చెట్టు, అనగనగా కాలం

**వఝుల శివకుమార్ :** గోగుపూలు, దాఖలా, కలలసాగు

**షాజహానా :** నఖాబ్, జఖ్మీ, ఆవాజ్, దర్దీ

**అఫ్సర్ :** వలస, ఊరి చివర

**జూకంటి జగన్నాథం :** పాతాళగంగ, బొడ్డుతాడు, తల్లికొంగు, గంగడోలు

**నాళేశ్వరం శంకరం :** దూదిపేడ

**వేం నర్సింహారెడ్డి :** కొలిమంటుకున్నది, చేతనావర్తనం-2, సమర్పథేబాగ్లా

**శిలాలోలిత :** పంజరాన్ని నేనే పక్షిని నేనే, గాజునది

**జాజుల గౌరి :** కర్షకులు

❀❀❀❀❀

# 30. తెలంగాణ కథా చరిత్ర

## ఉపోద్ఘాతం

మానవునికి ఊహ తెలిసినప్పటి నుండి కథలు వినడమంటే ఆసక్తి ఉంటుంది. అక్షర జ్ఞానంలేని వారుకూడా కథలు చెబుతారు, శ్రద్ధగా వింటారు. చిన్న పిల్లలకు కథలంటే ప్రాణమే. వృద్ధులకు కథ చెప్పడంలోను వినడంలోను ఉండే ఆసక్తి అందరికీ తెలిసిందే. కథ జీవితమంత విస్తృతమైనది కాకపోయినా జీవన నేపథ్యాన్ని హృద్యంగా వివరిస్తుంది. వ్యక్తి జీవితంలోని సంఘటనలను చుట్టూ ఉన్న సమాజానికి అన్వయించి చెప్పడంలోనూ, విషయాన్ని విషయంగా కాకుండా అనుభవంతో మేళవించి సృజనాత్మకంగా చెక్కడంలోనూ కథ ఒక అసాధారణ సాధనం. కథను విన్నవారు, తానెరిగిన కష్టాలు, సుఖాలు తనకొక్కనికి మాత్రమే పరిమితమైనవికావని, సర్వజన సామాన్యమైనవని గ్రహించగలుగుతారు. కథలు కుతూహలాన్ని రేకిత్తిస్తాయి, జిజ్ఞాసను కలిగిస్తాయి, జ్ఞానాన్ని పెంపొందిస్తాయి. కథ చెప్పడంలో నేర్పులేకపోతే ఆ కథ సాధారణంగా ఉంటుంది. పూర్వకాలం నుండి కథలు అనేక రకాలుగా ఉన్నాయి. కథాకథనం, కథాశ్రవణం అనే విషయాల్లో పిల్లలు పెద్దలు ఒక్కటే.

## శాతవాహన కాలం

ప్రపంచ కథాసాహిత్యానికే మకుటాయమానమైనది బృహత్కథ అని చెప్పవచ్చు. దీనిని గుణాఢ్యుడు పైశాచీ ప్రాకృతంలో రాసాడు. క్రీ.పూ. 200 – 150 మధ్యకాలం మధ్యకాలం వాడనీ, శాతవాహనుల రాజ్యంలోని వాడని చారిత్రకుల అభిప్రాయం. ఈ శాతవాహనుల రాజధాని కోటిలింగాల ప్రాంతమని, ఇది ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలోని పూర్వ కరీంనగర్ జిల్లా, ప్రస్తుత జగిత్యాల జిల్లాలో ఉన్నది. ఈ బృహత్కథ సంస్కృతం, తమిళం, చైనా, టిబెట్, ఇంగ్లీష్, జర్మనీ, ఫ్రెంచ్, రష్యన్ భాషల్లోకి అనువదించబడినది. దీనిని సంస్క ృతంలోకి "కథాసరిత్సాగరం" అనే పేరుతో పూర్వ కరీంనగర్ జిల్లా వేములవాడ, గంగాధర ప్రాంతానికి చెందిన సోమదేవుడు అనువదించాడు. బృహత్కథను క్షేమేంద్రుడు (కాశ్మీర రాజు ఆస్థానకవి) కూడా బృహత్కథామంజరిగా సంస్కృతంలో అనువదించాడు. క్రీ.పూ 1వ శతాబ్దంలో శాతవాహన రాజు హాలుడు "గాథాసప్తశతి" (700) ఏడువందల కథలను గ్రంథస్తం చేశాడు. బృహత్కథ తర్వాత కథాసరిత్సాగరం బేతాళ పంచవింశతి, సింహాసన ద్వాత్రింశిక వంటి కథా కావ్యాలు, శుక సప్తతి కథలు, పంచతంత్రకథలు, హితోపదేశం కథలు ప్రసిద్ధి పొందాయి. తెలంగాణలోని కావ్యాలలో కూడా అనేక రకాల కథలు ఉన్నాయి.

## ఆధునిక కాలం

ఆధునిక కాలంలో కొమర్రాజు వేంకట లక్ష్మణ రావు అక్క బండారు అచ్చమాంబ తొలి తెలుగు కథారచయిత్రి. గురజాడ కంటే పదేళ్ళ ముందే 1902 నవంబరులో ఆమె రాసిన కథ "ధన త్రయోదశి"ని 'హిందూసుందరి' పత్రికలో ప్రచురించారు. తెలంగాణలో ఉద్యోగరీత్యా జీవితాన్ని గడిపి గ్రంథాలయోద్యమానికి కృషి చేసినవాడు కొమర్రాజు వేంకట లక్షణరావు. 1910లో 'ఏబదివేల బేరము' కథ రాశారు. ఈ కథ 'ఆంధ్ర పత్రిక' సాధారణ సంవత్సర ఉగాది సంచికలో ప్రచురించబడినది. ఈ కథలో ఒక బూటకపు జమీందారు (ఘరాన దొంగ) ఎంతో మంది జమీందారులను మోసపుచ్చిన షావుకారును మోసపుచ్చిన విధానం ఉన్నది. సాంఘిక ప్రయోజనంగల కథ. కథలోని భాష, కథనం సరళంగా, ఆసక్తిదాయకంగా ఉంటుంది. బ్రిటీషుఆంధ్రలో కథవచ్చిన కాలంలో తెలంగాణలో కథ రావడం దీని ప్రత్యేకత.

ఆంధ్ర పితామహుడు మాడపాటి హనుమంతరావు రాసిన 'హృదయ శల్యము', గురజాడ దిద్దుబాటు కథ అచ్చయిన 'ఆంధ్రభారతి' లోనే 1912లో అచ్చుకావడం విశేషం. ఇది చారిత్రక నేపథ్యం ఉన్న కథ.

బడారు శ్రీనివాసరావు రాసిన 'రాజయ్య సోమయాజులు' కథ 1914లో తెలంగాణలో ప్రచురింపబడిన మొదటి పత్రిక "హితబోధిని"లో అచ్చయినది. ఈ హితబోధిని సంపాదకుడే కథా రచయిత. అతి సరళ భాషలో ఈ కథ ఉన్నది. 'రంగము'లు గా ఈ కథ విభజింపబడినది. 68 సం॥ల వృద్ధుడు రాజయ్య సోమయాజులు 8సం॥ల లలితా బాయి వివాహం గురించి ఉన్నది. బాల్యవివాహ ఆచారాన్ని విమర్శిస్తూ రాసిన కథ.

షబ్నవీసు వేంకటరామ నరసింహారావు 1921లో రాసిన కథ 'బాలికా విలాపము' (విజ్ఞాన ప్రచారిణీ గ్రంథమాల నల్గొండ నుండి వెలువడినది). ఈ కథలో బాల్య వివాహాలతో బాల విధవలు కావడం, పునర్వివాహం మొదలగునవి ఉన్నాయి. సంఘ సంస్కరణోద్యమంలో భాగంగా ఈ కథ వచ్చింది. ఒక దేశ భక్తుడు ఆత్మహత్య నుండి బాల వితంతువును కాపాడటమే ఇతివృత్తం. గ్రాంథిక భాషలో ఈ కథ ఉన్నది.

మాడపాటి రామచంద్రుడు రాసిన కథ 'అడవిగాచిన వెన్నెల' 1923లో ఆంధ్రాభ్యుదయము' పత్రికలో ప్రచురింపబడినది. ఇది గ్రాంథిక భాషలోనే ఉన్నది. రామారావు – భగ్నమనోరథయైన కమల కుమారి కథ ఇది.

సోమరాజు రామానుజరావు రాసిన కథ 'నీవేనా?' 1925లో భారతి పత్రికలో వచ్చినది. రాజకీయ, సామాజిక, చారిత్రక, విజ్ఞాన కథలేగాక డిటిక్టివ్ కథలు కూడా తెలంగాణ నుండి 1929లో వచ్చాయని ఈ కథను బట్టి తెలుస్తున్నది. అద్భుతమైన సన్నివేశాలతో కథను కల్పన చేశాడు. సరళ గ్రాంథికంలో ఉన్నది.

కే. రాములు 'విపరీత సాహసము' అనే కథను 1927లో రాశారు. ఇది 'సుజాత' పత్రిక నుండి వెలువడినది. ఇది చారిత్రక ఇతివృత్తం గల కథ. దీనిలో పరిచారికల విషాద ఇతివృత్తం చెప్పబడింది. సరళ గ్రాంథికంలో ఉన్నది. ఒద్దిరాజు రాఘవ రంగారావు రాసిన 'లండన్ విద్యార్థి' కథ ఇదే సం॥లో వచ్చింది.

భాగ్యరెడ్డివర్మ 'వెట్టిమాదిగ' కథను రాశారు. ఈ కవి 'భాగ్యనగర' పత్రిక నుండి 1932లో వెలువడినది. దీనిలో భాష సరళంగా ఉన్నది. 'అజ్ఞాతవాసి' అనే పేరుతో తను నడిపిన భాగ్యనగర పత్రికలోనే అచ్చయింది. జీతభత్యాలు లేకుండా పని చేసే 'వెట్టి' గురించి దళితునిచే రాయబడిన కథ ఇది.

జె. వనాంబ రాసిన 'సుగుణా! ఈ పొరపాటునాదే' అనే కథ. 'దక్కన్ కేసరి' అనే పత్రికలో 1934లో ప్రచురితమైనది. అపోహలు తొలగించుకొన్న వినయకుమార, సుగుణల వివాహం గురించి ఉన్నది. ఈ కథ సరళ భాషలో ఉన్నది.

ఎస్.బి. సీతారామారావు రాసిన కథ 'గరీబోణ్ణి'. ఇది 'తెలుగుతల్లి' సంచిక నుండి 1939లో ప్రచురింపబడినది. ఆ కాలంలోని వాస్తవికతను చిత్రించినకథ. దొరల పెత్తనం, వెట్టిచాకిరీ గురించి తెలిపేకథ. నల్గొండలోని మాండలికంలో రాయబడినది. మాండలికంలో వచ్చిన మొదటి కథగా చెప్పవచ్చు.

చరుకు పల్లి రఘోత్తమ రావు 1940లో రాసిన 'కోవిల్లో' కథలో తెలంగాణ భాష, పదాలు, క్రియలు, నుడికారాలు ఉన్నాయి. 1940లో అచ్చయిన మొదటి కథాసంకలనం 'కమ్మతెమ్మరలు' నుండి గ్రహించబడినది. గ్రామాధికారుల స్వార్థం, అధికార దర్పం మొ॥వి సహజంగా ఈ కథలో రాయబడినవి.

గుండవరము హనుమంతరావు రాసిన 'టాకీలో సమావేశము' కథ 1940లో వచ్చినది. ఇది కూడా 'కమ్మతెమ్మరలు' కథా సంకలనం నుండే తీసుకోబడినది. ఉన్నత వర్గానికి చెందిన యువకుడు సినిమా హాలులో ఒక యువతిని కలుసుకొని, ఆకర్షింపబడి వేశ్యావృత్తి లోనికి లాగబడినది అని తెలిసినా వివాహం చేసుకోవాలనుకుంటాడు. సంఘసంస్కరణ భావాలు చిత్రించే కథ.

అందుగల తిరుమల రావు రాసిన నిష్ఫలం, అవురుపల్లి కృష్ణారావు రాసిన 'మాబావ', చరుకుపల్లి హరికృష్ణారావు రాసిన 'పల్లె బడి', అందుగుల లక్ష్మణరావు రాసిన 'అంతే, నా నోము' కథలు 1940లో 'కమ్మతెమ్మరలు' అనే కథా సంకలనం నుండే వెలువడినాయి.

పెండ్యాల శేషగిరిరావు రాసిన 'ముహూర్తబలం' కథ 1943లో 'కథా వాటిక' కథా సంకలనం నుండి వెలువడినది. ఈ కథలో ముహూర్త బలంతో కాక సహజంగా కష్టపడే ధోరణిగల శ్రీనివాస్ గురించి, ఆయన మూర్ఖపు కొడుకులు ఇది తెలుసుకోలేక చెడిపోయి, బిచ్చమెత్తుకొనే పరిస్థితి గురించి ఉన్నది.

అడ్లూరి అయోధ్య రామకవి రాసిన 'కాలాన్ని తేవాలి' 1948లో 'తెలంగాణ మంటల్లో' అనే కథా సంపుటి నుండి వెలువడినది. నైజాము రాష్ట్రంలో వందేమాతర ఉద్యమారంభాన్ని చిత్రించే కథ. చారిత్రక సంఘటనమీద ఆధారపడిన కథ. ముస్లీం, హిందు స్నేహాన్ని, ముస్లీంలలో జాతీయ భావాన్ని తెలిపే కథ.

మానేపల్లి తాతాచార్య రాసిన 'పాలేరు తమ్ముడు' కథ 1948లో 'ప్రజాశక్తి' కథా సంకలనంనుండి గ్రహించబడినది. చిన్న పిల్లల అభేద మనస్తత్వాన్ని గురించి తెలిపే కథ ఇది.

పల్లాదుర్గా ప్రసాదరావు 'రెండు జెండాలు' కథ 1948లో 'గెలుపు మనదే' కథాసంపుటి నుండి వెలువడినది. కాంగ్రెస్, కమ్యూనిస్టులు కలిసి వర్గ శత్రువును ఎదిరించడం ఈ కథలో ఉంటుంది.

బెల్లంకొండ చంద్రమౌళి శాస్త్రి రాసిన 'కలగాదు నిజం' కథ 1948లో 'కథాకళి' అనే కథల సంపుటిలోనిది. 'సారథి' పత్రికలో కూడా ప్రచురితమైనది. ఆ కాలంనాటి పట్వారీల గురించి ఈ కథలో ఉన్నది.

చెన్నమనేని రాజేశ్వరరావు రాసిన 'పిట్ట బ్రతుకు' కథ 1948లో 'సారస్వత జ్యోతి' పత్రికలో ప్రచురింపబడినది. పేదల కష్టాల గురించి దీనిలో ఉన్నది.

తాళ్ళూరి రామానుజ స్వామి రాసిన 'భిక్షిణులు' కథ 1950లో 'భాగ్యనగర్' పత్రికలో ప్రచురింపబడినది. భిక్షగాళ్ళ దీనావస్థ, దుస్థితి, ఆకలి గురించి తెలిపే కథ ఇది.

మురళి రాసిన 'ఇదుగో పులి – అదిగో తోక' కథ 1950లో 'సుజాత' పత్రికలో ప్రచురించారు. దీనిలో ఒక స్త్రీని సమాజం, పురుషులు ఏవిధంగా అకారణంగా నిందలకు గురిచేస్తారో తెలుపుతుంది. ఈ కథలోని కథనం కొత్తదనంతో కనిపిస్తుంది.

పి. యశోదారెడ్డి రాసిన 'విచ్చిన తామరలు' కథ 1951లో 'సుజాత' పత్రికలో వచ్చింది. ఈకథలో రమ ప్రేమించిన కమల్ ధనవంతుడు. ధనవంతుడంటే రమకు ఇష్టంలేదు. తండ్రి ఆత్మ గౌరవానికి ఎక్కడ భంగం కలుగుతుందో అని ఆత్మహత్య చేసుకుంటుంది. యశోదారెడ్డి మహబూబ్‌నగర్ మాండలికంలో అనేక కథలను రాసింది.

సి. హెచ్ రాజేశ్వర రావు రాసిన 'ఎలక్షన్ల హడావిడి' కథ 1952లో 'పల్లెటూరు' అనే పత్రికలో ప్రచురింపబడినది. ఎలక్షన్ల గురించి, జమిందారు దౌర్జన్యంతో, అహంకారంతో పదవులను పొందడం గురించి ఈ కథలో ఉన్నది.

పి.ఎస్.ఆర్. ఆంజనేయ శాస్త్రి 'ఎక్స్‌ప్లాయిటేషన్' కథ 1953లో 'సాధన' కథాసంకలనం నుండి గ్రహించబడినది. ఇదే సంవత్సరంలో కె.ఎల్. నరసింహారావు 'శాంతి ప్రకటనలు', రఘు రాసిన 'బిచ్చం' కథలు సాధన సంకలనం నుండే గ్రహించబడినాయి. ఇదే సంవత్సరంలో గూడూరి శంకరం రాసిన 'పాపాయి' కథ 'నినాదం' పత్రిక నుండి వెలువడినది.

గొట్టిముక్కల కృష్ణమూర్తి రాసిన 'కడుపునిండింది' కథ 1954లో 'సారస్వత జ్యోతి' పత్రికలో ప్రచురింపబడినది. పేద ప్రజల దీనావస్థ గురించి ఈ కథ తెలుపుతుంది. 1954లో మరో కథ జి.చంద్రమౌళి రాసిన 'ప్రజానాయకుడు పరంధామయ్య' కథ 'సారస్వత జ్యోతి' పత్రికనుండే ప్రచురింపబడినది. అలాగే కె. సరోజిని రాసిన 'తీరని బాధ' కథ ఇదే 'సారస్వత జ్యోతి' సంకలనం నుండి ప్రచురింపబడినది.

1955 సం॥లో శౌంఠి కృష్ణమూర్తి రాసిన 'దేశసేవకుడు' కథ 'కథా వాహిని' కథాసంకలనం తీసుకోబడినది. 'ఆందోళికం' కథ కూడా 1955 లోనే కందుకూరి లింగరాజు రాసాడు. ఇది 'సుమాంజలి' కథా సంకలనంలో ప్రచురింపబడినది.

1956లో ఇరివెంటి కృష్ణమూర్తి రాసిన 'రంగుల లంగయ్య' కథ 'పరిసరాలు 2' కథా సంపుటిలో ప్రచురితమైనది. మహబూబ్‌నగర్ మాండలికంలో ఉన్నవి. ఈ కథలో పట్నం నుండి వచ్చిన లంగయ్య అతిగా మాట్లాడడం గురించి ఉంటుంది.

1956లోనే చక్రవర్తి రంగస్వామి రాసిన 'నిజమైన మనుషులు' కథ 'నిజమైన మనుషుల కథా సంపుటి'లో ప్రచురితమైనది. మనిషి ధర్మం, మనిషి ప్రవర్తన గురించి ఈ కథ తెలుపుతుంది.

1956కు ముందు పబ్బరాజు గోపాలరావు రాసిన 'రిక్షావాల' కథ 'లచ్చినవ్వింది' కథా సంకలనంలోనిది. 1959లో ప్రచురితమైనది. ఈ కథలో రిక్షావాడి మంచితనం, నిజాయితి తెలుస్తుంది. వ్యాపారస్తుడిలో మార్పు కనిపిస్తుంది.

ఎదిరె చెన్నకేశవులు 1956కు ముందు 'పొట్ట కోసం' కథ రాసాడు. ఈ కథ 'పొట్టకోసం కథల సంపుటి'లో 1968లో ప్రచురింపబడినది. ప్రపంచంలో పొట్టకోసం ఎవరు ఎన్ని పాట్లు పడతారో, పూటగడవడం ఎంత కష్టమో ఈ కథ ద్వారా తెలుస్తుంది.

ఈ కథలే కాకుండా అనేక కథాసంపుటాలు తెలంగాణాలో ప్రచురింపబడినాయి. వాటిలో మరికొన్నింటిని చూద్దాం.

మాడపాటి హనుమంతరావు 1915లో 'మల్లికా గుచ్ఛము' పేరుతో మొదటి కథా సంకలనాల పుస్తకం వచ్చింది. దీనిని మచిలీపట్నంలోని 'సరస్వతీ నికేతనం' వారు ప్రచురించారు.

సురవరం ప్రతాపరెడ్డి 21 కథలను 'ప్రతాపరెడ్డి కథలు', 'మొగలాయి కథల'ను 1940లో అణా గ్రంథమాల వారు అచ్చువేశారు. 1987లో 'సురవరం ప్రతాప రెడ్డి' కథలపేరుతో 'ఆంధ్ర సారస్వత పరిషత్తు' వారు పునర్ముద్రించారు.

1943లో అణా గ్రంథమాల వారు 'కాళోజి కథలు' అచ్చువేశారు.

1945లో ఆంధ్ర పబ్లిషింగ్, హైదరాబాద్ వారు పొట్లపల్లి రామారావు 9 కథలను 'జైలు' పేరుతో అచ్చువేశారు.

1946లో వట్టికోట ఆళ్వారు స్వామి 'జైలు లోపల' కథా సంపుటి ప్రచురించారు.

1956లో 'పరిసరాలు' కథా సంపుటి దేశోద్ధారక గ్రంథమాల వారు ప్రచురించారు.

1958లో 'బ్రతుకు బాటలు' పేరుతో హీరాలాల్ రాయ్ రాసిన కథా సంపుటి వచ్చింది.

1953లో హైదరాబాద్ పౌరసమాచార శాఖ వారు 'కథా గుచ్ఛం' సంకలనం వేశారు.

1955లో 'భాస్కరభట్ల' కృష్ణారావు పేరుతో కథా సంపుటి అచ్చు అయింది.

1969లో నెల్లూరి కేశవస్వామి 'పసిడిబొమ్మ' పేరుతో 'సాధన సమితి' పక్షాన అచ్చువేశాడు.

1974లో కాంచన పల్లి చినవేంకట రామారావు 'మాఊళ్లో కూడానా' అనే సంపుటి ప్రచురించారు

1981లో 'చార్మినార్' పేరుతో నెల్లూరి కేశవస్వామి కథాసంపుటిని ప్రచురించారు.

1981లో 'కోణార్క్ పబ్లికేషన్స్‌వారు తాళ్లూరి నాగేశ్వర రావు, హితశ్రీ సంపాదకత్వంలో 'నూటపదహార్లు' కథలు ప్రచురించారు.

### 1970 నుండి 1980 వరకు

1970 – 80 మధ్యకాలంలో విప్లవం, పోరాటం, జనజీవన వ్యథలను చిత్రిస్తూ చాలామంది తెలంగాణ కథలు రాశారు. ఈ కాలంలో అల్లంరాజయ్య, తుమ్మేటి రఘోత్తమరెడ్డి, ఉప్పల నరసింహం, బి.యస్. రాములు, పి.చంద్, తాడిగిరి పోతరాజు, దేవరాజు మహారాజు, పులుగు శ్రీనివాస్, బోయ జంగయ్య, భూపాల్, కాలవ మల్లయ్య మొదలగు వారు తెలంగాణ భాషలో తెలంగాణ జీవితాన్ని కథల రూపంలో రాశారు.

### 1990 తర్వాత

1990 దశకం ఆరంభంలో కవిత్వంలోగాని, కథల్లోగాని పరాయికరణం కనిపిస్తుంది. గ్రామాలకు దూరంకావటం, గ్రామీణ జీవితం వాటి మధురస్మృతులు, రియల్ఎస్టేట్, నగరాలకు వలసలు, పట్టణాల్లో ఏకాకితనాన్ని అనుభవించటం, భూమి – వ్యవసాయం మీద మమకారం విడువకుండా ఉండడం, నగరాలకే కాక జీవనోపాధి వెతుక్కుంటూ బొంబాయి, షోలాపూర్, దుబాయిలకు వలసపోవడం, అక్కడి వ్యథలు, పర్యావరణం సమస్యలు, మట్టివాసనలు వెంటాడటం, అభివృద్ధీకరణం, వ్యాపార వినిమయ సంస్కృతిలో మానవ విలువల్ని చిత్రిస్తూ తెలంగాణ కథకులు వైవిధ్యంతో కథలను రచించారు. ఇంకా ఈ రచనలు కొనసాగుతున్నాయి. కథాసాహిత్యం దిన దిన ప్రవర్ధమానమవుతూ తెలంగాణ కథాసాహిత్యాన్ని సుసంపన్నం చేస్తున్నాయి. తెలంగాణలో స్త్రీవాద సాహిత్యం కూడా ఉంది. స్త్రీ స్వేచ్ఛ, సమానత్వం, సమానావకాశాలు కోరుతూ స్త్రీల వ్యథలను శ్రమ దోపిడిని చిత్రిస్తూ కథలు వచ్చాయి. గీతాంజలి, ముదిగంటి సుజాతారెడ్డి, జాజులగౌరి, జూపాక సుభద్ర, అనిశెట్టి రజిత, విమల, వసంత కన్నభిరాన్, కల్పనా కన్నభిరాన్ మొదలగువారు రచనలు కొనసాగిస్తున్నారు. తెలంగాణలో దళిత సాహిత్యంలో వాళ్ళ దుర్భర జీవితాలను, వ్యథలను చిత్రించారు. చదువు విజ్ఞానంతో తమ వ్యథలను దూరం చేసుకోవచ్చని రాశారు. తెలంగాణ కథా సాహిత్యంలో ముస్లింవాద కథలు కూడా బలంగా ఉన్నాయి.

### ముగింపు

తెలంగాణ కథల్లో జీవితంలోని సంఘర్షణలు, పోరాటాలు కథా వస్తువుగా ఉన్నాయి. తెలుగు జనజీవనాన్ని, సహజమైన కథల ద్వారా వ్యక్తంచేశారు. ఆత్మవిశ్వాసాన్నిచ్చి అభ్యున్నతి అందుకోవడానికి, స్ఫూర్తినిపొందడానికి అనుగుణంగా తెలంగాణ కథ వర్ధిల్లుతుందని ఆశిద్దాం.

**– మూలం : శ్రీ సంగిశెట్టి శ్రీనివాస్ గారి వ్యాసాల నుండి**

❀❀❀❀❀

# 31. నదులు - విశిష్టత

విశిష్టమైన చరిత్ర కలిగి, విలక్షణ సంస్కృతీ సంప్రదాయాలతో, విశేషమైన సహజ వనరుల సిరులతో వినుతికెక్కిన విశ్వంభర తెలంగాణ. ఆ సహజవనరుల్లో భాగమైన నీటికి నెలవైన నదులు, చెరువులు, వాగులు, కుంటలు, కాలువలతో కూడి సస్యశ్యామల క్షేత్రంగా తెలంగాణ మాగాణము విరాజిల్లినది.

తెలంగాణ చరిత్ర సంస్కృతితో విడదీయరాని అనుబంధాన్ని కలిగిన నదులు తమ పరీవాహక ప్రాంతాల్లో పరిఢవిల్లిన నాగరికత, వికసించిన సాంస్కృతిక, సారస్వత వైభవాల ద్వారా ఈ ప్రాంతం ఘనమైన వారసత్వం కలిగియున్నదని చాటి చెప్పాయి.

ఈ నదీ తీరాలు మోక్షకారకాలైన పుణ్యక్షేత్రాలను కలిగి ఆధ్యాత్మిక శోభను సంతరించుకొని తెలంగాణను మోక్షభూమిని చేసి మంగళహారతులు పట్టాయి. ప్రజల దాహార్తిని తీరుస్తూ, క్షుద్బాధను పోగొడుతూ, పసిడి పంటలను పండిస్తున్నాయి. తమ పావన తరంగాలతో తెలంగాణ నేలను స్పృశించి పునీతం చేసి పుణ్య భూమిగా నిలిపాయి.

"ఏరుల పుట్టుక, శూరుల పుట్టుక తెలుసుకోవడం సాధ్యంకాదు" అని అన్నట్లుగా ఈ నదులు ఎక్కడో చిన్నగా పుట్టి వాగులై, ఏరులై, అనేక ఇతర వాగులను కలుపుకుంటూ జీవనదులుగా అనేక ప్రాంతాల గుండా ప్రవహిస్తూ సముద్రంలో కలిసిపోతాయి.

"గోదావరీ భీమరథీ కృష్ణవేణ్యాది కాస్థధా! సహ్యాపాదోద్భవా నద్యః స్మృతా పాప భయాపహా!" (విష్ణు పురాణం) తలచుకొనినంత మాత్రానే పాపాలను పోగొట్టే పుణ్యనదులుగా కీర్తించబడిన. గోదావరి, కృష్ణలు ప్రధాన నదులుగా ఉండి అనేక ఉపనదులు కలిగియున్న ప్రాంతం తెలంగాణ. ఈ ఉపనదులు ఆయా ప్రాంతాల్లో తమ ఉనికిని చాటుతూ జనజీవన సౌభాగ్యానికి తోడ్పడుతున్నాయి. ప్రధాన నదులతో కలుస్తూ ఆ నదులకు నీటి ఉద్ధృతిని విశాలత్వాన్ని కలిగించి వాటిని జీవనదులుగా నిలుపుతున్నాయి.

పురాణ పురుషులకు నిలయమై, చరిత్రలకు సాక్షీభూతమై, సాహితీ మూర్తులకు కావ్య వస్తువై, నాగరికతకు మూలమై, ప్రవహిస్తున్న ఇక్కడి నదులు తెలంగాణ వైభవాన్ని చాటుతున్నాయి.

తెలంగాణ ప్రాంతంలో ప్రవహించే నదులు, ఉపనదులు ఈ రాష్ట్ర పురోగతికి కారణభూతమవుతున్నాయి. ప్రధాన నదులతో పాటు కొన్ని ముఖ్యమైన ఉపనదులను గురించి క్లుప్తంగా పరిచయం చేయడం ఈ వ్యాసం ఉద్దేశం.

**గోదావరి**

'గోదావరీయం సరితాం వరిష్ఠా' – నదులలో గోదావరి శ్రేష్ఠమైనది (వాల్మీకి రామాయణం), "పుష్యార్కే జన్మనక్షత్రే వ్యతీపాతేచ వైధృతే – సకృత్ గోదావరీ స్నానం కోటి యజ్ఞ ఫలం లభేత్" (గోదావరి నదీ స్నానం కోటి యజ్ఞాల ఫలం) అని ప్రశంసించబడిన ఈ నది ప్రస్తావన పురాణేతిహాసాలలో, శాసనాలలో, కావ్యాలలో గోదావరి, గౌతమి అనే పేర్లతో కనిపిస్తున్నది.

భారతదేశంలో గంగ తరువాత రెండవ పెద్దనది గోదావరి. దక్షిణ భారతదేశంలో పెద్ద నది. తెలంగాణలో గోదావరిని 'గంగ' అని పిలుచుకుంటారు. ఈ దేశంలో గంగ ఎంత పవిత్రమైనదో తెలంగాణ వాసులకు గోదావరి అంత పవిత్రమైనది.

పోతన శ్రీమహా భాగవతంలో 'అభ్రంకష శుభ్ర సముత్తుంగ భంగయగు గంగ' అని, రామదాసు 'అదిగో భద్రాది ! గౌతమి ఇదిగో చూడండి' అంటూ గోదావరిని దర్శింప చేశారు.

గోదావరి నది మహారాష్ట్రలోని సహ్యాద్రి పర్వత శ్రేణుల్లో నాసికాత్ర్యంబకం వద్ద పుట్టి ప్రవహిస్తూ నిజామాబాదు జిల్లా కందకుర్తి వద్ద తెలంగాణలో ప్రవేశిస్తున్నది. అక్కడ హరిద్ర, మంజీర అనే ఉపనదులను కలుపుకొని ఆ పిమ్మట నిర్మల్ జిల్లా బాసర మీదుగా ప్రవహిస్తున్నది.

నిజామాబాద్, నిర్మల్, జిగిత్యాల, మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల గుండా ప్రవహిస్తూ మార్గమధ్యంలో అనేక ఉపనదులను కలుపుకొని అఖండ గోదావరిగా పయనిస్తూ ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశించి అంతర్వేది వద్ద సముద్రంలో కలుస్తున్నది.

ఈ నది పొడవు 1465 కి.మీ కాగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో దీని ప్రయాణం 720 కి.మీ. అందులో ఒక్క తెలంగాణ ప్రాంతంలోనే 79% ప్రయాణిస్తున్నది. అంటే గోదావరి పరీవాహక ప్రాంతం అత్యధిక భాగం తెలంగాణలోనే ఉన్నది.

గోదావరినదిపై నిజామాబాదు జిల్లా పోచంపాడు దగ్గర శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిర్మించబడినది. దీనినే పోచంపాడు ప్రాజెక్టు అంటారు. తెలంగాణలో గోదావరినదిపై నిర్మించిన మొదటి ప్రాజెక్టు ఇది. దీని ద్వారా దాదాపు 18 లక్షల ఎకరాలకు సాగునీరు అందించబడుతున్నది. ఈ ప్రాజెక్టు ద్వారా విద్యుదుత్పాదకం కూడా జరుగుతున్నది.

పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల మధ్య ఎల్లంపల్లి వద్ద శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మించారు. దీని ద్వారా 2.20 లక్షల ఎకరాలకు సాగునీరు లభ్యమవుతున్నది. అనేక గ్రామాలకు తాగునీరు అందించబడుచున్నది.

ఈ గోదావరి నదీ తీరంలో బాసర, కాళేశ్వరం, మంథని, ధర్మపురి, చెన్నూరు, గూడెం, కోటి లింగాల, సుందిళ్ళ, భద్రాచలం మొదలైన పుణ్య క్షేత్రాలున్నాయి. గోదావరి పుష్కరాలు మహావైభవంగా జరుగుతాయి.

గోదావరి నదికి ప్రాణహిత, మంజీరా, కిన్నెరసాని, మానేరు, ఇంద్రావతి, శబరి, వార్ధా మొదలైన ఎన్నో ఉపనదులున్నాయి. వాటిలో కొన్నింటిని గురించి తెలుసుకుందాం.

## ప్రాణహిత

సకలప్రాణిహితమైన ప్రాణహిత నదికి పూర్వపు నామము ప్రణీతా.

"ప్రణీతా వరదావైన్యా గౌతమీచ సరస్వతీ నద్యః, పంచవహంత్యత్ర ప్రయాగాత్కోటిశోధికం" – ప్రాణహిత, వెన్‌గంగ, వార్ధా, గోదావరి, సరస్వతీ నదులు సంగమించే క్షేత్రంలో స్నానమాచరిస్తే త్రివేణి సంగమ క్షేత్రమైన ప్రయాగ (అలహాబాదు)లో స్నానం చేసిన దాని కంటె కోటి రెట్లు అధికమైన ఫలం లభిస్తుందని స్కాంధ పురాణంలో చెప్పబడినది.

మధ్యప్రదేశ్ సాత్పూరా పర్వత శ్రేణిలో పుట్టిన వార్ధా మరియు మహారాష్ట్రలో పుట్టిన పెన్‌గంగ, వెయిన్‌గంగలు కలిసి ప్రాణహితగా ఏర్పడి ఆసిఫాబాదు కుమ్రం భీం జిల్లాలో కౌతాల సమీపంలో తెలంగాణలో ప్రవేశిస్తున్నది. మహారాష్ట్ర, ఆసిఫాబాదు, మంచిర్యాల సరిహద్దుల్లో ప్రవహిస్తూ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం వద్ద గోదావరిలో కలుస్తున్నది. ఇక్కడ సరస్వతి నది అంతర్వాహినిగా ప్రవహించడం చేత కాళేశ్వరం త్రివేణి సంగమ స్థానంగా ప్రసిద్ధి పొందినది. ఈ ప్రాణహితనదికి పుష్కరాలు జరుగుతాయి.

## మంజీర

"నీవు పారిన దారిలో ఇక్షుదండాలు – నీవు జారిన జాడలో అమృతభాండాలు

నీవు దూకిన నేల విద్యున్మాల – నీవు ప్రాకిన పథము మాకు చైత్రరథమ్ము "

**–దాశరధి కృష్ణమాచార్య**

"నీ కంకణక్వణము నినదించెనంతనే – కర్షకునినాగేలు కదలి ముందుకు సాగు,

నీ చేతి చలువ చిందిలిపాటు గనినంత – పైరుపచ్చల కనుల పండువుగ విలసిల్లు"

**– వేముగంటి నరసింహా చార్యులు**

బతుకుకు మెతుకునందిస్తూ తాను పారిన ప్రాంతాన్ని మెతుకు సీమగా మార్చిన మంజీర నదిని ప్రశంసిస్తూ కవులు తమ కవితాగానంతో మంజీర నాదాలు వినిపించారు.

అంతటి ప్రశస్తి పొందిన మంజీరానది మహారాష్ట్ర బాలాఘాట్ పర్వతశ్రేణుల్లో పుట్టి తెలంగాణలో సంగారెడ్డి జిల్లాలో ప్రవేశిస్తున్నది. మెదక్, కామారెడ్డి, నిజామాబాదు జిల్లాల గుండా ప్రవహిస్తూ నిజామాబాదు జిల్లా కందకుర్తి వద్ద గోదావరిలో కలుస్తున్నది. కందకుర్తిలో మంజీరతో పాటు హరిద్రానది కూడా గోదావరిలో సంగమించడం ద్వారా కందకుర్తి త్రివేణి సంగమ స్థానమై ప్రసిద్ధి పొందినది. ఈ విధంగా మన రాష్ట్రంలో గోదావరికి రెండు చోట్ల త్రివేణి సంగమ స్థానాలు ఉండడం గొప్ప విషయం.

మంజీర పొడవు 640 కి.మీ ఈ నదికి ఎక్కువ పరీవాహక ప్రాంతం తెలంగాణలోనే ఉన్నది నిజామాబాదు అచ్చంపేట దగ్గర ఈ నదిపై నిజాంసాగర్ ప్రాజెక్టును నిర్మించారు. దీని ద్వారా దాదాపు 2 లక్షల ఎకరాలకు సాగునీరు లభిస్తున్నది.

సంగారెడ్డి సమీపంలో సింగూరు గ్రామం వద్ద సింగూరు ప్రాజెక్టును నిర్మించారు. హైదరాబాదు నగరానికి తాగునీరు అందించడం దీని ప్రధాన లక్ష్యం.

ఈ విషయాన్నే కవి వేముగంటి తన 'మంజీరనాదాలు'లో ప్రస్తావిస్తూ "ఆనాడు కుతుబుసుల్తాను నిలిపిన పురము – భాగ్యనగరములోన వసియించు పౌరులకు పంచదారను బోలు మంచినీరొసగెదవు – ఎంత చల్లనిదానవే ! నీవు మంజీర! ఎంత తీయని దానవే!" అంటూ ప్రశంసించాడు.

ఈ నదీ తీరంలో నందికంది రామలింగేశ్వరాలయం, కల్పగూరు త్రికూటాలయం ప్రసిద్ధి పొందినవి. ఏడు పాయల జాతర ఈ నదీతీరంలో జరుపబడుచున్న పెద్ద జాతర.

### మానేరు

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావు పేట మండలం నర్మాల గ్రామం వద్ద కొండల్లో పుట్టి కరీంనగరము గుండా ప్రవహిస్తూ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ వద్ద గోదావరిలో కలుస్తున్నది.

ఈ మానేరు నదిపై అప్పర్ మానేరు, మిడ్ మానేరు, లోయర్ మానేరు ప్రాజెక్టులు కలవు. ఈ మానేరు క్రింద దాదాపు 2,60,000 వేల ఎకరాలకు సాగునీరు లభిస్తున్నది. వరంగల్ అర్బన్ మరియు రూరల్, సిద్ధిపేట జిల్లాలకు తాగునీరును అందిస్తున్నది.

మానేరుకు పెద్దవాగు, 'మ్రోయుతుమ్మెద' అనే ఉప నదులున్నాయి. పెద్దవాగు తీరంలోనే వేములవాడ రాజ రాజేశ్వరాలయం ఉన్నది.

### కిన్నెరసాని

భూపాలపల్లి జిల్లా మేడారం – తాడ్వాయి కొండ సానువుల్లో పుట్టి ఆగ్నేయంగా ప్రవహించి భద్రాచలానికి కాస్త దిగువన బూర్గంపాడు దగ్గర గోదావరిలో కలుస్తున్నది. దీని పొడవు 96 కి.మీ. పాల్వంచ దగ్గర కిన్నెరసానిపై రిజర్వాయరు నిర్మించారు. దీని వలన పాల్వంచ, కొత్తగూడెం ప్రాంతాలకు తాగునీరు, సాగునీరు లభిస్తున్నది. దీని ద్వారా విద్యుదుత్పాదన కూడా జరుగుతున్నది.

ఈ విధంగా గోదావరి ఉపనదులు తాము ప్రవహిస్తున్న ప్రాంతాల అభివృద్ధికి దోహదపడుచూ గోదావరిలో కలిసిపోయి నదీ చరిత్రలో ఖ్యాతిని పొందాయి.

### కృష్ణానది

"కృష్ణవేణీ నదీ శ్రేష్ఠా కూలంకష గతాసతీ

దక్షిణాం దిశమాసాద్య సర్వతీర్థ సమన్వితా"

దక్షిణ భారతదేశంలో ప్రవహించే నదులలో కృష్ణానది శ్రేష్ఠమైనదని పురాణవచనం. గోదావరితో పాటు ఈ నది కూడా తలచిన మాత్రముననే పాపాలను పోగొడుతుందని విష్ణు పురాణం తెలుపుతున్నది.

ఇంతటి ప్రశస్తి కలిగిన కృష్ణానది దక్షిణ భారతంలో గోదావరి తరువాత రెండవ పెద్దనదిగా పేరు పొందినది. ఇది మహారాష్ట్ర సహ్యాద్రి పర్వతాలలో పుట్టి కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల గుండా ప్రవహిస్తూ ఆంధ్రప్రదేశ్‌లో హంసలదీవి వద్ద సముద్రంలో కలుస్తున్నది. ఈ నది పొడవు 1400 కి.మీ ఇందులో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో 450 కి.మీ ప్రవహిస్తున్నది. దీనిలో ఈ నదీ పరీవాహక ప్రాంతం అధిక భాగం అనగా 69% తెలంగాణలోనే ఉన్నది

కృష్ణానది తెలంగాణలో మహబూబ్‌నగర్ జిల్లా తంగిడి గ్రామం వద్ద ప్రవేశించి మహబూబ్‌నగర్, జోగులాంబ గద్వాల, వనపర్తి, నాగర్ కర్నూల్, నల్గొండ జిల్లాల గుండా ప్రవహిస్తూ ఆంధ్రప్రదేశ్‌లో అడుగుపెడుతున్నది. ఈ నదీ తీరంలో సంగమేశ్వరం, బీచుపల్లి, సోమశిల, జటప్రోలు, మట్టపల్లి మొదలైన పుణ్యక్షేత్రాలు కలవు.

తుంగభద్ర, మూసీ, భీమా, దుందుభి (డిండి), మున్నేరు, పాలేరు మొదలైనవి కృష్ణకు ఉపనదులు.

జోగులాంబ గద్వాల జిల్లా రావులపల్లి వద్ద ఈ నదిపై ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు నిర్మించారు. ఇది బహుళార్థ సాధక ప్రాజెక్టు. దీని ద్వారా సమారుగా 1.20 వేల ఎకరాలకు సాగునీరు లభిస్తున్నది. పాలమూరు ప్రాంతానికి ఈ ప్రాజెక్టు వరప్రదాయిని. ఇక్కడ 'ప్రియదర్శిని జూరాల హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టు' పేరుతో కర్ణాటక సహకారంతో విద్యుదుత్పాదన జరుతున్నది.

నల్లగొండ జిల్లా నందికొండ గ్రామం వద్ద కృష్ణానదిపై నాగార్జున సాగర్ ప్రాజెక్టును నిర్మించారు. ఇది బహుళార్థ సాధక ప్రాజెక్టు సాగర్ కుడికాలువ (జవహర్ కాలువ) ద్వారా దాదాపు 11 లక్షల ఎకరాలకు, ఎడమకాలువ ద్వారా (లాల్‌బహదూర్ కాలువ) 9.5 లక్షల ఎకరాలకు సాగునీరు అందించబడుతున్నది. ఈ ప్రాజెక్టు సుమారుగా 816 మెగావాట్ల విద్యుదుత్పాదన సామర్థ్యం కలిగియున్నది.

ఈ కృష్ణానదిని గురించి దాశరథి కృష్ణమాచార్యులు తన కవిత ద్వారా "తల్లీ! నీ పాద తీర్థము త్రావినాము, నీదు బిడ్డల గుండెల నిండ నీవు ధారవోతువు కరుణాసుధారసమ్ము" అంటూ కీర్తించాడు.

జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత డా॥ సి.నారాయణ రెడ్డి గారు కృష్ణానది వైభవాన్ని తెలుపుతూ "కృష్ణవేణీ! తెలుగింటి విరిబోణీ! – నాగార్జునగిరి కౌగిట ఆగి బీళ్ళను బంగారు చేలుగా మార్చేవు – అన్నపూర్ణవై కరువులు బాపేవు బ్రతుకులు నిలిపేవు" అంటూ శ్లాఘించాడు. కృష్ణానది తెలంగాణ ప్రజల జీవనాధారమై నిలిచింది. కృష్ణానదికి పుష్కరాలు జరుగుతాయి.

## తుంగభద్ర

"గోదావరీ, భీమరథీ, కృష్ణవేణీ తుంగభద్రా సరిదుత్తమాః" అని మార్కండేయ పురాణంలో కీర్తించబడిన నదులలో తుంగభద్ర కూడా ఒకటి 'తుంగభద్రా కృష్ణా భీమరథీ విశ్వేతి మహానద్యః' అని భాగవతం తుంగభద్రను మహానదిగా అభివర్ణించినది.

ఇంతటి ప్రశస్తిని పొందిన తుంగ భద్రానది తుంగ, భద్ర అనే రెండు నదుల కలయిక 'గంగా స్నానం – తుంగా పానం' అన్నారు పెద్దలు గంగలో స్నానం చేయడం ఎంత పుణ్యమో తుంగా నీటిని తాగడం కూడా అంతే పుణ్యమని భావిస్తారు.

ఈ నది కర్ణాటక రాష్ట్రంలోని సహ్యాద్రి పర్వత శ్రేణిలో తుంగానదిగా పుట్టి శృంగేరి క్షేత్రాన్ని దాటి భద్రానదితో కలిసి తుంగభద్రగా మారింది. మన తెలంగాణ రాష్ట్రంలో జోగులాంబ గద్వాల జిల్లా సరిహద్దుల్లో ప్రవహించి ఆలంపురం దాటి సంగమేశ్వరం వద్ద కృష్ణానదిలో కలుస్తున్నది. తుంగభద్ర తెలంగాణలో 75 కి.మీ ప్రవహిస్తున్నది.

ఈ నదీ తీరంలోనే అష్టాదశ శక్తిపీఠల్లో ఒకటైన జోగులాంబ దేవాలయం, నవబ్రహ్మ ఆలయాలు ఉన్నాయి.

పాల్కురికి సోమనాథుడు తన పండితారాధ్య చరిత్రలో శ్రీశైలం పశ్చిమ ద్వారంగా భాసిల్లే ఆలంపురమును "పశ్చిమ ద్వార ప్రభావంబు జూడు, తుంగభద్రాంకితో తుంగభద్రా తరంగిణి చారు తీరమున మోక్షపదంబు" కీర్తించాడు.

కొఱవి గోపరాజు తన సింహాసన ద్వాత్రింశికలో 'శ్రీహరికి లీలా విలాస యోగ్యమైన నదుల్లో తుంగభద్ర యొక్కటి' అని తుంగభద్రా నదిని ప్రశంసించాడు.

ఈ నదికి కూడా పుష్కరాలు జరుగుతాయి.

## దుందుభి (డిండి)

దుందుభి నది గురించి గంగాపురం హనుమచ్ఛర్మగారు 'దుందుభి' కావ్యం రాశారు. అందులో స్కాంధపురాణమందలి శ్రీశైల ఖండంలో ఏలేశ్వరం సమీపంలో ఏకాదశ తీర్థాలున్నట్లు వాటిలో దుందుభీశ్వరం' ఉన్నట్లు తెలుస్తున్నది. ఈ నదీతీరంలో వెలసిన ఈశ్వరునికి దుందుభీశ్వరుడని పేరు ప్రసిద్ధమైనట్లుగా పేర్కొన్నారు.

ఈ నది పుట్టుకను గురించి దుందుభి కావ్యంలోని 'భాగ్యనగరాత్యంత పరిసరమ్మున బుట్టి పాలమూర్మండలపు భాగాన బంధింప' అనే వాక్యము ద్వారా అనంతగిరి కొండల్లో పుట్టి మహబూబ్‌నగర్ గుండా ప్రవహిస్తూ నల్లగొండ జిల్లా గుండ్లపల్లి వద్ద కృష్ణలో కలుస్తున్నది.

ఈ నది పొడవు 153 కి.మీ నల్గొండ జిల్లా గుండ్లపల్లి దగ్గర ఈ నదిపై డిండి ప్రాజెక్టును నిర్మించారు. ఈ నదీ తీరంలోని మీనాంబరం క్షేత్రంలో పరుసవేదీశ్వరాలయం ప్రసిద్ధి పొందిన ఆలయం.

గంగాపురం హనుమచ్ఛర్మగారు దుందుభిని ప్రశంసిస్తూ
"దుందుభి మా పాలిటి నదీమతల్లీ! శ్రితకల్పవల్లీ
తెలుగు నేలను జేరి పులకించు తల్లీ! అమృత వల్లీ
ముక్కారు పంటలను మొనయు జీవనము! నీదు ధనము
తేనె మాగాణాల దెరలి ప్రవహించు! నీదు అంచు"
ప్రవహించి మా సీమ పావనమ్ముగజేసి
తెలుగు సంస్కృతులతో తేజరిల్లెడి నీవు
తెలుగు భూముల సస్యఫల భరితముల జేసి
ప్రవహింతువా దుందుభీ మా సీమ పాలయేఱుగ"
అన్నాడు.

తెలంగాణ మాగాణములో ముక్కారు పంటలను పండించి, ప్రజల దాహార్తిని తీర్చెడి దుందుభీ నిజంగా పాలయేఱె!

**మూసీనది**

దీని పూర్వనామము ముచుకుందా నది. ఈ నదీ తీరంలోనే భాగ్యనగరం (హైదరాబాదు) రూపుదిద్దుకొన్నది. ఈ నది వికారాబాదు అనంతగిరి కొండల్లో పుట్టి రంగారెడ్డి, హైదరాబాదు, యదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాల గుండా ప్రవహిస్తూ నల్గొండ జిల్లా వాడపల్లి వద్ద కృష్ణానదిలో కలుస్తున్నది. ఈ నది పొడవు 250 కి.మీలు. ఈ నదీతీరంలో వాడపల్లి, అనంతగిరి, మత్స్యగిరి ప్రధాన క్షేత్రాలు.

ఏనుగుల వీరాస్వామయ్య తన కాశీయాత్ర చరిత్రలో ఈ నదిని గురించి ప్రస్తావించాడు. హైదరాబాదు మరియు దాని పరిసర ప్రాంతాలకు ఈ నది తాగునీరు, సాగునీరు అందించేదని చెప్పాడు. ఎప్పుడూ మూసీ నిండుగా ప్రవహించేదని, 1820లో ఈ నదికి వరదలు వచ్చాయని తెలిపాడు.

1908లో కూడా ఈ నదికి వరద వచ్చి హైదరాబాదు ముంపుకు గురైనది. నిజాంనవాబు మీర్ ఉస్మాన్ అలీఖాన్ 1919లో మూసీనదిపై గండిపేట వద్ద ఆనకట్టను నిర్మించాడు. అదే ఉస్మాన్ సాగర్ ప్రజలు దీనిని గండిపేట చెరువని వ్యవహరిస్తారు.

1927లో మూసీకి ఉపనది అయిన ఈసా నదిపై తన కుమారుడైన హిమాయత్ అలీఖాన్ పేరుమీద హిమాయత్‌సాగర్ నిర్మించాడు. హైదరాబాద్ నగరానికి తాగునీరు అందించడంలో ఈ రెండు చెరువులు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి.

నల్గొండ జిల్లా బొప్పారం గ్రామం వద్ద ఈ నదిపై మూసీ ప్రాజెక్టును నిర్మించారు. దీని వల్ల దాదాపుగా 30,000 ఎకరాలు సాగవుతున్నాయి. దీనితోపాటు ఈ నదిపై అసఫ్‌నహర్ ప్రాజెక్టు, శాలి గౌరారం ప్రాజెక్టులు నిర్మించబడ్డాయి. మూసీకి కాగ్నా, ఆలేరు, అహల్యా (హాలియా), బక్కేరు మొదలైనవి ఉపనదులు.

**భీమానది**

కర్ణాటక నుండి వచ్చి మహబూబ్‌నగర్ మాగనూరు మండలంలో 7 కి.మీ ప్రవహించి తంగిడి వద్ద కృష్ణలో కలుస్తున్నది. దీనిపై ఒకే ఒక్క ఎత్తిపోతల పథకం ఉన్నది. దీని ద్వారా సుమారుగా 500 ఎకరాలకు సాగునీరు లభిస్తున్నది.

**మున్నేరు**

15 – 16 శతాబ్దాల మధ్యకాలంలో జీవించిన హరిభట్టు అనే కవి మున్నేరు గురించి వరుణ దిగ్వీధినేపురమున బ్రవహించె, పావన సలిలసంపన్న 'మున్న' అని ప్రస్తావించాడు.

ఈ నది భూపాలపల్లి పాకాల గుట్టలో పుట్టి భద్రాద్రి కొత్తగూడెం గుండా ప్రయాణించి ఆంధ్రప్రదేశ్‌లో కృష్ణా జిల్లా ఏటూరు వద్ద కృష్ణలో కలుస్తున్నది. ఈ నదికి పాలేరు, ఆలేరు, వైరా ఉపనదులు.

## పాలేరు

జనగాం ప్రాంతంలో పుట్టి భద్రాద్రి కొత్తగూడెం గుండా జిల్లా సరిహద్దుల గుండా ప్రవహిస్తూ ఆంధ్రప్రదేశ్‌లో ప్రవేశించి మున్నేరులో కలుస్తున్నది. ఈ నదిపై పాలేరు గ్రామం వద్ద పాలేరు ప్రాజెక్టు నిర్మించారు. ఈ విధంగా ఎన్నో ఉపనదులు ప్రధాన నదులతో కలుస్తూ తెలంగాణ నేలను జల సమృద్ధిగల ప్రాంతంగా నిలిపాయి.

నదులు ఎక్కడో పుట్టి పలుప్రాంతాలలో ప్రవహిస్తూ చివరకు సముద్రంలో కలుస్తాయి. అయితే ఆ నదులు ప్రవహించే ప్రాంతాలలో అవి ఆ ప్రాంత సాంఘిక, ఆర్థిక పురోగతికి దోహదం చేస్తాయి అక్కడి ప్రజల జీవన విధానంతో మమైకమవుతాయి. సంస్కృతిలో భాగమౌతాయి. అందువల్లనే ఆ ప్రాంత ప్రజలు ఆ నదులను తమవిగా చెప్పుకొనేంతగా వాటితో అనుబంధాన్ని కలిగి ఉంటారు.

నదులు అంటే కేవలం తాగునీరు, సాగునీరు ఇచ్చేవాటిగానే చూడరు. ఇక్కడి చరిత్ర, సంస్కృతి, సంప్రదాయం, జీవన విధానం, నాగరికతకు చిహ్నాలుగా నదులను భావిస్తారు. అందుకే నదిని గంగమ్మ అని అప్యాయంగా పిలుచుకుంటూ నీటి పండుగలు (పుష్కరాలు) జరుపుకుంటారు. ప్రకృతి ప్రేమికులైన తెలంగాణ వాసులకు నదులు జీవనాధారాలు, సిరిసంపదలు.

గతమెంతో ఘన చరిత్ర కలిగిన నదీ వ్యవస్థ తెలంగాణలో కాలగమనంలో తన వైభవాన్ని కోల్పోతూ వస్తున్నది. ఈ పరిస్థితుల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దీనికి పునర్వైభవం తీసుకొని రావడానికి, ఈ ప్రాంతాన్ని సుభిక్షం, సురక్షితం చేయడానికి, బంగారు తెలంగాణను ఆవిష్కరించడానికి ఈ నదులపై నూతన ప్రాజెక్టులకు రూపకల్పన చేసి నిర్మించ తలపెట్టింది. ఆ ప్రయత్నంలో రాష్ట్ర ప్రభుత్వంతో పాటు తెలంగాణ ప్రజలమందరం భాగస్థులై తెలంగాణను నీటి వనరుల భాగ్యసీమగా మలచుకుందాం.

❀❀❀❀❀


గోదావరి తీరం, బాసర

# 32. తెలంగాణ తొలి తెలుగు వాచకాలు

తెలంగాణ రాష్ట్రం... దశాబ్దాల కల. ఉద్యమాల ఫలితం. త్యాగాల గుర్తు. రాష్ట్రావిర్భావం నూతనోత్తేజాన్నిచ్చింది. సరికొత్త స్ఫూర్తితో ముందుకు సాగవలసిన అవసరాన్ని తెలియజేసింది. ఈ బృహత్‌యజ్ఞంలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం విద్యాసంస్కరణలకు శ్రీకారంచుట్టింది. ముఖ్యంగా నూతన వాచక నిర్మాణం ద్వారా సొంతగొంతును వినిపించదలచింది. తెలంగాణ భావి పౌరులకు మన ఘనమైన భాష, సాహిత్య వారసత్వ సంపద ఇదీ అని చాటదలచింది. స్వాభిమానాన్ని ప్రేరేపించడానికి సమాయత్తమైంది. ఫలితంగా 'తెలంగాణ వాచకాలు' పురుడుపోసుకున్నాయి. 1 నుండి 10వ తరగతి వరకు వాచకాలు ఒకేసారి రూపుదిద్దుకున్నాయి. ఇలా 'దశావతారాలు' ఏకకాలంలో ఆవిర్భవించడం బహుశా దేశ చరిత్రలోనే అపూర్వం.

## రూపకల్పన

తెలంగాణ రాష్ట్రం ఏర్పడినందున రాష్ట్రంలో తెలుగు పాఠ్యపుస్తకాలను మార్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీటిలో తెలంగాణ సంస్కృతి, చరిత్ర, సాహిత్యం మొ॥వి ప్రతిబింబించేలా చూసేందుకు పాఠ్యాంశాలను ఎంపిక చేయడానికి విషయనిపుణులు, విద్యావేత్తలు, క్షేత్రస్థాయి ఉపాధ్యాయులతో కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో డాక్టర్ రవ్వా శ్రీహరి, డాక్టర్ కోవెల సుప్రసన్నాచార్య, డాక్టర్ ఎన్. గోపి, డాక్టర్ ఎస్వీ రామారావు, డాక్టర్ బన్న అయిలయ్య, డాక్టర్ ముదిగంటి సుజాతరెడ్డి, డాక్టర్ సుంకిరెడ్డి నారాయణరెడ్డి, డాక్టర్ బాల శ్రీనివాసమూర్తి, డాక్టర్ ఎస్. రఘు, డాక్టర్ రజని వంటి ఆచార్య బృందం నేతృత్వం వహించారు. డాక్టర్ నందిని సిధారెడ్డి, శ్రీ దేశపతి శ్రీనివాస్ వంటి తెలంగాణ ఉద్యమ రథసారథులు ఈ బృందంలో సభ్యులుగా ఉండి పాఠ్యపుస్తకాల రూపకల్పనలో కీలకపాత్ర పోషించారు. శ్రీ నలిమెల భాస్కర్, శ్రీ వేణు సంకోజు, శ్రీ సంగిశెట్టి శ్రీనివాస్ వంటి సాహితీ నిపుణులు పుస్తకాల రూపకల్పనకు సహాయ సహకారాలు అందించారు.

క్షేత్ర స్థాయిలో విశేషానుభవం ఉండి విషయనిపుణులుగా వ్యవహరించిన శ్రీ పల్లెర్ల రామమోహన్‌రావు, శ్రీ ఎల్.ఎం.ప్రసాద్, శ్రీ కె.రంగరాజు, శ్రీ వి.చెన్నయ్య, శ్రీ బొజ్జల శరత్‌బాబు, శ్రీ ఎ.భాను ప్రకాశ్, శ్రీ గాజుల రవీందర్, శ్రీ చక్రవర్తుల శ్రీనివాస్, శ్రీ కె.జనార్ధన్, శ్రీ మెంగవరపు పవన్, శ్రీమతి దొడ్డె శారద, శ్రీమతి గట్టు త్రివేణి, శ్రీమతి కోట సుకన్య, శ్రీమతి వి.సునంద, శ్రీమతి పల్లి మాధవి, శ్రీమతి స్వరూపరాణి, శ్రీమతి వనజారెడ్డి, శ్రీ బెజ్జారపు వినోద్ కుమార్, శ్రీ పసుల ప్రతాప్ మొదలగువారు రూపకల్పనలో భాగస్వాములైనారు. ఈ కమిటీకి కన్వీనర్‌గా శ్రీ సువర్ణ వినాయక్ వ్యవహరించాడు.

కమిటీ సభ్యులు వివిధ కార్యశాలల్లో పాల్గొని ప్రజాస్వామిక పద్ధతుల్లో పిల్లల సర్వతోముఖ వికాసానికి తోడ్పడే పాఠ్యాంశాలను ఎంపికచేశారు. వీటికి నిపుణులైన ఉపాధ్యాయులతో అభ్యాసాలు రాయించారు. ఉపాధ్యాయ శిక్షణా కార్యక్రమాలలో విషయనిపుణులుగా వ్యవహరించిన వారిని, నైపుణ్యాన్ని ప్రదర్శించిన వారిని ఎంపిక చేశారు. అట్లాగే ఉపాధ్యాయులతోనే చిత్రాలు గీయించారు. పాఠ్యపుస్తకాలను ముద్రణకు పంపడానికి ముందు గౌరవనీయులైన తెలంగాణ రాష్ట్ర తొలిముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖరరావుగారి పరిశీలనకు పంపారు. వారు వీటిని సమీక్షించడానికి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు శ్రీ డా॥ కె.వి. రమణాచారిగారికి బాధ్యతను అప్పగించినందున వారు పాఠ్యపుస్తక రచయితలతో సమావేశం జరిపి సమీక్షించి, వాచకాలకు తుదిరూపునిచ్చారు.

పాఠ్యపుస్తకాల రూపకల్పన కోసం పలు దఫాలుగా కార్యశాలలను నిర్వహించారు. ఇతివృత్తాలను, ప్రక్రియలను కార్యశాలల్లో చర్చించి ఎంపిక చేశారు. పాఠ్యాంశాలను తెలంగాణ సాహిత్యం నుండి పిల్లల స్థాయికి అనుగుణంగా ఎంపిక చేసి పాఠ్యపుస్తకాల్లో పొందుపరిచారు. తెలంగాణ రాష్ట్రంలోని బాలల అకాడమీ, స్టేట్ రిసోర్స్ సెంటర్, నేషనల్ బుక్ ట్రస్టు వంటి ప్రముఖ సంస్థలు ముద్రించిన పుస్తకాల నుండి పాఠాలను తీసుకున్నారు. తెలుగు యూనివర్సిటీ ముద్రించిన జానపద గేయ సాహిత్యం నుండి బాల గేయాలను, అభినయ గేయాలను పాఠ్యాంశాలుగా పెట్టారు. ఉపాధ్యాయుల పని భారాన్ని, భాషా సామర్థ్యాల సాధనను దృష్టిలో పెట్టుకొని పాఠ్యాంశాలను, అభ్యాసాలను పొందుపరిచారు.

## పాఠ్యపుస్తక ప్రత్యేకతలు

### ఇతివృత్తాలు

'నేటి బాలలే రేపటి పౌరులు'. భవిష్య సమాజానికి ఉపయోగపడే హేతుబద్ధ పౌరులుగా మానవత్వంతో ప్రవర్తించేలా చేయడానికి ఉపకరించే ఇతివృత్తాలను చర్చించి నిర్ణయించారు. అవి దేశభక్తి, శ్రమ గౌరవం, నైతిక / ఆధ్యాత్మిక/ మానవత్వపు విలువలు, ప్రకృతి చిత్రణ, చరిత్ర, సంస్కృతి, పిల్లల ఆసక్తులు, సహకారం, పర్యావరణం, వ్యక్తిత్వ వికాసం, బాలకార్మికత నిర్మూలన, చదువు ఆవశ్యకత, వృద్ధుల పట్ల వైఖరి, మాతృభావన, కళాసౌందర్యం, సామాజికస్పృహ, బాలికల విద్య, త్యాగ గుణం, యాత్రానుభవం, భక్తి తత్పరత, నదీ ప్రశంస, ఉద్యమస్ఫూర్తి, రైతు జీవితం, జంతు ప్రేమ, సాహిత్యసేవ, మానవ సంబంధాలు, ప్రేరణ, జీవకారుణ్యం, దానగుణం, భాషాభిమానం, తెలంగాణ ప్రాశస్త్యం, సంస్కృతి, వైభవం, మానవ స్వభావం, పఠనాభిలాష మొదలగునవి.

### ప్రక్రియలు

భాష విభిన్న వ్యవహార రూపాల్లో ఉంటుంది. వీటినే ప్రక్రియలంటారు. విభిన్న ప్రక్రియలతో పిల్లలు వివిధ సందర్భాలలో ప్రతిచర్యలు పొందుతుంటారు. వాటిని వినడం లేదా చదువడం వల్ల అవగాహన పొందే సామర్థ్యం పెంపొందాలి. ఇందుకోసం వివిధ వ్యవహార రూపాల్లోని సాహిత్యాన్ని పాఠ్యాంశాలుగా పొందుపరిచారు. అవి గేయం, పాట, కథ, సంభాషణలు, వ్యాసాలు, ఖండకావ్యం, లేఖ, యాత్రారచన, శతకం, కావ్యం (ప్రాచీన, ఆధునిక), ద్విపద, స్వగతం, వచనకవిత, జానపదకథ, సంభాషణ, ఆత్మకథ, రేడియో ప్రసంగం, బుర్రకథ, గేయకథ, అచ్చ తెలుగు కావ్యం, పురాణం, జీవిత చరిత్ర, సంపాదకీయ వ్యాసం, గజల్, పీఠిక మొదలగునవి.

### భాషాసామర్థ్యాలు

ఒకటి నుండి 10వ తరగతి వరకు పిల్లలందరూ భాషా సామర్థ్యాలను సాధించడానికి పాఠ్యపుస్తకాలలో జాబితాను కూడా పొందుపరిచారు. వీటిని పాఠ్య పుస్తకాల్లోని అభ్యాసాల ఆధారంగా విద్యా సంవత్సరాంతానికి సాధించాలి. ప్రధానంగా తెలుగులో క్రింది భాషా సామర్థ్యాలున్నాయి. అవి :

1) విని అర్థం చేసుకొని ఆలోచించి మాట్లాడడం
2) ధారాళంగా చదువడం – అర్థం చేసుకోవడం
3) స్వీయరచన
4) సృజనాత్మకత, ప్రశంస
5) పదజాలాభివృద్ధి
6) వ్యాకరణాంశాలు

### అభ్యాసాలు

పైన తెలిపిన సామర్థ్యాల సాధన కోసం ప్రతి పాఠంలో ఒక్కొక్క సామర్థ్యానికి అభ్యాసాలను అన్ని పాఠాలలో పొందుపరిచారు. ఇవి పిల్లల్ని ఆలోచింపజేసేలా, సృజనాత్మకతను పెంపొందింపజేసేలా ఉంటాయి. ఈ అభ్యాసాలకు పిల్లలు ఆలోచించి సొంతంగా జవాబులు రాయాల్సి ఉంటుంది.

### సృజనాత్మకత

పిల్లల్లో అభివ్యక్తి సామర్థ్యం పెంపొందాలి. ఇది వినూత్నంగా ఉంటే సృజనాత్మకత అవుతుంది. పిల్లల్లో భాషా బోధన ద్వారా సృజనాత్మకతను పెంపొందింపజేయాలి. సృజనాత్మకత కలిగిన పిల్లలు భవిష్యత్తులో ఆ శక్తిని ఉపాధిగా కూడా మార్చుకోగలుగుతారు. పాఠ్యపుస్తకాల ద్వారా ఈ కింది సృజనాత్మక రూపాలను పిల్లలకు అభ్యాసం కల్పించడానికి చేర్చడం జరిగింది.

1. గేయం / పాట
2. కథ / ఆత్మకథ
3. వ్యాసం
4. సంభాషణ
5. లేఖ
6. ఏకపాత్రాభినయం
7. కవిత
8. పోస్టరు తయారీ
9. నినాదాలు
10. సూక్తులు
11. వర్ణన
12. ఇంటర్వ్యూ ప్రశ్నావళి
13. ప్రకటన
14. ఆహ్వాన పత్రిక
15. అభినందన వ్యాసం
16. అభినందన పత్రం
17. కరపత్రం
18. స్వగతం
19. సంపాదకీయ వ్యాసం
20. పీఠిక

**తెలంగాణ భాష**

తెలంగాణ భాష, యాస తనదైన విశిష్టతను కలిగి ఉన్నది. ఈ సౌందర్యాన్ని ఆవిష్కరించే విధంగా తెలంగాణ మాండలికంలో రాయబడిన 'కొత్తబాట' లాంటి పాఠాలు మరికొన్ని పాఠాలు తెలంగాణ పలుకుబడులను పుణికిపుచ్చుకున్నాయి. తెలంగాణ పదాలను, సామెతలను, జాతీయాలను పట్టికలుగా ఇవ్వడం జరిగింది. పదపట్టికలో ఆయా పదాల అర్థాలను ఇవ్వడం జరిగింది. తెలంగాణ భాషపై చిన్నచూపును వదిలేయాలని ప్రబోధించడానికి 'ఎవరిభాష వాళ్లకు వినసొంపు' అన్న పాఠాన్ని పెట్టడం జరిగింది. మన భాషపట్ల ఆత్మన్యూనతను వీడి ఆత్మాభిమానంతో మాట్లాడే నైపుణ్యమలవడడానికి సులభమైన చిట్కాలతో కూడిన 'వాగ్భూషణమ్ భూషణమ్' పాఠాన్ని వాచకంలోకి తీసుకోవడం జరిగింది.

**తెలంగాణ సాహిత్యం**

తెలంగాణలో విస్తృతమైన సాహిత్యం వచ్చింది. మార్గ, దేశీ పద్ధతులతో పద్య, గేయ, వచన రూపంలో సమున్నత స్థాయిలో సాహిత్య సృజన జరిగింది. అయితే దురదృష్టవశాత్తు కొంత ఉండిపోయింది. ఈ స్థితిని సవరించడానికి వాచకాలు నడుంబిగించాయి. మరుగున పడిన కవి మాణిక్యాలను పాఠాల ద్వారా పరిచయం చేశాయి. కొఱవిగోపరాజు, పొన్నగంటి తెలగన, వానమామలై వరదాచార్యులు, పల్లా దుర్గయ్య, బిరుదురాజు రామరాజు, పి.వి.నరసింహారావు వంటి సాహితీ స్రష్టల రచనలను పాఠాల రూపంలో ఇవ్వడం జరిగింది. తెలంగాణలో 'పాట'కు విడదీయరాని సంబంధం ఉంది. అందుకే పాటలు కూడా పాఠాల రూపంలో దర్శనమిస్తాయి. ఉదా : బతుకమ్మ పాట, పల్లెటూరి పిల్లగాడ పాట, దేశభక్తి పాట మొ॥నవి.

తెలంగాణలో ఉన్న శతకసంపద అమూల్యం. పుష్కలం. తెలంగాణాలోనే తెలుగు తొలి శతకం ఆవిర్భవించింది. దీన్ని పాల్కురికి సోమన రాశాడు. నాటి నుంచి నేటి వరకు ఎంతో మంది శతక కవులు తెలంగాణాలో శతకాలను రచించారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తరువాత రూపొందించిన పాఠ్యపుస్తకాలలో ప్రాచీనంతో మొదలుకొని నేటివరకు ఉన్న శతక కవులలో సుమారు 30 మంది శతక కవులను పాఠ్యపుస్తకాలలో పరిచయం చేశారు. వారిలో పాల్కురికి, యధావాక్కుల అన్నమయ్య, పోతన, శేషప్ప, రామదాసు, బద్దెన, ఎలకూచి బాలసరస్వతి, ఉత్పల సత్యనారాయణాచార్య, ఇమ్మడిజెట్టి చంద్రయ్య, టి.వి.నారాయణ, రంగకృష్ణమాచార్యులు, బాకవరావు పంతులు, గుమ్మనగారి లక్ష్మీనరసింహశర్మ, గౌరీభట్ల రఘురామశర్మ, రావికంటి రామయ్య మొదలగు వారి శతకాలలోని పద్యాలు పాఠాల్లో చోటుచేసుకున్నాయి.

**తెలంగాణ సంస్కృతి**

అచ్చమైన మనసుకు పట్టిన అద్దం తెలంగాణ సంస్కృతి. కుల మత ప్రాంతాలకతీతంగా అందరినీ, అన్నిటినీ ఆత్మీయంగా అక్కునజేర్చుకునే విలక్షణ సంస్కృతి ఇక్కడ విలసిల్లింది. కొన్ని సంప్రదాయాలు తెరమరుగయ్యి ఉండవచ్చు.

కొన్నింటిని గూర్చిన అవగాహన ఈ తరానికి లేకపోవచ్చు. వాటిని మరొకసారి జ్ఞాపకంచేయడం ద్వారా ఉజ్జ్వలమైన తెలంగాణ వైభవాన్ని చాటిచెప్పడమేగాక, దీనిని కొనసాగించాలన్న సందేశాన్ని కూడా అందించడం జరిగింది. ఇందుకు తెలంగాణ పల్లెల్లో సంస్కృతి, 'గ్రామాలలోని వేడుకలు, క్రీడా వినోదాలు, మన పండుగలు (బతుకమ్మ, బోనాలు, వినాయకచవితి, తీజ్ మొదలగునవి), జానపద కళలు, గోలకొండ పట్టణము', చెరువు' వంటి పాఠాలు కొన్ని ఉదాహరణలు మాత్రమే.

## తెలంగాణ కవులు

ఈ నూతన పాఠ్యపుస్తకాల ద్వారా తెలంగాణలోని ఎంతో మంది కవులు వెలుగులోకి వచ్చారు. తెలంగాణలోని సాహితీ ప్రక్రియలు కూడా పరిచయమైనవి. తొలి అచ్చతెలుగు కావ్యం రచించిన పొనగంటి తెలగన రాసిన 'యయాతి చరిత్ర'లోని అంశం పాఠ్యాంశంగా వచ్చింది. పాల్కురికి సోమన, పోతన, కొఱవి గోపరాజు, గోన బుద్ధారెడ్డి, సి.నారాయణరెడ్డి, సుద్దాల హనుమంతు, పల్లా దుర్గయ్య, ఇరివెంటి కృష్ణమూర్తి, వానమామలై వరదాచార్యులు, కృష్ణమూర్తి యాదవ్, దేవులపల్లి రామానుజరావు, వేముగంటి నర్సింహాచార్యులు, వట్టికోట ఆళ్వారుస్వామి, చెర్విరాల భాగయ్య, ముకురాల రామారెడ్డి, సంగెం లక్ష్మీబాయి, మామిండ్ల రామాగౌడ్, నెల్లూరు కేశవ స్వామి, ఆదిరాజు వీరభద్రరావు వంటి ప్రముఖ తెలంగాణ రచయితలు, కవులు నూతన పాఠ్యపుస్తకాల ద్వారా తెలంగాణ సమాజానికి పరిచయమయ్యారు.

శతక సాహిత్యానికి మూలం తెలంగాణ. తెలంగాణలోని ప్రాచీన శతక కవులతోపాటు ఆధునిక శతక కవులు కూడా పాఠ్యపుస్తకాల ద్వారా పరిచయమైనారు. బద్దెన, యధావాక్కుల అన్నమయ్య, కంచర్ల గోపన్న, శేషప్ప కవి, సిరిసినగల్ కృష్ణమాచార్యులు, ఎలకూచి బాల సరస్వతి వంటి ప్రాచీన శతక కవులతో పాటు సూరోజు బాల నర్సింహాచారి, టి.వి. నారాయణ, ఆడెపు చంద్రమౌళి, దూపాటి సంపత్‌కుమారాచార్య, రాయికంటి రామయ్య, నంబి శ్రీధర్, గుమ్మన్నగారి బాల నర్సింహ శర్మ వంటి ఆధునిక శతక కవులు కూడా పాఠ్యపుస్తకాల ద్వారా వెలుగులోకి వచ్చారు.

## స్ఫూర్తిప్రదాతలు

తెలంగాణ సమాజానికి స్ఫూర్తినిచ్చిన ఎందరో ప్రముఖులను పాఠ్యపుస్తకాలల్లో చేర్చడం జరిగింది. రుద్రమదేవి, భక్త రామదాసు, కుమ్రం భీం, భాగ్యరెడ్డి వర్మ, పి.వి. నర్సింహారావు, సురవరం ప్రతాపరెడ్డి, షోయబుల్లాఖాన్, ఆరుట్ల కమలాదేవి, ప్రజాకవి కాళోజి, ప్రొఫెసర్ జయశంకర్ మొదలగు వారి గురించి వివరించారు.

## కీలక సూత్రాలు

పాఠ్యపుస్తకాల రూపకల్పనకు జాతీయ విద్యా ప్రణాళిక-2005, రాష్ట్ర విద్యా ప్రణాళిక-2011లో పేర్కొన్న కీలక సూత్రాల ఆధారంగా పాఠ్యాంశాలను, అభ్యాసాలను పొందుపరిచారు.

1) **తమకున్న శక్తి సామర్థ్యాలనుపయోగించి పిల్లలు నేర్చుకోవడం**
2) **తాము పొందిన జ్ఞానాన్ని పిల్లలు దైనందిన జీవితంలో ఉపయోగించడం**
3) **పాఠ్యపుస్తకానికే పరిమితం కాకుండా సమాజం ద్వారా, పరిసరాల ద్వారా, పఠన సామగ్రి ద్వారా పిల్లలు నేర్చుకోవడం**
4) **బట్టీ విధానాలకు బదులు అర్థవంతమైన రీతిలో ప్రతిచర్యలు, కృత్యాలు, అన్వేషణల ద్వారా పిల్లలు నేర్చుకోవడం**
5) **భాష, తమ స్థానిక కళలు, సంస్కృతీ సంప్రదాయాలు, ఉత్పత్తుల ఆధారంగా పిల్లలు నేర్చుకోవడం**
6) **ఇతర కీలక సూత్రాలు**

ఆలోచింపజేయడం, వ్యక్తీకరణలు, సృజనాత్మకత, కాల్పనికత, భాషాభిరుచి, భాషావినియోగానికి అధిక ప్రాధాన్యం, మొత్తం పాఠ్యపుస్తకం విద్యాప్రమాణాల సాధనకు దోహదపడడం, పరస్పర ప్రతి చర్యలకు కేంద్రంగా ఉండడం, తోటివారి ద్వారా, అదనపు సామాగ్రిద్వారా, సమాజసభ్యుల ద్వారా నేర్చుకోవడానికి వీలుండుట, ఉన్నతవైఖరులు, మానవత్వపువిలువలు - సంబంధాలు పెంపొందించడానికి ఉద్దేశించినవిగా ఉండడం, సోపానక్రమంలో బోధించడానికి

వీలుగా పాఠాల అమరిక ఉండడం, బహుముఖ విశ్లేషణ, విమర్శన సామర్థ్యాన్ని పెంపొందించేలా ఉండడం, సమకాలీన సామాజిక అంశాలపట్ల ఆసక్తి కలిగించడం మొదలగునవి. విద్యార్థులచే సామర్థ్యాల సాధన చేయించడానికి వివిధ రకాల కృత్యాలు ఉన్నాయి. 1. వ్యక్తిగత కృత్యం, 2. జట్టు కృత్యం, 3. పూర్తి తరగతి కృత్యం.

పిల్లలు వ్యక్తిగతంగా ఆలోచించడానికి, ప్రతిస్పందించడానికి వ్యక్తిగతకృత్యాలు, జట్లలో పనిచేయడానికి జట్టుకృత్యాలు (సృజనాత్మకత, ప్రాజెక్టుపనులు), పూర్తి తరగతి కృత్యాలు అంటే చర్చించడానికి, అభిప్రాయాలు చెప్పడానికి (వినడం, మాట్లాడడం) కూడా అభ్యాసాలు ఉన్నాయి.

## ముగింపు

ఆర్.టి.ఇ.-2009, రాష్ట్ర విద్యా ప్రణాళిక-2011 ప్రకారం నూతన భాషావాచకాలు రూపొందించారు. ప్రధానంగా ఇవి ఆలోచింపచేయడం, వ్యక్తీకరించడం, సృజనాత్మకత, విలువలు, వైఖరులు పెంపొందింపచేయడానికి ఉద్దేశించినవి. విమర్శనాత్మక, హేతుబద్ధమైన చింతనతో విచక్షణా జ్ఞానంతో వ్యవహరించేలా చేయడానికి ఈ పాఠ్యపుస్తకాలు దోహదపడతాయి. ఇందుకనుగుణంగా ఇతివృత్తాలు, పాఠ్యాంశాల ఎంపిక, అభ్యాసాలకూర్పు ఉన్నాయి. వీటిని ప్రణాళికాబద్ధమైన బోధనాభ్యసన ప్రక్రియలను అనుసరించి ఫలితాలు సాధించాలి.

❀❀❀❀❀

